సరికొత్త వివరణలతో

# సమగ్రభారతచరిత్ర

## ప్రాచీనయుగం



కె కృష్ణారెడ్డి

ప్రజాశక్తి బుక్‌హౌస్

సరికొత్త వివరణలతో

# సమగ్ర భారత చరిత్ర

## ప్రాచీన యుగం

కె. కృష్ణారెడ్డి

ప్రజాశక్తి బుక్‌హౌస్

*1-1-187/1/2, చిక్కడపల్లి, హైదరాబాద్-20. ఫోన్ : 27660013*

అనువాదం : సఫ్దర్ అహ్మద్

ప్రచురణ సంఖ్య : 1008

ప్రచురణ కాలం : సెప్టెంబర్, 2007

వెల : రు. 150/-

టైటిల్ : శ్రీరాం కారంకి

ప్రతులకు

**ప్రజాశక్తి బుక్‌హౌస్**

1-1-187/1/2, చిక్కడపల్లి, హైదరాబాద్-20. ఫోన్ : 27660013

బ్రాంచీలు

హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, ఖమ్మం,

హన్మకొండ, నల్గొండ, గుంటూరు

ముద్రణ

ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, హైదరాబాద్

# విషయసూచిక


ముందుమాట 5

I. **భారతీయ అలిఖిత - లిఖిత చరిత్ర** 7

1. భారత అలిఖిత సంస్కృతి 9

2. అది చారిత్రక సంస్కృతులు - సింధు నాగరికత 25

3. వైదిక యుగం 47

II. **తొలి చారిత్రక యుగం - రాజకీయ చరిత్ర** 61

4. మౌర్య పూర్వకాలం 63

5. మౌర్య సామ్రాజ్యం (క్రీ.పూ. 321 - 184) 75

6. మౌర్య - అనంతర భారతదేశం (క్రీ.పూ. 200 - క్రీ.శ. 300) 95

7. గుప్తులు - వారి వారసులు (క్రీ.శ. 300 - 750) 117

| | | |
|---|---|---|
| III. | రాజకీయ వ్యవస్థ - ప్రభుత్వం | 131 |
| | 8. సింధూ యుగం | 133 |
| IV. | ఆర్థిక వ్యవస్థ | 171 |
| | 9, సింధూ నాగరికత కాలం | 173 |
| V. | సమాజం - మతం | 227 |
| | 10. ప్రాచీన భారత సమాజం | 229 |
| | 11. ప్రాచీన భారత మతాలు | 259 |
| VI. | సంస్కృతి | 303 |
| | 12. భాష - సాహిత్యం | 305 |
| | 13. ప్రాచీన భారతీయ కళలు, వాస్తుశిల్పం | 329 |
| VII. | అనుబంధం | 341 |
| | 14. వంశక్రమం | 343 |
| | 15. మ్యాపులు | 353 |

# రచయిత తొలి పలుకులు

**భా**రతదేశ చరిత్రను అంశాల వారీగా, శాస్త్రబద్ధంగా పరిశీలించి, వివరించడం ఈ పుస్తకంలోని నూతనత్వం అని ముందుగా చెప్పాలి. పూర్తిగా భిన్నమైన, నూతన ప్రణాళికతో ఈ పుస్తకాన్ని రచించానని వేరుగా చెప్పనవసరం లేదు. దీనిలో రాజకీయ చరిత్రపై కాకుండా ఇతర అంశాలపై కేంద్రీకరణ హెచ్చుగా ఉంది. ప్రతి అధ్యాయంలోను ఆ కాలానికి చెందిన రాజకీయ చరిత్రను ప్రత్యేకంగా పేర్కొన్నాను. అయినప్పటికీ తరతరాలుగా వస్తున్న విస్తారమైన, విభిన్నమైన అన్ని జీవిత కోణాల ఆవిష్కరణకు ఇవ్వాల్సిన ప్రాధాన్యత ఇచ్చాను. పాలక వ్యవస్థ, ఆర్థిక వ్యవస్థ, సామాజిక, మత, సాంస్కృతిక సంస్థలు, ఆచారాలు, విశ్వాసాలను సుబోధకంగా వివరించే ప్రయత్నం చేశాను. పైకి భిన్నత్వం కనిపిస్తున్నప్పటికీ భారత దేశ చరిత్ర మొత్తంలోను అంతర్లీనంగా కొనసాగిన ఏకత్వాన్ని చూపించాను.

వివిధ దశల్లో చరిత్రను ప్రభావితం చేసిన రకరకాల శక్తుల గురించి విశ్లేషించడానికి శాయశక్తులా ప్రయత్నించాను. సామాజిక మార్పుకు దోహదపడి అవి చరిత్రను ఎలా తీర్చిదిద్దాయో తెలియ చేశాను. దురదృష్టవశాత్తు అనేక రిఫరెన్సు గ్రంథాలలో సామాన్యుడి గురించి కాని, దేశ సాంస్కృతిక వారసత్వం గురించి కాని తగినంత చెప్పకపోవడమే కాకుండా, ఆ చెప్పినది కూడ ఒక పద్ధతి ప్రకారం లేదు. ఈ పుస్తకంలో నూతన ప్రణాళికను అనుసరించడం ద్వారా ఆ లోపాలను అధిగమించే ప్రయత్నం జరిగింది. అంతేకాదు ఆధునిక యుగానికి సంబంధించిన భాగంలో విద్యార్థుల అవసరాలను గమనంలో ఉంచుకొని విషయాలను పొందుపరిచాను. బారత స్వాతంత్ర్యపోరాటాన్ని వివరించే సమయంలో వాస్తవాలకు అనుగుణంగా ఉన్నదున్నట్లు చెప్పడానికి కృషి చేశాను. భారత దేశ చరిత్రను, సంస్కృతిని ప్రాచీన కాలం నుండి, వర్తమాన కాలం వరకు సమగ్రమైన రీతిలో వివరించడానికి ఒక నమ్మకమైన ప్రయత్నం చేశాను.

**'సరికొత్త వివరణలతో సమగ్ర భారత చరిత్ర'** పేరుతో వెలువడుతున్న ఈ పుస్తకంలో నాలుగు భాగాలున్నాయి. **1. ప్రాచీన యుగం, 2. మధ్య యుగం, 3. ఆధునిక యుగం, 4. జాతీయోద్యమం.** విద్యార్థులను మాత్రమే కాకుండా, భారత దేశ చరిత్ర, సంస్కృతి పట్ల ఆసక్తి కలిగిన ప్రతి ఒక్కరిని దృష్టిలో పెట్టుకొని ఈ పుస్తకాన్ని రూపొందించాను. ఈ ప్రయత్నాన్ని పాఠకులు హర్షించి ఆదరిస్తారని ఆశిస్తాను. చివరిగా, ఈ పుస్తకాన్ని చక్కటి తెలుగులోకి తెచ్చిన అనువాదకులకు, నిశితంగా ఎడిట్ చేసి ఎంతో వేగంగా ప్రచురించిన ప్రజాశక్తి వారికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

**న్యూఢిల్లీ,**
**10-09-2007**

**కూనం కృష్ణారెడ్డి**

# అంకితం

చరిత్ర రచనలో నా ఈ కృషిని ప్రేమాదరాలతో

అంగీకరించి సహకరిస్తున్న

నా చిన్ని కుటుంబం

*ఉమ, ఆదిత్య, నీలిమలకు*

# I

# భారతీయ

# అలిఖిత - లిఖిత చరిత్ర

1

# భారత అలిఖిత సంస్కృతి

**మా**నవచరిత్ర ఎన్నో యుగాల పూర్వం నాటిది. ఈ చరిత్రలో దాదాపు చాలా భాగం అలిఖితమైనదే. ఈ అలిఖిత భాగమే చరిత్ర పూర్వయుగం. మానవచరిత్ర గతానికి సంబంధించి కేవలం కొంతభాగమే నమోదై ఉంది లేదా లిఖితపూర్వకంగా మన ముందుకు వచ్చింది. ఈ లిఖిత భాగమే చరిత్ర. చరిత్ర పూర్వయుగాన్ని వివిధ కాలాలుగా లేదా యుగాలుగా విభజించారు. ఈ విభజన కోసం ఆయా కాలాల్లో లభించిన భౌతిక వస్తువుల స్వరూప స్వభావాలను ప్రాతిపదికగా తీసుకున్నారు.

### మానవ జీవన పరిణామం

ఆఫ్రికాలో హోమో ఎరక్టస్ నుంచి ఉద్భవించిన ఆధునిక మానవుడు అక్కడినుంచి వివిధ మార్గాల్లో ప్రపంచం నలుమూలలకూ విస్తరించాడన్నది ఓ ఆసక్తికరమైన సిద్ధాంతం. ఈ సిద్ధాంతాన్నే విస్తరణ సిద్ధాంతంగా పేర్కొంటున్నారు. దీన్ని ఆధునిక మానవ జనాభా జన్యుపరమైన ఆధారాలు బలపరుస్తున్నాయి. భూమి మీద వున్న అన్ని జాతులు, ప్రాంతాల మానవ జనాభా డిఎన్ఎ దాదాపు ఒకేరకంగా ఉంది. దీన్నిబట్టి మానవజాతి ఆవిర్భావం దాదాపు సమకాలీనంగానే జరిగిందని, దీనికి ఉన్నది ఉమ్మడి మూలమేనని స్పష్టమవుతోంది. దాదాపు ఇదేకాలంలో హోమో ఎరక్టస్ సంతతి నుంచి సమాంతరంగా ఆధునిక మానవుడు పరిణామం చెందాడన్నది మరో సిద్ధాంతం. దీని ప్రాంతీయ జనాభా ఏకకాలంలోనే వృద్ధిచెందుతూ వచ్చింది. ఈ సిద్ధాంతాన్ని శిలాజాల సాక్ష్యం బలపరుస్తోంది. మానవజాతికి ఆఫ్రికానే మూలకేంద్రమని చరిత్రకారులు చెబుతున్నారు. తూర్పు ఆఫ్రికాలోని హదర్, ఓల్డువాయి, లాటోలి తదితర ప్రాంతాల్లో అత్యంత ప్రాచీనమైన మానవ అస్థిపంజరాన్ని పురాతత్వ శాస్త్రవేత్తలు కనుగొన్నారు. ఇప్పటి వరకు అత్యంత భద్రంగా ఉంచింది ఇథియోపియాలోని హదర్‌లో లభించిన ఓ స్త్రీ అస్థిపంజర భాగాలే. ఈ భాగాలను దాదాపు 40 శాతం పురాతత్వ శాస్త్రవేత్తలు క్రోడీకరించగలిగారు. ఈవిధంగా ఏర్పడిన అస్థిపంజరానికి 'లూసీ' అని నామకరణం చేశారు. ఈ లూసీ ఆస్ట్రోలోపెథికస్ వర్గీకరణకు చెందినది. భారత ఉపఖండంలో ఎక్కడా కూడా మానవ సంబంధిత నిజమైన శిలాజాలు దొరికిన తిరుగులేని ఆధారాలు కొంతకాలం క్రితం వరకూ లేవు. అయితే తూర్పు, దక్షిణాఫ్రికా, ఐరోపా, చైనాతో సహా ఆసియాలోని పలు

భాగాలు ఇండోనేషియాలోని జావాలో మానవ సంబంధిత శిలాజాలు అనేకచోట్ల కనిపించాయి. అయితే 1982లో ఓ భూగర్భ శాస్త్రవేత్త నర్మదా లోయలోని హత్నోరా సమీపంలో మానవ సంబంధిత శిలాజాన్ని కనుగొనడంతో భారత ఉపఖండం కూడా మానవ సంబంధ శిలాజ పటంలోకి ఎక్కింది. హత్నోరా ప్రాంతం మధ్యప్రదేశ్‌లోని హోషంగాబాద్ సమీపంలో ఉంది. నర్మదా మనిషి లేదా హత్నోరా రకంగా పేర్కొన్న ఈ శిలాజం మధ్య పాత రాతియుగానికి చెందినదని స్పష్టమవుతోంది. అలాగే ఈ శిలాజాన్ని మానవ సంబంధ శిలాజ రకానికి చెందిన హోమోఎరక్టస్‌గా కూడా గుర్తించారు. అయితే దాన్ని కనుగొన్న భూగర్భ శాస్త్రవేత్త అభిప్రాయంలో ఇది హోమోఎరక్టస్ ఉపజాతులకు భిన్నమైనది. ముఖ్యంగా కపాల సామర్థ్యం ఎక్కువ ఒంపులు, మానసిక పరిణతిపరంగా నర్మదా మానవుడు భిన్నమైన వాడని ఆ భూగర్భ శాస్త్రవేత్త వెల్లడించారు. దీన్నే హోమోఎరక్టస్ ఆధునిక దశకు సంకేతంగా పరిగణించారు.

నర్మదా కపాలం పరిణామ హోదాపై వివాదం ఒకటి తలెత్తింది. అది హోమో ఎరక్టస్సా లేక హోమోసెపియన్‌దా అన్నది. ప్రస్తుత అభిప్రాయాల సమతూకం మాత్రం హోమోసెపియన్ సిద్ధాంతాన్నే బలపరుస్తోంది. ప్రస్తుతానికి మాత్రం ఆ నర్మదా మనిషి వయసు 27 నుంచి 32 సంవత్సరాల మధ్య వయసు ఉండవచ్చనే వాదనకు బలం చేకూరుతోంది. అలాగే మొదట్లో భావించినట్లుగా పురుషుడి కపాలం కాదని, స్త్రీ కపాలమేనని, దాని కపాల సామర్థ్యం 1155 నుంచి 1421 సిసి విలువల మధ్య ఉండవచ్చునని స్పష్టమైంది. ఈ రకమైన విలువలు ఆఫ్రికా, ఆసియా హోమోఎరక్టస్ జాతిలో ఎక్కువగా కనిపిస్తాయి. హోమోసెపియన్ల స్థాయికి దాదాపుగా వస్తాయి.

## భారత పూర్వ చరిత్ర కాలనిర్ధారణ ప్రాతిపదికలు

ఇప్పటి వరకు భారతదేశంలో మానవ జీవనానికి సంబంధించిన అతి ప్రాచీన ఆనవాళ్ళు క్రీస్తు పూర్వం 3,00,000 నుంచి 2,00,000 సంవత్సరాల మధ్యనాటివి. సోవన్ లోయా దక్షిణ భారతదేశంలో లభించిన ఆది మానవ కాలం నాటి రాతి పరికరాల ఆధారంగా దీనిని నిర్ధారించడం జరిగింది. కానీ క్రీ.పూ. 36,000 కాలంలోనే ఆధునిక మానవుడు (హోమోసెపియన్) తొలిసారిగా కనిపించాడు. క్రీ.పూ. 8000 సంవత్సరంలో ముగిసిన పాత రాతియుగంలో ఆదిమానవుడు మామూలు రాళ్ళతో చేసిన పరికరాలనే ఉపయోగించాడు. ప్రాథమికంగా మానవుడి కార్యకలాపాలు ఆహార సముపార్జనకే పరిమితమయ్యాయి. ఆహారం కోసం ప్రకృతిపైనే ఆధారపడేవాడు. అనంతరం మంటలను సృష్టించడం, ఆర్పడం నేర్చుకున్నాడు. ఆ విధంగా తన జీవనంలో మెరుగుదల సాధించాడు.

భారతదేశంలో మధ్య రాతియుగం క్రీ.పూ. 8000 సంవత్సరంలో మొదలై క్రీ.పూ. 4000 సంవత్సరం వరకు కొనసాగింది. ఆ కాలంలో పదునైన కొసలు కలిగిన పరికరాలను ఉపయోగించి మానవుడు జంతువుల వేట సాగించాడు. వేగంగా పరుగెత్తే జంతువులను సైతం ఆ పరికరాలతో సంహరించేవాడు. మధ్య రాతియుగానికి సంబంధించిన వివిధ ఆనవాళ్ళు చోటా నాగపూర్, పీఠభూమి, మధ్యభారతం, కృష్ణానది దక్షిణ ప్రాంతాల్లో కనిపించాయి.

భారతదేశంలో కనిపించిన దాదాపు అన్నీ నవీన శిలాయుగం నాటి ఆవాసాలు క్రీ.పూ. 4000 సంవత్సరం కంటే పాతవి కావు. ఆ కాలంలోనే మనిషి జంతువులను మచ్చిక చేసుకోవడం, మొక్కలను పెంచడం, గ్రామాల్లో స్థిరపడటం, వ్యవసాయ గ్రూపులుగా ఏర్పడడం మొదలుపెట్టాడు. ఆ కాలంలో కనిపించిన స్పష్టమైన మెరుగుదల ఏమిటంటే అందంగా తీర్చిదిద్దుకున్న రాతి పరికరాలను ఉపయోగించడం. ఆ కాలంలోనే చక్రాన్ని కూడా మనిషి తయారుచేశాడు. అది చాలా కీలకమైన పురోగతికి నిదర్శనం.

నవీన శిలాయుగం చివరి నాటికి రాగి, ఇత్తడి వంటి లోహాలను ఉపయోగించడం మొదలుపెట్టాడు. అది క్రీ.పూ. 1800 నుంచి 1000 సంవత్సరాల మధ్య సాగిన లోహదశ. లోహ దశ సంస్కృతులు ఛోటా నాగపూర్ పీఠభూమి నుంచి ఎగువ గంగ పరీవాహక ప్రాంతం వరకు విస్తరించాయి. ఆ కాలంనాటి కొన్ని ప్రాంతాల్లో మైసూర్ సమీపంలో ఉన్న బ్రహ్మగిరి, నర్మదాలో ఉన్న నవదతోలి ఉదాహరణలు.

### చరిత్ర పూర్వ సంస్కృతుల లక్షణాలు, మూలాలు

మానవుడి ఆధునిక దశలకు సంబంధించిన వివిధ రకాల ఆధారాలు అందుబాటులో వున్నాయి. కానీ పూర్వచరిత్రకు సంబంధించిన అధ్యయనాలకు మాత్రం ఆనాటి శిలాజాలు, ఇతర భౌతిక పరికరాలే ఆధారం. ఇవన్నీ కూడా తొలి మానవుడు వదిలేసినవే. ఇప్పటికీ అక్కడక్కడ కనిపిస్తున్నవే. మనం మానవుడి గతానికి సంబంధించి చరిత్రపూర్వ దశలను గురించి మాట్లాడుకుంటున్నామంటే కేవలం ఆహారం కోసం జీవించిన, వేట సాగించినా లేదా అప్పుడే స్థిరపడ్డ మానవ జీవనం గురించి చెప్పుకోవడమే. ఆ దశలో మనిషి ప్రకృతితో సర్దుకుపోవడం, వనరులను సమకూర్చుకోవడం చేసేవాడు. ఈ సర్దుబాట్లు అతడు ఉపయోగించిన పరికరాలు, ఇతర సామాగ్రిని నిర్ధారించాయి. అలాగే అతని నివాస ప్రాంతాలను ఎంచుకోవడం, తన సామాజిక జీవనాన్ని రూపొందించుకోవడం, వివిధ నమ్మకాలను ఏర్పరచుకోవడానికి కూడా ఆ సర్దుబాట్లే దోహదం చేశాయి. తొలి మానవుడికి సంబంధించిన అవశేషాలు దాదాపుగా రాతి పరికరాల రూపంలోనే అందుబాటులోకి వచ్చాయి. వీటిలో కొన్ని అతడు పెంచిన జంతువులు లేదా వేటాడిన జంతువుల కళేబరాల్లోనే లభించాయి. అయితే వీటి ఆధారంగా ఆనాటి మానవుడు జీవనాన్ని నిర్ధారించేందుకు బలమైన అంశాలేవీ వెలుగులోకి రాలేదు. అయితే తొలి మానవుడు ఉపయోగించిన పరికరాలు, అతడి నివాసానికి సంబంధించిన ఆధారాలు, తొలి సామాజిక అభివృద్ధి దశల నాటి ఆనవాళ్లు, ప్రాచీన సంస్కృతుల్లో ఉన్న వైరుధ్యాలకు అద్దం పట్టాయి. అలాగే కొన్ని రకాల నిర్ధారణలకు రావడానికి కూడా దోహదం చేశాయి. భారతదేశంలో తొలి మానవుడి సాంస్కృతిక పరిణామ క్రమం తొలి రాతి యుగం, మధ్య రాతియుగం, అనంతర రాతియుగం దశల్లోనే ఉన్నప్పటికీ ఈ ఉపఖండంలో సాంస్కృతికంగా పరస్పర ఆధారిత ప్రభావం గణనీయంగా కనిపించడం గమనార్హం. మరో రకంగా చెప్పుకోవాలంటే ఈ సాంస్కృతిక పరిణామ క్రమం ఒక ప్రాంతంలో ఉన్నట్టుగా మరో ప్రాంతంలో లేదు. పైగా రాతియుగం నాటి సంస్కృతుల్లో కూడా

ప్రాంతీయపరమైన వైరుధ్యాలు కనిపించాయి. అయితే భారత చరిత్ర పూర్వ సంస్కృతులకు సంబంధించి కొన్ని సాధారణ లక్షణాలను మాత్రం గుర్తించడం జరిగింది.

తొలి రాతియుగంలో ప్రధానంగా ఉపయోగించిన పరికరాలు చేతి కొడవళ్ళు, గండ్ర గొడ్డళ్ళు ఇతర కీలక పరికరాలు. ఇవన్నీ కూడా చేతి కొడవళ్ళ తరహాలో రూపుదిద్దుకున్నవే. వీటిని వివిధ పరికరాలను చెక్కడానికి, పెచ్చులు తీయడానికి ఉపయోగించేవారు. తొలి రాతియుగం తర్వాత వచ్చిన మధ్య రాతియుగంలో వాడిన పరికరాల్లో పెచ్చులు తీసేందుకు ఉపయోగించేవి, చిన్న చిన్న ముక్కలు చేసేవి మొదలైనవి ఉన్నాయి. అనంతర శిలాయుగంనాటి పరికరాల్లో చిన్నపాటి రాతి పరికరాలు ఉండటం గమనార్హం. వీటిని పరిశీలిస్తే ఈ పరికరాల్లో ఉన్న తేడాతో పాటు ప్రాంతీయపరంగా కూడా గరిష్ఠ స్థాయిలో వ్యత్యాసం ఉన్న విషయం స్పష్టమవుతుంది.

సాంకేతికంగా గడిచిన యుగం కంటే అనంతర యుగంలో మనిషి వాడిన పరికరాలు, అలవాట్లలో సాంస్కృతికంగా ఎంతో మార్పు వచ్చిన విషయం స్పష్టమవుతోంది. ఎందుకంటే మూడు రాతియుగాల్లోనూ మనిషి ఉపయోగించిన పరికరాలు, వాడకంలో సాధించిన పరిణతిలో ఉన్న తేడా స్పష్టంగా కనిపిస్తుంది. భారతదేశంలో అనంతర రాతియుగం నాటి కొన్ని ప్రాంతీయ సంస్కృతుల ఆనవాళ్ళు మానవుడి స్థిర నివాసానికి సంబంధించిన బలమైన ఆధారాలు అందిస్తున్నాయి. స్థిరమైన గ్రామ ఆధారిత సమాజాల ఆవిర్భావం నవీన శిలాయుగం, తామ్రయుగంలో కనిపిస్తుంది. ఈ రెండు యుగాల్లో కూడా మనిషి ఉపయోగించిన పరికరాలు, వాడిన లోహాలు, ఆనాటి సాంస్కృతిక జీవనంలో వచ్చిన పరిణితికి అద్దం పడతాయి. కాశ్మీర్‌లోని బుర్జాహోం మాదిరిగా నవీన శిలాయుగంలో మనిషి జీవనం అనేక ప్రాంతాల్లో జంతువుల వేటకే పరిమితమైంది. అయితే పంటల ఉత్పత్తి, జంతువుల్ని పెంచడం వంటి వాటి ఆధారంగా అనేక ప్రాంతాల్లో జీవన గతిలో మార్పు కనిపించింది.

భారత ఉపఖండంలో ఈ మార్పు తొలిసారిగా వాయువ్య ప్రాంతంలో మధ్య, ఉత్తర, దక్షిణ బెలూచిస్తాన్‌లో, అలాగే దక్షిణ సింధు పరీవాహక ప్రాంతంలో, ఉత్తర రాజస్థాన్‌లో కనిపించింది. ఈ ప్రాంతాల్లో సాగిన తొలి నవీన శిలాయుగం – తామ్ర యుగంనాటి ఆనవాళ్ళు క్రీ.పూ. 4000 ఏళ్ళ క్రితం నాడు సాగాయి. అవే హరప్పా నాగరికత ఆవిర్భావానికి నాంది పలికాయి.

అయితే హరప్పా నాగరికతను ఈ కాలపు భారతదేశ స్థూల సాంస్కృతిక లక్షణానికి ప్రతీకగా పరిగణించడం భావ్యం కాదు. కొన్ని స్వతంత్ర ప్రాంతాలు ఉండేవి. అవి ఇతర ప్రాంతాలతో ముడిపడి హరప్పా నాగరికత లేదా తదుపరి కాలం యొక్క సాంస్కృతిక దశను తప్పించుకొని నవీన రాతియుగ నివాస ప్రాంతాలుగా అభివృద్ధి చెందాయి. అలాంటి సంస్కృతుల ప్రాదేశిక విస్తరణ స్థలకాలాదుల వైరుధ్యాలతో ఉపఖండంలో శ్రీనగర్ లోయ (కాశ్మీర్) నుండి దక్షిణంలో కర్ణాటక, ఆంధ్ర వరకు కొనసాగింది. ఈ ప్రాంతీయ సంస్కృతులలోనే భవిష్యత్తు భారతీయ గ్రామీణ సముదాయాల మూలాలు ఉన్నాయి. ఎందుకంటే వాటి స్థూల సాంస్కృతిక

సమ్మేళనం లోహయుగపు తొలి చారిత్రక నివాస ప్రాంతాల నేపథ్యంలో అత్యంత ప్రధానమైనది.

**ఆహార సేకరణ సముదాయాలు- రాతియుగాల ఆదిమ మానవుడు**

సుమారు 2,50,000 సంవత్సరాల పూర్వం భారతదేశంలో మానవుడి కార్యకలాపాల రాతి నివేదికలను ప్లీస్టోసీన్ కాలం నాటి తీవ్ర వాతావరణ మార్పుల నేపథ్యంలో పరిశీలించారు. భారతదేశంలో తొలి మానవులు, వారి నివాస ప్రాంతాల కోసం అన్వేషణ కొనసాగుతూనే ఉంది. ఈలోగా తొలి రాతియుగ పరికరాలను ఉపఖండంలోని వివిధ ప్రాంతాలలో తవ్వితీశారు. అందులో ప్రధానమైనది పోట్వార్ మైదానప్రాంతం. పశ్చిమోత్తర పంజాబ్‌లో ఈ మైదాన ప్రాంతాన్ని సోన్ నది రెండుగా చీలుస్తుంది. బియాస్, బన్‌గంగా లోయలు, ప్రవర లోయలోని(గోదావరి ఉపనది)నెవాస, ఆంధ్రప్రదేశ్‌లో గుండ్లకమ్మ పరివాహక ప్రాంతంలోని గూడలూరు, కృష్ణలోయలో నాగార్జునకొండ, మద్రాసు సమీపంలోని కోస్తా మైదాన ప్రాంతం (వడమదురై, అత్తిరామపాకం మొదలైనవి), ఒరిస్సాలో మహానది ఉత్తర తీరం వెంబడి ఉన్న జిల్లాలలో కూడా ఇలా పరికరాలు లభించాయి. ఉపఖండంలోని కొండలు, లోయలు ఆదిమ మానవులను బాగా ఆకర్షించి ఉంటాయి. ఎందుకంటే ప్రతి అధ్యయనంలోనూ (తవ్వకం) వారి పరికరాలు, సాధనాలు బయట పడ్డాయి. దానిని బట్టి వారు ఇక్కడ నివసించారని ఖచ్చితంగా నిర్ధారించవచ్చు.

బహుశా తొలి రాతి యుగంలో అభివృద్ధి చెందిన ఒక కొత్త సాంకేతిక పరిజ్ఞానం సుమారు 35,000 సంవత్సరాల పూర్వం భారతదేశంలో ప్రత్యక్షమయ్యింది. కేవలం ఒక్క పరికరాలే భిన్నంగా లేవు. మధ్యరాతియుగపు మనిషి జీవించిన వాతావరణం కూడా మారినట్లు కనబడుతోంది. తొలి రాతియుగం కంటే తక్కువ తేమగల వాతావరణం ఉండేదని తెలుస్తోంది. మహారాష్ట్ర లాంటి ప్రాంతాలలో సమకాలీన జంతు జాతుల శిలాజాలు లభించాయి. అయితే దేశంలో వివిధ ప్రాంతాలలో మధ్యరాతియుగ సంస్కృతులకు ఒకే తరహా ప్రాచీనత లేదు. మనకు తెలిసినంతవరకు క్రీ.పూ 33,000 నుండి క్రీ.పూ16,500 వరకు ఈ సంస్కృతులు పరిఢవిల్లాయి. చారిత్రక తేదీలలో ఈ ప్రాంతీయ వైరుధ్యాలు, స్థూల సాంస్కృతిక సమ్మేళనం చివరి రాతియుగంలో మరింత ప్రస్ఫుటమయ్యాయి. ఈ కాలంలో సూక్ష్మ పరికరాలను వాడడం మొదలుపెట్టారు. మధ్యప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్ తదితర ప్రాంతాలలో ఈ సంస్కృతులు క్రీ.పూ 8,500 నుండి క్రీ.పూ 1700 సంత్సరాల వరకు విస్తరించి ఉన్నాయి.

అత్యంత సంకీర్ణమైన సూక్ష్మ పరికరాలు గణనీయమైన సాంకేతిక మార్పును సూచిస్తాయి వాటిని ఎముక, కలప లేదా టేకుతో మలిచారు. తదుపరి లోహకాలపు పరికరాల ఆకారాలు, విధులను ఈ పరికరాలు బహుశా అంచనా వేసి ఉండవచ్చు. సూక్ష్మ పరికరాలతో పాటు కనీసం కొన్ని ప్రాంతాలలో కుండలు తయారు చేసే పద్ధతి మొదలైంది. ఈ సాంకేతిక మార్పునకు మానవ చరిత్రలో ఎనలేని ప్రాధాన్యత ఉంది. ఎందుకంటే అది ఆహారోత్పత్తి, స్థిర జీవనంతో దగ్గరగా ముడిపడి పోయింది. ఈ మార్పును చివరి రాతియుగం ఏదో ఒక రూపంలో అంచనా వేసి ఉంటుంది. గుజరాత్‌లోని లంఘ్‌నాజ్, మధ్యప్రదేశ్‌లోని ఆదంగఢ్‌లలో పశుపోషణకు సంబంధించిన అవశేషాలు బయటపడ్డాయి. వస్తుమార్పిడికి సంబంధించిన

సాక్ష్యాలు కూడా వెలుగు చూశాయి. వివిధ ప్రాంతాలు, సముదాయాల మధ్య వస్తు మార్పిడి జరిగేది.

**పాతరాతియుగ సంస్కృతుల విస్తరణ, లక్షణాలు:**

భారతీయ శివాలిక్ పర్వతరాలలో తొలిరాతియుగ పరికరాలపై సమాచారాన్ని క్రమంగా సేకరించారు. జమ్మూలోని ఉత్తరబైనీ ప్రాంతంలో ఎగువ శివాలిక్ పర్వతాల పురాతన వస్తువులు బయటపడ్డాయి. పాకిస్తానీ పంజాబ్‌లోని పోట్వార్ పీఠభూమి (శివాలిక్ ప్రాంతం)లో కూడా అనేక అవశేషాలు బయటపడ్డాయి. రావల్పిండి సమీపంలోని రీవాత్ అనే క్షేత్రం కీలకమైనది. తదుపరి. సాక్ష్యం పబ్బీ కొండలు (జీలం నదికి తూర్పున) నుండి వెలువడింది.

మరో ముఖ్యమైన ప్రాంతం మహారాష్ట్రలోని పూణే ప్రాంతంలో గల కుక్డీ లోయ బోరీ అనే గ్రామం సమీపాన సుమారు తొమ్మిది అగ్నివిస్ఫోటక బూడిద క్షేత్రాలు ఉన్నాయి. పాతరాతియుగ కళాకృతులు చాలా వరకు నల్లరాయిలో కనిపించాయి. భారతీయశివాలిక్ ప్రాంతాలు, రీవాత్, పబ్బీకొండలలో కనిపించిన తొలి రాతియుగ పరికరాలు ఇక్కడ లేవు వాటి ప్రాచీనతను సర్వజనీనంగా ఆమోదిస్తే దక్కనులోని అక్యూలియన్ పరిశ్రమను మధ్య ప్లీస్టోసీన్ కాలం నాటిదిగా గుర్తించవచ్చు. నిజానికి పాతరాతియుగపు అవశేషాలు అన్ని వాతావరణ ప్రాంతాలలోనూ బయటపడ్డాయి. బలూచిస్తాన్, బంగ్లాదేశ్ పశ్చిమ సరిహద్దుల మధ్య, లడఖ్, కేరళలోని పాల్ఘాట్ ప్రాంతాల మధ్య అన్ని ప్రధాన అతిసార భూములలో ఈ అవశేషాలు కనిపించాయి.

స్థానికంగా లభించే రాళ్లతో పనిముట్లు లేదా పరికరాలను తయారు చేసే పరిజ్ఞానం మన పూర్వీకులకు ఖచ్చితంగా ఉండేది. అలాంటి ముడి రాళ్లు లభించని చోట (త్రిపుర, బంగ్లాదేశ్ లాంటి ప్రదేశాలలో) మానవులు అనువైన కలపను వినియోగించారు. తాము నివసిస్తున్న ప్రాంతం యొక్క ప్రాకృతిక గుణాల గురించి వారికి తగిన అవగాహన ఉండేదనడంలో ఎలాంటి సందేహం లేదు. స్థానికంగా లభించే ఆహారం, నీటి వనరుల గురించి తెలుసుకోవలసిన అవసరం వారికి ఉండేది. వనరుల లభ్యత ఆధారంగా తమ కార్యకలాపాలను నిర్ధారించు కునేవారు. ఆ విధంగా వారు భారతీయ భూభాగాన్ని అధ్యయనం చేసిన తొలి ఆవిష్కర్తలు.

దిగువ రాతియుగానికి వెళితే అత్యంత వివాదాస్పదమైన అంశం మన ముందు ఉదయిస్తుంది. మానవాళి స్థూల పరిమాణ క్రమంలో ఒక ప్రత్యేక భూభాగంగా భారత ఉపఖండాన్ని మూల్యాంకణం చేసే విషయం వివాదాలను రేకెత్తించింది. హథ్‌నోరాసాక్ష్యాల ఆధారంగా ఈ ప్రాంతం ప్రాచీన హోమో సేపియన్స్ జాతి ఆదిమానవులతో నిండి ఉండేదని నొక్కి చెప్పవచ్చు. అంతకుముందు లేదా ఆ తర్వాత ఏమి జరిగిందో ఇప్పటికీ తెలియదు. ఎగువ రాతియుగానికి చేరుకునే సమయం నాటికి ఆ జాతి మానవుల సంచారం లేదా జీవనం మరింత స్పష్టమైంది. పరికరాలు భిన్నంగా అందంగా తీర్చిదిద్దబడ్డాయి.

## మధ్యరాతియుగ సంస్కృతుల విస్తరణ, లక్షణాలు :

మంచుయుగం (ప్లీస్టోసీన్) చివరలో అలాగే హోలోసీన్ యుగం మొదట్లో అలాగే ఆహారసేకరణ ఆహారోత్పత్తికాలాల మధ్యలో ఈ యుగాన్ని ఒక ప్రత్యేక కాలంగా పురావస్తుశాస్త్రంలో పరిగణించవచ్చు. భారతీయ కాలమాన పరిస్థితులలో ఒకవైపు ఈ కాలాని ఎగువ రాతియుగంగా నిర్ధారించినా, మరోవైపు ప్రాంతీయ నేపథ్యంలో ఈ కాలాన్ని గ్రామీణ వ్యవసాయ ఆర్థిక వ్యవస్థకు తొలి ఛాయగా చెప్పవచ్చు. తత్ఫలితంగా ఈ కాలాన్ని చివరి మంచుయుగం లేదా తొలి మంచురహిత దశగా గుర్తించే అవకాశమూ ఉంది.

సూక్ష్మ పరికరాల తయారీ పరిశ్రమను గుర్తించడం చాలా తేలిక. సాధారణంగా ఒకటి నుండి ఐదు సెంటీమీటర్ల పొడవు ఉండే పరికరాలను రెండువైపులా ధార ఉన్న బ్లేడ్ల రూపంలో ఈ పరికరాలను మలిచారు. పదును ఉండే పరికరాలు, మాంసం కోసే పరికరాలు, చర్మం ఒలిచే సాధనాలు తదితర ఎగువ రాతియుగ సాధనాలకు సూక్ష్మ స్వరూపాలతో పాటు అర్థచంద్రాకారంలో ఉండే పరికరాలు కూడా కనిపిస్తాయి. అలాగే వివిధ ఆకారాలలో ఉన్న పరికరాలు వెలిశాయి.

భారతదేశంలో మధ్యరాతియుగపు తొలి ఛాయలు లేదా విస్తరణకు సంబంధించిన ఆధారాలు నేటికీ పరిమితంగా ఉన్నాయి. కేవలం ఏడెనిమిది క్షేత్రాలలోనే ఈ కాలానికి సంబంధించిన అవశేషాలు సృష్టంగా లభించాయి. ఈ క్షేత్రాలు రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రాలలో పరిమితంగా ఉన్నాయి. గుహ చిత్రాలను పరిగణనలోకి తీసుకున్నా అవి మధ్యభారత ఎగువ భూభాగాలకే పరిమితమయ్యాయి. అంటే ఉత్తరప్రదేశ్ నుండి గుజరాత్ రాష్ట్రాల మధ్యలోనే అవి విస్తరించి ఉన్నాయి క్రీ.పూ. ఆరవ సహస్రాబ్దికి చెందిన కనీసం రెండు క్షేత్రాలు (బాగోర్, ఆదమ్‌గఢ్) పశుపోషణ (మేకలు, గొర్రెలు)కు సంబంధించిన సాక్ష్యాలను అందిస్తాయి. ప్రజలు అప్పటికే తమ ఆహారసేకరణ- వేట కార్యకలాపాలకు స్వస్తి చెప్పి ఉండవచ్చు.

## ఆహార ఉత్పత్తిదారులు- మట్టిపాత్రల సంస్కృతులు

ఆహారోత్పత్తి ఆధారిత స్థిర జీవనం తొలుత పశ్చిమోత్తర ప్రాంతంలో మొదలైంది. ఇక్కడ మానవుడు ప్రాథమిక ఆహారోత్పత్తి నుండి నవీనరాతి యుగ-మట్టిపాత్రల గ్రామ సంస్కృతుల వరకు ప్రగతి సాధించాడు. వేరేచోటా ఆహారోత్పత్తి సంస్కృతులు నెమ్మదిగా ఉద్భవించాయి. అంటే క్రీ.పూ. రెండవ సహస్రాబ్ది మొదలు కొని వివిధ ప్రాంతాలలో విభిన్న వేగంతో ఈ సంస్కృతులు అభివృద్ధి చెందాయి.

క్రీ.పూ.2400 సంవత్సరాల ప్రాంతంలో శ్రీనగర్ లోయకు చెందిన బుర్జాహోమ్ ప్రజల నవీన రాతియుగ ఆర్థిక వ్యవస్థలో ఆహారోత్పత్తి లేకపోయినప్పటికీ (అప్పటికి వారు వేట దశలోనే ఉన్నారు) రాజస్థాన్‌లోని బానస్‌లోయ (అహర్ రాతియుగపు ఆర్థిక వ్యవస్థ), నర్మదా లోయలోని మహేశ్వర్ - నవదాటోలీ మట్టిపాత్రల ఆర్థిక వ్యవస్థ, చంబల్ లోయలోని

నాగ్డా, దైమాబాద్, చండోలీ, ఉత్తర దక్కన్‌లోని ఇతరక్షేత్రాలలో మాత్రం ఆహార ఉత్పత్తి ప్రధాన లక్షణంగా ఉంది. ఈ ప్రాంతాలలో తొలి రైతుల జీవన స్థితిగతులను వెలికి తీసిన అవశేషాల ఆధారంగా పునఃనిర్మించవచ్చు. తొలి రైతులు చాలా వరకు బహిరంగ గ్రామాలలో నివసిస్తూ పంటలను (గోధుమలతో సహా వరి, వివిధ రకాల గడ్డలను (దక్షిణ బీహార్‌లోని చిరాండ్ వలె) పండించారు.

దక్కనులోని చాలా ప్రదేశాలలో ఆర్థిక వ్యవస్థ వాతావరణ స్థితిగతులకు అనుగుణంగా సంచార స్వభావం కలిగి ఉండేది. ఈ ప్రాంతంలో నవీన రాతియుగ – మట్టి పాత్రల యుగాల కలయిక పిక్లిహల్, తెక్కలకోట (కర్ణాటక) లేదా ఉట్నూరు, నాగార్జునకొండ (ఆంధ్రప్రదేశ్)లలో ప్రస్ఫుటంగా కనిపించింది. ఈ సంగ్రహం క్రీ.పూ. 2000 నుండి క్రీ.పూ. తొలి సహస్రాబ్ది మధ్యశతాబ్దాల వరకు కొనసాగింది. అయినప్పటికీ కొన్ని ప్రాంతాలలో నూతన లోహ పరిజ్ఞానం ఊహించిన దానికంటే ముందే అభివృద్ధి చెందినట్లు బోధపడుతోంది. పరిణామక్రమం ఏదైనప్పటికీ ప్రాంతీయ వైరుధ్యాలు ఎలా ఉన్నప్పటికీ ఈ సంస్కృతులు ఉమ్మడిగా భవిష్యత్తు లోహయుగపు పూర్వ పరిస్థితులను ప్రతిబింబించాయి.

**తొలి వ్యవసాయ స్థిర నివాసాలు :**

భారత ఉపఖండంలోని ఏ నవీన రాతియుగపు క్షేత్రమూ క్రీ.పూ. 7000–6000 సంవత్సరాల కంటే పురాతనమైనది కాదు. దక్షిణ, తూర్పు ప్రాంతాలలో కనుగొన్న కొన్ని క్షేత్రాలు క్రీ.పూ. 1000 సంవత్సరాల కాలం నాటివి. అయితే నవీన రాతియుగపు ప్రధాన కాలం మాత్రం క్రీ.పూ. 4000–1800 మధ్యలో ఉంది. తొలి నవీన రాతియుగపు ప్రజలు ప్రధానంగా పశులకాపరులు, వారికి సంచార ఆర్థిక వ్యవస్థ ఉండేది. అయితే తదుపరి నవీన రాతియుగపు వలసదారులు క్రమంగా వ్యవసాయదారులుగా మారారు. వివిధ రకాల పంటలను పండిస్తూ వృత్తాకారం లేదా చతుర్భుజ ఆకారంలో ఉండే గృహాలలో నివసించారు.

భారత ఉపఖండంలోని తొలి జ్ఞాత వ్యవసాయ నిలయాలు సింధూనదీ వ్యవస్థకు పశ్చిమాన ఉన్న ప్రాంతం నుండి వచ్చాయి. తొలిస్థిర గ్రామ నివాసం (6000 క్రీ.పూ) ఈశాన్య బలూచిస్తాన్‌లోని మెహర్‌గఢ్. నవీన రాతియుగపు వలసదారులు రాయిపై పూర్తిగా ఆధారపడడంవల్ల కొండ ప్రాంతాలను దాటి దూరంగా వెళ్లలేకపోయారు. అయితే లోహాల వినియోగం మొదలవడంతో నవీన రాతియుగం నుండి మట్టిపాత్రల దశకు ప్రగతి సాధించారు. నాగరికత అంచుల్లో నిలిచారు.

ఈ మార్పులన్నీ తొలుత పశ్చిమోత్తర భారతదేశంలో చోటు చేసుకున్నాయి. హరప్పా వంటి గొప్ప నాగరికత రూపంలో పరిపూర్ణత సాధించాయి. అయితే ఉప ఖండంలోని మిగతా ప్రాంతాలు లేదా భారత లోపలి భాగాలు మధ్యరాతి యుగం నుండి నవీన రాతియుగం, తదుపరి మట్టిపాత్రల దశకు చాలా నెమ్మదిగా ప్రస్థానం కొనసాగించాయి.

నవీనరాతియుగం నుండి మట్టి పాత్రల దశకు పరివర్తనం చెందిన తొలి గ్రామం మెహర్‌గఢ్, క్రీ.పూ. ఐదవ సహస్రాబ్ది నాటికి ఈ పరివర్తనం పూర్తి అయ్యింది. తర్వాతి రెండు సహస్రాబ్దిలో (5000–3000 క్రీ.పూ) పశ్చిమోత్తర భారతదేశం ఇలాంటి పరివర్తనను పూర్తి చేయడమే కాకుండా వ్యవసాయ నివాసాల విస్తరణను కూడా గణనీయ స్థాయిలో చవి చూసింది. మెహర్‌గఢ్ నుండి నివాసాలు పొరుగు ప్రాంతాలకు (సింధు లోయతో సహా) విస్తరించాయి.

శాశ్వత నివాసాలకు తోడుగా కొత్త చేతివృత్తులు వచ్చాయి. ముఖ్యమైన సాంకేతిక ఆవిష్కరణలు వాటిలో అంతర్భాగమయ్యాయి. కొత్త వృత్తులలో మట్టిపాత్రల తయారీ, రాగి, మిశ్రమ లోహాల తయారీ, పరికరాలు, ఆయుధాలలో వాటి వాడకం ముఖ్యమైనవి. ఈ పరిణామాలన్నీ సింధూ నది వ్యవస్థకే పరిమితమయ్యాయి. అయితే ఈ నదీ వ్యవస్థకు తూర్పున ఉన్న భారత ఉపఖండాన్ని అవి ఏ విధంగానూ ప్రభావితం చేయలేదు.

ఈ కాలమంతటా (5000–3000 క్రీ.పూ) ఉపఖండంలో మరెక్కడా స్థిర వ్యవసాయ సముదాయాలు లేవన్న విషయాన్ని మనం గుర్తు పెట్టుకోవాలి. మధ్యరాతియుగ సేకరణ –వేటదారులు లేదా తొలి నవీన రాతియుగపు పశుపోషకులు ఈ ప్రాంతాలలో ఎక్కువగా సంచార జీవితం గడిపారు. అయితే సింధూ నాగరికత కాలంలో భారత లోపలి భాగాలలోని ఈ ప్రజలు ఎంతో అభివృద్ధి చెందిన హరప్పావాసులతో సంప్రదింపులు, సంబంధాల వల్ల ప్రభావితమై ఉండవచ్చు. వారి ఆచారవ్యవహారాలను అనుసరించి ఉండవచ్చు. ఫలితంగా అనేక తామ్రయుగ సంస్కృతులు భారత లోపలి భూభాగాలలో అభివృద్ధి చెందాయి. అయితే ఇవేవీ క్రీస్తుపూర్వం 1800 సంవత్సరాల కంటే పురాతనమైనవి కావు. కొన్ని సంస్కృతులు క్రీ.పూ 1000 సంవత్సరాల వరకు, మరికొన్ని క్రీ.పూ. 800 సంవత్సరాల వరకు కొనసాగాయి.

**నవీన రాతియుగ దశ :** నవీన రాతియుగ పరివర్తనలో సాంకేతిక విప్లవం చాలా తక్కువగా ఉన్నా భూమి వినియోగంలో మాత్రం గుణాత్మక మార్పులు వచ్చాయి. మానవులు ఆహారాన్ని సేకరిస్తూ జంతువులను వేటాడుతూ వేలాది సంవత్సరాలు జీవించగలిగినప్పుడు పశుపోషణ, వ్యవసాయం చేపట్టాల్సిన అవసరం వారికి ఏలా ఏర్పడింది? ఎట్టకేలకు ప్రజలు గ్రామ జీవితానికి అలవాటుపడి పశుపోషకులుగానూ, రైతులుగాను స్థిరపడిపోయారు. స్థిరనివాసం, పశుపోషణ, వ్యవసాయం (గోధుమ, బార్లీ) ప్రక్రియ పశ్చిమోత్తర సరిహద్దులో తొలుత సంభవించడం యాదృచ్ఛికమేమీ కాదు. మెహర్‌గఢ్ (క్రీ.పూ 6000 నుండి)లో ఈ ప్రక్రియ పరిపూర్ణమైంది. సేకరణ– వేటదారులు పశుపోషణ, వ్యవసాయాన్ని అలవర్చుకోవడానికి ఉపఖండంలో ఒక ప్రత్యేక కాలం అంటూ లేదు. నవీనరాతియుగ దశ వివిధ ప్రాంతాలలో విభిన్న కాలాల్లో ఆవిష్కృతమైంది. ప్రతి ఉదంతంలోనూ ఒక ప్రత్యేకరాయి, మట్టిపాత్రల తయారీ పరిజ్ఞానం, ప్రత్యేక జంతువులు (పోషణకు) కనిపిస్తాయి.

**తామ్రయుగ దశ :** హరప్పా నాగరికత తర్వాత అనేక తామ్రయుగ సంస్కృతులు దేశంలోని చాలా ప్రాంతాలలో వెలసిల్లాయి. నైసర్గికంగా బానస్ నుండి మాల్వా, ఆ తర్వాత పశ్చిమ మహారాష్ట్రలో భీమా లోయ వరకు అవి విస్తరించాయి. ఈ సంస్కృతులు కొన్ని సమాన క్షణాలను ప్రదర్శించాయి. ముఖ్యంగా జీవనోపాధి ఆర్థిక వ్యవస్థల్లో, నివాస గృహాల

స్వరూపం, తొలిచే రాతిసాధనాలు, గంద్రగొడ్డళ్ల కొరత, రాగి పరిమిత వినియోగం విషయంలో అవి దాదాపు ఒకేలా పోలి ఉన్నాయి. అయితే వాటి మట్టి పాత్రలు మాత్రం ప్రత్యేకమైనవి. కనుక సాంస్కృతిక అభ్యున్నతి, ఆలోచనల ప్రచార ప్రక్రియ దాదాపు వెయ్యేళ్లపాటు పశ్చిమ, మధ్య భారత ప్రాంతాలలో కొనసాగినట్లు మనం భావించాలి. ఈ ప్రక్రియ కారణంగా వివిధ సంస్కృతులకు కృష్ణ, తుంగభద్ర తీర ప్రాంతాలు అందుబాటులోకి వచ్చాయి. ఈ సారవంతమైన భూములలో "దక్షిణ నవీన రాతియుగ" స్థిర నివాసాలు వికసించాయి.

**తొలి లోహయుగ దశ :** దేశంలోని వివిధ ప్రాంతాలలో స్థిర గ్రామ నివాసం వివిధ స్వరూపాలను సంతరించుకుంది. అలాగే వివిధ కాలాల్లో విభిన్న నేపథ్యాలలో ఇనుము వాడకంలోకి వచ్చింది. ఇటీవల దక్షిణాసియాలోని ఆరు ప్రాంతాలలో ఇనుము వాడకం పుట్టుపూర్వోత్తరాల గురించి పరిశోధన జరిగింది. ఆ అధ్యయనం ప్రకారం ఆర్యుల వలసతో ఇనుము వినియోగానికి ఎలాంటి సంబంధమూ లేదు. ముడి ఇనుము కేంద్రీకృత ప్రాంతాలపై జరిగిన పరిశోధనలో ఆ ఖనిజం విస్తారంగా విస్తృతంగా లభించేదన్న విషయం స్పష్టమైంది.

రేడియోకార్బన్ తేదీల ప్రకారం క్రీ.పూ. 1100 ప్రాంతంలో మాల్వా చుట్టుపక్కల ఇనుము ఉత్పత్తి మొదలై ఉంటుంది. తామ్రయుగ, లోహయుగ భౌతికవాద సంస్కృతుల మధ్య మాల్వాలో నిరంతరం కనిపించడమే పై వాదనకు ఆధారం. తామ్రయుగ చివరి దశలు ఈ ప్రాంతంలో క్రీ.పూ.1300 వరకు అంతరించాయి. అయితే ఇనుమును తొలుత ఉత్పత్తి చేసిన క్షేత్రం లేదా ప్రాంతాన్ని అన్వేషించడం నిరర్ధకమేనని చెప్పాలి. ఎందుకంటే ఇనుముకు ఒకటి కంటే ఎక్కువ మూలకేంద్రాలు ఉన్నాయి. పైగా కొన్ని శతాబ్దాల వ్యవధిలోనే అనేక సముదాయాలు ఇనుమును ఒకేసారి వినియోగించడం మొదలుపెట్టాయి. గంగా-యమున ద్వినది ప్రాంతంలో ఇనుము వినియోగంవల్ల అనేక స్థిర నివాసప్రాంతాలు ఏర్పడ్డాయి. అలాగే మగధ, కోశల రాజ్యాలు, ఉత్తర గణరాజ్యాలు (గంగా మైదాన ప్రాంతంలో) చివరిలోహయుగం నేపథ్యంతో ఆవిర్భవించాయి. లోహ సాంకేతిక పరిజ్ఞాన పరిచయం, స్థిర నివాసాల శైలులు, ఉత్తర భారతదేశంలో రాజకీయ పరిణామాల మధ్యగల సంబంధాన్ని పురావస్తు శాస్త్రజ్ఞులు ఎంతో కాలం నుండి అన్వేషిస్తున్నారు.

**సంచార,వ్యవసాయదార సముదాయాల విస్తరణ - లక్షణాలు(క్రీ.పూ.2000-600)**

**పశ్చిమోత్తర సరిహద్దు :** పోట్వార్ పీఠభూమిలోని సరాయిఖోలా నవీన రాతియుగ దశ క్రమంగా కోట్ దీజియన్ తామ్రయుగ సంస్కృతికి బాటలు వేసింది. తర్వాత ఏదో ఒక విధంగా ఈ ప్రాంతమంతా సింధూ మైదాన ప్రాంతాల సమకాలీన వ్యాపార వ్యవస్థలో ఇమిడి పోయింది. స్వాత్-చిత్రల్ ప్రాంతంలో పురావస్తు తవ్వకాలు జరపగా వివిధ క్షేత్రాలలో విభిన్న లోహాల వాడకం ఉండేదని తేలింది. వివిధ రకాల రాళ్లు, ఇతర వస్తువులు, ముఖ్యంగా గవ్వలు, కౌడీలు, ఏనుగు దంతాలు, సముద్ర పదార్థాలు సింధూ మైదాన ప్రాంతాల నుండి ఇక్కడికి చేరి ఉంటాయి. ఘాలిగాయ్‌లోని రాతి గృహ క్షేత్రం స్వాత్-చిత్రల్ ప్రాంతానికి ఒక మూలరేఖను అందిస్తుంది. "ఆది చారిత్రక శ్మశానాలు" క్రీ.పూ. 1750 నుండి 750 సంవత్సరాల వరకు ప్రత్యక్షమయ్యాయి. శ్మశానాలు, సంబంధిత నివాసాలను 'గాంధార సమాధి సంస్కృతి"గా వర్గీకరించారు. ఈ తామ్రయుగ సమాధులు పార్థివదేహాలు, కలశాల ఖననాలను కలిగి ఉన్నాయి.

**కాశ్మీర్‌లోయ:** కాశ్మీర్‌లో 30 కంటే ఎక్కువ నవీన రాతి యుగ క్షేత్రాలు బయల్పడ్డాయి. చాలా వరకు బారాముల్లా, అనంత్‌నాగ్, శ్రీనగర్ ప్రాంతాలలోనే అవి వెలుగులోకి వచ్చాయి. ఈ విస్తరణను బట్టి ఈ సంస్కృతి మైదాన ప్రాంతాల నుండి పూర్తిగా వేరుపడి లేదని అర్థమవుతుంది. గుఫ్‌క్రాల్ వద్ద గల మట్టిపాత్రల పూర్వదశలో నివాస వసతులు విశాలంగాను, చిన్నవిగాను కనిపించాయి. అంతకు ముందున్న దశలో ఈ నివాస వసతులు ఉపరితలంగా, విశాలంగా ఉండేవి. తర్వాతి దశలో నివాస గృహాలలో రెండు భాగాలు (చాంబర్లు) కనిపించాయి. చేతితో మలచిన మట్టికుండలకు అడుగు భాగంలో చేపతో ముద్రించిన ఆకారం ఉంది. కాశ్మీర్ నవీనరాతియుగ మట్టిపాత్రల దశలో ఇలాంటి కుండలు ఒక ప్రత్యేకమైన లక్షణంగా నిలిచాయి. గుఫ్‌క్రాల్, బుర్జహోమ్‌లలో జరిపిన తవ్వకాలలో ఇలాంటి పాత్రలు బయటపడ్డాయి. కాశ్మీర్ ఈ దశ నుండి భారీ శిలా దశకు (2000–1500 క్రీ.పూ. మధ్యలో) పరివర్తనం చెందింది.

**ఈశాన్య రాజస్థాన్ :** క్రీ.పూ. నాలుగు, మూడు సహస్రాబ్దికి చెందిన గణేశ్వర్ – జోధ్‌పూర్ సంస్కృతికి సంబంధించిన ఆనవాళ్లను జోధ్‌పూర్ తొలిగా బయటపెట్టింది. తర్వాత గణేశ్వర్ వద్ద మట్టిపాత్రలు లభించాయి. ఈ ప్రాంతాన్ని మరలా తవ్వారు. ఇలాంటి క్షేత్రాలు (సుమారు 83) ఈశాన్య రాజస్థాన్‌లోని వివిధ ప్రాంతాలలో బయటపడ్డాయి. ముఖ్యంగా సికర్, జైపూర్, చురు జిల్లాలలో అవి ఉన్నాయి. రాగి గనులు, రాగి తయారీ కేంద్రంగా ఈశాన్య రాజస్థాన్ ప్రశస్తిని ఈ తవ్వకాలు సార్థకం చేస్తాయి. మూడు నాలుగు ఎకరాల కంటే ఎక్కువగా విస్తారం లేని గణేశ్వర్ క్షేత్రంలో ఇప్పటికే సుమారు 2,000 రాగి వస్తువులు బయటపడ్డాయి. ఇలాంటి క్షేత్రాలు 80కిపైగా ఉన్నాయని మనం గుర్తిస్తే రాగిని ఏ మేరకు తవ్వితీశారో, రాగి పరికరాల తయారీ ఏ స్థాయిలో ఉండేదో అర్థం చేసుకోవచ్చు.

**వాయవ్య రాజస్థాన్ :** వాయవ్య రాజస్థాన్‌లోని తామ్రయుగ క్షేత్రాలలో బానస్, తదితర ఉపనదులు ముంచిన మైదాన ప్రాంతం ఒకటి ఉంది. అందులో మూడు క్షేత్రాలు (అహర్, గిలుంద్, బలాథల్) మాత్రమే శాస్త్రీయంగా తవ్వబడ్డాయి. అహర్ లేదా బానస్ సంస్కృతికి చెందిన క్షేత్రాలు ఇప్పుడు 90 కంటే ఎక్కువగా ఉన్నాయి. అహర్ సంస్కృతిలోని ముఖ్యమైన అంశం రాగి లోహశాస్త్రంపై దానికున్న అపారమైన పరిజ్ఞానమే. ఈ ప్రాంతంలో బయల్పడిన తామ్ర పాత్రలు, పరికరాలు గుజరాత్‌లోని హరప్పావాసులతో ఉన్న సంబంధాలను చాటి చెబుతాయి. మరోవైపు ఈ సంస్కృతి మాల్వావైపు విస్తరించింది. దక్షిణాన దక్కను వరకు దానికి సంబంధాలు ఏర్పాడ్డాయి.

**మాల్వా :** మాల్వాలో వందకుపైగా తామ్రయుగ క్షేత్రాలు ఉన్నాయి. నవదాటోలి పరిమిత నివాసప్రాంతంగా ఉండేదని ఆధారాలు చెబుతున్నాయి. ఎరాన్‌లో లభించిన పురావస్తు సాక్ష్యాలు విభిన్నమైన నివాస ప్రాంత చిత్రాన్ని అందిస్తాయి. బీనా నదితో మూడువైపులా చుట్టబడి ఉన్న ఎరాన్ నాలుగోవైపు ఒక ఎత్తయిన రాతి వేదిక, గోతితో సురక్షితంగా ఉండేది. తామ్రయుగదశ మధ్యభాగంలో నిర్మాణమైన రాతి వేదికకు రెండు దశలు ఉండేవి. ఎర్రటి మట్టిపై నల్లటి పూత ఉన్న పాత్రలు ఈ కాలంలో ప్రధానంగా ఉండేవి. అలాగే ఇతర నలుపు–ఎరుపు పాత్రలు ఉండేవి. సూక్ష్మ రాతికత్తులనే ప్రాథమిక సాధనాలుగా వినియోగించారు.

రాగి పరికరాలపై సాక్ష్యం పరిమితంగా ఉంది. అయితే నవదాటోలీలా రాగితో తయారైన వెడల్పాటి గొడ్డళ్లు కనిపించాయి. రాగితో తయారైన పూసలు, ఇతర లోహాలు, మిశ్రమ లోహాలతో తయారైన సాధనాలు విస్తారంగా దొరికాయి. నవదాటోలీలో విభిన్న రకాల పంటలను పండించారు. నవదాటోలీలో లిఖించబడిన మాల్వా సంస్కృతి క్రీ.పూ. రెండవ సహస్రాబ్ది తొలియర్థానికి చెందినది. అయితే ఇక్కడ ఆసక్తికరమైన అంశం మాల్వాలో చివరి హరప్పావాసులు నివసించడమే. ఇతర ఆసక్తికరమైన పరిణామాలలో అగ్నిహోమాల మండపాలు, దాంగ్‌వాడాలోని దేవాలయాలు (కట్టడాలు ఆ స్వరూపంలో ఉన్నాయి) అవశేషాలు, తామ్రయుగ దశలో నంది, లింగ ఆరాధన సాక్ష్యాలు ఉన్నాయి.

**మహారాష్ట్ర :** సవాల్దా సంస్కృతి విస్తరించి ఉన్న ప్రాంతాలను బట్టి తొలి నివాస క్షేత్రం ఉత్తర మహారాష్ట్రలో తపతి, గోదావరి నదుల మధ్య ఉన్నట్లు స్పష్టమవుతుంది. అది క్రీ.పూ.మూడవ సహస్రాబ్ది చివరలో లేదా రెండవ సహస్రాబ్ది ప్రారంభంలోకాని స్థిరపడి ఉండవచ్చు. కహోథే వద్ద జరిగిన తవ్వకాల ఫలితాలను బట్టి సవాల్దా సంస్కృతిని పాక్షిక సంచార సముదాయంగా అన్వయించారు. మహారాష్ట్రలో చివరి హరప్పావాసుల మూల నివాస కేంద్రం సవాల్దా సంస్కృతి ఆక్రమించిన ప్రాంతంలోనే ఉంది. దైమాబాద్ వద్ద సింధూలిపి లభ్యం కావడం ఈ గుర్తింపు అంశాన్ని (వివాదాన్ని) ఒక కొలిక్కి తెచ్చింది.

మహారాష్ట్రలో తదుపరి ఆవిర్భవించిన జొర్వే సంస్కృతి దశను చాలా తీక్షణంగా అధ్యయనం చేశారు. ఇంతవరకు వెలుగు చూసిన 200 పై చిలుకు జొర్వే నివాస కేంద్రాలలో చాలా వరకు ఒకటి నుండి మూడు హెక్టార్లలో విస్తరించి ఉన్న గ్రామాలే ఉన్నాయి. ప్రత్యేకంగా ఆసక్తి కలిగించే విషయమేమిటంటే ఇనామ్‌గావ్ వద్ద జొర్వే దశతొలి సంవత్సరాలలో నీటిపారుదల (వ్యవసాయ) కాలువ, నివాస ప్రాంతానికి పశ్చిమాన రాళ్లతో నిర్మించిన గట్టు ఉన్నట్లు ఆధారాలు లభించడమే. చేతి నాగళ్లు, విత్తనం నాటే పరికరాలు రెండింటిని వ్యవసాయంలో వినియోగించారు. కుమ్మరి బట్టీలు, బంగారు ఆభరణాలు, రాగి, ఈటెలు, టెర్రకోట విగ్రహాలు, జంతు, అగ్నిదేవుని ఆరాధనా చిహ్నాలు జొర్వే సంస్కృతికి చెందిన తామ్రయుగ గ్రామ జీవితానికి పూర్తి అర్థాన్ని ఇస్తాయి. ఈ దశ క్రీ.పూ. 1000 లేదా తదుపరి కాలంలో అంతరించినట్లు భావిస్తారు.

**దక్షిణ భారతదేశం:** ఈ ప్రాంతాన్ని స్థూలంగా "దక్షిణ నవీనరాతియుగ సంస్కృతి' అని పిలుస్తారు. ఈ సంస్కృతికి మూడు దక్షిణ రాష్ట్రాలలో నైసర్గిక వైరుధ్యాలు కనిపిస్తాయి. అందులో కర్ణాటక పీఠభూమి, పశ్చిమోత్తర తమిళనాడులోని పీఠభూమి ప్రాంతం, ఆంధ్రప్రదేశ్‌లోని తెలంగాణ, రాయలసీమ ప్రాంతాలు ప్రముఖమైనవి. ఈ దక్షిణ నవీనరాతియుగ సంస్కృతిని నవీనరాతియుగ అగ్నిపర్వత ద్రావకాలు (బూడిద) ఏర్పరచిన రాళ్లు, కొండలు కట్టివేశాయి. ఇక్కడ రెండు ద్వినది ప్రాంతాలు ఉన్నాయి. కృష్ణ, తుంగభద్రల మధ్య రాయ్‌చూర్ ద్వినది ప్రాంతం, భీమ, కృష్ణ మధ్య షోలాపూర్ ద్వినది ప్రాంతం ఉంది. తుంగభద్రకు తూర్పున కూడా కొన్ని క్షేత్రాలు బయటపడ్డాయి. ఈ ప్రాంతాపు చదరపుకొండలు, నదీ తీరాలు నవీనరాతియుగ వలసదారులకు ఎంతో అనుకూలంగా ఉండడంతో వారు ఇక్కడే

స్థిరపడిపోయారు. బ్రహ్మగిరి, మస్కీ, పిక్లిహల్, ఉట్నూరు, కుప్గల్, హల్లూరు, నాగార్జునకొండ, సంగనకల్లు, పాలవాయి, పాయంపల్లి, తెక్కలకోట, కొడేకల్ ప్రధాన క్షేత్రాలు. ఆంధ్రలో సంపూర్ణమైన తామ్రయుగ సముదాయం (నివాస) బయటపడింది. కర్నూలు ప్రాంతాలలో కనుగొన్న అనేక క్షేత్రాలలో సింగనపల్లి ప్రధానమైనది. అక్కడ రంగరించిన మట్టి పాత్రలు, రాతి కత్తులు పెద్ద సంఖ్యలలో లభిస్తున్నాయి. ఆంధ్ర నవీనరాతియుగ సాంస్కృతికాంశం తమిళనాడు, కర్ణాటక సముదాయంలో అంతర్భాగమని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు.

మహారాష్ట్రలోని విదర్భ ప్రాంతం, దక్షిణ ద్వీపకల్పం అంచుల మధ్య ఉన్న భౌగోళిక ప్రాంతం ఖననశైలికి ఒక ప్రధాన క్షేత్రంగా ఉంది. ఇక్కడ భారీ శిలాస్మారకాలతో కూడిన సమాధులు ఉండడం ప్రత్యేకమైన లక్షణం. ఈ శైలి చారిత్రక యుగంలో కూడా కొనసాగింది. రాతిచప్టాలు, ఫలకాలు, స్థూపాలు రూపంలో సమాధులు ఏర్పాటయ్యాయి. ప్రాంతాల వారీగా వీటి ఆకారంలో మార్పులు ఉన్నాయి. ఇటీవలి కాలం వరకు ఈ భారీ శిలాస్థూపాలు ఈ ప్రాంతంలో ఒక ప్రత్యేకమైన సాంస్కృతిక చిహ్నంగా ఉండేవని భావించారు. అయితే అవి ఖనన శైలి తప్ప మరొకటి కాదని ఇప్పుడు స్పష్టమయ్యింది. నవీనరాతియుగ– తామ్రయుగ సంస్కృతి విస్తరణ నేపథ్యంలో ఉద్భవించిన ఈ శైలి దక్షిణ భారతదేశంలో చాలా కాలం పాటు కొనసాగింది. సాధారణంగా అది ఇనుముతో ముడి పడి ఉంది. అయితే లోహపూర్వ దశలో అది అభివృద్ధి చెందిందని చెప్పడానికి కూడా అవకాశాలు ఉన్నాయి. హల్లూరు, కుమారనహల్లి లాంటి క్షేత్రాలవద్ద దాని తొలి ఇనుము దశ క్రీ.శ. 1300లో కనిపిస్తుంది.

**తూర్పు భారతదేశం :** విద్వాంసులు సాధారణంగా రెండు నవీనరాతియుగ సాంస్కృతిక ప్రాంతాలు గురించి మాట్లాడతారు. ఒకటి బెంగాల్, బీహార్, ఒరిస్సా ప్రాంతం కాగా రెండవది అస్సాం. అస్సాంలో అనేక ఉపప్రాంతాలు ఉన్నాయి. ఒరిస్సాలో కుచాయి క్షేత్రం చేతులతో తయారు చేసిన మట్టి పాత్రలు, గండ్రగొడ్డళ్లు, ఇసుకరాయితో తయారు చేసిన వొలిచే సాధనాలను అందించింది. గోల్బయిసాసన్ క్షేత్రం కూడా నవీనరాతియుగపు పరికరాలను (ఎముక పరికరాలు చక్రం సహాయంతో తయారైన మట్టి పాత్రలు) అందించింది.

ఈశాన్య ప్రాంతమంతటా నున్నపు నవీనరాతియుగ పరికరాలు లభించాయి. అయితే వాటి నవీనరాతియుగ దశ దాఖలాలు నిర్దిష్టంగా ఉత్పన్నం కాలేదు. అస్సాంలోని రెండు నవీనరాతియుగ క్షేత్రాలు– ఉత్తర కఛార్ కొండల్లోని దావోజలి హడింగ్, అస్సాం–మేఘాలయ సరిహద్దులోని సరుతారు– ఇటీవలి కాలంలో తవ్వబడ్డాయి. నాగాలాండ్‌లో కొన్ని క్షేత్రాలు గత కొన్నేళ్లలో మట్టిపాత్రలు, నవీనరాతియుగ పరికరాలను అందించాయి. అయితే ఈ క్షేత్రాలను పూర్తిగా తవ్వాల్సి ఉంది.

పశ్చిమ బెంగాల్, బీహార్‌లలో తొలి గ్రామవాసాలు ఏర్పడినట్లు అనేక క్షేత్రాలు చెబుతున్నాయి. ముఖ్యంగా పాండు రాజర్ ధీబి (పశ్చిమ బెంగాల్), చీరంద్, తారాది, సెనూర్ (బీహార్)లలో ఇలాంటి ఆధారాలు దొరికాయి. పాండు రాజర్ ధీబిలో దొరికిన సాంస్కృతిక పరికరాలలో సూక్ష్మరాతికత్తులు, లోపల ధాన్యం దాచిన ముద్రలు గల మట్టి పాత్రలు ఉన్నాయి. ఉత్తర బీహర్‌లోని మధ్యగంగ మైదాన ప్రాంతంలో చీరంద్‌వద్ద ఇంకా విస్తృతమైన ఆధారం లభించింది. ఈ క్షేత్రంలో వివిధ రకాల మట్టి పాత్రలు, టెర్రకోట పరిశ్రమ, ఎముకపరికరాలు,

పూసలు, గోధుమ, బార్లీ, వడ్ల అవశేషాలు పెద్ద ఎత్తున దొరికాయి. కైముర్ కొండప్రాంతం దిగువన ఉన్న సెనూర్ వద్ద మూడు ప్రధాన పింగాణి పాత్రలు లభించాయి. ఉన్నతమైన సూక్ష్మరాతి పరికరాల పరిశ్రమకు తోడు ఎముక పరికరాలు, పూసలు, ఇతర అవసరాలను తీర్చే రాతి ఆకారాలు, బియ్యం, బార్లీ, కొన్ని తృణధాన్యాలు దొరికాయి. వరి ఇక్కడ ప్రధాన పంటగా ఉండేదని బోధపడుతోంది. తారాది వద్ద నవీన రాతియుగ స్థాయి గురించి ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు.

తూర్పు భారతదేశ పురావస్తుక్రమంలో తామ్రయుగ దశ బీహార్, పశ్చిమ బెంగాల్, ఒరిస్సాలోని అనేక క్షేత్రాలను కలుపుకొని ఉంది. సాధారణ, ఎరుపు–నలుపు పాత్రలు ఇక్కడి ప్రత్యేకత, ఈ స్థాయిలో రాగి, సూక్ష్మపరికరాల పరిశ్రమ, ఎముక పరికరాలు, సహాయక పనిముట్లు, పాక్షిక విలువగల రాతి గొలుసులు, మట్టిగృహాలు, రాతి కట్టెలు, ప్రధానపంట అయిన వరి, టెర్రకోట, తదితర రాతి విగ్రహాలు ఉన్నాయి. ఒరిస్సాలో ఈ స్థాయిని విస్తృతంగా తవ్వలేదు. అయితే బీహార్, పశ్చిమ బెంగాల్‌లలో అసంఖ్యాక క్షేత్రాలు ఉన్నాయి. పశ్చిమ బెంగాల్‌లో ఇప్పటి వరకు 70 పైచిలుకు క్షేత్రాలను అధికారికంగా నమోదు చేశారు. వాటిలో తామ్రయుగ, లోహయుగ పాత్రలు లభించాయి. అయితే పంటలకు సంబంధించిన వెలలేని సాక్ష్యం సెనూర్‌లోని తామ్రయుగ స్థాయిలో లభించింది. వరి, బార్లీ, గోధుమ, ఆముదపు గింజలు, కందులు, మెంతులు, అలసందలు తదితర ధాన్యాల అవశేషాలు ఇక్కడ బయటపడ్డాయి.

**ఉత్తరప్రదేశ్ :** తూర్పు ఉత్తర ప్రదేశ్‌లో ఆది కాల సాక్ష్యాలు (సరయుమైదానప్రాంతం) స్పష్టంగా లేవు. కేవలం పిప్రావా–గన్వారియా తవ్వకాలే మట్టిపాత్రలు (నల్లని, సాధారణ)ను అందించాయి. ఇమ్లీడీ, నర్హాన్, సొగౌరాలలో ఆది కాల అవశేషాలు లభించాయి.

పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లో తేలికపాటి వర్ణంగల మట్టిపాత్రలు దశతో గ్రామ జీవితం మొదలవుతుంది. ఇక్కడ చివరి హరప్పావాసులు కూడా కనిపిస్తారు. ఈ స్థాయి తూర్పుదిశ కోణం అలహాబాద్ సమీపంలోని శృంగవేరపుర వద్ద ఉంది. అయితే చివరి హరప్పావాసులు నివాసప్రాంతం ఢిల్లీ–మీరట్–బులంద్‌షహర్ మండలి కంటే దిగువన విస్తరించినట్లు కనబడదు. మరోవైపు OCP స్థాయి సహరాన్‌పూర్–హరిద్వార్ ప్రాంతానికి (ఈమండలిలో) మించి విస్తరించింది. కనుక దాని విస్తరణ హరప్పావాసులనివాస ప్రాంతాన్ని అధిగమిస్తుంది.

పింగాణి–లోహ మిశ్రమంతో తయారయ్యే వర్ణం (రంగు) పూత ఉన్న పాత్రలను ఒసిపిగా పరిగణిస్తారు. ఇక్కడ తీవ్రమైన అంశమేమిటంటే ఒసిపి స్వయంగా చివరి హరప్పా కాలం నాటి విస్తరణలో అంతర్భాగమా కాదా అన్నదే. మొత్తం మీద, చివరి హరప్పా వాసులు, ఒసిపి సంకీర్ణ సముదాయం చాలా దగ్గరగా ముడిపడి ఉన్నాయి. హులాస్ వద్ద బయల్పడిన చివరి హరప్పా క్షేత్రం ద్వినది ప్రాంతంలో హరప్పావాసులు అభివృద్ధి చెందిన క్రమాన్ని స్పష్టంగా వివరిస్తుంది. ఈ ప్రాంతంలోని ఒసిపి సముదాయం యొక్క ముఖ్య లక్షణం "రాగి రాశులు"తో దానికున్న అనుబంధమే. ఒసిపి విస్తరణ, "రాగిరాశుల" సంబంధిత అన్వేషణ ఎగువ గంగాలోయలో ఎరుపు–నలుపు కుండ పెంకుల స్థాయికి దారి తీశాయి. ఈ సాక్ష్యాలను అత్రంజిఖేరా, జాఖేరా క్షేత్రాలు ప్రధానంగా అందజేశాయి.

పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లో ఎరుపు-నలుపు కుండ పెంకుల (పాత్రలు) స్థాయిని బూడిదరంగు కుండపెంకుల దశ అధిగమిస్తుంది. ఈ దశ కేవలం పశ్చిమ యు.పి.లేదా గంగా-యమున ద్వినది ప్రాంతానికే పరిమితం కాలేదు. అది సింధూ-గంగా ప్రాంతమంతటా విస్తరించి ఉంది. పంజాబ్, హర్యానాలలో ఇలాంటి దశకు చెందిన క్షేత్రాలు అనేకం ఉన్నాయి. కొన్ని క్షేత్రాలు పరిధికి మించి ఉన్నాయి. హర్యానాలోని కురుక్షేత్రకు సమీపంలోని భగవాన్‌పుర, జలంధర్‌లోని దాధేరి, కాట్పలోన్‌లో బూడిదరంగు కుండపెంకుల స్థాయి చివరి హరప్పానాగరికత స్థాయిని అధిగమించి ఉంది. గంగా మైదాన ప్రాంతంలో తదుపరి దశ ఉత్తర నలుపు వర్ణిత పాత్రలుతో నిండి ఉంది. ఇది ఆది చారిత్రక కాలం నుండి ప్రారంభమవుతుంది.

## తొలి లోహయుగం

### చారిత్రక దశ ఆరంభం

లోహ వినియోగపు చరిత్రలో రాగి, కాంస్యం తర్వాతి స్థానం ఇనుముదే, భారతదేశంలో ఇనుము వినియోగం కేవలం సాంకేతిక మార్పునే కాక సాంస్కృతిక మార్పునకు కూడా నాంది పలికింది. ప్రాంతీయ నేపథ్యాల విషయంలో ఇది మరింత ప్రస్ఫుటంగా కనిపించింది. ఎందుకంటే వాతావరణ పరిస్థితుల కారణంగా కాంస్య, రాగి కంటే అధునాతమైన సాంకేతిక పరిజ్ఞానం అవసరమైంది. అలాంటి పరిజ్ఞానంపైనే సాంస్కృతిక సామర్థ్యాన్ని పూర్తిగా చాటుకొనే ముందస్తు పరిస్థితులు ఉండేవి. అలిఖిత, ఆది చారిత్రక దశ నుండి చారిత్రక సంస్కృతి వైపు ఉపఖండాన్ని ఇనుము నెమ్మదిగా, నిర్దిష్టంగా తీసుకెళ్లింది.

**లోహయుగపు క్షేత్రాలు-సంస్కృతులు:** భారతదేశంలో ఇనుము యొక్క తొలి చరిత్రను ప్రాంతీయ నేపథ్యాల ఆధారంగా అధ్యయనం చేయవచ్చు పాశ్చాత్య ప్రభావం కారణంగా భారతలోహపరిజ్ఞానం అభివృద్ధి చెందిందా లేదా అన్న విషయాన్ని పక్కనపెడితే మనం ఉపఖండంలోని లోహ వినియోగ ప్రాంతాలపై దృష్టి సారించవచ్చు. ఇనుము వినియోగ క్రమం ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి భిన్నంగా ఉంది. అయితే క్రీ.పూ. 1000-500 మధ్యకాలంలో ఇనుము వినియోగం ఈ కింది ప్రధాన ప్రాంతాలకు విస్తరించి ఉంటుంది: ఎగువగంగాలోయ, దాని పరిసర ప్రాంతాలు; మాల్వాపీఠభూమి, తపతిలోయ; దక్షిణ, మధ్యభారత భారీశిలా ప్రాంతాలు; బలూచిస్తాన్ మైదాన ప్రాంతాలు; మధ్య, దిగువ గంగాలోయలు; పశ్చిమోత్తర ప్రాంతం, ముఖ్యంగా పెషావర్ ప్రాంతం.

ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఆధారాల ప్రకారం ఇనుము ముందుగా పైన పేర్కొన్న తొలి మూడు ప్రాంతాలలో వెలుగు చూసింది. ఎగువ గంగాలోయ, సింధూ-గంగా పరివాహక ప్రాంతంలో ఇనుము తొలుత బూడిదరంగు కుండపెంకులతో ముడిపడి ఉన్నట్లు ఆధారాలు లభించాయి. ఇది క్రీ.పూ.800 సంవత్సరాల పరిసర కాలంలో తొలి నాళ్లలో ఈ లోహాన్ని చాలా పరిమితంగా వాడారు. అయితే క్రీ.పూ ఆరవ శతాబ్దం నాటికి అది సర్వసాధారణమైంది. ఈ కాలంలో అది ఒక నూతన సంస్కృతితో ముడిపడింది. అదే ఉత్తర నలుపు వర్ణ పాత్రల సంస్కృతి లోహ వినియోగం మధ్య, దిగువ గంగా లోయకు కూడా విస్తరించింది. ఈ ప్రాంతాలు గత సంస్కృతులకు గణనీయమైన స్థాయిలో వేరు పడ్డాయి.

మాల్వా ప్రాంతం, తపతి లోయలో కూడా నాగ్దా, ఎరాన్, ప్రకాష్‌లాంటి క్షేత్రాలలో ఇనుము గత తామ్రయుగ సంస్కృతులలో కీలక మార్పును ప్రవేశపెట్టింది. ఈ ప్రాంతంలో ఇనుము వినియోగం బహుశా గంగాలోయకంటే ముందుగానే జరిగి ఉండవచ్చు (కీ.పూ. 1000). అలాగే ఉత్తర కర్ణాటకలోని హల్లూరు వద్ద ఇనుము క్రీ.పూ. 900 నాటి నవీనరాతియుగ పరికరాలను నిరర్థకం చేసినట్లు కనబడుతోంది. ఇంకా చెప్పాలంటే, ఈ కాలపరిధి దక్షిణ భారతదేశంలోని ఇతర లోహయుగ క్షేత్రాలకు వర్తించకపోయినా భారీశిలాస్థాపాలున్న ప్రదేశాలలో ఒక నిర్దిష్టమైన సాంస్కృతిక వీడుకోలు (గత నవీన రాతియుగ కాలం నుండి) కనిపిస్తుంది.

**ఇనుము ప్రభావం:** పైన ప్రస్తావించబడిన ప్రాంతాలన్నింటిలో ఇనుము ఆధునిక వ్యవసాయశైలిని ప్రవేశపెట్టిందనడంలో ఎలాంటి సందేహంలేదు. గంగాలోయ, మాల్వా ప్రాంతంలో ఇనుము వాడకం పట్టణ కేంద్రాల పురోగతికి కూడా బాటలు వేసింది. బ్రాహ్మణిక, బౌద్ధ గ్రంథాలు రెండూ క్రీ.పూ. తొలి సహస్రాబ్ది కాలం నాటి నగరాల గురించి తరచుగా ప్రస్తావించాయి. అహిచ్ఛత్ర, వారణాసి, కౌసాంబి, స్రావస్తి, ఉజ్జయినీ తదితర నగరాలలోనే లోహయుగపు పట్టణీకరణకు సంబంధించిన పురావస్తు సాక్ష్యాధారాలు లభిస్తాయి.

గంగాలోయ స్థిర నివాసాల లోహ యుగపుదశల పురావస్తు ఆధారాలు గత దశల కంటే ఎంతో ప్రామాణికంగా ఉన్నాయి. ఈ నివాసాలు మరింత విస్తరించాయని సూచించే ఆధారాలు కూడా ఉన్నాయి. క్రీ.పూ. ఆరవ శతాబ్దం మధ్యనాటికి ఈ నివాసప్రాంతాలు పట్టణ కేంద్రాల స్థాయిని అందుకున్నాయి. హరప్పా నాగరికత అంతరించిన తర్వాత తొలిసారిగా వ్యవసాయ నిల్వలు (అదనపునిల్వలు) గణనీయమైన పరిమాణంలో లభించాయని చెప్పడానికి పట్టణ కేంద్రాలే తార్కాణం. అదనపు ఉత్పత్తి లేదా నిల్వలు ఈ నగరాలను పోషించాయి. ఈ కాలం నుండే రాగి, వెండి నాణేల వాడకం ఎక్కువైంది. దీనిని బట్టి వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలు కూడా పెద్ద ఎత్తున జరిగినట్లు భావించవచ్చు. కొన్ని పట్టణ కేంద్రాలు రాజకీయ అధికార కేంద్రాలుగా కూడా వ్యవహరించాయి. ఇలాంటి కేంద్రాలలో బయటపడిన బలమైన ప్రహరీగోడలు, రక్షణ స్థావరాలు ఈ విషయాన్ని ధృవీకరిస్తాయి. ఆవిధంగా నిర్దిష్టమైన ప్రాదేశిక విభాగాలున్న రాజకీయ వ్యవస్థ కూడా ఈ కాలం నాటికి అభివృద్ధి చెందింది.

దక్షిణ భారతదేశంలో మరికొన్ని శతాబ్దాలపాటు పట్టణీకరణ సంభవించక పోయినా భారీశిలాస్థాపాల దశలో దక్షిణభారత సామాజిక నిర్వహణకు సంబంధించిన కొన్ని ముఖ్యమైన లక్షణాలు రూపుదిద్దుకున్నాయి. అవి తొలి చారిత్రక కాలాల వరకు కొనసాగాయి. కనీసం దక్షిణంలోని చివరి తీరప్రాంతాలలోనైనా అలాంటి లక్షణాలు సంగం పద్యాలలో(కవితలు) ప్రతిబింబించాయి.

2

# ఆది చారిత్రక సంస్కృతులు

## సింధు నాగరికత

**సాధారణ అధ్యయనం :**

**పరిచయం:** 1922 సంవత్సరంలో పురాతత్త్వశాస్త్రవేత్తల తవ్వకాలలో బయల్పడిన ఆసక్తికరమైన సాక్ష్యాధారాల కారణంగా సింధూనాగరిక అధ్యయనం భారత ఆది చరిత్రలో ఒక ముఖ్యమైన, నిరంతరమైన ప్రక్రియగా మారిపోయింది. మరీ ముఖ్యంగా గత ఐదు దశాబ్దాలలో సింధూనాగరికతపై మన అవగాహనలో గణనీయమైన ప్రగతి వచ్చింది. ప్రస్తుత భారతదేశంలో ఈ నాగరికతకు సంబంధించిన చారిత్రక, భౌతిక అవశేషాలు గల ఎన్నో క్షేత్రాలను కనుగొనడంతో మన పరిజ్ఞానం బాగా విస్తరించింది. ప్రస్తుతం మనకు అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం సింధూ నాగరికత ప్రాంతం ఆఫ్ఘనిస్తాన్‌లోని షార్తుఘయ్ నుండి గుజరాత్ దక్షిణ భాగానికి (మహారాష్ట్రలోని దైమాబాద్ వరకు కాకపోయినా), అలాగే మక్రన్ తీరంలోని సుత్కాజెందోర్ నుండి ఆలంగీర్‌పూర్ (తూర్పుఢిల్లీ) వరకు విస్తరించి ఉంది. ప్రస్తుత పాకిస్తాన్ కంటే భౌగోళికంగా ఎంతో విశాలమైన ప్రాంతాన్ని కలిగి ఉన్న ఈ నాగరికతా క్షేత్రాలు దాదాపు ఐదులక్షల చదరపు కిలోమీటర్ల ప్రాంతంలో విస్తరించి ఉన్నాయి. ఈ నాగరికత పుట్టుపూర్వోత్తరాలపై నేటికీ అసక్తికరమైన వాదోపవాదాలు కొనసాగుతున్నా దాని సాంస్కృతిక పరిణతపై ఎలాంటి వివాదం లేదు. దాని సార్వజనిత, వ్యవసాయ వికాసం, విభిన్న హస్తకళలు, సుదూర వాణిజ్య సంబంధాలు, ఏకీకృత లిపి (దీనిని ఇప్పటి వరకు క్రోడీకరించలేకపోయారు) మతవిశ్వాసాలు, ఆచారాల గురించి పెద్దగా వివాదాలేవీ లేవు. హరప్పా, మొహెంజోదారో, లోథల్, కాలిబంగన్, ఢోలావీర లాంటి విస్తృత పట్టణ కేంద్రాలతో సింధూ నాగరికత పట్టణీకరణ తొలి దశకు నాంది పలికింది. ఈ ప్రక్రియలో చిన్నస్థాయి పట్టణాలు కూడా పెద్ద సంఖ్యలో ఆవిర్భవించాయి.

**మూలాలు- పరిణామక్రమం :** మోహర్‌గఢ్, అలాగే బలూచిస్తాన్, సింధ్‌లలోని ఇతర క్షేత్రాలలో ఇటీవల జరిపిన తవ్వకాల కారణంగా నేడు మనకు వాయవ్య ప్రాంతానికి సంబంధించిన నిరంతర పురావస్తు క్రమం అందుబాటులోకి వచ్చింది. స్థిర గ్రామవాసం నుండి హరప్పా నాగరికత పూర్వదశ వరకు పురావస్తు ఆధారాలు లభించాయి. అయినప్పటికీ

ఈ పట్టణ నాగరిక ఒక ప్రత్యేకమైన స్వరూపాన్ని ఎలా, ఎందుకు సంతరించుకుందో మనకు అంతగా అవగాహన లేదు. చరిత్ర, మానవ విజ్ఞానశాస్త్ర సిద్ధాంతాల మేరకు రాజ్యస్థాయి రాజకీయ సంఘటనం లేకుండానే పట్టణీకరణ సాధ్యం కాదు. హరప్పా పాలకవర్గం అధికారంలోకి ఎలా వచ్చిందో, ఏ పద్ధతుల్లో అదనపు నిల్వలను సమీకరించిందో లేదా ప్రాంతాల మధ్య సంబంధాలను ఎలా నిర్వహించిందో మనకు తెలియదు. కేవలం ఒకే ఒక్క రాజ్యం ఉండేదో లేదా అనేక స్వయంప్రతిపత్తిగల పరస్పర సహకార రాజ్యాలు ఉండేవో అన్న విషయం కూడా ఖచ్చితంగా నిర్ధారణ కాలేదు. తొలి హరప్పా క్షేత్రాలలో పట్టణీకరణ కాలపు నిర్దిష్ట లక్షణాలు అభివృద్ధి దశలో కనిపిస్తాయి. ఈపూర్వదశ (అమ్రీ, కోట్ దీజి, సోథి సంస్కృతులు) ఆయా సమాజాల మధ్య విపరీతమైన సంబంధాలను (కలయికలను) చవి చూసి ఉండవచ్చు. అలాగే పురోగమన రాజకీయ నియంత్రణను కూడా అనుభవించి ఉండవచ్చు. అయితే పురావస్తు చిత్రపటంలో క్షేత్రాల విస్తరణలో మార్పులు ఉన్నాయి. కట్టడాల నిర్మాణ స్థాయి, హస్తకళల ఉత్పత్తిలో కూడా వైరుధ్యాలు ఉన్నాయి. గృహ అలంకార వస్తువులు, గ్రామీణ సాంకేతిక పరిజ్ఞానాలు రాజ్యపూర్వ దశ నుండి రాజ్యకాలాల మధ్య అలాగే కొనసాగాయని ఆశించవచ్చు. ఈ కొనసాగింపునకు తోడు ఇప్పుడు మనం తెలుసుకోవలసినది ఏమిటంటే: అంతకు పూర్వం కనుగొన్న క్షేత్రంలో పరిణత చెందిన హరప్పాలక్షణాల "చొరబాటు" ఒక సముదాయం పైన రాజ్య సంస్థల(వ్యవస్థలు) ను రుద్దడాన్ని ఏ విధంగా బాధ్యత వహిస్తుంది? కొన్ని మార్పులను లోతుగా అధ్యయనం చేస్తే పరివర్తన స్వభావం కూడా స్పష్టమవుతుంది. ఉదాహరణకు దంతాలున్న రాతి పరికరాలను విపులంగా అధ్యయనం చేశారు. పట్టణ కాలంలో రాయిపై ప్రజలు ఆధారపడడం తగ్గిపోయిందని ఈ అధ్యయనాలు వెల్లడిస్తాయి. ముళ్ళున్న రాతి పరికరాల సంగ్రహాలు ప్రామాణికత సంతరించుకున్నాయని, వాటిని పరిమిత విధులకే వినియోగించారని, రాగి, కాంస్య పనిముట్లపైనే ఎక్కువ ఆధారపడ్డారని కూడా బోధపడుతుంది.

**పరిణత దశ స్వభావం:** హరప్పా నాగరికత స్వంత వ్యక్తిత్వానికి సంబంధించి విద్వాంసులు కొన్ని అంశాలను ఎక్కువగా ప్రస్తావించి మిగతా వాటిని నిర్లక్ష్యం చేశారు. ఉదాహరణకు లిపిని క్రోడీకరించినట్లు ఎంతో మంది వాదించారు. అయితే అవన్నీ అశాస్త్రీయ పద్ధతులలో జరిగాయి. మరోవైపు ముద్రలు, ముద్రికల వినియోగ పద్ధతులు, వాటి విస్తరణ గురించి ఒక్క వివరణాత్మకమైన విశ్లేషణ కూడా లేదు. అలాగే ముద్రల అర్థమేమిటో కూడా విద్వాంసులు సరిగ్గా వివరించలేకపోయారు. ఒక క్షేత్రాన్ని పరిణత చెందిన హరప్పా క్షేత్రంగా ప్రస్తావించినపుడు కూడా ఎలాంటి వివరణ ఇవ్వలేకపోయారు. విశాలమైన వస్తువుల జాబితాను వారు సాధారణమైనదిగా భావించారు. ఉదాహరణకు కుమ్మరి ఉత్పత్తులు, లోహపరికరాల పరిమితస్థాయి, ఒక ప్రత్యేక పరిమాణంలో గల ఇటుకలు, గదులు, బండ్లు, చక్రాల నమూనాలు, టెర్రకోట ఆకారాలు, బరువులు పొడవైన బ్లేడ్లు, లిపితో కూడిన ప్రత్యేక ముద్ర, తదితర వాటిని వర్గీకరించలేదు. ఈ స్థూల జాబితాలోని వస్తువులు అన్ని క్షేత్రాలలో లభించలేదు. అలాగే కొన్ని క్షేత్రాలలో ఇతర లక్షణాలు కనిపించాయి. మూల లక్షణాలు (పాత్రలు, వస్తువులు, పరికరాలు) ఏమిటో నిర్ధారించకుండానే ఎలాంటి సూత్రీకరణ చేయలేము. ముద్రలు, బరువులు కొన్ని క్షేత్రాలకే ఎందుకు పరిమితమయ్యాయో వివరించలేము.

**"పతన" సమస్యలు:** హరప్పా నాగరికత పతనం కావడానికి కీలక కారణం స్థిరనివాసాలను ప్రజలు పెద్ద ఎత్తున వదలివెళ్లడమే. అందుకే ఈ పతనాన్ని సాహిత్య పదబంధాలలో వివరించడానికి అనేక ప్రయత్నాలు జరిగాయి. వరదలు, సముద్ర మట్టం పడిపోవడం, అడవుల నరికివేత, భూమి పొరల కదలికలు, పెరిగిన శుష్కత్వం, ఆర్యుల దండయాత్రలు, తదితర కారణాలను ముందుకు తెచ్చారు. నైలు నది ప్రవాహ దిశలలో మార్పులు, సంబంధిత వరదలను నిత్యం ఎదుర్కొంటూ ఈజిప్టు నాగరికత నిలదొక్కుకోగలిగింది. తీవ్రమైన క్షారత (salinity) సమస్యల వల్ల దక్షిణ భాగంలో వ్యవసాయోత్పత్తి క్షీణించినప్పటికీ మెసొపొటామియా నాగరికత సుదీర్ఘ కాలం పరిఢవిల్లింది. ఈజిప్టు, మెసొపొటామియా రెండూ విదేశీదండయాత్రలను వరుసగా ఎదుర్కొన్నాయి. ఈ పరిణామాలేవీ మన చరిత్రకారులను అడ్డగోలు వివరణలు ఇవ్వకుండా నిరోధించలేకపోయాయి. అయితే ఇప్పటివరకు రాజకీయ, ఆర్థిక కారణాలను ఏ వివరణ ప్రస్తావించలేదు. ఎందుకంటే హరప్పావాసుల రాజకీయ, ఆర్థిక నిర్వహణను సమగ్రంగా అధ్యయనం చేయలేదు.

## మూలాలు

**విభిన్న సిద్ధాంతాలు :** 1950 దశకం మొదట్లో సింధూ నాగరికత మూలాలపై వెలువడిన సిద్ధాంతాలు స్థానిక విదేశీ నేపథ్యాల మధ్య ఊగిసలాడాయి. హరప్పా వాసులు స్థానికులేనన్న సిద్ధాంతం నుండి వారు ఏలమ్ (ఇరాన్), మెసొపొటామియా నుండి వలస వచ్చారన్న సిద్ధాంతం వరకు అనేక ఊహాజనిత సూత్రీకరణలు వెలువడ్డాయి. ఈ రెండు విపరీత అభిప్రాయాల మధ్య ప్రేరేపిత సమ్మేళనం అనే సిద్ధాంతం వచ్చింది. అది కూడా మెసొపొటామియా నుండి సింధూ నదికి నాగరికత వలస వచ్చిందనే ఊహ ఆధారంగానే రూపొందించబడింది. సింధూ నాగరికత సాధారణంగా పశ్చిమాసియా, మరీ ప్రత్యేకంగా మెసొపొటామియా వల్ల సంపన్నమైందన్న భావన కూడా ఈ కాలం నుండే ఏర్పడిందన్న విషయాన్ని మనం దృష్టిలో ఉంచుకోవాలి.

1950 దశకం మధ్యలో సింధ్‌లోని కోట్ దిజి క్షేత్రాన్ని తవ్వారు. ఇక్కడ హరప్పా పూర్వ దశకు చెందిన సురక్షిత నివాస ప్రాంతం యొక్క సాక్ష్యం తొలిసారిగా బయటపడింది. సింధ్‌లోని అమ్రీ, ఎండిపోయిన ఘగ్గర్‌లోయలోని కాలిబంగన్ వద్ద జరిగిన తవ్వకాలు ఈ అధ్యయనానికి మరింత సార్థకత చేకూర్చాయి. 1960 దశకం తొలి నాటికి సింధూ నాగరికత మూలాలపై పురావస్తు శాస్త్ర ఆధారంగా అర్థవంతమైన చర్చ సాధ్యమైంది. నాగరికత మూలాలపై కొత్తగా వెలువడిన సిద్ధాంతమే అందుకు నిదర్శనం.

కోట్ దిజియన్, అమ్రీ, సోథి (కాలిబంగన్) సంస్కృతులు హరప్పా పూర్వ దశకు చెందినవే కాకుండా ఆది హరప్పా సంస్కృతులని చెప్పడం అన్ని విధాలా సమర్థనీయం. అయితే మూలాలకు దారి తీసిన వ్యవస్థాగత మార్పులపై నేటికీ వివాదం కొనసాగుతోంది. ఎందుకంటే మూలాలను సమ్మేళన సిద్ధాంతంతో ముడిపెట్టారు. నాగరికత స్వరూపం కొందరు మేధావులైన నియంతలు అదే పనిగా తీసుకున్న నిర్ణయానికి ఫలితమని, ఆ నియంతలు తమ

సమకాలీన సుమేరియన్ల నుండి నగరాల ఆలోచనను అందిపుచ్చుకొని విదేశీ వాణిజ్యాన్ని, ప్రామాణికతను ప్రోత్సహించి సంపదను కూడగట్టారని ఈ సిద్ధాంతం చెబుతోంది.

1960 దశకం చివరలో "ఉత్థాన" దశలు లేదా స్థాయిల ఆధారంగా బలూచిస్తాన్, సింధూనది వ్యవస్థలో ఆది చారిత్రక సాంస్కృతి ప్రగతిని వివరించడానికి ప్రయత్నాలు జరిగాయి. ఈ సిద్ధాంతం ప్రకారం హరప్పా నాగరికత తన స్వాభావిక శైలిని స్థానికంగానే అభివృద్ధి పరచుకుంది. అయితే ఆ శైలి సుమేరియాతో సంబంధం ఫలితంగానే విస్తరించింది.

ఈ వివాదానికి 1970 దశకం తొలినాళ్లలో ఒక సరికొత్త కోణం ఇచ్చారు. ఈ కొత్త సిద్ధాంతంలోని ముఖ్యమైన భాగం తొలి హరప్పా భౌతిక అవశేషాలు, వాటి విస్తరణ (సింధూ మహాలోయలో) మధ్య తులనాత్మక విశ్లేషణ, సింధూ లోయలో పట్టణీకరణకు దారి తీసిన పరిణామాలను స్పష్టంగా పునఃసృష్టించడం అసాధ్యమని వాదించబడింది. హరిప్పా నాగరికత పరిణత చెందిన కాలంలో అధికార కేంద్రం ఉత్తర బలూచిస్తాన్ నుండి దక్షిణ బలూచిస్తాన్‌కు మారింది. స్థిరనివాసాలు తీరప్రాంతానికి విస్తరించాయి. దీనిని బట్టి మెసొపొటామియాతో సముద్ర మార్గాన వాణిజ్య సంబంధాలు ఉధృతమైనట్లు భావించాలి. ఇలాంటి వాణిజ్యం వల్లే సింధూలోయలో పట్టణాభివృద్ధి సాధ్యమైందని 1970, 80 దశకాల్లో వెలువడిన మరికొన్ని సిద్ధాంతాలు పేర్కొన్నాయి. ఇరాన్, మధ్య ఆసియా, ఆఫ్ఘనిస్తాన్‌లలో జరిగిన పరిణామాలతో సింధూ పట్టణ ప్రగతిని ముడిపెట్టడానికే ఈ ప్రయత్నం జరిగినట్లు స్పష్టమవుతుంది. భారతీయ భూభాగం కంటే బయట ఎక్కడో జరిగిన పరిణామాలను ఎక్కువగా పరిగణనలోకి తీసుకున్నారు. వాటి ఆధారంగానే ఈ కొత్త సిద్ధాంతాన్ని రూపొందించారు.

భారతదేశంపై వెలువడిన పాశ్చాత్య పురావస్తుశాస్త్ర గ్రంథాలలో కూడా ఇలాంటి ప్రయత్నాల ప్రతిధ్వనులు వినిపిస్తాయి. వాటికి విభిన్న స్వరాలు ఉన్నాయి. 1980 దశకంలో కూడా ఒక సూత్రీకరణ వచ్చింది. హరప్పా నాగరికత పరిణత దశకు చేరుకోవడానికి మెసొపొటామియాతో వాణిజ్యమే కీలక పాత్ర పోషించదని చెప్పబడింది. అయితే ఈ సూత్రీకరణ పూర్తిగా నిరాధారమైనది. ఎందుకంటే తొలి హరప్పా నాగరికత దశలో మెసొపొటామియాతో వాణిజ్య సంబంధాలు కొనసాగాయని చెప్పడానికి ఎలాంటి సాక్ష్యాధారాలు లేవు. మెసొపొటామియాతో ఏదో ఒక విధంగా ముడిపెట్టనిదే హరప్పా నాగరికత మూలాలను నిర్ధారించడం పాశ్చాత్య విద్వాంసులకు (చాలా మందికి) కొంత వరకు ఇబ్బందికరమే.

**మూలాలు- పరిణామక్రమం :**

గత ఎనిమిది దశాబ్దాలుగా సాగిన పురావస్తు పరిశోధన నాగరికత "స్థాయిల" నిరంతర క్రమాన్ని నిర్ధారించింది. సాధారణ జీవనశైలి నుండి పూర్తిస్థాయి సింధూ నాగరికత వరకు ఇక్కడి ప్రజలు సాధించిన పురోగతిని ఆవిష్కరించింది. ఈ "స్థాయిల"ను హరప్పా పూర్వ, తొలి హరప్పా, పరిణత హరప్పా, చివరి హరప్పా దశలు లేదా స్థాయిలుగా వర్గీకరించారు. ఈ పరిశోధన యొక్క ప్రధాన పరిణామం: హరప్పా నాగరికత సాధించిన సుదీర్ఘ స్థానిక ప్రగతి లేదా పరిణామక్రమానికి స్పష్టమైన ఆధారాలను అందించడం. సింధూ లోయ పరిసర

ప్రాంతాలలోని తూర్పు బలోచిస్తాన్ కొండల్లో అభివృద్ధికి బాటలు వేసిన ఈ నాగరికత తర్వాతి దశలో మైదాన ప్రాంతాలకు విస్తరించింది. మెసొపొటామియాతో నిస్సందేహంగా సంబంధాలు ఉండేవి. కాని సింధూనాగరికత కేవలం మెసొపొటామియా నాగరికతకు అదనపు క్షేత్రం మాత్రమేనన్న పాత సిద్ధాంతం లేదా సింధూ నాగరికత మెసొపొటామియా నాగరికతకు ప్రత్యక్ష అనుకరణ మాత్రమేనన్న సూత్రీకరణను తిరస్కరించాల్సి ఉంటుంది.

సింధూ నాగరికత స్థానిక పరిణామక్రమంలోని వివిధ దశలను నాలుగు పురావస్తు క్షేత్రాల విశ్లేషణ ద్వారా నమోదు చేయవచ్చు. ఈ క్షేత్రాలను ఇటీవలి సంవత్సరాలలో తవ్వితీశారు. అవి మెహర్‌గఢ్, అమ్రీ, కాలిబంగన్, లోథల్, ఈ నాలుగు క్షేత్రాలు నాలుగు ముఖ్య దశల క్రమాన్ని ప్రతిబింబిస్తాయి. భారత ఉపఖండంలోని పశ్చిమోత్తర ప్రాంతం యొక్క అలిఖిత, ఆది చారిత్రక దశలను మన ముందుంచుతాయి. ఈ క్రమం తొలి దశ పరివర్తనతో మొదలవుతుంది. ఈ దశలో ఆహార సేకరణ– వేటకారులు స్థిరమైన వ్యవసాయ జీవనానికి స్థిరపడ్డారు. రెండవ దశలో విశాలమైన గ్రామాలు ఏర్పడ్డాయి. సింధూ హక్రా లోయలో పట్టణాలు వెలిశాయి. మూడవ దశలో మహానగరాలు ఏర్పడ్డాయి. చివరగా నాల్గవ దశలో సింధూనాగరికత పతనమైంది. ఈ నాలుగు దశలలో ఒక్కో దశకు ఒక్కో పురావస్తుక్షేత్రం ప్రాతినిధ్యం వహిస్తుంది. తొలి దశకు మోహర్‌గఢ్, రెండవ దశకు అమ్రీ, మూడవ దశకు కాలిబంగన్, నాల్గవ దశకు లోథల్ ప్రామాణికమైనవి.

మెహర్‌గఢ్ వద్ద ఇటీవల జరిగిన తవ్వకాలను బట్టి బలూచిస్తాన్‌లోని ఈ ప్రాంతంలో క్రీ.పూ.ఆరవ సహస్రాబ్ది నుండి తదుపరి నాలుగు వేల సంవత్సరాల వరకు సాంస్కృతిక వికాసం నిరంతరంగా కొనసాగిందని చెప్పవచ్చు. మెహర్‌గఢ్ వద్దగల అత్యంత పురాతనమైన గుట్టతోపాటు బలూచిస్తాన్‌లోని అనేక నవీనరాతియుగ నివాసప్రాంతాలను కనుగొనడంతో సింధూ నాగరిక వికాసానికి స్థానిక అంశాలే దోహదపడ్డాయని నిర్ధారణకు వచ్చారు. ఇటీవలి సంవత్సరాలలో తవ్వితీసిన క్రీ.పూ. నాల్గవ సహస్రాబ్దికి చెందిన అనేక నివాసప్రాంతాలు ఈ కొత్త సిద్ధాంతానికి అదనపు ఆధారాలను అందించాయి.

అమ్రీ అవశేషాలను విశ్లేషిస్తే క్రీ.పూ. నాల్గవ సహస్రాబ్దిలోనే సింధూనాగరికత నివాస ప్రాంతాలు గణనీయంగా విస్తరించాయని బోధపడుతుంది. స్థానిక పరిణామ క్రమంలో భాగంగానే ఈ ప్రాంతాలు విస్తరించాయి అంతే కాని మెసొపొటామియా. ఇరాన్ లేదా మధ్య ఆసియా సాంస్కృతిక పోకడలను వలసదారులు ఇక్కడికి బదిలీ చేయలేదు. ప్రస్తుతానికి సింధూనాగరికత స్థానిక మూలాలపై మనకు సృష్టమైన అవగాహన ఉన్నప్పటికీ దురదృష్టవశాత్తు ప్రత్యేకమైన పరిణతదశ హరప్పా సంస్కృతి ఎలా ఉద్భవించిందో మనకు అంతగా తెలియదు. ఈ సంస్కృతి ఏ కాలంలో ఉన్నత దశకు చేరుకుందో కూడా తెలియదు. ఈ విషయం ఇంకా వివాదాస్పదంగానే ఉంది.

ఉపఖండపు పురావస్తు శాస్త్రంలో అత్యంత చిరస్మరణీయమైన ఆవిష్కరణతో 80వ దశకం మొదలైంది. కచ్ మైదానప్రాంతంలో మెహర్‌గఢ్ వద్దగల బోలాన్ లోయలో జరిపిన తవ్వకాలు అనేక కారణాల వల్ల ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి. మొట్టమొదటగా అవి

గ్రామాల వికాస చరిత్రపై వెలుగును ప్రసరిస్తాయి. గ్రామాల విస్తరణ చివరకు సింధూ నాగరికత అభివృద్ధికి దారి తీసింది. రెండవది, గోధుమ, బార్లీ పంటలసాగు, గొర్రెలు, మేకలు, ఇతర పశువుల పోషణకు దక్షిణాసియాలో ఈ ప్రాంతం ఎంత ముఖ్యమైనదో ఆ తవ్వకాలు తేల్చిచెప్పాయి. మూడవది, క్రీ.పూ. 7000 మొదలుకొని ఈ ప్రాంతంలో సాంస్కృతిక ప్రగతిక్రమాన్ని నిరంతరంగా అందించడం ద్వారా బలూచిస్తాన్‌లోని ఇతర ప్రాంతాలలో సాంస్కృతిక వికాసానికి సంబంధించిన చిత్రాన్ని తెరపైకి తీసుకొచ్చాయి.

అయితే ఇక్కడో ప్రశ్న ఉదయిస్తుంది. మెహర్‌గఢ్ వద్ద లభించిన అవశేషాలను సింధూమైదాన ప్రాంతంలో గ్రామీణ ఆవాసాల అభివృద్ధిలో అంతర్భాగంగా ఎంతవరకు పరిగణించాలి? కచ్ మైదాన ప్రాంతంలోని ప్రధాన నదులు కచ్‌లో ప్రవేశించగానే అనేక సహజ కాలువలుగా చీలిపోతాయి. ఇవి రుతుపవన సంబంధిత ప్రవాహాలు, అయితే వరదల సమయంలో నీటిని భారీ నీటి పారుదల పథకాల సహాయంతో ఉపరితలానికి చేర్చుతారు. మొత్తానికి ఈ దృశ్యం సింధూ వరద మైదానానికి భిన్నంగా ఉంది ఈ ఒక్కకారణం వల్లే కచ్ మైదానంలోని మెహర్‌గఢ్ సింధూనాగరికత అభివృద్ధి క్రమంలో ఒక మైలురాయి అని వాదించడం కష్టమవుతుంది. అది సాధారణ విశ్లేషణ తప్ప మరొకటి కాదు. సింధూ నాగరికతకు సమీప నేపథ్యాన్ని సింధూ మైదాన ప్రాంతాలలోని పట్టణపూర్వ నివాసాలు అందిస్తాయి. ఇవి సింధ్‌లోని కిర్థార్, కొహిస్తాన్ ప్రాంతాలు, పంజాబ్, హర్యానాలోని సింధూ, తదితర ఉపనదులు, రాజస్థాన్/చోలిస్థాన్ ఎడారిలోని ఘగ్గర్–హక్రా ప్రాంతాలలో విస్తరించి ఉన్నాయి. ఈ ప్రాంతాలలో ఒక్క చోలిస్థాన్ మాత్రమే బాగా సమీకృతమైన తొలి హరప్పా క్షేత్రాలను కలిగి ఉంది. వాటితోపాటు ఘనమైన(జనసాంద్రత ఎక్కువగా ఉన్న) సమీకృతమైన పరిణత దశ హరప్పా క్షేత్రాలు(ఇక్కడ 174 క్షేత్రాలుండగా రాజస్థాన్– హర్యానా–పంజాబ్‌లలో 138, గుజరాత్‌లో 101 క్షేత్రాలు ఉన్నాయి) కనిపిస్తాయి. చోలిస్థాన్‌లోని ఘగ్గర్–హక్రా వ్యవస్థలోనే తొలి హరప్పా సంస్కృతి పరిణతి చెందిన నాగరికతగా పరివర్తనం చెందడానికి ఒకటి కంటే ఎక్కువ అవకాశాలు ఉన్నాయి.

**ఆరంభాలు- విస్తరణ**

హక్రా పీడనానికి వాయవ్యదిశలో చోలిస్థాన్ ఎడారి ఉంది. హక్రా నది దిగువ భాగం సింధూలో చేరి రాన్ ఆఫ్ కచ్‌లోకి లేదా పరిసరాలలోకి ప్రవహిస్తుంది. భారతీయ సరిహద్దులకు ఈ వైపు హక్రా నదిని ఘగ్గర్ అని పిలుస్తారు. తొలి సాహిత్యంలోని సరస్వతీగా దానిని పరిగణిస్తారు. ఘగ్గర్ నది ప్రాచీన వైశాల్యం 6–8 కిలోమీటర్ల వరకు ఉంటుంది. ప్రాథమికంగా ఘగ్గర్ పూర్వపు సరస్వతి నదికి వారసురాలు. నవీన రాతియుగ భూపొరల కదలికల వల్ల దీనికి సంబంధించిన రెండు ఉపనదులను– పురాతన సట్లెజ్, యమున – సింధూ, గంగా నదులు ఆక్రమించాయి. ప్రస్తుత ఘగ్గర్ అయిన సరస్వతిని ఎండగార్చాయి. సింధూ–గంగా మధ్య విస్తరించిన మానవ నివాసాలకు ఈ పరిణామం శరాఘాతంలా మారింది.

వేసవిలో సాధారణంగా ఎండిపోయే ఒక కాలువ పర్వత ప్రాంతాలలో వర్షాలు బాగా కురిసినపుడు నీటిని భారీగా తీసుకెళ్లేది. ఈ నీటినే వివిధ వ్యవసాయ కాలువలలో నిల్వ

చేసి వ్యవసాయ పనులకు వాడుకొని ఉంటారని ఒక చరిత్రకారుడు సూత్రీకరించాడు. వేసవిలో ఘగ్గర్–హక్రా ఉపరితల కాలువలు (ప్రాచీన సరస్వతి) అనేక సరస్సులు లేదా మడుగులను వివిధ ప్రదేశాలలో ఏర్పాటు చేసి ఉంటాయి. ఈ ప్రాంతపు ఆదిచరిత్రకాల నివాసులు అలాంటి నీటివాహక ప్రదేశాలవైపు మొగ్గు చూపి ఉండవచ్చు. మంచు– ఆధారిత సింధూ నదికి ఎలాంటి నియంత్రణ ఉండేది కాదు. అందుకు భిన్నంగా ప్రాచీన సరస్వతిని వినియోగించడం చాలా తేలికగా ఉండేది. మెహర్‌గఢ్‌కు చెందిన నవీన రాతియుగ ప్రజలు ఈ నది ప్రవహించే కొండప్రాంతాలలో స్థిరపడ్డారు. వారు కచ్ మైదాన ప్రాంతంలో ప్రవేశించగానే సరస్వతి అనేక పాయలుగా చీలిపోయింది. ఈ ఊహాత్మక వాతావరణ స్థితి చోలిస్థాన్, రాజస్థాన్, హర్యానా, పంజాబ్‌లలో ఆదిచారిత్రక క్షేత్రాలు కొన్ని ప్రదేశాలకే పరిమితం కావడాన్ని కూడా సూచిస్తుంది.

సింధూ లోయ నేపథ్యంలో దాని ఆవాస చరిత్రలో నిర్ణయాత్మక అడుగు వరదపారే మైదానప్రాంతాన్ని మానవులు ఆక్రమించడమే. తొలి హరప్పా నివాసప్రాంతాలు కిర్థార్ కొండలు, కొహిస్తాన్‌లో కేంద్రీకృతమై ఉన్నాయి. కేవలం పరిణత దశ హరప్పా నాగరికత లేదా సంస్కృతి కాలంలోనే మనం వరద మైదాన ప్రాంతంలో (మొహెంజొదారో అందులో భాగమే) మానవ నివాసాలను చూడగలము. ఈ నిర్ణయాత్మక అడుగు (సింధ్ నివాస చరిత్రలో ఒక వివరణ అవసరం. అందుకు ప్రాథమిక నైసర్గిక స్థితిని (సింధూలోయ) పరిగణనలోకి తీసుకోవాలి. ఆధునిక వ్యవసాయ కాలువలను తర్వాత పరిశీలించవచ్చు.

ఇప్పుడు నాగరికత ప్రస్థానంపై మన అభిప్రాయాన్ని పునరుద్ఘాటించవచ్చు. సాంస్కృతిక పరివర్తనం చోలిస్థాన్‌లో చోటు చేసుకుంది. (అంటే ఘగ్గర్–హక్రా లోయలో). అప్పటికే నది చీలిక ప్రక్రియ మొదలైంది. సరస్వతి ఉపరితలంలో పల్చగా పాయల రూపంలో ప్రవహిస్తూ అనేక సరస్సులను వివిధ ప్రదేశాలలో ఏర్పాటు చేసింది. సింధూ పశ్చిమ దిశవైపు పయనిస్తూ ఉండేది. అలాగే పాక్షిక వర్షాభావ వాతావరణంలో కూడా ప్రవహించింది. నేటికీ ఈ ప్రాంతంలో అలాంటి వాతావరణ పరిస్థితే నెలకొని ఉంది. ఘగ్గర్– హక్రా నది చివరగా సింధూలో కలిసిపోయి ఉమ్మడిగా రాన్ ఆఫ్ కచ్‌లోకి ప్రవహించింది. హర్యానా లాంటి ఎగువ ప్రాంతంలో ఘగ్గర్– హక్రా ప్రవాహ దిశలో తొలి హరప్పా నివాస క్షేత్రాలు ఎక్కువగా కేంద్రీకృతమై ఉన్నాయి. చోలిస్థాన్ తర్వాతి కాలంలో ఈ నివాసాలు ఏర్పడినా మొత్తం మీద ఘగ్గర్– హక్రా ప్రవాహ దిశ దాదాపు అదే తరహా వాతావరణ పరిస్థితులలో కొనసాగి ఉండవచ్చు. కనుక నీటిపారుదల వ్యవస్థ (ఎంత సాధారణమైనప్పటికీ), హస్తకళల ప్రావీణ్యం సింధూ నాగరికత ఆవిర్భావంలో రెండు ప్రధాన చోదక శక్తులని ప్రతిపాదించబడింది.

**పరిణత దశ - వైశాల్యం**

**ప్రాథమిక విస్తరణ ప్రదేశం:** ప్రాథమిక నైసర్గిక స్వరూపం, క్షేత్ర స్థానికీకరణకు తోడు ప్రాచీన హరప్పా క్షేత్రాల విస్తరణకు మరో ముఖ్యమైన లక్షణం ఉంది. బలూచిస్తాన్ నుండి ద్వినది ప్రాంతంలోని ఎగువ భాగం వరకు, అలాగే జమ్మూలోని మాండా నుండి గుజరాత్ ప్రధాన భూభాగంలోని ఎస్పువరీ ప్రాంతం వరకు విభిన్న వాతావరణ పరిస్థితులతో హరప్పా నివాస ప్రాంతాలు సర్దుకుపోవడం నిజంగా ప్రత్యేకమైన లక్షణమే. ప్రాంతీయ సర్దుబాట్ల

ఈ క్రమంలో అవి తొలుత సాంస్కృతిక స్థాయిని అధిగమించాయి. దీనినే తొలి హరప్పా సంస్కృతి అని పిలుస్తారు. అదే సమయంలో విస్తరణకు సంబంధించిన చిత్రం సాధారణంగా ఉంది. దీనర్థం ప్రాచీన సింధూనాగరికత తన ప్రాథమిక ప్రాదేశిక విస్తరణ భూభాగంలో దాదాపు సమానంగా ఆవిర్భవించినట్లా?

అలా జరగడం దాదాపు అసాధ్యం. క్షేత్రాల విస్తరణ సాంద్రత ఆధారంగా (ప్రాచీన హరప్పా, తొలి కాలాలలో) సింధూ నాగరికత వికసించిన మూల ప్రాంతం హక్రా మైదాన ప్రాంతంలోని చోలిస్తాన్ భూభాగమని బోధపడుతుంది. హక్రా పాత్రల క్షేత్రాలు: 99, తొలి హరప్పా క్షేత్రాలు: 40, పరిణత లేదా ప్రాచీన హరప్పా క్షేత్రాలు : 174 ఈ మూలప్రాంతం కిందికి వస్తాయి. ఇవన్నీ 200 కిలోమీటర్ల పొడవున (హక్రా నదికి ఇరువైపులా) విస్తరించి ఉన్నాయి. కాని వాటి వైశాల్యం 50 కిలోమీటర్లకు మించి లేదు.

ఈ పరిమిత ప్రాంతంలో ఒక్కసారి అభివృద్ధి చెందిన తర్వాత ఈ నాగరికత దిగువ భాగానికి విస్తరించడం సహజ పరిణామమే. తొలుత హక్రా వెంబడి కచ్‌కు, తర్వాత సౌరాష్ట్రకు విస్తరించింది. హక్రా-సింధూ ద్వినది ప్రాంతానికి (మొహంజొదారో ప్రాంతంతో సహా)కూడా శీఘ్రంగా విస్తరించి ఉండవచ్చు. రావి, సట్లెజ్ నదుల మధ్య హరప్పా వరకు ఉన్న మధ్య సింధూలోయ కూడా ఆక్రమణకు గురైంది. సింధూ గంగా మధ్య గల ప్రాంతం కూడా ఈ దశలోనే ఆక్రమణకు గురై ఉంటుంది. బలూచిస్తాన్ నివాస ప్రాంతాలు లేదా ఘోర్తుఘయ్ నివాస ప్రాంతం మొహెంజొదారో ప్రాంతంవైపు విస్తరణకు బహుశా కీలక స్థావరాలుగా ఉండి ఉండవచ్చు. మరోవైపు గంగా-యమున ద్వినది ప్రాంతంలోని ఎగువ భాగం తర్వాతి దశలో మానవ నివాసాలతో నిండిపోయింది.

ద్వినది ప్రాంతం మినహాయించి పైన పేర్కొన్న ప్రాంతాలన్నింటిలో తొలి నివాస ప్రాంతాలకు సంబంధించిన స్పష్టమైన పురావస్తు ఆధారాలు ఉన్నాయి. పాకిస్తాన్, పంజాబ్ మైదాన ప్రాంతాలలో, సింధూ-గంగాలోయ మధ్య ఉన్న ప్రాంతంలో ఈ నివాసాల తొలి దశ హక్రా మట్టిపాత్రలతో నిండి ఉంది. మిగతా మైదాన ప్రాంతాలు గుజరాత్‌లో తొలి హరప్పా నివాస క్షేత్రాల కంటే పురాతనమైన భౌతిక అవశేషాలుగల ఉపపొరలు లేవు. బలూచిస్తాన్‌లో నిజానికి హరప్పా నాగరికతకు పూర్వం స్థిరపడ్డం నివాస ప్రాంతాలు ఉన్నాయి. ద్వినది ప్రాంతంలో పరిణత దశ హరప్పావాసులు రాకకు పూర్వం ఎలాంటి చారిత్రక నమోదు లేదు. గుజరాత్‌లో సూక్ష్మరాతి పరికరాలు ఉపయోగించిన వేట-సేకరణదారులు తెర వెనుక ఉండిపోయారు.

మొత్తానికి విస్తరణ సాంద్రత చాలా ఆసక్తికరంగా ఉంది. ఒక ప్రత్యేక ప్రాంతంలో కేంద్రీకరణ, దీర్ఘకాల నివాసంతోపాటు చెల్లాచెదురుగా ఉన్న పూర్వ స్వల్పకాలిక నివాసం గల ప్రాంతాలు ఈ పరిధిలోకి వస్తాయి. భౌగోళిక విస్తరణ సుదీర్ఘకాలంపాటు ఒక నిరంతర ప్రక్రియగా కొనసాగిందని మనం అర్థం చేసుకోవాలి.

**విస్తరణ- సింధూ నగరాల పరిమాణం :**

గ్రామాల అభివృద్ధి స్థిరంగా, స్పష్టంగా ఉన్న మూడు ప్రాంతాలను సింధూ నాగరికత వికాసంలో కీలక అంశంగా పరిగణించగలం. ఒకటి సింధ్‌లోని సింధూ వరద మైదానానికి

పశ్చిమ, దక్షిణ దిశలో ఉన్న కిర్థార్ కొండప్రాంతం, కొహిస్తాన్. రెండు: గోమల్‌లోయ. ఇక్కడ సింధూనదిలాగా ప్రాచీన నివాస ప్రాంతాలు నదికి ఇరువైపులా విస్తరించలేదు. మూడవది చోలిస్తాన్ ప్రాంతం. ఈ మూడు ప్రాంతాలలో ఒక్క చోలిస్తాన్ మాత్రమే సాంద్రమైన నివాస ప్రాంతాలను కలిగి ఉంది. అవన్నీ ఉన్నతంగా సమీకృతమై ఉన్నాయి. చోలిస్తాన్‌లోని ఘగ్గర్–హక్రా నది వ్యవస్థలోనే తొలి హరప్పా సంస్కృతి ఒక పరిణత నాగరికతగా పరివర్తన చెందడానికి అనేక అవకాశాలు ఉన్నాయి.

**చోలిస్తాన్(ఘగ్గర్–హక్రా వ్యవస్థ):** పూర్వపు రాజసంస్థానమైన బహావల్‌పూర్ మూడు ప్రధాన భాగాలుగా విభజించబడింది. ఇందులో మొదటిది భారత మహా ఎడారిలో అంతర్భాగంగా ఉంది. దానిని రోహి లేదా చోలిస్తాన్ అని పిలుస్తారు. మధ్యభాగం కూడా ప్రధానంగా ఎడారే. కేవలం సట్లెజ్ నది వెంబడే ఈ ప్రాంతపు భూభాగం సారవంతంగా ఉంది. మనం ఇక్కడ దృష్టి సారించాల్సిన అంశం హక్రా నది ప్రవాహ దిశపైనే. ఈ నది చోలిస్తాన్ ఎడారిని బహావల్‌పూర్ మధ్యభాగం నుండి వేరు చేస్తుంది. కనక చోలిస్తాన్ ఎడారి హక్రా మూల ప్రాంతానికి ఆగ్నేయ దిశలో ఉంది. హక్రా దిగువ భాగం సింధూ నదిలో కలిసి రాన్ ఆఫ్ కచ్‌లోకి ప్రవహిస్తుంది. భారత భూభాగానికి లోపల ఈ నదిని ఘగ్గర్ అని పిలుస్తారు. దీనినే ప్రాచీన సాహిత్యంలో పేర్కొనబడిన సరస్వతి నదిగా గుర్తిస్తారు.

ఘగ్గర్ నదీ వ్యవస్థకు సంబంధించి కింద పేర్కొనబడిన అంశాలను గమనించాలి?

1. ప్రాచీన ఘగ్గర నదితలం రెండు పాయలుగా చీలిపోయి అర్థాంతరంగా ముగుస్తాయి. ఈ రెండు పాయలు లోతట్టు ప్రాంతంలో మాయమైపోయినట్లు తెలుస్తోంది. ప్రాచీన ఘగ్గర్ సింధూ లేదా లూని నదులతో కలిసిపోయినట్లు సూచించే శిలాధారాలు ఏమీ లేవు.

2. ప్రాచీన యమున శిలాయుగ కాలువలు గతంలో ఆ నది మూడుసార్లు తన ప్రవాహ దిశను మార్చుకున్నట్లు సూచిస్తాయి. మొదటి కాలువ ఘగ్గర్ పాత నదీతలంలోకి ప్రవహించింది. రెండవ కాలువ ప్రస్తుత చౌతంగ్ (ప్రాచీన ద్రిషద్వతి) గుండా ప్రవహించింది. ఘగ్గర్‌ను కలుసుకుంది. మూడవసారి అది దక్షిణ దిశగా ప్రవహించి చంబల్ గుండా గంగానదిలో కలిసింది.

చివరగా చెప్పాలంటే ఘగ్గర్ ప్రాథమికంగా ప్రాచీన సరస్వతి వారసురాలు. నవీన రాతియుగంలో సంభవించిన భూపొరల కదలికలవల్ల ఘగ్గర్ ఉపనదులైన రాతియుగపు సట్లెజ్, యమునలు సింధూ, గంగా నదులలో కలిసిపోయాయి. సరస్వతిని (ఘగ్గర్) బీడుగా మార్చాయి. ఈ నది ఎండిపోవడంతో సింధూ, గంగా లోయల మధ్య నివసించిన ప్రజలు తీవ్ర పరిణామాలను ఎదుర్కొన్నారు. పై కాలువలు తీసుకున్న ప్రవాహ దిశ వెంబడి మానవులు స్థిరపడడం అందుకు నిదర్శనం.

చోలిస్తాన్ లేదా బహావల్‌పూర్‌లో హక్రా నది వెంబడి 300 మైళ్ల పొడవులో కనుగొన్న 414 క్షేత్రాలలో 174 పరిణత దశ హరప్పా నాగరికతకు చెందినది. ఇటుక బట్టీలు, ఇతర ప్రజావసర వస్తువులను ఉత్పత్తి చేసే కార్యలాపాలు కేంద్రీకృతమై ఉన్న కొన్ని ప్రత్యేక ప్రదేశాలను

76 క్షేత్రాలలో గుర్తించారు. ఈ క్షేత్రాలలో కొన్ని రాగిని ఉత్పత్తి చేశాయి. రాజస్థాన్ రాగి ఈ ప్రాంతంలో ప్రాథమిక లోహంగా ఉన్నట్లు బోధపడుతోంది. తూర్పులో భారత సరిహద్దు దగ్గర పరిణత చెందిన హరప్పా క్షేత్రాల విస్తరణ చాలా పల్చగా ఉంది. కనక రాజస్థాన్, తదితర ప్రాంతాలలోని పరిణతి చెందిన హరప్పా క్షేత్రాలను ప్రత్యేక విస్తరణ ప్రాంతంగా పరిగణించవచ్చు.

**రాజస్థాన్, హర్యానా, పంజాబ్:** చోలిస్తాన్‌కు అవతల హరప్పా క్షేత్రాలు తొలుత పల్చగా తర్వాత సాంద్రంగా విస్తరిస్తాయి. రాజస్థాన్‌లోని ఈశాన్య ప్రాంతం దిశగా హర్యానా, పంజాబ్, ఉత్తరప్రదేశ్‌లోని గంగా–యమున ద్వినది ప్రాంతం ఎగువ భాగానికి విస్తరించాయి. ఈ క్షేత్రాల సగటు వైశాల్యం కొన్ని ఎకరాల కంటే మించి లేదు. బనావలి, రాఖీగఢ్ క్షేత్రాలు 40 నుండి 60 ఎకరాల విస్తీర్ణంలో ఉన్నాయి. అయితే ఈ ప్రాంతంలో హరప్పా నివాస ప్రాంతాల విస్తరణపై పెద్ద సందేహం వచ్చిపడింది. సుమారు 50×25 కిలోమీటర్ల పరిధి గల ప్రాంతంలో 21 క్షేత్రాలు బయల్పడడమే అందుకు కారణం. ఈ క్షేత్రాలలో ప్రధానమైనవి ఢాలేవాన్, గుర్నికలన్, హసన్‌పూర్, బాగ్లియన్‌దథే, లఖ్మిర్‌వాలా. వీటిలో హరప్పా పూర్వ, హరప్పా ఉన్నత నాగరికతకు చెందిన మట్టిపాత్రలు ఉన్నాయి. ఈ క్షేత్రాలు మూడు నుండి ఐదు కిలోమీటర్ల దూరంలో విస్తరించి ఉన్నట్లు చెబుతారు. అలాగే అవి క్రమబద్ధ, భారీ నివాస ప్రాంతాలుగా కూడా ఉన్నాయి. మొదటి నాలుగు క్షేత్రాలు హరప్పా వర్గీకరణకు చెందినవి. కాగా చివరిది మొహెంజొదారో అంతటి వైశాల్యం కలది. హరప్పా ఒక ప్రధాన ఉత్పత్తి కేంద్రమనడంలో ఎలాంటి సందేహం లేదు. ఎందుకంటే అనేక ముడి పదార్థాలను వాడిన సాక్ష్యాధారాలు అందుబాటులో ఉన్నాయి. పంజాబ్‌లోని శివాలిక్ పర్వత ప్రాంతాల్లోని క్షేత్రాల విషయానికి వస్తే రోపర్ సమీపంలోని కోట్ల నిహంగ్‌ఖాన్ 2.60 హెక్టార్ల విస్తీర్ణంలో ఉంది. ద్వినదిప్రాంతంలో విశాలమైన క్షేత్రాలు లేవు. వాటి సగటు వైశాల్యం మూడు హెక్టార్లకు మించి లేదు. సహరాన్‌పూర్, మీరట్ జిల్లాలలో యమునా ఉపనదుల చిన్న లోయలలో ఈ క్షేత్రాలు కేంద్రీకృతమై ఉన్నాయి.

**సింధ్:** సింధ్‌లోని కొహిస్తాన్, కిర్థార్ పర్వత ప్రాంతంలోని హరప్పా క్షేత్రాలు సాధారణంగా స్థానిక జీవజలరాశులవద్ద కేంద్రీకృతమై ఉన్నాయి. బహుశా అవి వ్యవసాయం, వనరుల సేకరణకు ఉభయతారకంగా వ్యవహరించి ఉంటాయి. సింధ్‌లోని లార్కానా ప్రాంతంలో వెలసిన మొహెంజొదారో వ్యవసాయ అనుకూలతను పొందిదనడంలో ఎలాంటి సందేహం లేదు. అయితే ఇరాన్ నుండి మధ్య ఆసియా వరకు విస్తరించి ఉన్న వాణిజ్య మార్గాలకు అది కీలక స్థావరంగా కూడా వ్యవహరించింది.

ఒక ప్రాచీన వాణిజ్య మార్గం కరాచికి ఉత్తర దిశగా థానోబులాఖాన్‌కు వెళ్లి నేటి లార్కానా జిల్లాలో ప్రవేశించింది. అప్లోదినో, అమ్రీ, గాజిషా, అలీమురాద్, లోహంజొదారో నుండి మొహెంజొదారో (లార్కానా జిల్లాలో) లాంటి నివాస ప్రాంతాలు ఈ వాణిజ్య మార్గం ఇరువైపులా ఉండడం దాని ప్రాముఖ్యతకు నిదర్శనం. వాస్తవానికి మొహెంజొదారోలోని హస్తకళా

కార్యకలాపాల ప్రత్యేక ప్రదేశాలు ఆ ప్రాంతం పోషించిన ఉత్పత్తి, పునఃపంపిణీ పాత్రను వెల్లడిస్తాయి. పాశ్చాత్య ప్రాంతాల వ్యాపారులతోపాటు దేశీయంగా నదీ జలమార్గాల ద్వారా వాణిజ్య లావాదేవీలు జరిగాయి. వైశాల్యం విషయానికి వస్తే మొహెంజొదారో సుమారు 240-250 ఎకరాలు(ఇటీవలి అంచనా 500 ఎకరాలు) విస్తీర్ణంలో ఉంది. తన సమీప హరప్పా నివాస ప్రాంతమైన నారు వారో ధారో (సింధ్) (86 ఎకరాలు) కంటే మొహెంజొదారో మూడింతలు విశాలమైనది. చాన్‌హుదారో దిగువ భాగంలో ఉంది. దాని వైశాల్యం సుమారు 16 ఎకరాలు. చిట్టచివరన అహ్లాదినో లాంటి క్షేత్రాలు ఉన్నాయి. ఇవి రెండు ఎకరాల కంటే మించి లేవు.

**గుజరాత్:** కచ్‌లోని హరప్పా నివాస ప్రాంతాలు పూర్తి స్థాయి సంస్కృతికి ప్రతిబింబం. తమ సంస్కృతి క్షీణించే వరకు అవి పరిపూర్ణంగా జీవించాయి. కచ్‌నుండి గుజరాత్ గ్రామీణ ప్రాంతాలకు పెద్ద ఎత్తున వలసలు జరగడంతో ఈ ప్రాంతాలు విచ్ఛిన్నమయ్యాయి. సౌరాష్ట్రకు కూడా ప్రజలు వలస పోయి ఉండవచ్చు. కచ్‌లోని హరప్పా క్షేత్రాలు కేవలం వ్యవసాయం ఆధారంగానే కొనసాగలేదు. ఎందుకంటే ఈ ప్రాంతం వ్యవసాయపరంగా ఎప్పుడూ సంపన్నంగా లేదు. అయితే అదే సమయంలో కచ్‌లో పత్తిసాగునకు అనుకూలమైన వాతావరణం ఉండేది. అలాగే మేతకు పనికి వచ్చే భూములు కూడా విశాలంగా ఉండేవి. ఇక్కడ వనరులను సమీకరించి ఉంటారు. పశు పోషణకు ఇది ప్రధాన కేంద్రంగా ఉండేది. పత్తి ఉత్పాదక కేంద్రంగా చాలా కాలం పాటు కొనసాగింది. ఉదాహరణకు ఖండరియా వద్ద ప్రకృతి నుండి లభించే వనరులను వెలికి తీశారు. అందుకు తగిన ఆధారాలు కూడా ఉన్నాయి. ముఖ్యంగా బంక, తేనె, జాస్పర్, కొబ్బరి పీచు తదితర వాటిని సమకూర్చుకునేవారు. ఇవి కచ్‌లాగా పాక్షిక-వర్షాభావ ప్రాంతాలైనప్పటికీ సౌరాష్ట్ర ద్వీపకల్పం, గుజరాత్ గ్రామీణ ప్రాంతాలు రెండూ సారవంతమైన భూములు, గలగల పారే సరస్సులు, తగిన వర్షపాతం, ప్రధాన ముడి పదార్థాలు కలిగి ఉండేవి. పాక్షిక విలువగల రాళ్లు, సముద్ర గవ్వలు, రాగి, ఏనుగుదంతాలు, బంగారు, వివిధ రకాల సాధారణ ఖనిజాలు ఇక్కడ లభించేవి. మరోవైపు గుజరాత్ పత్తి సాగుకు ఎంతో అనుకూలంగా ఉంది. సౌరాష్ట్ర, గుజరాత్ ప్రధాన భూభాగంలో పశుపోషణ హరప్పా ఆర్థిక వ్యవస్థలో ప్రధాన భాగంగా ఉండేది. నాగేశ్వర్ లాంటి హరప్పా క్షేత్రాలలో ముడి పదార్థాల కొనుగోలు జరిగినట్టు పురావస్తు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఇక్కడ వివిధ రకాల గవ్వలను అమ్మేవారు. వాటిని గాజులు, శంఖాలలో ఉపయోగించారు. నాగ్వాడా అనే మరో క్షేత్రం పాక్షిక విలువ గల రాళ్ల తయారీకి ప్రముఖ కేంద్రంగా ఉండేదని భావిస్తారు.

**మక్రన్ తీరం:** మక్రన్ తీరంలోని మూడు హరప్పా క్షేత్రాలు- సుత్కాజెండోర్, సోక్తా-కోహ్, ఖైరియాకోట్-సాధారణంగా రేవు పట్టణాలని పరిగణిస్తారు. గల్ఫ్, మెసొపొటామియాలతో వాటికి సముద్ర వ్యాపార సంబంధాలు ఉండేవి. సుత్కాజెండోర్ వద్ద ఒమన్‌కు చెందిన నావ ఒకటి బయటపడడంతో ఈ సూత్రీకరణకు బలం చేకూరింది. అదే

సమయంలో కేవలం వాణిజ్య కార్యకలాపాలొక్కటే ఈ క్షేత్రాల ప్రధాన వ్యాపకంగా ఉండకపోవచ్చు.

**బలూచిస్తాన్:** దక్షిణ బలూచిస్తాన్ కొండలలో ప్రత్యేకమైన హరప్పా నివాస ప్రాంతాలు వెలసినట్లు ఎలాంటి ఆధారాలు లేవు. అయితే ఉత్తర బలూచిస్తాన్‌లోని దాబర్‌కోట్ ప్రాంతంలో ప్రత్యేకమైన హరప్పా స్థాయి (పురావస్తు) ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాంతం నుండి ఆఫ్ఘనిస్తాన్ చేరుకోవడం సులభం. కనుక దాబర్‌కోట్ ఒక వాణిజ్య లేదా వనరుల సమీకరణ కేంద్రంగా వ్యవహరించి ఉండవచ్చు.

**ఆఫ్ఘనిస్తాన్:** ఈశాన్య ఆఫ్ఘనిస్తాన్‌లోని షోర్తుఘయ్ వద్ద గల పరిణత దశ హరప్పా నివాస ప్రాంతం (వలస కేంద్రం) చాలా చిన్నది (2-5హెక్టార్లు). ఇతర ప్రాంతాలకు ఎంతో దూరంగా ఉన్న క్షేత్రం వాణిజ్య స్థావరంగా ఉండి ఉండవచ్చు. ఈ నేపథ్యంలో వాణిజ్యం హరప్పా వైపు నుండి బదఖ్షాన్, మధ్య ఆసియా, ఆఫ్ఘనిస్తాన్ వైపు సాగి ఉండవచ్చు. లాపిస్ లజూలీ, రూబీలు, టిన్ తదితర ఖనిజాలలో వాణిజ్యం జరిగి ఉంటుంది.

**సాధారణ సూత్రీకరణలు:**

మొత్తం మీద స్థానిక వ్యవసాయ అనుకూలత, సహజవనరుల పంపిణీ, దేశీయ వ్యాపార మార్గాల కూడలి తదితర అంశాల ఆధారంగా సింధూ వలస ప్రాంతాల మౌలిక లక్షణం రూపుదాల్చుకుందన్న విషయం విస్పష్టం. సింధూ నాగరికత విశాల భూభాగంలో విస్తరించి ఉండడమే కాకుండా సుదీర్ఘకాలంపాటు మనుగడ సాగించింది. ఘగ్గర్-హక్రా పరీవాహక తీరంలోని చోలిస్తాన్‌లో ప్రారంభమైన ఈ నాగరికత హక్రా-సింధూ ద్వినది ప్రాంతం గుండా సింధ్‌లోని మొహెంజొదారో తదితర ప్రాంతాలకు విస్తరించింది. రేడియోకార్బన్ సాక్ష్యాధారం ఈ విస్తరణ సిద్ధాంతాన్ని బలపరుస్తుంది. క్రీ.పూ. 2500 కాలంలో దిగువ సింధ్‌కు విస్తరించిన తర్వాత సింధూ నాగరికత రాజస్థాన్, హర్యానా, పంజాబ్‌ల వైపు విస్తరించినట్లు ఆధారాలు ఉన్నాయి. దిగువ సింధ్‌కు విస్తరణతోపాటు కచ్‌వైపు కూడా ఈ నాగరికత పయనించి ఉండవచ్చు. అప్పుడు కచ్ ఒక ద్వీపంగా కొనసాగిందనడానికే ఎక్కువ అవకాశాలు ఉన్నాయి. అది హక్రా-సింధూ ఉమ్మడి ప్రవాహానికి చాలా సమీపంలో ఉండేది. నిజానికి రాజస్థాన్- పంజాబ్ - హర్యానా క్షేత్రాలను పరిగణనలోకి తీసుకుంటే సింధూ నాగరికత క్షేత్రాల పంపిణీ ఘగ్గర్-హక్రా పరీవాహక ప్రాంతంలోని మూడు ప్రదేశాలలో చాలా సాంద్రంగా ఉన్నట్లు బోధపడుతుంది. ఆ మూడు ప్రాంతాలు: చోలిస్తాన్, భటిండా ప్రాంతంలోని ఘగ్గర్- సరస్వతి నదీ వ్యవస్థలో అంతర్భాగమైన సర్హింద్‌నాలా వెంబడి, ఘగ్గర్-సింధూ ఉమ్మడి ప్రవాహంగల కచ్. సౌరాష్ట్ర ద్వీపకల్పం వైపు, గుజరాత్ ప్రధాన భూభాగంవైపు ప్రస్థానం కచ్ నుండే కొనసాగింది. బహుశా తదుపరి కాలంలో ఈ పరిణామం సంభవించి ఉండవచ్చు.

**హరప్పా వలసప్రాంతాల లక్షణాలు:**

**వలస ప్రాంతాల ప్రాథమిక నిర్మాణ స్వరూపం:** హరప్పా నగరాలు గ్రిడ్ పద్ధతిలో వెలిశాయన్న వాదనను ఆధునిక పరిశోధన పటాపంచలు చేసింది. రహదారులు ఎప్పుడూ నిరంతరాయంగా ఏర్పాటు చేయబడలేదు. అలాగే కుడి భుజాకారంలో ఎప్పుడూ కూడళ్లుగా కొనసాగలేదు. అయితే పురావస్తుశాస్త్రవేత్తలు జరిపిన ప్రధాన తవ్వకాలన్నింటిలోనూ కేంద్రీకృత ప్రణాళికపై స్పష్టమైన ఆధారాలు లభించాయి. వ్యక్తిగత నివాస గృహాల భౌతిక కొలతలలో ఇది ప్రస్ఫుట మవుతుంది. రెండు ఎత్తయిన వేదికలు ఒకదానికి ఒకటి వేరుగా నిలచిన తీరు, పునాదులపై నిర్మాణమైన బయటి గోడలు, విభజనలు, మూలస్తంభాలు, ప్రవేశ ద్వారాలు ఇవన్నీ ప్రణాళికా బద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేస్తాయి. ప్రాథమిక నివాస గృహాలు క్షుణ్ణంగా తీర్చి దిద్దబడ్డ నిర్మాణాలను ప్రతిబింబిస్తాయి.

మొహెంజొదారో, హరప్పా, కాలిబంగన్ లాంటి వలస ప్రాంతాలులో ద్వంద్వ వేదికలు వేర్వేరు ప్రహరి గోడలతో కనిపిస్తాయి. సార్వజనిక పరిపాలన మరియు ఆచార– నివాస విధి నిర్వహించే పశ్చిమ క్షేత్రం, పూర్తిగా వ్యక్తిగతమైన నివాస క్షేత్రాల మధ్య అవి స్పష్టమైన విభజనను సూచిస్తాయి. హరప్పా వద్ద గల పశ్చిమ వేదికలో కొన్ని ప్రధాన సార్వజనిక కట్టడాలు ఉన్నాయి. ఇవి ఉత్తర ప్రహరీగోడ, నది మధ్యలో వెలిశాయి.

మొహెంజొదారో వద్ద ప్రధాన ప్రహరీగోడ నీడలో నిర్మాణ సముదాయం ఏదీలేదు. కాలిబంగన్ వద్ద పశ్చిమ వేదికలో రెండు వేర్వేరు క్షేత్రాలు ప్రత్యేక ప్రహరీలతో ఉన్నాయి. ఒక క్షేత్రం ఆచార వ్యవహారాలకు సంబంధించినది కాగా రెండవది బహుశా అధికారిక భవనాలు, ఉన్నత వర్గ నివాస గృహాలను కలిగి ఉండేది.

తర్వాత సుర్కోటడ లాంటి ప్రదేశాలు ఉన్నాయి. కాలిబంగన్‌లోని పశ్చిమ క్షేత్రానికి ప్రతిరూపంగా సుర్కోటడ వలసప్రాంతం ఏర్పాటైంది. లోథల్‌లో ఏకీకృత భవన సముదాయం ఉంది. ఇందులో సార్వజనిక భవనాలు, సాధారణ నివాస కట్టడాలు, హస్తకళాకారుల కార్యశాలలు ఒకే ప్రహరీ గోడ లోపల కేంద్రీకృతమై ఉన్నాయి. ఒక ప్రహరీ గోడతోనే బనావలీలో రెండు అంతర్గత గోడాకార ఉపనిర్మాణాలు ఉన్నాయి. అయితే బనావలీ "అక్రోపాలిస్" దిగువ పట్టణం మధ్య విభజన గోడ నిర్మాణం అక్రోపొలిస్‌కు ఆర్చీ ఆకారపు అనిర్ధారిత స్వరూపాన్ని ఇస్తుంది. ఢోలావీరలో ప్రత్యేకమైన నిర్మాణశైలి ఉంది. బహిరంగ ప్రదేశాలు, త్రయ విభజనలు ఇక్కడి ప్రత్యేకతలు. మిగతా వలస ప్రాంతాలలో ఇలాంటి నిర్మాణాలు ఎక్కడా కనిపించవు. దిగువపట్టణం, మధ్యపట్టణం, ప్రధాన వేదికల మధ్య ఇక్కడ స్పష్టమైన విభజన ఉంది. అహ్లాదినో, హులాస్ లాంటి చిన్నస్థాయి పట్టణ నివాస ప్రాంతాలు కూడా ఉన్నాయి. వీటిలో అంతర్గత విభజనలు కాని, ప్రహరీ గోడలుకాని లేవు.

**ప్రణాళిక, పరిమాణం మధ్య సంబంధం:** సింధూ నగరాల ప్రణాళిక స్థాయి, వాటి పరిమాణం మధ్య ప్రత్యక్ష సంబంధం అంటూ ఏదీ లేదు. అందుకు ఉత్తమ నిదర్శనం లోథల్,

మొహెంజొదారోల మధ్య ఉన్న వైరుధ్యమే. లోథల్ కంటే మొహెంజొదారో 18 రెట్లు విశాలంగా ఉంది. అయితే రెండు నగరాలు ఉమ్మడి లక్షణాలను కలిగి ఉన్నాయి. కాల్చిన ఇటుక గృహాలు, నియంత్రిత వీధులు, ఇటుక మురుగుకాలువలు మొదలైనవి రెండు నగరాల్లోనూ ఒకే విధంగా కనిపిస్తాయి. మరోవైపు కాలిబంగన్ (ఇది లోథల్ కంటే రెండింతల వైశాల్యం కలిగి ఉంది) పై నగరాలతో పోలిస్తే ఎంతో వెనుకబడి ఉంది. కాల్చిన ఇటుకలను పరిమితంగా వాడడం, పౌర పారిశుధ్య వ్యవస్థ, బావులు, తదితర సౌకర్యాలు ఇక్కడ చాలా తక్కువగా ఉన్నాయి. కనక సింధూలో కేవలం పరిమాణం మాత్రమే సంపన్నత లేదా అభివృద్ధి స్థాయిని నిర్ధారించదు. ఆ విధంగా చూస్తే హరప్పా గ్రామం, పట్టణం, నగరాల మధ్య వర్గీకరణ కొంత వరకు అస్పష్టంగా ఉంది.

**వీధులు, సందుల ఏర్పాటు :** ప్రతి నగరంలోనూ ప్రధాన వీధులు గణనీయమైన వెడల్పులో ఉండేవి. మొహెంజొదారోలోని హెచ్.ఆర్. ప్రాంతంలో ఉత్తర– దక్షిణ తొలి వీధి(first street) 30 నుండి 35 అడుగుల వెడల్పులో ఉంది. కనీసం 13 అడుగుల వెడల్పు ఉన్న వీధులు సర్వసాధారణమైనవని భావిస్తారు. అయితే సందులన్నీ చాలా వరకు ఇరుకైనవి. మొహెజొందారోలో వాటి వెడల్పు మూడు నుండి ఎనిమిది అడుగుల వరకు ఉంది. లోథల్‌లో అవి ఆరు నుండి తొమ్మిది అడుగుల వెడల్పులో ఉన్నాయి. ప్రణాళికలను బట్టి వీధులన్నీ ఒకే స్థాయి వెడల్పుకల్గి లేవని స్పష్టమవుతుంది. ఉదాహరణకు కాలిబంగన్ దిగువ పట్టణంలోని ఒక ప్రధాన వీధి ఉత్తర భాగాన సుమారు 6.15 మీటర్ల వెడల్పు ఉండగా దక్షిణ దిశలో అది 8.20 మీటర్ల మేరకు విస్తరించి ఉంది. వెడల్పులో ఈ వైరుధ్యాలున్నప్పటికీ వీధులన్నీ దాదాపు తిన్నగా విస్తరించి ఉన్నాయి. అయితే అంతర్గత సందులు ప్రణాళికల ప్రకారం ఎప్పుడో కాని నిటారుగా ఉండేవి కావు. కాని చాలా వరకు వంకర టింకరగా ఏర్పాటయ్యాయి. అయినప్పటికీ ఈ అడ్డ సందులు సరైన ఆకారంలో లేదా కుడిభుజాకారంలో ఎప్పుడూ ఉండేవి కావు. కనుక హరప్పావాసులు కేవలం నిటారు వీధులతోనే సరిపెట్టుకొనేవారని బోధపడుతోంది. కూడళ్లు కూడా ప్రమాదకరమైన రీతిలో ఉండేవి.

**మురుగు కాలువల వ్యవస్థ :** ఇక్కడ ముఖ్యమైన నిర్మాణ లక్షణం కాల్చిన ఇటుకలతో నిర్మాణమైన మురుగు కాలువలే, మురుగు కాలువల వ్యవస్థ విస్తృతంగా ఉండేది. కనీసం లోథల్, మొహెంజొదారో నగరాల విషయంలో అయినా ఇది స్పష్టంగా వ్యక్తమవుతుంది. ఈ రెండు నగరాలలోని ప్రధాన వీధులన్నింటిలోనూ మురుగు కాలువలు ఉన్నాయి. చిన్న చిన్న వీధులలో కూడా అవి అక్కడక్కడ దర్శనమిస్తాయి. వ్యక్తిగత గృహాల నుండి మురుగునీటిని తీసుకెళ్లడమే ఈ కాలువల ప్రాథమిక విధి. ఆవిధంగా చాలా సందర్భాలలో అవి గృహాలలోని చిన్న మురుగు కాలువలతో నీటి గొట్టం ద్వారా ముడిపడి ఉండేవి. వాటి వెడల్పు,లోతు వేర్వేరుగా ఉండేవి. మొహెంజొదారోలో సాధారణ వెడల్పు సుమారు తొమ్మిది ఇంచ్‌లు.

ఈ మురుగు కాలువలను తరచూ శుభ్రం చేసేవారు. కాలువలపైన రాతి స్లాబ్‌లు లేదా ఇటుకలను అందుకు అనుగుణంగా అమర్చారు. మురుగు కాల్వల సాధారణ మేస్త్రీపని

పకడ్బందీగా జరిగింది. మలుపులను చాలా జాగ్రత్తగా గోళాకారంతో నిర్మించారు. మురుగునీటి ప్రవాహం సాఫీగా సాగేలా ఇలాంటి ఏర్పాటు చేశారు. అలాగే ఇటుకతో నిర్మించిన కల్వర్టులు కూడా మొహెంజొదారో శివారు ప్రాంతాలలో కనిపించాయి.

పారిశుధ్య వ్యవస్థలో కేవలం కాలువలే కాక కొన్ని ప్రదేశాలలో ఇంకుడు గుంతలు కూడా ఉండేవి. కొన్నిసార్లు మట్టి పాత్రలే ఆ విధులను నిర్వహించేవి. ఇంటి నుండి వెలువడే మురుగు నీరు ఒక గొట్టం ద్వారా ఆ పాత్రలో వచ్చి చేరేది. సాధారణంగా మట్టిపాత్రల దిగువ భాగంలో రంధ్రం ఉండేది. దాని గుండా మురుగు నీరు భూమిలో ఇంకిపోయేది. అసలైన ఇంకుడు గుంతలును ఇటుకలతో నిర్మించారు. కొన్నింటిలో లోపలికి వెళ్లేందుకు మెట్లు కూడా ఉండేవి. వాటిని ఉపయోగించి పారిశుధ్య పనులను నిర్వహించేవారు.

కాలిబంగన్‌లో వీధి మురికి కాలువలు లేకపోవడం ఎంతో ఆసక్తిని కలిగించే అంశం. అయితే ఇంకుడు కుండలు ఇంటి బయట ఏర్పాటై ఉండేవి. కలపలేదా ఇటుకతో నిర్మితమైన వ్యక్తిగత మురికి కాలువలు వాటితో జతపడేవి. ఈ నేపథ్యంలో హరప్పా మురుగు కాలువల వ్యవస్థను ఆ నగరపు సాధారణ నిర్మాణ ప్రామాణికతతో ముడిపెట్టడానికే ఎక్కువ మంది మొగ్గు చూపారు. మట్టి ఇటుకలతో నిర్మాణమైన గృహాలు, ఇతర నగరాలతో పోలిస్తే వనరుల కొరత తీవ్రంగా ఉండడాన్ని బట్టి కాలిబంగన్ లోథల్, మొహెంజొదారో కంటే ఎంతో వెనుకబడిన నగరమని బోధపడుతుంది.

**బావుల ఏర్పాటు:** హరప్పా పౌర సౌకర్యాల ప్రణాళికలో కాల్చిన ఇటుకలతో తీర్చిదిద్దిన బావులు (ఇవి పెద్ద సంఖ్యలో ఉన్నాయి) సహజ లక్షణంగా ఉన్నట్లు తెలుస్తోంది. మొహెంజొదారో నుండి దీనికి సంబంధించిన ఆధారాలు పుష్కలంగా లభిస్తాయి. ఆ నగరంలో సుమారు 700 బావులు వినియోగంలో ఉన్నట్లు తెలుస్తోంది. ప్రతి మూడవ ఇంటిలో ఒక బావి ఉండేది. బావుల అంతర్గత వ్యాసం రెండు అడుగుల నుండి ఏడు అడుగుల ఆరు ఇంచిల వరకు ఉండేది. అయితే సాధారణ వ్యాసం మాత్రం రెండు అడుగుల రెండు ఇంచిలు. సాధారణంగా వృత్తాకారంలో ఉండే బావులు కొన్నిసార్లు అండాకారంలో ఉండేవి. ప్రత్యేకంగా రూపొందించబడిన ఇటుకలతో బావులను నిర్మించేవారు. చాలా సందర్భాలలో అవి ఇంటి ఆవరణలో ఏర్పాటుయ్యేవి. అయితే అక్కడక్కడ రెండు గృహాల మధ్య తవ్వబడ్డాయి. బహుశా అవి సార్వజనిక వినియోగానికి ఉద్దేశించబడి ఉంటాయి. కొన్ని ఇతర ప్రదేశాలలో కూడా బావులు ఏర్పాటయ్యాయి. కాని కాలిబంగన్ తూర్పు వేదికలో అవి అరుదుగా కనిపిస్తాయి. ఈ స్థాయిలోనే నగర ప్రధాన కేంద్రం పరిధిలో నీటి సరఫరా వ్యవస్థ ఉండడం ఆ కాలపు పరిస్థితులలో కనీవిని ఎరుగని విషయమని చెప్పడం అనవసరం. సమకాలీన ఈజిప్టు, మెసొపొటామియా వాసులు నది నుండి బకెట్లతో నీటిని తీసుకెళ్లేవారు. అలా తోడి తీసుకెళ్లిన నీటిని నగరంలోని తమ గృహలలో ట్యాంకులలో నిల్వ చేసేవారు.

**గృహ నిర్మాణంలో సారూప్యత :** తమ సాధారణ సారూప్యతతో హరప్పా నివాస గృహాలు కూడా అందరినీ తొలుత ఆకర్షిస్తాయి. ఇటుకతోపాటు కలపను విస్తృతంగా వాడి

ఉండవచ్చు. కాల్చిన ఇటుకలు, కలప అవశేషాలు గల గృహాలు మొహెంజొదారోలో పెద్ద సంఖ్యలో బయటపడ్డాయి. మెట్ల పట్టికల అవశేషాలు పై అంతస్తుల నిర్మాణాన్ని సూచిస్తాయి. ఈ మెట్ల పట్టికలు వాలుగా, ఇరుకుగా ఉండేవి.

పైకప్పు సాధారణంగా కలప దుంగల ఆధారిత మట్టిపూత గల గచ్చు నిర్మాణంతో ఉండేది. సాధారణంగా బంకమట్టిని పూతకోసం వాడేవారు. గచ్చి కూడా ఎక్కువగా బంకమట్టితోనే తయారైనా జిప్సం, సున్నపురాయిని కూడా వాడేవారు. లోపలి చప్టా ఇటుకలు లేదా దంచిన మట్టితో ఏర్పాటయ్యేది. కాలిబంగన్ వద్ద కేవలం ఒక గది చప్టా వృత్తాకార నక్సాషి ఉన్న పెంకులతో (tiles) కనిపించింది. ఇలాంటి అలంకరణ గల చప్టాకు మరో రెండు ఉదాహరణలు బాలాకోట్, అహ్లాదినో నుండి లభించాయి.

వాకిళ్లు చాలా సాధారణంగా, బహుశా కలపతో ఏర్పాటై ఉండేవి. ప్రవేశ ద్వారాలు సాధారణంగా, పక్కసందులలోకి దారి తీసేవి. కాని ప్రధాన వీధులలో అరుదుగా అవి తెరుచుకునేవి. కిటికీలు చాలా అరుదుగా కనిపిస్తాయి. ఇంటిలోపల వెలుతురుకు మౌలిక ఆధారం అంతర్గత విశాల ఆవరణే అయి ఉంటుంది.

ఈ గృహాలలో కనిపించే ప్రత్యేక లక్షణాలు స్నానపుగదులు, రహస్య మందిరాలు. ఎంతో జాగ్రత్తగా అమర్చబడిన చప్టా గల స్నానపు గదులు మొహెంజొదారో గృహాలలో విడదీయరాని లక్షణంగా ఉండేవి. మురుగునీటిని తీసుకెళ్లే కాలువ లేదు. నీటి గొట్టం ద్వారా స్నానపు గదుల నుండి నీరు బయటికి పోయేది. మరోవైపు రహస్య మందిరాలు చాలా తక్కువగా కనిస్తాయి.

**సాధారణ సూత్రీకరణలు :** ఉమ్మడి లక్షణాల పరిధిలోనే విస్తృత స్థాయి వైరుధ్యాలు ఉన్నాయి. ఉదాహరణకు మొహెంజొదారో, హరప్పా కాలిబంగన్, లోథల్, బనావలీ, సుర్కోటడ, ఢోలావీర, కుంతసి క్షేత్రాలలో ప్రాథమిక గృహ నిర్మాణ స్వరూపం స్పష్టంగా ఉన్నా నిశితంగా పరిశీలిస్తే వైరుధ్యాలు కనిపిస్తాయి. సాంకేతిక అంశాలపై పూర్తి పట్టు కనిపిస్తుంది. నిఘా స్థూపం మొదలుకొని, మూలసైనిక స్థావరాలు, ప్రవేశ ద్వారాలు, చివరకు గోతులు కూడా కోట నిర్మాణ ప్రణాళికలో కనిపిస్తాయి. మరుగునీటి విసర్జనపై ఎలాంటి గందరగోళం లేదు. అలాగే నీటి సరఫరా నిర్వహణపై సందేహాలు లేవు. ఇంటి నిర్మాణ సామాగ్రి గురించి కూడా సరైన అవగాహన ఉంది. ప్రామాణిక కొలతలతో కూడిన ఇటుకలు, మట్టి–గచ్చిలో ఇమడ్చిన రాళ్లు, భారీ స్థాయి రాతిపని, పాలిషింగ్ (ఢోలావీర) తదితర ప్రక్రియలపై స్పష్టమైన అవగాహన ఉంది. అన్ని రకాల నివాస గృహాలు, కట్టడాలను నగర భౌతిక నిర్మాణ స్వరూపంలో సమీకృతం చేశారు. వాటి లక్షణాలు పరిమాణం లేదా వైశాల్యంపై ఎప్పుడూ ఆధారపడలేదు. మొహెంజొదారో లోథల్‌ల మధ్య పరిమాణంలో తేడాలు, ఆ మాటకు వస్తే కుంతసి మొహెంజొదారో మధ్య వైరుధ్యాలు చాలా ఎక్కువగా ఉన్నా నియంత్రిత లే–ఔట్ యొక్క మౌలిక లక్షణాలను అవి అట్టిపెట్టుకున్నాయి. కార్యాచరణ వైరుధ్యాలను కూడా ఆశించవచ్చు. కుంతసి లాంటి క్షేత్రాలు కేవలం ముడిసరుకుల శుద్ధి, కొనుగోలు స్థావరాలుగా ప్రధాన విధిని నిర్వహించాయి.

## ఇతర సంస్కృతులతో సంబంధాలు

**సంబంధాల పరిధి, స్వభావం:** సింధూ మండలానికి వెలుపల గల వివిధ నవీనరాతి యుగ, తామ్రయుగ సంస్కృతులు చూపే లోతైన మూలాలు(ఆయా ప్రాంతాలలో) వాటి పుట్టుపూర్వోత్తరాలను పూర్తిగా సమ్మేళన అంశాలలో వివరించే అవకాశాన్ని నిరాకరిస్తాయి. ఇందుకోసం ఒక నిర్దిష్టమైన, స్పష్టమైన వివరణ అవసరం. ఇక్కడ ప్రస్తావించదలచిన సంస్కృతులు నైరుతి రాజస్థాన్ నుండి దక్షిణ దక్కన్, ఆంధ్రలో ఒకవైపు, సింధూ-గంగా విభాజిత ప్రాంతం, ఎగువ ద్వినది ప్రాంతం నుండి తూర్పు భారత దేశానికి మరోవైపు విస్తరించి ఉన్నాయి. వీటిలో కొన్ని సంస్కృతులు క్రీ.పూ. మూడవ సహస్రాబ్ది ద్వితీయార్థంలో ఉద్భవించినా ఘనమైన సాంస్కృతిక అంశాలు చాలా వరకు క్రీ.పూ. రెండవ సహస్రాబ్దికి చెందుతాయి. మరో విధంగా చెప్పాలంటే ప్రాథమికంగా ఏ స్వరూపాల్లోనైతే మనం వాటిని తెలుసుకున్నామో అవి చివరి హరప్పా వాసులకే సమకాలికంగా ఉన్నాయి.

కనక చోలిస్తాన్‌లో క్రీ.పూ. 2700లో సింధూ నాగరికత అభివృద్ధి చెందినపుడు ఉపఖండంలోని మిగతా ప్రాంతంలో, ముఖ్యంగా అరావలీ కొండలకు తూర్పున ఉన్న ప్రాంతాలలో పరిస్థితి ఎలా ఉండేది? ఈ ప్రశ్నకు బహుశా ఏకైక సమాధానం ఈ విధంగా ఉంది. భారత లోపలి భూభాగాలలో (బెలాన్‌లోయ, వింధ్య పర్వతాలను మినహాయిస్తే) ప్రజలు చాలా వరకు వేట-సేకరణదారులుగా ఉండి ఉంటారు. ఇలాంటి క్షేత్రాలలో లభించిన ఆధారాలను బట్టి ఈ ప్రాథమిక వేట-సేకరణదార ఆర్థిక వ్యవస్థలో పశుపోషణ, శైశవ దశలో ఉన్న పంట సాగు లేదా మొక్కల వినియోగం ప్రధాన విధులుగా ఉండేవని అర్థమవుతుంది. ఉదాహరణకు తూర్పు రాజస్థాన్‌లోని బాగోర్ క్రీ.పూ. ఐదవ సహస్రాబ్దికి చెందిన మధ్యరాతియుగ స్థాయిని ప్రదర్శిస్తుంది.

విశాల సింధూలోయలో, ముఖ్యంగా హక్రా పరీవాహక ప్రాంతంలోని వ్యవసాయక వలసదారులు వనరుల కోసం సింధ్‌కు ఆవల ఉన్న పశ్చిమ కొండలవైపే దృష్టి సారించి ఉండరు. లేదా సింధూ లోయకే పరిమితమై ఉండరు. తూర్పు దిశను కూడా అన్వేషించి ఉండే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఆ విధంగా ఆ ప్రాంతపు వేట-సేకరణదారులతో సంబంధాలు ఏర్పాటు చేసుకొని ఉంటారు. వారు వేట-సేకరణదారులతో సంప్రదింపులు జరిపారన్న వాస్తవం గణేశ్వర్‌లోని అప్పటి సాంస్కృతిక స్థితి (స్థాయి) నుండి స్పష్టమవుతుంది. హరప్పా పరిణత దశ తదుపరి కాలంలో గణేశ్వర్ ఆవిర్భవించింది. గణేశ్వర్ పరిణామక్రమం ప్రకారం అది ఒక వేట-సేకరణదార మధ్యరాతియుగ సముదాయం. తర్వాతి దశలో గనుల తవ్వకాన్ని చేపట్టి రాగిని ఉత్పత్తి చేసింది. హరప్పా పూర్వ లేదా ఆది హరప్పా వాసుల అవసరాలను తీర్చి ఉంటుంది. పరిణత దశ హరప్పావాసులు కేవలం గణేశ్వర్ ప్రజలతో సంబంధాలు పెట్టుకునే వరకే పరిమితం కాలేదు. హర్యానా వరకు ఉన్న సింధూ గంగా విభజిత ప్రాంతంలో ఒక వైపు,గుజరాత్‌కు మరోవైపు విస్తరించారు. ఈ ఆవాసాలు భారత లోపలి భూభాగాలతో సంబంధాలు నెలకొల్పడానికి అనేక అవకాశాలను కల్పించాయి. అహార్,

అత్రంజి ఖేరా రెండుచోట్లా హరప్పా ప్రతీకాత్మక గవ్వల పూసలు కనిపించడం నిజంగా అంతుపట్టని విషయం.

ఈ సంబంధాల ప్రక్రియ చివరి హరప్పా దశలో మరింత ప్రస్ఫుటమైంది. అపుడు ఎగువ ద్వినది ప్రాంతం, ఉత్తర మహారాష్ట్రలోని చివరి హరప్పా వలస ప్రాంతాలు ఉండేవి. వాటిలో కొన్ని ప్రాంతాలు మాల్వాలో కూడా కనిపించాయి. నిజానికి చివరి హరప్పావాసులు భారత లోపలి భూభాగాల సాంస్కృతి వికాస ప్రధాన ప్రవాహంలో కలిసిపోయారు.

**ఈ సంబంధాల ప్రాముఖ్యత:**

పై పరిణామాల ఆధారంగా భారత లోపలి భాగాల్లోని నవీన రాతియుగ – తామ్రయుగ సంస్కృతులు ఆది, పరిణత, చివరి హరప్పా వలస ప్రాంతాల మధ్య కలయిక ఫలితమేనని వాదించవచ్చు. మరోవైపు ఉన్నత దశకు చేరుకున్న వేట–సేకరణదారులు ఢిల్లీ–అరావలి–కాంబే సీమకు తూర్పు దిశగా పయనించడంవల్ల కూడా సాంస్కృతిక వికాసం సంభవించింది. ఎగువ ద్వినది ప్రాంతం నుండి గంగాలోయకు, గుజరాత్ నుండి మాల్వా, మహారాష్ట్రాలకు విస్తరించిన చివరి హరప్పావాసుల ప్రభావం కారణంగా వేట–సేకరణ దారులు వ్యవసాయం వైపు పూర్తిస్థాయి పరివర్తన చెందారు. ప్రాంతీయ వేట–సేకరణదారులు ఎంతో పరిణత చెందిన కాంస్యయుగ నాగరికత వారసులతో సంబంధం పెట్టుకోవడమే ఇక్కడ ఉత్ప్రేరక శక్తిగా పని చేసింది. ఈ పరివర్తన సంతరించుకున్న స్వరూపం వివిధ ప్రాంతాలలో విభిన్నంగా ఉంది. దానిపై మరింత అధ్యయనం చేయాల్సి ఉందనడంలో ఎలాంటి సందేహం లేదు.

పశుపోషణ, మొక్కల వినియోగంపై అవగాహన ఉన్నప్పటికీ తొలి మధ్యరాతియుగ సముదాయాలు(భారత లోపలి భూభాగాలలో) హరప్పా వాసులతో కలవకముందే తమ ఆర్థిక వ్యవస్థ పునాదిని ఎందుకు విస్తరించలేకపోయారో ఇప్పటికీ తేలని అంశంగా మిగిలిపోయింది. ఈ ప్రశ్నకు సమాధానం సిద్ధంగా లేదు. అయితే ఒక్క విషయాన్ని మాత్రం మనం మదిలో ఉంచుకోవాలి. అదేమిటంటే వేట–సేకరణదారులపై జీవనపంథా మార్చుకోవాలన్న ఒత్తిడి ఏ మాత్రం ఉండేది కాదు. ఎందుకంటే అడవులలో వినియోగ సాధ్యమైన మొక్కలు, జంతువులకు ఎలాంటి కొదవ ఉండేది కాదు.

**పతనానికి కారణాలు**

**పతన సిద్ధాంతాలు:** సాంప్రదాయ అభిప్రాయం ప్రకారం ఆర్యుల దండయాత్ర వల్లే హరప్పా వాసులు తుడిచిపెట్టుకుపోయారు. అయితే అలాంటి హింసాత్మక అంతం సంభవించినట్లు ఎలాంటి సాక్ష్యాధారాలు లేవు. తర్వాత మరో సిద్ధాంతం వచ్చింది. దాని ప్రకారం ఉత్తర దిశ నుండి వచ్చిన వలసదారులు ఆయా ప్రాంతాలలో నివసిస్తున్న ప్రజలను దక్షిణంవైపు తరిమికొట్టారు. అయితే ఆర్యుల దండయాత్ర లేదా చొరబాటు జరిగినట్లు ఎలాంటి ఆధారం లేదు. సంస్కృతం, స్థానిక భాషలను సరిగ్గా అన్వయించకపోవడం వల్లే ఐరోపా విద్వాంసులు ఇలాంటి లోపభూయిష్టమైన సిద్ధాంతాలను ప్రతిపాదించారు. ఇంతకు హరప్పా వాసులకు ఏమి జరిగింది?

ఇపుడు ఎండిపోయిన ఘగ్గర్–హక్రా నది చుట్టూ అనేక హరప్పా క్షేత్రాలు ఉన్నాయి. ఈ నది సింధూకు దక్షిణాన దానికి సమాంతరంగా ప్రవహించింది. అనేక మంది విద్వాంసులు హరప్పా కాలంలో ఘగ్గర్–హక్రా భారీ నదిగా ఉండేదని ఇపుడు నమ్ముతున్నారు. రుగ్వేద తదితర సంస్కృత గ్రంథాలు ప్రస్తావించిన సరస్వతి నది కూడా అదే అయి ఉండవచ్చు. ఈ సిద్ధాంతం ప్రకారం హిమాలయాలలో భూకంపాలు సంభవించడం వల్ల ఘగ్గర్–హక్రా నదీ పరీవాహక దిశలో మార్పు వచ్చింది. ఫలితంగా ఆ నది అనేక నగరాలను ముంచెత్తింది. వరదలు, ఆ తర్వాత నది ఎండిపోవడంతో హరప్పావాసులు మనుగడ కోసం దక్షిణ పథానికి తరలిపోయి ఉంటారు.

మరో సిద్ధాంతం ప్రకారం హరప్పా ప్రగతికి వ్యాపార వాణిజ్యాలే దోహదం చేసి ఉన్నట్లయితే నాగరికతకు మరణ ఘంటికలను కూడా అవే మ్రోగించి ఉంటాయి. వాణిజ్య సంక్షోభం వల్ల ఏర్పడిన తీవ్ర ఆర్థిక మాంద్యం పట్టణ కేంద్రాలను నిర్మానుష్యంగా మార్చివేసి ఉంటుంది. మరోవైపు పురావస్తు శాస్త్రవేత్తలు వీధుల ఆక్రమణ, పారిశుధ్య లేమి, వలసదార కాలనీల గురించి సాక్ష్యాలు అందించారు. వాటిని బట్టి సామాజిక– సాంస్కృతిక పతనం సంభవించి ఉంటుందని అంచనా వేయవచ్చు.

ప్రకృతి వైపరీత్యాలను సామాజిక – ఆర్థిక పతనాన్ని తట్టుకొని నిలబడ్డ హరప్పా వాసులు దక్షిణం వైపు కదలి ఉంటారు. కొత్త భూభాగాల సంస్కృతిని ఎట్టకేలకు ఆమోదించి ఉంటారు. వరదలు, ప్రకృతి వైపరీత్యాలవల్ల జరిగిన నష్టం గురించిన కథనాలు జానపదాలు, పురాణగాధలలో క్రమంగా చేరిపోయి ఉంటాయి. హరప్పావాసుల నష్టం గంగా మైదాన ప్రాంతాలకు వరంగా మారింది. ప్రాచీన భారతదేశ చరిత్రలోని ఒక మరపురాని కాలానికి గంగామైదానాలు వేదికగా నిలిచాయి. హరప్పానాగరికతకు చెందిన చివరి ప్రజలు ఆ వేదికకు కొంత వరకు పునాదులు వేశారు.

**పతన ప్రక్రియ, స్వభావం:**

సింధ్, ఝుకర్, లోహంజొదారోలలోని రెండు క్షేత్రాల ఎగువ స్థాయిలలో మట్టి పాత్రలను కనుగొన్న నేపథ్యంలో చివరి హరప్పా దశ విచ్ఛిన్న సిద్ధాంతం రూపుదాల్చుకుంది. సింధూ నాగరిక తుది దశకు చెందిన పాత్రలలో కొన్ని సిరామిక్ మార్పులు చోటు చేసు కున్నాయి. మొహెంజొదారో ఇటుక పనితనం ఈ కాలంలో పేలవంగా తయారైంది. కొన్ని క్షేత్రాలలో కుమ్మరి కొలిములు కనిపించాయి. అందులో ఒకటి ప్రధాన వీధి నడిబొడ్డులో ఉంది. గతంలో పూర్తిగా జనావాసం గల ప్రాంతంలో కుమ్మరులు కొలిమిని ఏర్పాటు చేయగలిగారంటే ఈ కాలంలో పౌర జీవన స్థాయి (ప్రమాణాలు) గణనీయంగా క్షీణించాయనడానికి అదో సూచిక.

రెండు వేర్వేరు పురావస్తు సమాచార చిట్టాల ఆధారంగా విదేశీ దండయాత్ర సిద్ధాంతం వెలువడింది. మొహెంజొదారో వద్ద గల తూర్పు వేదిక ఎగువ భాగాలలో సుమారు 33 అస్థిపంజరాలు చెల్లా చెదురుగా ఒకే ప్రాంతంలో లభించాయి. అవి స్త్రీ పురుష బాలలకు సంబంధించినవి. ఈ అస్థిపంజరాలు సమకాలికమైనవి కావు. ఒక ఉదంతంలో అస్థిపంజరానికి

ఉన్న చీలిక గుర్తు మరణానికి దారి తీయలేదు. ఈ సిద్ధాంతం కేవలం కల్పితగాథే. పశ్చిమోత్తర ప్రాంతంలోని వివిధ ప్రదేశాలలో పాశ్చాత్య, మధ్య ఆసియా మూలాలు ఉన్న కొన్ని పురావస్తు పరికరాలు లభించాయి. పురావస్తు తవ్వకాలు జరిగిన మూల ప్రాంతాలలో అవి కనిపించలేదు. వాటిని సమకాలీన వస్తువులుగా భావించడానికి ఎలాంటి కారణం కనిపించదు. అలాగే దండయాత్రికుల (ఆక్రమణదారుల) రాకను అవి సూచించవు. అయితే అలాంటి పరికరాలను బలవంతంగా అన్వయించి ఆక్రమణ సిద్ధాంతాన్ని రూపొందించారు. వాటికి తోడు పైన పేర్కొన్న అస్థిపంజరాలను వాడుకున్నారు. స్థూలంగా సింధూ నాగరికత, మరీ ప్రత్యేకంగా మొహెంజొదారో ఆక్రమణదారుల బృందానికి బలయ్యాయని సూత్రీకరించారు.

ఉత్తర ఆఫ్ఘనిస్తాన్ మూలాలు ఉన్న కొన్ని వస్తువులను బోలాన్ కనుమ చుట్టుపక్కల గల క్వెట్టా, మెహర్‌గఢ్ ప్రాంతంలో కనుగొన్నారు. విదేశీ చొరబాటుకు వాటిని చిహ్నాలుగా పరిగణించారు. ఇది సింధూనాగరికత తుది దశలో సంభవించిందని ప్రతిపాదించారు. ఇలాంటి వస్తువులు పరిణత దశ నాగరికతకు చెందినవి కూడా కావచ్చు అన్న విషయాన్ని ఈ సిద్ధాంత సమర్థకులు విస్మరించారు. ఆక్సస్–సింధూ కలయిక ప్రాంతంలో అలాంటి వస్తువులు లభించడం సాధారణం. ఎందుకంటే ఈ ప్రాంతం వాణిజ్య మార్గానికి చాలా దగ్గరలో ఉంది. సింధూ నాగరిక స్వంత అంశాల ఆధారంగానే దాని పతనం, పరివర్తనను అర్థం చేసుకోవలసి ఉంటుంది. ఇక్కడే మనం పురావస్తు స్థాయిక్రమాన్ని తీక్షణంగా పరిశీలించాలి. మారుతున్న సాంస్కృతిక పరిస్థితిపై దృష్టిసారించాలి. సింధ్ నేపథ్యంలో ఈ విషయాలు దృష్టిలోకి వచ్చాయి. హరప్పా వద్ద ప్రస్తుతం జరుగుతున్న తవ్వకాలలో ఇదే అంశం వెలుగులోకి వచ్చింది. ఇక్కడి క్షేత్రంలో జనసాంద్రత మరీ ఎక్కువగా ఉన్నట్లు నమోదు చేశారు. తుది దశలో ఇలాంటి పరిస్థితులు ఏర్పడ్డాయి. చివరి హరప్పా దశగా గుర్తించిన కాలాన్ని ఐదవ కాలంగా పిలుస్తారు. ఇందులో సిమెటరీ 'హెచ్' పాత్రలు ప్రత్యేకంగా కనిపిస్తాయి (ఈ క్షేత్రంలో జరిగిన తవ్వకాలలో హెచ్ ముద్ర గల సమాధులు బయటపడ్డాయి). అలాగే చిన్న పరిమాణంలో ఉన్న మరుగు కాలువలు, కాల్చిన ఇటుకలు దొరికాయి. మట్టిపాత్రల స్వరూపం మారినా పట్టణ ప్రణాళికకు సంబంధించిన అంశాలు అలాగే కొనసాగాయి.

ఈ నిరంతరతను తొలుత రంగ్‌పూర్ నేపథ్యంలో గుజరాత్‌లో గుర్తించారు. మట్టిపాత్రల నాణ్యతాలోపం, మరుగుకాలువలు, స్నానపు ఘట్టాలు, గృహాలపై తాటాకుల పందిరి లేకపోవడం రంగ్‌పూర్‌లో జీవించిన హరప్పావాసుల సంపద తరిగిపోయిందన్న విషయాన్ని సూచిస్తాయి. పరిణత దశ మట్టిపాత్రల స్థానంలో కొత్తతరహా పాత్రలు కనిపిస్తాయి. వాటిని "కవ్వించే ఎర్రటి పాత్రలు అని పిలుస్తారు. రంగ్‌పూర్ వద్దగల ఈ ఎర్రటి పాత్రల సంస్కృతి బయటి నుండి చొచ్చుకురాలేదు. హరప్పా సంస్కృతే స్థానికంగా అలా అభివృద్ధి చెందింది.

సింధూ–గంగా విభజిత ప్రాంతంలో కూడా పరివర్తనకు సంబంధించిన ఆధారాలు స్పష్టంగా ఉన్నాయి. పురావస్తు స్థాయిక్రమం ఆధారంగానే తొలుత ఈ పరివర్తనను అంచనావేశారు. హర్యానాలోని మిటాథల్, సిస్వాల్ లాంటి క్షేత్రాలలో నమోదు చేసిన మార్పులు, సంబంధిత పింగాణీ పాత్రల కొనసాగింపును కూడా పరిగణనలోకి తీసుకున్నారు. ఎక్కడా

నాటకీయమైన సాంస్కృతిక ఉపసంహరణ కనిపించదు. వలస ప్రాంతాలను ఇష్టానుసారంగా ఏర్పాటు చేశారు, వదలివేశారు. భౌతిక సంస్కృతికి సంబంధించిన వస్తువులు కాలానుగుణంగా మారాయి. అయితే ఈ ప్రాంతాన్ని పూర్తిగా విడిచిపెట్టి వెళ్లారని లేదా విదేశీ సాంస్కృతిక సముదాయాలు ఇబ్బడి ముబ్బడిగా వచ్చి చేరాయనడానికి ఎలాంటి సూచికలు లేవు. పరిణత దశ హరప్పా వాసులు తర్వాత అక్కడి ప్రజలు విస్తరించిన అన్ని ప్రాంతాలలోనూ నిరంతరత, మార్పు రెండు మౌలిక లక్షణాలుగా కనిపిస్తాయి. ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి సాంస్కృతిక స్థాయి వేర్వేరుగా ఉంది. కచ్ మైదానంలో పాత సాంప్రదాయాలు కొత్త అంశాలతో పిరాక్ క్షేత్రం వద్ద కొనసాగింది. మరోవైపు దక్షిణ బలూచిస్తాన్‌లో కులి సంస్కృతి అలాగే కొనసాగింది. సింధ్‌లోని ఝుకర్ వద్ద కేవలం ఒక కొత్త పాత్ర శైలి ఉద్భవించిది. పరిణత హరప్పా సాంప్రదాయానికి అనుగుణంగా సాంస్కృతిక నిరంతరతలో ఎలాంటి ఆటంకం, నాటకీయ మార్పు లేకుండా ఈ క్షేత్రం మనుగడ సాగించింది. అయితే సింధూలిపి కేవలం కుమ్మరులకే పరిమితమైపోయింది. సిమెట్రీ హెచ్ పాత్రల సంస్కృతికి ఉత్తమ నిదర్శనాలు చోలిస్తాన్‌లో కనిపిస్తాయి. చివరి హరప్పా కాలానికి చెందిన క్షేత్రాలు ఇక్కడ 50కిపైగా ఉన్నాయి. సట్లెజ్, యమున మధ్య విస్తరించి ఉన్న ప్రాంతమంతా తుది హరప్పా క్షేత్రాలతో నిండి ఉంది. ముఖ్యంగా ఎగువ ద్వినది ప్రాంతంలో ఇవి ఘనంగా కేంద్రీకృతమై ఉన్నాయి. ఈ కాలంలో వ్యవసాయ వైవిధ్యం, సంపన్నత తరిగిపోయిన దాఖలాలు ఎక్కడా లేవు.

గుజరాత్‌లో వివిధ సాంస్కృతిక పరిస్థితుల కలయిక ఉన్నట్లు బోధపడుతోంది. పశువుల పాక ఉన్న చిన్న క్షేత్రాల నుండి రోజ్‌దీ, బెట్ ద్వారకా లాంటి సురక్షిత క్షేత్రాల వరకు గల విభిన్నమైన సాంస్కృతిక పరిస్థితులు ఇక్కడ కనిపిస్తాయి. గతంలో కంటే లిపి వాడకం తగ్గిపోయినా పూర్తిగా మాయం కాలేదు. వ్యవసాయం గట్టిగా పెనవేసుకుపోయింది. వ్యవసాయం విస్తరించిందే కాని తరిగిపోలేదు. వేరే ప్రాంతాలలో వలే గుజరాత్‌లో కూడా చివరి హరప్పా క్షేత్రాలు పరిణత దశ క్షేత్రాల కంటే ఎక్కువ సంఖ్యలో ఉన్నాయి. కనీసం గుజరాత్‌లోనైనా విదేశీ వాణిజ్య సాంప్రదాయం కొనసాగింది. ప్రత్యేకమైన చిహ్నం గల ముద్ర (గల్ఫ్‌దేశాలకు చెందినది)ను బెట్ ద్వారకా వద్ద, సింధూ సంబంధిత ముద్రలను నిప్పూర్, ఫైలాక వద్ద కనుగొనడం పరిణత హరప్పా కాలం నాటి విదేశీ వాణిజ్య సాంప్రదాయం అలాగే కొనసాగిందనడానికి తిరుగులేని సాక్ష్యం.

అదే సమయంలో పతనానికి సంబంధించిన స్థూల అంశం ప్రస్ఫుటంగా కనిపించింది. పురావస్తు నివేదికలు సాధారణమైపోయాయి, లిపి వాడకం పరిమితమైంది. సుదూర ప్రాంతాల నుండి తీసుకువచ్చిన ముడి సరుకుల వినియోగం తగ్గిపోయింది. ఈ పతనాన్ని వివరించడానికి ప్రయత్నించే ముందు సట్లెజ్–యమునల మధ్య విస్తరించి ఉన్న చివరి హరప్పా క్షేత్రాల ప్రధాన లక్షణాన్ని గుర్తు చేసుకోవాలి. ఈ కాలంలో ద్వినది ప్రాంతం వైపు వలస ప్రాంతాలు ఎక్కువగా దృష్టి సారించాయి. ఇలాంటి మార్పు ఎందుకు చోటు చేసుకుందో మనకు ఏ మాత్రం తెలియదు.

అయితే ఘగ్గర్–హక్రా నదీ వ్యవస్థ శీఘ్రంగా ఎండిపోవడం ఒక కారణమై ఉండవచ్చు. మరో కారణం హరప్పావాసులు మితిమీరి విస్తరించడమే. వలసప్రాంతాల పునాదులు అంత లోతుగా లేవు. చోలిస్తాన్, సింధ్‌లోని కొన్ని ప్రాంతాలు, పశ్చిమ పంజాబ్, హర్యానా, గుజరాత్‌లలో వారికి ఘనమైన వంశచరిత్ర ఉంది. తొలిదశ హరప్పావాసులతో వారికి సంబంధం ఉంది. మైదాన ప్రాంతాలలో పల్చగా విస్తరించడంతో వారి రాజకీయ సంఘటన బలహీనపడిందని అందరూ అంగీకరించవలసిన విషయం. భారత లోపలి భూభాగాలలోని అభివృద్ధి చెందిన సముదాయాలు వారిని మింగేశాయి.

ద్వినది ప్రాంతంలోని ఎగువ భాగంలో ఒకసారి స్థిరపడ్డాక హరప్పావాసులు గంగాలోయ ప్రధాన సంస్కృతి వైపు మొగ్గుచూపారు. ఆ సంస్కృతితో తమ అనుబంధాన్ని పెంచుకున్నారు. అలాగే నైసర్గిక కోణం నుండి చూస్తే చివరి హరప్పా కాలంలో గుజరాత్‌లో సాంద్రంగా విస్తరించడంవల్ల ఆగ్నేయ రాజస్థాన్, మాల్వా, దక్కన్ వైపు వారి ప్రస్థానం అనివార్యమైనట్లు తెలుస్తోంది. తపతి లోయ వెంబడి వారు నేరుగా దక్కన్‌కు విస్తరించారు. ఆగ్నేయ రాజస్థాన్, మాల్వా ప్రజలతో సంబంధాలు కొనసాగించినట్లు ఆధారాలు ఉన్నాయి. నిజానికి హరప్పా వాసులు భారత్ లోపలి ప్రాంతాల సాంస్కృతిక వికాస ప్రవాహం వైపు కదిలారు.

**ముగింపు :** ప్రస్తుతం మనకు అందుబాటులో ఉన్న సమాచారం సూచించేదేమిటంటే సింధూనాగరికత ఉన్న పళంగా అంతం కాకుండా భారత సాంస్కృతిక ప్రధాన స్రవంతిలో కలిసిపోయింది. సింధూ–గంగా విభజిత ప్రాంతం నుండి గంగా–యమున ద్వినది ప్రాంతానికి హరప్పావాసులు వలస వెళ్లినట్లు స్పష్టమైన ఆధారాలు ఉన్నాయి. గుజరాత్ నుండి మాల్వా, మహారాష్ట్రలకు విస్తరించినట్లు కూడా సూచనలు ఉన్నాయి. అయితే సింధూనాగరికత భారత నవీనరాతియుగ – తామ్రయుగ సంస్కృతులలో పట్టణీకరణ రూపంలో కలవలేదు. రోజ్‌ది, బెట్‌ద్వారక (గుజరాత్) చోలిస్తాన్‌లోని కుడ్‌వాలాలో పట్టణ ప్రమాణాలు కొనసాగి ఉంటాయి. కాని వాటి వైశాల్యం పరిమితంగా ఉందన్న అభిప్రాయం కలుగుతుంది. వైవిధ్యభరితమైన వ్యవసాయం ఆధారంగా అలాంటి పట్టణ ప్రాంతాలు కొనసాగాయి.

3

# వైదిక యుగం

**సాధారణ అధ్యయనం:**

**పరిచయం:** ఉత్తర భారతదేశం, ముఖ్యంగా గంగాలోయ, వైదిక సంస్కృతికి మూల కేంద్రం ఈ సంస్కృతి గురించి విశాలమైన వైదిక సాహిత్యం (రుగ్వేద కాలం క్రీ.పూ. 1500–1000, మలివైదిక కాలం క్రీ.పూ. 1000–600) ఎక్కువ సమాచారాన్ని అందిస్తుంది. సింధూ – గంగా విభజిత ప్రాంతంలోని క్షేత్రాలలో బూడిదరంగు మట్టిపాత్రలు (క్రీ.పూ. 900–500) లభించడంతో అత్యంత విలువైన పురావస్తు పదార్థాలను వైదిక సాహిత్య సాహితీపరమైన సమాచారంతో సరిపోల్చడానికి మార్గం సుగమమైంది. ముఖ్యంగా మలి వైదిక గ్రంథాలలో పొందుపరచిన సమాచారాన్ని ధృవ పరచుకోవడానికి అవకాశం కలిగింది. హరప్పా కాలంలో కనిపించని ఇనుము వినియోగాన్ని కూడా పురావస్తు క్రమస్థాయిలో నమోదు చేశారు. క్రీ.పూ. 1200 లేదా 1000 ప్రాంతంలో భారతదేశంలో ఇనుము పరిజ్ఞానాన్ని వినియోగించడం ప్రారంభించారని చెప్పడానికి ఏకాభిప్రాయం కొరవడినా విద్వాంసులు సాధారణంగా ఇనుప పరికరాలు వాడకంలోకి వచ్చిన కాలాన్ని క్రీ.పూ. 800–750 నుండి పరిగణిస్తారు.

భారతదేశంలోనే కాకుండా స్థూల ఇండో–ఐరోపా సాహిత్యంలోనే అత్యంత పురాతనమైన సాహితీ కృతిగా ఖ్యాతి గాంచిన రుగ్వేదం సాత్వికమైన సామాజిక ఆర్థిక, రాజకీయవ్యవస్థ, మతపరమైన జీవనం గురించి ప్రస్తావిస్తుంది. పశుపోషణ, ప్రాథమిక వ్యవసాయం చుట్టూ తిరిగే భౌతిక జీవనం రాజకీయ వ్యవస్థతో, ముడిపడి ఉండేది. వ్యవస్థలో పెద్దల నాయకత్వంలోని కుదురు సంఘాలు (పెద్దలను రాజ, విస్‌పతి, గోపతి అని పిలిచే వారు) క్రియాశీలంగా ఉండేవి.

తదుపరి వైదిక కాలాలలో వైదిక సంస్కృతి పంజాబ్ ప్రాంతం నుండి దక్షిణ తూర్పు ఆగ్నేయ దిశగా గంగాలోయలో విస్తరించింది. పోడు వ్యవసాయదార సమాజ అభివృద్ధితో ఈ విస్తరణ ముడిపడి ఉంది. చతుర్వర్ణ సమాజపు ఆందోళనలు కూడా ఈ దిశలో తీవ్రమయ్యాయి. విశాలమైన సంకీర్ణ సంస్కృతి (బలిదానాలతో కూడిన) బ్రాహ్మణ పురోహితుల ఆధ్వర్యంలో ప్రారంభమైంది. పాలకవర్గం క్రమంగా అవతరించింది. అదే క్షత్రియ కులంగా స్థిరపడింది.

ఈ మార్పులు రుగ్వేద కాలం కంటే మరింత సంక్లిష్టమైన సామాజిక – ఆర్థిక, రాజకీయ, మతపరమైన పరిస్థితులను సృష్టించాయి. బూడిద రంగు మట్టి పాత్రలు లభించిన క్షేత్రాలు పై మార్పులను సూచించే భౌతిక అవశేషాలను అందించాయి. రాజకీయ వ్యవస్థ రాజ్య వ్యవస్థ ముంగిటలో ఉండేది. పూర్తిస్థాయి రాచరిక రాజ్యం క్రమబద్ధ రెవెన్యూ వ్యవస్థ, సుశిక్షిత సైన్యం లేకపోవడంతో అప్పటికీ ఉద్భవించలేదు.

**రుగ్వేద కాలం :** భారతదేశం ఆది కృతి రుగ్వేదం పురోహిత కుటుంబాలు ఆలపించిన భక్తిగీతాల సమాహారం దాని ఆవిర్భావం గురించి తీవ్ర అనిశ్చితి ఉంది. అలాగే అందుబాటులో ఉన్న పురావస్తు సామాగ్రి, వైదిక ప్రమాణాల మధ్య పరస్పర సంబంధాన్ని నెలకొల్పడానికి ప్రయత్నాలు జరిగినప్పటికీ వేదాల పురావస్తు శాస్త్రం శాస్త్రజ్ఞులకు ఇప్పటికీ దక్కలేదు. అయితే ప్రాచీన భారతదేశంలో సామాజిక మార్పు ప్రక్రియను అర్థం చేసుకోవడానికి రుగ్వేదం అందించే సమాచారాన్ని వాడుకునేందుకు తగిన కారణాలు కొన్ని ఉన్నాయి. అభిప్రాయభేదాలు ఉన్నప్పటికీ సమాజం నాగరికత దశకు పూర్వస్థితిలో ఉందని రుగ్వేదం చెబుతోంది. బహుశా నాగరికత వైపు పరివర్తనకు ఆ కాలం నాంది పలికి ఉంటుంది. సాహిత్య ఆధారాలలో కనిపించే ఇలాంటి వివరాలు పురావస్తు శాస్త్రంలో ఎల్లప్పుడూ అందుబాటులో ఉండవు.

రుగ్వేద ఆర్థిక వ్యవస్థ చాలా వరకు ప్రాథమికమైంది. అంటే సంచార జీవితం గడిపే ప్రజలు వ్యవసాయాన్ని, వ్యాపారాన్ని నిర్వహించేవారు. ముఖ్యంగా వ్యవసాయం కంటే పశుపోషణ ప్రధాన వృత్తిగా ఉండేది. సంపదను పశువుల సంఖ్య రూపంలో లెక్కపెట్టేవారు. సాంకేతిక పరిజ్ఞానం ఏ విధంగా చూసినా లోహయుగ పూర్వానికి చెందినది. తెగలను “జన” అని వర్గీకరించారు. వాటి ఉపవిభజనలు విస్(కుదురు), కుల (కుటుంబం). “రాజన్” అనే పెద్ద రాజకీయ విధులను నిర్వహించేవాడు. తెగ సైనిక నాయకునిగా వ్యవహరించడం అతడి ప్రధాన విధి. రాజకీయ వ్యవస్థ వ్యవహారాలలో ప్రజల భాగస్వామ్యం, సభ సమితి సంఘాలలో ప్రస్ఫుటమవుతుంది. మిగతా ప్రాంతాలలో గణపతి లేదా జ్యేష్ఠ “గణా”లకు అధిపతిగా ఉండేవాడు. ఇక్కడ రాచరిక రహిత రాజకీయ వ్యవస్థ తదుపరి యుగాలలో వచ్చిన గణరాజ్యవాదానికి తొలి రూపంగా ఉండేది. మత వ్యవస్థ అనేక సహజ దృగ్విషయాల చుట్టూ తిరుగాడేది. తాంత్రికత్వం తరహాలో దైవత్వం మూర్తీభవించేది. సమాజంలో భవిష్యత్ మార్పులకు సంబంధించిన శక్తులు కూడా ఉండేవి. పశుసంపదకు ఎక్కువ ప్రాధాన్యత ఉన్నప్పటికీ రుగ్వేద కాల సమాజంలో విభిన్న హస్తకళలు అనేక వృత్తుల రూపంలో కొనసాగాయి. కుల వ్యవస్థ పూర్తిగా ఏర్పడకున్నా సంబంధిత ఛాయలు శ్రమ విభజన రూపంలో కనిపించాయి. ముఖ్యంగా బ్రాహ్మణ, రాజన్య, వైశ్య తరగతులు ఉండేవి. పురోహితుడు, రాజన్‌ల మధ్య సన్నిహిత సంబంధం తదుపరి కాలంలో బ్రాహ్మణ, క్షత్రియుల మధ్య పరస్పర సహకారానికి దారి తీసింది.

స్థానిక ప్రజలతో సంబంధాలు మొదలయ్యాయి. రుగ్వేద కాలపు తెగలు తమలో తాము కలహించుకోవడమే కాకుండా స్థానిక దాసులు, దాస్యులతో కూడా నిరంతరంగా ఘర్షణ పడేవి. మరోస్థాయిలో సంబంధాలు అంతే అవసరమయ్యాయి. రుగ్వేదలో సంస్కృతేర

పదాలను కలుపుకోవడం, రుగ్వేద సమాజంలో దాసులను చేర్చుకోవడం బట్టి భవిష్యత్‌లో వచ్చిన మార్పులు కేవలం "స్వచ్ఛమైన" రుగ్వేద ఆర్యసంస్కృతి నుండి పుట్టుకొచ్చిన "స్వచ్ఛమైన" కొమ్మలు కాదని బోధపడుతుంది.

**మలి వైదిక కాలం:** రుగ్వేద సమాజం మౌలికంగా తెగ లక్షణం కలిగి ఉంటే అలాంటి తెగ నిర్మాణంలో మార్పులు తదుపరి వైదిక గ్రంథాలలో స్పష్టంగా కనిపిస్తాయి. ఈ మార్పునకు ఆధారం స్థిర నాగలి సేద్యం గల ఆర్థిక వ్యవస్థ వైపు క్రమంగా జరగడమే. ఈ మార్పు కూడా ఇతర కారకాలైన సారవంతమైన గంగా మైదాన ప్రాంతాల ఆక్రమణ, వాటి విస్తరణతో ముడిపడి ఉంది. అలాగే కొత్తగా సమకూర్చుకున్న ఇనుము పరిజ్ఞానం మరో కారకం. ఇనుము సహాయంతో వ్యవసాయంలో మిగులు ఉత్పత్తిని సాధించగలిగారు. తదుపరి వైదిక గ్రంథాలు ఇనుము, రాగి, తగరం మొదలైన లోహాలు, గోధుమలు, బార్లీ, వరి, పప్పుధాన్యాలు లాంటి పంటలను తరచూ ప్రస్తావిస్తాయి. వ్యవసాయ కార్యకలాపాల ప్రాముఖ్యత కొన్ని కర్మ కాండలలో (ఆచారాలు) బహిర్గతమవుతుంది. ఖగోళశాస్త్రం లాంటి శాస్త్రాల అధ్యయనం కూడా ప్రారంభమైంది. ఈ శాస్త్రానికి వ్యవసాయ పనులతో ప్రత్యక్ష సంబంధం ఉండేది.

ఈ పై మార్పులకు తోడు సామాజిక నిర్మాణంలో కూడా ఎంతో ప్రాముఖ్యత కలిగిన మార్పులు వచ్చాయి. తీవ్రమైన విభజనలతో ఇపుడు కులవ్యవస్థ నిర్దిష్టమైన స్వరూపాన్ని సంతరించుకుంది. ఇందులో చతుర్వర్ణాలైన బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, సూద్ర పూర్తి స్థాయిలో ఏర్పడ్డాయి. వైశ్య, సూద్ర కులాలను బ్రాహ్మణ, క్షత్రియ కులాలకు లోబడి ఉండేలా చేయడం ద్వారా ఈ వ్యవస్థ భారతదేశంలో సామాజిక వర్గీకరణకు ఒక ప్రాథమిక ముసాయిదా సూత్రావళిని అందించింది. అయితే తదుపరి కాలాలలో కులవ్యవస్థ మరింత సంకీర్ణమైన నిర్మాణాన్ని సంతరించుకుంది.

తెగ వ్యక్తిత్వం పతనం కావడం మరో ముఖ్యమైన మార్పు, రాజ్యాల (ప్రాదేశిక ప్రాంతాలు) ఆవిర్భావం ఈ విషయాన్ని స్పష్టం చేస్తుంది. భౌద్ధమతానికి చెందిన 16 మహాజనపదాల జాబితా వెలువడక ముందే కురు, పాంచాల లేదా విదేహ లాంటి మలివైదిక జనపదాల గురించి మనం తెలుసుకుంటాము. ప్రాంతాల ఏర్పాటు ప్రాదేశిక రాజ్యాలతో ముడిపడి ఉంది. రాజ్యాలు రాచరికమైనవి లేదా బహుపాలనా కేంద్రాలు గలవి. రాజత్వ గుణంలో కూడా మార్పు వచ్చింది. దానితోపాటు విస్తృతమైన బలిదానాలు, వేడుకలు (అశ్వమేధ, వాజపేయ, రత్నహవింషి) కూడా వచ్చాయి. అలాగే మిగులు ఉత్పత్తిని క్రమబద్ధ పన్నుల రూపంలో సమకూర్చుకునే హక్కు రాజుకు దక్కింది. రాజు సహాయంతో ఆచారాలు, వేడుకలను నియంత్రించే పురోహితుడు బౌద్ధ కాలంలో ప్రతిఘటనను ఎదుర్కొనట్లు తెలుస్తోంది. బలిదాన కర్మకాండలు మరింత విస్తృతమయ్యాయి. చివరకు అర్థం పర్థం లేని ఆచారాలు కూడా బలపడ్డాయి. ఇదే సమయంలో వ్యవసాయక, వాణిజ్య ఆర్థిక వ్యవస్థ విస్తరించింది.

**ఆర్యుల పుట్టుపూర్వోత్తరాలు :**

ఆర్యుల పుట్టుపూర్వోత్తరాల అంశం ఇప్పటికీ వివాదాస్పదంగా ఉంది. విద్వాంసులు అనేక సిద్ధాంతాలను ముందుకు తీసుకొచ్చారు. అవి పరస్పర విరుద్ధంగా ఉన్నాయి. ఆర్య అనే పదం సాహిత్యపరంగా ఉన్నత జన్మ అనే అర్థాన్ని ఇస్తుంది. అయితే అది భాషను సూచిస్తుంది. కాని కొందరు దానిని జాతిగా పరిగణిస్తారు. భాషా శాస్త్రం, సాహిత్యం, పురావస్తుశాస్త్రం, మానవ విజ్ఞానశాస్త్రం లాంటి విభిన్న ఆధారాలను పరిగణనలో తీసుకొని విద్వాంసులు ఈ అంశంపై పరస్పర విరుద్ధమైన అభిప్రాయాలను వెలిబుచ్చారు. కనుక ఈ అంశం ఇప్పటికీ వాదోపవాదాలకు సిద్ధంగా ఉంది. ఏకాభిప్రాయం కోసం జరిగిన ప్రయత్నాలన్నీ అంతగా ఫలవంతం కాలేదు.

**ఉమ్మడి భాషాశాస్త్ర అధ్యయనాలు :** ఫ్లోరెన్స్ వాసి ఫిలిప్పో సాసెట్టి ప్రాచీన భాషల తులనాత్మక అధ్యయనాన్ని చేపట్టినపుడు 16వ శతాబ్దంలో ఈ సమస్య వెలుగులోకి వచ్చింది. సంస్కృతం, ఐరోపా ప్రధాన భాషలైన గ్రీకు, లాటిన్, గోథిక్ (ట్యూటానిక్ లేదా జర్మానిక్), సెల్టిక్ (ఆంగ్లం) అలాగే పార్సీల మధ్య సమీప సారూప్యాలు ఉన్నాయని అతడు కనుగొన్నాడు. ఉదాహరణ "మదర్" అనే ఆంగ్ల పదం సంస్కృతంలో "మాత్ర్"గా పార్సీలో 'మటర్'గా, గ్రీకులో "మెటర్"గా లాటిన్‌లో "మటర్"గా, జర్మన్‌లో "మట్టర్"గా పిలవబడ్డాయి. ఈ సారూప్యత గల పదాలను పూర్వీకులు సుదీర్ఘకాలం కలిసి జీవించి ఉన్నపుడు కుటుంబాలలో వాడి ఉంటారు.

అయితే 1786లో సర్ విలియమ్ జోన్స్ ఈ సారూప్యతలు, సంబంధాలు యాదృచ్ఛికమైనవి కావని, మనకు తెలియని మాతృభాష నుండి పుట్టుకొచ్చి ఉంటాయని సూచించాడు. ఆ మాతృభాషను మాట్లాడిన వారిని నేడు ఇండో–యూరోపియన్లుగా పిలుస్తారు. వారి వారసుల భాషలను ఇండో–యూరోపియన్ భాషలని అంటారు. మాక్స్ ముల్లర్ ఈ భాషలను "ఆర్యన్" అని పిలిచాడు. అయితే ఆర్యన్ అంటే భాష అని, అది జాతిని సూచించదని స్పష్టంగా నొక్కి చెప్పారు. కాని మరో జర్మన్ విద్వాంసుడైన పెంకా భాషను జాతితో గుర్తించాడు. అలా అంతులేని వివాదానికి తెర తీశాడు. ఆర్య అనే పదం కేవలం భాషను సూచిస్తుందా లేదా జాతిని సూచిస్తుందా? భాష, జాతి రెండింటినీ సూచిస్తుందా? ఈ ప్రశ్నలు వివాదస్పదమైనవి. అయితే నేడు అనేక మంది విద్వాంసులు ఆ పదం కేవలం భాషను మాత్రమే సూచిస్తుందన్న అభిప్రాయాన్ని కలిగి ఉన్నాయి. మరికొంత మంది దానిని జాతి అనే అర్థం వచ్చేరీతిలో ఇప్పటికీ వినియోగిస్తున్నారు.

**భాషశాస్త్ర అధ్యయనాలు:** విద్వాంసులు ఆర్యుల మాతృభూమిని కనుగొనేందుకు ప్రాచీన సాహిత్యాన్ని అనేక సందర్భాలలో వాడుకున్నారు. కాలక్రమంలో ఇండో–ఆర్యులు రుగ్వేద సంహితను మౌఖికంగా రూపొందించారు. భాషాశాస్త్ర ప్రమాణాలను బట్టి సంహిత క్రీ.పూ. 1500 నుండి 1000 సంవత్సరాల మధ్యలో రూపొంది ఉంటుంది. జెండ్ అవెస్టా (ప్రాచీన పార్సీ) భాష కూడా రుగ్వేద సంస్కృతం లాగే ఉంది. నిజానికి వైదిక సంస్కృతికి ఇరాన్‌కు చెందిన ప్రాచీన ఆర్య సంస్కృతిలో సన్నిహిత సంబంధాలున్నాయి. ఈ రెండు సంస్కృతులు ఒకే ఇండో–ఇరానియన్ సంస్కృతి నుండి ఉద్భవించినట్లు తెలుస్తోంది.

**పురావస్తుశాస్త్ర అధ్యయనాలు :** పశ్చిమాసియా, భారతదేశం నుండి విద్వాంసులు కొన్ని ముఖ్యమైన పురావస్తు సాక్ష్యాలను వెలుగులోకి తీసుకురాగలిగారు. తవ్వకాలు, బోఘాజ్ కుయ్ (టర్కీ) శిలాశాసనాలు (ఇది బాబిలోనియా చిహ్నరూప లిపిలో ఉన్నాయి) హితీయులు అనే ప్రాచీన ఆర్యుల సముదాయం గురించి సమాచారాన్ని అందించాయి. క్రీ.పూ. 1950కు పూర్వం వీరు ఆసియా మైనర్‌లోకి ప్రవేశించారు. ఒక బోఘాజ్ కుయ్ శిలాశాసనం క్రీ.పూ. 1400 సంవత్సరాలకు చెందిన శాంతి ఒప్పందం ప్రతిని అందిస్తుంది. హితీయులు, మితన్నీకి చెందిన మర్యన్నీ పాలకుల మధ్య ఈ ఒప్పందం కుదిరింది. ఇందులో వైదిక దేవుళ్లు అయిన ఇంద్ర, వరుణ, మిత్రన్మ, సత్యల పేర్లతో ప్రస్తావించారు. బహుశా మర్యన్నే పాలకుల చొరవతో ఈ పేర్లను చేర్చి ఉంటారు. అదే ప్రాంతంలోని మరో శాసనం మర్యన్నీ పాలకుల భాషను వెలుగులోకి తీసుకువస్తుంది. వీరు ఉత్తర మెసొపొటామియాలో నివసించేవారు. వారి భాష అత్యంత పురాతనమైన ఇండో-ఇరానీ రూపాన్ని ప్రత్యేకతను కలిగి ఉన్నది. ఎందుకంటే వారి భాషలోని సంఖ్యాకాలు కూడా ఇండో - ఇరానీ ప్రత్యేకతను కలిగి ఉన్నాయి. ఉదాహరణకు ఐకా, తెరా, పంజా, సత్తా మొదలైనవి. భారత పురావస్తు తవ్వకాలలో లభించిన ఆధారాలను బట్టి ఆర్యులు బూడిదరంగు మట్టి పాత్రల రూపకర్తలని భావిస్తారు. క్రీ.పూ. 1100-600 కాలానికి చెందిన ఈ పాత్రలు మూల కేంద్రం గంగా యమున ద్వినది ప్రాంతంలో ఉంది.

**మానవ విజ్ఞాన శాస్త్ర పరిశోధనలు :** చివరగా కొందరు విద్వాంసులు మానవ విజ్ఞాన శాస్త్రం సహాయంతో ఆర్యుల మాతృభూమిని గుర్తించడానికి ప్రయత్నాలు చేశారు. వేదాలలో ఆర్యులను అజానుబాహువుల జాతి ప్రజలుగా వర్ణించారు. తెల్లని శరీరవర్ణంతో వెలిగిపోయే ఛాయ, నల్లని జుత్తు వారి స్వంతమని పేర్కొనబడింది. అయితే అస్థి పంజరాల అవశేషాలలో ఏ ఒక్క దానిని ప్రాచీన కాలపు ఆర్యులతో స్పష్టంగా గుర్తించలేదు. తాము స్థిరపడ్డ ప్రాంతాలలో ఆర్యులు స్థానిక ప్రజలతో క్రమంగా కలిసిపోయారు. కనక తమ ప్రత్యేక వ్యక్తిత్వాన్ని వారు ప్రపంచవ్యాప్తంగా ఎక్కడా నిలుపుకోలేకపోయారు. ఈ కారణంగా వారి జాతి లక్షణాలను వెలికి తీయడం అంత సులభం కాదు. అలాగే వాటి ఆధారంగా వారి మాతృభూమిని గుర్తించడం సాధ్యమయ్యే పని కాదు.

**విభిన్న సిద్ధాంతాలు :** ఆర్కిటిక్ ప్రాంతం, జర్మనీ, మధ్య ఆసియా, దక్షిణ రష్యా లాంటి విభిన్న ప్రాంతాలను వేర్వేరు విద్వాంసులు ఆర్యుల మాతృభూమిగా గుర్తించారు. దక్షిణ రష్యా లేదా యురేషియా ఆర్యుల స్వంత భూమి అని చెప్పే సిద్ధాంతం ఇతర సిద్ధాంతాల కంటే కొంత వరకు అర్థవంతంగా ఉంది. ఈ ప్రాంతం నుండి వారు ఆసియా, ఐరోపాలోని విభిన్న ప్రాంతాలకు వలస పోయారు. ఆర్యభాష మాట్లాడే ప్రధాన తెగలలో హితీయులు, ఇండో-ఆర్యులు, ఇరానీలు, కస్సీయులు, మితన్నీలు, గ్రీకులు ఉన్నారు. హితీయులు కప్పడోసియా (ఆసియా మైనర్)కు వలసవెళ్లగా (క్రీ.పూ. 1950 ప్రాంతంలో) ఇండో-ఇరానీలు క్రీ.పూ. 2000 కాలంలో ఆక్సస్, పామిర్లు, జక్సర్తేస్ లోయలకు వచ్చారు. తర్వాత ఇరానీలు ఇరాన్‌కు వెళ్లగా ఇండో ఆర్యులు క్రీ.పూ. 1500 మధ్యకాలంలో భారతదేశంలోకి ప్రవేశించారు. (ఈ కాలాన్ని క్రీ.పూ. 2000 సంవత్సరాల కంటే ముందుగా నిర్ధారించలేము) క్రీ.పూ. 1760 ప్రాంతంలో

కస్సీయులు బాబిలోనియాను స్వాధీనం చేసుకోగా మితన్నీలు క్రీ.పూ.1500 కాలంలో మెసొపొటామియా ఉత్తర ప్రాంతాలకు వలస వెళ్లారు. చివరగా గ్రీకు ఆర్యులు క్రీ.పూ.1200 కాలంలో గ్రీస్‌కు వెళ్లారు.

## వైదిక సమాజం ఆధారాలు

**సాహిత్య, పురావస్తు ఆధారాల మధ్య పోలిక :** ఆర్యులు ఉత్తర భారతదేశాన్ని ఆక్రమించుకొని స్థానిక ప్రజలను జయించి ఆర్య నాగరికతను స్థాపించారని, ఆ నాగరికత నుండే భారతీయ సంస్కృతి మౌలిక అంశాలు ప్రవహించాయన్న పాత సిద్ధాంతం ఇక ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదు. వైదిక గ్రంథాలను ప్రత్యేకంగా అన్వయించడంవల్లే అలాంటి అభిప్రాయం గతంలో ఉండేది. అప్పుడు కేవలం సాహిత్య ఆధారాలనే వినియోగించారు. అయితే హరప్పా, హరప్పా అనంత కాలంపై పురావస్తు పరిశోధన, భాషా శాస్త్ర అధ్యయనంలో మెరుగుదల పై సిద్ధాంతాన్ని తిరస్కరించడానికి ఉపకరించాయి.

హరప్పా నగరాల పతనం, వాటి తర్వాత ఆవిర్భవించిన పురావస్తు సంస్కృతులు (ఉత్తర భారతంలోని వివిధ ప్రాంతాలలో) గమనంలో ఉంచుకొని వైదిక కాలంపై ఒక అవగాహనకు రావలసిన అవసరం ఎంతైనా ఉంది. విశేషమేమిటంటే వైదిక కాల చరిత్రను అన్వయించడానికి ఇప్పుడు సాహిత్య ఆధారాల కంటే పురావస్తు ఆధారాలకే ఎక్కువ ప్రాధాన్యతనిస్తున్నారు. ఉత్తర భారతంలో హరప్పా నాగరికత పతనమైన తర్వాత కొన్ని ప్రధాన పురావస్తు సంస్కృతులు ఆవిర్భవించాయి. స్వాట్ లోయలోగాంధార సమాధి సంస్కృతి; పింగాణి–ఇనుము మిశ్రమ వర్ణ పాత్రల సంస్కృతి (ఈ కాలంలోనే రాగి నిల్వ పాత్రలు ఆవిర్భవించినట్లు భావిస్తారు); ఎరుపు – నలుపు మట్టిపాత్రలు, నల్లటి కుండలతో ముడిపడి ఉన్న తామ్రయుగ సంస్కృతులు (క్రీ.పూ. తొలి సహస్రాబ్ది మధ్యభాగానికి చెందినవి); బూడిదరంగు మట్టి పాత్రల సంస్కృతి (క్రీ.పూ. 1200–400 వరకు తొలుత పంజాబ్, రాజస్థాన్ ఆ తర్వాత ద్వినది ప్రాంతంలో) క్రమంగా ఆవిర్భవించాయి. కొన్ని సందర్భాలలో ఈ సంస్కృతులు ఉత్తర భారతదేశమంతా విస్తారంగా విస్తరించి ఉండేవి. మరి కొన్ని సందర్భాలలో పల్చగా, పరిమితంగా విస్తరించి ఉండేవి.

ఈ పురావస్తు సంస్కృతులకు సమకాలికంగా వైదిక సాహిత్య సంస్కృతి ఉండేదని చెబుతారు. తొట్టతొలి గ్రంథం రుగ్వేదం. దీని తర్వాత అథర్వ, యజుర్, సామవేదాలు వచ్చాయి. ప్రతి వేదానికి తర్వాతి కాలంలో రచించబడిన వివిధ రకాల గ్రంథాలు జతయ్యాయి. ముఖ్యంగా బ్రాహ్మణాలు, అరణ్యకాలు, ఉపనిషత్తులు వేదాలతో ముడిపడ్డాయి. ఈ భారీ సాహిత్యం రుగ్వేద రచన అనంతర కాలానికి చెందినదని మలిదశ వైదిక సాహిత్యం వివరిస్తుంది. వైదిక మార్పులను కంఠస్తం చేసుకొని మౌఖికంగా తర్వాతి తరాలకు శతాబ్దాల తరబడి అందించడంవల్ల వాటి కాలాలను నిర్ధారించడం అసాధ్యంగా మారింది. కేవలం క్రీ.పూ.400 కాలంలోనే వాటికి అక్షర రూపం ఇచ్చి ఉంటారు.

వైదిక సాహిత్య భాండాగారానికి తదుపరి చేరికలు (సూత్ర గ్రంథాలు) సాధారణంగా క్రీ.పూ. తొలి సహస్రాబ్ది మధ్యభాగానికి చెందినవని లెక్క కడతారు. ఈ అదనపు గ్రంథాలు అనేక అంశాలను ప్రస్తావిస్తాయి. ఉదాహరణకు, ధర్మసూత్రాలు ఆదర్శవంతమైన సమాజాన్ని సూచిస్తాయి. తర్వాతి కాలంలో అవి ధర్మశాస్త్రాలుగా ఆవిర్భవించాయి. యస్క రచించిన నిరుక్తలోపదమూల శాస్త్రానికి సంబంధించిన వివరాలు ఉన్నాయి. సామాజిక బాధ్యతలకు సంబంధించిన నియమాలు, కుణాలు, ఆచారాలకు సంబంధించిన సూత్రాలను ధర్మసూత్రాలు, గృహ సూత్రాలు, స్రౌత సూత్రాలలో పొందుపరిచారు. గృహస్తుడు పాటించాల్సిన ఆచారాలు (కర్మకాండలు), సామాజిక విధులను కూడా అవి సూచిస్తాయి. ఒకే రచయిత రచించాడని చెప్పబడుతున్న ఈ మూడు సూత్రాల గ్రంథాల పుటను కొన్ని సార్లు "కల్పసూత్రాలు" అనే ముద్ర వేస్తారు.

అలాగే శృతి, స్మృతి అనే వర్గీకరణ ఉంది. శృతి కింద వేదాలు, స్మృతి కింద సూత్రాలు చేర్చబడ్డాయి. కొందరు వ్యాఖ్యాతల ప్రకారం స్మృతివర్గీకరణలో ఇతిహాస – పురాణ సాంప్రదాయం కూడా ఉంది. ఈ సాంప్రదాయం గత సంఘటనలు, ప్రాచీన జానపదాలు, రెండు మహాగ్రంథాలతోపాటు తదుపరి కాలంలో వెలువడిన పురాణాలను కూడా వివరిస్తుందని చెబుతారు.

వైదిక సాహిత్య భాండాగారంలోని వేదాంగ (అదనపు కృతులు) తదితర రచనలను కాలానుక్రమంగా విభజించలేము. ఈ గ్రంథాలలోనే కొన్ని భాగాలు పూర్వపు కాలానికి చెందినవి కాగా మిగతావి తదుపరి కాలంలో రూపొందించబడ్డాయి. అందుకే అలాంటి గ్రంథాల క్రమం కేవలం అంచనా మాత్రమే. ఈ గ్రంథాలను మూల సమాచారంగా వినియోగించే సమయంలో మనం వివిధ భాగాలను జాగ్రత్తగా పరిశీలించవలసి ఉంటుంది. కొన్ని భాగాలు పూర్వకాలాలలో రచించబడగా మరికొన్ని తదుపరి కాలంలో జత చేయబడ్డాయి. ఈ కృతులన్నీ మత ఆచారాలు, నమ్మకాలకు సంబంధించినవేనన్న విషయాన్ని కూడా గమనంలో ఉంచుకోవాలి. వాటికి పరిమితమైన విధి ఉండేది. సాధారణ భాషలో కాకుండా కేవలం పురోహితులకే పరిమితమైన భాషలో అవి రచించబడ్డాయి.

ఈ గ్రంథాలకు ఖచ్చితమైన కాలాలను నిర్ధారించలేము. కనుక సాహిత్య, పురావస్తు ఆధారాలను క్రమానుపద్ధతిలో పోల్చడం కష్టమవుతుంది. ప్రతి విభాగం నుండి పునర్నిర్మించబడ్డ విశాలమైన సామాజిక, ఆర్థిక పోకడలను పోల్చి చూడవచ్చు, వాటి మధ్య పరస్పర సంబంధాన్ని నెలకొల్పవచ్చు. అలాంటి పరస్పర సంబంధాన్ని భౌతిక సంస్కృతిని తులనాత్మకంగా అధ్యయనం చేయడంలో సునాయాసంగా తీసుకెళ్లవచ్చు. పురావస్తు ఆధారాల నుండి లభించిన వస్తువులు, సాంకేతిక పరిజ్ఞానం, సాహిత్య ఆధారాలలో వాటి వివరణను సమాంతరంగా అధ్యయనం చేయవచ్చు. మట్టిపాత్రలు, లోహ పరికరాలు, వస్తువులు లాంటి అనేక అవశేషాలను రెండు ఆధారాల నుండి పోల్చి చూడవచ్చు. అలాగే నివాస ప్రాంతాల నిర్మాణ స్వరూపం, సామాజిక స్వరూపాన్ని ఈ అవశేషాల ఆధారంగా పునఃనిర్మించవచ్చు. అయినప్పటికీ పరస్పర సంబంధాన్ని రెండు సమస్యల కారణంగా చాలా జాగ్రత్తగా ఏర్పరచాల్సి ఉంటుంది. కర్మకాండల నిర్వహణకు

సంబంధించిన వివరణలు ఉద్దేశ్యపూర్వకంగా ప్రాచీన సాంకేతిక పరిజ్ఞానాలను పాటించి కర్మకాండకు లేని చరిత్రను కట్టబెట్టవచ్చు. ఇంకో సమస్య కూడా ఉంది. ప్రాచీన సాహిత్య ఆధారాలను తదుపరి కాలాలలో జత చేసి ఉండవచ్చు. ఇలాంటి అదనపు సాహిత్య కృతులను వేరు చేయడం చాలా కష్టమైన పని.

భారతీయ శాస్త్ర అధ్యయనం వైదిక ఆచారాలు, మత సిద్ధాంతాలు, వైదిక సంస్కృతానికి ఎక్కడలేని ప్రాధాన్యతను ఇచ్చింది. ప్రాచీన ఇరాన్, ఇతర భాషలలో (ఇండో–యూరప్) వెలువడిన గ్రంథాలతో తులనాత్మక అధ్యయనాలు కూడా జరిగాయి. 19వ శతాబ్దంలో చేపట్టిన ఇలాంటి అధ్యయనాల నుండే ఆర్యజాతి సిద్ధాంతాన్ని తొలిగా ప్రతిపాదించారు. ఆర్యుల జాతి ఉత్తర భారతదేశాన్ని జయించి తన భాషను పరాధీన ప్రజలపై రుద్దిందనే భావనను బలపరిచారు.

ఇప్పుడు ఆర్య దండయాత్ర సిద్ధాంతాన్ని పూర్తిగా తిరస్కరించారు. కనక దృష్టంతా భారతదేశంలో ఇండో–ఆర్య భాష ఎలా ప్రవేశించిందన్న అంశానికి మళ్లింది. ఆ భాష అలా ఎందుకు అభివృద్ధి చెందింది, ఉత్తర భారత ప్రధాన భాష వ్యవస్థగా క్రమంగా ఎలా ఏర్పాటైంది అనే అంశాలు నేడు పరిశోధనకు మూలమయ్యాయి. చారిత్రక సాక్ష్యం ప్రకారం ఇండో–ఆర్య భాష ఉత్తర భారతదేశంలో చొరబాటుగా అభివృద్ధి చెందింది. వలసలు, సంచార జీవితం లేదా వ్యాపారుల లాంటి అనేక మార్గాలలో భాషను ప్రసారం చేయవచ్చు. (సంచార జీవితం గడిపేవారు వెనుకబడిన సంస్కృతి కలిగినప్పటికే స్థిరపడ్డ సముదాయాలతో సన్నిహిత సంబంధం కలిగి ఉండేవారు)

భాషను విస్తరింపచేయడానికి ఆక్రమణ లేదా దండయాత్రలే ప్రత్యేక పద్ధతులు కాదు. బహుళ పురాతన సంస్కృతులు విభిన్న జాతి ప్రజలకు ప్రాతినిధ్యం వహించాయన్న ఆధారాలు, ఇండో–ఆర్య భాషపై ఆర్యేతర ప్రజలు చూపిన ప్రభావం వేరే సిద్ధాంతాన్ని సూచిస్తాయి. విభిన్న సంస్కృతులు గల ప్రజల పరస్పర సంబంధాలను ఏర్పరచుకొని భాష, సంస్కృతిపరమైన సర్దుబాట్లు చేసుకొని ఉంటారన్నది ఈ సిద్ధాంత సారాంశం. అలాగే ఇండో–ఆర్య భాషకు మత ఆచారాలకు కీలక స్థానాన్ని కల్పించే బదులు ఆ కాలపు సమాజాన్ని పురావస్తు, సాహిత్య సమాచారంతో పునఃనిర్మించడంపై దృష్టి సారించారు. ఫలితంగా భాష, మతానికి సంబంధించిన అధ్యయనాలు ఆ కాలపు సమాజాల విభిన్న కోణాల విశాల చిత్రంలో అంతర్భాగమవుతున్నాయి.

ఆక్రమణదార ఆర్యులు ఉత్తర భారతంలో రాజ్య వ్యవస్థను ఏర్పాటు చేసి స్థానిక ప్రజలను లోబరచుకొని తమ కోసం పని చేసేలా ఒత్తిడి చేశారన్న భావన గతంలో ఉండేది. ఇప్పుడు వాదిస్తున్నట్లు భారీ స్థాయి ఆక్రమణ అంటూ ఏదీ జరగలేదని భావిస్తే ఉత్తర భారతదేశం రాజ్యం ఎలా ఆవిర్భవించిందో తెలుసుకోవడానికి ఇతర కారణాలను అన్వేషించాల్సి ఉంటుంది. బహుశా ఇది (రాజ్య ఆవిర్భావం) శతాబ్దాల తరబడి సాగిన సుదీర్ఘ ప్రక్రియ అయి ఉంటుంది. అందులో అనేక శక్తులు, కారకాలు అంతర్భాగమై ఉండవచ్చు.

## వైదిక సమాజ ఊహాత్మక చిత్రం :

ఉత్తర భారతమంతటా విస్తరించి ఉన్న విభిన్న సాంస్కృతిక, తెగ సముదాయాలలో ఇండో–ఆర్య భాష ఎలా ప్రవేశించింది, ఎలా విస్తరించింది, ప్రజలు ఆ భాషను ఆ స్థాయిలో ఎందుకు వినియోగించారు లాంటి విషయాలను మనం పరిశీలించాల్సి ఉంటుంది. కనుక ఈ కాలంలో ప్రజల విభిన్న నివాస ప్రాంతాలు, వారి జీవన విధానాన్ని తెలుసుకోవడానికి ప్రయత్నించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఉత్తర భారతంలో క్రీ.పూ. తొలి సహస్రాబ్ది ప్రారంభం నాటి పురావస్తు శాస్త్ర ఊహాచిత్రం వివిధ ప్రాంతాలలో వైవిధ్యభరితమైన సంస్కృతులు ఉన్నట్లు సూచిస్తుంది. గంగా మైదాన ప్రాంతంలోని కొన్ని భాగాలలో నివాస ప్రాంతాల స్వభావాన్ని నిశితంగా విశ్లేషించే అవకాశం లభించింది. తదనంతరం వెలువడిన విశాల చిత్రం విభిన్న సంస్కృతులను ప్రదర్శించింది.

పురావస్తు ఆధారాలతో రూపొందించిన వైదిక సమాజ ఊహాచిత్రం తొలుత సాధారణ, చిన్నస్థాయి నివాస ప్రాంతాలను సూచిస్తుంది. ఇలాంటి ప్రాంతాలలో వ్యవసాయదారులు, పశుపోషకులు నిర్ణీత సంఖ్యలో నివసించారు. అట్టహాసపు (ఆడంబర) జీవనశైలికి సంబంధించి ఎలాంటి ఆధారాలు లభించలేదు. గృహాలు సాధారణంగా తాటాకు గుడిసెలుగా ఉన్నాయి. నేలను మట్టితో అలికేవారు. తొలి సహస్రాబ్ది (క్రీ.పూ) మధ్యనాటికి ఇటుక నిర్మాణాలు వచ్చాయి. నివాస ప్రాంతాలలో లభించిన పురాతన వస్తువులను బట్టి గ్రామాలు స్వయం పోషక లక్షణం కలిగి ఉన్నట్లు తెలుస్తుంది. ప్రత్యేక హస్తకళల ఉత్పత్తి నెమ్మదిగా అభివృద్ధి చెందింది. వైదిక గ్రంథాల భాండాగారంలో చిత్రీకరించినట్లు జీవితాన్ని ఊహాజనితంగా పునఃనిర్మించిన కొందరు ఆధునిక విద్వాంసులకు ఈ పురావస్తు పరిశోధనా సాక్ష్యాలు దిద్దుబాటుగా నిలిచాయి. మహాగ్రంథాలలో విలాస వైభోగాలు, రాజప్రసాదాలు, నగరాలతో ముడిపడి ఉన్న సంపద గురించిన వర్ణనలు కవితాత్మక కల్పన లేదా తదుపరి కాల పరిస్థితుల అన్వయాలై ఉండవచ్చు.

ఈ అసంఖ్యాక సంస్కృతులలో ఒక దానిని ఆర్యులతో గుర్తించడానికి ప్రయత్నాలు జరిగాయి. అయితే అలాంటి ప్రయత్నాలు ఊహాజనితంగానే మిగిలిపోయాయి. ఆర్యులు, ద్రవిడులకు సంబంధించిన పురావస్తు ఆధారాలను వెదకడం కన్నా ప్రధాన వంశాలైన పురులను బూడిద రంగు మట్టిపాత్రల సంస్కృతితోను, యూదులను నలుపు–ఎరుపు పాత్రల సంస్కృతిలోను పరస్పరం ముడిపెట్టడానికి ప్రయత్నిస్తే ఉపయోగకరంగా ఉంటుందని (మహాగ్రంథాలు, పురాణాలలో పేర్కొన్న వంశాలను) కొందరు సూచించారు. చివరకు అలాంటి గుర్తింపు కూడా ఛాయా మాత్రంగానే ఉంటుంది.

## రుగ్వేద నుండి మలి వైదిక దశలకు పరివర్తనం :

**వైదిక గ్రంథాలు :** పురావస్తు శాస్త్రానికి దూరంగా జరిగి వైదిక సాహిత్య ఆధారాలతో అప్పటి సమాజాన్ని ఊహించగలిగితే మనకు విభిన్నమైన అంశాలపై సమాచారం అందుబాటులో ఉంటుంది. నిర్దిష్టమైన తేదీలు (కాలాలు) లేకపోవడంలో నిర్దిష్టమైన సాధారణ

సూత్రీకరణలు చేయడం కష్టమవుతుంది. చారిత్రక పునఃనిర్మాణం విషయానికి వస్తే సమాజంలో కొన్ని అంశాలు అలాగే కొనసాగి పరివర్తన చెందాయి. రుగ్వేద నుండి తదుపరి కాలంలో వెలువడిన వైదిక సాహిత్యంలో పై మార్పు, పరివర్తనల వివరణ ఉంది. గ్రంథాల పరిణామక్రమాన్ని స్పష్టంగా నిర్ధారించడం ఎప్పుడూ సాధ్యం కాదు. కొన్ని గ్రంథాల విషయంలో కాలాలు కలిసిపోతాయి. ఈ కాలపు చరిత్రను పునఃనిర్మించడానికి ఎక్కువగా ఉపయోగించిన వైదిక గ్రంథాలు కింది విధంగా ఉన్నాయి.

| సంహిత | బ్రాహ్మణ | ఉపనిషద్ |
|---|---|---|
| రుగ్వేదం | ఐత్రేయ | ఐత్రేయ |
| | కౌసితాకి | కౌసితాకి |
| అధర్వవేదం | గోపథ | ప్రశ్న |
| | | మందూక |
| యజుర్‌వేదం | సతపథ | బృహదారణ్యక |
| | తైత్రియ | తైత్రియ |
| సామవేదం | పంచవిసింహ | చండోగ్య |
| | (తంద్యమహా) | |
| | జైమినియ | కేనా |

**రుగ్వేద దశ :** రుగ్వేదం ప్రస్తావించిన ప్రజల భౌగోళిక విస్తరణ సప్తసింధూ ప్రాంతంలో, అంటే సింధూ, దాని ఉపనదుల ప్రాంతంలో ఉంది. తూర్పు ఆఫ్ఘనిస్తాన్ నుండి సింధూ–గంగా పరీవాహక ప్రాంతం, ద్వినది ప్రాంత అంచుల వరకు ఈ భూభాగం విస్తరించి ఉంది. స్థలాలు, ప్రజలు, నైసర్గిక లక్షణాలు, యాసల (వేద గ్రంథాలలో ప్రస్తావించిన) ఆధారంగా వేదాల భౌగోళిక మూలాలను నిర్ధారించే ప్రయత్నాలు జరిగాయి. ఇది కష్టంతో కూడుకున్న వ్యవహారం. ఎందుకంటే కొన్ని నదుల ప్రవాహ దశలో తరచూ మార్పులు వచ్చాయి. కాలక్రమంలో అవి సరిహద్దులను, నైసర్గిక లక్షణాలను మార్చివేసి ఉంటాయి. ఆధునిక స్థలాల పేరుతో ప్రజలను గుర్తించే ప్రయత్నాలు దెబ్బతింటాయి.

రుగ్వేద సమాజం చాలా వరకు సంచార జీవితాన్ని కలిగి ఉన్నా వ్యవసాయం గురించి దానికి తగిన అవగాహన ఉండేది. పశువులు, అశ్వాల సంఖ్యను లెక్కించి సంపదను నిర్ధారిస్తారు. (పశువులను అత్యంత విలువైన సంపదగా పరిగణించేవారు. అయితే వాటిని సమకూర్చుకోవడం చాలా కష్టంతోకూడుకున్న పని.) రథాలు, బంగారు, బానిస బాలికలు (దాసిలు) కూడా సంపద కిందే వస్తాయి. కానుక సమర్పణను శ్లాఘించే దానస్తుతి గేయాలలో

వీటి ప్రస్తావన ఉంది. పశువులు ప్రధాన సంపద కావడంతో పశువుల అపహరణ ధనాన్ని పెంచుకునేందుకు ప్రధాన రూపంగా ఉండేది. దీనితోపాటు పశువుల పెంపకాన్ని కూడా చేపట్టేవారు. పశువులను మేపే సమాజాలలో ఇది సాధారణమైన విషయం. సరస్వతి నది తీరాలు మేత పచ్చికతో నిండుగా ఉండేవని వర్ణించబడింది. అయితే ప్రవాహ దిశలో మార్పుల కారణంగా ఈ ప్రాంతం నుండి సింధూ–గంగా నీటి ప్రవాహ ప్రాంతానికి, అలాగే ఎగువ ద్వినది ప్రాంతానికి వలసలు జరిగినట్లు బోధపడుతోంది.

సంచార జీవన విధానం ఏకాకిగా ఉండజాలదు. రైతులతో సంబంధం దానికి అవసరం. అలాంటి సంబంధం పురావస్తు, సాహిత్య ఆధారాలను బట్టి సాధ్యమేనని తెలుస్తుంది. ఆ సమయంలో ఉత్తర భారతదేశానికి చెందిన రెండు వర్గాలు వేర్వేరు భాషలను కలిగి ఉంటాయి. వ్యవసాయానికి సంబంధించిన అనేక పదాలు ఆర్యేతర భాషకు చెందినవి కావడం ఆసక్తికరమైన విషయమే.

రుగ్వేద కాలంలో గుర్తింపు (వ్యక్తిత్వం) వ్యక్తి జన్మించిన "జన" (తెగ)కే ఉండేది. గుర్తింపు సూచికగా జన్మ కీలక ప్రాముఖ్యతను సంతరించుకుంది. జన కంటే చిన్న భాగమైన 'విస్' బహుశా ఒక కుదురుకు సంబంధించినదై ఉంటుంది. కుదురుల నిర్మాణ స్వరూపంలో "రాజా"కు పాలక కుదురు స్థాయి ఉండేది. అయినప్పటికీ "రాజా" కొన్నిసార్లు కుదురు పేరును కలిగి ఉండేవాడు. రాజా అనే విషయం "రాజు" కంటే ముఖ్యుడు (పెద్ద) అన్న అర్థాన్ని ఇస్తుంది. కొన్ని కుటుంబాల సమాహారాన్ని "గ్రామం"గా పరిగణించేవారు. తదుపరి కాలంలో అది గ్రామం (పల్లె) అనే అర్థాన్ని తెచ్చుకుంది.

తొలుత సమాజం స్థూలంగా రెండు వర్ణాలుగా విభజితమై ఉండేది. ఒకటి ఆర్యవర్ణ, రెండవది దాస వర్ణ. ఈ రెండు వర్ణాలను రుగ్వేదంలో ప్రస్తావించారు. దాస అనే పదం కొన్నిసార్లు సంబంధిత వ్యక్తుల దేహ లక్షణాలతో ముడిపడి ఉండేది. అయితే ఆర్య అనే పదం సాధారణంగా గౌరవనీయమైన వ్యక్తిని సూచించేది. ఆ పదం జాతి అనే ప్రత్యేక అర్థాన్ని స్ఫురించదు. ఆర్య, దాస అనే పదాలను కొన్నిసార్లు ప్రతీకాత్మకంగా ఉపయోగించి ఉండవచ్చు. తదుపరి వైదిక గ్రంథాలు నాలుగు సుపరిచితమైన వర్ణాలను – బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, సూద్ర – ప్రస్తావిస్తాయి.

**మలి వైదిక దశ**

మలి వైదిక గ్రంథాలు మరింత విశాలమైన భూభాగాన్ని ప్రస్తావిస్తాయి. అందులో పశ్చిమ గంగ మైదాన ప్రాంతం, మధ్యగంగ మైదాన ప్రాంతం కూడా ఉన్నాయి. తూర్పు వైపు రెండు మార్గాలలో విస్తరణ జరిగింది. (1) హిమాలయ పర్వత పాదాలు. ఈ మార్గం తర్వాతి కాలంలో ఉత్తరపథగా పేరుగాంచింది (2) యమున, గంగా తీరాల వెంబడి దక్షిణ మార్గం.

దక్షిణం వైపు వెళ్లే ఈ మార్గం తర్వాతి కాలంలో దక్షిణాపథంగా పేరు పొందింది. ద్వీపకల్పం, గంగాలోయల మధ్య ఈ మార్గం వారధిగా ఉండేది. ఇంతటి విశాలమైన భూభాగం గురించి పరిచయం ఉందంటే దానర్థం కొత్త విభిన్నమైన వాతావరణాలతో ప్రజలు సర్దుకుపోయారు.

ఉత్తర బీహార్‌ను విస్తృతమైన తడి భూమిగా ప్రస్తావించారు. ఈ ప్రాంతంలోని పూర్వ నివాస ప్రాంతాలను కొన్ని సందర్భాలలో నవీన రాతియుగం నాటి ప్రాచీన కాలాల వరకు తవ్వి తీయవచ్చు. ముఖ్యంగా చిరండ్ అనే క్షేత్రం అత్యంత ప్రాచీనమైనది. అసురుల అంత్యక్రియ ఆచారాలను కొన్ని గ్రంథాలు ప్రస్తావిస్తాయి. అలా అసురులు, ఆర్యుల మధ్య తారతమ్యాన్ని గుర్తిస్తాయి. మిర్జాపూర్ ప్రాంతంలోని భారీ శిలాసమాధులను, సంబంధిత ఆచారాలను గ్రంథాలు పేర్కొని ఉండవచ్చు. మగధలో వ్రాత్యుల విదేశీ సంస్కృతిని కూడా పేర్కొన్నాయి. మధ్యగంగ మైదాన ప్రాంతంలో విభిన్న సంస్కృతులు ఉండేవని దీనిని బట్టి అర్థమవుతుంది.

నివాస ప్రాంతాల విస్తరణ రెండు కారణాలవల్ల సంభవించి ఉండవచ్చు. ఒకటి ఆర్యులు తమ సముదాయంతో విడిపోయి పాత నివాస ప్రాంతాలకు వలసపోయి ఉండవచ్చు. రెండు జనాభా పెరుగుదల విస్తరణకు ప్రేరకంగా నిలిచి ఉండవచ్చు. పాత ప్రాంతాలు కొత్తవాటితో కలిసిపోయి మరింత విశాలమైన ఆవాస ప్రాంతాలను ఏర్పాటు చేసి ఉండవచ్చు. తొలి బూడిద రంగు మట్టి పాత్రల క్షేత్రాలు దాదాపు మూసుకుపోయి చిన్న నివాస ప్రాంతాలుగా ఉన్నాయి.

తొలి, మలి వైదిక గ్రంథాల తులనాత్మక అధ్యయనం సంచార జీవితం నుండి స్థిరమైన వ్యవసాయ జీవనం వైపు క్రమంగా మార్పు రావడాన్ని సూచిస్తుంది. వ్యవసాయం ప్రధాన ఆర్థిక వ్యవస్థగా ఎదిగింది. అయితే పశ్చిమ గంగా మైదానంలో సంచార జాతులు ఎప్పటికీ పూర్తిగా నశించలేదు. కాని ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి ఆర్థిక స్వరూపం భిన్నంగా ఉండేది. ఆ విధంగా మధుర చుట్టూ ఉన్న ప్రాంతం శతాబ్దాల తరబడి సంచార, వ్యాపార జీవితాన్ని కొనసాగించింది. మరోవైపు మధ్యగంగా మైదాన ప్రాంతంలో సంచార జీవితానికి సంబంధించిన ఆధారాలు పరిమితంగా ఉన్నాయి. పరోక్ష ఆధారాల నుండి ఆర్థిక వ్యవస్థలో వచ్చిన మార్పును అర్థం చేసుకోవచ్చు. ప్రత్యేకమైన సందర్భాలలో పశువులకు సంబంధించిన వ్యాఖ్యానాలు కొన్నే ఉన్నాయి. కొన్ని సందర్భాలలో ధాన్యానికి సంబంధించిన వర్ణనలు ఎక్కువగా ఉన్నాయి. దీనిని బట్టి రాజసుయ లాంటి బలిదాన ఆచారాలలో పాలతో చేసిన పదార్థాల సంతర్పణ చాలా తక్కువగా ఉండేదని, వ్యవసాయ ఉత్పత్తుల నుండి గ్రహించిన పదార్థాలనే ఎక్కువగా వాడేవారని తెలుస్తుంది.

వ్యవసాయం అంటే భూమిపై, నీటి పారుదల వ్యవస్థలపై కొంత నియంత్రణను తప్పక సూచిస్తుంది. ఉత్తర బీహార్ వరి సాగు వర్ణనలో తిండి గింజలను ప్రస్తావించారు. సహజ రుతువులవల్ల కలిగే వర్షాల ఆధారంగా సంవత్సరానికి ఒకసారి వరిని పండించే అవకాశం ఉండేది. వర్షాలు తగిన మోతాదులో వ్యవసాయానికి నీటిని అందించేవి. మధ్య

గంగ మైదానంలో తడినేలలను ఎండబెట్టాల్సి వచ్చేది. దానికి శ్రమ అవసరం. తడి వరి సాగు కూడా శ్రమ భరితమైనదే. అలాంటి కార్యకలాపాలకు తగిన సంఖ్యలో కార్మికులే కాకుండా కార్మికులు, వారిని నియంత్రించే వారి మధ్య సామాజిక ఎడబాటు కూడా అవసరమైంది. దీనర్థం సమాజంలో తక్కువ సంఖ్యలో ఉన్న శక్తిమంతులు పెద్ద సంఖ్యలో ఉన్న ప్రజలను తమ కోసం పని చేయాలని ఆదేశించగలిగేవారు.

ఈ మార్పులు సమాజంలోని ఇతర మార్పులపై కూడా ప్రభావం చూపాయి. వైదిక ఆధారాలలో కుల మూలాలను సాధారణంగా పరిశీలిస్తారు. వేదాలు పేర్కొనే సమాజాన్ని కూడా అందుకు తార్కాణంగా చూపుతారు. ఎందుకంటే వర్ణాలకు సంబంధించిన తొలి వ్యాఖ్యానాలు ఈ గ్రంథాల నుండే వచ్చాయి. సమాజం యొక్క మరింత సంకీర్ణమైన స్వభావం మలివైదిక గ్రంథాలలో ప్రస్ఫుటమవుతుంది. అందులో చతుర్వర్ణాల ప్రస్తావన ఎక్కువగా ఉంది. ఈ నాలుగు వర్ణాలను ప్రస్తావించడమే కాకుండా వాటికి సంబంధించిన వివిధ కర్తవ్యాలను, నిర్మాణ స్వరూపాన్ని కూడా వివరించాయి. సామాజిక వర్గీకరణ స్వరూపంగా వర్ణ అనే సిద్ధాంతాన్ని జాతి లాంటి ఇతర వర్గీకరణ స్వరూపాల నేపథ్యంలో కూడా చూడవచ్చు. తదుపరి కాలంలో వెలువడిన సాహిత్యంలో, మరీ ముఖ్యంగా బ్రాహ్మణేతర గ్రంథాలలో జాతి గురించిన ప్రస్తావన తరచూ కనబడుతుంది. వర్ణ, జాతులకు ఉన్న నిర్దిష్టమైన సామాజిక పాత్రపై విద్వాంసుల మధ్య అభిప్రాయభేదాలు ఉన్నాయి.

వేదసాహిత్యం, ఇండో–ఐరోపా మూలాలకు అవతల కుల ఆవిర్భావం గురించి అధ్యయనం చేయాలి. వాతావరణానికి సంబంధించిన అంశాలు, రాజత్వ స్వరూపాలు, ఆర్థిక వనరుల అందుబాటు, మత సిద్ధాంత పాత్రలను పరిశోధించాలి. ఇవన్నీ కుల వ్యవస్థ ఏర్పాటులో కీలక పాత్ర పోషించాయి. కుల వ్యవస్థ మూలాలు వైదిక గ్రంథాలలో వర్ణించిన సమాజాల కంటే ఎంతో పురాతనమైనవి. ఉత్తర భారతదేశంలో జరిపిన తవ్వకాల వల్ల మనకు ఈ విషయం తెలిసింది. కనుక కులం, దాని చరిత్రపై ఉన్న పాత ప్రామాణిక గ్రంథాలను నూతన దృష్టికోణంతో పరిశీలించాల్సి ఉంటుంది. ఇటీవలి అధ్యయనాలు (కులంపై) కొత్త సూత్రీకరణలను ప్రవేశపెట్టడానికి ప్రయత్నించాయి. ముఖ్యంగా కులాన్ని భారతీయ సామాజిక సంఘటనంగా వీక్షించేందుకు కృషి చేశాయి. కాలక్రమంలో కులం విస్తరించిందని ప్రతిపాదించాయి. కొందరు విద్వాంసులు రాజత్వం యొక్క అంతర్గత చలనాలను ఎత్తిచూపారు. జాతి కార్యనిర్వహణకు రాజత్వం అత్యంత ముఖ్యమైనది. తర్వాతి కాలంలో కూడా అది కొనసాగింది.

జాతి తన మూలాలైన జన్ (జన్మించబోయే వాడు) నుండి అర్థాన్ని గ్రహించింది. కనుక రాజత్వ సంబంధాల స్వరూపాలు కుల సంఘటనానికి మౌలికంగా ముఖ్యమైన సాధనాలు. ఈ స్వరూపాలకు ప్రాంతీయ వైవిధ్యాలు ఉన్నాయి. రాజ్యపూర్వ తెగలు, దొరతనాలు లాంటి రక్త సంబంధీకుల ఆధారిత సామాజిక వర్గీకరణతో ముడిపడి ఉన్న అంశాన్ని జాతి కలిగి ఉంది. రాజ్యసమాజాలతో ముడిపడి ఉన్న వర్గ విభజనకు ముందు ఇలాంటి ఏర్పాటు ఉండేది. నిర్మాణ స్వరూపం లేదా అలాంటి సముదాయాల చీలిక, కలయిక జాతి స్వరూపాలను ప్రభావితం

చేసి ఉండవచ్చు. దీనికితోడు అధికార క్షేత్రంగా ఉత్పత్తి వనరులపై నియంత్రణను జతచేయవచ్చు. వర్ణాలు చీలిపోవడంతోనే జాతులు ఆవిర్భవించాయని వాదించడం బహుశ మరీ తేలిపోయే విధంగా ఉంది. వర్ణ, జాతి అనే రెండు వ్యవస్థలను ఒకే చట్రంలో ఇరికించినట్లు కనబడుతోంది.

"జన"లు రుగ్వేద కాలం నాటివి. కురులు లేదా పాంచాలులు లాంటి వ్యక్తిగత జనలు సంకీర్ణం లేదా సమాఖ్యవల్ల ఉద్భవించాయని తదుపరి గ్రంథాలలో వ్యాఖ్యానాలు ఉన్నాయి. వేదాలలోని "రాజ" క్రమంగా రాజుగా పరిణామం చెందాడు. ఈ ప్రక్రియలో రాజన్య క్షత్రియగా పరివర్తనం చెందాడు. "క్షత్ర" లేదా అధికారం అనే పదంలో "క్షత్రియ" అనే విషయానికి మూలాలు ఉన్నాయి. మలి వైదిక గ్రంథాలలో క్షత్రియ అనే పదం తరచూ కనబడుతుంది.

రాజసూయ, అశ్వమేధం, వాజపేయి లాంటి బలిదాన కర్మకాండలతో కూడా అధికారం ముడి పడి ఉంది. ఈ కర్మకాండల ద్వారే రాజ దైవత్వంతో తన సంబంధాన్ని చాటుకొనేవాడు. సమాజంలో మిగతా ప్రజలకంటే భిన్నమైన ఆకర్షణీయమైన లక్షణాలను పుణికి పుచ్చుకున్నాడు. ఈ కర్మకాండలు బ్రాహ్మణుల అధికారాన్ని కూడా పెంచాయి. రాజు, పురోహితుని మధ్య సమతుల్యం కొన్నిసార్లు స్పష్టంగా ఉండేది కాదు. అయితే బ్రాహ్మణుల వైపే అధికార సమతుల్యం మొగ్గు చూపినట్లు కనిపిస్తుంది. అధికారాన్ని కేంద్రీకరించడానికే ఇలాంటి కర్మకాండలను నిర్వహించే వారు. తర్వాతి దశలో అది రాజత్వానికి దారి తీసేది. అధికార ప్రతిబింబం జనపదలో కనిపిస్తుంది. జనపద అంటే జనతో సంబంధం ఉన్న ప్రాంతం. దానిని పాలక క్షత్రియ కులం (కుదురు) పేరున నామకరణం చేసేవారు.

తొలి సాహిత్య ఆధారాలలో వివరించబడిన సమాజాలు కూడా దొరల ప్రాంతాలతో పోల్చబడ్డాయి. వాటిలోకొన్ని రాజులు పాటించే రాజ్యాలుగా ఎదిగాయి. తొలి రాజ, రాజన్య, తర్వాతి క్షత్రియ, రాజుల మధ్య తేడాలను వారి నేపథ్యాలను బట్టి అర్థం చేసుకోవచ్చు. రాజ్యాలకు భిన్నమైన దొరల ప్రాంతాలు రాజ్యానికి పూర్తిగా భిన్నంగా ఉండేవి కావు. ఎందుకంటే దొరల ప్రాంతాలకు చెందిన కొన్ని రాజ్యాలలో పూర్తిగా అభివృద్ధి చెందాయి. కప్పాన్ని వసూలు చేశారు కాని రాజ్యాలలో క్రమబద్ధ పన్ను చెల్లింపుల రూపంలో కాదు. మత, రాజకీయ సంస్థలు ప్రజలపై సమర్థవంతమైన నియంత్రణతో విధులు నిర్వహించాయి. వనరులపై నియంత్రణ పూర్తి స్థాయిలో ఉండేది కాదు. ఎందుకంటే వనరులను వ్యక్తిగత సంపద కంటే వారసత్వ సముదాయం యొక్క ఉమ్మడి ఆస్తిగా పరిగణించేవారు. ఈ సముదాయం తన సంబంధాలను రాజత్వం ద్వారా నిర్ధారించుకునేది. అధికారానికి చట్టబద్ధత కల్పించడం కూడా ఈ కాలంలో విస్తృతమైంది.

ఆ విధంగా వైదిక కాలం కుదురు వ్యవస్థ నుండి ఉమ్మడి కుదురు, గృహస్త ఆర్థిక వ్యవస్థ వైపు మార్పును చవిచూసింది. వైదికానంతర కాలంలో మధ్యగంగ లోయలోని దొర ప్రాంతాల తీవ్ర విభజన పాక్షికంగా కుదురు వ్యవస్థ కొనసాగింపునే ప్రతిబింబించింది. అయితే రాజ్య ఏర్పాటును ప్రోత్సహించే ధోరణులతో కూడా దగ్గరగా ముడిపడి ఉంది.

# II

# తొలి చారిత్రక యుగం
# రాజకీయ చరిత్ర

4

# మౌర్య పూర్వకాలం

**నేపథ్యం :**

క్రీ.పూ. 600 నుండి 325 వరకు ఉన్న కాలాన్ని సాధారణంగా భారతదేశ చరిత్రలో ప్రధాన ఘట్టంగా పరిగణిస్తారు. ఉత్తర భారతదేశం, ముఖ్యంగా మధ్య గంగా లోయ (పశ్చిమంలో అలహాబాద్ నుండి తూర్పున భాగల్‌పూర్ వరకు ఉన్న ప్రాంతం) రాజకీయ, సామాజిక, ఆర్థిక, మత, సాంస్కృతిక రంగాలలో భవిష్యత్ పర్యవసానాలు గల మార్పులను చవిచూశాయి.

యజ్ఞాలు శాసించే మత జీవనం, బ్రాహ్మణ పురోహితుల ఆధిపత్యాన్ని సవాలు చేస్తూ ఈ కాలంలో అనేక ఏకేశ్వరోపాస మతాలు (సాత్విక పూజా పద్ధతులను పాటించే బృందాలు) ఆవిర్భవించాయి. వాటిలో ప్రధానమైనవి జైన, బౌద్ధ మతాలు. మత జీవనంలో ఈ కొత్త పోకడలు ప్రాదేశిక రాజ్యాల ఆవిర్భావంతో సమకాలికంగా ఉన్నాయి. రాచరిక, రాచరికేతర రాజ్యాలు వివిధ పరిమాణాలతో భారతీయ చరిత్రలో తొలిసారి ఏర్పడ్డాయి.

పురోగమిస్తున్న వ్యవసాయం, నాణేల చెలామణి భౌతిక జీవనాన్ని నిర్ధారిస్తాయి. ఈ కాలంలో వరి ముఖ్యమైన పంటగా ఉండేది. దుక్కిదున్ని విత్తిన తర్వాత నాట్లు వేసే పద్ధతిని ప్రవేశపెట్టారు. విభిన్నమైన హస్తకళలు, వాణిజ్య కార్యకలాపాలు విస్తరించాయి. అయితే అన్నింటి కంటే ప్రాధాన్యత గల అంశం గంగాలోయ, ఉత్తర భారతంలోని కొన్ని ఇతర ప్రాంతాలలో పట్టణ కేంద్రాల ఆవిర్భావం. హరప్పా నాగరిక పతనమైన తర్వాత దాదాపు వెయ్యేళ్లకు ఈ పట్టణాలు వెలిశాయి.

పైన పేర్కొన్న అంశాలు 1950 కంటే పూర్వం అందరికీ తెలుసు. పాలి, బౌద్ధ, ప్రాకృత జైన గ్రంథాలను ఉపయోగించి (పాణిని రచించిన వ్యాకరణ సూత్రావళి అష్టధ్యాయితో సహా) విద్వాంసులు పై నిర్ధారణలకు వచ్చారు. అయితే ఇటీవలి దశాబ్దాలలో అందుకు భిన్నంగా రాజ్యం, పట్టణ కేంద్రాల ఆవిర్భావాలను మారిన పరిస్థితిని అర్థం చేసుకోవడానికి కీలక అంశాలుగా గుర్తించారు. సాధారణ సమాజం మరింత సంకీర్ణ దశకు పరివర్తనం చెందడంతో రాజ్య, పట్టణ కేంద్రాల ఏర్పాటు రెండూ ముడిపడి ఉన్నాయని భావిస్తారు.

బౌద్ధ, జైన గ్రంథాలను క్షుణ్ణంగా పరిశీలిస్తే కొత్త మతాలు పట్టణ కేంద్రాలు, పట్టణ జనాభా వైపే మొగ్గు చూపాయన్న భావన కలుగుతుంది. అవి వైదిక మత ఆచారాలపై

దృష్టి సారించలేదు. మరోవైపు ఈ వైదిక ఆచారాలు, నగరాలను శాశ్వత అధ్యయన రహిత కేంద్రాలుగా పరిగణించేవి. (అధ్యయన రహిత అంటే వేద గ్రంథాల పఠనం లేకపోవడం, వైదిక సాంప్రదాయాన్ని తృణీకరించడం) బౌద్ధ గ్రంథాల ప్రకారం పట్టణ ప్రాంతాలలో పాలకుని, వ్యాపారుల నివాసాలు కలిగి ఉండేవి. గహపతి అంటే పాలకుడు. (వ్యవసాయం నుండి అపార సంపదను కూడబెట్టిన ఒక కొత్త సామాజిక వ్యవస్థ గహపతి) శెట్టి అంటే ధనిక వ్యాపారి. వీరిద్దరూ బౌద్ధ సంఘానికి ముఖ్యమైన పోషకులు, దాతలు.

నూతన సాంస్కృతిక ఆచారాలు, ముఖ్యంగా బౌద్ధ, జైన మతాల ఆవిర్భావం తర్వాత, రాజకీయ, సామాజిక – ఆర్థిక పరిస్థితులలో వచ్చిన ఈ మార్పులతో దగ్గరగా ముడిపడి ఉండడం ఎలాంటి ఆశ్చర్యానికి గురి చేయదు. చతుర్వర్ణ వ్యవస్థను తీవ్రంగా వ్యతిరేకించి సమసమాజాన్ని స్థాపించేందుకు బుద్ధుడు ప్రయత్నించాడన్న గౌరవ భావన ఇప్పుడు చాలా వరకు సవరించబడింది.

పురోహిత బ్రాహ్మణ సముదాయం యొక్క కర్మకాండల ఆధిపత్యానికి వ్యతిరేకంగా బుద్ధుడు తీసుకున్న వైఖరిని చాలా సమగ్రంగా ఉల్లేఖించారు. కేవలం జన్మకారణంగా ఒకరు బ్రాహ్మణుడు కాలేదని ప్రకటించడం ద్వారా బుద్ధుడు సమాజంలో వర్ణస్థాయిని నిర్ధారించేందుకు ప్రధాన ప్రాతిపదికగా జన్మను తీసుకోవడాన్ని సవాలు చేసినట్లు కనబడుతోంది. పాలి సాహిత్య అధ్యయనాలు కూడా సంఘం పరిధిలో జాతి, వర్ణ వర్గీకరణలను బుద్ధుడు వ్యతిరేకించాడని సూచిస్తాయి. అయితే సంఘం వెలుపల ఉన్న సమాజం మరింత సంకీర్ణమైనదని, విభజితమైనదని బుద్ధుడు గుర్తించాడు.

ఇటీవలి పరిశోధనలు రక్తం, వారసత్వం యొక్క స్వచ్ఛతను బుద్ధుడు నొక్కి చెప్పాడని చెబుతాయి. బ్రాహ్మణుడిపై క్షత్రియుడి ఆధిపత్యాన్ని ప్రతిపాదించాడు. సమాజాన్ని రెండు విశాలమైన వర్గాలుగా విభజించాడు. అవి ఉక్కత్థ లేదా హీనకమ్మ,ఉక్కత్థలో ఖత్తియ, బహమన, గహపతి వస్తారు. కమ్మ కిందికి ఉన్నత వృత్తి నిర్వహించే వారు. హస్తకళాకారులు సిప్ప కిందికి వస్తారు. హీన కిందికి చండాల, నిషాద, వేన, పుక్కుస, రథకర వస్తారు. తర్వాత హీన కమ్మలు, హీన సిప్పలు వస్తారు. భౌతిక పరిస్థితులు, వాస్తవ స్థాయి, వ్యక్తి యొక్క రాజకీయ పరపతిని బౌద్ధ గ్రంథాలు పరిగణనలోకి తీసుకుని (సమాజంలో అతడి స్థాయిని నిర్ధారించినట్లు) ఈ అధ్యయనాలలో వెల్లడైంది.

**రాజ్య అవతరణ**

ఇటీవలి చరిత్రశాస్త్ర పోకడలు నగరాల ఏర్పాటు, ప్రాదేశిక రాజ్యాల అవతరణ మధ్య సన్నిహిత సంబంధాలను నొక్కి చెప్పాయి. ముఖ్యంగా గంగాలోయలో జనపదలు, మహాజనపదలు ఆవిర్భవించాయి. పట్టణ కేంద్రాల వలె ప్రాదేశిక రాజ్యాలు (చాలా వరకు రాచరికమైనవి) అనువంశిక వారసత్వం, సుశిక్షిత సైన్యం, వృత్తిపర పాలనాధికారులు, రెవెన్యూ యంత్రాంగంతో కేవలం ఉత్తర భారతంలోనే వెలిశాయి. దక్కను లేదా దక్షిణ లోపలి భూభాగాలకు ప్రాదేశిక రాజ్యాలు చొచ్చుకుపోలేదు.

రాజ్య రాజకీయ వ్యవస్థ ఆవిర్భావంతో సాంప్రదాయ తెగ లేదా వంశ ఆధారిత రాజకీయ వ్యవస్థలపై తీవ్రమైన ఒత్తిడి పెరిగింది. ఇలాంటి వ్యవస్థలలో సాధారణ సంఘటనం, భౌతికపరమైన విషయాలలో తక్కువ అసమానతలు ఉండేవి. ఉత్తర భారతదేశంలో, ముఖ్యంగా గంగాలోయలో వ్యవసాయోత్పత్తులను భారీ స్థాయిలో పండించే సామర్థ్యం ఎక్కువగా ఉంటే అందుకు తగిన రాజకీయ- పరిపాలనా వ్యవస్థ కూడా ఉండేది. ఈ వ్యవస్థ వ్యవసాయరంగంపై పన్ను లేదా వాటా విధించేది. ఆ విధంగా సమకూర్చుకున్న మిగులు ధాన్యాలు గ్రామీణేతర ప్రాంతాలలో స్థిరపడ్డ హస్తకళాకారులు, వ్యాపారులు, పాలకులు, అధికారుల అవసరాలను తీర్చడానికి, వ్యవస్థను కొనసాగించడానికి దోహదపడ్డాయి.

పాలకుడు, అతడి అధికారులు తదుపరి దశలో కొన్ని విలాస లేదా ప్రతిష్టాత్మకమైన ఉత్పత్తులను కోరుకొని ఉంటారు. సాధారణంగా అలాంటి ఉత్పత్తులు లేదా వస్తువులు స్థానికంగా అందుబాటులో ఉండేవి కావు. సమాజంలోని పాలక, నవీన ధనిక వర్గాలకు విలాస వస్తువులను సమకూర్చే ప్రక్రియ వాణిజ్యం, వ్యాపార కూడళ్ల అభివృద్ధిని ప్రోత్సహించింది. సహజ సరిహద్దులు లేదా అడ్డంకులు లేని మైదాన ప్రాంతం (ఉత్తర భారతదేశంలో) వ్యాపారుల సంచారానికి, సరుకుల రవాణాకు, మత నాయకుల ప్రచారానికి ఎంతో అనుకూలంగా ఉండేది. క్రీ.పూ. 6-5 శతాబ్దాలకు చెందిన అనేక పట్టణ కేంద్రాలు ముఖ్యమైన వాణిజ్య మార్గాలకు కూడళ్లుగానే కాకుండా రాజకీయ, ఆర్థిక, మతపరమైన కార్యకలాపాలకు కీలక స్థావరాలుగా మారాయి. కనుక పట్టణ కేంద్రాలు, ప్రాదేశిక రాజ్యాల ఆవిర్భావాన్ని సమకాలీన, పరస్పర సంబంధిత ప్రక్రియలుగా కనిపిస్తాయి. ఈ ప్రక్రియల కారణంగా ఉత్తర భారత సమాజం సాధారణ స్థాయి నుండి మరింత సంకీర్ణమైన దిశకు పరివర్తనం చెందింది.

**సోలశ మహాజనపదలు :**

క్రీ.పూ. ఆరవ శతాబ్దం తొలియార్థంలో అంటే బౌద్ధం ఆవిర్భవించకముందు - ఉత్తర భారతంలో పదహారు విశాలమైన ప్రాదేశిక రాజ్యాలు ఉండేవి (సోలశ మహాజనపదలు). అంగుత్తర నికాయ అనే బౌద్ధకృతి ప్రకారం ఈ 16 రాజ్యాలు ఇలా ఉన్నాయి : అంగ, మగధ, కాశి, కోసల, వృజ్జి (వజ్జి), మల్ల, చేది, వత్స (వంశ), కురు, పంచాల, మత్స్య (మచ్ఛ), సురసేన, అస్మక (అస్సక), అవంతి, గాంధార, కంబోజ. దిఘనికాయ అనే గ్రంథం కొన్ని రాజ్యాలను జంటలుగా ప్రస్తావించింది. అవి కాశి-కోసల, వృజ్జి-మల్ల, చేది-వంశ, కురు-పంచాల, మత్స్య-సురసేన. మరో బౌద్ధ ఆధారం (చుల్లనిద్దేశ) ఈ జాబితాకు కళింగ పేరును జత చేసింది. గాంధార స్థానంలో యోన దేశాన్ని చేర్చింది.

**అంగ :** ఆధునిక భాగల్‌పూర్, మోంఘిర్ జిల్లాలతో కూడిన ఈ రాజ్యాన్ని చంపానది మగధ నుండి వేరు చేసింది. దీని రాజదాని చంపా (గతంలో దీనిని మాలిని అని పిలిచేవారు) చంపా, గంగా నదుల సంగమం తీరాన వెలిసింది. భారతదేశంలోని ఆరు మహానగరాలలో ఒకటిగా పరిగణించబడిన చంపా వ్యాపార, వాణిజ్యాలకు పెద్ద కేంద్రంగా ఉండేది. ఇక్కడి ఓడరేవు నుండి వ్యాపారులు సువర్ణభూమికి ప్రయాణం కట్టేవారు. రాజ్యంలోని మరో రెండు ప్రధాన పట్టణాలు భద్దియ (భద్రిక), అస్సాపుర (అశ్వపుర). అంగ రాజ్య వైభవం క్రీ.పూ. ఆరవ శతాబ్దం మధ్యలో క్షీణించింది. అప్పుడు అంగను పాలించిన చివరి స్వతంత్ర పాలకుడు

బ్రహ్మదత్తను బింబిసారుడు హత్య చేసి ఆ రాజ్యాన్ని ఆక్రమించాడు. అప్పటి నుండి అంగ ఒక స్వతంత్ర రాజ్యంగా తన అస్థిత్వాన్ని కోల్పోయి విస్తరిస్తున్న మగధ రాజ్యంలో అంతర్భాగంగా ఉండిపోయింది.

**మగధ :** ఆధునిక పాట్నా, గయా జిల్లాలు (బీహార్) కీలక ప్రాంతంగా ఈ రాజ్యం ఆవిర్భ వించింది. రాజ్‌గిర్ సమీపంలోని గిరివ్రజ తొలి రాజధాని. గయలోని కొండ ప్రాంతాలలో అది ఏర్పాటైంది. తర్వాత రాజధానిని రాజగృహకు, చివరగా పాటలీపుత్రకు తరలించారు. వేద సాహిత్యంలోను, పురాణాల్లోను మగధను పాలించిన అనేక మంది రాజుల గురించి ప్రస్తావన ఉంది. ఈ ఆధారాల ప్రకారం మగధ తొలి పాలకవంశాన్ని జరాసంధుని తండ్రి బృహద్రత స్థాపించాడు. ఈ వంశం క్రీ.పూ. ఆరవ శతాబ్దం చివరలో పతనమైంది.

**కాశి :** తొలినాళ్లలో ఈ రాజ్యం అత్యంత బలశాలిగాను, సంపన్నంగాను ఉండేది. నగరానికి ఉత్తర, దక్షిణ దిశలలో ప్రవహించిన వరుణ, ఆసి అనే నదులు రాజధాని నగరమైన వారణాసి అనే పేరును ఇచ్చాయి. కాశికి చెందిన బ్రహ్మదత్త కోశల రాజ్యాన్ని జయించినట్లు అనేక జాతక కథలు పేర్కొంటాయి. ఈ రాజ్యం ఎంతో కీలకమైన ప్రాంతంలో ఉండేది. పొరుగు రాజులు దానిని జయించడానికి ఎక్కువ ఆసక్తి చూపేవారు.

**కోసల :** కోసల రాజ్యం ఆధునిక అవధ్ ప్రాంతంలో ఏర్పాటైంది. తూర్పున సదానీర (గండక్) నది, పశ్చిమాన పంచాల, దక్షిణాన సర్పిక, ఉత్తరాన నేపాల్ కొండలతో చుట్టుముట్టబడి ఉండేది. దాని తొలి రాజధాని అయోధ్య. బుద్ధుని కాలం నాటికి ఈ నగరం ప్రాధాన్యత లేని పట్టణంగా దిగజారింది. అయోధ్యకు పొరుగున ఉన్న సాకేత్ ప్రాముఖ్యతను సంతరించుకుంది. తదుపరి కాలంలో స్రావస్తి (సాహేత్-మాహేత్) రాజధానిగా మారింది. ఈ నగరం యునైటెడ్ పావిన్సెస్‌లోని గోండా, బహ్‌రెయిచ్ జిల్లాల సరిహద్దుల్లో ఏర్పాటైంది. సేతవ్య, ఉక్కత్థ, కీటగిరి అనే ప్రధాన పట్టణాలు ఈ రాజ్యంలో ఉండేవి. కాశిని స్వాధీనం చేసుకోవడంతో కోసల శక్తివంతమైన రాజ్యంగా ఎదిగింది. గోమతి తీరాన ఉన్న కేశపుట్ట పాలకులు కోలియులు,నేపాలీ తరాయిలోని కపిలవస్తు పాలకులు సాక్యులపై ఆధిపత్యం సాధించింది. బుద్ధుడి జననానికి 150 ఏళ్ల ముందే కాశి, కోసల రాజ్యాల మధ్య ఆధిపత్యపోరు మొదలైంది. కంసుని పాలనలో కోసల విజయం సాధించడంతో ఈ సంఘర్షణకు తెరపడింది. బుద్ధుడి సమకాలికుడైన కోసల రాజు ప్రసేన్‌జీత్ (పసేనాడి), మగధ రాజు అజాతశత్రువుల మధ్య మరోసారి సుదీర్ఘ పోరాటం జరిగింది. బుద్ధునిపట్ల ప్రసేన్‌జీత్ గౌరవాభిమానాలు చూపేవాడు. అయితే బ్రాహ్మణులను కూడా గొప్పగా పోషించాడు. ఈ కాలానికి చెందిన గొప్ప పాలకులలో ప్రసేన్‌జిత్‌ది ఆకర్షణీయమైన వ్యక్తిత్వం అనడంలో ఎలాంటి సందేహం లేదు. అతడికి వారసుడైన విదూదబ సాక్య రాజ్యంపై దాడి చేసి తన తల్లిని మోసం చేసిన సాక్య పాలక వంశంపై ఘోరంగా పగ తీర్చుకున్నాడు. అప్పటి వరకు ఎంతో స్వేచ్ఛను అనుభవించిన ఆ వంశం దాదాపు తుడిచిపెట్టుకుపోయింది. కోసల రాజ్యం కూడా తన స్వాతంత్ర్యాన్ని కోల్పోయి మగధ సామ్రాజ్యంలో అంతర్భాగంగా మారింది.

**వృజ్జి :** గంగానదికి ఉత్తరాన గల ఈ రాజ్యం నేపాల్ కొండల వరకూ విస్తరించి ఉండేది. వృజ్జి సమాఖ్యలో ఎనిమిది పాలక వంశాలు (కుదురులు) ఉండేవి. వాటిలో ముఖ్యమైన

వారు విదేహులు, లిచ్ఛావీలు, జ్ఞాత్రికాలు, వజ్జీలు. విదేహుల రాజధాని మైథిల. నేపాల్‌లోని చిన్న పట్టణమైన జనక్‌పూర్‌గా ఈ రాజధానిని గుర్తించారు. నేటి ఉత్తర బీహార్‌లోని ముజఫర్‌పూర్ జిల్లాలోని బానర్హ్ లిచ్ఛావీల రాజధాని వైశాలిగా కొనసాగింది. వృజ్జీ సమాఖ్యకు ఈ నగరం ప్రధాన కేంద్రంగా ఉండేది. మహావాగ్గ అనే గ్రంథం వైశాలిని అత్యంత సంపన్నమైన, జనసాంద్రమైన పట్టణంగా కీర్తించింది. రామాయణంలో కూడా ఈ నగరానికి సంబంధించిన కీర్తనలు ఉన్నాయి. జ్ఞాత్రికలకు కుండాపుర (కుండగ్రామ), కొల్లగ(వైశాలి సరిహద్దులలో) ప్రధాన అధికార కేంద్రాలుగా ఉండేవి. ఈ వంశంలోనే సిద్ధార్థ, అతడి కుమారుడు మహావీరలు జన్మించారు. లిచ్ఛావీలు లాగా వైశాలి నగరంతో ముడిపడి ఉన్న వృజ్జీలు లేదా వజ్జీల గురించి పాణిని ప్రస్తావించాడు. సమాఖ్యలోని ఇతర ప్రజలు – ఉగ్ర, భోగ, కౌరవ, ఐక్షవాక – వైశాలికి పొరుగున జీవించారు. మల్ల, కోసల రాజులతో స్నేహ సంబంధాలుగల లిచ్ఛావీలు మగధకు వ్యతిరేకంగా సమాఖ్యను ఏర్పాటు చేశారు. తొమ్మిది మంది మల్ల రాజులు, 18 మంది కాశీ–కోసల గణరాజులు ఈ సమాఖ్యలో కొనసాగారు. పురాణాల ప్రకారం వైశాలి వాసులు బింబిసారుని పాలనలో మగధపై దాడి చేశారు. అనతి కాలంలోనే లిచ్ఛావీలు, బింబిసారుని మధ్య శాంతి ఒప్పందం కుదిరింది. బింబిసారుడు వైశాలి రాజు చేతకుని కుమార్తె చెల్లనను వివాహమాడాడు. అయితే ఈ వియ్యం లిచ్ఛావీలను మగధ సామ్రాజ్యపు ధాటి నుండి కాపాడలేకపోయింది. వైశాలి సమాఖ్యను అజాతశత్రు విజయవంతంగా తుడిచిపెట్టాడు.

**మల్ల :** వృజ్జీ సమాఖ్యకు ఉత్తరాన గల మల్ల రాజ్యం రెండు ప్రధాన భాగాలుగా విభజించ బడి ఉండేది. ఈ భాగాలకు కుసినార, పావ రాజధానులుగా ఉండేవి. కుసినారను ఇప్పటి కాసియాగా గుర్తించారు. ఇది గోరఖ్‌పూర్‌కు తూర్పున 35 మైళ్ల దూరంలో ఉంది. పావను ఆధునిక గ్రామమైన పాదరౌనగా గుర్తించారు. కాసియాకు ఈశాన్యాన 12 మైళ్ల దూరంలో ఈ గ్రామం ఉంది. వజ్జీ సమాఖ్యలాగా మల్ల బహు పాలక వర్గాల రాజ్యంగా ఉండేది. అయితే బుద్ధుని కాలంలో రాచరికం కొనసాగింది. మల్ల, లిచ్ఛావీల మధ్య సంబంధం అస్థిరంగా ఉండేది. ఒకసారి స్నేహ సంబంధాలుంటే మరోసారి సంఘర్షణ తలెత్తేది. బుద్ధుని మరణం వరకు మల్ల రాజులు తమ స్వాతంత్ర్యాన్ని నిలుపుకోగలిగారు. తర్వాతి కాలంలో మగధ సామ్రాజ్యంలోకి పీల్చుకోబడ్డారు. జైన, బౌద్ధమతాలు మల్ల పాలకులలో గొప్ప పోషకులను సమకూర్చుకున్నాయి. మల్ల రాజ్యం గణరాజ్యంగా ఉండేది (republic). పావకు చెందిన మల్ల పాలకులు ఒక కొత్త పార్లమెంటు భవనాన్ని (శాసనమండలి) నిర్మించారు. బుద్ధుడు దానిని లాంఛనంగా ప్రారంభించాడు. కార్యనిర్వాహక అధికారులను పురిసులని పిలిచేవారు. ఆధునిక పోలీసుల వలెవీరు తమ విధులను నిర్వహించేవారు. మల్ల వంశీయుల నుండి ఎందరో గొప్ప బౌద్ధ నాయకులు ఎదిగారు. వారిలో ఆనందుడు, ఉపాలి,అనురుద్ధుడు, దేవదత్తుడు, ఖండసుమనలు ఉన్నారు. బుద్ధునితో ఆధ్యాత్మికంగా చాలా సన్నిహితంగా మెలిగినప్పటికీ బుద్ధుని ప్రత్యర్థి అయిన మహావీరుని పట్ల కూడా మల్ల పాలకులు గౌరవాభిమానాలను కనబరచి తమ విశాల దృక్పథాన్ని చాటుకున్నారు.

**చేది :** చేదిలు లేదా చేటిలుకు రెండు జిల్లా నివాస ప్రాంతాలుండేవి. ఒకటి నేపాల్ పర్వతాలలోను, మరొకటి బుందేల్‌ఖండ్‌లోను ఉండేది. పురాణగాథల ప్రకారం చేది రాజ్యం

జమ్ము సమీపంలో ఉంది. ప్రస్తుత ఉత్తరప్రదేశ్‌లోని బందా సమీపాన గల సుక్తిమతి అనే రాజధాని నగరాన్ని కలిగి ఉంది. మరో ముఖ్యమైన పట్టణం సహజతి. యమున కుడి తీరంలో అది వెలిసింది.

**వత్స :** అవంతికి ఈశాన్యాన యమున తీరంపై వెలసిన వత్స రాజ్యానికి కౌసాంబి (అలహాబాద్ సమీపంలో) రాజధానిగా ఉండేది. వత్స పాలకులలో ఉదయనుడు అత్యంత బలశాలి. అవంతి రాజు ప్రద్యోతతో అతడి వైరం చారిత్రక ఇతిహాసాలలో ప్రధానాంశంగా కొనసాగింది. తొలుత బౌద్ధ మతాన్ని అణచివేసిన ఉదయనుడు బౌద్ధ వ్యవస్థకు చెందిన ప్రముఖ సభ్యుడు పిండోలా సలహా మేరకు ఆ మతానికి గొప్ప సమర్థకునిగా మారాడు. తన కుమారుడికి బోధి అనే పేరు పెట్టాడు. అయితే ఉదయనుడు మరణించిన తర్వాత వత్స రాజ్యం గురించి ఎలాంటి సమాచారం లేదు.

**కురు :** కురు పాలకుల రాజధాని ఇంద్రప్రస్థ. ఇది ఢిల్లీ సమీపాన ఉంది. హస్తినాపురం మరో ముఖ్యమైన పట్టణం. బుద్ధుని కాలంలో కురు రాజ్యాన్ని కొరవ్య అనే తెగ దొర పాలించాడు. అప్పుడు రాజ్యానికి రాజకీయ ప్రాముఖ్యత ఏ మాత్రం ఉండేదికాదు. యాదవులు, భోజులు, పంచాల రాజులతో కురు పాలకులకు వివాహ సంబంధాలు ఉండేవి. తొలుత వారికి రాచరిక వ్యవస్థ ఉండేది. అది క్రమంగా గణరాజ్యానికి దారి తీసింది.

**పంచాల :** ఉత్తరప్రదేశ్‌లోని ఆధునిక బదౌన్, ఫరుక్కాబాద్, బరేలీ జిల్లాలలో విస్తరించిన ఈ రాజ్యం రెండు భాగాలుగా విభాజితమై ఉండేది. ఒకటి "ఉత్తర" లేదా ఉత్తర పంచాల, మరొకటి "దక్షిణ" లేదా దక్షిణ పంచాల. గంగానది ఈ రెండు భాగాల మధ్య విభజన రేఖగా ప్రవహించేది. ఉత్తరకు అహిచ్ఛత్ర రాజధానిగా ఉండేది. (బరేలీ జిల్లాలోని ఆధునిక రామ్‌నగర్‌గా దీనిని గుర్తించారు) దక్షిణకు కంపిల్య లేదా కంపిల్ (ఫరుక్కాబాద్ జిల్లా) రాజధాని. ఉత్తర పంచాలలోని ప్రధాన భూభాగాల కోసం ప్రాచీన కాలంలో కురు, పంచాల పాలకుల మధ్య సుదీర్ఘ పోరాటం జరిగింది. పంచాల తొలి పాలకులలో ఒకడైన దుర్ముఖ ఎన్నో ప్రాంతాలను జయించినట్లు చెబుతారు. రాచరిక వ్యవస్థ కలిగిన పంచాల వాసులు క్రీ.పూ. ఆరు లేదా ఐదవ శతాబ్దంలో రిపబ్లికన్ తరహా ప్రభుత్వాన్ని ఆమోదించారు.

**మత్స్య :** మత్స్య లేదా మచ్ఛ రాజ్యాన్ని ఆధునిక జైపూర్‌తో గుర్తించారు. ఆల్వార్ ప్రాంతమంతటితోపాటు భరత్‌పూర్‌లోని కొంత భాగాన్ని ఆ రాజ్యం కలిగి ఉండేది. దాని రాజధాని విరాటనగరం. జైపూర్ సమీపంలోని ఆధునిక బైరత్ వద్ద ఈ నగరం ఉండేది. మత్స్య రాజులు సాధారణంగా సురసేనులతో జత కలిసి ఉండేవారు. ఒక దశలో మత్స్య చేది రాజ్యంలో ఒక భాగంగా ఉండేది. అంతిమంగా అది మగధ సామ్రాజ్యంలో కలిసిపోయింది.

**సురసేన :** ఈ రాజ్యానికి యమున తీరానగల మధుర వద్ద రాజధాని ఉండేది. గ్రీకు రచయితలు ఈ రాజ్యాన్ని సౌరసెనాయ్‌గా, రాజధానిని మేథోరాగా ప్రస్తావించారు. మధుర పాలకులు యదు లేదా యాదవ కుటుంబానికి చెందిన వారు. వృష్ణీలు, అంధకులు, మహాభోజులు, ఇతర సన్నిహిత తెగలు కృష్ణ– వాసుదేవుడు నాయకునిగా ఒక సంఘాన్ని ఏర్పాటు చేశారు. సురసేనుల రాజు అవంతిపుత్ర బుద్ధుని ప్రధాన శిష్యులలో ఒకడిగా

ఉండేవాడు. రాజు పేరును బట్టి అతడికి అవంతికి చెందిన సామ్రాజ్యవాద కుటుంబంతో సంబంధం ఉండేదని బోధపడుతుంది. మెగస్థనీస్ కాలం వరకు సురసేనులు గౌరవప్రదమైన ప్రజలుగా కొనసాగారు.

**అస్సక :** గోదావరి తీరాన వెలసిన అస్మక లేద అస్సకకు పోటాలి, పోటన లేదా పోదన వద్ద రాజధాని ఉండేది. దక్కనులోని బోధన్‌తో ఈ నగరాన్ని గుర్తిస్తారు. రాజ్యంలో ములక (దీనికి ప్రతిష్టాన లేదా పైథన్ రాజధానిగా ఉండేది), మరికొన్ని పొరుగు జిల్లాలు ఉండేవి. రాజ్యం సరిహద్దులు దక్షిణ అవంతి పరిసరాలను స్పృశించేవి. కౌటిల్యుని అర్థశాస్త్రం మీద వ్యాఖ్యానించిన భట్టస్వామి అస్మకను మహారాష్ట్రతో గుర్తిస్తాడు. ఇతరులు దానిని స్వాట్ లోయలోని అస్సకెనోయ్ రాజ్యంతో గుర్తిస్తారు. అస్మక, ములక రాజ్యాలను ఇక్ష్వాకు నాయకులు, పోదన నగరాన్ని రాచరికముని అస్మక కనుగొన్నట్లు విశ్వసిస్తారు. పోటాలి నగరం ఒక దశలో కాశి రాజ్యంలో అంతర్భాగంగా ఉండేది. అస్సక రాజు అరుణుడు, అతడి మంత్రి నందిసేనుడు కళింగ రాజుపై విజయం సాధించారు.

**అవంతి :** పశ్చిమ భారతదేశంలో ఒక ముఖ్యమైన రాజ్యం అవంతి. అది వింధ్య పర్వతాలకు ఇరువైపులా రెండు భాగాలుగా విడిపోయి ఉండేది. ఉత్తర భాగానికి ఉజ్జయినీ రాజధానిగా ఉండేది. దక్షిణ భాగానికి మహిస్మతి రాజధాని. గంగాలోయ నుండి భరుకచ్ఛ (భరూచ్) వరకు గల రహదారి వెంబడి విస్తరించిన ఈ రాజ్యం వ్యాపార లావాదేవీలు, వాణిజ్య కార్యకలాపాల వల్ల సంపన్నమైంది. ఉజ్జయినీ ఒక గొప్ప వాణిజ్య కేంద్రంగా ఎదిగింది. బుద్ధుని కాలంలో అవంతిని ప్రద్యోత పాలించాడు. వత్స, మగధ, కోసల రాజ్యాలతో అతడి వైరం ఉండేది. పురాణాలలో, బౌద్ధ గ్రంథాలలో చండ శాసనుడిగా వివరించబడ్డ ప్రద్యోత పొరుగు రాజులను అణచివేశాడు. ప్రద్యోత తర్వాత నలుగురు రాజులు పాలించారు. వారిలో నందివర్ధనుడు చివరివాడు. మగధ పాలకుడు శిశునాగ అతడిని ఓడించాడు. ఆ విధంగా అవంతి మగధ సామ్రాజ్యంలో అంతర్భాగమైంది. అది బౌద్ధ మతానికి ప్రధాన కేంద్రంగా వెలసిల్లింది.

**గాంధార :** ఆధునిక పెషావర్, రావల్పిండి జిల్లాలలో విస్తరించిన గాంధార రాజ్యానికి తక్షశిల లేదా ఆధునిక తక్షశిల వద్ద రాజధాని ఉండేది. విద్య, వాణిజ్యానికి అది ప్రధాన కేంద్రంగా కొనసాగింది. క్రీ.పూ. ఆరవ శతాబ్దం మధ్యలో దాని రాజు పక్కుసతి (పుష్కరసరీన్) మగధపాలకుడు బింబిసారుని వద్దకు రాయబారాన్ని పంపాడు. అవంతి పాలకుడు ప్రద్యోతపై యుద్ధం చేశాడు. క్రీ.పూ. ఆరవ శతాబ్ది ద్వితీయార్థంలో గాంధారను పర్షియన్లు స్వాధీనం చేసుకున్నారు. గంధార ప్రజలను ఒకటవ డేరియస్ వేయించిన బెహిస్తున్ శిలాశాసనంలో అఖెమేనియన్ సామ్రాజ్యపు వాసులుగా పేర్కొన్నారు.

**కంబోజ :** సాధారణంగా గాంధారతో కలిసి ఉన్న కంబోజ రజౌరీ లేదా ప్రాచీన రాజాపురలో విస్తరించి ఉండేది. పశ్చిమోత్తర సరిహద్దు రాష్ట్రంలోని హజారా జిల్లాను కలుపుకొని అది కాఫిరిస్తాన్ వరకు విస్తరించి ఉండేది. కాంబోజుల రాజధాని రాజాపుర. ప్రాచీన కాలంలో వీరికి రాచరిక సంవిధానం ఉండేది. తదుపరి కాలంలో సంఘ లేదా రిపబ్లికన్ తరహా ప్రభుత్వం ఏర్పడింది.

**మగధ సామ్రాజ్యవాదం :** క్రీ.పూ. ఆరవ శతాబ్దంలో నెలకొన్న అనుకూల, అస్థిర రాజకీయ చిత్రంలో మగధ రాజ్యం ఒక ముఖ్యమైన పాత్రను పోషించే అవకాశాన్ని చేజిక్కించుకుంది. ఎగువ, దిగువ గంగా మైదాన ప్రాంతంలో మధ్య కీలక ప్రదేశంలో విస్తరించిన ఈ రాజ్యం (నేటి పాట్నా, గయా జిల్లాలు) ఆర్యులు, ఆర్యేతరుల మధ్య సమ్మేళనానికి కేంద్రంగా నిలిచింది. ఇక్కడ కిరాతులు స్థానికంగా బలవంతులు. జాతుల కలయిక వల్ల గొప్ప పోరాటయోధులే కాకుండా లౌకికవాద దృకథం గల ప్రజలు కూడా ఉద్భవించారు. వీరు సర్వజనీన మతాన్ని స్థాపించడంలో శ్లాఘనీయమైన పాత్ర పోషించారు. భారతీయ రాజకీయ వేదికలో మగధ ప్రాముఖ్యత అత్యంత ప్రభావశీలమైన ప్రభుత్వ వ్యవస్థకు నామమాత్రంగా కూడా రుణపడిలేదు.

**హర్యాంకులు :**

**బింబిసారుడు (క్రీ.పూ 547–495):** వివాహ సంబంధాలతో ఇతడు తన అధికారాన్ని, ప్రభావాన్ని సుస్థిరం చేసుకున్నాడు. అతడి పట్టపురాణి కోసలాదేవి. ఈమె కోసల రాజు ప్రసేన్‌జిత్ సోదరి. రెండవ రాణి చెల్లన. లిచ్ఛావీ నాయకుడు, వైశాలి రాజు చేతకుని కుమార్తె ఈమె. పంజాబ్ పాలకుడు మద్ర కుమార్తె ఖేమా అతడి మూడవ రాణి. వాస్తవానికి బలమైన రాజ్యాలతో వివాహసంబంధాలు బింబిసారుని అధికారాన్ని, స్థాయిని గణనీయంగా పెంచాయి. అతడి కోసల భార్య కాశిని వరకట్నంగా తెచ్చింది. అయితే అతడు అనేక సైనిక దండయాత్రలను చేపట్టాడు. సామ్రాజ్యానికి కొత్త ప్రాంతాలను దఖలు పరిచాడు. అంగపాలకుడు బ్రహ్మదత్తను ఓడించి ఆ రాజ్యాన్ని కైవసం చేసుకున్నాడు. అవంతి పాలకుడు ప్రద్యోతతో స్నేహ సంబంధాన్ని కొనసాగించాడు. తన వ్యక్తిగత వైద్యుడు జీవకను ప్రద్యోత వద్దకు పంపి అతడిని కామెర్ల వ్యాధి నుండి విముక్తి చేయించాడు. అతడు బౌద్ధాన్ని పాటించాడా లేదా జైన మతాన్ని అనుసరించాడా అని చెప్పడానికి నిర్దిష్టమైన ఆధారాలేవీ లేవు. అయితే ఇరు మతాలు అతడిని తమ అనుచరునిగా, సమర్థకునిగా పేర్కొన్నాయి. అయితే అతడి జీవితం విషాదంగా ముగిసిందనడంలో ఎలాంటి వివాదం లేదు. ఒక ఆధారం ప్రకారం బింబిసారుడిని అతడి కుమారుడు అజాతశత్రు ఆకలిచావుకు గురిచేశాడు. మరో ఆధారం ప్రకారం తన కుమారుడితో ఉన్న కలహపూరిత సంబంధం వల్ల అతడు విషం సేవించి తనువు చాలించాడు.

**అజాతశత్రు (క్రీ.పూ. 495–462) :** సామ్రాజ్య వాద విస్తరణ విధానాన్ని పాటిస్తూ అజాతశత్రు కోసల రాజు ప్రసేన్‌జిత్‌పై యుద్ధం ప్రకటించాడు. ప్రసేన్‌జిత్ అతడికి మేనమామ. సుమారు 36 రాజ్యాలు, గణరాజ్యాల కూటమికి వ్యతిరేకంగా అజాతశత్రు విజయం సాధించడం నిజంగా అద్భుతం. ఈ సమాఖ్యకు వైశాలికి చెందిన లిచ్ఛాలీలు నాయకత్వం వహించారు. యుద్ధం సుమారు 15 సంవత్సరాలు కొనసాగింది. చివరికి లిచ్ఛావీలతో సహా తన ప్రత్యర్థులందరినీ అజాతశత్రు లొంగదీసుకున్నాడు. అతడు ఏ (జైన లేదా బౌద్ధ) మతాన్ని అనుసరించాడో స్పష్టంగా తెలియదు. అయితే జైన, బౌద్ధ గ్రంథాలు అతడిని తమ అనుచరునిగా వాదించాయి. తొలి దశలో అజాతశత్రు జైన మతాన్ని ఆచరించాడని, తర్వాత తన మనస్సు మార్చుకొని బౌద్ధాన్ని స్వీకరించాడని సాధారణంగా నమ్ముతారు. అతడు గౌతమ బుద్ధుడిని

కలిసి తన తండ్రి బింబిసారుడిని తానే చంపినట్లు నేరం ఒప్పుకున్నట్లు చెబుతారు. వాస్తవానికి అజాతశత్రు బుద్ధుడితో జరిపిన సమావేశాన్ని భారూత్ శిల్పాలలో ప్రతిబింబించాడు.

**అజాతశత్రు వారసులు :** జైన, బౌద్ధ గ్రంథాల ప్రకారం అజాతశత్రు వారసులు అనేక మంది మగధను సుమారు 166 సంవత్సరాలపాటు పరిపాలించారు. దురదృష్టవశాత్తు వారిలో అనేక మంది అనామకులు. అయితే వారిలో ఉదయిన్ అనే ఒక్క పాలకుడి పేరే మనకు తెలుస్తుంది.

**శిశునాగులు :** తాను రాజు కాకముందు శిశునాగుడు కాశిలో మగధ రాయబారిగా వ్యవహరించాడు. తన కొత్త రాజధానిని గిరివ్రజలో ఏర్పాటు చేశాడు. అతడు ప్రద్యోత (చండా ప్రద్యోత వారసుల్లో ఒకడు)ను ఓడించి అవంతి రాజ్యాన్ని మగధ సామ్రాజ్యంలో చేర్చాడు. దీనితో అతడు ఉత్తర భారతంలో అత్యంత శక్తివంతమైన పాలకుడయ్యాడు. అతడి కుమారుడు, వారసుడు కాలాశోక. ఇతడి పాలనలో జరిగిన రెండు ముఖ్యమైన సంఘటనలు – వైశాలి వద్ద రెండవ బౌద్ధ మండలి సదస్సు, రాజధానిని ఎట్టకేలకు పాటలీపుత్రకు తరలించడం. రాజధాని నగర సమీపంలో కాలాశోకను నంద వంశ వ్యవస్థాపకుడు హత్య చేశాడు.

**నంద వంశీయులు :** నంద వంశాన్ని స్థాపించిన మహాపద్మ తక్కువ జాతికి చెందిన వాడు. అతడు సూద్ర మహిళకు జన్మించాడని పురాణాలు వివరిస్తాయి. అయితే జైన కృతులలో అతడు రాజ్యనర్తకి, ఒక నాయికి జన్మించిన వాడని చిత్రీకరించారు. ఈ విషయాన్ని గ్రీకు రచయిత కర్టియస్ కూడా ధృవీకరించాడు. మహాపద్మను రెండవ పరశురామునిగా కీర్తించారు. అతడు క్షత్రియ జాతినంతటినీ తుడిచిపెట్టాడు. రాజ్యానికి తిరుగులేని పాలకుడయ్యాడు. ఇక్ష్వాకులు, పంచాలులు, కాశీలు, హైహయాలు, అస్మకాలు, కురులు, మైథిలివాసులు, సురసేనులు, వితిహోత్రులు, తదితర క్షత్రియ కుటుంబాలను అతడు అధికారం నుండి తప్పించాడు. కథాసరిత్సాగరం అనే కృతిలో కోసల మగధ సామ్రాజ్యంలో అంతర్భాగమైనట్లు క్లుప్తంగా ప్రస్తావించారు. ఖారవేలకు చెందిన హాథిగుంప శిలాశాసనం కళింగపై నంద పాలకుల ఆధిపత్యాన్ని నిర్ధారిస్తుంది. మైసూరులోని కొన్ని శాసనాల ప్రకారం నందులు కుంతల రాజ్యాన్ని కూడా పాలించాడు. ఇది బొంబాయి ప్రెసిడెన్సీ దక్షిణ భాగంలో, మైసూరుకు ఉత్తరాన ఉంది.

మహాపద్మ తర్వాత అతడి ఎనిమిది మంది కుమారులు రాజ్యాన్ని పాలించారు. పురాణాల ప్రకారం వారు 12 ఏళ్లపాటు పాలించారు. వారిలో చివరివాడు ధననంద. ప్రాచీన గ్రీకు రచయితలు ప్రస్తావించిన అగ్రామ్స్ లేదా క్షాండ్రామ్స్ ఇతడే అయి ఉంటాడు. బియాస్ అవతల శక్తిమంతులైన ప్రజలకు ధన నంద రాజు అని కర్టియస్ వర్ణించాడు. గ్రీకు రచయితల ప్రకారం అగ్రామ్స్‌కు సుమారు 2,00,000 పదాతి దళం, 20,000 ఆశ్విక దళం, 2,000 రథాలు, 3,000 గజదళం ఉండేది. ఇంత పెద్ద స్థాయిలో సైనిక బలం ఉన్నప్పటికీ అతడికి ప్రజామద్దతు లభించలేదు. మితిమీరిన గర్వం, ధనాశతో అతడు ప్రజలలో అప్రతిష్ట మూటగట్టుకున్నాడు. దోపిడీ మార్గాలలో అతడు సంపదను కూడబెట్టాడు. అతడు దాచిపెట్టిన సంపద గురించి ఒక తమిళ కావ్యంలో ఆసక్తికరమైన వివరణ ఉంది. అలెగ్జాండర్ తన దండయాత్రను కొనసాగించి ఉంటే ధననందను ఖచ్చితంగా ఓడించేవాడే. అయితే తన సైన్యంతో ముందుకు కదలలేదు. ఫెగెలిస్ లేదా భాగల అనే కుల పెద్ద సలహాను పెడచెవిన పెట్టాడు.

అలెగ్జాండర్ నిష్క్రమించిన తర్వాత చంద్రగుప్త మౌర్య, చాణక్యులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నంద పాలనకు చరమ గీతం పాడారు. అనతి కాలంలోనే మౌర్యుల నాయకత్వంలో మగధ సామ్రాజ్య విస్తరణలో నూతన దశను ఆవిష్కరించింది.

## గణరాజ్యాలు (క్రీపూ.650-325)

జైన, బౌద్ధ, బ్రాహ్మణిక గ్రంథాల అధ్యయనం ఉత్తర భారతదేశంలో రాచరిక రాజ్యాలతోపాటు అనేక గణరాజ్యాలు, స్వయం ప్రతిపత్తిగల కుదురులు ఉండేవని సూచిస్తుంది. పాలి గ్రంధాల ప్రకారం సుమారు పది గణరాజ్యాలు బుద్ధుని జీవిత కాలంలో ఉత్తర భారతంలో వెలిశాయి. అందులో ప్రముఖమైనవి కపిలవస్తు, కుసినగర్, పావ, వైశాలి. కపిల వస్తువును సక్యులు, కుసినగర్, పావలను మల్ల రాజులు, వైశాలిని లిచ్ఛావీలు పాలించారు.

సక్యుల రాజ్యం భారత్, నేపాల్ సరిహద్దుల్లో ఉండేదని బోధపడుతోంది. ప్రసేన్‌జిత్ కుమారుడు రాజు విరుధక ఈ గణరాజ్యంపై దాడి చేసి దానిని కోసల రాజ్యంలో అంతర్భాగం చేశాడు. ఈ రాజకీయ ఉప్పెన సమయంలో అనేక మంది సక్యులు ఊచకోతకు గురయ్యారు.

మల్ల వంశీయులు రెండు విభాగాలుగా చీలిపోయారు. తొలి భాగం పావను శాసిస్తే రెండవ భాగం కుసినగర్‌ను పాలించింది. విశేషమేమిటంటే మహావీర పావ వద్ద తుదిశ్వాస వదిలాడు. కుసినగర్ కూడా చారిత్రక ప్రాముఖ్యత కలది. ఎందుకంటే బుద్ధుడు అక్కడ పరినిర్వాణం పొందాడు. అజాతశత్రు దాడి చేసి మగధ సామ్రాజ్యంలో కలుపుకునేంత వరకు మల్ల పాలకుల గణరాజ్యం ప్రగతిబాటలో పయనించింది.

అన్ని వైపులా దండయాత్రలు, యుద్ధాలు జరుగుతున్న యుగంలో వైశాలికి చెందిన లిచ్ఛావీలు అత్యంత శక్తిమంతులుగా, ప్రగతిశీలురుగా తమ సత్తాను చాటారు. లిచ్ఛావీలు వీరులు, యుద్ధ పిపాసులు. వారి సైనిక శక్తి పొరుగు రాజ్యాలకు దడ పుట్టించేది. గణరాజ్యానికి చుట్టూ ఉన్న రాజ్యాలు లిచ్ఛావీలవైపు కన్నెత్తి చూడడానికి కూడా హడలిపోయేవి. సామ్రాజ్య కాంక్షతో రగిలిపోయిన అజాతశత్రు వల్ల లిచ్ఛావీలు తమ స్వాతంత్ర్యాన్ని కోల్పోయారు. అయితే సైనిక పోరాటం సుమారు 15 ఏళ్లపాటు కొనసాగింది. యుద్ధంలో అజాతశత్రు ధన, మానవ వనరులను భారీగా కోల్పోయాడు. కాని అంతిమంగా లిచ్ఛావీలపై ఆధిపత్యం సాధించి వారి గణరాజ్యాన్ని స్వాధీనం చేసుకున్నాడు.

గణరాజ్యాల పేర్లు ఇలా ఉన్నాయి : (1) కపిలవస్తు సక్యులు, (2) వైశాలి లిచ్ఛావీలు, (3) పావమల్లులు, (4) కుసినగర్ మల్లులు, (5) రామగ్రామ కొల్లియాలు, (6) సుంసుమాస భగ్గాలు, (7) పిప్పిలివాహన మోరియాలు, (8) కేశపుట్ట కలమాలు, (9) మైథిలి విదేహాలు, (10) వైశాలి సమీపంలోని కుండలగ్రామ నాయాలు లేదా జ్ఞాత్రికాలు.

## పర్షియన్, గ్రీకు దండయాత్రలు :

**పర్షియన్ దండయాత్ర :** పర్షియాకు చెందిన సైరస్ (588–530 క్రీ.పూ.) ప్రాచీన ప్రాచ్య చరిత్రలో గొప్ప దండయాత్రికుడు. భారత దేశంపై దండయాత్ర చేసి లోపలికి చొచ్చుకు వచ్చిన తొలి విదేశీ పాలకుడు అతడే. అనతోలియా, బాబిలోనియాలను కూడా స్వాధీనం

చేసుకొని ఈజిప్టు సరిహద్దుల వరకు తన సామ్రాజ్యాన్ని విస్తరించాడు. సింధూ నదికి పశ్చిమాన నివసించిన భారతీయ తెగలన్నీ (కాబుల్‌వరకు) సైరస్‌కు లొంగిపోయి అతడికి కప్పం చెల్లించాయి. కొన్ని చారిత్రక ఆధారాల ప్రకారం సైరస్ కపీసా అనే నగరాన్ని నాశనం చేశాడు. కాబుల్‌కు ఉత్తర దిశలో ఈ నగరం ఎక్కడో ఉండేది. కాంబిసెస్ (క్రీ.పూ. 530-522) కూడా విస్తరణ విధానాన్ని అవలంబించాడు. కాని తన తండ్రి అనుసరించిన ప్రగతిశీల విధానాన్ని పక్కన పెట్టాడు.

ఒకటవ డేరియస్ (522-486 క్రీ.పూ.) సైరస్ మనవడు. క్రీ.పూ. 518లో అతడు సింధూలోయను స్వాధీనం చేసుకున్నాడు. భారతదేశం డేరియస్ సామ్రాజ్యంలో 20వ సత్రపిగా ఉండేదని హెరొడటస్ పేర్కొన్నాడు. సింధూ నదిని అన్వేషించాల్సిందిగా స్కైలస్‌నాయకత్వంలో ఒక నౌక దళ బృందాన్ని డేరియస్ పంపించాడని అతడు రాశాడు. సింధ్, సింధూనదికి తూర్పున ఉన్న పంజాబ్‌లోని కొంత భాగం డేరియస్ దండయాత్రలో ఉన్నాయి. తదుపరి కాలంలోపర్షియా చక్రవర్తి జెర్క్సెస్ అధీనంలో ఈ ప్రాంతాలు ఉండడం విశేషం. జెర్క్సెస్ (క్రీ.పూ. 465-456) తన భారత ప్రాంతాలను పూర్తిగా వినియోగించుకొని బలమైన సైనిక బలగాలను నిర్మించాడు. భారత బలగాలను గ్రీసులో మోహరించి తన ప్రత్యర్థులతో యుద్ధం చేశాడు. భారతీయ సైనికుల గురించి హెరొడోటస్ ప్రస్తావించాడు. మూడవ డేరియస్ భారతీయ సైనికులను చేర్చుకొని వారిని అలెగ్జాండర్‌తో పోరాడేందుకు పంపాడు. అలెగ్జాండర్ ఆసియా ఖండంపై దండయాత్ర చేసే నాటికి పర్షియన్ల నియంత్రణ సడలిపోయిందన్న విషయం విస్పష్టం.

**భారతదేశంపై అలెగ్జాండర్ దండయాత్ర :**

పర్షియన్ల తర్వాత భారతదేశంపై దండయాత్ర జరిపిన విదేశీయులు గ్రీకులు. వారు క్రీ.పూ. నాల్గవ శతాబ్దంలో దేశంపై దండెత్తారు. క్రీ.పూ. 334లో తన తండ్రి ఫిలిప్ మరణానంతరం అలెగ్జాండర్ గద్దెనెక్కాడు. క్రీ.పూ. 329 నాటికి అతడు అసియా మైనర్ నుండి ఆఫ్ఘనిస్తాన్ వరకు విస్తరించి ఉన్న పర్షియా సామ్రాజ్యాన్ని పూర్తిగా స్వాధీనం చేసుకున్నాడు. క్రీ.పూ. 327 మేలో అతడు హిందూకుష్ పర్వతశ్రేణులను దాటుకొని వచ్చాడు. ఆ సంవత్సరమంతా స్థానిక ఆటవిక తెగలను అణచివేయడంలోనే నిమగ్నమయ్యాడు. హెఫేస్తియన్, పెర్దికాస్‌ల నేతృత్వంలోని సైనిక బలగాలను భారతదేశంపై దండయాత్ర చేయడానికి పంపించాడు. క్రీ.పూ. 327 డిసెంబరు లేదా 326 జనవరిలో వారు ఖైబర్ పాస్‌ను దాటి సింధూనదిపై వంతెన నిర్మించారు. ఈలోగా అలెగ్జాండర్ కొత్తగా స్వాధీనం చేసుకున్న ప్రాంతాలలో తన ఆధిపత్యాన్ని సుస్థిరం చేసుకోవడంలో తీరిక లేకుండా ఉండిపోయాడు.

అలెగ్జాండర్ దాడికి పూర్వం ఉత్తర, వాయువ్య భారతదేశాన్ని ఎందరో చిన్నస్థాయి దొరలు, స్వతంత్ర తెగలు పాలించేవి. అంతఃకలహాలు, కుటుంబాల మధ్య ఆధిపత్యపోరులో వారు తమ శక్తిని, వనరులను కరగబెట్టారు. తక్షిల, పౌరవ పాలకుల మధ్య వైరం ఉండడంతో తక్షశిల పాలకుడు తన కుమారుడు అంభిని బాక్ట్రియాకు పంపి అలెగ్జాండర్ మద్దతును అర్థించాడు. భారతదేశంలోని ఇతర పాలకులను ఓడించేందుకు తనకు మద్దతు ఇవ్వాలని కోరాడు. అట్టోక్‌కు పదిమైళ్ల ఎగువ ప్రాంతానగల ఉండ్ లేదా ఓహింద్ వద్ద నిర్మించిన నావలలో అలెగ్జాండర్ సింధూ నదిని దాటాడు. ఈలోగా తక్షశిల సింహాసనాన్ని అధిష్టించిన

అంభీ అలెగ్జాండర్‌ను మర్యాదపూర్వకంగా ఆహ్వానించాడు. ఇక్కడి నుండి అలెగ్జాండర్ పోరస్ (పురుషోత్తముడు)కు సందేశం పంపి లొంగిపోవాలని ఆదేశించాడు. అందుకు నిరాకరించిన పోరస్ అమీతుమీ తేల్చుకోవడానికి సిద్ధమయ్యాడు.

**హైడాస్పెస్ యుద్ధం (క్రీ.పూ. 326) :** హైడాస్పెస్ (జీలం) నది ఒడ్డుకు అలెగ్జాండర్ తన బలగాలతో వచ్చాడు. నదిలో ప్రవాహం ఉధృతంగా ఉండడంతో అతడు అనేక వారాలపాటు అక్కడే మకాం చేయాల్సి వచ్చింది. చివరికి చీకటిలో నదిని దాటి పోరస్‌ను ఆశ్చర్యంలో ముంచెత్తాడు. కార్రీ మైదాన ప్రాంతాలలో భీకరమైన యుద్ధం జరిగింది. యుద్ధరంగంలో పోరస్ స్వయంగా అసమానమైన ధైర్యసాహసాలను ప్రదర్శించినా ఓటమి పాలయ్యాడు. సుమారు 12,000 మంది సైనికులు హతమయ్యారు. మరో ఆరు వేల మందిని ఖైదీలుగా తీసుకున్నారు. గాయపడిన పోరస్‌ను లొంగిపోవలసిందిగా ప్రాధేయపడ్డారు. పోరస్ స్వతంత్ర భావాన్ని అలెగ్జాండర్ మెచ్చుకున్నాడు. పోరస్‌కు రాజ్యం కట్టబెట్టడమే కాకుండా దానికి మరో పెద్ద రాష్ట్రాన్ని జతచేశాడు.

జీలం నదిని దాటుకొని తూర్పు దిశలో అలెగ్జాండర్ పయనించాడు. గ్లస్సాయ్ లేదా గ్లాంకనికోయ్‌ను ఓడించి మరింత ముందుకు కదిలాడు. అకెసీన్స్ (చీనాబ్)ను, హైడ్రాయేట్స్ (రావి) నదులను దాటుకొని కథయోయ్ (కథస్) రాజధాని సంగాలను స్వాధీనం చేసుకున్నాడు. ఈ దాడి తుఫాను వేగంలో జరిగింది. అలెగ్జాండర్ ఎదుట లొంగిపోవడం తప్ప రాజు సంభూతికి మరో మార్గం లేకుండా పోయింది. తర్వాత అలెగ్జాండర్ బియాస్ ఒడ్డుకు చేరుకున్నాడు. మగధ సామ్రాజ్యాన్ని స్వాధీనం చేసుకోవాలన్నదే అతడి లక్ష్యం. అయితే ఇక్కడ అలసిపోయిన అతడి సైనికులు నదిని దాటడానికి నిరాకరించారు. సుదీర్ఘ సైనిక దండయాత్రలు, ఇంటికి చాలా కాలం దూరంగా ఉండడం వల్ల ఇక తిరుగు ప్రయాణం చేయాలని సైనికులు నిర్ణయించారు. అలాగే బియాస్‌కు అవతల ఒక బలమైన రాజ్యం ఉందని, దానిని లొంగదీసుకోవడం అంత సులభం కాదని కూడా తెలుసుకున్నారు. ఈ కారణంగా అలెగ్జాండర్ మరో దండయాత్రకు తన సైనికులను సమీకరించలేకపోయాడు.

ఫలితంగా అతడు ఉపసంహరణకు ఆదేశాలు ఇచ్చాడు. కొత్తగా స్వాధీనం చేసుకున్న ప్రాంతాలలో పాలనాపరమైన ఏర్పాట్లు చేశాడు. సింధూ నుండి బియాస్ వరకు విస్తరించి ఉన్న భూభాగాన్ని మూడు రాష్ట్రాలుగా విభజించి వాటిని గవర్నర్ల ఆధీనంలో ఉంచాడు. మెసిడోనియా సైన్యంలోని కొన్ని బలగాలను స్థానిక గవర్నర్లకు సహాయంగా (శాంతిభద్రతల పరిరక్షణ కోసం) వదలి వెళ్లాడు. క్రీ.పూ. 326 అక్టోబరులో జీలం, సింధూ మీదుగా ఉపసంహరణ మొదలైంది. సింధూ డెల్టా ఎగువ అంచున గల పాటాలా వద్దకు చేరుకున్న తర్వాత అలెగ్జాండర్ తన సైన్యాన్ని రెండు భాగాలుగా విభజించాడు. ఒక భాగాన్ని నియార్కస్ నేతృత్వంలో సముద్ర మార్గాన పంపించారు. మరో భాగాన్ని తన స్వంత కమాండ్ కింద ఉంచుకున్నాడు. క్రీ.పూ. 325 సెప్టెంబరులో అలెగ్జాండర్ ఆధునిక కరాచి శివారు ప్రాంతం నుండి భూమార్గాన బయల్దేరాడు. బాబిలోన్ (ఆధునిక బాగ్దాద్) చేరుకున్న తర్వాత అతడు తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. క్రీ.పూ. 323 జూన్‌లో కేవలం 33 ఏళ్ల వయస్సులో అలెగ్జాండర్ మరణించాడు.

# 5

# మౌర్య సామ్రాజ్యం (క్రీ.పూ. 321-184)

**ఆధారాలు :**

క్రీ.పూ. నాల్గవ శతాబ్దం చివరి పాతికేళ్ల నుండి భారతదేశ గత చరిత్రపై మన అవగాహనలో స్పష్టత ఏర్పడుతుంది. ఈ కాలంలో ఉత్తర భారతదేశంపై మగధ సామ్రాజ్యం పట్టు, ఆధిపత్యం తీవ్రమైన తర్వాతి దశలో ఉపఖండంలోని ఇతర ప్రాంతాలకు విస్తరించింది. మౌర్యుల పాలనలో మగధ ఆధిపత్యం పతాక స్థాయికి చేరుకుంది. ముఖ్యంగా అశోకుని హయాంలో (272–233 ) సామ్రాజ్య వైభవం ఉన్నత శిఖరానికి చేరుకుంది. మౌర్య పాలకులలో అత్యంత గొప్పవాడు అశోకుడు.

మౌర్య యుగం భారతదేశ ప్రాచీన చరిత్రలో వివిధ దశలుగా నమోదైంది. ఎందుకంటే ఈ కాలంలో తగిన చారిత్రక ఆధారాలు పెద్ద సంఖ్యలో అందుబాటులోకి వచ్చాయి. మౌర్య భారత చరిత్రకారుడు మెగస్తనీస్ కథనాలు, కౌటిల్యుడి అర్థశాస్త్ర, అశోకుని శిలాశాసనాల్లోని ఘనమైన వర్ణనలు, బౌద్ధ గ్రంథాలలో అశోకుని సాహసగాథలు (ఇవి సమకాలీనమైనవి కావు) చారిత్రక కళ, క్షేత్రస్థాయి పురావస్తు ఆధారాలను ఉపయోగించే స్థితిలో ఉన్నాడు.

మౌర్య చరిత్ర కోసం ఆధారాలను ఎంపిక చేసే విషయంలో చరిత్రకారుల వైఖరులు, ప్రాధాన్యతలలో ఆసక్తికరమైన మార్పులు వచ్చాయి. కౌటిల్యుడి అర్థశాస్త్రాన్ని ప్రాథమిక ఆధారంగా తీసుకునే చరిత్రకారుల సంఖ్య ఇటీవలికాలంలో తగ్గిపోయింది. అర్థశాస్త్ర గణాంకాల విశ్లేషణ చేపట్టిన డాక్టర్ ట్రౌట్‌మాన్ ప్రకారం ఆకృతి క్రీ.శ. మూడవ శతాబ్దంలో తన ప్రస్తుత స్వరూపాన్ని సంతరించుకుంది. ఏ ఒక్క కాలానికో లేదా ఏ ఒక్క రచయితకో అది పరిమితం కాదు. మౌర్యుల కాలం నాటి రాజకీయ వ్యవస్థ గురించి అర్థశాస్త్రంలోని వర్ణనలు, గణాంకాలను ఆధారంగా తీసుకోవడానికి ఈ విషయం కొన్ని ఇబ్బందులు కలిగించినా గ్రంథంలోని తొలి భాగాలు (అధ్యక్ష ప్రకార) క్రీ.పూ. మూడవ శతాబ్దానికి సంబంధించినవి. అంటే మౌర్య కాలంతో దాదాపు సమకాలికమైనవి. పైన పేర్కొన్నట్లు మౌర్య కాలం గురించి తెలుసుకోవడానికి "అర్థశాస్త్ర" వినియోగం కేవలం దాని తొలి భాగాలకే పరిమితం.

మెగస్థనీస్ "ఇండికా"లోని వివరణ, ప్రధానాంశాల మధ్య వైరుధ్యాలు కూడా కొన్ని సందేహాలను లేవనెత్తాయి. ఆ పుస్తకం మౌలిక ప్రాముఖ్యత ప్రశ్నార్థకంగా మారుతుంది.

అయితే ఆ గ్రీకు రాయబారి ఎంతైనా తన స్వంత పరిశీలన ఆధారంగానే ఆ పుస్తకాన్ని రాశాడు. మరోవైపు అశోకుని హయాంలో సామ్రాజ్య విస్తరణ గురించి మన పరిజ్ఞానం ఎంతో అభివృద్ధి చెందిందనడం నిస్సందేహం. ఎందుకంటే ఇటీవలి దశాబ్దాలలో అనేక శిలాశాసనాలు బయటపడ్డాయి. ఇప్పటికీ బయటపడుతున్నాయి. భారతదేశంలో మనకు తెలిసిన తొలి లిఖిత నివేదికలు ఇప్పటికీ ఈ శాసనాలే. అశోకుని ప్రాథమిక రాతి శాసనాలు రాతి శాసనాల యొక్క కొత్త వివరణలు మౌర్యకాలంపై సరికొత్త వెలుగును ప్రసరిస్తాయి.

అశోకుడు గ్రీకు, అర్మాయిక్, గ్రీకో-అర్మాయిక్ (ద్విభాష) భాషలు, లిపులలో వేయించిన శాసనాలలో అత్యంత అద్భుతమైన ఆధారాలు లభిస్తాయి. ఇలాంటి శిలాశాసనాలు ఆఫ్ఘనిస్తాన్ (లఘ్మన్‌లో రెండు అర్మాయిక్ శాసనాలు, పుల్-ఎ-దరుంత నుండి ఒక రాతి శాసనం, షార్-ఎ-కునా నుండి గ్రీకో అర్మాయిక్ ద్విభాష నివేదిక, కందహార్ నుండి ఒక గ్రీకు, ఒక అర్మాయిక్ శాసనం), పాకిస్తాన్‌లోని తక్షశిలలో లభించాయి. ఈ శాసనాలు లభించిన స్థలాలే మౌర్య సామ్రాజ్య వైశాల్యానికి స్పష్టమైన సూచికలు. అశోకుడే స్వయంగా తన సామ్రాజ్యాన్ని మహాలక (విశాలమైన)గా గుర్తించాడు. ఆఫ్ఘనిస్తాన్, తక్షశిల (పాకిస్తాన్) నుండి శాసనాలు లభించడం బట్టి అశోకుడికి అరాకోసియా, పారోపనిసడే, గెడ్రోసియాలపై నియంత్రణ ఉండేదని చెప్పడంలో ఎలాంటి సందేహం తలెత్తదు. క్రీ.పూ. 301లో సెల్యూకస్‌పై ప్రాంతాలను మౌర్య పాలకుడు చంద్రగుప్తునికి ధారాదత్తం చేశాడు.

తన సామ్రాజ్య పరిధిలోని ప్రజలను నేరుగా సంబోధిస్తూ అశోకుడు వేయించిన విభిన్న రకాల శాసనాలు విభిన్న అంశాలను స్పృశిస్తాయి. దీనిని బట్టి ఈ శాసనాలకు కేంద్ర లేదా మూల ముసాయిదా ఉండేదని, దానిని చక్రవర్తే స్వయంగా పాటలీపుత్రలో రూపొందించేవాడని తెలుస్తోంది. వీటిని తర్వాతి కాలంలో ఆమోదించి, విస్తరించి లేదా క్లుప్తం చేసి స్థానిక లేదా ప్రాంతీయ అధికారులు శిలాశాసనాలుగా (స్థానిక అవసరాలకు అనుగుణంగా) వేయించి ఉంటారని బోధపడుతోంది. కేంద్ర శాసనాల విశాల అర్థానికి లోబడే మార్పులు చేర్పులు జరిగేవి. చక్రవర్తి తన శాసనాలను స్వయంగా విస్తత (విస్తృతమైన), మజిమ (మధ్యమస్థాయి), సంఖిత (సంక్షిప్త)గా వర్గీకరించడం పైవాదనను బలపరుస్తోంది. గ్రీకు, అర్మాయిక్ శాసనాలు పాక్షికంగా అనువాదాలు, అంతర్‌లిపి కరణలు, వివరణలు, అలాగే అశోకుని ఆలోచనలు, సిద్ధాంతాల పీఠికలు. బ్రాహ్మి, ఖరోష్టి లిపులలో గల ప్రాకృత శాసనాలలో అశోకుని ఆలోచనలు, సిద్ధాంతాలు ప్రతిబింబిస్తాయి.

మౌర్య సామ్రాజ్యం అఖిలభారత స్థాయిలో విస్తరించి ఉన్నప్పటికీ, సంబంధాలను ఏర్పాటు చేసుకోవడం, వాటిని నిర్వహించడంలో సమస్యలు ఎదురైనప్పటికీ అశోకుని శాసనాలు ఆయా ప్రాంతాలలో ఏర్పాటైన తీరును బట్టి విశాలమైన లేదా విస్తృతమైన సమాచార, అంతః సంబంధాల వ్యవస్థ సామ్రాజ్యంలో ఒకటి ఉండేదని స్పష్టమవుతుంది. లఘ్మన్ వద్ద గల ఒక అర్మాయిక్ శాసనంలో ప్రత్యేకమైన అంశాలున్నాయి. మిగతా శాసనాలలో చాలా వరకు ఇలాంటి అంశాలు ఎక్కడా కనిపించవు. దానిని అదే తరహా అశోక శాసనంతో కలిపి చదివితే రాచరిక రహదారి (కరపథి లేదా రాజపథ), నిర్వహణా అధికారుల గురించి తెలుస్తుంది. రహదారుల నిర్వహణను సమర్థవంతమైన పనిగా (కార్యం) పరిగణించేవారు (పుర్తబాగ). లఘ్మన్ శాసనాలలో

పేర్కొనబడిన స్థలాల పేర్లు, దూరాలను బట్టి అవి మైళ్లు రాళ్లు లేదా సూచికలని స్పష్టంగా తెలుస్తుంది.

పశ్చిమాసియాను పాలింబోత్ర లేదా పాటలీపుత్రతో కలిపిన రహదారి గురించి ఎరాటోస్థీన్స్ ఇచ్చిన వర్ణనలు లఘ్మన్ శాసనాలతో ఖచ్చితంగా సరితూగుతాయి. ఎరాటోస్థీన్స్ అశోకుని సమకాలికుడు. అయితే వయస్సులో చక్రవర్తి కంటే పెద్దవాడు. మౌర్యులు రహదారి వ్యవస్థను సరిగ్గా నిర్వహించారని, సూచికలను ఏర్పాటు చేసి దూరాలను, స్థలాలను, మార్గాలను సూచించారని ప్రాచీన రచయితలు తమ గ్రంథాలలో ఇచ్చిన వివరణలు కూడా ఖచ్చితంగా ఖరారయ్యాయి (శిలాశాసనాలలో). అశోకుడు పట్టాభిషేకం తర్వాతి సంవత్సరం నుండి తేదీలు, సంవత్సరాలను శాసనాలలో లెక్కించినట్లు స్పష్టమవుతుంది.

## చంద్రగుప్తుడు (క్రీ.పూ.321-297) :

**తొలి జీవితం :** చంద్రగుప్తుని తొలి వృత్తి గురించి స్పష్టమైన సమాచారం లేదు. అతడి తొలి జీవితం అంతగా వెలుగు చూడలేదు. గ్రీకు రచయిత జస్టిన్ ప్రకారం చంద్రగుప్తుడు తక్కువ జాతికి చెందిన వాడు. జైన పురాణం అతడిని ఒక గ్రామపెద్ద కుమార్తె కుమారునిగా పరిచయం చేస్తాయి. పురాణాల ప్రకారం అతడు చివరి నంద, సూద్ర సహచరి మురా అనే మహిళకు జన్మించాడు. మురా అనే పేరు నుండే అతడి చివరి పేరు మౌర్య వచ్చింది. బౌద్ధ రచయితలు చంద్రగుప్తుని మోరియా అనే క్షత్రియ వంశానికి చెందిన వాడిగా చూపుతారు. ఈ వంశం బహుశా పిప్పిలివనను పాలించేది. ఈ రాజ్యం నేపాలీ తరాయిలోని రుమ్మిండే, గోరఖ్‌పూర్ జిల్లాలోని కాసియాల మధ్య విస్తరించి ఉండేది.

బౌద్ధ పురాణాల ప్రకారం చంద్రగుప్తుడు తొలుత గ్రామంలో ఒక పశుపాలకుడి ఇంటిలో పెరిగాడు. తర్వాత వేటకారుని సంరక్షణలో పెరిగాడు. అంతకుముందు మోరియా వంశ పెద్ద అయిన గుప్తుని తండ్రి ఒక సరిహద్దు ఘర్షణలో మరణించాడు. నందులపై తీవ్రమైన ద్వేషం పెంచుకున్న చాణుక్యుడు అనుకోకుండా ఒక రోజు చంద్రగుప్తుని కలిశాడు. అతడిలో శక్తి సామర్థ్యాలు పుష్కలంగా ఉన్నాయని గ్రహించి ఆ బాలుడిని తన వెంట తక్షశిలకు తీసుకెళ్లాడు. అక్కడ అతడిని తీవ్రమైన విద్యాభ్యాసంలో ప్రవేశపెట్టాడు. కళలు, శాస్త్రాలను ఏడులేదా ఎనిమిదేళ్లపాటు నేర్పించాడు.

క్రీ.శ.326–25లో చంద్రగుప్తుడు తొలిసారి వెలుగులోకి వచ్చాడు. అప్పుడు అతడు అలెగ్జాండర్‌ను కలుసుకొని నందుల పరిపాలనకు చరమగీతం పాడేందుకు సైనిక సహాయాన్ని అర్థించినట్లు చెబుతారు. అయితే ఆ సమావేశం అనుకున్న ఫలితాన్ని ఇవ్వలేదు. పంజాబ్‌లోని గణరాజ్యాల నుండి మౌలిక బలగాలను భర్తీ చేసుకున్న తర్వాత చంద్రగుప్తుడు హిమాలయ నాయకుడు పర్వతకతో స్నేహ ఒప్పందం కుదుర్చుకొని తన ప్రాబల్యాన్ని సుస్థిరం చేసుకున్నాడు. పర్వతక అతడికి సంకీర్ణ స్వభావంగల ఒక పెద్ద సైన్యాన్ని సమ కూర్చాడు.

అదృష్టవశాత్తు పంజాబ్‌లో గ్రీకుల మధ్య అభిప్రాయభేదాలు తీవ్ర రూపం దాల్చడంతో చంద్రగుప్తుడు తన లక్ష్యాన్ని మరింత సులువుగా, ఆశ్చర్యకరమైన రీతిలో సాధించగలిగాడు. క్రీ.పూ.323లో అలెగ్జాండర్ మరణం తర్వాత గ్రీకు సైనికాధికారులు సామ్రాజ్యాన్ని తమలో

తాము విభజించుకున్నారు. క్రీ.పూ. 321లో మరో విభజన త్రిపరదీసుస్ వద్ద జరిగింది. ఇందులో సింధూ నదికి తూర్పున ఉన్న భారతదేశంలో ఏ ఒక్క ప్రాంతాన్ని గ్రీకు సామ్రాజ్యంలో చేర్చలేదు. సింధ్ గవర్నర్ పేదన్ (గ్రీకు) పశ్చిమోత్తర రాజ్యానికి బదిలీ అయ్యాడు. ఈడిమస్ అనే ఒక్క గ్రీకు అధికారే భారతదేశంలో తచ్చాడాడు. అయితే క్రీ.పూ. 317లో అతడు ఉపసంహరించుకోవడంతో భారతదేశం నుండి గ్రీకుల నిష్క్రమణ ప్రక్రియ పూర్తయ్యింది.

గ్రీకులను పట్టి పీడించిన సంక్షోభాలు చంద్రగుప్తునికి మంచి అవకాశాన్ని ఇచ్చాయి. నందులను అతడు చివరి దెబ్బతీసి క్రీ.పూ. 323లో పరిస్థితులకు అధిపతి అయ్యాడు. "అలెగ్జాండర్ మరణం తర్వాత భారతదేశం పరాయి పాలన భారాన్ని తన భుజాల నుండి దించి వేసింది. అతడి గవర్నర్లను హత్య చేసింది. ఈ విముక్తికి కారకుడు సాండ్రోకోటస్," అని జస్టిన్ ఉల్లేఖించాడు. ఈ సాండ్రోకోటస్ అనే వ్యక్తి నిస్సందేహంగా చంద్రగుప్తుడే.

**దండయాత్రలు - స్వాధీనాలు :**

గ్రీకు పాలన అంతమైన తర్వాత చంద్రగుప్త తన దృష్టిని ధన నంద నియంతృత్వాన్ని ధ్వంసం చేయడంపై సారించాడు. మగధను పాలించిన చివరి నంద పాలకుడు ధన నంద. అయితే అతడి ఆధిపత్యాన్ని ఎదిరించడం అంత సులభమైన పని కాదు. ఎందుకంటే సైనిక శక్తి, ఆర్థిక వనరులలో అతడు అత్యంత బలశాలి. చంద్రగుప్తుడు అంతకు ముందు సైనిక తప్పిదాలు చేశాడు. తన సైన్యం వెనుక భాగాన్ని లేదా చివరి భాగాన్ని రక్షణ లేకుండా అలాగే ఉంచాడు. ఈ తప్పును సరిదిద్దుకొని నగరాలను స్వాధీనం చేసుకొని వాటిలో స్థావరాలను ఏర్పరిచే సరైన పద్ధతిని పాటించాడు. ఆ విధంగా పాటలీపుత్ర వరకు దండయాత్ర కొనసాగించాడు. అక్కడ జరిగిన భీకర యుద్ధంలో భద్దసల నేతృత్వంలోని నంద సైన్యాలు ఓడిపోయాయి. కాని నందను ప్రాణాలతో వదిలారు. పాటలీపుత్రను విడిచి వెళ్లేందుకు అనుమతించారు. పురాణాలు, అర్థశాస్త్రం నందుల వినాశనానికి చాణుక్యుడే కీలక వ్యక్తి అని కీర్తించాయి. అయితే దోపిడీ స్థాయి తీవ్రంగా పెరగడంవల్లే ధననంద ప్రజలలో ఆదరణ కోల్పోయాడు. ప్రజా వ్యతిరేకత అతడి అంతిమ పరాజయానికి బాటలు వేసింది.

గంగాలోయ ఒక్కసారి తన నియంత్రణలో పూర్తిగా రాగానే చంద్రగుప్తుడు పశ్చిమోత్తర ప్రాంతానికి బయల్దేరి వెళ్లాడు. సింధూ వరకు ఉన్న పశ్చిమోత్తర ప్రాంతాలు అతడికి సునాయాసంగా వశమయ్యాయి. సింధూనది వద్ద ఆగిపోయాడు. అక్కడి నుండి తిరిగి మధ్య భారతదేశం వైపు ప్రయాణం కట్టాడు. క్రీ.పూ. 312 నాటికి నర్మదానదికి ఉత్తరాన గల ప్రాంతాన్ని ఆక్రమించాడు. అయితే క్రీ.పూ. 305లో అతడు మరోసారి పశ్చిమోత్తర ప్రాంతానికి బయల్దేరి వెళ్లాడు. అక్కడ సెల్యూకస్ నికేటర్‌తో పోరాడాడు. (సెల్యూకస్ అలెగ్జాండర్ సైన్యంలో ఒక ఉన్నతాధికారి. మాసిడోనియా సామ్రాజ్యంలోని ఆసియా రాష్ట్రాలన్నింటిపై అతడికి నియంత్రణ ఉండేది).

భారతదేశంలో తన సామ్రాజ్యానికి పునాదులు వేయడంలో చంద్రగుప్తుడు నిమగ్నమై ఉండగా గ్రీకు రాజు సెల్యూకస్ బాబిలోన్, బాక్ట్రియాలను స్వాధీనం చేసుకొన్న తర్వాత భారతదేశంలో కోల్పోయిన అలెగ్జాండర్ భూభాగాలను తిరిగి కైవసం చేసుకోవడానికి వచ్చాడు.

అయితే అలెగ్జాండర్ దండయాత్ర చేసినపుడు భారతదేశం అనైక్యంగా ఉండేది. కాని ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఒక సమర్థుడైన నాయకుడు ప్రతిఘటనకు బలమైన సైన్యాలను సిద్ధం చేశాడు.

ఈ యుద్ధం గురించి మనకు ఎలాంటి వివరాలు తెలియవు. అయినప్పటికీ ప్రాచీన రచయితలు పై దండయాత్రను విఫలయత్నంగా చిత్రీకరించారు. సెల్యూకస్ శాంతిని కోరుకోవలసి వచ్చింది. భారతీయ పాలకుడికి నాలుగు ప్రాంతాలు – అరియా, అరాకోసియా, గెడ్రోసియా, పారోపనిసదాయ్ (హెరాత్, కందహార్, మక్రన్, కాబుల్)లను సమర్పించు కున్నాడు.

గ్రీకు రాజుపై విజయంతో చంద్రగుప్తుడు తన సామ్రాజ్యాన్ని పర్షియా సరిహద్దుల వరకు విస్తరించాడు. స్నేహ సంబంధానికి సూచికగా చంద్రగుప్తుడు గ్రీకు రాజుకు 500 ఏనుగులు కానుకగా ఇచ్చాడు. ఆ సమయంలో ఈ కానుక సెల్యూకస్‌కు ఎంతో ఉపయోగపడింది. పసలేని ఆధారాలపై ఇరు పాలకుల మధ్య వివాహ సంబంధాన్ని కొందరు సూచించారు. సెల్యూకస్ కుమార్తె చంద్రగుప్తుని లేదా బిందుసారుని వివాహం చేసుకొని ఉంటుందని చెప్పారు. అప్పటి నుండి ఇరు సామ్రాజ్యాల మధ్య స్నేహ సంబంధాలు కొనసాగాయి. చంద్రగుప్త సెల్యూకస్‌కు కొన్ని భారతీయ ఔషధాలను కానుకగా పంపాడు. మరోవైపు సెల్యూకస్ తన వంతుగా మెగస్థనీస్‌ను మౌర్య ఆస్థానానికి రాయబారిగా పంపాడు. మెగస్థనీస్ పాటలీపుత్రలో క్రీ.పూ. 304 నుండి 299 వరకు జీవించాడు. భారతదేశ పరిస్థితులపై చక్కటి సంకలనాన్ని రూపొందించాడు. తదుపరి కాలంలో భారత రచయితలు అతడి గ్రంథంలోని కొన్ని భాగాలను వాడుకోవడంతో అవి నేటికీ అందుబాటులో ఉన్నాయి.

చంద్రగుప్తుడు విశాలమైన సామ్రాజ్యాన్ని పాలించాడు. సుమారు 6,00,000 సైనికులుగల సైన్యంతో అతడు భారతదేశాన్ని తన నియంత్రణలోకి తెచ్చుకున్నాడని ప్లూటార్క్ పేర్కొన్నాడు. ఇది అతిశయ వ్యాఖ్యానం కావచ్చు. కాని పశ్చిమంలో చివరన గుప్త సామ్రాజ్యంలో సౌరాష్ట్ర లేదా కథియావార్ అంతర్భాగంగా ఉండేది. ఒకటవ రుద్రదమన్ జునాగఢ్ శిలాశాసనం ప్రాంతీయ గవర్నర్ పుష్యగుప్తుని గురించి ప్రస్తావిస్తుంది. పుష్యగుప్త ప్రముఖ సుదర్శన సరస్సును తవ్వించాడు.

జైన పురాణాల ప్రకారం చంద్రగుప్త తన వృద్ధాప్యంలో సింహాసనాన్ని త్యజించి జైన సన్యాసి భద్రబాహు ప్రభావంతో దక్షిణానికి తీర్థయాత్రపై వెళ్లిపోయాడు. శ్రావణ బెళగోల వద్ద సన్యాసిగా జీవించాడు. సల్లేఖనకు పాల్పడి తనను తాను ఆకలి చావుకు గురి చేసుకున్నాడు.

**మెగస్థనీస్ కథనం :**

సెల్యూకస్ నికేటర్ మెగస్థనీస్ అనే రాయబారిని మౌర్య ఆస్థానానికి పంపాడు. కాబుల్, పంజాబ్‌ల మీదుగా ప్రయాణిస్తూ అతడు పాటలీపుత్ర చేరుకున్నాడు. పాటలీపుత్ర మౌర్య సామ్రాజ్యానికి రాజధాని. తాను ప్రయాణం చేసిన ప్రాంతాల గురించి మెగస్థనీస్‌కు స్పష్టమైన అవగాహన ఉండేదనడంలో ఎలాంటి సందేహం లేదు. భారతదేశంలోని మిగతా భాగాలపై పరిజ్ఞానం కోసం అతడు రాచరిక నివేదికలపై ఆధారపడ్డాడు. అతడి కృతిలో అనేక పరిమితులు ఉండడం సహజమే అయినప్పటికీ అతడు నిశితంగా దృష్టి సారించిన అంశాలు

మాత్రం విశ్వసనీయమైనవి. భారతీయ భాషలు, సంస్కృతిపై అవగాహన లేకపోవడంతో అతడి రచనల్లో కొన్ని వైరుధ్యాలు కనిపిస్తాయి. అతడు రచించిన ఇండికా అనే గ్రంథం తప్పిపోయింది. స్ట్రాబో, అర్రియన్, డియోడొరస్, తదితర రచయితల గ్రంధాలలో ఇండికాలోని కొన్ని భాగాలు ఇంకా సజీవంగా ఉన్నాయి. చంద్రగుప్తుని పౌర, సైనిక ప్రభుత్వం, దేశ వ్యవసాయ భూమి, వాతావరణం, పశువులు, మొక్కలు ప్రజల ఆచార వ్యవహారాల గురించి అవి తగిన సమాచారాన్ని అందిస్తాయి.

**బిందుసారుడు (క్రీ.పూ 297-272) :** గ్రీకులకు అమిత్రోఖేట్స్‌గా సుపరిచితుడైన బిందుసారుడు (సంస్కృత పదం అమిత్రఘాత (ప్రత్యర్థులను హరించేవాడు) నుండి గ్రీకు పదం అమిత్రోఖేట్స్ పుట్టుకొచ్చింది) దక్కను వరకు ఆయుధాలను తీసుకెళ్లినట్లు చెబుతారు. మౌర్య సామ్రాజ్యాన్ని దక్షిణాదిలో మైసూరు వరకు విస్తరించాడని భావిస్తారు. టిబెట్ బౌద్ధ సన్యాసి తారానాథ ప్రకారం (ఇతడు భారతదేశాన్ని 16వ శతాబ్దంలో పర్యటించాడు) బిందుసారా 16 రాజ్యాలను జయించాడు. అవి రెండు సముద్రాల మధ్య విస్తరించి ఉన్నాయి. బహుశా అతడు బంగాళాఖాతం, అరేబియా సముద్రాలను ప్రస్తావించి ఉంటాడు. తమిళనాడు, కేరళలను మౌర్యులు ఆక్రమించినట్లు కొన్ని తొలి తమిళ గ్రంథాలు కూడా ప్రస్తావిస్తాయి. అయితే ఈ ఆధారాలతో బిందుసారా తన సామ్రాజ్యాన్ని దక్షిణాది వరకు విస్తరించాడని ఊహించడం అన్యాయమే అవుతుంది. బహుశా దక్షిణాది ప్రాంతాలు కనీసం మౌర్య సామ్రాజ్య ఆధిపత్యాన్ని గుర్తించి ఉంటాయి. సామ్రాజ్యంలో అవి ఎన్నడూ అంతర్భాగంగా లేవు. మైసూరు వరకు విస్తరించిన అశోకుని శాసనాలలో దక్షిణ భారతంపై సైనిక దాడి జరిగినట్లు ఎక్కడా ప్రస్తావించకపోవడం మన వాదనను బలపరుస్తుంది. సిరియా సెల్యూకస్ రాజు ఒకటవ ఆంటియోకస్‌తో బిందుసారునికి సంబంధాలు ఉండేవి. సిరియా పాలకుని రాయబారి డీమాకస్ మౌర్య ఆస్థానంలో గడిపినట్లు చెబుతారు. తియ్యటి మద్యం, ఎండబెట్టిన దోస, ఒక ఫిలాసఫర్ తన వద్దకు పంపించాలని బిందుసారుడు ఆంటియోకస్‌కు లేఖ రాశాడు. అతడు అన్ని పంపించాడు. కాని ఫిలాసఫర్‌ని పంపలేదు. గ్రీకు చట్టాలు అందుకు అనుమతించవని సమాధానం ఇచ్చాడు. మత క్షేత్రంలో బిందుసారా అజీవిక అనే పూజా విధానంలో ఎక్కువ ఆసక్తి చూపాడు. నిజానికి ఒక అజీవిక జోతిష్యుడు ఉండేవాడు. అతడి పేరు పింగళవత్స. అశోకుడు జన్మించినపుడు అతడు బిందుసారా ఆస్థానంలోనే ఉన్నాడు. అశోకుడు రాజు అవుతాడని అప్పుడే జోస్యం చెప్పాడు. అశోకవదన అనే గ్రంథం బిందుసారా పాలనలో తక్షశిలలో తిరుగుబాటు జరిగినట్లు మనకు సమాచారం ఇస్తుంది. ఉన్నతాధికారుల అణచివేతకు అక్కడ ప్రజలు అభ్యంతరం చెప్పారు. తిరుగుబాటును అణచివేసేందుకు బిందుసారా అశోకుడిని అక్కడికి పంపించాడు. తన కర్తవ్యంలో అశోకుడు సఫలమయ్యాడు. తన తండ్రి మరణం తర్వాత, రాజ్యాధికారాన్ని చేజిక్కించుకోవడానికి అశోకుడు ఉజ్జెయినీ నుండి నేరుగా పాటలీపుత్రకు తరలి వెళ్లాడని అనేక బౌద్ధ కథనాలు స్పష్టం చేస్తున్నాయి. కనుక అశోకుడు తక్షశిలలో గడిపిన కాలం ఉజ్జయినీ వైస్రాయ్‌గా నియమితుడు కావడానికి ముందేనని భావించాల్సి ఉంటుంది. తక్షశిలలో అతడు చూపిన సామర్థ్యం కారణంగా ఉజ్జయినీ వైస్రాయ్‌గా నియమితుడయ్యాడు.

## అశోకుడు (క్రీ.పూ 268-232):

**పట్టాభిషేకం :** 20వ శతాబ్దం ప్రారంభం అయ్యేవరకు అశోకుడు మౌర్య పాలకుల్లో కేవలం ఒకడిగానే పురాణాలలో ప్రస్తావించబడ్డాడు. 1837లో జేమ్స్ ప్రిన్సెప్ దేవానామ్‌పియ పియదస్సి అనే బ్రాహ్మి లిపిలోగల శాసనాన్ని విక్రోడీకరించాడు. తర్వాత అనేక ఇతర శాసనాలు బయటపడ్డాయి. తొలుత ఈ నివేదికలను అశోకుడికి వర్తింపచేయలేదు. అయితే 1915లో మస్కీ శాసనాన్ని కనుగొన్నారు. అది అశోక పియదస్సి గురించి వివరాలు అందించింది. సిలోను వంశచరిత్ర "మహావంశ" ఈ విషయాన్ని ధృవపరిచింది. అశోకుడు పియదస్సిని తన రెండవ పేరుగా శాసనాలలో వినియోగించాడని "మహావంశ" స్పష్టం చేసింది.

అందుబాటులో ఉన్న ఆధారాల మేరకు బిందుసారుని మరణం తర్వాత రాకుమారుల మధ్య సింహాసనం కోసం అంతర్యుద్ధం జరిగిందని తెలుస్తోంది. అందులో అశోకుడు కూడా పాల్గొన్నాడు. తనను వ్యతిరేకించిన కొందరు సోదరులను మాత్రమే అశోకుడు అడ్డు తొలగించుకున్నాడు. కాని బౌద్ధగ్రంథాలు పేర్కొన్నట్లు అందరు సోదరులను కాదు.

తన 99 మంది సోదరులను (అగ్రజుడైన సుసీమతో సహా) చంపిన తర్వాతే అశోకుడు అధికారాన్ని హస్తగతం చేసుకున్నాడని దీపవంశ, మహావంశ అనే గ్రంథాలు పేర్కొన్నాయి. సిలోను ఆధారాల ప్రకారం కేవలం చివరి సోదరుడైన తిస్సా మాత్రమే చావుపాలు కాలేదు. అయితే తారానాథ ప్రకారం అశోకుడు తన సోదరుల్లో కేవలం ఆరుగురిని మాత్రమే చంపాడు. ఇదే వాస్తవమనిపిస్తోంది. పైగా భారీ శిలాశాసనం-5లో అశోకుడు తన సోదర సోదరీలు, వారి కుటుంబ సభ్యుల సంక్షేమానికి అధికారులను నియమించినట్లు పేర్కొన్నాడు. క్రీ.పూ. 272 నుండి 268 వరకు నాలుగేళ్ల పాటు ఈ అంతర్యుద్ధం జరిగింది. సింహాసనంపై తన స్థాయిని భద్రపరచుకున్న తర్వాతే అశోకుడు క్రీ.పూ. 268లో లాంఛనంగా పట్టాభిషేకం పొందాడు.

సింహాసనం ఎక్కిన తర్వాత అశోకుడు విలాస జీవితంలో మునిగిపోయి, కామాశోకగా మారాడని తారానాథ పేర్కొన్నాడు. తర్వాత అత్యంత కిరాతకంగా ప్రవర్తించి చండాశోకునిగా ముద్ర వేయించుకున్నాడు. చివరకు బౌద్ధ మతాన్ని స్వీకరించి దయాగుణాన్ని ప్రదర్శించడంతో "ధమ్మాశోక"గా పిలవబడ్డాడు.

## ముఖ్యమైన ఘటనలు:

క్రీ.పూ. 260లో కళింగతో జరిగిన యుద్ధమే అశోకుని పాలనాకాలంలో సంభవించిన అత్యంత ప్రధానమైన ఘటన అని చరిత్రకారులు పేర్కొంటారు. అశోకుడే స్వయంగా ఆ యుద్ధంలో జరిగిన ఘోరాలను వివరించాడు. యుద్ధంలో సుమారు లక్షా యాభై వేల మంది ప్రాణాలు కోల్పోయారు. అంతకంటే ఎక్కువ మంది గాయపడ్డారు. కళింగ యుద్ధం తర్వాత అశోకుడు నాటకీయ పరిస్థితులలో బౌద్ధమతాన్ని స్వీకరించాడని అంతవరకు అందరూ భావించారు. అయితే అలా జరగలేదు. అతడు వేయించిన ఒక శిలాశాసనం ప్రకారం (భాబ్రా

శాసనం) యుద్ధం ముగిసిన రెండున్నర ఏళ్లకుగాని అతడు బౌద్ధమత సమర్ధకునిగా మారలేదు. బౌద్ధ సన్యాసి ఉపగుప్త ప్రోద్బలంతో, ప్రభావంతో అతడు బౌద్ధ మతాన్ని స్వీకరించాడు.

భాబ్రా శిలాశాసనంలో అశోకుడు ఇలా పేర్కొన్నాడు. "బౌద్ధ మతాన్ని బుద్ధునిపై విశ్వాసాన్ని, ధమ్మ, సంఘంలో సభ్యత్వాన్ని నేను అంగీకరిస్తున్నాను" ఈ శాసనాన్ని స్థానిక బౌద్ధ పురోహితుల కోసం ప్రత్యేకంగా వేయించినదే కాని విశాలమైన ప్రజానీకం కోసం కాదు. ఈ శాసనం లో అశోకుడు తనను తాను"మగధ రాజు"గా ప్రకటించుకున్నాడు. ఇలాంటి హోదాను ఈ ఒక్క సందర్భంలోనే అతడు వాడుకున్నాడు.

క్రీ.పూ. 250లో పాటలీపుత్ర వద్ద మొగ్గలిపుత్త తిస్సా ఆధ్వర్యంలో మూడవ బౌద్ధ మండలి సమావేశమైంది. విభజ్జవాద సిద్ధాంతాన్ని నిజమైన మతవిశ్వాసంగా ప్రకటించారు. విచిత్రమేమిటంటే ఈ సమావేశం గురించి అశోకుడు తన శాసనాలలో ఎక్కడా ప్రస్తావించలేదు. బౌద్ధ గ్రంథాలలో పేర్కొనబడిన ప్రధాన సంఘటనలలో కేవలం ఒక్కదానిని మాత్రమే అశోకుని శాసనాలు సమర్ధిస్తాయి. అదే సంఘ ప్రక్షాళన. మూడవ బౌద్ధ మండలి ముగిసిన తర్వాత కొందరు ప్రముఖ బౌద్ధ సన్యాసులను ఎంపికచేసి వివిధ ప్రాంతాలకు మిషనరీలుగా పంపారు. వీరిలో మజ్ఝహంతిక (కాశ్మీర్, గంధార), మహాదేవ (మహిసమండల), రఖ్ఖిత (వారణాసి), యోన ధర్మరఖ్ఖిత (అపరాంతక), మహాధర్మరఖ్ఖిత మహారథ మహారఖ్ఖిత (యోన), మజ్జిమ (హిమాలయ), సోన, ఉత్తర (సువర్ణభూమి), మహింద (లంక) ఉన్నారు.

యోన అనే పదం గ్రీకు జాతీయుడిని సంబోధించడానికి ఉద్దేశించినది. కనక ధర్మరఖ్ఖిత పేరుకు ముందు ఈ పదాన్ని వాడడం అతడి విదేశీయతను సూచిస్తుంది. అతడు గ్రీకు లేదాపర్షియా వాసుడై ఉంటాడు. అయితే అతడిని అపరాంతక (భారత పశ్చిమతీరానికి) కు పంపి మహారఖ్ఖితను యోన దేశానికి పంపడం ఆశ్చర్యకరంగా కనిపిస్తుంది. బహుశా యోన అంటే పశ్చిమోత్తర నివాస ప్రాంతాలై ఉంటాయి. అయితే రుద్రదమనుడు వేయించిన జునాగఢ్ శాసనంలో తుసస్ప (అశోకుడి గవర్నర్) పేరును ప్రస్తావించడం బట్టి పశ్చిమ భారతదేశంలో పర్షియన్లు లేదా గ్రీకుల విదేశీ వలస ప్రాంతాలు ఉండేవని బోధపడుతుంది.

అశోకుని శాసనాలు, ముఖ్యంగా భారీశిలాశాసనం-2 దక్షిణాది రాజ్యాల గురించి ప్రస్తావిస్తాయి. చోళ, పాండ్య, సత్యపుత్ర, కేరళపుత్ర రాజ్యాలను ప్రాచంత రాజ్యాలు (సరిహద్దు రాజ్యాలు)గా గుర్తిస్తాయి. అవి విజిత లేదా రాజవిషయ (సామ్రాజ్య ప్రాంతాలు)కు స్పష్టమైన రీతిలో భిన్నంగా గుర్తించ బడ్డాయి. కనక దక్షిణాది రాజ్యాలు మౌర్య సామ్రాజ్యానికి వెలుపల కొనసాగి ఉండవచ్చు. కాని వాటికి మౌర్యులతో సన్నిహిత సంబంధాలు ఉండేవి.

సాంప్రదాయ ఆధారాల ప్రకారం (కల్హణుడి రాజతరంగిణి) కాశ్మీర్ మౌర్య సామ్రాజ్యంలో అంతర్భాగం. అశోకుడు శ్రీనగర్ నగరాన్ని నిర్మించాడు. మధ్య ఆసియాలోని ఖోటన్ కూడా మౌర్యుల నియంత్రణలో ఉండేదని భావిస్తారు. కొన్ని టిబెటన్ ఆధారాలు అశోకుడు ఈ ప్రాంతాన్ని సందర్శించినట్లు కూడా చెబుతాయి. ఒక వేళ ఖోటన్ మౌర్య సామ్రాజ్య పరిధిలో ఉండకపోయినా రెండు ప్రాంతాల మధ్య స్నేహ సంబంధాలను కొట్టి వేయలేము. ఆధునిక నేపాలీ ప్రాంతాలతో మౌర్యులకు సన్నిహిత సంబంధాలు ఉండేవి.

ఎందుకంటే హిమాలయ పర్వతపాదాలు సామ్రాజ్య పరిధిలోనే ఉండేవి. అశోకుడి కుమార్తెలలో ఒకరు నేపాల్ రాజవంశీయునితో వివాహమాడినట్లు చెబుతారు.

సిలోను సాంప్రదాయక సాహిత్యం మౌర్యులు, సిలోన్ మధ్య కొనసాగిన సన్నిహిత సంబంధం గురించి స్పష్టమైన ఆధారాలను అందిస్తుంది. సిలోన్ పాలకుడు తిస్సా తనను తాను అశోకుని తరహాలో తీర్చిదిద్దుకున్నాడని తెలుస్తోంది. మౌర్యచక్రవర్తి తన కుమారుడు (మహేంద్రు) కుమార్తె (సంఘమిత్ర)లను బౌద్ధ ప్రచారకులుగా సిలోన్‌ను పంపాడు. వారితో పాటు బోధి చెట్టు (ఈ చెట్టు కిందే బుద్ధుడు చైతన్యం పొందాడు)లో ఒక శాఖను శ్రీలంకకు పంపాడు. ఈ చెట్టు సిలోన్‌లో నేటికీ జీవిస్తోందని చెబుతారు. అయితే భారతదేశంలోని మూల చెట్టును క్రీ.శ. ఏడవ శతాబ్దంలో గౌడకు చెందిన శశాంక కూల్చివేశాడని భావిస్తారు.

భారీశిలాశాసనం-13 లో అశోకుడు హెలెనిక్ ప్రపంచంలోని తన సమకాలికుల గురించి ప్రస్తావించాడు. వీరితో రాయబారాలు నడిపాడు. అలాంటి ఐదుగురు పాలకులలో ఆంతియోక, తురమాయ, అంతికిని, మాక, అలికాసుదర ఉన్నారు. వీరిని సిరియారాజు రెండవ ఆంతియోకస్ థియోస్, ఈజిప్టు పాలకుడు రెండవ టోలెమి ఫిలడెల్ఫస్, మెసిడోనియా రాజు ఆంతిగోనస్ గొనాటస్, సిరీన్‌కు చెందిన మాగస్, ఎపిరస్ పాలకుడు అలెగ్జాండర్‌గా గుర్తించారు.

**కుటుంబ సభ్యులు:**

అశోకుని కుటుంబానికి చెందిన సభ్యుల గురించి వివిధ గ్రంథాలు, ఆధారాలలో ప్రస్తావన ఉంది. వంశథాపకాసిని, దివ్యవదన, అశోకవదన లాంటి బౌద్ధ గ్రంథాలలో అశోకుడి తల్లి అస్తిత్వం గురించి ఖచ్చితమైన సూచనలు ఉన్నాయి. అశోకవదనలో ఆమెను సుభద్రాంగిగా పేర్కొన్నాడు. చంపాకు చెందిన ఒక బ్రాహ్మణుడికుమార్తెగా ఆమెను అభివర్ణించారు. అశోకుని పట్టపురాణిగా చాలా కాలం వరకు అసంధిమిత్త కొనసాగింది. ఈమె గురించి మహావంశ. అనే గ్రంథంలో ప్రశంసాయుతమైన వివరణ ఉంది. అసంధిమిత్త మరణం తర్వాత తిస్సారకను ప్రధాన రాణి స్థాయికి పెంచారు. ఈమె గురించి బౌద్ధ సాహిత్య కృతులలో ఎలాంటి ప్రశంసలు లేవు. ఎందుకంటే అశోకుడికి ఎంతో ప్రీతిపాత్రమైన చెట్టుకు ఆమె హాని తలపెట్టింది. మరోరాణి కౌరవకి గురించి అలహాబాద్ వద్దగల రాణిశాసనంలో ప్రస్తావన ఉంది. అందులో ఆమె చేసిన మత, సేకా విరాళాల గురించి వివరాలు ఉన్నాయి. తివారా అనే రాకుమారునికి ఆమె జన్మనిచ్చిందని వివరించబడింది. అశోకుని రాణులలో ఒక్క కౌరవకి పేరే శాసనాలలో కనిపిస్తుంది. తిస్సారక వ్యక్తిగత నామమే కౌరవకి అని, ప్రధాన రాణిగా మారిన తర్వాత ఆమె తిస్సారక అనే బిరుదును పొందిందని కొందరు వాదించారు.

దివ్యవదనలో అశోకుడి మూడవ భార్యగా ప్రస్తావించబడిన రాణి పద్మావతి. ఈమె ఎన్నడూ పట్టపురాణి కాకపోయినప్పటికీ యువరాజు కునాల (ధర్మవర్ధన)కు తల్లి. రాజతరంగిణిలో జలౌకను అశోకుడి మరో కుమారునిగా ప్రస్తావించినా అతడి తల్లి గురించి ఎలాంటి వివరాలు ఇవ్వలేదు.

అశోకుని కుమార్తెలలో ఇద్దరి గురించి మనకు బాగా తెలుసు. ఒక కుమార్తె సంఘమిత్ర. మరో రాకుమారి చారుమతి. ఈమె నేపాల్ క్షత్రియుడు దేవపాలను వివాహమాడింది. అశోకుని మనవళ్లలో సంప్రతి (కునాల పుత్రుడు), దశరథ గురించి తరచుగా ప్రస్తావించబడింది.

మహావంశ అనే గ్రంథంలో అశోకుడి పాలన చివరి సంవత్సరాలలో జరిగిన ఘటనల గురించి వివరించారు. తన 29వ పాలనా సంవత్సరంలో అశోకుడి పట్టపురాణి అసంధిమిత్త మరణించింది. నాలుగేళ్ల తర్వాత (237బిసి) అశోకుడు తిస్సారకను పట్టపురాణిని చేశాడు. రెండేళ్ల తర్వాత తిస్సారక అశోకునికి ప్రియమైన చెట్టును విషపు బాణంతో గాయపరిచింది. దాంతో ఆ చెట్టు బలహీనపడింది. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన అశోకుడు ఆ చెట్టును సజీవంగా ఉంచడానికి తన శాయశక్తులా కృషి చేశాడు. దానిని కాపాడుకోగలిగాడు. ఇదే కథనాన్ని ఫాహియాన్ వల్లెవేశాడు కాని రాణి పేరును మాత్రం ప్రస్తావించలేదు.

**అశోకుని శిలాశాసనాలు:**

**నేపథ్యం :** ఈస్ట్ ఇండియా కంపెనీ అధికారి జేమ్స్ ప్రిన్సెప్ 1837లో అశోకుని శాసనాలను విక్రోడీకరించేంత వరకు వాటి ప్రాముఖ్యత గురించి ఎవరికీ తెలియదు. ఆ తర్వాతే వాటిని మెచ్చుకోవడం మొదలుపెట్టారు. 20వ శతాబ్దం మొదటి భాగంలో ఈ శాసనాల రచయిత అశోకుడని తొలిసారిగా గుర్తించడంతో వాటిపై ఎనలేని ఆసక్తి పెరిగింది. ఈ శాసనాలలో చాలా వరకు అశోకుడు ప్రజలతో నేరుగా సంభాషించినవే ఉన్నాయి. కొన్ని మాత్రమే బౌద్ధ మత స్వీకారం గురించి, అశోకుడికి సంఘంతో ఉన్న సంబంధం గురించి ప్రస్తావిస్తాయి. అశోకుని రాజశాసనాలు, శిలాశాసనాలు అతడి వ్యక్తిత్వం గురించే కాకుండా అతడి పాలనలో సంభవించిన ముఖ్య సంఘటనల గురించి మనకు సమాచారాన్ని అందిస్తాయి. ప్రాకృత భాష, బ్రాహ్మిలిపి, పశ్చిమోత్తర ప్రాకృత, ఖరోష్టిలిపి, గ్రీకు భాష, లిపి, అర్మాయిక్ భాష, లిపిలలో ఈ శాసనాలు ఉన్నాయి.

**వర్గీకరణ :** ఉపరితల స్వరూపం ఆధారంగా శిలాశాసనాలను వర్గీకరించారు. అంటే రాళ్లు, స్తంభాలు, గుహలు అని అర్థం. అయితే ఈ వివిధ ఉపరితలాలు వివిధ ప్రయోజనాలకు అనుగుణంగా ఉండేవి. కనక వాటి స్థాపన, అంశాలు ఒక శైలిని అనుసరిస్తాయి.

భారీ శిలాశాసనాలను సామ్రాజ్య సరిహద్దుల వెంబడి నిర్మించారు. బంగాళ ఖాతం తీరంలో కొత్తగా స్వాధీనం చేసుకున్న ప్రాంతంలో రెండు కళింగ శిలాశాసనాలు కూడా ఇందులో ఉన్నాయి. అశోకుడు వేయించిన 14 భారీ శిలాశాసనాలు విశాలమైన భూభాగంలో విస్తరించి ఉన్నాయి. అవి విభిన్నమైన అనేక అంశాలు కలిగి ఉన్నాయి. మొదటి రెండు శిలాశాసనాలు పశువులవధ విధివిధానాలు, అలాగే వైద్య, సంక్షేమ సేవల కల్పనకు సంబంధించినవి. తర్వాత నైతికవర్తనం, న్యాయపాలనలో అనుసరించాల్సిన దమ్మ సూత్రాలు, ధమ్మ స్వరూపం, సహనం, కర్మకాండ, దాతృత్వంపై దాని ప్రభావం గురించి ప్రస్తావించి అంతిమంగా కళింగయుద్ధ చరిత్ర, దాని పర్యావసానాలతో ముగుస్తాయి.

రెండు కళింగ శాసనాలు (వీటిని కొన్ని సార్లు 14, 16 శాసనాలని పిలుస్తారు) మిగతా మూడు శాసనాలు (దాతృత్వం, మానవాళి రాజత్వంపై 11 శాసనం, పరమత సహనంపై 12 శాసనం, కళింగ యుద్ధం, మార్పు 13శాసనం), ఆక్రమిత ప్రాంతాల పాలనాధికారుల నుద్దేశించి నైతికవర్తన సమస్యలు, న్యాయపాలన, పొరుగు ప్రాంతాల ప్రజల అపోహలను తగ్గించే సమస్య, అంతర్జాతీయ శాంతిని ప్రోత్సహించడంపై ఉన్న మరో రెండు శాసనాలకు సరితూగుతాయి.

భారీ స్థూపశాసనాలను ముఖ్యమైన నగరాలు, సామ్రాజ్యంలోని ప్రధాన రహదారుల వెంట ఏర్పాటు చేశారు. వీటిలో మూడు స్థూపాలు పాటలీపుత్ర నుండి హిమాలయ పర్వత పాదాలలో ఉన్న బౌద్ధ పవిత్ర స్థలాల (పుణ్యక్షేత్రాలు) వరకు ఉన్న రహదారి వెంట ఉన్నాయి. వాటి వివరాల శైలి సాత్వికంగా ఉంది. ధమ్మ స్వభావంతో రెండు స్థూపశాసనాలు మొదలవుతాయి. పాపం, మోహాన్ని నియంత్రించేందుకు ధమ్మ విలువలను ప్రయోగించడంపై నైతికవర్తనం, న్యాయపాలనను పాటించడం, వేడుకలు, జంతు బలులను నియంత్రించడంపై మూడు శాసనాలు ఉన్నాయి. నైతికవర్తనాన్ని అమలు చేసేందుకు వినియోగించవలసిన సాధనాల గురించి మరో శాసనం ఉంది. అదే చివరిది. (తోప్ర కాలమ్ విషయంలో రెండు శాసనాలు ఉన్నాయి).

చిన్న రాతిశాసనాలు దక్షిణాది, సామ్రాజ్యంలోని మధ్యభాగాలలో కేంద్రీకృతమై ఉన్నాయి. బౌద్ధ మత సాధారణ అనుచరునిగా అశోకుని కార్యకలాపాలు, విలువలకు సంబంధించిన ఆచరణాత్మక నియమావళి, చివరగా బౌద్ధ పురోహితులకు ఉద్దేశించి వేయించిన ధమ్మ గ్రంథాలు చిన్నరాతిశాసనం-3 ఇందులో కనిపిస్తాయి.

ఈ మూడు చిన్న రాతిశాసనాలలో రెండు శాసనాలు, అలాగే మరో రెండు స్థూప శాసనాలు (నేపాల్) బౌద్ధ మతానికి సంబంధించినవి. గుహ శాసనాలు బరాబర్ కొండల్లో కనిపిస్తాయి. వర్షాకాలంలో బౌద్ధ సన్యాసులకు ఇవి తాత్కాలిక వసతిని కల్పిస్తాయి.

**నైసర్గిక విస్తరణ:** సుమారు పది క్షేత్రాలలో విభిన్న అంతరాలతో 14 భారీ శిలాశాసనాలు బయటపడ్డాయి. కల్సీ, గిర్నార్, సోపార, ధౌలీ, జౌగాద, ఎర్రగుడి, సన్నతి, షహ్‌బాజ్‌గఢీ, మన్సేరా, కందహార్‌లలో అవి కనుగొనబడ్డాయి. ఇందులో ఏడు శాసనాలు ప్రాకృత భాష, బ్రాహ్మిలిపిలో ఉండగా, రెండు ప్రాకృత - ఖరోష్టిలో, మరొకటి గ్రీకు లిపిలో ఉన్నాయి. నేడు పై ప్రాంతాలలో 14 శాసనాలన్నీ లేవు. ధౌలీ, జౌగాదలలో 11,12,13 శాసనాలు స్థానంలో రెండు వేర్వేరు కళింగ శాసనాలు వచ్చాయి. ఈ రెండు శాసనాలు మరో క్షేత్రం (సన్నతి)లో కూడా బయటపడ్డాయి.

ప్రాకృత బ్రాహ్మిలలో లభించబడిన మూడు చిన్న రాతి శాసనాల గురించి మనకు తెలుసు. ఇందులో మొదటిది 17 ప్రాంతాలలో (సహస్రామ్, రూపానాథ్, గుజ్జర, పాంగుడారియా, అహ్రీరా, ఢిల్లీ సమీపంలోని బాహాపూర్, బైరత్, బ్రహ్మగిరి, సిద్ధాపూర్, జతింగ-రామేశ్వర్, మస్కీ, గవీమద్, పాల్కిగుండు, నిట్టూర్, ఉదేగోలం, ఎర్రగుడి, రాజులమందగిరి) బయటపడింది. పై ప్రాంతాలలో ఏడు ప్రాంతాలు (బ్రహ్మగిరి, సిద్ధాపూర్, జతింగ-రామేశ్వర్, నిట్టూర్, ఉదేగోలం

ఎర్రగుడి, రాజుల మందగిరి) రెండవ చిన్న రాతి శాసనాన్ని అందించాయి. బైరట్‌లో పై రెండు శాసనాలకు అదనంగా మరో శాసనం (మూడవ చిన్నరాతి శాసనం) లభించింది.

ప్రధాన స్థూపశాసనాలు ఆరు ఉన్నాయి. అవి ఏకశిలా స్థూపంపై చెక్కబడ్డాయి. ఐదు ప్రదేశాలలో (మీరట్–14వ శతాబ్దంలో ఇక్కడి నుండి ఢిల్లీకి స్థూపాన్ని తరలించారు. కౌసంబి–ఇక్కడి నుండి అలహాబాద్‌కు తరలించారు, లౌరియా–అరారజ్, లౌరియా– నందన్‌గఢ్ రామ్‌పూర్వ బీహార్) ఇవి బయటపడ్డాయి. ఏడవ శాసనం గల ఆరవస్థూపం తూర్పు పంజాబ్‌లోని తోప్ర వద్ద నిర్మించబడింది. 14 వ శతాబ్దంలో దీనిని ఢిల్లీకి తరలించారు. తొలి ఆరు స్థూప శాసనాలలో ఉల్లేఖనాలు సమరూపంగా ఉన్నాయి.

తొలుత కౌశాంబి వద్ద స్థాపించిన అహ్మదాబాద్ స్థూపం రెండు అదనపు శాసనాలతో లిఖించబడింది. మొదటిదైనా చిన్న స్థూపశాసనం–1 భోపాల్ సమీపంలోని సాంచి, ఉత్తర ప్రదేశ్‌లోని సార్‌నాథ్‌లలో కూడా కనిపిస్తుంది. పై ప్రాంతాలన్నింటిలో శాసనాలను చాలా గట్టిగా సమర్ధిస్తున్నారు. ఉల్లేఖనాలలో గణనీయమైన వైరుధ్యమూ ఉంది. సార్‌నాథ్ శాసనంలో చిన్న స్థూపశాసనం–2 కూడా లిఖించబడింది. అలహాబాద్– కోసమ్ స్థూపంలో కనిపించే రెండవ అదనపు శాసనం (చిన్న స్థూపశాసనం–3) అశోకుని రాణులలో ఒకరి నుండి లభించిన కానుకను గుర్తు చేస్తుంది. కనుక సాధారణంగా దానిని రాణి శాసనంగా పరిగణిస్తారు. చివరిగా నేపాల్‌లో రెండు స్థూపశాసనాలు లభించాయి. ఒకటి బుద్ధుడి జన్మస్థలమైన రుమ్మిన్‌దే వద్దగల ఆలయంలో, మరొకటి నిగాలీ సాగర్ లేదా నిగ్లీవ అనే పెద్ద సరస్సులో లభించాయి. నిగ్లీవలో కనకముని అనే బుద్ధుడి పూర్వ అవతార పురుషుడి అస్థికలు ఉన్నాయి. ఎలాంటి ఉల్లేఖనం లేని స్థూపాలను కూడా అశోకుడు నిర్మించాడు. అయితే వాటిలో కొన్ని మాత్రమే మిగిలాయి.

బీహార్‌లోని బరాబర్ కొండ గుహలలో అశోకుడు వేయించిన నాలుగు గుహశాసనాలలో మూడింటిని కనుగొన్నారు. నాల్గవది క్రీ.శ. ఐదవ శతాబ్దానికి చెందిన శాసనాన్ని కలిగి ఉంది. తొలి రెండు గుహశాసనాలు అజీవిక పూజావిధానాన్ని పాటించే బౌద్ధ సన్యాసుల నివాస స్థలాలుగా గుహలను అంకితమిస్తాయి. మూడు ఇతర గుహలు బరాబర్ కొండల్లో మరో భాగమైన నాగార్జుని కొండలో ఉన్నాయి. వాటిలో కూడా శాసనాలు కనిపిస్తాయి. అవి కూడా అజీవిక సన్యాసులకు అంకితం ఇవ్వబడ్డాయి. ఇక్కడ పాలకుడు తనను తాను దేవానాంప్రియగా అభివర్ణించుకున్నాడు. అయితే ఈ అంకితాలను అశోకుడి మనవడు దశరథ అందించాడు.

కందహార్ సమీపంలోని ప్రాంతంలో ప్రధాన రాతి శాసనాలు 12,13 గ్రీకు లిపిలో కనిపించాయి. ద్విభాష శాసనం (అర్మాయిక్–గ్రీకు) కందహార్ సమీపంలోని షార్–ఎ–కునాలో లభించింది. తక్షిల, కందహార్, పుల్–ఎ– దరుంత, లఘ్మన్ లోయలలో అర్మాయిక్ లిపిలో ఉన్న శాసనాలు బయల్పడ్డాయి. ఈ లోయలో ఒక శాసనానికి చెందిన రెండు స్వరూపాలను (వేర్వేరు కాలాలలో వేసినవి) కూడా కనుగొన్నారు.

పైన పేర్కొన్న శాసనాలలో ప్రాకృతభాష, ఖరోష్టి లిపిలో ఉన్నవి నేటి పాకిస్తాన్ భూభాగంలో లభించాయి. అర్మాయిక్ లిపిలో ఉన్న శాసనాలలో ఒకటి తక్షిల, ఐదు తూర్పు ఆఫ్ఘనిస్తాన్‌లో బయటపడ్డాయి. రెండు గ్రీకు లిపి శాసనాలు ఇదే ప్రాంతంలో లభించాయి. ప్రాకృతభాష, బ్రాహ్మీలిపిలో ఉన్న శాసనాలు ఉత్తర భారతదేశం, భారత ద్వీపకల్పంలోని వేర్వేరు ప్రాంతాలలో దొరికాయి.

పై రాచరిక నివేదికలన్నీ ఒకప్పుడు అశోకుని పాలన ఉన్న ప్రాంతాలలోపలే ఉండేవని తెలుస్తోంది. అవి లభించిన ప్రాంతాలను బట్టి మనం మౌర్య సామ్రాజ్య వైశాల్యాన్ని నిర్ధారించవచ్చు. అశోకుని శిలాశాసనాలలో ఖరోష్టి, బ్రాహ్మీ లిపిలో ఉన్నవాటి గురించి సుదీర్ఘకాలం చర్చించారు. అయితే గ్రీకు, అర్మాయిక్ శాసనాల ప్రాముఖ్యతను కేవలం ఇటీవలి దశాబ్దాలలోనే గ్రహించారు.

క్రీ.పూ. 260 కాలంలో ధర్మ (ధమ్మ) పర్యటనలు మొదలయ్యాయి. అదే సంవత్సరంలో చిన్న రాతిశాసనాలు -1,2 లను విడుదల చేసి ఉంటారు. శిలాశాసనాలలో ఈ రెండు మొదటివి. కళింగ శాసనాలు (15. 16) బహుశా క్రీ.పూ. 259లో ప్రచురించబడి ఉంటాయి. అయితే 14 రాతి శాసనాలను జారీ చేశారు. క్రీ.పూ. 258-257 మధ్య బరాబర్ కొండలలోని రెండు గుహలను అజీవిక బౌద్ధ సన్యాసులకు అంకితమిచ్చారు. నేపాల్‌లోని రెండు స్మారకస్థూపాలు క్రీ.పూ 250 పరిసర ప్రాంతంలో నిర్మించబడ్డాయి. తర్వాత క్రీ.పూ. 243-242లో స్థూల శిలాశాసనాలను ఏర్పాటు చేశారు.

**అశోకుని ధమ్మ**

**ధర్మ ఉద్దేశ్యం, నేపథ్యం:**

మౌర్య సామ్రాజ్యాన్ని స్థాపించిన తర్వాత సుమారు 137 సంవత్సరాల పాటు దాని అఖండతను నిలపడాన్ని పరాక్రమ వ్యూహాలతో పాటు బలమైన అధికారిక వ్యవస్థ తోడ్పడాయి. అశోకుని ధమ్మసిద్ధాంతం వల్ల అవి మరింత బలపడ్డాయి. ఈ విషయంలో గ్రీకు, అర్మాయిక్ శాసనాలు ఎంతో విలువైన సమాచారాన్ని అందించాయి. అశోకుడు బౌద్ధంవైపు మొగ్గు చూపడాన్ని ప్రాకృత శాసనాలు సమగ్రంగా నమోదు చేశాయి. వీటిని ఆధారం చేసుకొని విద్వాంసులు తరచూ అశోకుని ధమ్మను బౌద్ధంగా ముద్రవేయడానికి ప్రయత్నించారు. అలాగే అశోకుడిని బౌద్ధ పాలకునిగా నిర్ధారించారు. ఇలాంటి అతిసాధారణ పరస్పర సంబంధాన్ని పక్కన పెట్టాల్సి ఉంటుంది. ఎందుకంటే గ్రీకు శాసనాలు "ధమ్మ"ను యూసేబియా లేదా దయాగుణ సిద్ధాంతంగా అనువదించాయి (షార్-ఎ-కునా శాసనం). ధమ్మను అర్మాయిక్ భాషలో కిస్త్ (సత్యం), దాత(చట్టం) గా అనువదించారు. ఇవి షార్-ఎ-కునా, తక్షిల స్థూప శాసనాలలో కనిపిస్తాయి. తన పట్టాభిషేకం జరిగిన పదేళ్లకు అశోక ధర్మను ప్రకటించాడని ఈ నివేదికలలో స్పష్టంగా పేర్కొనబడి ఉంది. కనక అశోకుని ధమ్మను బౌద్ధంతో లేదా మత వాదంతో పోల్చలేము.

చరిత్రకారులు నేడు ధమ్మను విశాలమైన సామాజిక, నైతిక వర్తన నియమావళిగా పరిగణిస్తారు. విశాలమైన మౌర్య సామ్రాజ్యంలోని విభిన్న సముదాయాలకు సామాజిక,

ఆర్థిక, రాజకీయ విభేదాలకు అతీతంగా ఆమోదయోగ్యమైన సిద్ధాంతంగా ధమ్మ అభివృద్ధి చెందిందని వారు గుర్తిస్తున్నారు. ఆ విధంగా ధమ్మ కూడా విశాలమైన అంశమే అవుతుంది. దానిని మత కోణం నుండి విశ్లేషించజాలము. విశాలమైన మౌర్య సామ్రాజ్యాన్ని ఏకంగా ఉంచడంలో ధమ్మ సిద్ధాంతం పోషించిన పాత్రను విస్పష్టంగా అర్థం చేసుకోవాలి.

ధమ్మ సందేశాన్ని ఉపఖండంలోని పశ్చిమోత్తర సరిహద్దు భాగంలో గ్రీకు, అర్మాయిక్ భాషలలో ప్రబోధించారు. అంటే ఆ ప్రాంత ప్రజల భాష, సంబంధిత సాంస్కృతిక అంశాలను చక్రవర్తి పరిగణనలోకి తీసుకొని వారిని భారతీయ భౌతిక, రాజకీయ చిత్ర పటంలో అంతర్భాగం చేశాడని మనం భావించాలి. మరోవైపు దక్కను ప్రాంతంలో ప్రాకృత, బ్రాహ్మిలిపిలో శాసనాలు జారీ చేయడానికి చక్రవర్తి మొగ్గు చూపాడు. ఇక్కడి ప్రజలకుద్రవిడ భాషలపై తగిన అవగాహన ఉండేది. అయితే ఇక్కడ ప్రాకృత భాషలో శాసనాలు వేయించడం చొరబాటు అంశంగా కనిపిస్తుంది. ఉన్నతస్థాయి రాజకీయ అధికారం తన సాయంత్రణను సుదూర దక్షిణ ప్రాంతంపై పెంచుకోవడానికి ఈ శాసనాలను పై నుండి మోపినట్లు భావించాల్సి ఉంటుంది.

ధర్మను ఆచరించడానికి ప్రజలు పెంపొందించుకోవలసిన గుణాల గురించి కందహార్ గ్రీకు శాసనం చెబుతుంది. అందులో రాజు (పాలకుని) ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకోవడం ఒక సద్గుణమని పేర్కొన్నారు. దృఢభక్తి సిద్ధాంత వివరణే ఇది. ప్రాకృత భాషలో ఉన్న 13 శాసనంలో దీని గురించి వివరణ ఉంది. ఈ కారణంగా అశోకుని ధమ్మలో రాజకీయ కోణం కూడా దాగి ఉందని కొందరు విశ్లేషించారు. పాలకుని ప్రయోజనాలను కాపాడే బాధ్యత ప్రజలదేనని చక్రవర్తి పేర్కొన్నాడు. అంటే తనను రక్షించే బాధ్యతను ప్రజలే తీసుకోవాలని అతడు కోరుకున్నాడు. అందుకు ప్రతిఫలంగా ప్రజల పట్ల పాలకుడు తండ్రి స్థాయిలో వ్యవహరిస్తాడు. ధర్మకు రాజకీయ లక్ష్యం ఉండేది. మౌర్య కాలపు పరిస్థితులను అధ్యయనం చేయడంలో ఈ అంశం ఒక సరికొత్త కోణాన్ని జోడించింది.

**ధమ్మ సారం:**

అశోకుని ధమ్మ ఇటు ఒక కొత్త మతం కాదు, అటు కొత్త రాజకీయతత్త్వమూ కాదు. అది ఒక జీవనవిధానమని  చెప్పడమే సబబుగా ఉంటుంది. విశాలమైన ప్రజానీకం పాటించాల్సిన ప్రవర్తన నియమావళిని, విలువల పట్టికను అది అందించింది. అందులోని అంశాలు విశాలమైనవి, మానవీయ కోణం గలవి. కనక వాటిని అశోకుడు విస్తృతంగా ప్రచారం చేసినా ఏ ఒక్క సాంస్కృతిక సముదాయం కాని, మతవర్గం కాని అభ్యంతరం వ్యక్తం చేయలేదు. ధమ్మ సిద్ధాంతాన్ని చట్టం, సామాజిక వ్యవస్థ నేపథ్యంలో వాడుకున్నా ప్రాచీన భారతీయులకు అదేమి కొత్తగా అనిపించలేదు. అయితే అశోకుడు ఆ సిద్ధాంతానికి మానవీయ కణం ఇవ్వడం ద్వారా దానికో కొత్త అర్థాన్ని, ప్రాముఖ్యతను కల్పించాడు.

ధమ్మను అశోకుడే స్వయంగా సృష్టించాడని అందరూ సాధారణంగా అంగీకరిస్తారు. అది బౌద్ధ, హిందూ ఆలోచనాసరళితో ప్రభావితమై ఉండవచ్చు. అయితే చక్రవర్తి ఆ సిద్ధాంతానికి ఒక ఆచరణాత్మకతను, సరళతను, అంతకంటే మించి నైతిక ఔన్నత్యాన్ని ఇవ్వడంతో అదో జీవనవిధానంగా మారింది. ఇదే ధమ్మసారం. ధమ్మ కేవలం బౌద్ధ విలువల విధానం అయి

ఉంటే అశోకుడు దానిని బహిరంగంగా పేర్కొనేవాడు. ఎందుకంటే బౌద్ధం పట్ల తన ఆరాధనను అతడు ఎన్నడూ దాచుకోలేదు. అశోకుని శిలాశాసనాలలో మత అంశాన్ని చొప్పించే విషయానికి వస్తే అందులో స్వర్గప్రాప్తి నైతిక జీవనం ఆధారంగానే సాధ్యమని పేర్కొనబడింది. అంటే దానర్థం సర్వాప్రాప్తికి మత జీవనమొక్కటే మార్గమని కాదు. సాధారణవ్యక్తిలో తెలుసుకోదగ్గ విలువైన ప్రతీకాత్మకను పెంచడానికే అశోకుడు ప్రయత్నించాడు. నైతిక జీవనం అనే విలువను పాటిస్తే అత్యుత్తమ పురస్కారమైన స్వర్గం దక్కుతుందని ప్రబోధించాడు.

**కీలక లక్షణాలు:**

శిలాశాసనాలతో తన ధమ్మ సిద్ధాంతాన్ని ప్రచారం చేసే అవకాశం అశోకునికి లభించింది. వివిధ భారీశిలాశాసనాలు ధమ్మకు సంబంధించిన వివిధ అంశాలను వివరిస్తే భారీ శిలాశాసనం -11 మాత్రం ధమ్మపై విపులమైన వివరణ ఇస్తుంది. అందులో దాతృత్వం, మానవళి రాజత్వం (krinshish of humanity) గురించి కూడా ప్రస్తావన ఉంది. ధమ్మ అనేది లౌకిక అంశమని అది స్పష్టంగా సూచిస్తుంది. ఈ శాసనంతో పాటు ఇతర భారీ శిలాశాసనాల ద్వారా మనం ధమ్మకు సంబంధించిన ఈ కీలక లక్షణాలను నిర్ధారించవచ్చు.

1. జంతు బలులు, వేడుక సంగ్రహాల నిషేధం (శిలాశాసనం-1)., భారీ వ్యయంతో కూడిన నిర్థకమైన వేడుకలు, కర్మకాండలకు దూరంగా ఉండడం (11).
2. సామాజిక సంక్షేమం దిశగా అధికార యంత్రాంగాన్ని సమర్థవంతంగా నిర్వహించడం (2,10)
3. జంతువుల పట్ల అహింస, కరుణ చూపడం(6), బ్రాహ్మణులు శ్రమ పట్ల ఉదారత చూపడం (3)
4. సేవకులను యజమానులు, ఖైదీలను ప్రభుత్వ అధికారులు మానవతా దృక్పథంతో చూడడం. (భారీశిలాశాసనం 5). ధర్మ-మహామత్తుల నియామకం గురించి కూడా ఈ శాసనం ప్రస్తావిస్తుంది.
5. అన్ని మత వర్గాలలో సహనం (7, 12)
6. భేరిఘోష (యుద్ధమృదంగాల ధ్వని) స్థానంలో ధమ్మఘోషను (శాంతి ధ్వని) ప్రవేశపెట్టడం. అంటే యుద్ధం కంటే ధమ్మ ద్వారా మానవాళిని జయించడం (13)
7. ధమ్మయాత్రల వ్యవస్థ ద్వారా గ్రామీణ ప్రజానీకంతో నిత్య సంబంధాలను నిర్వహించడం (భారీశిలా శాసనం 8)

అశోకుని స్థాయి తొలుత ఒక సాధారణ భక్తునిది. అయితే తర్వాత అతడికి సంఘంతో సన్నిహిత సంబంధం ఏర్పడింది. ఫలితంగా అతడు తన మత విశ్వాసాలలో ఛాందసవాదిగా మారాడు. మత ఛాందసులుగా వ్యవహరిస్తే ప్రగతికి బాటలు వేయవచ్చని తన సామ్రాజ్య ప్రజలకు అతడు పిలుపునిచ్చాడు. అయితే ధమ్మను బౌద్ధ ప్రవచనాలతో అతడు ముడిపెట్టలేదు. బౌద్ధం అతడి వ్యక్తిగత విశ్వాసంగా ఉండిపోయింది. ఎర్రగుడి శాసనం ప్రకారం అశోకుడు

ధమ్మను అన్ని సామాజిక స్థాయిలలో చొచ్చుకుపోవాలని కోరుకున్నాడు. క్రీ.పూ 250లో మూడవ బౌద్ధ మండలి సమావేశం జరిగింది. మండలి అసమ్మతివాదాలను ఏరివేస్తూ, ఇతర మత వర్గాలను అణచివేస్తూ ఉన్న సమయంతో కూడా అశోకుడు తన 12వ పాలనా సంవత్సరంలో బరాబర్ కొండల్లోని ఒక గుహను అజీవిక సన్యాసులకు విరాళంగా ఇచ్చాడు. దీనిని బట్టి అతడు కరుడుగట్టిన సాంప్రదాయతత్త్వంతో వ్యవహరించలేదని బోధపడుతుంది.

తన పాలన చివరి సంవత్సరాలలో అశోకుడు అనేక చిన్నస్థాయి స్థూప శాసనాలను జారీ చేశాడు. వాటిలో కొన్ని పూర్తిగా బౌద్ధ కార్యకలాపాలకు సంబంధించినవి. మిగతావి సాధారణ కార్యకలాపాలకు సంబంధించినవి. ధమ్మ సాధించిన పురోగతితో అతడు సంతృప్తి చెందాడు. అయితే ప్రతి ఒక్కరూ ధమ్మను ఆచరించాలన్న ఆలోచన అతడిని పట్టి పీడించినట్లు తెలుస్తోంది. ఛాందసవాదానికి బీజం పడినట్లు ఒక చిన్న స్థూపశాసనం **(I)** ద్వారా బహిర్గతమవుతుంది. ఇదో దురదృష్టకరమైన ఆలోచనాధోరణి. అశోకుడు "పాపం – పుణ్యం" అనే సాంప్రదాయవాద భావనలో మునిగిపోయినట్లు తర్వాతి శాసనాలలో ఒక బలమైన సూచన కనిపిస్తుంది.

**తదుపరి మౌర్యులు (232- 184 క్రీ.పూ) :**

తదుపరి మౌర్యుల గురించి ఆధారాలు చాలా పరిమితంగా ఉన్నాయి. దొరికిన చిన్నపాటి ఆధారాలు కూడా గందరగోళాన్ని, అనిశ్చితిని కలిగిస్తాయి. ఈ కారణంగా వారి చరిత్రను పునఃనిర్మించడం చాలా కష్టం. బౌద్ధ,జైన సాహిత్యంతో పాటు పురాణాలు ఈ మౌర్యుల గురించి కొంత సమాచారాన్ని అందిస్తాయి. అయితే వాటి మధ్య ఏకాభిప్రాయం లేదు. పురాణాలలో కూడా ఒక పురాణం నుండి మరో పురాణానికి ఎంతో వ్యత్యాసం ఉంది. కాని ఒక్క విషయంలో మాత్రం పురాణాలు అంగీకరిస్తాయి. మౌర్య వంశం 137 ఏళ్ల పాటు కొనసాగిందని చెబుతాయి. కనుక తొలి ముగ్గురు మౌర్య చక్రవర్తులు పాలించిన 90 ఏళ్లు పోతే మనకు 47 ఏళ్లు మిగులుతాయి. ఈ కాలంలోనే తదుపరి మౌర్యులు పాలించాలి.

అశోకుని మరణం తర్వాత మౌర్య సామ్రాజ్యం రెండు భాగాలుగా చీలిపోయింది. ఒకటి పశ్చిమ భాగం, మరొకటి తూర్పు భాగం. పశ్చిమ భాగాన్ని కుణాల పాలించాడు. తర్వాత స్వల్పకాలం పాటు సంప్రతి పాలించాడు. అతడి తర్వాత బాక్ట్రియా గ్రీకులు, శాతవాహనులు, ఉత్తర దక్కనులోని ఇతర పాలకుల నుండి ఆ ప్రాంతం దండయాత్రలను ఎదుర్కొంది. సామ్రాజ్యంలోని తూర్పుభాగం పాటలీపుత్ర రాజధానిగా కొనసాగింది. దానిని తొలుత దశరథ పాలించాడు (ఇతడు అశోకుడి మనవడు అయి ఉంటాడు). మత్స్యపురాణంలో దశరథుని గురించి ప్రస్తావన ఉండడమే కాకుండా నాగార్జుని కొండల్లోని గుహల ద్వారా కూడా అతడు మనకు పరిచయమవుతాడు. ఆ గుహలను అతడు అజీవిక సన్యాసులకు అంకితమిచ్చాడు. దశరథ దేవానాంప్రియ ఆదేశించిన మూడు శాసనాలలో అతడు పట్టాభిషేకం పొందిన వెంటనే గుహలను సన్యాసులకు అంకితమిచ్చినట్లు వివరాలు ఉన్నాయి.

మత్స్యపురాణంలో కనిపించే సంప్రతిని బౌద్ధ, జైన సాహిత్యం కుణాల కుమారునిగా వివరిస్తాయి. జైన సిద్ధాంతం ప్రకారం అతడు అశోకుడి మనవడు. జైన మతాన్ని పోషించాడు.

సుహాస్తిన్ అనే ముని అతడితో జైన మతాన్ని స్వీకరింపచేశాడని చెబుతారు. జైన మతం స్వీకరించిన తర్వాత అతడు పాలకునిగా ఆ మతాన్ని చురుకుగా సమర్థించాడని, ఇతర మార్గాలలో కూడా ప్రోత్సహించాడని జైన కృతులు పేర్కొంటాయి. పశ్చిమ భాగంలో పశ్చిమోత్తర రాష్ట్రం, గాంధార, కాశ్మీర్ ప్రాంతాలు ఉండేవి. ఈ ప్రాంతాలను కుణాలా పాలించాడు. కుణాల తన రాజ్య సరిహద్దులను విస్తరించి పశ్చిమ రాష్ట్రాన్ని కూడా స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది.

పురాణాల ప్రకారం దశరథ ఎనిమిదేళ్లు పాలించాడు. యుక్తవయస్సుగల వారసుడు లేకుండానే అతడు మరణించినట్లు భావించాలి. కుణాల కూడా ఎనిమిదేళ్లు పాలించాడని అవే ఆధారాలు పేర్కొంటాయి. దశరథ మరణించిన సమయంలోనే అతడు కూడా మరణించి ఉంటాడు. ఫలితంగా ఇపుడు పశ్చిమ భాగాన్ని పాలిస్తున్న సంప్రతి పాటలీపుత్ర సింహాసనాన్ని విజయవంతంగా తిరిగి దక్కించుకొని ఉంటాడు. ఆ విధంగా సామ్రాజ్యాన్ని ఐక్యం చేశాడు. ఈ సంఘటన క్రీ.పూ 223లో జరిగింది.

అయితే సామ్రాజ్యం అప్పటికే విచ్ఛిన్నం కావడం మొదలుపెట్టింది. సంప్రతి ఉజ్జయినీ, పాటలీపుత్రల నుండి పాలించాడని జైన కృతులు పేర్కొంటాయి. అంటే సామ్రాజ్యంలో పశ్చిమ భాగం రాజధానిని ఉత్తర భారతం నుండి ఉజ్జయినీకి తరలించి ఉంటారు. తదుపరి దశకంలో ఆంతియోకస్-3 బాక్ట్రియా పాలకుడు యుధిడీమస్‌ల మధ్య యుద్ధం జరిగింది. బాక్ట్రియా యుద్ధం నుండి ఒక బలమైన దేశంగా ఎదిగింది. అది పశ్చిమోత్తర భారతదేశాన్ని ఆక్రమించడానికి సిద్ధమైంది. పాటలీ పుత్రలో తన ఆధిపత్యాన్ని సుస్థిరం చేసుకోవడంలో సంప్రతి నిమగ్నమై ఉండగా సింధూకు ఇరువైపులా ఉన్న అనేక స్థానిక రాజ్యాలు సామ్రాజ్యం నుండి విడిపోయి ఉంటాయి. సంప్రతి దృష్టి క్రమంగా మగధ వైపు మళ్లింది. మౌర్య వంశ ప్రధాన కుటుంబం ఒక్క పాటలీపుత్రలోనే కాలం గడిపింది. ఫలితంగా సుదూర ప్రాంతాలలో సామ్రాజ్యం చీలిపోవడాన్ని నిరోధించలేకపోయింది. సామ్రాజ్యాన్ని సంపూర్ణంగా నియంత్రించలేకపోయింది. తొమ్మిదేళ్లు పాలించిన సంప్రతి తర్వాత శాలిసుక 13 సంవత్సరాలు పాలించాడు.

శాలిసుక వారసుడు సోమవర్మన్ లేదా దేవవర్మన్ ఏడేళ్లు పాలించాడు. మౌర్య వంశానికి చెందిన చివరి ఇద్దరు పాలకులు శతధన్వన్, బృహద్‌రథ. శతధన్వన్ ఎనిమిదేళ్లు, బృహద్‌రథ ఏడేళ్లు పాలించినట్లు ఆధారాలు చెబుతున్నాయి. బృహద్‌రథను పుష్యమిత్ర సుంగ హత్య చేశాడు.

## కౌటిల్యుని అర్థశాస్త్రం:

**చారిత్రక నేపథ్యం:** కౌటిల్యునికి ముందు కనీసం నాలుగు భిన్నమైన సైద్ధాంతిక శాలలు, 13 మంది వ్యక్తిగత బోధకులు అర్థశాస్త్రాన్ని బోధించినట్లు అనేక ఆధారాలు, ప్రస్తావనలు, వ్యాఖ్యానాలు చెబుతాయి. దురదృష్టవశాత్తు తొలి సాహితీ కృతులన్నీ నశించిపోయాయి. కౌటిల్యుని అర్థశాస్త్రం మాత్రమే మనకు అందుబాటులోకి వచ్చిన తొలి లిఖిత గ్రంథం. ఆర్థికశాస్త్రం, ప్రభుత్వ నిర్వహణ కళ, విదేశాంగ విధానం యొక్క అధ్యయనం

అత్యంత ప్రాచీనమైంది. కొందరు విద్వాంసుల ప్రకారం భారతదేశంలో ఈ శాస్త్ర అభివృద్ధి క్రీ.పూ. 650 కాలంలో మొదలై ఉంటుంది. విస్తృతంగా ఉన్న ప్రాచీన సాహిత్యం మాయం కావడానికి కౌటిల్యుని అర్థశాస్త్రం ఒక కారణమై ఉండవచ్చు. ఎందుకంటే అర్థశాస్త్రం అద్వితీయమైన కృతి. దాని ఘనత ఇతర ప్రాచీన సాహిత్యాన్ని తెరమరగు చేసి ఉంటుంది.

ప్రపంచంలోని అనేక భూభాగాలు మేధోపరమైన అంధకారంలో కూరుకుపోయి ఉన్న సమయంలో రాజకీయ అర్థశాస్త్రంపై ఒక నిర్దిష్టమైన కృతిని రచించగలిగిన ఈ కౌటిల్యుడు ఎవరై ఉంటాడు? బ్రాహ్మణిక, బౌద్ధ,జైన ఆధారాల ప్రకారం కౌటిల్యుడు (ఇతడిని విష్ణుగుప్తుడు అని కూడా పిలుస్తారు) నంద వంశాన్ని నాశనం చేసి మగధ పీఠంపై చంద్రగుప్త మౌర్యను ప్రతిష్ఠింపచేశాడు. కౌటిల్య అనే నామం అతడు కుటిల గోత్రానికి చెందిన వాడని సూచిస్తుంది. చాణక్య అనే పేరు అతడిని చణక కుమారునిగా చూపుతుంది. విష్ణుగుప్తుడు అతడి వ్యక్తిగత పేరు.

**అర్థశాస్త్ర అంశాలు:**

కౌటిల్యుని అర్థశాస్త్రాన్ని భారతదేశం ఎన్నడూ మరువలేదు. తదుపరి సాహిత్యంలో దాని గురించి తరుచూ ప్రస్తావన ఉంది. అయితే ఆధునిక కాలం వరకు ఆ కృతి ప్రతులు అందుబాటులో లేవు. 1904లో మైసూరుకు చెందిన డాక్టర్ ఆర్ శ్యామశాస్త్రికి అరుదైన ఆధారాలు లభించేవరకు ఈ పరిస్థితి కొనసాగింది. తాటాకు పత్రాలపై ఒక పూర్తి కృతితో భట్టస్వామిన్ పాత వ్యాఖ్యానం గల ఒక భాగం అతడికి లభించాయి. తాటాకు పత్రాలపై ఉన్న కృతి గ్రంథ లిపిలో ఉంది. అతడు ఆ కృతిని 1909లో ప్రచురించాడు. దాని ఆంగ్ల అనువాదం 1915లో ముద్రణ అయ్యింది. తర్వాత మరో మూల చేతిప్రతి, కొన్ని భాగాలు వివిధ లిపిలలో లభించాయి. ఆ కృతిపై పాత వ్యాఖ్యానాలు కూడా దొరికాయి. బొంబాయి విశ్వవిద్యాలయానికి చెందిన డాక్టర్ ఆర్.పి. కాంబ్లే అనేక సంవత్సరాల పాటు వివిధ కృతులను, అనువాదాలను తులనాత్మకంగా అధ్యయనం చేశాడు.

ఆ కృతిలో 15 అధికరణలు లేదా పుస్తకాలు ఉన్నాయి. ఒకటవ గ్రంథంలోని మొదటి ఆధ్యాయం అంశాల పట్టికను కలిగి ఉంది. ఒక వచనంలో కృతికి 150 అధ్యాయాలు, 180 ప్రకరణలు, 6,000 ప్రవచనాలు ఉన్నట్లు పేర్కొనబడింది. ప్రకరణ అంటే ఒక ప్రత్యేక అంశానికి కేటాయించిన భాగం. అధ్యాయాల సంఖ్య భాగాల సంఖ్యకు సమానంగా లేదు. ఎందుకంటే ఒక అధ్యాయం ఒకటి కంటే ఎక్కువ అంశాలను కలిగి ఉంటుంది. అలాగే కొన్నిసార్లు ఒక అంశం ఒకటి కంటే ఎక్కువ అధ్యాయాలలో విస్తరించి ఉంటుంది. సూత్ర రూపంలో గల వచన శైలిలో అర్థశాస్త్రం కొనసాగుతుంది. అందులో కేవలం 380 శ్లోకాలు మాత్రమే ఉన్నాయి. వివిధ గ్రంథాల అంశాలను క్లుప్తంగా సూచించడం ఇక్కడ ఉపయోగకరంగా ఉండగలదు.

- ఒకటవ గ్రంథం సంక్షిప్త పరిచయంతో మొదలవుతుంది. ఇతర శాస్త్రాల నేపథ్యంలో అర్థశాస్త్రాన్ని నిర్ధారిస్తుంది. తర్వాత రాజు గురించి ప్రస్తావిస్తుంది. అతడి శిక్షణ, మంత్రులని

నియామకం, రాజ్యానికి సంబంధించిన ఇతర అధికారుల భర్తీ, పాలకుడు పాటించాల్సిన దినచర్య, అతడి భద్రత, సంరక్షణను వివరిస్తుంది.

- రెండవ గ్రంథం రాజ్యంలోని వివిధ కార్యనిర్వాహక అధికారుల విధులను వివరిస్తుంది. వ్యవసాయం, గనుల తవ్వకం, విరామ కార్యక్రమాలు, తదితర వాటిలో రాజ్య కార్యకలాపాలపై పూర్తి చిత్రాన్ని అందిస్తుంది.
- మూడవ గ్రంథం చట్టం, న్యాయపాలనకు సంబంధించినది. చట్ట స్మృతిని పూర్తిగా పునః నిర్మిస్తుంది.
- నాల్గవ గ్రంథం నేరాల అణచివేతకు సంబంధించినది. నేరాన్ని పసిగట్టడం, వ్యాపారులు, హస్తకళాకారులపై నియంత్రణ, చిత్రహింసలు, మరణదండనలపై భాగాలను కలిగి ఉంది.
- ఐదవ గ్రంథం అధికారుల వేతనస్థాయిలతోపాటు సాధారణ అంశాలను కలిగి ఉంది.
- ఆరవ గ్రంథం క్లుప్తమైనది. అందులో రెండు అధ్యాయాలే ఉన్నాయి. అయితే రెండూ ముఖ్యమైనవి ఎందుకంటే స్థూలకృతికి అవి సైద్ధాంతిక ఆధారాన్ని అందిస్తాయి. మొదటి అధ్యాయం రాజ్య భాగస్వామ్య శక్తుల సిద్ధాంతాన్ని, రెండవ అధ్యాయం విదేశాంగ విధానంపై సిద్ధాంతాన్ని కలిగి ఉన్నాయి.
- ఏడవ గ్రంథంలో విదేశాంగ విధానం యొక్క ఆరు పద్ధతులపై విస్తృతమైన చర్చ ఉంది. విదేశీ విధానం అమలులో ఎదురయ్యే ఆరు వేర్వేరు పరిస్థితులను అధిగమించడానికి పాటించాల్సిన పద్ధతులను అది వివరిస్తుంది.
- ఎనిమిదవ గ్రంథంలో వ్యాసనాలపై అంటే వైపరీత్యాలపై చర్చ ఉంది. వివిధ భాగస్వామ్య శక్తుల పని తీరును తీవ్రంగా విఘాతం కలిగించే వైపరీత్యాలను ఎలా అధిగమించాలో అది చెబుతుంది.
- తొమ్మిదో గ్రంథం యుద్ధ సన్నాహాలకు సంబంధించినది. అందులో సమీకరించగలిగే వివిధ రకాల బలగాలు, దండయాత్రను ప్రారంభించడానికి అనుకూలమైన పరిస్థితులు, యుద్ధానికి పూర్వం ఎదురయ్యే ప్రమాదాలను అడ్డుకోవడం లాంటి అంశాలు ఉన్నాయి.
- ఏడవ గ్రంథంలో యుద్ధతంత్రం గురించి వివరణ ఉంది. ప్రధాన యుద్ధ శిబిరాన్ని, వివిధ రకాల యుద్ధ క్షేత్రాలను, వివిధ రకాల సైనిక పద్ధతులను అది వివరిస్తుంది.
- 11వ గ్రంథంలో ఒకే ఒక్క అధ్యాయం ఉంది. ఆక్రమణదారుడు ఓడిపోయిన పాలకుని కంటే స్థానిక తెగ నాయకులపట్ల తీసుకోవలసిన జాగ్రత్తలను వివరిస్తుంది.
- 12వ గ్రంథంలో బలహీనమైన పాలకుడికి అత్యంత శక్తిమంతుడైన పాలకుడి నుండి ముప్పు ఎదురైతే అతడు తీసుకోవలసిన ఎత్తుగడలు, వ్యూహాలు గురించి, అంతిమంగా విజయం ఎలా సాధించాలో చెబుతుంది.

- 13వ గ్రంథంలో శత్రువు కోటను ఎలా ముట్టడించి ఆక్రమించాలో వివరించబడింది. కుతంత్రం లేదా ప్రత్యక్ష పోరాటం ద్వారా కోటను స్వాధీనం చేసుకోవాలని చెబుతుంది. ఆక్రమిత ప్రాంతాలను ఎలా పాలించాలో కూడా వివరిస్తుంది.
- 14వ గ్రంథంలో రహస్య, తాంత్రిక ఆచారాలను వివరించారు.
- 15వ గ్రంథంలో కృతి రచనకు ఉపయోగించిన తార్కిక పద్ధతులను, శాస్త్రీయ పద్ధతిని వివరిస్తుంది. కొన్ని గ్రంథాలు, కొన్ని అధ్యాయాల క్రమం నిర్దిష్టంగా లేకపోయినా తొలి ఐదు గ్రంథాలు అంతర్గత పాలన గురించి, చివరి ఎనిమిది గ్రంథాలు పొరుగు రాజ్యాలతో రాజ్య సంబంధాల గురించి వివరిస్తాయని స్థూలంగా చెప్పగలము.

**స్వభావం, ప్రాముఖ్యత :**

కౌటిల్యుని సిద్ధాంతాలకు సర్వజనీన ఆచరణాత్మకత ఉంది. పాలకుడు, పాలితుల మధ్య సంబంధం, దేశ సంపద, ప్రజా సంక్షేమంలో రాజ్యం పాత్ర, పొరుగు రాజ్యాలతో దౌత్య, సంబంధాలు, సంకీర్ణాలు, విదేశాంగ విధాన నిర్వహణపై అతడు పలికిన హితోక్తులు నేటి పరిస్థితులకు కూడా వర్తిస్తాయి.

కౌటిల్యుడి బోధనలను స్పష్టంగా అర్థం చేసుకొని ఆధునిక ప్రపంచంలో వాటిని జాగ్రత్తగా వర్తింప చేయాలంటే అర్థశాస్త్రం యొక్క మౌలిక లక్షణాలను కూడా తెలుసుకోవాలి. ఆ కృతి ఆదర్శ రాజ్యానికి సంబంధించినది. అలాంటి రాజ్యం ఉండేదని లేదా ప్రస్తుతం ఉద్భవిస్తుందని లేదా భవిష్యత్‌లో ఏర్పడగలదని చెప్పలేము.

ప్రభుత్వ కళను మౌలికంగా అర్థశాస్త్రం అందిస్తుంది. కనక స్వభావరీత్యా అది బోధనావళి. అందరు పాలకులకు అది సూచనలిస్తుంది. ధర్మాన్ని పరిరక్షించిన కాలాలన్నింటికీ అది వర్తిస్తుంది. బోధనాపరమైన కృతి కావడంతో దాని ఆధారం ప్రభుత్వ నిర్వహణే అవుతుంది. సైద్ధాంతిక చర్చలో అసలు రాజ్యమంటూ ఎందుకు ఉండాలన్న వాదన అందులో ఎక్కడా కనిపించదు. రాజ్యమంటూ ఒకటి ఉన్నా ఏ తరహా రాజ్యం ఉత్తమమైనది అనే ప్రశ్నకు సమాధానం కూడా లభించదు. కౌటిల్యుడు దృష్టిలో రాజ్య మనుగడ, పాలకుడు ప్రత్యక్ష సిద్ధాంతాలు.

రాజ్య నిర్వహణపై సైద్ధాంతిక విశ్లేషణకు కౌటిల్యుడు రెండు ప్రత్యేక సూత్రాలను అందిస్తాడు. అవి : (1) ఏడు భాగస్వామ్యశక్తుల (రాజ్యం) నేపథ్యంలో ఆంతరంగిక పాలనా అంశాలపై విశ్లేషణ (2) రాజ్యాల సమాహార సిద్ధాంతం ఆధారంగా రాజ్యాల మధ్య సంబంధాలపై విశ్లేషణ. ఆరవ గ్రంథంలోని రెండు అధ్యాయాలను సైద్ధాంతిక సూత్రాలు నిర్ధారించడానికి, సూత్రాల అభివృద్ధిలో ఉపయోగించే అంశాలను నిర్వచించడానికి వాడుకుంటారు. అర్థశాస్త్రలోని మిగతా భాగాలు రాజ్య పాలకుడు, అధికారులకు సూచనావళిగా ఉన్నాయి.

6

# మౌర్య - అనంతర భారతదేశం (క్రీ.పూ.200-క్రీ.శ.300)

**నేపథ్యం :**

మౌర్య సామ్రాజ్యం పతనం తర్వాత వచ్చిన కాలాన్ని సాధారణంగా “చీకటి యుగం” అని (భారతదేశ చరిత్రలో) పిలుస్తారు. ఇలాంటి వ్యక్తీకరణ రాజకీయ కేంద్రీకరణనను నాగరికతకు ఏకైక కొలబద్ధగా భావిస్తుంది. అయితే ఇలాంటి భావనకు దూరంగా ఈ కాలం సామాజిక–ఆర్థిక–సాంస్కృతిక చరిత్రలో కొన్ని ముఖ్యమైన పరిణామాలను ముందుకు తెచ్చింది.

పురావస్తు శాస్త్రం వెలుగులోకి తీసుకొచ్చిన ఒక ముఖ్యమైన మార్పు భారతదేశంలోని విశాల భూభాగంలో ఆది చారిత్రక కాలం నుండి చారిత్రక కాలానికి పరివర్తన రావడం. ఉదాహరణకు దక్షిణాదిలో తొలి భారీశిలా సంస్కృతి (తెగ దశకు ప్రాతినిధ్యం వహించిన) స్థానంలో తొలి చారిత్రక సంస్కృతి వచ్చింది. ఉత్తర భారత సంస్కృతిలోని కొన్ని అంశాలను తనలో విలీనం చేసుకుంది. అయితే ఈ పరివర్తన ప్రక్రియను సాహిత్య కృతులలో సరిగ్గా నమోదు చేయలేదు. అయినప్పటికీ తొలి చారిత్రక సంస్కృతికి సంబంధించిన వివిధ అంశాలను (చోళ, పాండ్య, చేర రాజ్యాలలో) సంగం సాహిత్యం నుండి వెలికి తీయవచ్చు. విభిన్న కాలాల్లో నమోదైన ఈ అంశాలు (క్రీ.పూ., క్రీ.శ. కాలాలలో) తెగ స్థాయిని అధిగమించిన సంస్కృతికి ప్రాతినిధ్యం వహిస్తాయి. అయితే పూర్వపు తెగ లక్షణాలు కొన్నింటిని ఈ సంస్కృతి అంటి పెట్టుకుంది.

మౌర్య అనంతర కాలంలో వచ్చిన మరో రెండు ప్రధాన మార్పులకు ఇలాంటి పూర్వపు మూలాలే ఉన్నాయి. ఈ మార్పులను వేగవంతం చేయడంలో మౌర్యులు కీలక పాత్రను పోషించారు. భారతదేశాన్ని ఉపఖండంగా తీర్చిదిద్దిన నైసర్గిక ఎడబాటు ఉన్నప్పటికీ భారతీయ సంస్కృతి చాలా వరకు ఒకప్పుడు స్థానికేతరమని భావించిన శక్తులకు రుణపడింది. అందుకు తగిన ఆధారాలు పుష్కలంగా ఉన్నాయి. మౌర్యానంతర కాలంలో బయటి ప్రపంచంతో సంబంధాలు గణనీయంగా పెరిగాయని అవి నిరూపిస్తాయి.

రెండు ప్రధాన మార్గాలలో భారతీయ సామాజిక–రాజకీయ సంఘటనం బయటి ప్రపంచంతో సంబంధాలను నెరిపింది. ఒకటి పశ్చిమోత్తర దిశ నుండి వివిధ జాతి వర్గాలు దేశంలోకి తరచూ దూసుకురావడం. ఈ పరిణామాలు మధ్య ఆసియా జాతీయుల వలసలతో ముడిపడి ఉన్నాయి. ఉత్తర భారతంలో ఇలాంటి చొరబాట్లు రాజకీయ తిరుగుబాట్లనే కాకుండా రాజకీయ సంఘటనం, నిర్మాణ స్వరూపంలో కూడా మార్పులు తీసుకువచ్చాయి.

తొలి చొరబాటుదారులైన బాక్ట్రియా గ్రీకుల తర్వాత సైథియన్లు, పార్థియన్లు, కుషాణులు వచ్చారు. భారతీయ సాహిత్యంలో వీరిని యవనులు, సకులు, పల్లవులు, తుషార్లుగా గుర్తిస్తారు. ఈ చారిత్రక కాలంలో మధ్య ఆసియా, తదితర ప్రభావాలు కూడా ఈ మార్గం ద్వారా వచ్చి చేరాయి. క్రమంగా భారతీయ సామాజిక నిర్మాణంలో అంతర్భాగ మయ్యాయి.

మరో సంబంధ మార్గం అంతర్జాతీయ వాణిజ్యం. ఈ రంగంలో ఇప్పుడు భారతదేశం గతంలో ఎన్నడూలేని విధంగా క్రియాశీలమైంది. ప్రాచ్యం నుండి విలాస వస్తువులను సమకూర్చుకోవాలన్న పాశ్చాత్య ఆకాంక్ష అనేక ప్రాంతాలను ప్రభావితం చేసింది. ముఖ్యంగా పశ్చిమోత్తర ప్రాంతం, గంగా లోయ, ద్వీపకల్పం తీవ్రంగా ప్రభావితమయ్యాయి. దక్షిణంలో విదేశీ వ్యాపారుల మకాం గురించి సాహిత్య, శిలాశాసన ఆధారాలలోనే కాకుండా (యవనులు, ధమ్మయవనులు) పురావస్తు క్షేత్రాలలో కూడా సాక్ష్యాలు ఉన్నాయి. క్రీ.శ. తొలి రెండు శతాబ్దాలలో భారతదేశంలోకి రోమను మారక ప్రవాహం ఎంత తీవ్రంగా ఉండేదంటే ఆ పరిణామం రోమను పాలక వర్గాన్ని ఆందోళనకు గురి చేసింది.

వివిధ జాతి వర్గాలు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో స్థానికంగా సామాజిక చింతన, సంఘటనను పునర్వ్యవస్థీకరించాల్సిన అవసరం ఏర్పడింది. అప్పటికీ అవి మార్పు దశలో ఉన్నాయి. దేశంలోనే కొత్త చారిత్రక కేంద్రాలు ఆవిర్భవించడంతో అవి పరివర్తన దశలో ఉన్నాయి. శాసన నిర్ణేతల (రూపకర్తలు) వైఖరి ఎలా ఉండేదంటే కొత్తగా వచ్చి చేరిన ప్రజలకు సామాజిక నిర్మాణంలో తక్కువ హోదాను కల్పించేవారు. అయితే ఈ వైఖరి భౌతికపరంగా సాంస్కృతిక సంకీర్ణ ప్రక్రియకు విఘాతం కల్గించలేదు. వాస్తవానికి రాజకీయ అధికారం గలవారు (యవనులు, సకులు, కుషాన్లు) తమ భారతీయ సరిజోడు అయిన శాతవాహనులకు స్వచ్ఛమైన క్షత్రియ హోదా విషయంలో ఏ మాత్రం అధమంగా ఉండేవారు కాదు. అయితే శాసనకర్తలు గట్టిగా సంరక్షించిన వ్యవస్థ మత పోషణపైనే కాకుండా, వర్ణాశ్రమ ధర్మాన్ని సంరక్షించడంపై కూడా ఆధారపడి ఉండేది. చతుర్వర్ణ వ్యవస్థ కలుషితమైపోతోందని శాసనకర్తలు తీవ్ర ఆందోళన చెందారని తెలుస్తోంది.

ఇలాంటి పోషణ (గుర్తింపు) క్రమంగా భాషాపరమైన అంశంలో కూడా విస్తరించింది. కేవలం అధికార విధులకే సంస్కృతం చాలా వరకు పరిమితమవుతూ వచ్చింది. రాజదర్బారు చుట్టూ సాహిత్యాన్ని ఉత్పత్తి చేయడం మొదలు పెట్టింది. విదేశీయులకు భారతీయ సామాజిక పరిస్థితిని అర్థం చేసుకోవడానికి బౌద్ధం ఒక సౌకర్యవంతమైన మార్గంగా ఉండేది. ఈ కాలంలో బౌద్ధ మతానికి విశాలమైన పోషణ లభించింది.

బ్రాహ్మణత్వం, ఏకేశ్వరోపాస మతాలన్నీ ఈ కొత్త పరిస్థితులలో కీలక మార్పులను చవి చూశాయి. బౌద్ధ, జైన మతాలలో అంతర్గత విభేదాలకు గతంలోనే మూలాలున్నప్పటికీ అవి ఈ కాలంలో మరింత నిర్దిష్ట స్వరూపాన్ని సంతరించుకున్నాయి. అంటే వివిధ సైద్ధాంతిక శాలలు, మహాయాన బౌద్ధం ఆవిర్భవించాయి. బౌద్ధంలో వచ్చిన ఈ మార్పులు కొంత వరకు ఆ మత ప్రాదేశిక ఆధారం విస్తరించడంవల్లే చోటు చేసుకున్నాయి. భారతదేశ సరిహద్దులను దాటడమే కాకుండా దేశంలో కూడా బౌద్ధం విస్తరించడం మొదలుపెట్టింది. దేశంలో నాగాలు, యక్షులు తదితర స్థానిక పూజా వ్యవస్థలతో ఆ మతం సర్దుబాటు చేసుకోవలసి వచ్చింది. వాస్తవానికి పౌరాణిక మతం యొక్క అనేక లక్షణాలను బౌద్ధం ప్రతిబింబించింది. ఈ కాలంలో ఆ లక్షణాలు బహిర్గతమయ్యాయి. ఊహా చిత్రాన్ని కొలవడం ఇరు మతాలలో సాధారణమైన లక్షణం. బోధిసత్త్వ సిద్ధాంతం బౌద్ధ మతానికి కీలకం కాగా పౌరాణిక మతంలో భక్తి సిద్ధాంతం భగవద్గీతలో సున్నితమైన ప్రవచనాలతో ఈ కాలంలో వ్యాపించింది.

**దక్కను శాతవాహనులు**

దక్కను ప్రాంతాన్ని పాలించిన శాతవాహనులు గతకాలపు మౌర్యుల వలే భౌతికపరమైన వనరులతో బలంగా ఉండేవారు. ముఖ్యంగా నాణేలు, ఇనుప పరికరాలను విపరీతంగా వాడారు. పెంకులు, కాల్చిన ఇటుకలను భవన నిర్మాణ సామాగ్రిగా ఉపయోగించారు. ఉత్తర భారతంలో ఇలాంటి సామాగ్రినే వాడేవారు. అలాగే భారీ శిలాస్మారక సంస్కృతి వారసత్వంతో అమితంగా లాభపడ్డారు. శాతవాహన రాజ్యం, సమాజం, ఆర్థిక వ్యవస్థను ఏర్పాటు చేయడంలో ఆ సంస్కృతి సృష్టించిన సైనిక, హస్తకళల, వ్యవసాయదార పూర్వ పరిస్థితులు ఎంతో అనుకూలించాయి.

మధ్యధర ప్రాంతంతో విస్తృతమైన వాణిజ్య సంబంధాలు, రోమను నాణేల ప్రవాహం వారి పాలనకు ఒక విశిష్టమైన స్థానాన్ని అందించాయి. అలాగే దక్కనులో పెద్ద స్థాయిలో పట్టణ ప్రాంతాలు ఏర్పడ్డాయి. ఈ పరిస్థితులన్నీ ద్వీపకల్పంలో రాజ్య అవతరణకు సహకరించాయి.

ఆర్యేతర ప్రజలైన శాతవాహనులు దక్కనులో బ్రాహ్మణీకరణ చెందిన తొలి రాజవంశాలలో ఒకరు. కొత్తగా మతాంతీకరణ చెందడంతో వర్ణవ్యవస్థకు ఛాందసవాద సమర్థకులుగా మారారు. గిరిజనేతర పద్ధతిలో తమ రాజ్య పరిధిలో వర్ణవ్యవస్థ ఉత్పత్తి సంబంధాలు నిర్వహించాలని కోరుకున్నారు. బౌద్ధ సన్యాసులు, బ్రాహ్మణులకు నగదు, భూమి రూపంలో విరాళాలు అందించిన తొలి పాలకులుగా వీరిని ఆయా శిలాశాసనాలు కీర్తిస్తాయి. ఫలితంగా బౌద్ధులు, బ్రాహ్మణులు శాతవాహన రాజకీయ వ్యవస్థ, సమాజంలో కీలక శక్తులుగా ఎదిగారు. మౌర్య పాలన అనుభవం నుండి లబ్ది పొందుతూ శాతవాహనులు ఇతర ప్రాంతాలపై తమ ఆధిపత్యాన్ని చాటుకొన్నారు. వ్యవసాయ సముదాయాలు, తెగనాయకులు, తక్కువ శ్రేణి రాకుమారులు ఉన్న ప్రాంతాలను తమ ఆధీనంలోకి తెచ్చుకున్నారు. వీరు అభివృద్ధి పరచిన

పాలనావ్యవస్థ పూర్తిగా భారతీయ అంశాలతో కూడుకున్నది. కనుక ఇండో-గ్రీకులు, సకులు, పార్థియన్లు, కుషానుల రాజకీయ వ్యవస్థకు శాతవాహనుల రాజ్యం పూర్తి భిన్నంగా ఎదిగింది.

**మూలాలు:** దక్కనులో శాతవాహనులు 460 ఏళ్లపాటు నిరాఘాటంగా పాలించారు. అయితే శాతవాహనుల తొలి నివాస ప్రాంతం ఏదనే విషయంపై చరిత్రకారులమధ్య వాదోపవాదాలు జరిగాయి. వారి వంశ నామం అర్థమేమిటి, శతకర్ణి అనే బిరుదు అర్థమేమిటి అనే విషయాలు కూడా చిక్కుముడిగా మారాయి. "ఐత్రేయ బ్రాహ్మణ" ప్రకారం వారు విశ్వామిత్రకు పుట్టిన తక్కువ జాతి కుమారులు. అశోకుని శాసనాలలో ఆంధ్రులను సరిహద్దు ప్రజలుగా పేర్కొన్నారు.

శాతవాహనులకు సంబంధించిన తొలి నివేదికలు కేవలం ఒక్క మహారాష్ట్రలోనే లభించాయన్న వాదన ఇప్పుడే మాత్రం నిలవదు. కేవలం రెండు శాసనాలు (నానాఘాట్, నాసిక్), కొన్ని నాణేలు మాత్రమే మహారాష్ట్రలో కనుగొనబడ్డాయి. అయితే ఆంధ్రప్రదేశ్‌లోని తెలంగాణ జిల్లాలలో ఇటీవల జరిపిన తవ్వకాలలో శాతవాహన కాలం నాటి అనేక నాణేలు, ముద్రలు బయటపడ్డాయి. కోటిలింగాల వద్ద శాతవాహన వంశ వ్యవస్థాపకుడు శ్రీముఖ జారీ చేసిన నాణేలు, తొలి పాలకులైన కన్హా, ఒకటవ శతకర్ణి నాణేలు లభించాయి. ఈ ఆవిష్కరణలు శాతవాహన సామ్రాజ్యానికి తెలంగాణ మూల ప్రాంతంగా ఉండేదన్న వాస్తవాన్ని ధృవపరుస్తాయి. అలాగే నానాఘాట్ శిలాశాసనంలో ఒకటవ శతకర్ణిని దక్షిణ పథపతి అని వర్ణించడం బట్టి శాతవాహన రాజ్యం కేవలం పశ్చిమ దక్కన్‌కే పరిమితం కాలేదని, అది దక్కనులోని ఇతర ప్రాంతాలు కలిగి దాని వెలుపల విస్తరించి ఉండేదని నిర్ధారణ అవుతుంది.

శాతవాహన, శతకర్ణి అనే పదాల మధ్య సంబంధం గొప్ప వివాదాస్పద అంశంగా మారింది. సప్తవాహన అనే ప్రాకృత మూలం నుండి శాతవాహన అనే పదం వచ్చింది. అంటే ఆ వంశానికి సూర్యదేవుని మూలం ఉండేది. శతకర్ణి అన్నది వారు ధరించిన చివరి నామం. కొందరు వారిని బ్రాహ్మణులుగా పరిగణించారు. మరికొందరు వారిని బ్రాహ్మణ, నాగ మూలాలున్న మిశ్రమ కులస్తులుగా గుర్తించారు. నాసిక్‌లోని బాలశ్రీ శాసనంలో గౌతమిపుత్ర శతకర్ణిని ఏకబ్రాహ్మణ అని సంబోధించారు. అంటే "ఎదురులేని బ్రాహ్మణుడు" లేదా "బ్రాహ్మణుల ఏకైక రక్షకుడు" అని అర్థం.

**తొలి శాతవాహనులు:**

తొలి పాలకుడు సిముఖ (శ్రీముఖ). బ్రాహ్మణత్వాన్ని అనుసరించినా బౌద్ధులు, జైనులపట్ల అతడు ఉదారంగా ప్రవర్తించాడు. సిముఖ వారసుడు అతడి చివరి సోదరుడు కన్హ(కృష్ణ). కన్హ తన రాజ్యాన్ని పశ్చిమంలో నాసిక్ వరకు విస్తరించాడు. మూడవరాజు ఒకటవ శ్రీశతకర్ణి సిముఖ కుమారుడు. అతడు పశ్చిమ మాల్వా, అనుప (నర్మదాలోయ), విదర్భ (బెరార్)లను ఆక్రమించాడు. అశ్వమేధ, రాజసూయ యాగాలతో సహా కొన్ని వేదిక బలిదానాలను

అతడు నిర్వహించాడు. ఈ వంశానికి చెందిన ఆరవ రాజు రెండవ శతకర్ణి. సంగ వంశీయుల నుండి తూర్పు మాల్వాను అతడు చేజిక్కించుకున్నాడు.

రెండవ శతకర్ణి వారసుడు లంబోదర. ఆ తర్వాత ఎనిమిదవ రాజుగా లంబోదరుని కుమారుడు అపిలక పాలనా పగ్గాలు చేపట్టాడు. అపిలక నుండి హాల వరకు ఈ వంశానికి చెందిన 17వ పాలకుడి కాలం తొలగిపోని చీకటి కాలం. హాల పాలించిన ఐదేళ్లు రాజ్యం సంపన్నమైంది. హాల స్వయంగా గాధసప్తసతి అనే కావ్య ప్రబంధాన్ని రచించారు. అందులో మహారాష్ట్రి లేదా పైశాచి ప్రాకృతంలో 700 ప్రణయ వచనాలు ఉన్నాయి. పశ్చిమ శక సత్రపులు సామ్రాజ్యంపై దాడి చేయడంతో శాతవాహనులు తాత్కాలిక గ్రహణాన్ని ఎదుర్కొన్నారు. పశ్చిమ సత్రప అయిన నహాపన గుజరాత్, కథియావార్, ఉత్తర మహారాష్ట్ర, దక్షిణ మహారాష్ట్రలోని కొన్ని భాగాలను పాలించేవాడు.

**తర్వాతి శాతవాహనులు:**

దాదాపు 50 ఏళ్ల పాటు రాజకీయ గ్రహణం అనుభవించిన తర్వాత శాతవాహనులు గౌతమీపుత్ర శాతకర్ణి నేతృత్వంలో మళ్లీ అధికారాన్ని చేజిక్కించుకున్నారు. శాతవాహనులలో గౌతమీపుత్రను గొప్పవాడిగా గుర్తిస్తారు. అతడు సాధించిన విజయాలను నాసిక్ ప్రశస్తిలో ఘనంగా కీర్తించారు. ఆ ప్రశస్తిని అతడి తల్లి గౌతమి బాలశ్రీ వేయించింది. నహాపనను ఓడించి తాము కోల్పోయిన ప్రాంతాలను గౌతమీపుత్ర తిరిగి స్వాధీనం చేసుకున్నాడు. బౌద్ధులతోపాటు బ్రాహ్మణులకు కూడా అతడు పెద్ద విరాళాలు అందించాడు. ఏకబ్రాహ్మణ అనే బిరుదు అతడు బ్రాహ్మణులను ఘనంగా పోషించిన విషయాన్ని వెల్లడిస్తుంది.

ఒకటవ వశిష్టపుత్ర పులమయి రాజ్యాన్ని కృష్ణానది ముఖద్వారం వరకు విస్తరించాడు. కోరమాండల్ తీరంలో లభించిన నాణేలు (ఓడ, ద్వంద్వ తెరచాప చిహ్నాలతో) ఈ విషయాన్ని రుజువు చేస్తాయి. అలాగే శాతవాహనులు నౌకాదళానికి, సముద్ర వాణిజ్యానికి ఇచ్చిన ప్రత్యేక ప్రాధాన్యతను అవి వెల్లడిస్తాయి. తన పాలనాకాలంలో అతడు  అమరావతి వద్ద గల పాత స్తూపంకు మరమ్మతులు చేయించాడు. దానిని విస్తరించి ఘన్నంగా చెక్కబడిన పాలరాతి స్లాబ్‌లను వేయించాడు.

పులమయి వారసుడు వశిష్టపుత్ర శ్రీ శాతకర్ణి రుద్రదమన్ కుమార్తెను వివాహమాడాడు. అయితే శాక – శాతవాహన పోరాటం కొనసాగింది. చివరి గొప్ప పాలకుడు యజ్ఞశ్రీ శాతకర్ణి. పశ్చిమ సత్రపులు స్వాధీనం చేసుకున్న ప్రాంతాలను అతడు చాలా వరకు తిరిగి దక్కించుకున్నాడు. అతడు వివిధ విలువలు కలిగిన అనేక నాణేలను జారీ చేశాడు. వాణిజ్య పురోగతి, సక పాలకులతో వైరాన్ని విజయవంతంగా తెరదించడానికే నాణేలను పెద్ద సంఖ్యలో ముద్రించారు.

## సంగం యుగం

### పరిచయం:

పురావస్తు తవ్వకాల ప్రకారం తమిళ ప్రజలకు క్రీస్తుశకానికి చాలా ముందే సాహిత్య కళ గురించి తెలుసు. అంటే క్రీ.పూ. రెండవ శతాబ్దం నుండి వారికి సాహిత్య రచన పై అవగాహన ఉంది. తమిళులు తొలిగా ఉపయోగించిన లిపి బ్రాహ్మిలిపి. తర్వాతి కాలంలోనే – అంటే చివరి ప్రాచీన, తొలి ఆధునిక కాలం – వారు సరికొత్త లిపిని అభివృద్ధి చేయడం మొదలుపెట్టారు. దానిని గ్రంథ లిపి అంటారు. ఈ లిపి నుండే ఆధునిక తమిళ అక్షరాలు వెలువడ్డాయి. సంగం సాహిత్యంలోని కొన్ని అంశాలను గ్రీకు ప్రాచీన రచయితల కృతులు ధృవపరుస్తాయి. టోలెమి, ప్లైనీ, స్ట్రాబో, పెరిప్లస్ అనే గ్రంథాన్ని రచించిన అనామక రచయిత కృతులు అందులో ముఖ్యమైనవి. క్రీ.పూ. మూడవ శతాబ్దం నుండి క్రీ.శ. మూడవ శతాబ్దం వరకు సంగం యుగం కొనసాగిందని పై కృతులను బట్టి నిర్ధారించవచ్చు. ఈ కాలంలోనే సంగం సాహిత్యం కూడా చాలా వరకు ఉత్పత్తి అయి ఉంటుంది. క్రీ.శ. నాలుగు ఐదవ శతాబ్దాలలోనే దానిని నేడున్న స్వరూపంలో సంకలించి ఉంటారు.

తొలి తమిళ కావ్య ప్రబంధాల ఆధారంగానే దక్షిణంలో తొలి చారిత్రక సమాజాన్ని పునఃనిర్మించాడు. పురావస్తు శాస్త్ర విస్తరణ ఇటీవలి కాలంలో పుంజుకోవడంతో సాహిత్యపరమైన ఆధారాలకు నిర్దిష్టత లభిస్తోంది. సంస్కృతి సంకీర్ణంగా ఉండేది. అందులో ఉత్తర స్థానిక అంశాలు అప్పటికే ఉన్నతస్థాయి సమ్మేళనాన్ని సాధించాయి. అయితే ఈ సంస్కృతిలోని వైరుధ్యాలను తొలి తమిళ వ్యాకరణ గ్రంథమైన "తోల్కప్పియం"లోని ప్రాంతీయ వివరణలను సంప్రదించిన మీదట విశ్లేషించడం ఉత్తమంగా ఉంటుంది.

ఆ గ్రంథంలో విభిన్న భూములు, వాతావరణ పరిస్థితులు గల ఐదు నైసర్గిక ప్రాంతాలను ప్రస్తావించారు. అవి అడవులు, కొండలు, మైదాన ప్రాంతాలు, తీర ప్రాంతాలు, ఉష్ణప్రాంతాలు. ఈ ప్రాంతాలలోని రుతువుల లక్షణాలను వివరించిన ఈ కృతి దేవతలు, స్థానిక ఆహారం, జంతుజాలం, మొక్కలు. సముదాయ అలవాట్లు, వృత్తులు, సంగీత వాయిద్యాలు, తదితర వాటి గురించి పేర్కొంటుంది. అయితే ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి జీవనశైలి విభిన్నంగా ఉండేది. ఉదాహరణకు మైదాన ప్రాంతాలలో ప్రజల జీవితం వ్యవసాయ పనుల చుట్టూ తిరగగా తీర ప్రాంతాలలో వారు వాణిజ్య కార్యకలాపాలలో నిమగ్నమై ఉండేవారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య కూడా వ్యత్యాసం ఉండేది. ఈ కాలంలో పట్టణ ప్రాంతాలలో అనేక నివాస గృహాలు ఏర్పడ్డాయి.

చోళ, పాండ్య, చేర మూడు ప్రధాన రాజ్యాలుగా ఉండేవి. అయితే మనకు తెలియవచ్చిన అనేక తెగ దొరతనాలు కూడా ముఖ్యమైనవే. యుద్ధాలు, తెగ ఘర్షణలు తరచూ జరిగేవి. ఈ దశలో యుద్ధ వీరునిగా ఉన్న రాజు ప్రాథమికంగా తన తెగ లేదా రాజ్యాన్ని కాపాడుకోవడంపైనే దృష్టి సారించేవాడు. సహజంగానే సంగం కార్యాలలో యుద్ధం, ప్రేమలకు సంబంధించి తెగ భావాలు వ్యక్తమవుతాయి. అది సమాజ సంకీర్ణతలో ఆయా సందర్భాలలో వచ్చిన మార్పులను కూడా ప్రతిబింబిస్తాయి.

మతం విషయంలో కూడా ఈ అంశం ప్రధానంగా ఉండేది. ఒక నైసర్గిక ప్రాంతానికి ప్రధాన దైవమైన మురుగన్‌ను పౌరాణిక కార్తికేయునిగా గుర్తించడం మొదలుపెట్టారు. అయితే అతడు మౌలికంగా తమిళుల యుద్ధ ప్రభువు, సంతాన ప్రదాత. వరి, రక్తాలను అభిషేకమిచ్చి అతడిని అరాధించేవారు. అలాగే ఆచారబద్ధంగా నృత్యం (తాండవం) నిర్వహించేవారు.

**దక్షిణ భారత సంగం వంశాలు :**

మెగస్థనీస్ ప్రస్తావించిన తొలి దక్షిణ భారత రాజ్యం పాండ్యులదే. అశోకుని శిలాశాసనాలలో పాండ్య, చోళ, చేరా రాజ్యాలను సరిహద్దు రాజ్యాలుగా పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రధాన రాతి శాసనం-2లో ఈ ప్రస్తావన ఉంది. ఖారావేలలోని హాతిగుంప శాసనంలో అశోకుని శాసనాల తర్వాత తమిళ రాజ్యాల గురించిన వివరాలు ఉన్నాయి. ఖారావేల తమిళ రాజ్యాల సమాఖ్యను నాశనం చేశాడని చెబుతారు. అదే త్రమిరదేశ సంఘం. అయితే సంగం కాలానికి మౌలిక ఆధారం మాత్రం సంగం సాహిత్యమే. అది ప్రధానంగా పాండ్యుల గురించి వివరిస్తుంది. అలాగే చోళులు, చేరాలకు సంబంధించిన సమాచారాన్ని కొంత వరకు అందిస్తుంది. మములనార్ అనే సంగం కవి తన పురాణనూరు గ్రంథంలో నంద, మౌర్య పాలకుల గురించి కూడా ప్రస్తావించాడు.

**పాండ్యులు :** ఆధునిక దక్షిణ తమిళనాడు అంతటి విశాలమైన ప్రాంతంపై పాండ్యులు పాలించారు. వారి రాజధాని మధురై. (తొలుత తేన్-మదురై తర్వాత కపటపురం వారి రాజధానులుగా ఉండేవి) నెదుంజెలియన్ క్రీ.శ.210 ప్రాంతంలో పాలించాడు. తలైయలన్ గణం వద్ద యుద్ధాన్ని గెలిచిన వీరునిగా అతడికి బిరుదు ఉంది. అతడి ఆస్థానంలో ఇద్దరు గొప్ప కవులు మంగుడి మరుదన్, నక్కిరార్‌లు ఉండేవారు. పట్టుప్పట్టు అనే కావ్యగ్రంథంలో చక్రవర్తిని కీర్తిస్తూ ఆ ఇద్దరు కవులు ఒక్కో కావ్యాన్ని అందించారు. మంగుడి మరుదన్ రచన మదురైకంజి, తదితర ఆధారాల నుండి మనకు నెయంజెలియన్ పూర్వీకుల గురించి తెలుస్తుంది అలాంటి పూర్వ పాలకుల్లో మరో నెదుంజెలియన్ కూడా ఉన్నాడు. మదురై వద్ద కోవళన్ విషాదాంతం అతడి హయాంలోనే జరిగింది. "శిలప్పాదిగారం" ప్రకారం ఈ విషాద సంఘటన రాజును కృంగదీసి అతడి ప్రాణాలను బలిగొంది.

**చోళులు :** నేటి ఉత్తర తమిళనాడు, దక్షిణ ఆంధ్రప్రదేశ్ ప్రాంతాలపై చోళులు పాలించారు. వారి రాజధాని తొలుత ఉరయూర్ వద్ద ఉండేది. తర్వాత దానిని పుహార్ (కావేరి పట్టణం)కు మార్చారు. చోళులలో తొలి ముఖ్య పాలకుడు ఎలారా (క్రీ.పూ.2వ శతాబ్దం మధ్యలో). శ్రీలంకను జయించడంలోనే అతడి ప్రాముఖ్యత ఉంది. అయితే కరైకాళ (190 క్రీ.శ) అందరిలో సుప్రసిద్ధుడు. తొలి జీవితంలో అతడు సింహాసనం నుండి తప్పించబడ్డాడు. తర్వాత కారాగారం అనుభవించాడు. కారాగారం నుండి అతడు తప్పించుకున్న తీరు, సింహాసనాన్ని మళ్లీ దక్కించుకున్న వైనం గురించి సాహిత్య రూపకాలలో చక్కగావర్ణించబడి ఉంది. ముఖ్యంగా పట్టణ పలయ్, పట్టుప్పట్టు కావ్య గ్రంథాలలో దాని వర్ణన ఉంది. అతడు సాధించిన తొలి విజయాలలో తంజావూరుకు తూర్పున 15 మైళ్ల దూరంలో వేణ్ణి వద్ద జరిగిన

యుద్ధం ఒకటి. వహైప్పరండాలి వద్ద యుద్ధాన్ని గెలవడం మరో ముఖ్యమైన విజయం. అక్కడ తొమ్మిది మంది తెగ దొరలు అతడికి లొంగిపోయారు. కరైకాళ చేసిన యుద్ధాలు తమిళ దేశ రాజులలో అతడికి ప్రముఖ స్థానాన్ని కల్పించాయి. తన ప్రత్యక్ష పాలన కింద ఉన్న ప్రాంతాలను అతడు విస్తరించాడు. అటవీ భూములలో వ్యవసాయం, స్థిర నివాసాన్ని కూడా కరైకాళ ప్రోత్సహించాడు. నీటిపారుదల కాలువలను నిర్మించడం ద్వారా తన రాజ్య సంపదను పెంచాడు.

వైదిక మతాన్ని ఆచరించాడు, బలిదానాలను నిర్వహించాడు. తర్వాతి కాలంలో కరైకాళ ఎన్నో లోకోక్తులకు కేంద్రబిందువయ్యాడు. శిలప్పాదిగారంలో అలాంటి వీరగాధలు ఎన్నో కనిపిస్తాయి. కావేరి పట్టణం, దాని తీరప్రాంతం గురించి వర్ణన పట్టిణప్పలయ్‌లో ప్రధాన భాగంగా ఉంది. ఈ కాలంలో పారిశ్రామిక వాణిజ్య పరిస్థితులు గురించి స్పష్టమైన అవగాహన కలిగిస్తుంది. శివుని అపరభక్తునిగా కీర్తి గడించిన చోళ పాలకుడు సెంగనన్ పోర్ యుద్ధంలో విజేతగా కనిపిస్తాడు. చేరా రాజు కణైక్కల్ ఇరుంపోరాయ్‌పై అతడు విజయాన్ని సాధించాడు. ఈ రాజు కూడా సుమారు 70 శివాలయాలను నిర్మించాడు. అతడు నాలుగు లేదా ఐదవ శతాబ్దంలో (క్రీ.శ) జీవించాడు.

**చేరాలు :** ఆధునిక కేరళలోని కొన్ని భాగాలపై వీరు పాలించారు. వారి రాజధాని వంజీ లేదా కరూర్. చేర పాలకుల విషయంలోనే మనం నిర్దిష్టమైన వారసత్వ క్రమాన్ని నిర్ధారించవచ్చు. రెండు పాలక వంశాలు ఇక్కడ ఉండేవి. మహాభారత యుద్ధ ఘటనలతో తమను తాము ముడిపెట్టుకోవడాన్ని చేర పాలకులు పడిన తాపత్రయాన్ని సంగం కావ్యాలు వెల్లడిస్తాయి. తొలి చేర పాలకుడు ఉదియంజెరల్ కురుక్షేత్రలో పోరాడిన రెండు సైన్యాలను పుష్టిగా పోషించినట్లు చెబుతారు. ఇతడు క్రీ.శ.130 కాలంలో పాలించాడు. ఇతడి కుమారుడు నెడుంజెరల్ ఆదన్. అతడు అనేక యుద్ధాలను గెలిచాడు. ఈ కారణంగా అతడికి "ఇమాయవరంబన్" అనే బిరుదు లభించింది. అంటే హిమాలయాలను రాజ్య సరిహద్దులుగా కలవాడని అర్థం. ఆదన్ కుమారులలో సెంగుత్తువన్ ఒకడు. సంగం యుగానికి చెందిన గొప్ప కవి పరానర్ సెంగుత్తువన్‌ను తన గేయంలో కీర్తించాడు. కణ్ణగిని ఆదర్శపత్నిగా కొలిచే పత్తిని పూజావిధానాన్ని అతడు ప్రారంభించాడు. ఉదియంజెరల్ కుటుంబానికి చెందిన ఐదుగురు పాలకులను (మూడు తరాల వారు) పదిర్రుపట్టు ప్రస్తావిస్తుంది. వీరు సుమారు 201 సంవత్సరాలపాటు పాలించారని చెబుతారు. మరో కుటుంబానికి చెందిన ముగ్గురు పాలకులు 58 ఏళ్లు పాలించారని సాహిత్య ఆధారాలు పేర్కొన్నాయి.

**ఇతర స్థానిక పాలక వంశాలు :**

పురాణాల ప్రకారం మౌర్య వంశం పతనమైన తర్వాత సుంగా, కాన్వా, ఆంధ్ర లాంటి పాలక వంశాలు ఆవిర్భవించి రాజకీయ లోటును భర్తీ చేశాయి. కళింగ రాజ్యం స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకుంది. దక్షిణంలోని తమిళ రాజ్యాలు ఉత్తర భారత సామ్రాజ్యాల నుండి పూర్తి స్వేచ్ఛను పొందాయి. పశ్చిమోత్తర భారతదేశం విదేశీ దండయాత్రలను వరుసగా

ఎదుర్కొంది. గ్రీకులు, పార్థో–సైథియన్లు, యూచీలు లేదా కుషాణులు ఈ ప్రాంతంపై దాడి చేసి దేశంలోని వివిధ ప్రాంతాలలో రాజ్యాలను ఏర్పాటు చేసుకున్నారు. భారతీయ సామాజిక, రాజకీయ జీవితంపై చెరిగిపోని ముద్రలు వేశారు.

**సుంగా వంశం :** సుంగా వంశం గురించి గార్గీ సంహిత, పతంజలి మహాభాష్య, దివ్యవదన, కాళిదాసుని మాలవికాగ్నిమిత్ర, బాసుడి హర్షచరిత్ర ఎన్నో వివరాలు అందిస్తాయి. అయోధ్య, విదీష (ఆధునిక ఖిల్సా), బహ్రూత్‌లలో లభించిన శిలాశాసనాలు, నాణేలు చివరి సుంగా చరిత్రపై కాంతిని ప్రసరిస్తాయి. కౌసాంబి (ఆధునిక కోసల) అయోధ్య, అహిచ్ఛత్ర, మధురలలో ఈ వంశానికి చెందిన నాణేలు లభ్యమయ్యాయి.

మౌర్య పాలకులలో చివరి వాడైన బృహధ్రథ పట్ల ప్రజలలో గూడుకట్టుకున్న అసంతృప్తి వల్లే పుష్యమిత్రుడు విజయవంతంగా తిరుగుబాటు చేయగలిగాడు. బృహద్రథ మౌర్య సామ్రాజ్యాన్ని గ్రీకుల వరుస దండయాత్రల నుండి సంరక్షించలేకపోయాడు. ఈ నేపథ్యంలో చెలరేగిన ఆగ్రహజ్వాలల్లో పుష్యమిత్రుడు అతడిపై తిరుగుబాటు చేశాడు. గర్గీ సంహితలోని యుగ పురాణ ప్రకారం గ్రీకు సైనికులు ఉత్తర భారతంలోని అనేక ప్రాంతాలను అధిగమించి పాటలీపుత్రకు చేరుకున్నారు. వారికి దెమెత్రియస్ నాయకత్వం వహించి ఉంటాడు. అప్పటికే పుష్యమిత్రుడు మౌర్యుల సైన్యాధిపతిగా ఉన్నాడు. భరద్వాజ గోత్రానికి చెందిన బ్రాహ్మణులుగా సుంగా వంశీయులను సాధారణంగా గుర్తిస్తారు.

పుష్యమిత్రుడి వారసుడిగా అతడి కుమారుడు అగ్నిమిత్ర రాజ్య నిర్వహణా బాధ్యతలను చేపట్టాడు. కాళిదాసుని మాలవికాగ్నిమిత్ర కావ్యంలో కథానాయకుడు ఇతడే. అగ్నిమిత్రుడి తర్వాత సుజ్యేష్ట సింహాసనాన్ని అధిష్టించాడు. నాణేలలో ఉన్న జేఠమిత్ర ఇతడే. ఇతడి తర్వాత అగ్నిమిత్ర కుమారుడు వసుమిత్ర పాలనా పగ్గాలు చేపట్టాడు. అయితే స్వల్పకాలంలోనే అతడు కోసలకు చెందిన మూలదేవ చేతిలో హత్యకు గురయ్యాడు. వసుమిత్ర స్థానంలో వజ్రమిత్ర వచ్చాడు. ఎలాంటి ప్రాముఖ్యత లేని అతడి పాలన తర్వాత భాగవత వచ్చాడు. బేస్‌నగర్ స్థూప శాసనంలో పేర్కొనబడిన భాగబద్ర రాజు ఇతడే. భాగవత వారసుడు దేవభూతి. వసుదేవ అనే బ్రాహ్మణ మంత్రి దేవభూతిని గద్దె దించాడు. ఈ క్రమంలోనే సుంగా వంశం పతనమైంది.

సుంగా పాలక వంశం కొనసాగిన కాలంలో బ్రాహ్మణత్వం మళ్లీ పుంజుకుంది. భాగవత అనే మతం ఎనలేని ప్రాధాన్యతను దక్కించుకుంది. మధ్య భారతంలోని గోనార్దా గ్రామంలో జన్మించిన గొప్ప వ్యాకరణ శాస్త్ర నిపుణుడు పతంజలి పుష్యమిత్ర సమకాలికుడు. సుంగా కాలంలో మౌర్య కళకు పూర్తిగా భిన్నమైన ఒక సరికొత్త కళా స్వరూపం ఆవిర్భవించింది. బార్హూత్‌లో బయల్పడ్డ విశ్రాంతి గృహాలు సమకాలీన భారత జీవనాన్ని చక్కగా వివరిస్తాయి. స్వభావం (లక్షణం) విషయానికి వస్తే సుంగాకళ ప్రజాకర్షకమైనది. దాని లక్ష్యం, మూలం చాలా వరకు సంగ్రహమే. యావత్తు భారతదేశ ప్రజల ఉమ్మడి కళాతృష్ణను సుంగా కళ ప్రతిబింబిస్తుంది. మౌర్య కాలపు రాచరిక ఆస్థానం నుండి వెలువడిన కళకు ఇది పూర్తిగా విరుద్ధమైనవి.

**కావ్యాలు :** సుంగా పాలకుడు దేవభూతిని హత్య చేసి రాజ్యాధికారాన్ని చేజిక్కించుకున్న వసుదేవ అనే బ్రాహ్మణ మంత్రి కాన్వాల కొత్త వంశాన్ని స్థాపించాడు. కాన్వా తొలి రాజు యొక్క రాజ్యం కేవలం మగధ వరకే పరిమితమై ఉండేది. వసుదేవ వారసుడు భూమిమిత్ర. అతడి తర్వాత నారాయణ అనే పాలకుడు వచ్చాడు. నాణేలలో కనిపించిన విష్ణుమిత్రుడు ఇతడేనని కొందరు చరిత్రకారులు వాదించారు. నారాయణ వారసునిగా అతడి కుమారుడు సుశర్మన్ సింహాసనం ఎక్కాడు. ఇతడే కాన్వా చివరి పాలకుడు. క్రీ.పూ. 27లో ఆంధ్రులు ఇతడిని మట్టుబెట్టారు.

**కళింగ చేతాలు :**

ఖారవేల కాలంలో కళింగ రాజ్యంలో పూరి, కటక్ జిల్లాలు, గంజాం, అలాగే విశాఖ జిల్లాలు అంతర్భాగంగా ఉండేవి. ఉదయగిరి కొండలోని హాతిగుంఫ శాసనం (పూరిజిల్లాలోని భువనేశ్వర్ నుండి మూడు మైళ్ల దూరంలో ఈ ప్రాంతం ఉంది) ఖారవేల సాధించిన విజయాలను వివరిస్తుంది. మహామేఘవాహనుడి వారసుడైన ఖారవేల కళింగను పాలించాడు. అయితే చేతి లేదా చేది పాలక వంశాన్ని స్థాపించింది మాత్రం మహామేఘ వాహనుడే. ఖారవేళ, మహామేఘవాహనుడి మధ్య ఏ సంబంధం ఉండేదో ఖచ్చితంగా చెప్పడం చాలా కష్టం. అలాగే వారిద్దరి మధ్య ఎంత మంది పాలకులు వచ్చారో నిర్ధారించడం అసాధ్యం. కాలగణాంకాలు లేని, తీవ్రంగా దెబ్బతిన్న హాతిగుంఫ శాసనం ఎన్నో ఊహాగానాలకు దారి తీసింది. ఈ శాసనంలో మొత్తం 17 వాక్యాలు ఉన్నాయి. అయితే వాటిలో కేవలం నాలుగు మాత్రమే ఖారవేల పాలనలోని తొలి 13 సంవత్సరాలను నమోదు చేశాయి. ఈ శాసనంలో వర్ణించినట్లు ఖారవేల పాలనా విజయాలు అతిశయమే అయినప్పటికీ ఖారవేల ఒక గొప్ప సైనిక నాయకుడని, అతడి నేతృత్వంలో కళింగ రాజ్యకీర్తి పతాకస్థాయికి చేరుకుందని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. ఖారవేల మరణించిన తర్వాత కళింగ రాజ్యం తన పూర్వవైభవాన్ని తెచ్చుకోవడానికి ఎన్నో శతాబ్దాలపాటు వేచి చూడాల్సి వచ్చింది.

**ఉత్తర భారత ఇతర పాలక వంశాలు :** సింధూ నది దాటిన మెనాండర్ పంజాబ్‌ను రావి నది వరకు ఆక్రమించాడు. గ్రీకుల విజయం స్థానిక గవర్నర్లలో కొత్త ఉత్సాహాన్ని నింపింది. వారు తమను తాము స్వతంత్రులుగా ప్రకటించుకున్నారు. ఫలితంగా అయోధ్య, కౌసాంబి, మధుర, అహిచ్ఛత్రలలో అనేక స్వతంత్ర రాజ్యాలు (చిన్నవి) ఏర్పడ్డాయి. మధురకు వాయవ్య దిశలో అర్జునయానుల గిరిజన గణరాజ్యం ఉండేది. తూర్పున ఆగ్రా నుండి పశ్చిమాన జైపూర్ వరకు ఈ రాజ్యం విస్తరించి ఉండేది. సుంగా వంశం పతనం కావడంతో రావి, యమున నదుల మధ్యలో నివసిస్తున్న క్షత్రియ తెగలు సర్వస్వతంత్ర రాజకీయ శక్తులుగా మళ్లీ ప్రత్యక్షమయ్యాయి. ఆడంబరులు, రావి, బియాస్ నదుల మధ్య విస్తరించిన భూభాగాన్ని స్వాధీనం చేసుకున్నారు. వీరి నాణేలలో మూలదైవం మహాదేవ (శివ) ప్రతిమ కనిపిస్తుంది. కునిందుల రాజ్యం బియాస్, యమున నదుల ఎగువ ప్రాంతాలలో విస్తరించి ఉండేవి. వారి నాణేలు కూడా రాజ్య దైవమైన ఛత్రేశ్వర (శివ) ప్రతిమను కలిగి ఉన్నాయి. పంజాబ్‌లోని

కొంత భాగాన్ని త్రిగర్తకు చెందిన యుద్ధ తెగ ప్రజలు స్వాధీనం చేసుకున్నారు. యౌద్ధేయులు సట్లెజ్–యమున నదుల మధ్య గల భూభాగాన్ని నియంత్రించారు. కార్తికేయ అనే మూలదైవం ప్రతిమ ఉన్న నాణేలను వారు జారీచేశారు. కార్తికేయను బ్రాహ్మణ్య అని కూడా పిలుస్తారు.

## విదేశీ పాలక వంశాలు

**పరిచయం :** క్రీ.పూ. రెండవ శతాబ్దం తొలి దశలో మౌర్య సామ్రాజ్య పతనం కావడంతో భారతదేశ ప్రాచీన చరిత్రలో ఒక కొత్త యుగం మొదలైంది. ఈ యుగంలో విశాల సామ్రాజ్యంపై ఆధిపత్యం గల ఒకే ఒక్క పాలక వంశం స్థానంలో అనేక విదేశీ శక్తులు ఉపఖండంలో కొత్త రాజ్యాలను ఏర్పాటు చేసి తమ ప్రాబల్యాన్ని సుస్థిరం చేసుకున్నాయి. మౌర్య సామ్రాజ్యం విచ్ఛిన్నం కావడం, పశ్చిమోత్తర సరిహద్దు నుండి ఎన్నో దండయాత్రలు జరగడంతో చాలా మంది చరిత్రకారులు ఈ కాలాన్ని చీకటియుగంగా పరిగణించాలని భావించారు. అయితే ఇలాంటి వాదన క్రమంగా బలహీనపడి పూర్తిగా నిరర్థకమైంది. రాజకీయ పరిభాషలో చెప్పాలంటే మౌర్య సామ్రాజ్య పతనం ఎలాంటి సంక్షోభాన్ని లేదా తీవ్ర పర్యవసానాన్ని సూచించదు. దక్కనులోలాగే ఉత్తర భారతదేశంలో రాజ్యాల అవతరణ ప్రక్రియ నిరాఘాటంగా కొనసాగింది.

క్రీ.పూ. ఆరు–ఐదు శతాబ్దాలలో గంగాలోయలో ప్రాథమిక రాజ్యాలు ఏర్పడితే ఈ కాలంలో "ఉన్నత" రాజ్యాలు ఏర్పడ్డాయి. ప్రాచీన భారతదేశ చరిత్రకారులు, రాజకీయ మానవ విజ్ఞాన శాస్త్రవేత్తల మధ్య జరిగిన ఆసక్తికరమైన సంభాషణల నుండి కూడా ప్రాచీన భారతదేశంలో రాజ్య స్వరూపం గురించి తెలుసుకోవచ్చు. వరుసగా జరిగిన విదేశీ దండయాత్రలతో ఆస్తి, ప్రాణ నష్టం సంభవించి ఉంటాయి. అలాగే కొన్ని రాజకీయ అనిశ్చితులు కూడా నెలకొని ఉంటాయి. అయితే సాధారణంగా ఉపఖండం పాశ్చాత్య ప్రపంచంతో సన్నిహిత సంబంధాలను ఏర్పరచుకుంది. ఈ సంబంధాల కారణంగా సామాజిక–ఆర్థిక, సాంస్కృతిక జీవనంలో ఎన్నో మంచి ఫలితాలను సాధించడానికి ఆస్కారం ఏర్పడింది.

క్రీ.పూ.200 నుండి క్రీ.శ.300 వరకు విస్తరించి ఉన్న భౌతిక వాద సంస్కృతి వ్యవసాయం, నీటి పారుదల రంగాలలో అద్వితీయమైన ప్రగతిని చవిచూసింది. కళలు బహుస్వరూపాలను పొందాయి. వాణిజ్యం గణనీయంగా పెరిగింది. (ముఖ్యంగా విదేశీ వాణిజ్యం) నాణేల వాడకమూ పెరిగింది. ఈ 500 సంవత్సరాలలో ఉపఖండమంతటా పట్టణ కేంద్రాలు ఆవిర్భవించడంలో మరో ముఖ్యమైన విషయం. ఈ కాలంలో రెండవ పట్టణీకరణ ఉన్నత శిఖరానికి చేరుకుంది. రాజ్యసమాజం, పట్టణాభివృద్ధి విస్తరణ సమాంతరంగా పరస్పర సహకారకంగా జరిగినట్లు బోధపడుతోంది.

పశ్చిమోత్తర సరిహద్దు భూభాగాల నుండి ఉపఖండంలోకి చొరబడిన విదేశీ శక్తులలో బాక్ట్రియా గ్రీకులు ప్రధానమైనవారు. వీరు తొలుత పశ్చిమాసియాకు చెందిన సెల్యూకస్ వంశానికి విధేయులుగా ఉండేవారు. భారతదేశంపై దండెత్తిన తొలి విదేశీయులు వీరే. క్రీ.పూ. 187లో మౌర్య సామ్రాజ్య పతనాన్ని పురస్కరించుకొని ఈ దాడి జరిగింది. ఆఫ్ఘనిస్తాన్‌లోని

ఆక్సస్ నది తీరంలో ఐఖోనం అనే ప్రాంతం వద్ద ఒక గ్రీకు పట్టణ అవశేషాలు లభించడం ఉపఖండంలో గ్రీకుల ఉపస్థితికి ఉత్తమ నిదర్శనం.

ఈ పట్టణం వద్ద జరిపిన తవ్వకాలలో 682 నాణేలు బయటపడ్డాయి. అందులో 676 నాణేలు హస్తముద్రికలు కలిగిఉన్నాయి. గ్రీకు పాలకుడు అగాథోకల్స్ (క్రీ.పూ. 180–165) జారీ చేసిన ఆరు నాణేలు మరీ ప్రత్యేకమైనవి. కాంస్యంతో తయారైన ఈ చతుర్భుజ ఆకార నాణేలు 2.33 నుండి 3.307 గ్రాములు బరువు కలవి. అయితే ఈ కాంస్య నాణేల రెండు వైపులా ముద్రణ కలిగి ఉండడం వాటి ప్రత్యేకతను నిర్ధారిస్తాయి. ఒక వైపు చక్ర, మండల చిహ్నాలు, మరోవైపు గద, ఒక విచిత్రమైన సాధనం ఉన్నాయి. అవి అంకుశ, హలాలను సూచిస్తాయి. రెండు వైపులా ఉన్న చిత్రాలులో ఖడ్గాలు ఒరలో వేలాడుతూ కనిపిస్తాయి. చక్రం కలిగిన చిత్రాన్ని వాసుదేవ కృష్ణునితో గుర్తించారు. రెండవ చిత్రంలో గద, హలం ఉన్నాయి. వాటిని కృష్ణుడి అగ్రజుడైన బలరామునితో పోల్చవచ్చు. ఆ విధంగా ఈ నాణేలు కృష్ణుడు, బలరాముని ప్రతీకాత్మకంగా ప్రతిబింబించాయి. గ్రీకు పాలకుని ద్విభాష, ద్విలిపి గల నాణేలు ఇద్దరు సుపరిచిత భారతీయ దైవాలను చిత్రీకరించడం పశ్చిమోత్తర సరిహద్దు భూభాగం, భారతీయ ప్రధాన భూభాగాల మధ్య ఉన్న సన్నిహిత సాంస్కృతిక సంబంధాలును సూచిస్తాయి.

దక్షిణాసియా, మధ్య ఆసియా, పశ్చిమాసియా ప్రజల మధ్య సంబంధాల తీవ్రత గాంధార కళ అధ్యయనంలో చాలా చక్కగా నమోదైంది. గాంధారకళ అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించింది. ఈ కళలోని గ్రీకు, భారతీయ బౌద్ధ అంశాలు కళా చరిత్రకారులకు సుపరిచితం. ఇటీవలి అధ్యయనాలు గాంధార కళలో పశ్చిమాసియా, ముఖ్యంగా ఇరానీ అంశాలు, అలాగే మధ్యఆసియా గిరిజన (తెగ) అంశాలు ఉన్నట్లు సూచిస్తాయి. గాంధార కళ అవతరణలో బౌద్ధ మతం ఒక కీలకాంశం. దీనిని ఎవరూ వ్యతిరేకించలేదు. గాంధార కళ విషయానికి వస్తే అయితే ఇటీవలి సంవత్సరాలలో బ్రాహ్మణిక, బౌద్ధేతర చిహ్నాల ప్రాముఖ్యతను కూడా సమర్థవంతంగా (స్పష్టంగా) గుర్తించారు.

మధ్య, పశ్చిమాసియాలతో భారతదేశానికి సంబంధాలు మెరుగు పడడానికి ప్రధాన కారణం సంచార, యుద్ధ తెగల (మధ్య ఆసియా) వలసలే. క్రీ.పూ. రెండవ శతాబ్దం తొలి దశకాలలో ఈ వలసలు జరిగాయి. ప్రాచీన చైనా గ్రంథం హుసియుంగ్‌నూ (తర్వాత వీరిని హున్ లేదా హునాలుగా గుర్తించారు), సేక్(సకాలు), యూచీలు గురించి మనకు సమాచారం అందిస్తాయి. వీరి మధ్య ఘర్షణలు సాధారణంగా పశ్చిమ దిశవైపు వలసలను ప్రోత్సహించాయి. యుద్ధతెగలు ఎక్కువగా వలసవచ్చాయి. ముఖ్యంగా సకాలు, యూచీలు ఈశాన్య ఆఫ్ఘనిస్తాన్‌లోని బాక్ట్రియాకు వలస వచ్చాయి. ఈ ప్రాంతంలో వ్యవసాయ సంపన్నతకు, నీటి కాలువలకు, బంగారు రాశులకు కొదవ ఉండేది కాదు, మరీ ముఖ్యంగా అంతర్జాతీయ వాణిజ్య కేంద్రాన్ని రాజధానిగా కలిగి ఉండడం వల్ల కూడా బాక్ట్రియా అందరినీ ఆకర్షించింది. ఆ రాజధాని నగరం బాక్ట్రా (ఆధునిక మజార్–ఎ–షరీఫ్). ఈ ప్రాంతంలో సకా తెగల విజృంభణతో గ్రీకు రాజ్యం పతనమైంది. అయితే సకాలు స్వయంగా యూచీలు లేదా తా యూచీ (గొప్పయూచీ) చేతిలో ఓటమి పాలయ్యారు.

తా యూచీ  తెగకు చెందిన ఐదు గోత్రాలు (యాబ్గూ), ముఖ్యంగా క్యూ-ఘవాంగ్ తొలుత తా-సియా (బాక్ట్రియా తూర్పుభాగం), తర్వాత బాక్ట్రియా, అంతటినీ (బాక్ట్రాతో సహా) ఎలా స్వాధీనం చేసుకుందో చైనా పాలకవంశాల చరిత్రలు వివరిస్తాయి. తొలి క్యూ-ఘవాంగ్ పాలకుల విస్తరణ  ధోరణులు వారి తొలి పాలకుడు మియావోస్ చూపిన మార్గదర్శనంలో బహిర్గతమవుతాయి. మియావోస్ ఆక్సస్ నదికి ఉత్తరానగల భూభాగాలను స్వాధీనం చేసుకున్నాడు. దీనితో కుషాణుల మహా సామ్రాజ్యానికి బాటలు పడ్డాయి. తమ అధికారం శిఖర స్థాయిలో ఉన్నప్పుడు కుషాణ పాలకులు మధ్య ఆసియా, ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్, ఉత్తర భారతదేశంలోని విశాలమైన భూభాగాలను పాలించారు. 1960 పూర్వం కుషాణ పాలకులను అధ్యయనం చేసిన భారతీయ చరిత్రకారులు వారి మధ్య ఆసియా భూమికను గుర్తించినప్పటికీ వారు భారతీయులని, విదేశీ భూభాగాలలో తమ ప్రాబల్యాన్ని  విస్తరించారని భావించారు. ఈ భావనలో అనేక ప్రాధాన్యతగల మార్పులు వచ్చాయి. కుషాణుల మూల భూభాగం ఇపుడు భారతదేశంలో కాకుండా బాక్ట్రియాలో ఉన్నట్లు గుర్తించారు. బాక్ట్రియా నుండి కుషాణులు ఉత్తర, పశ్చిమోత్తర భాగాలకు (ఉపఖండంలో) విస్తరించారని నిర్ధారించారు. ససానీదు పాలకుడు ఒకటవ షాపుర్ క్రీ.పూ. 262లో బాక్ట్రియాను జయించడంతో కుషాణ మహాసామ్రాజ్య పతనం ప్రారంభమైంది.

ప్రాచీన ప్రపంచంలోని అత్యంత శక్తివంతమైన రాజకీయ స్వరూపాలలో కుషాణ సామ్రాజ్యం ఒకటని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. పాశ్చాత్యంలో రోమను సామ్రాజ్యం, ఇరాన్‌లోని అర్సాసిడ్ లేదా సామ్రాజ్యవాద పార్థియన్ సామ్రాజ్యం, చైనాలో హన్ వంశం ఇతర ప్రధాన రాజకీయ శక్తులు. మరీ సంచార జీవిత నేపథ్యం నుండి సామ్రాజ్య దశకు కుషాణులు చేరుకోవడంతో ప్రపంచవ్యాప్తంగా ఈ విషయంపై సహజంగానే ఆసక్తి పెరిగింది. చరిత్రకారులు కుషాణుల ప్రస్థానంపై అనేక అధ్యయనాలు చేపట్టారు. కుషాణ అధ్యయనాలలో ప్రధానమైన వాదనలు చాలా  ఉన్నాయి. కుషాణ పాలకుల వంశ చరిత్ర, వారసత్వ క్రమం అందులో ముఖ్యమైనది.

సకాశకం ఎప్పుడు ప్రారంభమైందనే విషయంతో ఈ సుదీర్ఘ వివాదం ముడిపడి ఉంది. సకా శకాన్ని కుషాణ చక్రవర్తులలో గొప్పవాడైన ఒకటవ కనిష్క ప్రారంభించినట్లు సాధారణంగా అందరూ గుర్తిస్తారు.

పశ్చిమోత్తర సరిహద్దు నుండి గంగాలోయలోకి విదేశీ శక్తులు చొచ్చుకురావడంతో రెండు ప్రాంతాల మధ్య సంబంధాలు తీవ్రతరమయ్యాయి. ఖరోష్టి లిపి విస్తరణలో ఈ విషయం స్పష్టమవుతుంది. పశ్చిమోత్తర ప్రాంతంలో ప్రధాన సాంస్కృతిక లక్షణమైన ఈ ఖరోష్టి లిపి గంగా లోయకు, ముఖ్యంగా గంగా డెల్టాలో విస్తరించింది. బనారస్‌కు సమీపంలో ఉన్న చునార్‌లో ఖరోష్టి లిపిలో ఉన్న ఇసుక రాతి  శాసనాలు పెద్ద సంఖ్యలో బయటపడ్డాయి. అవి క్రీ.శ. రెండవ శతాబ్దానికి చెందినవని నిర్ధారించారు. ఖరోష్టి శాసనంగల ఒక ఫలకం (క్రీ.శ. మూడవ శతాబ్దానికి చెందినది) పాట్నా సమీపంలోని కుమారహార్ తవ్వకాలలో బయటపడింది. కనుక దీనికి ఎనలేని ప్రాముఖ్యత ఉంది. గంగ పరివాహక పశ్చిమ బెంగాల్ నుండి అత్యంత ముఖ్యమైన ఆధారం లభించింది. పశ్చిమ బెంగాల్‌లోని వివిధ ప్రాంతాలలో ముద్రలు, ముద్రికలు,

ఖరోష్టి లిపి గల మట్టి పాత్రలు, ఖరోష్టి–బ్రాహ్మి ఉమ్మడి లిపి గల ఫలకాలు (క్రీ.శ. తొలి నాలుగు శతాబ్దాలకు చెందినవి) పెద్ద సంఖ్యలో లభించాయి.

## ఇండో-గ్రీకులుః

**బాక్ట్రియా తిరుగుబాటు :** క్రీ.పూ. మూడవ శతాబ్దం మధ్యభాగంలో సెల్యూక సామ్రాజ్యం నుండి బాక్ట్రియా, పార్థియా వేరుపడి స్వతంత్ర రాజ్యాలుగా ఎదిగాయి. జస్టిన్ అనే చరిత్రకారుడి ప్రకారం పార్థియా సెల్యూక పాలనకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసి అర్సాసెస్ నేతృత్వంలో స్వతంత్ర రాజ్యంగా మారింది. అదే సమయంలో బాక్ట్రియా గవర్నర్ డియోడోటస్ తిరుగుబాటు చేసి తనను తాను పాలకునిగా ప్రకటించుకున్నాడు. డియోడోటస్ వారసునిగా అతడి కుమారుడు(అదేపేరు గల)వచ్చాడు. అతడు రాజ్య వ్యవహారాలను (విధానాలు) పూర్తిగా ప్రక్షాళన చేశాడు. పార్థియాకు వ్యతిరేకంగా శత్రు విధానాన్ని అవలంబించిన తన తండ్రికి పూర్తి భిన్నంగా ఈ పాలకుడు పార్థియాతో స్నేహ సంబంధాలను నెలకొల్పాడు. (పార్థియా సెల్యూక పాలకులకు శత్రువుగా ఉండేది). అయితే డియోడోటస్ యూథీడీమస్ అనే సాహసికుడి చేతిలో హత్యకు గురయ్యాడు. యూథీడీమస్ స్వయంగా పాలనా బాధ్యతలను చేపట్టాడు.

**యూథిడీమస్ వంశం :** స్వతంత్ర బాక్ట్రియా చరిత్ర చాలావరకు యూథీడీమస్, అతడి కుమారుడు దెమిత్రియస్‌ల చరిత్రే. యూథీడీమస్ జారీ చేసిన నాణేలు పెద్ద సంఖ్యలో లభ్యం కావడాన్ని బట్టి అతడు సుదీర్ఘ కాలం పాలించి తన రాజ్యాన్ని విస్తరించినట్లు బోధపడుతుంది.

దక్షిణ అఫ్ఘనిస్తాన్, ఇరాన్ సరిహద్దు, పశ్చిమోత్తర భారతదేశంలోని కొన్ని భూభాగాలపై తన ఆధిపత్యాన్ని విస్తరించాడు. భారత లోపలిభూభాగంలోకి ఆయుధాలను తీసుకెళ్లిన విదేశీ పాలకులలో అలెగ్జాండర్ తర్వాత దిమిత్రియస్ నిలుస్తాడు. తన గైర్హాజరులో బాక్ట్రియా – సోగ్దియానా ప్రాంతాన్ని సురక్షితంగా ఉంచే బాధ్యతను తన పెద్ద కుమారుడు రెండవ యూథీడీమస్‌కు అప్పగించిన దిమిత్రియస్ భారతదేశంవైపు తన రెండవ కుమారుడు రెండవ దిమిత్రియస్‌తో కలిసి కదిలాడు. వారితోపాటు మోనాండర్ అనే సైనికాధికారి కూడా ఉన్నాడు. గాంధారను స్వాధీనం చేసుకున్న దిమిత్రియస్ సింధూ నదిని దాటుకొని తక్షశిలను జయించాడు. ఆ ప్రాంతాన్ని తన పూర్వస్థావరంగా మార్చుకున్నాడు. హిందూకుష్– సింధూ మధ్యగల దేశాన్ని పాలించే బాధ్యతను రెండవ దిమిత్రియస్‌కు అప్పగించాడు. తర్వాత తన సైన్యంలోని ఒక భాగాన్ని గంగా నదివైపు, మరో భాగాన్ని సింధూ తీరం వెంబడి దక్షిణంవైపు పంపాడు. మెనాండర్‌ను పాటలీపుత్రలో ఉంచాడు. ఉజ్జయినీలో అపోలో డోటస్‌కు బాధ్యతలు అప్పగించాడు. తానే స్వయంగా తక్షశిలను నియంత్రిస్తూ ఉండడంతో దిమిత్రియస్‌కు భారత సామ్రాజ్యంలోని మూడు అధికార కేంద్రాలపై ఆధిపత్యం లభించింది.

భారతదేశాన్ని జయించడంలో దిమిత్రియస్ నిమగ్నమై ఉండగా బాక్ట్రియాలో అతడి అధికారం సన్నగిల్లింది. ఈ క్రమంలోనే క్రీ.పూ. 171లో యూక్రాటైడ్స్ నేతృత్వంలో తిరుగుబాటు జరిగింది. బాక్ట్రియాలో అధికారాన్ని చేజిక్కించుకున్న యూక్రాటైడ్స్‌ను అణచివేసే ప్రక్రియలో

దిమిత్రియస్ తన ప్రాణాలు కోల్పోయి ఉంటాడు. ఇలాంటి క్లిష్టమైన పరిస్థితులలో బాక్ట్రియా పాలకులలో అత్యంత ప్రతిభావంతుడైన మెనాండర్ నాయకునిగా ఎదిగాడు. భారతీయ పురాణాలు ఇతడిని మిలిండాగా గుర్తిస్తాయి.

మెనాండర్ రాజ్యం ఇండో–గ్రీకు అధికారం యొక్క పతాక స్థాయిని సూచిస్తుంది. పశ్చిమాన కాబుల్ లోయ నుండి తూర్పున రావి నది వరకు, ఉత్తరాన స్వాట్ లోయ నుండి దక్షిణాన ఉత్తర అరాకోసియా వరకు గల భూభాగాన్ని అతడు పాలించాడు. అయితే మెనాండర్ కీర్తికి ఉన్నత స్థాయి దర్పణం పాలి కృతి అయిన మిలిండా పన్హో (మిలిండా ప్రశ్నలు)లో కనిపిస్తుంది. మిలిండా (సకల (సియాల్‌కోట్) రాజ్య పాలకుడు), నాగసేన అనే బౌద్ధ పురోహితుని మధ్య సంభాషణల రూపంలో ఈ కృతి రూపొందించబడింది.

**యూక్రాటైడ్స్ వంశం :** బ్రాక్టియా, భారతదేశంపై పాలించిన చివరి గ్రీకు పాలకుడు హెలియోకల్స్. అతడి తర్వాత బాక్ట్రియాను మధ్య ఆసియా స్టెప్పీల నుండి వచ్చిన సకాల సైన్యం లొంగదీసుకుంది. హెలియోకల్స్ తర్వాత బాక్ట్రియా పాలకుడిగా ఆంటియల్‌సిడాస్ బాధ్యతలు చేపట్టాడు. అతడు హెలియోడోరస్ అనే రాయబారిని కాశీపుత్ర భాగభద్ర ఆస్థానానికి పంపినట్లు బేస్‌నగర్ స్థూప శాసనం పేర్కొంది. భాగభద్రను చివరి సుంగా పాలకుడు భాగవతగా గుర్తించారు. ఆంటియల్‌సిడాన్ తర్వాత అమీన్టాస్ గ్రీకు పాలకునిగా వ్యవహరించాడు. అమీన్టాస్ గ్రీకు చివరి పాలకుడైన హెర్మయూస్‌కు తండ్రి అని సూచించ బడింది. శత్రువుల ప్రభంజనాన్ని అడ్డుకోవడానికి అతడు శతవిధాలా ప్రయత్నించాడు. అయితే అంతిమంగా పార్థియన్ల (కందహార్ ప్రాంతానికి చెందిన పహ్లావాలు) చేతిలో ఓటమి పాలయ్యాడు.

## గ్రీకు దండయాత్ర పర్యవసానాలు

భారతదేశంపై రెండవ గ్రీకు దండయాత్ర అలెగ్జాండర్ దండయాత్ర కంటే అత్యంత ప్రధానమైనది. పంజాబ్, తదితర పొరుగు ప్రాంతాలలో గ్రీకు పాలనను స్థాపించిన బాక్ట్రియా ఇండో–గ్రీకులు సుమారు 150 సంవత్సరాలపాటు సుదీర్ఘంగా పాలించారు. గ్రీకు రాజ్యం యొక్క ప్రాంతీయ సంఘటనం – గ్రీకు సత్రపీలు– దేశంలో ఎంత బలంగా పాతుకు పోయిందంటే సకా పాలకులు దానిని కొద్ది పాటి మార్పులతో అలాగే ఆమోదించారు.

శైలిలో, రూపకల్పనలో ప్రపంచంలోనే ఉత్తమ నాణేలుగా ప్రసిద్ధిగాంచిన గ్రీకు నాణేలు తదుపరి కాలాలలో స్థానిక రాజ్యాల మారక ద్రవ్యానికి ఆదర్శంగా నిలిచాయి. అలాగే ఇండో–గ్రీకు రాజుల కొన్ని వెండి నాణేలు భారతీయ పద్ధతులను ఆమోదించినట్లు నిర్దిష్టమైన సాక్ష్యాన్ని అందిస్తాయి. గ్రీకు, ఖరోష్టి లిపులలో ప్రశస్తిలు గల ద్విభాష నాణేలు సకాల పాలనలో కూడా కొనసాగాయి. పార్థియన్లు, తొలి కుషానులు కూడా వాటిని ఆమోదించారు. ఖరోష్టి ప్రశస్తిలను తొలుత ఉపసంహరించిన పాలకుడు కనిష్క.

భారతదేశానికి దిమిత్రియస్ తనతోపాటు తీసుకువచ్చిన గ్రీకు కాలసూచిక ఇతర శకాలెన్నింటికో జన్మనిచ్చింది. కాలక్రమాన్ని శాశ్వతంగా నిర్ధారించే ఆలోచన భారతదేశానికి గ్రీకుల నుండే వచ్చింది. సకాలు, కుషానులు దానిని ఎంతగా అనుకరించారంటే కేవలం

తొలి పాలనా సంవత్సరం తప్ప అందులో ఎలాంటి మార్పు లేదు. వారు మెసిడోనియా మాసాలను (ఉపవిభజన) అలాగే కొనసాగించారు.

సాహిత్య రంగంలో కొన్ని గ్రీకు పదాలు సంస్కృతంలో స్థానం సంపాదించు కున్నాయి. కలం, సిరా, ఫలకం, గ్రంథం తదితర పదాలకు ఉన్న సంస్కృత నామాలు గ్రీకు భాష నుండి తీసుకున్నవే. సాహిత్య ఆధారాలు దాదాపు నశించిపోయినప్పటికీ భారతదేశంలో గ్రీకులు రచించిన సాహిత్యం ఛాయలు మనకు ఇప్పటికీ లభిస్తాయి.

ఖగోళశాస్త్రం విషయానికి వస్తే భారతీయులు గ్రీకు ప్రజలకు ఎంతో రుణపడి ఉన్నారు. గర్గీ సంహిత ప్రకారం "యవనులు అనాగరికులు. అయినప్పటికీ ఖగోళశాస్త్రం వారితోనే మొదలైంది. ఈ విషయానికి వస్తే వారిని దేవతలుగా కొలవాల్సి ఉంటుంది." ద్విసంఖ్య విలువైన శూన్యాన్ని (జీరో) భారతదేశంలో కనుగొన్నారని సాధారణంగా అందరూ గుర్తిస్తారు. అయితే "స్థల-విలువ నమోదు, శూన్య చిహ్నం' బాబిలోనియా, గ్రీకు ఖగోళ శాస్త్రంలో సాధారణంగా వాడుకలో ఉండేవన్న విషయాన్ని మనం గుర్తు చేసుకోవాలి. భారతీయ ఆవిష్కరణ కేవలం ఈ పద్ధతిని సంఖ్యా వ్యవస్థలో ద్విసంఖ్య క్రమానికి బదిలీ చేయడం వరకే పరిమితం. ఆర్యభట్ట, వరాహమిహిర ఖగోళశాస్త్ర కృతులలో కనిపించే రాశులు, గ్రహాల పేర్లు ఖచ్చితంగా గ్రీకు మూలం కలిగి ఉన్నాయి.

భారతీయ కళ, నిర్మాణశైలి అభివృద్ధిని ఇండో- గ్రీకులు కొంత వరకు ప్రభావితం చేశారు. పశ్చిమోత్తర సరిహద్దు ప్రాంతంలో విస్తరించి ఉన్న గాంధార కళ తొలుత గ్రీకు అంశాలతోనే ఎక్కువగా ఉన్నా కాలం గడిచే కొద్దీ కళాశైలి చాలా వరకు భారతీయతను సంతరించుకొని తన గ్రీకు ప్రభావాన్ని దూరం చేసుకుంది.

## సకాలు

**పుట్టుపూర్వోత్తరాలు :** క్రీ.పూ. రెండవ శతాబ్దంలో మధ్య ఆసియాలో తిరుగుబాటు బయల్దేరింది. ఫలితంగా సంచార తెగలు మరపురాని వలసలను చేపట్టారు. క్రీ.పూ. 176లో హియుంగ్-ను యూచీని ఓడించారు. తర్వాత పశ్చిమం దిశగా పయనించి అక్కడి నుండి సాయ్-వాంగ్-సకాలు ప్రజలను తరిమివేశారు. అయితే హియుంగ్-ను ప్రజలను వూ-సన్ ప్రజలు వెనక్కి నెట్టారు. భారతదేశంలోకి ప్రవేశించక ముందు సకాలు చాలా కాలం పాటు పార్థియన్ పాలకుల కింద సకస్తాన్‌లో నివసించారు. హిందూకుష్ పర్వత శ్రేణులను దాటిన తర్వాత గ్రీకుల ప్రతిఘటనను అణచివేశారు. ఆరియా, అరాకోసియా, గెడ్రోసియాలను దాటుకొని బోలాన్ పాస్ గుండా సింధూ లోయకు చేరుకున్నారు. పతంజలి మహాభాష్యం వారిని అనిరవాసిత (స్వచ్ఛమైన) సూద్రులుగా పేర్కొంది. రామాయణం వారి నివాస ప్రాంతాన్ని ఉత్తరం అంచున కంబోజ, యవన రాజ్యాల సరసన చేర్చింది. అయితే మహాభారతం వారిని సకాల రాజ్యానికి అవతల పశ్చిమోత్తర ప్రాంతం శివారున స్థిరపరిచింది. హరివంశ సూత్రీకరణ ప్రకారం సకాలు తన శిరస్సులను సగం వరకు ముండనం చేసేవారు.

**తక్షశిల సకాలు :** భారతదేశపు తొలి సకా పాలకుడు మౌయెస్ లేదా మొగా. మౌయెస్ రాగి నాణేలను పెద్ద సంఖ్యలో జారీ చేశారు. కొన్ని వెండి నాణేలు కూడా ముద్రించాడు. మహారాజ మహాత్మ అనే బిరుదును ఆపాదించుకున్నాడు. అతడి రాజ్యం సింధూనదికి ఇరువైపులా పశ్చిమంలో పుష్కలవతి నుండి తూర్పున తక్షశిల వరకు సకాల రాజ్యం విస్తరించి ఉండేది.

అతడి నాణేలలో రెండో వైపు అనేక గ్రీకు, కొన్ని భారతీయ దైవాల (శివ, బుద్ధ) ప్రతిమలు ఉన్నాయి. నాణేల ఆధారంగా మౌయెస్ స్థానంలో ఒకటవ అజెస్ అధికారంలోకి వచ్చాడని చెప్పవచ్చు. ఒకటవ అజెస్ మరో రాజు అజిలిసెస్‌తో కలిసి ఉమ్మడి నాణేలను జారీ చేశాడు. అజిలిసెస్ బహుశా అజెస్ కుమారుడై ఉంటాడు. తాను గద్దెనెక్కే వరకు అజిలిసెస్ అజెస్‌తో కలిసి కొంత కాలం సంయుక్తంగా పాలించి ఉంటాడు. అలాగే గ్రీకు లిపిలో అజిలిసెస్ పేరు, ఖరోష్టి లిపిలో అజెస్ పేరుతో ఉన్న నాణేలు కూడా మనకు లభించాయి. దీని ఆధారంగా కొందరు విద్వాంసులు అజెస్ అనే పాలకుడు అజిలిసెస్ కుమారుడై ఉంటాడని, తర్వాత అధికారంలోకి వచ్చి ఉంటాడని సూచించారు. నాణేలను తన పూర్వీకుల శైలిలో అజిలిసెస్ కొనసాగించినా కొన్ని స్వంత నాణేలను కూడా విడుదల చేశారు. వాటిలో ఒకదానిపై భారతీయ దేవత అయిన అభిషేక లక్ష్మి ప్రతిమ ఉంది. రెండవ అజెస్ తర్వాత సకా రాజ్యం గోండోఫెర్నెస్ ఆధిపత్యంలోకి వెళ్లిపోయింది.

## పశ్చిమ సత్రపాలు

**సత్రపాల్ వ్యవస్థ :** అఖేమేనియా పర్షియన్ దండయాత్రలు దేశంలో సత్రపాల్ వ్యవస్థ కలిగిన ప్రభుత్వాన్ని ప్రవేశపెట్టిన పాలకుల్లో మొదటివారు. సత్రప లేదా క్షత్రప అన్నబిరుదు "రాజ్య పరిరక్షకుడు" అనే అర్థాన్ని ఇస్తుంది. ఈ తరహా ప్రభుత్వం సైథియన్ పాలనల సరికొత్త ఉత్సాహాన్ని సంతరించుకుంది. మహాక్షత్రప, సత్రపల సంయుక్త పాలనా వ్యవస్థే ఈ ప్రభుత్వ ప్రధాన లక్షణం. కుషాణుల ప్రాబల్యంలోనే ఈ ప్రభుత్వ వ్యవస్థ భారతదేశంలో బలంగా నాటుకుపోయింది. మౌలికంగా రెండు రకాల సత్రప వ్యవస్థలు మనకు బాగా తెలుసు. తొలి వ్యవస్థలో కేవలం ఇద్దరు వ్యక్తులు మాత్రమే ఉండేవారు. వారు క్షహరత జాతికి చెందిన భూమక, నహాపాన. రెండవ వ్యవస్థలో సత్రపాలు పెద్ద సంఖ్యలో ఉండేవారు. వీరంతా చాష్టన జాతికి చెందిన వారు.

**క్షహరతలు :** క్షహరత కుటుంబానికి చెందిన తొలి సత్రప భూమక. కుషానుల రాజ్యంలోని వాయవ్య భాగాన్ని పాలించే బాధ్యతను బహుశా భూమకకు అప్పగించి ఉండవచ్చు. భూమక వారసుడు నహాపాన. అతడు కేవలం రాగి, వెండి నాణేలను జారీ చేయడమేకాకుండా అనేక శాసనాలను కూడా వేయించాడు. వీటి ద్వారా మనం అతడి గురించి తెలుసుకోవచ్చు. అతని అల్లుడు, సైన్యాధిపతి అయిన ఉషావదాత జారీ చేసిన శాసనాలు నాసిక్ సమీపంలోని పాండులేనా, పూణే జిల్లాలోని జున్నర్, కార్లే వద్ద బయటపడ్డాయి. వాటి ప్రకారం మహారాష్ట్రలోని విశాల భాగానికి నహాపాన అధిపతిగా ఉండేవాడని తెలుస్తోంది. నాసిక్ శాసనం, నాసిక్ జిల్లాలో జోగల్ థేంబి వద్ద లభించిన నాణేల గౌరం ప్రకారం నహాపాన ప్రాబల్యాన్ని శాతవాహన పాలకుడు గౌతమీ పుత్ర శాతకర్ణి అణచివేశాడని తెలుస్తోంది. శాతకర్ణి క్షహరత రాజ్యంలోని

దక్షిణ ప్రాంతాలను తన రాజ్యంలో కలుపుకున్నాడు. నహాపాన మరణంతో క్షహరత పాలక కుటుంబం అదృశ్యమైనట్లు తెలుస్తోంది. కుషాన సామ్రాజ్యంలోని ఈ సత్రప ప్రాంతంలో క్షహరతల స్థానంలో కర్దమాకల జాతికి చెందిన సకా కుటుంబం అధికారం చేపట్టింది.

**కర్దమాకల వంశం :** కర్దమాకల జన్మస్థలం గురించి ఎలాంటి సమాచారం లేదు. అయితే చాష్టాన సింధ్ ప్రాంతాన్నికుషానుల సామంత రాజుగా పాలిస్తూ ఉండవచ్చు నహపాన మరణం తర్వాత కుషానులు చాష్టానను తన సామ్రాజ్యంలో వాయవ్య ప్రాంతానికి వైస్రాయ్‌గా నియమించారు. చేజారిపోయిన సత్రపాల ప్రాంతాలను తిరిగి స్వాధీనం చేసుకోవాలని సూచించారు. ఈ లక్ష్యంలో చాష్టానకు అతడి కుమారుడు జయదమన్ సహకరించి ఉండవచ్చు. చాష్టాన మనవడు రుద్రదమన్ కూడా వారికి జత కలిసి ఉంటాడు. తన తండ్రి కింద సత్రపగా వ్యవహరిస్తూ జయదమన్ మరణించాడు. అయితే రుద్రదమన్ చాష్టానతో కొంత కాలంపాటు సత్రపగా కొనసాగాడు. గ్రీకు, ఖరోష్ఠి, బ్రాహ్మి లిపులను తన నాణేలలో వాడిన తొలి కర్దమాక వంశీయుడు చాష్టాన. అతడి వారసుడు రుద్రదమన్. జునాగఢ్ రాతి శాసనం ప్రకారం రుద్రదమన్ మహాక్షత్రప బిరుదును గెలుచుకున్నాడు.

దక్కను ప్రభువైన శాతకర్ణిని రుద్రదమన్ రెండుసార్లు ఓడించాడని జునాగఢ్ శాసనం చెబుతుంది. కేవలం రక్తసంబంధం కారణంగానే శాతకర్ణిని క్షేమంగా వదిలివేశాడని స్పష్టంచేస్తుంది. అయితే ఓడిపోయిన రాజును గుర్తించే విషయంలో కొంత సందిగ్ధత నెలకొంది. రుద్రదమన్ మాల్వా, సౌరాష్ట్ర, గుజరాత్, ఉత్తర కొంకణ్, మహీష్మతి ప్రాంతాలను స్వాధీనం చేసుకున్నాడు. ఉజ్జయినీ రాజధానిగా గల రుద్రదమన్ గొప్ప పోరాట యోధుడే కాకుండా గొప్ప విద్యా పోషకుడు కూడా. సంస్కృత భాషపై అభిమానంతో ఆ భాషలోనే అతడు శాసనాలు వేయించాడు. అదే సమయంలో అతడి సమకాలికులైన సకా పాలకులు ప్రాకృత–సంస్కృత భాషల ఉమ్మడి లిపిలో శాసనాలు జారీ చేశారు. రుద్రదమన్ దయార్ద్ర హృదయం గల పాలకుడు. సుదర్శన కాలువ గట్టులను మరమ్మతు చేయించి దానిని పునరుద్ధరించాడు. అందుకు తన స్వంత ఖజానా నుండి నిధులను వెచ్చించాడు. ప్రజల నుండి అదనంగా పన్నులు వసూలు చేయలేదు. ఒకటవ రుద్రదమన్ వారసులుగా ఒకటవ దామఘ్సాద, ఒకటవ రుద్రసింహ, జీవదమన్, ఒకటవ రుద్రసేన, సంఘదమన్, దామాసేన వరుసగా పాలన సాగించారు. చివరి పాలకుడు మూడవ రుద్రసింహ క్రీ.శ.388 వరకు పాలించాడు. గుప్త రాచరికాధిపతి రెండవ చంద్రగుప్త అతడిని చంపివేశాడు.

**పార్థియన్లు :** ఈ వంశానికి చెందిన ప్రథమ పాలకుడు ఓనోనెస్. అతడు అరాకోసియా, సియస్తాన్‌లలో అధికారాన్ని చేజిక్కించుకున్నాడు. అయితే ఇండో–పార్థియన్ పాలకులలో గోండోఫెర్నెస్ గొప్పవాడు. సుప్రసిద్ధ తఖ్త్–ఎ–భాయ్ శాసనం ప్రకారం అతడి పాలనా కాలం క్రీ.శ.19–45. గోండోఫెర్నెస్ విశాలమైన భూభాగాన్ని స్వాధీనం చేసుకున్నాడు. ఎగువ కాబుల్ లోయలో చివరి గ్రీకు పాలకుడు హెర్మయూస్‌ను అతడు గద్దెదించాడు. అయితే భారతదేశంలో అతడు సకా పాలకులపై సాధించిన విజయం అత్యంత ముఖ్యమైనది. కొన్ని నాణేల ప్రకారం అతడు రెండవ అజెస్‌ను కొన్ని ప్రాంతాలలో అణచివేశాడని స్పష్టమవుతుంది.

అపోస్తలుడైన సెయింట్ థామస్‌ను గోండోఫెర్నెస్‌తో ముడిపెట్టే ప్రశస్తి "సెయింట్ థామస్ మహిమలు" అనే సిరియన్ గ్రంథంలో తొలిసారిగా కనిపిస్తుంది. తన అపోస్తలు

జీవితంలో థామస్ గోండోఫెర్నెస్ రాజ్యాన్ని పర్యటించి ఉండవచ్చు. అక్కడి నుండి అతడు దక్షిణ భారతదేశానికి ప్రయాణించాడు. గోండోఫెర్నెస్ మరణం తర్వాత పార్థియన్ సామ్రాజ్యం చిన్నచిన్న రాజ్యాలుగా చీలిపోయింది. ఈ దుర్భర పరిస్థితిని అవకాశంగా మలచుకున్న కుషానులు ఆఫ్ఘనిస్తాన్, పంజాబ్ సింధ్‌లలో పార్థియన్ పాలనకు చరమగీతం పాడారు.

**కుషాణులు**

**పుట్టుపూర్వోత్తరాలు :** యూచీ ప్రజల కుటుంబం లేదా తెగ పేరును కుషాణ అనే పదం ప్రాథమికంగా సూచిస్తుంది. క్రీ.పూ. 1వ శతాబ్దం తొలినాళ్లలో యూచీలు తమ సంచార జీవితానికి స్వస్తి పలికి తమనుతాము ఐదు బృందాలు లేదా రాజ్యాలుగా విభజించుకున్నారు. ఈ విభజన తర్వాత సుమారు వందేళ్లకు ఒకటవ కుజుల కాడ్‌ఫైసెస్ (ఐదు రాజ్యాలలో ఒక రాజ్యం పాలకుడు) మిగతా నాలుగు రాజ్యాలపై దాడి చేసి వాటిని లొంగదీసుకున్నాడు. ఫలితంగా విశాలమైన సామ్రాజ్యం ఏర్పాటైంది.

ఇటీవలి తవ్వకాలలో ఒక బాక్ట్రియా శాసనం లభించడంతో కుషాణుల గురించిన అధ్యయనాలలో భారీ మార్పు వచ్చే అవకాశం ఉంది. (గ్రీకు లిపిలో రచించబడే మధ్య ఇరాన్ భాష అయిన బాక్ట్రియన్‌ను ఒకటవ కనిష్క కాలం నుండి కుషాణ నాణేలపై వరుసగా వాడారు.) ఆఫ్ఘనిస్తాన్‌లోని రబాతక్‌లో బయల్పడిన ఈ తెల్లటి సున్నపురాయి శాసనాన్ని కనిష్క తన తొలి పాలనా సంవత్సరంలో జారీ చేశాడు. దాదాపు 23 వ్యాఖ్యలు కలిగిన ఈ ఫలకం కనిష్క జారీ చేసిన శాసనాలలో మొదటిది. ఈ శాసనం కుషాణ సామ్రాజ్య వైశాల్యం గురించి వివరిస్తుంది. తూర్పున భాగల్‌పూర్ సమీపంలోని చంపా వరకు సామ్రాజ్యం విస్తరించి ఉందని చెబుతుంది. చంపా, పాటలీపుత్ర, సాకేత ప్రాంతాలను కుషాణ సామ్రాజ్యంలో కలుపుకోవడాన్ని ఒక కుషాణ శాసనం తొలిసారిగా నమోదు చేసింది. వారణాసికి తూర్పున కుషాణుల ప్రాబల్యం గణనీయంగా పెరిగినా అది స్వల్పకాలం మాత్రమే నిలవగలిగింది. ఒకటవ కనిష్క వారసుల్లో ఒక్కరు కూడా మధురకు తూర్పున ఉన్న ప్రాంతాలపై ప్రత్యక్ష అధికారాన్ని చెలాయించలేదు.

ఈ పొడువాటి, బహుశా అత్యంత ప్రధానమైన కుషాణ శాసనం (ఇప్పటి వరకు తెలిసిన) కుషాణ రాజకీయ చరిత్రలో ఉన్న ప్రధాన వివాదాలు,అంశాలను పరిష్కరిస్తుంది. కుజుల కాడ్‌ఫైసెస్ వంశానికి కనిష్క ప్రత్యక్ష వారసుడని అది నిర్ధారిస్తుంది. కుషాణు పాలకులు మినహా కాడ్‌ఫైసెస్ పాలకవంశం అంటూ ఏదీ లేదు. వారసత్వ క్రమంగా కుషాణ పాలకులలో కనిష్క నాల్గవ వాడు అని కూడా సూచిస్తుంది. స్వయంగా కనిష్కుడే సకా శకాన్ని ప్రారంభించాడు లేదా ప్రవేశపెట్టాడు. అయితే క్రీ.శ. అది ఏ సంవత్సరమో ఇప్పటికీ నిర్ధారణ కాలేదు.

ప్రస్తుతం పరిశీలనలో ఉన్న ఈ శాసనం కుషాణ పాలకుల మత విధానం, వైఖరులపై విలువైన సమాచార గనిగా ఉంది. పాలకుడిని కొలిచే కుషాణుల సాంప్రదాయం (జీవిత కాలంలో, మరణానంతరం కూడా) ఇక్కడ స్పష్టంగా వర్ణించబడి ఉంది. దేవకులాలలో కుషాణ పాలకుల దివ్య ప్రతిమలు ఉన్నాయి. రబాతక్ శాసనం కుషాన సామ్రాజ్యంలో ఐదవ దేవకుల నిర్మాణం గురించి సమాచారం అందిస్తుంది. మిగతా నాలుగు దేవకులాలు మత్ (మధుర సమీపంలో), సుర్‌కోటల (ఆఫ్ఘనిస్తాన్), అయిర్తం (తజకిస్తాన్), దాల్వర్దిజిన్ –తెపేలలో ఉన్నాయి.

**ఒకటవ కాడ్‌ఫైసెస్ :** నాణేల ఆధారం ప్రకారం కుజుల కాడ్‌ఫైసెస్ (క్రీ.శ. 15–64) కాబుల్ లోయ చివరి గ్రీకు రాకుమారుడు హెర్మాయుస్ సహచరుడు, తర్వాత వారసుడయ్యాడు. ఒకటవ కాడ్‌ఫైసెస్ కాబుల్, కందహార్ ప్రాంతాలలో పార్థియన్ పాలనను అంతం చేశాడు. గాంధార, తక్షశిలలనుతన రాజ్యంలో కలుపుకున్నాడు. అతడి కుమారుడు విమా కాడ్‌ఫైసెస్ ఈ దండయాత్రలలో సహకరించి ఉంటాడు. ఒకటవ కాడ్‌ఫైసెస్ ఎలాంటి బంగారు నాణేలను ముద్రించలేదు. కేవలం రాగి నాణేలను మాత్రమే జారీ చేశాడు. అతడి నాణేలలో రోమన్ ప్రభావం ఖచ్చితంగా కనిపిస్తుంది. అగస్టస్ నాణేలను అతడు నేరుగా అనుకరించాడు. అలాగే టైబేరియస్, క్లాడియస్ నాణేల ప్రభావం కూడా కనిపిస్తుంది. కుజుల బహుశా ఒక బౌద్ధుడు లేదా శైవుడు అయి ఉంటాడు.

**రెండవ కాడ్‌ఫైసెస్ :** విమా కాడ్‌ఫైసెస్ (క్రీ.శ. 64–78) తన తండ్రి వారసత్వాన్ని దాదాపు పరిపక్వ వయస్సులో స్వీకరించాడు. తండ్రితో పోలిస్తే స్వల్ప కాలమేపాలించిన విమా కుషాణ ప్రాబల్యాన్ని భారత లోపలి భాగాలలో విస్తరించడానికే ఎక్కువ సమయం కేటాయించాడు. అతడి సామ్రాజ్యానికి తక్షశిల, పంజాబ్‌లే కాకుండా బీహార్‌లోని చంపా వరకువిస్తరించి ఉన్న గంగా లోయ అంతా దఖలు పడింది. పాశుపత అనే భారతీయ దైవాన్ని ఆమోదించిన తొలి విదేశీపాలకుల్లో విమా ఒకడు. అతడి నాణేలన్నీ (బంగారు లేదా రాగి) శైవ ధర్మంతో అతడికి ఉన్న సాన్నిహిత్యాన్ని ప్రతిబింబిస్తాయి. విమా జారీ చేసిన బంగారు, రాగి నాణేలు పెద్ద సంఖ్యలో లభించడాన్ని బట్టి కుషాణ సామ్రాజ్య సంపన్న స్థితిని ఊహించవచ్చు. అతడి హయాంలో పట్టు, సుగంధ ద్రవ్యాలు, విలువైన రాళ్లు, ఇతర ఉత్పత్తులలో వాణిజ్య లావాదేవీలు పెద్దఎత్తున జరిగాయి. భారతదేశం, చైనా, రోమను సామ్రాజ్యాల మధ్య వాణిజ్యం పతాకస్థాయిలో జరిగింది. భారతదేశంలోకి ప్రవహించిన రోమను బంగారు నాణేలు సామ్రాజ్యవాద కుషాణుల బంగారు నాణేల ముద్రణను ప్రభావితం చేశాయి.

**కనిష్క :** విమా కాడ్‌ఫైసెస్ వారసునిగా కనిష్కను సాధారణంగా పరిగణిస్తారు. అయితే ఆ ఇద్దరి మధ్య ఎలాంటి సంబంధం ఉండేదో ఖచ్చితంగా తెలియదు. క్రీ.శ. తొలి శతాబ్దంలో కనిష్క పాలించాడు. సకా శకాన్ని (క్రీ.శ. 78) ప్రారంభించాడు. శిలాశాసన ఆధారాలు అతడికి పంజాబ్, పశ్చిమోత్తర సరిహద్దు ప్రాంతం, బహావల్‌పూర్ ప్రాంతం (సింధ్‌కు ఉత్తరాన), చంపా వరకు విస్తరించి ఉన్న గంగాలోయ అంతటిపై ప్రాబల్యం ఉండేదని నిరూపిస్తాయి. మధుర వద్ద కనుగొన్న కనిష్క శాసనాలు, సాంచి పురావస్తు నిలయంలో శాసనం ప్రకారం అతడికి రాజ్‌పుతానా, మాల్వా, సౌరాష్ట్రలపై కూడా నియంత్రణ ఉండేది. సి–యూ–కీ, రాజతరంగిణి గ్రంథాల నుండి కాశ్మీర్ అతడి సామ్రాజ్యంలో అంతర్భాగంగా ఉండేదని స్పష్టమవుతుంది.

కనిష్క సామ్రాజ్యంలో ఆఫ్ఘనిస్తాన్, పొరుగున ఉన్న మధ్య ఆసియా భూభాగాలు కూడా ఉండేవని బోధపడుతోంది. హియున్ త్సాంగ్ ప్రకారం కనిష్క తన విశాల సామ్రాజ్యాన్ని పురుష పుర లేదా పెషావర్ రాజధాని నుండి పాలించాడు. కనిష్క పేరు సాధారణంగా బౌద్ధంతో

ముడిపడి ఉంది. తన పాలన ద్వితీయార్థంలో అతడు బౌద్ధ చర్చికి క్రియాశీలదాతగా మారాడు. బౌద్ధ చర్చి ప్రతిపాదించిన పరస్పర విరుద్ధమైన సిద్ధాంతాలతో విసిగిపోయిన కనిష్క పార్శ్వా సలహా మేరకు కాశ్మీర్‌లోని కుండలవన విహారాలో నాల్గవ బౌద్ధ మండలిని సమావేశపరిచాడు. బౌద్ధ మతంతో బాగా ముడిపడి ఉన్నప్పటికీ కనిష్క జొరాష్ట్రియన్, గ్రీకు, మైత్రేయ, భారతీయ దైవాలను కూడా కొలిచే ఉదారత్వం చూపాడు. సామ్రాజ్యంలోని వివిధ ప్రాంతాలలో వేర్వేరు దైవాలను పూజించడం బట్టి కనిష్క ఇతర మతాలపట్ల ఎనలేని సహనం చూపాడని బోధపడుతుంది. కళాసాహిత్యాల గొప్ప పోషకునిగా కనిష్క ఖ్యాతి గాంచాడు. అతడి హయాంలో సర్వోన్నతమైన గాంధార కళ సృష్టించబడింది. నాగార్జున, అశ్వఘోష, పార్శ్వా, వసుమిత్ర లాంటి గొప్ప బౌద్ధ రచయితలు కనిష్క ఆస్థానంలో వెలసిల్లారు. ఆయుర్వేద పితామహుడు చరకుడు కనిష్క ఆస్థాన వైద్యునిగా కొనసాగాడు. అసమాన ప్రతిభగల రాజకీయవేత్త మధుర కనిష్క మంత్రిగా వ్యవహరించాడు.

**కనిష్క వారసులు :** కనిష్క సమీప వారసుడు వసిష్క. అతడు స్వల్పకాలం మాత్రమే పాలించాడు. నసిష్క వారసుడు హువిష్క. కుషాణ చరిత్రలో అతడి పాలన మరో కాంతివంతమైన యుగం. శాసనాలు, నాణేల ప్రకారం తన తండ్రి నుండి వారసత్వంగా పొందిన విశాలమైన సామ్రాజ్యాన్ని అతడు ఖచ్చితంగా పరిరక్షించాడు. హువిష్క జారీ చేసిన నాణేలు చాలా ఉన్నాయి. కనిష్క నాణేలకు అవి ఎంతో భిన్నమైనవి. పాలకుని ఉన్నత చిత్రాలను ఆ నాణేలు కలిగి ఉన్నాయి. నాణేలకు రెండో వైపు వివిధ దైవాల ప్రతిమలు కనిపిస్తాయి. ఈ నాణేలను పరిగణనలోకి తీసుకుంటే హువిష్క బ్రాహ్మణత్వానికి లోబడి ఉండేవాడని బోధపడుతుంది.

కుషాణ వంశంలో చివరి గొప్ప పాలకుడు వసుదేవ. అతడిది పూర్తిగా స్వచ్ఛమైన భారతీయ నామం. అంటే విదేశీ పాలకవంశం క్రమంగా భారతీయతను సంతరించుకుంది. మధుర సమీపంలోనే అతడి శాసనాలు ఎక్కువగా బయటపడ్డాయి. దానిని బట్టి భారతదేశంలోని ఉత్తర, పశ్చిమోత్తర భాగాలపై అతడు నియంత్రణ కోల్పోయి ఉంటాడని ఊహించవచ్చు. అతడి నాణేలలో చాలా వరకు భారతీయ దైవమైన శివుడు నంది వాహనంతో కనిపిస్తాడు. సుమారు 25 ఏళ్లు పాలించిన తర్వాత వసుదేవుని రాజ్యం క్రీ.శ. 220 ప్రాంతంలో ముగిసింది. వసుదేవుని తర్వాత కుషాణుల చరిత్ర గందరగోళంగా ఉంది. విశాలమైన కుషాణ సామ్రాజ్య పతనం పర్షియన్ దండయాత్రలతో త్వరితగతిన సంభవించింది. ఉద్భవిస్తున్న సస్సానియన్ ప్రాబల్యం కుషాణ ప్రాబల్యాన్ని దెబ్బతీసిందనడం నిస్సందేహం. కుషాణుల పతనానికి మరో కారణం యోధేయ, కునింద, మాలవా లాంటి స్వతంత్ర గణరాజ్యాల (క్రీ.శ. 3వ శతాబ్దం తొలినాళ్లలో) ఆవిర్భావమని చెప్పవచ్చు. యమునా లోయలోని కొన్ని ప్రాంతాలలో కుషాణ పాలనను నాగాలు అంతమొందించారు. క్రీ.శ. నాల్గవ శతాబ్దం చివరలో కుషాణులు కిదార అనే కొత్త హోదాను పొందారు. ఈ కిదార కుషాణులు పంజాబ్, పశ్చిమోత్తర భారతదేశం,

కాశ్మీర్‌లను పాలించారు. అయితే పర్షియన్ సస్సానిదుల సామంతులుగా వారు పాలించాల్సి వచ్చింది.

**కుషాన పాలన ప్రాముఖ్యత :** కుషాణులు విశాలమైన సామ్రాజ్యాన్ని నిర్మించారు. విభిన్న జాతీయులను అది తనలో కలుపుకుంది. హెల్లెనిస్టు గ్రీకు, భారతీయుల సాంస్కృతిక ప్రభావానికి వారు లొంగిపోయారు. ఈ కలయిక వల్ల భారతదేశంలో గాంధార, మధుర కళా సిద్ధాంతశాలలు అభివృద్ధి చెందాయి. హెల్లెనిస్టు మారకద్రవ్య పద్ధతిని వారసత్వంగా స్వీకరించిన కుషాణ ముద్రణా వ్యవస్థ రోమను శైలిని ప్రారంభించి భారతీయ కళ, సాంప్రదాయాలతో ప్రభావితమైంది. కుషాణ నాణేలు గుప్తుల మారక రూపాన్నీ కాకుండా యోధేయ, చేది, గహడవల, తదితర భారతీయ పాలక వంశాల నాణేలను కూడా ప్రభావితం చేసింది. కుషాణ యుగం గొప్ప సాహిత్య యుగం కూడా. ఈ కాలంలో తీవ్రమైన మత కార్యకలాపాలు జరిగాయి. అలాగే బౌద్ధమతంలో మహాయాన వర్గం అభివృద్ధి చెందింది. శివ, కార్తికేయ, కృష్ణ పంథాలు ఆవిర్భవించాయి. కశ్యప మాతంగ (క్రీ.శ.61-67) చైనాలో బౌద్ధమతాన్ని ప్రవేశపెట్టాడు. బయటి ప్రపంచంతో ముఖ్యంగా రోమను చక్రవర్తులతో కుషాణులు వాణిజ్య సంబంధాలను పెంచుకున్నారు. పార్థియన్లతో తమకు ఉన్న శత్రుత్వం కారణంగా రోమను చక్రవర్తులు కుషాణుల వైపు ఎక్కువగా మొగ్గు చూపారు. రోమను నాణేలు పశ్చిమ భారతదేశంమంతా చెలామణి అయ్యాయి. వాటిని కుషాణ పాలకులే ప్రవేశపెట్టారు. కుషాణ సామ్రాజ్యంలోని పశ్చిమోత్తర భాగం శివార్లగుండా వెళ్లే పట్టు వ్యాపార మార్గం (చైనా-రోమ్‌ల మధ్య వాణిజ్య మార్గం)లో భారతీయ వ్యాపారులు ఏ మేరకు కార్యకలాపాలు నిర్వహించారో స్పష్టంగా తెలియదు. రోమను "జౌరీ" (నాణేలు లేదా మారకద్రవ్యం)ని కుషాన పాలకులు అనుకరించడం బహుశా వాణిజ్యాన్ని ప్రోత్సహించడానికే అయి ఉంటుంది.

7

# గుప్తులు - వారి వారసులు (క్రీ.శ. 300-750)

## సాధారణ అధ్యయనం

**ఉత్తర భారతదేశం :** గుప్త యుగంపై జరిగిన పరిశోధనను స్థూలంగా వీక్షిస్తే ఈ యుగంపై చరిత్రకారులు, పురావస్తు శాస్త్రవేత్తలకు ఉన్న తీవ్ర ఆసక్తి స్పష్టంగా బోధపడుతుంది. విభిన్నమైన పురావస్తు, సాహిత్య ఆధారాలు అందుబాటులో ఉన్న దృష్ట్యా ఈ పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. అనేక పురావస్తు, సాహిత్య ఆధారాలు ఉపఖండంలో నెలకొని ఉన్న తులనాత్మక రాజకీయ సుస్థిరత గురించి గొప్పగా చెబుతాయి. సృజనాత్మక సాహిత్య కార్యకలాపాలలో అమోఘమైన విజయాల గురించి కీర్తిస్తాయి. ఉత్తరభారత రాజకీయ ముఖచిత్రం సామ్రాజ్యవాద గుప్తుల ఆధిపత్యాన్ని ప్రతిబింబిస్తుంది. మరోవైపు సమకాలీన దక్కను వకాటకుల ఆవిర్భావాన్ని చవిచూసింది. గుప్తుల రాజకీయ చరిత్రలో కొత్త విషయం ఏమీ లేనప్పటికీ వకాటకుల చరిత్రను నేడు బాగా అర్థం చేసుకోవడానికి ఇటీవల కనుగొన్న అనేక శిలాశాసనాలు దోహదపడతాయి.

వకాటకుల వంశానికి చెందిన రెండువేర్వేరు పాలక కుటుంబాల గురించి క్షుణ్ణంగా తెలుసుకోవడానికి ఈ పురావస్తు, సాహిత్య ఆధారాలు సహాయపడతాయి. ఒక పాలక కుటుంబం మహారాష్ట్రలోని నాగ్‌పూర్ సమీపంలోని (రామ్‌టెక్) రామగిరి వద్ద రాజధాని కలిగి ఉండేది. మరో శాఖ అకోలా జిల్లాలోని బాస్సిమ్ సమీపంలోని వాత్సుల్మ నుండి పాలించింది. ఒకే పాలక వంశం నుండి రెండు వేర్వేరు శాఖలు క్రీ.శ.335లో ఉద్భవించాయి. ఈ పాలక వంశాన్ని వింధ్యాశక్తి స్థాపించాడు. ప్రధాన శాఖ పది మంది పాలకులను కలిగి ఉన్నట్లు కనబడుతోంది. వీరు శాతవాహన రాజ్యం పతనమైన తర్వాత (అంటే క్రీ.శ.మూడవ శతాబ్దం మధ్యభాగంలో) తమ ప్రాబల్యాన్ని చాటుకోవడం ప్రారంభించారు. వారి పాలన కనీసం క్రీ.శ.507 వరకు కొనసాగింది. వీరిలో చివరి పాలకుడు రెండవ పృథ్వీసేనుడు. బాస్సిమ్ శాఖకు ఆరుగురు పాలకులు ఉన్నారు. క్రీ.శ.335 నుండి 500 వరకు వారు తమ రాజ్యాన్ని పాలించారు. అంటే రెండు శాఖలు దాదాపు సమాంతరంగా పతనమయ్యాయి.

ఉత్తర భారతదేశం గుప్తుల నిరంతర పాలనను అనుభవించింది. అయితే క్రీ.శ.500 తర్వాత గుప్త సామ్రాజ్యం ప్రాబల్యం, వైభవం క్షీణించాయన్నది నిస్సందేహం. స్కంద గుప్తుని కాలంలో (క్రీ.శ.455–467) హుణుల వరుస దండయాత్రలతో గుప్త సామ్రాజ్యం తీవ్ర సమస్యను

ఎదుర్కొంది. స్కందగుప్తుడు హుణుల బెడదను విజయవంతంగా నివారించగలిగాడు. క్రీ.శ. ఐదవ శతాబ్దం చివరలో, ఆరవ శతాబ్దం తొలినాళ్లలో హుణులు మరోసారి ప్రత్యక్షమయ్యారు. వారికి తోరమన, అతడి కుమారుడు మిహిరకుల నాయకత్వం వహించారు. వారి సైనిక విజయాల గురించి పురావస్తు, సాహిత్య ఆధారాల నుండి ముందుగానే తెలుసు. తోరమన పాలనా కాలంపై గుజరాత్‌లోని సంజేలిలో బయటపడ్డ మూడు శిలాశాసనాలు కొత్త కాంతిని వెదజల్లుతాయి.

ఈ మూడు శాసనాలలో ఒకటి తోరమన దండయాత్ర గురించి, అతడు మాల్వా, గుజరాత్‌లపై సాధించిన నియంత్రణ గురించి చెబుతుంది, పశ్చిమ భారతదేశంలోని ఎక్కువ భూభాగంపై తోరమన పాలన సాగించాడని పేర్కొంటుంది. అయితే వ్యాపార, వాణిజ్య కార్యకలాపాల సజీవ స్వభావం గురించి, అలాగే మత సంస్థలకు వ్యాపారుల విరాళాలు, పోషణ గురించి ఉన్న సమాచారం అంత ప్రాముఖ్యత లేనిదికాదు. వాణిజ్య ఉత్పత్తుల స్థాయి అద్భుతమైనది. వాటి రవాణాపై వివిధ రకాల సుంకాలు విధించేవారు. సుంకాలను నగదు లేదా వస్తురూపంలో వసూలు చేసేవారు.

వ్యాపారులు చెక్కించిన శిలాఫలకాలలో వారి సూస్త్రాక్షరాలు ఉన్నాయి. కొందరు వ్యాపారుల పేరు చివరలో భట్ట, శర్మన్ అనే సంబోధికలు ఉన్నాయి. వీటిని సాధారణంగా బ్రాహ్మణ పేర్లుగా పరిగణిస్తారు. కనుక పురావస్తు ఆధారాల ప్రకారం వ్యాపార వాణిజ్య కార్యకలాపాలలో బ్రాహ్మణులు పాలుపంచుకున్నారని తెలుస్తోంది. జాతి వర్ణ నిర్మాణం ఎంత పటిష్టంగా ఉన్నప్పటికీ ఉత్పత్తుల మార్పిడి అంత ఆశ్చర్యాన్ని కల్గించదు.

ఈ శాసనంలో వాణగ్రామాల ప్రస్తావన ఉంది. దానిపై మనం దృష్టి సారించాల్సి ఉంటుంది. తోరమన శాసనం గుజరాత్‌లో ఆరవ శతాబ్దపు తొలి దశకంలో వాణగ్రామ సంఘటన చురుకుగా ఉండేదని సూచిస్తుంది. వాణగ్రామాలపై మన అవగాహనను ఈ శాసనం పెంచుతుంది. కథియావార్‌లో బయల్పడిన 529 క్రీ.శ. నాటి శాసనంలో వాణగ్రామాల గురించి విస్తృతమైన సమాచారం ఉంది.

తోరమన కుమారుడు, అతడి వారసుడైన మిహిరకులను గ్వాలియర్ ప్రశస్తి కీర్తిస్తుంది. అతడు సాధించిన సైనిక విజయాలను ప్రస్తావిస్తుంది. అయితే హుణుల సైనిక, రాజకీయ విజయాలు స్వల్పకాలంలోనే కరిగిపోయాయి. హుయాన్ త్సాంగ్ వ్యాఖ్యానాలు, బానాభట్టుని హర్షచరిత, కానౌజ్ పాలకుడు (మౌఖారి కుటుంబం) ఇసానవర్మన్ శాసనం హుణులు సాధించిన అనేక విజయాల గురించి ప్రస్తావిస్తాయి.

హుణుల సైనిక విజయం తాత్కాలికంగా మాత్రమే నిలిచింది. అయితే భారత రాజకీయ ముఖచిత్రంలో అవి కొంతకాలంపాటు కలకలం సృష్టించాయి. మరోవైపు క్రీ.శ. 500–550 మధ్య గుప్త సామ్రాజ్యం పతనం కావడానికి హుణుల దాడులే కారణం కాదని ఈ విషయం స్పష్టం చేస్తుంది. ఎందుకంటే హుణులే అనేక పాలకుల చేతిలో పరాభవం పాలయ్యారు. హుణులపై విజయం సాధించిన ఈ పాలకులు తొలుత గుప్త సామ్రాజ్యంలో సామంతులుగా ఉండేవారు. కాని ఆరవ శతాబ్దం ద్వితీయార్థంలో రాజకీయ ప్రాబల్యాన్ని

సంపాదించుకున్నారు. అంటే గుప్త సామ్రాజ్యం తన చివరి దశలో ఈ సామంతులవల్ల తీవ్ర సమస్యలను ఎదుర్కొంది. వీరు గుప్త చక్రవర్తుల ఆధిపత్యాన్ని నామమాత్రంగా కూడా గుర్తించలేదు. కనుక హూణులవల్లే గుప్త సామ్రాజ్యం పతనమైందని భావించడానికి ప్రత్యేక కారణం అంటూ ఏదీ లేదు.

క్రీ.శ. నాలుగు నుండి ఆరవ శతాబ్దాల వరకు రాజకీయ, సాంస్కృతిక రంగాలలో గొప్ప విజయాలు నమోదైనట్లు అనేక చారిత్రక రచనలు పేర్కొన్నాయి. సాధారణంగా ఈ కాలాన్ని "స్వర్ణయుగం" అని పరిగణిస్తారు. లేదా భారతీయ చరిత్రలో ప్రాచీన యుగం (classical age) గా కీర్తిస్తారు. ఈ కాలాన్ని స్వర్ణయుగంగా పేర్కొనడంపై మార్క్సిస్టు చరిత్రకారుల నుండి తీవ్రమైన విమర్శ వచ్చింది. జాతీయ భావాలను రేకెత్తించడానికే కొందరు జాతీయవాద చరిత్రకారులు ఇలాంటి వర్ణనలు ప్రవేశపెట్టారని వారు వాదిస్తారు. ముఖ్యంగా 20వ శతాబ్దపు తొలి మూడు దశకాలలో ఇలాంటి ప్రయత్నం జరిగిందని చెబుతారు. స్వర్ణయుగమని చెప్పబడుతున్న ఆ కాలంలో కూడా అనేక పీడిత వర్గాలు ఉండేవని గుర్తు చేశారు. ఆ కాలంలో బలవంతపు శ్రమను సాధనంగా చేసుకొని ప్రజలను ఆర్థిక రూపంలో దోపిడీ చేశారని, ప్రధానంగా రైతులు ఆ కోవకు సమాజంలోని ఉన్నత వర్గమే ఆస్వాదించిందని, సాధారణ ప్రజలకు అవి ఆమడదూరంలో ఉండేవని మార్క్సిస్టు చరిత్రకారుల అభిప్రాయం. కనుక భారతదేశ గత చరిత్రలో స్వర్ణయుగాన్ని వెదకాలని ప్రయత్నిస్తే నిరాశే ఎదురవుతుందని ఇలాంటి వాదన స్పష్టం చేస్తుంది. ఈ వాదన యొక్క హేతుబద్ధతను సందేహించలేము.

అయితే ఈ ప్రక్రియలో విషయాన్ని తెగేదాకా లాగారు. ఎందుకంటే ఈ కాలపు అనేక విజయాలను ఇటీవలి చరిత్రశాస్త్రంలో "మాయ"గా పరిగణిస్తారు. ఇక్కడ మనం ఒక్క విషయాన్ని అంగీకరించాలి. అదేమిటంటే రాజకీయ, సాంస్కృతిక రంగాలలో సాధించిన గొప్ప విజయాలను కేవలం పాలక లేదా ఉన్నత వర్గం ఒక్కటే ఆస్వాదించిన అలాంటి విజయాలను మాయ లేదా భ్రమగా కొట్టిపారేయ కూడదు. గుప్తుల కాలంలో కొన్ని సాంస్కృతిక లక్షణాలు పరిపూర్ణతను సాధించాయి. అంతకుముందు ఉన్న సకా-కుషాణ - శాతవాహన యుగపు సాంస్కృతిక నిర్మాణాలు లేదా సంఘటనలు గుప్తుల పాలనలో పరిపక్వతను సాధించాయి. ఇటీవలి చరిత్ర గ్రంథాలలో ఈ పరిణామాలను కీర్తించారు. అయితే గుప్తుల కాలంలో ఇలాంటి సాంస్కృతిక వికాసం సంభవించినా వాటిపై చరిత్రకారులు పెద్దగా ప్రతిస్పందించలేదు. కనక ఈ మూడు శతాబ్దాల విజయాలు, లోపాలను మరింత నిష్పక్షపాతంగా అధ్యయనం చేయాల్సి ఉంది. ఏకపక్షంగా ముద్రలు వేయడం మానాలి.

ఆసియా, ఐరోపా ఖండాలను స్థూలంగా పరిశీలిస్తే ఒకవైపు రోమను సామ్రాజ్యం పతనం వైపు పయనించింది. చైనా తాంగ్ కాలం నాటి కీర్తిని అప్పటికి దక్కించుకోలేదు. ఇరాన్‌లోని ససానిదులు కాలం లేదా ప్రాభవం తగ్గిపోయింది. అన్నింటి కంటే మించి హూణుల బెడద సుదీర్ఘకాలపు బలమైన చిత్రాన్ని ప్రదర్శించింది. భారతదేశంలో వ్యవస్థీకృత రాజకీయ సమాజం, ప్రజా జీవితం సజావుగా సాగింది. అందుకు తోడు కళ, నిర్మాణ, సాహిత్య రంగాలలో అద్భుతమైన కృతులు సృష్టించబడ్డాయి. అసమానతలు, అణచివేతలు, లోపాల మధ్య ఇలాంటి

విజయాలు దక్కాయి. గుప్తుల కాలాన్ని అంచనా వేయడంలో మనం ఈ విషయాన్ని పూర్తిగా పక్కన పెట్టలేము.

**దక్షిణ భారతదేశం:**

సాంప్రదాయవాద చరిత్ర రచనలో రాజ్యం, ఆర్థిక వ్యవస్థ స్వభావాన్ని చాలా వరకు రాజకీయ లేదా వంశ చరిత్రలో అంతర్భాగంగా వివరించారు. ఈ పోకడ రాజ్యాన్ని, ఆర్థిక వ్యవస్థను భిన్నమైన, సంబంధం లేని అంశాలుగా చిత్రీకరించడానికి ప్రయత్నించింది. సమాజం. ఆర్థిక వ్యవస్థలో వచ్చిన మార్పులను, సంబంధిత పర్యావసానాలను రాజకీయ ప్రక్రియలతో ముడిపెట్టేందుకు నామమాత్రపు ప్రయత్నం కూడా జరగలేదు. దేవాలయాలు, వాటి చరిత్రలను అధ్యయనం చేశారు. కాని వాటి వ్యవస్థాగత అభివృద్ధి. సమాజం, రాజకీయ వ్యవస్థ పరిణామక్రమంలో వాటి పాత్రను స్థూల ప్రక్రియలలో భాగంగా విశ్లేషించలేదు. ఇలాంటి సంబంధాలను గుర్తించి, స్వాగతించడంలో విఫలమయ్యారు. సంగం యుగం నుండి విజయనగర కాలం వరకు రాజకీయ వ్యవస్థను ఒకే రీతిలో వర్ణించడంలో ఈ వైఫల్యం స్పష్టంగా కనిపిస్తుంది. అయితే సాంప్రదాయవాద వైఖరి యొక్క సార్థకత పరిపూర్ణమైన రాజకీయ చరిత్ర క్రమాన్ని, సమాచార ఆధారాన్ని అందించడంలోనే ఉంది.

ఈ సమాచార ఆధారాన్ని ఉపయోగించుకొని సరికొత్త అంతర్గత కోణాలను తాజా అన్వయింపుల ద్వారా అందించడానికి నూతన వైఖరులు ప్రయత్నించాయి. అదే సమాచారాన్ని కొత్త పద్ధతులలో విశ్లేషించాయి. ఫలితంగా గతం యొక్క దృశ్యాలు, దృష్టికోణాలు గణనీయంగా మారిపోయాయి. ప్రాంతీయ రాజకీయ వ్యవస్థలు, సంస్కృతుల పరిణామ క్రమాన్ని అర్థం చేసుకోవడంలో ఉత్తమ దృక్పథాలు ప్రత్యక్షమయ్యాయి. ఈ నేపథ్యంలో రాజ్య అవతరణ, రాజ్య నిర్మాణ ప్రక్రియలను. అధ్యయనం చేయాల్సిన అవసరాన్ని గుర్తించారు. కొత్త దృక్పథాలను రెండు క్రమ దశల కింద అధ్యయనం చేయవచ్చు :1) సంగం అనంతర పరివర్తన (నాలుగు నుండి ఆరవ శతాబ్దాలలో ఒక నూతన సామాజిక ఆర్థిక స్వరూపం ఏర్పాటైంది.) 2) పల్లవ పాండ్య రాచరికాల కాలం. సంగం అనంతర పరివర్తన దశలో తమిళ ప్రాంతం అనిశ్చిత పరిస్థితిలో ఉండేది. సంగం లేదా తొలి చారిత్రక కాలంలో తీవ్రమైన భౌతికవాద సంస్కృతి, సామాజిక- అర్థిక సాంస్కృతిక స్వరూపాల హెచ్చింపు ప్రబలంగా ఉండేది. నదీ లోయల్లోని మూడు తెగ ప్రాంతాల ఆధిపత్యంలోని తినాయ్ లేదా పరిసర స్వరూపాల ప్రత్యేకమైన సిద్ధాంతంలో పై పరివర్తన ప్రతిబింబిస్తుంది. ఒక నూతన సామాజిక ఆర్థిక స్వరూపంవైపు పరివర్తన వల్ల రైతాంగ వ్యవసాయానికి ఆధిపత్యం లభించింది. పల్లవ-పాండ్య రాచరికాలు ఆవిర్భవించడానికి చాలా కాలం క్రితమే ఈ పరిణామం సంభవించింది. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే ఆంధ్ర, దక్కను ప్రాంతాలలో ఇదే కాలంలో బ్రాహ్మణవాద సిద్ధాంతం, బ్రాహ్మదేయ లాంటి వ్యవస్థాగత స్వరూపాలు, పౌరాణిక మతానికి చెందిన ఆలయం ఆధారంగా చిన్న చిన్న వారసత్వ రాజకీయ వ్యవస్థలు ఆవిర్భవించాయి. ఇలాంటి వాతావరణంలోనే పల్లవులు తమ రాజకీయ ప్రస్థానాన్ని మొదలుపెట్టారు.

సాంప్రదాయవాద చరిత్రలో సంగం- అనంతర కాలాన్ని చీకటి యుగంగానూ, అంతరాల కాలంగానూ చిత్రీకరించారు. కాలభ్రాలు అనే దుష్ట పాలకుల తెగ సాంప్రదాయ

వాద తమిళ సమాజాన్ని, రాజకీయ వ్యవస్థను ధ్వంసం చేయడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. సాంప్రదాయ పంథాలో "చీకటి యుగం" అనే భావన తరచూ వినిపిస్తూ ఉంటుంది. చీకటి యుగానికి ముందు, ఆ తర్వాత ఉన్న కాలాలను తమిళ చరిత్రలో శ్రేష్ఠమైనవిగా పరిగణిస్తారు. వర్ణ, వైదిక, పౌరాణిక ఆరాధన లాంటి బ్రాహ్మణిక సామాజిక-మత సంస్థలు పునరుజ్జీవం కావడంతో చీకటి యుగం అంతరించిందని కూడా భావిస్తారు. అంటే ఇలాంటి స్వరూపాలు సంగం యుగంలో కూడా బాగా స్థిరపడి ఉండేవనే అర్థాన్ని తీస్తారు.

కొత్త దృక్పథాలు ఈ కాలాన్ని కొండ, అడవి ప్రాంత ప్రజలు, మైదాన ప్రాంత ప్రజలు (రైతులు) మధ్య సంఘర్షణ కాలంగా పరిగణిస్తారు. ఇలాంటి పర్యావరణవాద వైఖరి (తొలి చారిత్రక, తొలి మధ్యయుగ కాలాల అధ్యయనంలో) తొలి కాలంలో ఆర్థిక సంఘటనం యొక్క స్వభావం అసమానంగా ఉండేదని నిర్ధారిస్తుంది. అందుకు నదీ లోయల్లోని రైతాంగ సంఘటనాన్ని సాక్ష్యంగా చూపుతుంది. క్రీ.శ ఏడవ శతాబ్దం నాటికి రైతాంగం విస్తరించి, ప్రాబల్యం సంపాదించుకుంది. మైదాన ప్రాంతాలలోనే కాకుండా (మరుదం) ఇతర వాతావరణ మండళ్లలో కూడా వ్యవసాయం విస్తరించడంతో రైతాంగ సమాజాల సరికొత్త వ్యవసాయదార సంఘటనానికి పునాదులు పడ్డాయి.

పరివర్తన కాలాన్ని సంక్షోభ కాలంగా కూడా పరిగణిస్తారు. సముద్ర మార్గాన వాణిజ్య కార్యకలాపాలు క్షీణించడంతో ఈ సంక్షోభం తలెత్తింది. సంగం యుగంలోని తొలి తెగ రాజకీయ వ్యవస్థలకు సముద్ర వ్యాపారం ప్రధాన ఆదాయ వనరుగా ఉండేది. వాణిజ్యం దెబ్బతినడంతో పట్టణ కేంద్రాలు కూడా తదుపరి కాలంలో నశించిపోయాయి. అందుకే ఈ కాలంలో స్పష్టమైన రాజకీయ, ఆర్థిక సమీకరణలు లోపించాయి. బహుశా తక్కువ శ్రేణి తెగ దొరల మధ్య ప్రయోజనాల సంఘర్షణ జరిగి ఉంటుంది. ఆర్థికపరమైన పరపతి, రాజకీయ అధికారం కోసం ఈ దొరలు కృషి చేశారు. అలాగే వివిధ మత వర్గాల మధ్య (బ్రాహ్మణిక, బౌద్ధ, జైన) ఉన్నతవర్గ పోషణ, మద్దతు కోసం తీవ్ర పోటీ నెలకొంది.

క్రీ.శ. ఆరవ శతాబ్దం నుండి రాజకీయ, ఆర్థిక సమీకరణలు మళ్లీ తెరపైకి స్పష్టంగా ప్రత్యక్షమయ్యాయి. అపుడు తమిళనాడులోని ఉత్తర, దక్షిణ ప్రాంతాలలో పల్లవులు, పాండ్యుల నేతృత్వంలో కొత్త రాజ్య వ్యవస్థ ఆవిర్భవించింది. కంచీపురం, మదురైలు ఈ రాజ్యాలకు కేంద్రబిందువుగా ఎదిగాయి. ఈ రెండు పాలక కుటుంబాల ఆ విర్భావంతోనే రాజకీయ వ్యవస్థ, ఆర్థిక వ్యవస్థల అధ్యయనాలు మొదలు కావాలి. ఈ కాలపు చరిత్రపై అనేక ఉత్కృష్ట అధ్యయనాలు ఉన్నాయి కాని అవి రాజకీయ చరిత్ర, రాజకీయ వ్యవస్థపైనే ఎక్కువగా దృష్టి కేంద్రీకరించాయి. రాజకీయ వ్యవస్థ కేంద్రీకృతమై, అధికారస్వామ్యాన్ని కలిగి ఉండేదని నిర్ధారించాయి. బ్రాహ్మదేయ, ఆలయం లాంటి భూ కేటాయింపులు వ్యవస్థాగత అంశాలను తప్ప ఆర్థిక చరిత్రపై ఈ అధ్యయనాలు పెద్దగా దృష్టి సారించలేదు.

కొత్త దృకృథాలలో ఈ సంస్థలను వ్యవసాయ విస్తరణ సాధనాలుగా చక్కగా అర్థం చేసుకున్నారు. వ్యవసాయ సమాజాల మధ్య సంబంధాలను నెలకొల్పడంలో బ్రాహ్మదేయ, ఆలయాలు కీలక పాత్ర పోషించాయి. నైసర్గిక, పరిసర ప్రాంతాల నేపథ్యం నుండి చూస్తే పై సంస్థల పాత్ర అర్థమవుతుంది. పాత ధోరణులకు విరుద్ధంగా ఇటీవలి దృకృథాలు ఈ కాలాన్ని

నిరంతర వ్యవసాయ విస్తరణ, క్రమ మార్పు, పూర్వపు రైతాంగ ప్రాంతాల మధ్య కొత్త వ్యవస్థాగత స్వరూపాల ద్వారా సమగ్రత సాధ్యమైన కాలంగా గుర్తిస్తాయి. (సాంప్రదాయ పంథా ప్రకారం ఈ కాలంలో సరికొత్త రాజకీయ, ఆర్థిక నిర్మాణాలు క్రమం పాటించకుండా వెలిశాయి.)

సాంప్రదాయ ఆలోచన ప్రకారం పల్లవ రాజకీయ వ్యవస్థలో బ్రాహ్మణిక రాజ్యాలు గుప్త అనంతర కాలంలోని ఉత్తర భారత రాజ్యాల నమూనాలో ఏర్పడాయి. ఉత్తర భారత సంస్కృత అంశాలను పుణికిపుచ్చుకున్నాయి. తమిళ ప్రాంతానికి కొత్తవారు కావడంతో పల్లవులను సృజనాత్మక పాలకులుగా కీర్తించారు. తమిళ ప్రాంతంలో ఉత్తర భారత అంశాలను ప్రవేశపెట్టిన వారిగా పల్లవులను కొనియాడారు. ఈ అంశాలనే దక్షిణ ప్రాంతంలో (తమిళ) పాండ్యులు ఆమోదించారని విశ్వసిస్తారు.

అయితే ఇటీవలి చరిత్ర శాస్త్రం ఒక కొత్త చిత్రాన్ని ముందుకు తెచ్చింది. దక్షిణ భారతంలో ముఖ్యంగా తమిళనాడులో ఉత్తర భారత రాచరిక లక్షణాలు గల రాజకీయ వ్యవస్థ క్రమంగా అభివృద్ధి చెందిందని, విభిన్న పరిస్థితులకు ఈ లక్షణాలును వేర్వేరుగా ఆమోదించారని, వ్యవసాయదార జీవన నేపథ్యంలో ప్రత్యేకంగా స్థిరమైన రైతాంగ ప్రాంతాలలో రాజ్యాలు వెలిశాయని సూత్రీకరిస్తుంది. క్రీ.శ. తొమ్మిదవ శతాబ్దం నాటికి ఇలాంటి వ్యవస్థను స్థాపించడంలో పల్లవులు సఫలమయ్యారు. సంస్కృత, తమిళ భాషలలో వారు వేయించిన రాగి ఫలకాలు, వారి పౌరాణిక ఆలయాలలో స్పష్టమైనట్లు పల్లవులు నిస్సందేహంగా సమాజాన్ని, ఆర్థిక వ్యవస్థను ప్రక్షాళన చేసే ప్రక్రియను మొదలుపెట్టారు. అందుకు బ్రాహ్మణులు (బ్రాహ్మదేయ), ఆలయాలకు భూదానాలు ఇచ్చే వ్యవస్థను సాధనంగా ఎంచుకున్నారు. కనక ప్రత్యేకమైన ద్రవిడ నిర్మాణశైలి ఆవిర్భవించడం చాలా ప్రాధాన్యత కలిగిన అంశం. పల్లవుల ఏకశిల, బహుళ అంతస్తు ఆలయాలలో శాశ్వతమైన సామగ్రి (రాయి)ని వాడడం ప్రత్యేక లక్షణం. ఈ నిర్మాణాల ఆధారంగానే వైష్ణవ, శైవ లాంటి పౌరాణిక మతాలు తమ ఆధిపత్యాన్ని చాటు కున్నాయి. పల్లవుల తమ పౌరాణిక సిద్ధాంతం (అంటే పాలకుల దైవత్వ సిద్ధాంతం) ఆధారంగానే ఆలయాల ద్వారా తమ ఉన్నత స్థాయిని ప్రజలకు ప్రదర్శించారు.

**భూస్వామ్య వ్యవస్థ:**

భారతీయ భూస్వామ్య వ్యవస్థ ఎందుకు అభివృద్ధి చెందింది, ఎప్పుడు అభివృద్ధి చెందింది? ఈ అంశాలపై విద్వాంసులకు విభిన్న అభిప్రాయాలు ఉన్నాయి. కనక మనం ప్రధాన సిద్ధాంతాలను గుర్తించడానికే పరిమితం అవుదాము. తొలి దశలో రాజకీయ భూస్వామ్య వ్యవస్థ మూలాలను రాజ్యం యొక్క వికేంద్రీకరణ నిర్మాణంలో అన్వేషించారు. ఈ విషయంలో ఆది భూస్వామ్య దశను గుప్తుల పూర్వ కాలంలో నిర్ధారించారు. భూస్వామ్య ఆర్థిక వ్యవస్థ పుట్టుపూర్వోత్తరాలు పరిపాలనా హక్కులు గల భూదానాల సాంప్రదాయం అభివృద్ధి చెందడంలో ఉన్నాయి. ఈ హక్కులు రాజ్యం ఆధిపత్యాన్ని నీరుగార్చాయి.

రెండవ సిద్ధాంతం ప్రకారం సామాజిక సంక్షోభం రూపంలో భూస్వామ్య వ్యవస్థ అవతరించింది. ఈ సామాజిక సంక్షోభం గత సామాజిక స్వరూపాన్ని అంతమొందించిందని భావిస్తారు. కొన్ని అంతర్గత వైరుధ్యాలు నిరంతర సామాజిక ఘర్షణలకు దారి తీశాయని

విశ్వసిస్తారు. ఈ ఘర్షణలను రామాయణ, మహాభారతాలు, పురాణ గాథలలో హింసాత్మకమైన రీతిలో వర్ణించారు. కలియుగంలో సామాజిక వ్యవస్థ కుప్పకూలిందని (గుప్తుల పూర్వ కాలంలో) ఫలితంగా రాజ్యాలే స్వయంగా భూదానాలు చేసే సాంప్రదాయాన్ని ప్రారంభించాయని చెబుతారు. అప్పటికే రాజ్య ప్రజల నుండి పన్ను లేదా భూమిశిస్తు వసూలు చేసే సామర్థ్యాన్ని రాజ్యాలు కోల్పోయాయని భావిస్తారు. ఈ భావన మౌలికంగా సరికొత్త భూస్వామ్య, సామాజిక స్వరూపం మూలాలను రాజ్య అధికార సంక్షోభంలో వెదుకుతుంది. సామాజిక ఘర్షణల వల్లే ఇలాంటి సంక్షోభం ఏర్పడిందని సూత్రీకరిస్తుంది. రాజ్య అధికారం సంక్షోభం నుండి ఉద్భవించిన "సామాజిక సంక్షోభాన్ని" కొత్త సామాజిక స్వరూపం ఆవిర్భావం గురించి వివరించడానికి ఉపయోగించారు. అయితే సమాంతరంగా వెలువడిన మరో సిద్ధాంతానికి ఇది నిర్మాణపరంగా పూర్తి భిన్నంగా ఉంది. ఈ సిద్ధాంతం ప్రకారం పట్టణాల మార్కెట్ వ్యవస్థ జీవనాధార వ్యవసాయ ఆర్థిక వ్యవస్థగా కుదించుకు పోయింది. క్రీ.శ. మూడవ శతాబ్దం నుండి పట్టణాలు క్షీణించడం మొదలుపెట్టాయి. ప్రజలు ఈ పట్టణాలను ఉమ్మడిగా ఖాళీ చేసి గ్రామాలకు వలసపోయారు. ఈ క్రమంలోనే భూస్వామ్య వ్యవస్థకు బీజం పడిందని ఈ సిద్ధాంతం ప్రతిపాదిస్తుంది.

స్థానిక, ప్రాంతీయ రాజ్యాల అవతరణకు ఈ కాలం ఎంతో కీలకమైనదని ఇటీవలి రచనలు స్పష్టం చేస్తున్నాయి. సాంప్రదాయ పాలక వంశాల క్రమాను పద్ధతికి భిన్నంగా ఈ రచనలు వెలువడ్డాయి. తొలి పట్టణ కేంద్రాల పతనం నేపథ్యంలోనే తొలి మధ్యయుగ కాలం ఆవిర్భవించిందని పేర్కొన్న ఒక రచన ఈ కాలం కొత్త రాజ్యాల ఆవిర్భావానికి కీలకమని చెప్పడంలో విఫలం కాలేదు. గుప్తుల సామ్రాజ్యాన్ని పక్కన పెడితే ఈ కాలంలో దేశవ్యాప్తంగా 69 రాజ్యాలను మనం గణించవచ్చు. ఇందులో 48 రాజ్యాలు మహారాష్ట్ర, తూర్పు మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా, బెంగాల్‌లలో ఉన్నాయి. ఈ రాజ్యాలు అవతరించిన ప్రాంతం ఒక విధంగా కొద్దిపాటి తేడాలతో నిరంతర ప్రాదేశిక మండలిని తలపిస్తుంది. ఈ మండలిలో చాలా భాగం వింధ్యా ప్రాంతంలోని అటవీ పీఠభూమిని కలిగి ఉంది.

## గుప్తులు

**ఆధారాలు :** సామ్రాజ్యవాద గుప్తుల కాలానికి సంబంధించిన 42 శాసనాలు బయటపడ్డాయి. వాటిలో 27 శాసనాలు రాతిలో చెక్కబడ్డాయి. ఈ రాతి శాసనాలలో 22 శాసనాలు వ్యక్తిగత ఆస్తులకు సంబంధించినవి కాగా ఒకటి అధికార కేటాయింపు, మిగతా నాలుగు ప్రశస్తిలు (రెండు సముద్రగుప్తుని ప్రశస్తిలు, రెండు స్కందగుప్తుని ప్రశస్తిలు). మిగతా 15 శాసనాలలో ఒకటి ఇనుప దండం. అది రెండవ చంద్రగుప్తుని ప్రశస్తి. మిగతావి రాగి ఫలకాలు. ఇందులో మూడు రాచరిక భూదానాలను నమోదు చేశాయి. పది ఫలకాలు రాజ్యం బ్రాహ్మణులు, దేవాలయాలకు ఆదాయ వనరులు కల్పించడానికి అమ్మిన భూములను నమోదు చేశాయి. ఒక రాగి ఫలకం వ్యక్తిగత భూదానానికి సంబంధించినది.

ఈ శాసనాలు గుప్త కాలం నాటి రాజకీయ చరిత్ర, మత విధానం, సామాజిక, ఆర్థిక పరిస్థితులు గురించి విలువైన సమాచారాన్ని అందిస్తాయి. అవి లభించిన ప్రదేశాలను బట్టి గుప్త పాలకులకు ఆధిపత్యం ఉన్న ప్రాంతాన్ని నిర్ధారించవచ్చు. ప్రశస్తిలు, తామ్ర శాసనాలు రాజుల వంశక్రమంపై సమాచారాన్ని అందిస్తాయి.

వర్మన్ వంశపుశాసనాల ప్రకారం రెండవ చంద్రగుప్తు ఒకటవ కుమార గుప్త పాలనా కాలంలో వర్మన్ రాజుల స్థానిక వంశీయులు మండసోర్ పొరుగు ప్రాంతంలో స్వతంత్రంగా వ్యవహరిస్తూ మాల్వా భూభాగాన్ని చాలా వరకు పాలించారు. గుప్తుల ఆధిపత్యాన్ని గుర్తించలేదు. ఆ ప్రాంతాన్ని గుప్తులు తిరిగి స్వాధీనం చేసుకున్న తేదిని కూడా ఆ శాసనాలు వెల్లడిస్తాయి. ముఖ్యంగా ఒకటవ కుమారగుప్త వేయించిన రాతిశాసనం ఈ విషయంలో నిర్దిష్టమైన సమాచారాన్ని అందిస్తుంది. తోరమన, మిహిరకుల శాసనాలు కూడా గుప్తుల పతనం గురించి వివరాలు అందిస్తాయి.

నాణేల ఆధారం గుప్తుల చరిత్రను పునఃనిర్మించడంలో అనేక విధాలుగా మనకు సహకరిస్తాయి. నాణేలు వారి పాలనలో జరిగిన ముఖ్య సంఘటనలను గురించి సమాచారం అందిస్తాయి. ఒకటవ చంద్రగుప్త జారీ చేసిన కుమారదేవి నాణేలు కొన్ని అసాధారణమైన రాజకీయ పరిణామాలను సూచిస్తాయి. పాలకుని మత భావాలను తెలుసుకోవడంలో సహకరిస్తాయి. అలాగే అతడి ఆస్థానంలో నెలకొని ఉండిన సాధారణ వాతావరణాన్ని అర్థం చేసుకోవడంలో ఉపయోగపడతాయి. సముద్రగుప్త జారీ చేసిన నాణేలు అతడి పాలనలో అసాధారణ సైనిక కార్యకలాపాలు చోటు చేసుకున్నాయన్న భావనను కల్గిస్తాయి. రెండవ చంద్రగుప్తుడు జారీ చేసిన నాణేలు గుప్త ఆస్థానంలో వాతావరణం మరింత పరిపూర్ణమైనట్లు చెబుతాయి. నాణెం శైలి, ముద్రణ కొన్నిసార్లు రాజకీయ పరిస్థితులపై ఒక ఆలోచనకు రావడానికి సహకరిస్తాయి. ఉదాహరణకు ఒకటవ కుమారగుప్త వారసులు జారీ చేసిన నాణేలు కళాత్మక ఉత్పత్తి ఉన్నత ప్రమాణాలలో క్రమంగా వచ్చిన క్షీణతను బహిర్గతం చేస్తాయి. సామ్రాజ్య ఆర్థిక పరిస్థితులలో సాధారణ తిరోగమనాన్ని సూచించడమే కాకుండా ఎలాంటి ఆధారాలు లేని పాలకునికి ఒక కాలాన్ని నిర్ధారించడంలో ఈ నాణేలు తోడ్పడతాయి.

కమండకుని "నీతిసార" (ఒకటవ చంద్రగుప్తుని కాలం నాటిది) కౌటిల్యుని "అర్థశాస్త్ర"కు గుప్త పాలకుల జవాబు లాంటిది గుప్తుల రాజకీయ వ్యవస్థ, పరిపాలనా యంత్రాంగం గురించి "నీతిసార" స్పష్టమైన వివరణ అందిస్తుంది. నారదస్మృతి, బృహస్పతి స్మృతి (నాల్గవ శతాబ్దం) రెండూ గుప్త చక్రవర్తులను న్యాయపరిపాలనలో తీవ్రంగా ప్రభావితం చేశాయి. అభిజ్ఞాన శాకుంతలం, మేఘదూతం, రఘువంశం, మాలవికాగ్నిమిత్రం, ఋతుసంహార, కుమార సంభవ లాంటి కాళిదాసుని రచనలు గుప్తుల ప్రభుత్వం, సమాజం, మతం గురించి విశ్వసించదగ్గ సమాచారం అందిస్తాయి. విశాఖ దత్తుడు రచించిన దేవి చంద్రగుప్తలో అనేక సంఘటనల వివరణ ఉంది. ముఖ్యంగా బాసన అనే సకా పాలకుని చేతిలో రామగుప్తుని ఓటమి, సకా పాలకుని హత్య, అలాగే రెండవ చంద్రగుప్తుని చేతిలో రామగుప్తుని హత్య, అతడి పట్టాభిషేకం, ధృవదేవి (రామగుప్తునివిధవ)తో అతడి వివాహం తదితర సంఘటనలు ఆ గ్రంథంలో ఉల్లేఖించబడ్డాయి. అయితే దురదృష్టవశాత్తు ఆ గ్రంథం కేవలం ఖండికలుగానే అందుబాటులో ఉంది. సూద్రకుని మృచ్ఛకటిక మౌలికంగా చారుదత్త (సాత్విక బ్రాహ్మణుడు), వసంతసేన (రాజ్యనర్తకి)ల ప్రణయగాథ. అయితే ఆ కాలపు అస్థిర రాజకీయ పరిస్థితులను కూడా అది వివరిస్తుంది.

**సామ్రాజ్యవాద గుప్తులు :**

శ్రీగుప్త, అతడి కుమారుడు ఘటోత్కచ గుప్తులు అనామకులు. కేవలం "మహారాజ" అనే బిరుదుతో వారు ఉండిపోయారు. ఈ గుప్త పాలకులు రాజ్యాన్ని కలిగి ఉన్నారో లేదా ఇతరులకు సామంతులుగా వ్యవహరించారో ఖచ్చితంగా తెలియదు. అయితే ఒకటవ చంద్రగుప్తుడు మాత్రం శక్తివంతమైన పాలకుడు. లిచ్ఛావీలు అతడితో సంబంధం పెట్టుకొని తమ కుమార్తె కుమారదేవిని అతడికిచ్చి వివాహం జరిపారు. అప్పటి వరకు అనామకులుగా ఉన్న గుప్తుల స్థాయి ఈ వివాహ సంబంధంతో అమాంతంగా పెరిగింది. చంద్రగుప్తుడు తన రాజ్యాన్ని అవధ్, మగధ, గంగా తీరాన అలహాబాద్ వరకు విస్తరించాడు. క్రీ.శ.320లో గుప్త యుగాన్ని స్థాపించిన వ్యక్తిగా చంద్రగుప్తుడిని పరిగణిస్తారు. తన పట్టాభిషేకాన్ని పురస్కరించుకొని అతడు ఈ కొత్త యుగాన్ని ప్రారంభించాడు.

ఒకటవ చంద్రగుప్తుని వారసునిగా అతడి కుమారుడు సముద్రగుప్త సింహాసనాన్ని అధిష్టించాడు. గుప్త వంశంలోని మరో అనామక రాకుమారుడు కచను అణచివేసిన తర్వాత అతడు పాలనా పగ్గాలు చేపట్టాడు. అలహాబాద్ ప్రశస్తి రచయిత హరిసేన తన యజమాని సముద్రగుప్త సాధించిన సైనిక విజయాల గురించి పూర్తి వివరాలు అందిస్తాడు. సామ్రాజ్యవాద గుప్తులలో సాధారణంగా సముద్రగుప్తును గొప్పవాడిగా కీర్తిస్తారు. అలహాబాద్ ప్రశస్తిలో సముద్రగుప్తుడు ఓడించిన రాజ్యాలు, పాలకులు, తెగల సుదీర్ఘ జాబితా ఉంది. ఈ జాబితాను నాలుగు భాగాలుగా విభజించవచ్చు. తొలి భాగంలో దక్షిణపథకు చెందిన 12 రాజ్యాలు పేర్లు, వాటి పాలకుల పేర్లు ఉన్నాయి. ఈ పాలకులను బందీలుగా తీసుకొని తర్వాత విడిచిపెట్టారు. వారికి మళ్లీ రాజ్యాలను కట్టబెట్టారు. రెండవ భాగంలో ఆర్యవర్తకు చెందిన ఎనిమిది మంది పాలకులపేర్లు ఉన్నాయి. వారిని భౌతికంగా అంతమొందించి వారి రాజ్యాలను స్వాధీనం చేసుకున్నారు. మూడవ భాగంలో అనేక అటవీ రాజ్యాల పాలకుల పేర్లు ఉన్నాయి. వారిని లొంగదీసుకున్నారు. అలాగే ఐదుగురు ప్రాత్యాంత పాలకుల పేర్లు ఉన్నాయి. వీరు సరిహద్దు రాజ్యాలకు అధిపతులు. మరో తొమ్మిది గిరిజన గణరాజ్యాల నాయకుల పేర్లు ఉన్నాయి. వీరు అన్ని రకాల పన్నులు చెల్లించారు. చక్రవర్తి ఆదేశాలను పాటించారు. క్రమం తప్పకుండా చక్రవర్తి ఎదుట హాజరై కానుకలు సమర్పించారు. నాల్గవ భాగంలో దైవపుత్ర షహానుషాలు(కుషానులు), సకా మురుండాలు, సింహళ, తదితర ద్వీపాల ప్రజల పేర్లు ఉన్నాయి. వీరు సముద్రగుప్తుని సేవలో స్వచ్ఛందంగా చేరారు.

సముద్రగుప్తుని సమీప వారసుడు అతడి కుమారుడు రామగుప్త. ఇతడు రెండవ చంద్రగుప్తుని అగ్రజుడు. దేవీ చంద్రగుప్త ప్రకారం రామగుప్తుడు తన భార్య ధృవదేవిని సకా నాయకుడు బాసనకు అప్పగించడానికి సిద్ధపడ్డాడు. అప్పటికే రాజ్యాన్ని బాసన ముట్టడించి ఉన్నాడు. రాణి ప్రతిష్టను గౌరవాన్ని చంద్రగుప్తుడు కాపాడతాడు. సకా నాయకుడిని, తన సోదరుడిని చంపి సింహాసనాన్ని హస్తగతం చేసుకున్నాడు. తర్వాత తన సోదరుని విధవను వివాహమాడాడు. ఆ విధంగా ఈ సంఘటనలు ఒక వీరగాథగా దేవీ చంద్రగుప్తంలో నమోదయ్యాయి.

రెండవ చంద్రగుప్తుడు స్వయంగా దండయాత్రలు చేపట్టి తన సామ్రాజ్యాన్ని విస్తరించాడు. అతడి ప్రధాన ప్రత్యర్థి గుజరాత్, కథియావార్ ద్వీపకల్ప సకా పాలకుడు. వకాటకుల స్నేహ హస్తాన్ని అతడు కోరుకున్నాడు. తన వ్యూహాత్మక స్థావరం నుండి వకాటకులు తనకు సైనిక సహకారాన్ని అందించగలరని భావించాడు. వివాహ సంబంధం ద్వారా సముద్రగుప్తుడు వకాటకుల స్నేహాన్ని పొందాడు. తన రాణి కుబేరనాగకు జన్మించిన ప్రభావతి అనే కుమార్తెను వకాటక పాలకుడు రెండవ రుద్రసేనతో వివాహం జరిపించాడు. అతడి ప్రయత్నాలు చివరకు ఫలప్రదమయ్యాయి. సకా సత్రపాలలో చివరి వాడైన మూడవ రుద్రసింహ హత్యకు గురయ్యాడు. కథియావార్, గుజరాత్‌లను స్వాధీనం చేసుకోవడంతో గుప్త సామ్రాజ్యం బంగాళాఖాతం నుండి అరేబియా సముద్రానికి విస్తరించడమే కాకుండా పాశ్చాత్య ప్రపంచంతో ప్రత్యక్ష సంబంధాన్ని ఏర్పాటు చేసుకుంది. చంద్రగుప్తుడు ఇతర సైనిక విజయాలను కూడా సాధించాడు. ఢిల్లీలోని కుతుబ్ మినార్ వద్ద గల ఒక ఇనుప స్థూపంపై చెక్కిన శాసనం చంద్ర అనే రాజు వంగలో ప్రత్యర్థి దొరల సమాఖ్యను ఓడించాడని, సింధూ నదిని దాటి వహ్లీకులను జయించాడని పేర్కొంటుంది. ఆ విధంగా చంద్రగుప్తుడు తన సామ్రాజ్యాన్ని అన్ని దిశలలో – పశ్చిమ, తూర్పు, పశ్చిమోత్తర విస్తరించాడు.

భారతదేశంలో పర్యటించిన ఫాహియాన్ ప్రధాన లక్ష్యం బౌద్ధ చేతిప్రతులను సమీకరించడం. మానవ సంచారానికి అనువుగా లేని గోబి ఎడారి, ఖోటన్, పామిర్ల పర్వత ప్రాంతాలు, స్వాట్, గాంధార లోయల వెంబడి ఫాహియాన్ ప్రయాణించాడు. భారతదేశంలో అతడు అనేక స్థలాలను సందర్శించాడు. పాటలీపుత్రలో మూడేళ్లు, తామ్రలిప్తిలో రెండేళ్లు గడిపాడు. తన తిరుగు ప్రయాణంలో అతడు తామ్రలిప్తి నుండి నౌకలో బయల్దేరాడు. సిలోను, జావాలను మార్గమధ్యంలో పర్యటించి సముద్ర మార్గాన ఇంటికి చేరుకున్నాడు. ఫాహియాన్ చంద్రగుప్తుని పేరును ప్రస్తావించకపోయినా దేశంలోని సాధారణ స్థితిగతులు, ప్రజల జీవితం గురించి ఆసక్తికరమైన సమాచారాన్ని అందించాడు.

తన తండ్రి నుండి వారసత్వంగా పొందిన సామ్రాజ్యాన్ని ఒకటవ కుమార గుప్తుడు అలాగే కాపాడగలిగాడు. అయితే తన పాలన చివరి దశలో అతడి సామ్రాజ్యాన్ని పుష్యామిత్రులు తీవ్రంగా ఇబ్బంది పెట్టారు. వీరు హుణులతో సాన్నిహిత్యం ఉన్నతెగ ప్రజలు కావచ్చు. గుప్త సామ్రాజ్య మనుగడకే సవాలుగా మారిన హునాలను స్కందగుప్తుడు ఎదుర్కోవలసి వచ్చింది. కాని అంతిమంగా అతడు హుణులను కోలుకోలేని విధంగా ఓడించాడు. దాంతో హుణులు ఆ సామ్రాజ్యం వైపు తదుపరి 50 ఏళ్ల వరకు కన్నెత్తి కూడా చూడలేదు. తన తాతను మరిపిస్తూ స్కందగుప్తుడు విక్రమాదిత్య అనే బిరుదును సంతరించు కున్నాడు. కథియావార్‌లోని జునాగఢ్ సమీపంలోగల గిర్నార్‌కొండలోని ఒక శాసనం సుదర్శన కొలువు పాత ఆనకట్ట పునరుద్ధరణ గురించి చెబుతుంది. స్కందగుప్తుని తొలి పాలనా సంవత్సరంలో కురిసిన భారీ వర్షాల కారణంగా సుదర్శన కాలువ తెగిపోయింది.

స్కందగుప్తుని మరణం తర్వాత సామ్రాజ్యవాద గుప్తుల చరిత్ర అస్పష్టంగా ఉంది. అనేక మంది రాజులు వరుసగా పాలించారు. తన సోదరుడు స్కందగుప్తుడు మరణించిన వెంటనే పురుగుప్త సింహాసనాన్ని అధిష్టించాడు. సామ్రాజ్య వంశాన్ని రెండవ కుమారగుప్త, బుద్ధగుప్త, నరసింహగుప్తలు కొనసాగించారు. నరసింహగుప్తుని తర్వాత అతడి కుమారుడు,

మనవడు గద్దెనెక్కారు. సామ్రాజ్యవాద గుప్త వంశానికి చెందిన చివరి పాలకుడు విష్ణుగుప్త. గుప్త వంశం సుమారు 230 సంవత్సరాలపాటు సార్వభౌమత్వాన్ని అనుభవించింది.

## గుప్తుల వారసులు

### హూణులు :

క్రీ.శ. ఆరవ శతాబ్దం ప్రారంభంలో తోరమన అనే హూణ నాయకుడు గాంధార నుండి బయల్దేరి మాల్వా వరకు చొచ్చుకుపోయాడు. తను వంశ చరిత్రలో అత్యంత సంక్లిష్టమైన కాలాన్ని గుప్తులు చవిచూస్తున్న సమయంలో హూణుల దండయాత్ర జరిగింది. అయితే తోరమన సాధించిన విజయం స్వల్పకాలం కూడా నిలవలేదు. క్రీ.శ.510లో అతడిని భానుగుప్తుడు ఓడించాడు. అతడు జారీ చేసిన నాణేలను బట్టి భానుగుప్తుడు ఉత్తర ప్రదేశ్, రాజ్‌పుతానా, పంజాబ్, కాశ్మీర్‌లోని కొన్ని భూభాగాలపై పాలించినట్లు మనకు తెలుస్తుంది. ఒక జైన కృతి ప్రకారం అతడు జైన మతాన్ని స్వీకరించాడు. చంద్రభాగ (చీనాబ్) నది ఒడ్డున గల పావయా వద్ద అతడు జీవించాడు.

తోరమన వారసునిగా అతడి కుమారుడు మిహిరకుల నాయకత్వ బాధ్యతలను స్వీకరించాడు. క్రీ.శ. 510లో అతడు పట్టాభిషేకం పొందాడు. హుయాన్‌త్సాంగ్ కృతులు, కల్హణుడి రాజతరంగిణి మిహిరకుల అధికారాన్ని, క్రూరత్వాన్ని వివరిస్తాయి. హుయాన్‌త్సాంగ్ ప్రకారం మిహిరకులుని రాజధాని సకల (పంజాబ్‌లోని సియాల్‌కోట్). అలెగ్జాండ్రియా గ్రీకు అయిన కాస్మోస్ తన క్రిస్టియన్ టైపోగ్రఫీ అనే గ్రంథంలో భారతదేశంలో శ్వేత హూణుల అధికారం గురించి ప్రస్తావించాడు. ఈ హూణుల రాజుగొల్లాస్ (సాధారణంగా ఇతడినే మిహిరకులుగా గుర్తిస్తారు) భారతదేశ ప్రభువు. ప్రజలు తనకు పన్నులు చెల్లించేలా అతడు ఒత్తిడి చేసేవాడు. తన అధికారాన్ని సుదీర్ఘ కాలం అనుభవించాలన్న మిహిరకులని ఆశ నెరవేరలేదు. ఇద్దరు భారతీయ పాలకులు – మందసోర్‌కు చెందిన యశోధర్మన్, నరసింహగుప్తలు – అంతిమంగా అతడి ప్రాబల్యాన్ని దెబ్బతీశారు. మాల్వా ప్రాంతానికి చెందిన పదవీ కాంక్షగల యశోధర్మన్ మిహిరకులను కప్పం చెల్లించేలా ఒత్తిడి చేశాడు. మిహిరకుల ఓడిపోయినా ఆ ఓటమి అతడిని భారత రాజకీయ రంగంలో కీలక శక్తిగా నిర్మూలించలేకపోయింది. అనతి కాలంలోనే యశోధర్మన్ తన రాజ్యాన్ని కోల్పోయాడు. దీంతో తన హింసాత్మక చర్యలను (కార్యకలాపాలను) పునరుద్ధరించడానికి మిహిరకుల సాహసించాడు.

గుప్త పాలకుడు నరసింహగుప్త బాలాదిత్య మిహిరకుల జరిపిన శక్తివంతమైన దాడితో తీవ్రంగా నష్టపోయాడు. అయితే దీర్ఘకాలంలో బాలాదిత్య తన ప్రత్యర్థిపై విజయం సాధించాడు. హూణ నాయకుడు మగధపై ఎలా దాడి చేశాడు. అతడిని బాలాదిత్య ఎలా ముట్టడించాడు. చివరకు ఎలా ఓడించాడో అనే అంశాలను హుయాన్‌త్సాంగ్ తన కృతులలో విపులంగా వివరించాడు. మిహిరకుల కాశ్మీర్‌లో శరణు కోరాడు. అయితే అనతి కాలంలోనే మరణించాడు. మిహిరకుల ఓటమితో అప్పటికే బలహీనపడ్డ హూణులు భారతదేశానికి ముప్పుగా ఇక ఏ మాత్రం కొనసాగలేదు. అయినప్పటికీ వారు చాలా కాలం పాటు మనుగడ సాగించారు.

## హర్ష (క్రీ.శ.606-47)

హర్షుడి పాలనపై ఉన్న ఆధారాలలో బానా, హ్యూయాన్ త్సాంగ్ రచనలు అత్యంత ముఖ్యమైనవి. బాణుడు హర్షుడి ఆస్థాన కవి. అతడు హర్ష చరిత్ర, కాదంబరి, పార్వతి పరిణయం అనే కావ్యగ్రంధాలను రచించాడు. చైనా నుండి వచ్చిన బౌద్ధ తీర్థయాత్రికుడు హుయాన్‌త్సాంగ్ భారతదేశాన్ని క్రీ.శ.ఏడవ శతాబ్దంలో పర్యటించాడు. తన యాత్రల గురించి ఉన్నతమైన వ్యాఖ్యానాలు రచించాడు. వాటిని ఉమ్మడిగా సి-యూ-కీ అంటారు. హర్షుడు స్వయంగా రచించిన రత్నావళి, నాగానంద, ప్రియదర్శిక అనే నాటకాలు కూడా హర్షుని చరిత్రను పునఃనిర్మించడానికి ఉపయోగపడతాయి.

పుష్యభూతి వంశానికి చెందిన తొలి ముఖ్య పాలకుడు ప్రభాకరవర్ధనుడు. అతడి రెండవ కుమారుడే హర్షవర్ధనుడు. వీరి రాజధాని థానేశ్వర్‌వద్ద ఉండేది. హర్షుడి అగ్రజుడు రాజ్యవర్ధనుడు తండ్రి మరణం తర్వాత గద్దెనెక్కారు. అయితే సింహాసనాన్ని అధిష్టించిన రోజు నుండి అతడు సమస్యలను ఎదుర్కోవలసి వచ్చింది. కనౌజ్‌కు చెందిన ఆఖరి పాలకుడు, ప్రభాకర వర్ధనుడి కుమార్తె రాజ్యశ్రీ భర్త అయినా గ్రహవర్మను మాల్వా పాలకుడు దేవగుప్త బెంగాల్ పాలకుడు శశాంకతో చేతులు కలిపి హత్య చేశాడు. కనౌజ్‌ను ఆక్రమించి రాజ్యశ్రీని నిర్బంధించాడు.

ఈ పరిణామంతో రాజ్యవర్ధనుడు దేవగుప్తకు వ్యతిరేకంగా యుద్ధాన్ని ప్రకటించాడు. అతడిని హత్య కూడా చేశాడు. అయితే ఇక్కడ శశాంక ద్రోహానికి పాల్పడి రాజ్యవర్ధనుడిని హత్య చేశాడు. ఈలోగా రాజ్యశ్రీ మధ్యభారత అడవుల్లోకి తప్పించుకుంది. ఇప్పుడు థానేశ్వర్ వద్ద హర్షుడు తన సోదరుని వారసత్వాన్ని స్వీకరించాడు. సహజంగానే పాలకునిగా ఇప్పుడు అతడి తొలి కర్తవ్యం తన సోదరిని రక్షించడం, తన సోదరుడు, బావల హత్యకు ప్రతీకారం తీర్చుకోవడం. కనౌజ్ నుండి అతడు శశాంకను తరిమికొట్టాడు. దీని తర్వాత అతడు కనౌజ్‌ను థానేశ్వర్‌తో ఏకం చేయడమే కాకుండా దానిని తన కొత్త రాజధానిగా కూడా మార్చాడు. క్రీ.శ.606-612 మధ్య హర్షుడు ఉత్తర భారతంలోని చాలా భూభాగాన్ని తన నియంత్రణలోకి తెచ్చుకున్నాడు. శిలాదిత్య అనే బిరుదును పొందాడు.

మొదట్లో వలభి పాలకులతో అతడి సంబంధాలు సామరస్యంగా ఉండేవి. అయితే రెండు రాజ్యాల మధ్య మాల్వా కొరకరాని కొయ్యగా మారింది. వలభి పాలకుడిపై యుద్ధం ప్రకటించిన హర్షుడు అందులో రెండవ ధృవసేనుడిని ఓడించాడు. ఈ ఓటమితో వలభి పాలకుడు సామంతుని పాత్ర పోషించడానికి అంగీకరించాడు. తర్వాత రెండవ పులకేశితో హర్షుడు యుద్ధంచేశాడు. లత, మాల్వా, గుర్జర ప్రజలపై అధినాయకత్వం ఇద్దరి మధ్య వివాదాస్పద అంశంగా ఉండేది. హర్షునిదాడి పూర్తిగా విజయవంతం కాలేదు. యుద్ధం ఎలాంటి ఫలితాన్ని ఇవ్వకపోవడంతో పులకేశితో అతడు శాంతి ఒప్పందం కుదుర్చు కున్నాడు. దక్షిణాదిపై పులకేశి తన ఆధిపత్యాన్ని కొనసాగించాడు. కొందరు విద్వాంసుల ప్రకారం హర్షుడు పల్లవ పాలకుడు ఒకటవ మహేంద్రవర్మను ఓడించాడు. అలాగే మరికొందరు దక్షిణాది పాలకులను ముట్టడించాడు. అయితే ప్రత్యక్ష ఆధారం ఏదీ లేకపోవడంతో మనం ఏ విషయాన్ని ఖచ్చితంగా నిర్ధారించలేము. కాని ఒరిస్సా లేదా కళింగ రాజ్యం హర్షుడికి అన్యాక్రాంతమైనట్లు తెలుస్తోంది.

**బాదామీ చాళుక్యులు (క్రీ.శ. 543-755):**

ఒకటవ పులకేశి బదామీ (వతాపి) రాజధానిగా ఒక చిన్న రాజ్యాన్ని స్థాపించాడు. ఒకటవ పులకేశి కుమారుడు ఒకటవ కీర్తివర్మన్ యుద్ధాల ద్వారా రాజ్యాన్ని విస్తరించాడు. బనవాసికి చెందిన కాదంబ, బస్తర్‌కు చెందిన పుల పాలకులను ఈ క్రమంలో ఓడించాడు. రెండవ పులకేశిని బదామీ చాళుక్యులలో అత్యంత గొప్పవాడిగా పరిగణిస్తారు. సింహాసనానికి రాకకు ముందు అతడు ఎందుర్కొన్న సమస్యలే కాకుండా తదుపరి కాలంలో అతడు సాధించిన సైనిక, దౌత్యపరమైన విజయాలు రెండవ పులకేశిని గొప్ప పాలకునిగా నిలిపాయి. అతడి ఆస్థాన కవి రవికీర్తి రచించిన ఐహోల్ శాసనం నుండి మనకు ఈ విషయాలు తెలుస్తాయి.

ఒకటవ కీర్తివర్మ మరణం తర్వాత అతడి సోదరుడు (మంగళేశ) రాజ్య సంరక్షకుడయ్యాడు. ఎందుకంటే కీర్తివర్మన్ కుమారుడు రెండవ పులకేశిన్‌కు అప్పటికి యుక్త వయస్సు రాలేదు. తన చిన్నాన మీద పులకేశి అంతర్యుద్ధం ప్రకటించి అధికారాన్ని కైవసం చేసుకోవలసి వచ్చింది. అంతర్యుద్ధం కారణంగా తిరుగుబాట్లు బయల్దేరాయి. తిరుగుబాటు చేసిన సామంతుడు అప్పాయికను పులకేశి ఓడించాడు. అతడి సహచరుడు గోవిందను క్షమించాడు. రెండవ పులకేశి యుద్ధ విజయాలలో బనవాసి, మైసూరు, దక్షిణ కనరా పాలకులు కాదంబులు, గంగాలు, అలుపాలపై నియంత్రణ సాధించడం, ఉత్తర కొంకణ్ పాలకులు మౌర్యులను లొంగదీసుకోవడం, హర్షునితో ఘర్షణ మొదలైనవి ఉన్నాయి. హర్షునితో జరిగిన యుద్ధంలో అతడు హర్షుడి రాజ్య విస్తరణ కాంక్షలను నిలువరించగలిగాడు. లత, మాల్వ, గుర్జర పాలకులను తన నియంత్రణలోకి తెచ్చుకున్నాడు. తూర్పు దక్కనుపై దండయాత్రలు జరిపాడు. మహా కోసల, కళింగ, పిస్తాపుర, రాయలసీమ బాణాలను అణచివేశాడు. పల్లవ రాజ్యంపై అతడు జరిపిన తొలి దాడి విజయవంతమైంది. ఆ రాజ్యంలోని ఉత్తర భాగాన్ని అతడు స్వాధీనం చేసుకున్నాడు. అయితే పల్లవులకు వ్యతిరేకంగా అతడు చేపట్టిన రెండవ దండయాత్ర ఘోరంగా విఫలమైంది. వ్యక్తిగతంగా, రాజ్యపరంగా అతడు తీవ్రంగా నష్టపోయాడు. పల్లవ పాలకుడు ఒకటవ నరసింహవర్మ చాళుక్య సైన్యాలను తరిమికొట్టడమే కాకుండా చాళుక్య రాజ్యాన్ని సైతం ముట్టడించారు. రెండవ పులకేశిని హత్య చేసి బదామీని స్వాధీనం చేసుకున్నాడు. తన పాలన చరమాంకంలో పులకేశి పర్షియా రాజు రెండవ ఖుస్రోవద్దకు రాయబారాన్ని పంపాడు. పర్షియా నుండి ఒక బృందాన్ని కూడా స్వాగతించాడు. హుయాన్ త్సాంగ్ పులకేశిన్ రాజ్యాన్ని సందర్శించాడు.

సుమారు 12 ఏళ్ల తర్వాత పులకేశిన్ కుమారుడు ఒకటవ విక్రమాదిత్య దురాక్రమణదారులైన పల్లవ సైనికులను తరిమివేయడమే కాకుండా తన రాజ్యాన్ని తిరిగి దక్కించుకోగలిగాడు. పల్లవుల రాజధాని కంచిని కొల్లగొట్టాడు. వినయాదిత్య హయాం సాధారణంగా శాంతియుతంగా కొనసాగింది. రాజ్యం కూడా అభివృద్ధి చెందింది. విజయాదిత్య పాలన సుదీర్ఘకాలం కొనసాగింది. ఈ కాలంలో అతడి రాజ్యంలో శాంతి, సౌభాగ్యాలు వెల్లివిరిశాయి. తదుపరి పాలకుడు రెండవ విక్రమాదిత్య. అతడి పాలనలో పల్లవ రాజ్యంపై మూడుసార్లు విజయవంతంగా దండయాత్ర జరిపారు. అలాగే దక్షిణ గుజరాత్‌లో అరబ్ దండయాత్రను తిప్పికొట్టారు. రెండవ కీర్తివర్మ చివరి బదామీ చాళుక్య పాలకుడు. ఇతడిని రాష్ట్ర కూట వంశ వ్యవస్థాపకుడు దంతిదుర ఓడించాడు.

**కాంచీపురం పల్లవులు (క్రీ.శ. 560-903):**

సముద్రగుప్తుడు దక్షిణ భారతంపై దండయాత్ర జరిపినప్పుడు పల్లవులు కొనసాగినా సింహవిష్ణువే వారి తొలి ముఖ్య పాలకుడు. చోళుల రాజ్యాన్ని స్వాధీనం చేసుకోవడమే కాకుండా సిలోన్‌తో సహా దక్షిణాది రాజ్యాలను ఓడించాడు. ఒకటవ మహేంద్రవర్మన్ హయాంలో సుదీర్ఘమైన పల్లవ- చాళుక్య సంఘర్షణకు బీజం పడింది. పల్లవ పాలకుల్లో గొప్ప వాడైన ఒకటవ నరసింహవర్మన్ రెండవ పులకేశిన్ జరిపిన ద్వితీయ దండయాత్రను తిప్పికొట్టి అతడిని చంపి వేశాడు. చివరకు చాళుక్యుల రాజధాని వతాపిని సైతం స్వాధీనం చేసుకున్నాడు. ఈ విజయం కారణంగా అతడు వతాపికొండ అనే బిరుదును పొందాడు. అతడు చోళులు, చేరాలు, పాండ్యులను కూడా ఓడించాడు. అలాగే సిలోన్‌కు రెండు నౌకాదళ బృందాలను పంపి తన మిత్రుడైన సిలోను రాకుమారుడు మనవర్మన్‌కు సహాయం అందించాడు. నరసింహవర్మన్ పంపిన సైనిక బలగాలతో కలిసి మనవర్మన్ సిలోను సింహాసనాన్ని స్వాధీనం చేసుకోగలిగాడు. నరసింహవర్మన్ పాలనలో మరో ముఖ్యమైన ఘటన హుయాన్‌త్సాంగ్ కాంచీ సందర్శన. మామల్లగా ప్రసిద్ధుడైన నరసింహవర్మ మామల్లపురం (మహాబలిపురం) నగరాన్ని నిర్మించాడు. అలాగే అక్కడి ఏకశిలా రాతితో దేవాలయాలను తొలిపించాడు.

రెండవ మహేంద్రవర్మ స్వల్పకాలం మాత్రమే పాలించగలిగాడు. ఎందుకంటే చాళుక్య రాజు ఒకటవ విక్రమాదిత్య అతడిని హత్యచేశాడు. ఒకటవ పరమేశ్వరవర్మ కూడా విక్రమాదిత్యుని సైన్యాలను ఎదుర్కోవలసి వచ్చింది. అయితే చాళుక్య సైన్యాలను అతడు ఓడించి తరిమికొట్టాడు. రాజసింహగా ప్రసిద్ధుడైన రెండవ నరసింహవర్మ పాలనలో శాంతి సౌభాగ్యాలు నెలకొన్నాయి. అలాగే సాహిత్యరచన, విశాల, అందమైన ఆలయాల నిర్మాణం జరిగాయి. అతడు చైనాకు రాయబార బృందాలను పంపించినట్లు చెబుతారు. అతడి పాలనలో సముద్ర వ్యాపారం వెల్లివిరిసింది. అయితే పల్లవ రాజ్యం చాళుక్య రెండవ విక్రమాదిత్య చేతిలో ఓటమి పాలైంది. అప్పుడు పల్లవ పాలకునిగా రెండవ పరమేశ్వరవర్మ ఉన్నాడు.

రెండవ విక్రమాదిత్య మరోసారి దండెత్తి వచ్చి, పల్లవ రాజధానిని స్వాధీనం చేసుకున్నప్పుడు పల్లవుల తదుపరి పాలకుడు రెండవ నందివర్మ శాంతి ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. తన కుమార్తెను చాళుక్య పాలకునికి వివాహంలో అప్పగించడమే కాకుండా భారీగా కప్పాన్ని సైతం చెల్లించాడు. నందివర్మన్ పాలనలో పాత ఆలయాలు పెద్ద సంఖ్యలో పునరుద్ధరణకు గురయ్యాయి. కంచి వద్ద వైకుంఠపెరుమాళ్ లాంటి కొత్త ఆలయాలు కూడా నిర్మితమయ్యాయి. దంతివర్మ, మూడవ నందివర్మ, నృపతుంగ, అపరాజిత వరుసగా పాలించారు. అయితే చివరి పాలకుడిని 9వ శతాబ్దం చివరలో ఆదిత్యచోళ ఓడించాడు. దాంతో దక్షిణ భారతంలో చోళ ఆధిపత్యం మొదలైంది.

# III

# రాజకీయ వ్యవస్థ – ప్రభుత్వం

8

# సింధూ యుగం

**రాజకీయ వ్యవస్థ (నిర్మాణం) :**

సింధూ నాగరికతకు చెందిన సహజ లక్షణాలు చాలా వరకు పట్టణీకరణతోసహా– అత్యంత సమర్థవంతమైన నిర్మాణ స్వరూపాన్నే కాకుండా బలమైన నిర్వహణా వ్యవస్థ లేనిదే అమలయ్యే పరిస్థితి లేదు. ఇక్కడొక ముఖ్యమైన ప్రశ్న తలెత్తు తుంది. ఈ వ్యవస్థ స్వరూపం ఏమిటి? హరప్పా సంఘటనం అప్పటికీ చిన్న చిన్న తెగ రాజ్యాలుగా ఉండేదా లేదా అసలు సిసలు రాజ్యంగా ఉండేదా? రెండవ అంశానికి వస్తే మరిన్ని ప్రశ్నలు ఉదయిస్తాయి. ఒకే రాజ్యం లేదా 'సామ్రాజ్యం' ఉండేదా? లేదా అనేక చిన్న రాజ్యాలు ఉండేవా? ఇతర దేశాల నుండి హరప్పా నాగరికత దిగుమతి కాకపోవడం చేత బయటి ప్రాంతం నుండి ఆక్రమణదారుడు వచ్చే పరిస్థితి లేదు. ఉపఖండంలోని పశ్చిమోత్తర భాగాన్ని స్వాధీనం చేసుకొని తన పాలనను స్థాపించి, దానితోపాటు ఆక్రమిత ప్రాంతంపై తన మాతృదేశపు సంస్కృతిని రుద్దే అవకాశమూ లేదు. అలాంటి దండయాత్రే కనక జరిగి ఉంటే "సామ్రాజ్యానికి" ఖచ్చితంగా ఒక పూర్వ లిఖిత వివరణ ఉండి ఉంటుంది.

కొందరు విద్వాంసుల ప్రకారం హరప్పా నాగరికత పరిణత దశలో చిన్న చిన్న తెగ రాజ్యాలు సంఘటిత రాజ్యాలుగా రూపాంతరం చెంది ఉంటాయి. అయితే తమ ప్రాంతీయ ఉనికిని నిలుపుకొని ఉంటాయి. వారు ఈ కింద రాజకీయ ముఖచిత్రాన్ని ప్రతిపాదించారు. మొహెంజోదారో రాజధానిగా సింధ్ ఒక రాజ్యంగా ఉండి ఉండవచ్చు; హరప్పా రాజధానిగా ఉత్తర పంజాబ్ (పాకిస్తాన్) రాజ్యం; వాయవ్య పంజాబ్ (ఛోలిస్తాన్)కు గన్వేరివాలా రాజధాని; కాలిబంగన్ రాజధానిగా ఉత్తర రాజస్థాన్‌కు ఒక రాజ్యం; రాఖీగఢీ రాజధానిగా హర్యానాకు మరో రాజ్యం; పశ్చిమోత్తర ప్రాంతాలకు బనావలి రాజధానిగా ఒక రాజ్యం; కఛ్, పరిసర ప్రాంతాలపై ధొలావీర ఆధిపత్యం; గుజరాత్, పొరుగు ప్రాంతాలకు లోథల్ రాజధానిగా కొనసాగి ఉండవచ్చు.

ఉత్తర భారతదేశ తొలి చారిత్ర కాలాన్ని (క్రీ.పూ. ఆరవ శతాబ్దం) పరిగణనలోకి తీసుకుంటే (అపుడు 16 మహాజనపదలు ఉండేవి) పైన ప్రతిపాదించిన దృశ్యం అంత అసంబద్ధమైనదేమీ కాదు.

మరో ప్రత్యామ్నాయం భవిష్యత్తు తెగ రాజ్యాలను ఊహించడం. ముఖ్యంగా కోట్ దిజి (లేదా తొలి మొహెంజోదారో) లేదా హరప్పా లేదా గన్వేరీవాలా లేదా మనకు తెలియని మరో ప్రదేశంలో ఇలాంటి రాజ్యాలు ఏర్పడడానికి అవకాశాలు ఉన్నాయి. అదెలా సాధ్యమంటే ఒక తెగ నాయకుడు వ్యాపార–వాణిజ్య మార్గాలలో అత్యంత ప్రబలమైన ఆర్థిక స్థోమతను పొంది పైన ప్రతిపాదించిన ప్రాంతాలలో రాజ్యాని ఏర్పాటు చేసి ఉంటాడు. పర్యవసానంగా అలాంటి రాజ్యం ఇతర చిన్న రాజ్యాలను అణచివేసి ఒక సామ్రాజ్యాన్ని స్థాపించి ఉంటుంది. అయితే ఇక్కడ ఒక క్షణం ఆగి మరో అంశాన్ని ఆలోచించవలసి ఉంటుంది. అదేమిటంటే సమర్థవంతమైన నియంత్రణ కొరకు ఒక సామ్రాజ్యానికి సుశిక్షతమైన సైన్యం, తగిన ఆయుధాలు అత్యంత కీలకం. నిజానికి ఈ విషయంలో మనకు పురావస్తు సాక్ష్యం చాలా తక్కువగా ఉంది.

"సామ్రాజ్య" నేపథ్యం లేకుండా పరిణత హరప్పా నాగరికత విశాలమైన భూభాగంపై క్రమబద్ధ నియంత్రణను సాధించే అవకాశమే లేదని తరచూ వాదించబడింది. తొలి చారిత్రక కాలాలకు చెందిన ఒక విస్పష్ట నిదర్శనం అలాంటి ఏర్పాటు ఉండేదన్న వాదనను నీరు గారుస్తుంది. క్రీ.పూ. తొలి సహస్రాబ్ది మధ్యలో భౌతిక సంస్కృతి (ఏకీకృత) నిజంగానే ఉండేది. దానికి ఉత్తర నలుపురంగు పాత్రలు, గోళాకార బరువులు, హస్తముద్రికలు, రాగి నాణేలు ప్రాతినిధ్యం వహించాయి. ఇలాంటి సంస్కృతి పశ్చిమాన పాకిస్తానీ పంజాబ్‌లోని తక్షశిల నుండి తూర్పున పశ్చిమ బెంగాల్‌లోని తమ్లూక్ వరకు, ఉత్తరాన ఉప–హిమాలయ ప్రాంతం నుండి దక్షిణాన కనీసం నర్మదా తీరం వరకు విస్తరించి ఉండేది. అయినప్పటికీ ఈ సంస్కృతిని వెనకేసుకురావడానికి ఎలాంటి "సామ్రాజ్యం" లేదు. తొట్టతొలి సామ్రాజ్యం రెండు వందల సంవత్సరాల తర్వాతనే ఆవిర్భావంలోకి వచ్చింది.

అనేక చిన్న రాజ్యాలను లేదా ఒక విశాలమైన సామ్రాజ్యాన్ని మనం ప్రతిపాదించినా ఒక ప్రశ్న మాత్రం అప్పటికీ జవాబు కోరుకుంటుంది: ప్రతి రాజ్యంలోనూ రాజులు ఉండేవారా లేదా సామ్రాజ్యం విషయంలో ఒక చక్రవర్తి ఉండేవాడా? రాజులు లేదా చక్రవర్తి ఉన్నట్లయితే అలాంటి వ్యక్తి సమాజంలోని ఇతర ప్రజల కంటే ఉన్నతంగా ఉండాలి. తన వ్యక్తిగత జీవన శైలిలో కాని చివరకు తన మరణంలో కాని అతడు ఉన్నత స్థానాన్ని కలిగి ఉండాలి. రాజభవనాలు, రాచరిక స్థూపాలు లేని కారణంగా రాజులు లేదా చక్రవర్తి ఉండేవారని నిర్ధారించలేకపోతే వారి ఉపస్థితి అసలు లేనేలేదని మనం చేతులు ఎత్తివేయాలా? ఇలాంటి ఊహాగానాన్ని మనం పూర్తిగా తిరస్కరిస్తే వేరే ప్రత్యామ్నాయాలు ఏవై ఉంటాయి? పాలనా యంత్రాంగం సంస్థానాధీశుల రీతిలో ఏర్పాటై ఉండేదా? ఇంకా చెప్పాలంటే అది లౌకికత్వాన్ని కలిగి ఉండేదా? లేదా అందులో పురోహిత వర్గం కూడా కీలక పాత్ర పోషించిందా? పోషిస్తే, ఏ మేరకు పోషించింది? సంతృప్తికరమైన సమాధానాల కోసం ఈ ప్రశ్నలు మరింత పురావస్తు సాక్ష్యాధారం కోసం వేచి ఉండక తప్పదు.

## వైదిక కాలం

### సామాజిక - ఆర్థిక నేపథ్యం రాజకీయ నిర్మాణ స్వరూపం:

వైదిక కాల జన (తెగ)లో అనేక విస్‌లు (కుదురులు) ఉండేవి. రుగ్వేద కాలం నాటికి ఇవి విస్, రాజన్యగా విభజన చెందాయి. రెండవ వర్గంలో పాలక కుటుంబాలు సమిష్టిగా చేరిపోయాయి. మలివైదిక సాహిత్యంలో కూడా రాజన్యను కథానాయకునికి ప్రతిరూపంగా వర్ణించారు. ఈ పాలక కుటుంబాల నుండే "రాజ"ను ఎన్నుకునేవారు. అశ్వమేధ యాగాన్ని విజయవంతంగా పూర్తి చేసిన వారే "రాష్ట్ర"లో భాగం పొంది రాజులవుతారని ఒక చోట పేర్కొనబడింది. అలాంటి రాజులు ఆరాధనకు అర్హులవుతారని, అశ్వమేధ యాగాన్ని పూర్తిగా నిర్వహించడంలో విఫలమైన వారు రాజన్య, విస్ సభ్యులుగా ఉండిపోతారని వివరించబడింది. రాజన్య, విస్‌ల మధ్య తొలినాళ్లలో సంబంధం సమానంగా ఉండి ఉండవచ్చు. "క్షాత్ర" విస్ నుండే సృష్టించబడిందని కూడా చెబుతారు. రుగ్వేద కాలంలో ఇద్దరి మధ్య సంబంధంలో అంత అగాధం లేదు. తదుపరి కాలంలోనే ఇరు వర్గాల మధ్య దూరం పెరిగింది. విస్ వర్గం రాజన్‌ను 'బలి' రూపంలో కానుకలు సమర్పించేది. ఇతర తెగ నాయకులు కూడా ఇలాంటి సాంప్రదాయాన్ని పాటించేవారు. కనక రాజన్, ఐస్‌ల మధ్య సంబంధం అసమానమైనది. రాజన్‌ను ఇతర రాజన్‌లు ఎన్నుకునేవారు. కాని విస్ అతడికి కానుకల రూపంలో అదనపు ఉత్పత్తిని సమకూర్చేది. ఇలాంటి ఏర్పాట్లు వల్లే రాజన్య కుటుంబాలు అనేక సంవత్సరాలపాటు మనుగడ సాగించగలిగాయి. అదనపు ఉత్పత్తికి తోడు పాలక కుటుంబాలు దోపిడీ లేదా దాడి ద్వారా సంపదను సమకూర్చుకునేవి.

రుగ్వేద కాలపు రాజన్య స్థానంలో మలివైదిక కాలంలో క్షత్రియుడు వచ్చాడు."అధికారం" అనే అర్థానిచ్చే "క్షాత్ర" అనే పదం నుండి "క్షత్రియ" పుట్టుకొచ్చింది. జన, దాని భూభాగంపై అధిక నియంత్రణ ఆధారంగానే అధికారం ప్రతిబింబించేది. క్షత్రియ వంశం పేరున ఆయా ప్రాంతాల నామకరణం జరిగేది. క్షత్రియ, జన మధ్య వ్యత్యాసం లేదా దూరం ఇద్దరి మధ్య ఉద్రిక్తతకు తెర తీసింది. "క్షాత్ర విస్‌ను ఆరగిస్తాడు" తదితర వ్యాఖ్యానాలు అప్పటి పరిస్థితిని అద్దం పడతాయి. జింక తిండి గింజలను మేస్తుందన్న అర్థాన్ని ఈ నానుడి అందిస్తుంది. "రాజ"ను "విసమత్త" (విస భక్షకుడు) అని తరచుగా ప్రస్తావించారు. విస్ కంటే క్షత్రియ చాలా శక్తిమంతుడని పేర్కొన్నారు. ప్రజలు తమ ఉత్పత్తిలో కొంత భాగాన్ని క్షత్రియుని కోసం పక్కన తీసి పెట్టేవారు. క్షత్రియునికి ప్రజల ఆస్తిలో (ఎంత మేరకు ఉన్నా) కొంత వాటా ఉండేది. తదుపరి కాలంలో ఆ వాటా "పన్ను"గా రూపాంతరం చెందింది. ముఖ్యంగా భాగం (వాటా), బలి (స్వచ్ఛంద సమర్పణ) అలాంటి కోవకు చెందుతాయి. అన్ని కృతులలో ప్రజలను క్షత్రియులకు విశ్వాసపాత్రులుగా చూపారు. క్షత్రియుడు, ప్రజల మధ్య అగాధం ఉన్నప్పటికీ కర్మకాండలు, సామాజిక కలయికపై ఎలాంటి నిషేధం ఉండేది కాదు. సూద్రులే ఈ సామాజిక ఒడంబడికకు దూరంగా ఉన్నారు. వారిని కనీసం 'శాల'లలోకి కూడా అనుమతించేవారు కాదు. అలాంటి ప్రదేశాలు కేవలం బ్రాహ్మణులు, రాజన్యలు, వైశ్యులకే పరిమితమై ఉండేవి.

కొత్త అవసరాలకు తగ్గట్టుగా తమ ఉత్పత్తిని పెంచుకోవలసిన అవసరాన్ని ప్రజలు కొత్త నివాస ప్రాంతాలను ఏర్పరచడం ద్వారా, వ్యవసాయ విస్తరణ ద్వారా పాక్షికంగా

తీర్చుకున్నారు. అలాగే వంశ వ్యవస్థకు బయట ఉన్న ప్రజల సేవలను వినియోగించుకోవడం ద్వారా మరికొంత లాభపడ్డారు. సూద్రులు ఆ విధంగా ఇతర వర్గాల కింద ఉపాధి పొందగలిగారు. ఈ పరిస్థితిలో సూద్రులు, దాసులు కార్మిక శక్తిగా అవతరించారు. ఫలితంగా గృహస్త ఆర్థిక వ్యవస్థ ఏర్పాటైంది. ఇందులో ఉమ్మడి కుటుంబం ఒక గృహానికి ప్రాతినిధ్యం వహించగా ఉపాధి పొందిన కార్మికులు సేవా సంబంధాలను నెలకొల్పారు. ప్రజలు క్షత్రియునికి తమ ఉత్పత్తిలో కొంత భాగాన్ని కానుకగా చెల్లించడం, సూద్రులు తమ శ్రమ ద్వారా ప్రజలకు సేవలందించడం సామాజిక వర్గీకరణకు తగిన ఆధారంగా ఉండేది. అయితే ఇలాంటి వర్గీకరణ లేదా విభజనకు రాజ్యయంత్రాంగం అక్కరకు రాలేదు. కుటుంబ లేదా కుదురు(వంశ) సంబంధాల ప్రాముఖ్యత అప్పటికీ ఉండడంతో అవి తమ ఆధిపత్యాన్ని చాటుకున్నాయి. ఈ నేపథ్యంలోనే విస్, ప్రజ క్షత్రియునిపట్ల విధేయత కనబరచినట్లు బోధపడుతోంది. ప్రజ అన్నది కొత్త సూత్రీకరణ.అందులో కుటుంబ లేదా వంశేతర సముదాయాలు, అలాగే సూద్రులు లాంటి వారసత్వం లేని వర్గాలు కూడా అంతర్భాగంగా ఉన్నాయి.

కొన్ని కుదురుల సమూహం 'జన'గా ఏర్పడేది. వారు స్థిరపడిన ప్రాంతాన్ని జనపద అని పిలిచేవారు. ఈ నివాస ప్రాంతాలు చిన్నవిగా ఉన్నంత వరకు కుటుంబ ఆధిపత్యం నియంత్రణకు ఒక వ్యవస్థగా సరిపోయేది. క్షత్రియ కుటుంబాల పేరున ఈ జనపదాల నామకరణం జరగడం ఇలాంటి ఏర్పాటును సూచిస్తుంది. ఆ విధంగా కురు, పంచాల లాంటి జనపదాలతోపాటు కైకేయ, మద్ర, మత్స్య తదితర ప్రాంతాల ప్రస్తావన ఉంది. క్షత్రియ కుటుంబాలు జనపద భూభాగంపై తమకు నియంత్రణ ఉందని వాదించేవి. అయితే ఈ దశలో సమగ్రంగా తీర్చిదిద్దిన (అంటే సరిహద్దులు నిర్దిష్టంగా కలిగిన) రాజ్యం అంటూ లేదు. జనపదల మధ్య సరిహద్దులుగా సహజ నైసర్గిక లక్షణాలైన అడవులు, నదులు, కొండలు,వాగులు వ్యవహరించాయి. ఈ కాలంలో "రాష్ట్ర" అనే పదాన్ని ప్రస్తావించారు. అయితే పూర్తి నియంత్రణలో ఉన్న నిర్దిష్టమైన భూభాగం అనే అర్థాన్ని మాత్రం ఆ పదం ఇవ్వదు. రుగ్వేదం, తదుపరి వైదిక గ్రంథాలలో 'రాష్ట్ర' అనే పదాన్ని రాజ్ (ప్రకాశించడం) అనే మూల పదం నుండి తీసుకున్నారు. ఒక ప్రాంతం లేదా క్షత్రియ అధికారం విస్తరించి ఉన్న భూభాగాన్ని వివరించేందుకు "రాష్ట్ర" అనే పదాన్ని ఉపయోగించారు.

రాజన్యులు క్షత్రియులుగా అవతారమెత్తినప్పుడు వారు విస్ (విషయ) వ్యవసాయ కార్యకలాపాలపై ఎక్కువగా ఆధారపడడం మొదలుపెట్టారు. ప్రజలు సమర్పించే కానుకలపై మనుగడ సాగించారు. సంఖ్యాపరంగా క్షత్రియులు విస్ కంటే చాలా తక్కువగా ఉన్నందువల్ల అలాంటి పరాధీనాన్ని తోసిపుచ్చలేము. అది అసాధ్యమైన ఏర్పాటు కూడా కాదు. క్రమంగా గృహస్త ఆర్థిక వ్యవస్థ విస్ వారసకుటుంబాలతో ముడిపడిపోయింది. క్షత్రియులు ఈ వ్యవస్థకు వెలుపల ఉండిపోయారు. సామాజిక వర్గంగా గృహపతి అంతిమ ఆవిర్భావం విస్‌తో సంబంధం ఆధారంగానే జరిగింది. విస్ స్థానంలో వైశ్యను ఉంచినప్పుడు అది తారుమారైన హోదాను సూచిస్తుంది. కుదురులు ఇక్కడ తమ ప్రభావాన్ని కోల్పోయి వ్యక్తిగత హోదాలు విస్పష్టంగా ముందుకు వచ్చాయి. ఈ దశలో సూద్రను కూడా ఎక్కువగా ప్రస్తావించారు. వైశ్య, సూద్ర మధ్య తారతమ్యాన్ని చూపారు. ఒక ప్రసిద్ధ వ్యాఖ్యానంలో వైశ్యను అణచివేయ వచ్చని, అయితే

సూద్రుని హింసించడం లేదా హత్య చేయవచ్చని పేర్కొనబడింది. ఈ వ్యాఖ్యానం బట్టి వాస్తవ వ్యవసాయ పనిని వైశ్యులు చేపట్టారా లేదా సూద్రులు చేపట్టారా అనే ప్రశ్న ఉదయిస్తుంది.

సాంకేతికపరంగా వ్యవసాయదారుడిని రుగ్వేదలో "కినాస"గా పేర్కొన్నాడు. వైదికానంతర సాహిత్యంలో కర్షక, క్షేత్రక, సూద్ర అనే పదాలను వాడారు. వ్యవసాయదారుడిని సంబోధించడానికి వైశ్య అనే పదాన్ని వాడలేదు. వైశ్యుడు వ్యవసాయం ద్వారానే సంపదను సమకూర్చుకున్నాడన్నది వేరే విషయం. విస్ ఇప్పుడు గృహ వ్యవస్థ లక్షణాన్ని సంతరించుకున్నారు. పితృస్వామ్య అధిపతిగా గృహపతి తన కుటుంబ శ్రమను, అలాగే సూద్ర, దాసుల శ్రమను శాసించాడు. సూద్రులు, దాసులు సంచారులు లేదా అభాగ్యులు ఏ మాత్రం కాదు. దాస-వర్ణ వ్యవస్థలో పేద సభ్యులుగా ఉండి ఉండవచ్చు. తమ పేదరికం కన్నా కుటుంబ, కుదురు వ్యవస్థకు బయట ఉండడంవల్లే వారు ఇతరులకు దాసోహం కావలసి వచ్చింది.

బలి, భాగ, శుల్క అనే పదాంశాలను వివిధ రకాల పన్నులుగా అన్వయించారు. అయితే వీటిలో ఒక్కటి కూడా నిర్దిష్ట సమయానికి లేదా క్రమబద్ధంగా వసూలు కాలేదు. అలాగే అవి విస్పష్టంగా నిర్ధారించిన మూల్యాన్ని కూడా తలపించలేదు. ఇంకా చెప్పాలంటే పన్ను చెల్లించడానికి ప్రత్యేక వృత్తి సముదాయాలు కాని, పన్ను వసూలు చేయడానికి నియమిత వ్యక్తులు కాని లేరు. ఈ పూర్వ పరిస్థితులన్నీ కేవలం వైదికానంతర కాలంలోనే సమగ్ర రూపాన్ని సంతరించుకున్నాయి. అప్పుడు పన్నులను వసూలు చేశారు. బలి, భాగ, శుల్క అనే అంశాలను పన్నులను సూచించడానికి వాడారు.వేద గ్రంథాలలో "బలిహృత్" అనే పదాన్ని వాడారు. ఆక్రమిత ప్రాంతంలోని తెగలు ఈ బలిని చెల్లించేవి. అయితే చాలా వరకు "బలి" అన్నది ప్రజలు క్షత్రియునికి సమర్పించుకున్న కానుకలను ప్రతిబింబిస్తుంది. దానిని పన్నుగా అన్వయించకూడదు. బలికి సంబంధించిన కాలాలు ఏవైనా ఉంటే అవి కర్మకాండలు నిర్వహించే సమయాన్ని లేదా విగ్రహ ప్రతిష్ట, పట్టాభిషేక ఉత్సవాలను సూచిస్తాయి. తొలుత ఓడిపోయిన తెగ సమర్పించుకునే "కప్పాన్ని" 'బలి' అని భావించినా తదుపరి కాలంలో క్షత్రియులకు ప్రజలు చెల్లించిన "కానుకలు"గా దానిని విస్తరించవచ్చు. బలిహృత్, బలికృత్ అనే పదాంశాలు కప్పాన్ని చెల్లించే లేదా సమకూర్చే వారిని సూచించి ఉంటాయి కాని పన్ను చెల్లించే వర్గాలను కాదు. కనుక బలి అన్నది కేవలం కానుక మాత్రమే. భాగ విషయానికి వస్తే దండయాత్రలో కొల్లగొట్టిన సంపదలో ఆయా వర్గాల వాటాను సూచిస్తుంది. లేదా కర్మకాండల సమయంలో ప్రజలు సమర్పించుకునే (నైవేద్యం) కానుకలను వివరిస్తుంది. తొలి సమాజాలలో కర్షకులు తాము సాగు చేసిన ఫలహారాన్ని (పండ్లు) తెగ నాయకునికి వినయపూర్వకంగా సమర్పించేవారు. ప్రపంచంలోని ఇతర సమాజాలలో కూడా ఇలాంటి సాంప్రదాయం ఉండేది. ఈ భాగ సమర్పణకు ఇలాంటి సాంప్రదాయంలోనే మూలాలు ఉన్నాయి.

భాగదుష అనే పదంతో కూడా దానికి సంబంధం ఉంది. ఇందులో దుష అనే పదాన్ని (పాలు పితకడం) వాటా సేకరణదారునిగా అన్వయించవచ్చు. లేదా పంపిణీదారుడైన 'పుసన్'తో దానిని ముడిపెట్టవచ్చు. శుల్క అనే పదం రుగ్వేదంలో పన్ను అర్థాన్ని ఇవ్వదు. అయితే విలువ కొలమానంలో దానిని వాడారు. అధర్వవేద విషయానికి వస్తే దాని నేపథ్యం సాధారణంగా ఒక బలహీనుడు ఒక శక్తిమంతుడికి చెల్లించే మూల్యంలో ఉంది. రుగ్వేదంలో

ప్రస్తావించబడిన బలి, భాగ, శుల్క అనే పదాలు తదుపరి ధర్మశాస్త్ర సాహిత్యంలో పన్నులు, బకాయిలు అనే అర్థాన్నిచ్చే రూపాలుగా మారిపోయాయి.

**రాచరిక వ్యవస్థ పరిణామక్రమం :**

"రాజ"ను కుదురులు ఎన్నుకునేలా లేదా ఒక ప్రత్యేక వర్గం అతడిని నియమించేదా అనే విషయం ఇప్పటికీ చాలా వివాదాస్పదంగా ఉంది. రుగ్వేద కీర్తనల్లో రాజును ఎన్నుకునేవారు విస్ (విషయ) కంటే ప్రత్యేకమైన వారని స్పష్టం చేయబడింది. విస్‌కు రాజును ఎన్నుకునే అధికారమే కనక ఉన్నట్లయితే "బలి"ని కోరుకునే శక్తి సన్నగిల్లేది. అయితే రుగ్వేదలోని మరో కీర్తనలో విషయ రాజును ఎన్నుకునే అంశాన్ని ప్రస్తావించారు. బహుశా అది పూర్వపు సాంప్రదాయం కావచ్చు. రాజన్యలు మరింత శక్తిమంతులుగా మారడంతో ఆ సాంప్రదాయానికి స్వస్తి చెప్పి ఉండవచ్చు. వైదిక గ్రంథాలలో రాజ అనే పదవి సాధారణంగా యుద్ధనాయకుని స్థాయిని, నివాస ప్రాంతాల పరిరక్షకుడిని సూచిస్తుంది. మొదట్లో ఈ పదవి వారసత్వం ఆధారంగా ఉండేది కాదు. పదవికి ఖాళీ ఏర్పడినప్పుడల్లా రాజును ఎన్నుకొని అతడిని సింహాసనంపై ప్రతిష్టించే అవకాశం ఉండేది.

తదుపరి వైదిక కాలంలో రాజ ప్రతిష్టాపన మరింత ఆడంబరంగా విస్తృతంగా మారింది. అధికారానికి క్షాత్ర వంశ నేపథ్యం, పట్టాభిషేకం కొలబద్ధలుగా మారాయి. సారభౌమత్వం, కానుకలు కోరడానికి పట్టాభిషేక మహోత్సవాలను ఋచీగా చూపారు. రాజత్వంతో ముడిపడి ఉన్న సంపూర్ణ, భౌతికవాద అధికారం ఇలాంటి ఆధారాలలోలేనట్లు బోధపడుతుంది. కానుకలు నుండి సమకూరే ఆదాయాన్ని కర్మకాండలు నిర్వహించడానికి, అలాగే వాటిని ప్రత్యక్షంగా నిర్వహించే బ్రాహ్మణులకు చెల్లించడానికి వ్యయం చేసేవారు. ఈ కారణంగానే క్షత్రియులు బ్రాహ్మణులపై ఎక్కువగా ఆధారపడడం మొదలుపెట్టారు. ఇలాంటి సంబంధాన్ని "సతపథ బ్రాహ్మణ" అనే కృతిలో విపులంగా వివరించారు. బ్రాహ్మణుడు మిత్ర అనే దేవుడని, కనక అతడు సృష్టికర్త అని, క్షత్రియుడు వరుణ అని, అతడు నిర్వాహకుడని పేర్కొనబడింది.

రాజకీయ అధికారానికి పెరుగుతున్న ప్రాముఖ్యతను సూచించడానికి రాజన్య అనే పదాన్ని క్షత్రియ అనే పదంతో భర్తీచేశారు. వారసత్వ లేదా కుదురులో స్థాయిని సూచించడానికే రాజన్య అనే పదాన్ని వాడారు. మరోవైపు క్షత్రియ అనే పదం ప్రాంతీయ అధికారాన్ని, ప్రాబల్యాన్ని సూచిస్తుంది. అంటే యుద్ధ రంగంలో విజయవంతమైన నాయకుడిని అది సూచిస్తుంది. ఒక ప్రాంతంపై ఆధిపత్యం చాటుకునే హక్కును, ప్రజల నుండి కానుకలను కోరుకునే పరపతిని, అలాగే కుదురు భూములపై యాజమాన్యాన్ని ప్రతిబింబించే స్థాయిని "క్షత్రియ" అనే పదం నిర్ధారిస్తుంది. క్షాత్ర సిద్ధాంతానికి మూలాధారం రాజ్య (ప్రాదేశిక అధికారం). పట్టాభిషేకం సమయంలో దీనిని నొక్కి చెప్పేవారు. రాజకు ప్రజలపై అధికారం ఉందని ప్రకటించేవారు.

వారసత్వ (కుటుంబ, కుదురు) వ్యవస్థలో ఆర్థిక, రాజకీయ నాయకత్వాన్ని రాజ అనేక విధాలుగా ప్రతిబింబిస్తాడు. భూభాగంపై నియంత్రణను అతడు వనరుల సౌలభ్యంతో సమీకృతం చేశారు. కుదురు సంక్షేమం, నాయకుని భౌతిక సంక్షేమం మధ్య ఉన్న పరస్పర

సంబంధానికి అతడి స్థాయి ప్రతీకగా నిలిచింది. నాయకునిపై తదేక దృష్టి రాజుకు అదనపు లక్షణాలను కట్టబెట్టింది. అందులో దైవాలతో సంబంధం నెలకొల్పడం కనీస లక్షణంగా ఉండేది. రాజును వ్యక్తిగతంగా దైవసంభూతునిగా పరిగణించకపోయినా అతడిని దేవతలే జోక్యం చేసుకొని ఎంపిక చేశారని వివరణలు (పురాణగాథలు) ఇచ్చేవారు. ఫలితంగా రాజు ఒక ప్రత్యేక పురుషునిగా గుర్తింపు పొందేవాడు.

నాయకుల కుటుంబాల చేతిలో అధికారం క్రమంగా కేంద్రీకృతం కావడంతో ఇతర మార్పులు కూడా అనుసరించాయి. అవి అంతిమంగా రాజత్వ ఆవిర్భావానికి దోహదపడ్డాయి. మార్పు దశను గుర్తించడం అంత తేలిక కాదు. అయితే వాటి పోకడలు స్పష్టంగా ఉన్నాయి. ఎంపిక, ఎన్నిక స్థానంలో వారసత్వ హక్కులు వచ్చాయి. ఉదాహరణకు సుదాస్ వంశం. రాజత్వానికి రాచరిక పుట్టుక తప్పనిసరి అని గట్టిగా నొక్కి చెప్పారు. దాంతో కుటుంబ వ్యవస్థలోనే లేదా వంశంలోనే వారసత్వం సురక్షితంగా ఉండిపోయింది. మరో ముఖ్యమైన రాయితీ రాజుకు దండించే అధికారాన్ని కట్టబెట్టడం. శాంతిభద్రతల పరిరక్షణకు రాజుఒక్కడే బాధ్యుడు కావడంతో ఇలాంటి అధికారాన్ని అతడి దఖలు పరచడం అనివార్యమైంది. కాని ఇలాంటి అంశాలను తదుపరి కాలం వరకు ప్రత్యేకంగా ప్రస్తావించలేదు.

రాజత్వ పదవితో దైవానికి బాంధవ్యం ఉందన్న వాదనలు తదుపరి కాలంలో రాజత్వ పరిమాణ క్రమానికి దోహదపడ్డాయి. ఫలితంగా ఆ పదవి కేవలం పాలక వంశాలకే (కుటుంబాలు) పరిమితమైంది.సముదాయ సంక్షేమం నాయకుని భౌతిక సంక్షేమంపై ఆధారపడి ఉందన్న ప్రాచీన సిద్ధాంతాలు ఇప్పుడు కూడా కర్మకాండలు, పూజా పురస్కారాలు, ఆలయ ఉత్సవాల రూపంలో కొనసాగాయి. రాజసూయ, అశ్వమేధ, వాజపేయలాంటి ప్రధాన బలిదాన కర్మకాండలు సంపద వినియోగానికి సుదీర్ఘమైన ఉత్సవాలుగా మారాయి. ఇలాంటి యాగాలలో పాలు, నెయ్యిని పెద్ద పరిమాణంలో నైవేద్యంగా పెట్టేవారు. వివిధ రకాల తిండి గింజలను కానుకగా సమర్పించేవారు. అలాగే పశువుల మందలోని ఉత్తమ జీవాన్ని బలి ఇచ్చేవారు.

కానుకలు అందించే సాంప్రదాయం సామాజిక హోదాను నిర్ధారించేది. ఆధిపత్య స్థానాలలో ఉన్న సముదాయాలు అలా పరస్పరం కానుకలను ఇచ్చిపుచ్చుకునేవి. రాజకు ధార్మిక సేవలు అందించే పురోహితుడు ప్రతిఫలంగా కానుకలను పొందేవాడు. ఇలాంటి ఏర్పాటును "బాధ్యత" అనేవారు. ఒక రకంగా చెప్పాలంటే భౌతికపరమైన విలువ ఉన్న కానుకలు ఏవైనప్పటికీ వాస్తవంగా అవి "రుసుము"ను తలపించేవి. కానుకల ప్రదానం క్షత్రియ–బ్రాహ్మణులకే పరిమితం కాలేదు. ఉదాహరణకు రాజసూయ బలిదానం వద్దకు ఇతర తెగ నాయకులు తమ యజమానికి కానుకలను కప్పంగా సమర్పించేవారు.

**రత్నిన్‌ల స్థాయి, పాత్ర :**

అధికార కేంద్రీకరణ శీర్షభాగం నుండి కింది స్థాయి వరకు గల అధికారులు రాజు వెంబడి వరుసగా కదిలేవారు. ఈ వ్యవస్థలో ప్రాతినిధ్యం అన్ని వర్గాలకు (సూద్రులు మినహా) విస్తరించింది. రత్నిన్‌లతో ఉన్న సంబంధంలో ఇది ప్రతిబింబిస్తుంది. రత్నిన్ అనే పదం సాధారణంగా కోశాగారాన్ని సూచించినా మౌలికంగా అది "కానుక" అనే అర్థాన్నిస్తుంది. ఈ

రత్నిన్‌లలో ప్రధాన పురోహితుడు, రాజన్య పట్ట మహిషి (ప్రధాన రాణి లేదా పట్టపురాణి), సేనాని, సూత, గ్రామణి, క్షత్తర్, సంగ్రహీతర్, భాగదుషు, అక్షవాస ఉన్నారు. ఈ జాబితాలో కొద్దిపాటి మార్పులు ఆయా గ్రంథాలలో కనిపిస్తాయి. కొన్ని గ్రంథాలలో గోవికర్తన అనే హోదా కూడా ఉంది. అతడు కసాయి లేదా వేటకారుడు కావచ్చు.

రాజసూయ యాగం సందర్భంగా రాజపై వ్యక్తుల గృహాలను సందర్శిస్తాడు. ఒక్కో గృహంలో ఒక్కో ప్రత్యేకమైన దైవానికి కానుకలు సమర్పిస్తాడు, ఆరాధిస్తాడు. ఈ దైవం ఆయా రత్నిన్‌లకు సంబంధించినది. వారి కుటుంబాన్ని పరిరక్షిస్తూ వారికి ఆయురారోగ్యాలు, సంతానాన్ని, సంపదను ప్రసాదిస్తుంది. ఈ ప్రక్రియను రత్న-హవింసి అంటారు. రత్నిన్‌లకు రాజు కానుకలను సమర్పించే సాంప్రదాయాన్ని అది ప్రతీకగా నిలుస్తుంది. కానుక సమర్పణ సాంప్రదాయం ప్రబలంగా ఉన్న సమాజంలో ఇలాంటి ఆచారం రత్నిన్‌ల హోదానే కాకుండా రాజ వారిపై ఆధారపడడాన్ని కూడా సూచిస్తుంది. ఈ ఒక్క కారణంగానే రత్నిన్‌లను రాజ రూపకర్తలుగా పరిగణిస్తారు.

ఈ 12 మంది రత్నిన్‌లు విశాల వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తారు. కాని వారు మౌలికంగా కుదురు నిర్వహణా చట్రంలోనే ఉంటారు. వీరి పదవీ కాలం ఎంత వరకు ఉండేదో ఖచ్చితంగా తెలియదు. అందుకు తగిన ఆధారాలు (పన్ను సేకరణ, ప్రత్యేక సాయుధ బలం) లేవు. అయితే ఈ పదవుల నుండే తదుపరి హోదాలు నిర్ధారణ అయ్యాయి. ఈ దశలో రాజ విసమత్తగా ఉండిపోయాడు. ప్రజలను భక్షించే రాజుకు భాగదుషు ఆ కార్యక్రమంలో చేదోడు వాదోడుగా ఉన్నాడు.

ఆ విధంగా రాజు చుట్టూ విభిన్న విధులు నిర్వహించే వ్యక్తులు గుమికూడారు. వారిలో కొందరు రాజు ఆంతరంగికులుగా కూడా వ్యవహరించారు. కాని అధికార యంత్రాంగం మాత్రం ఉండేది కాదు. అధికారాన్ని వికేంద్రీకరించే వ్యవస్థ కూడా లేదు. రత్నిన్‌ల మనుగడ రెండు కీలక పరిణామాలను సూచిస్తుంది. ఒకటి వంశేతర సముదాయ ఆవిర్భావం. వీరు రాజు వందిమాగధులుగా ఎదిగారు. రాజ అధికారాన్ని పెంపొందించారు. రెండవది రాజు, ఇతరుల పరస్పర ప్రయోజనాల సంబంధం ఏర్పడడం. కుల, వంశ నేపథ్యంతో సంబంధం లేకుండా ఇలాంటి ప్రయోజనకర వ్యవస్థ బలంగా నాటుకుపోయింది.

**సమావేశాల స్వభావం, పాత్ర :**

నాయకుని హోదా వివిధ కుదురు సమావేశాలతో అతడికి ఉన్న సంబంధం చుట్టూ పరిభ్రమించేది. గణ, విధాత, సభ, సమితి, పరిషద్‌లు కొన్ని ముఖ్యమైన సమావేశాలు. అందులో కొన్ని సంఘటనలు తదుపరి కాలంలో కూడా మనుగడ సాగించాయి. కాని వాటి విధులలో మాత్రం మార్పులు వచ్చాయి. గణను ఉమ్మడి పూర్వీకుని పేరుతో గుర్తిస్తారు. గోత్ర వ్యవస్థలో కూడా ఇది ప్రతిబింబిస్తుంది. గోత్ర వ్యవస్థలో ఉప సంఘాలు లేదా బృందాలను గణాలుగానే పరిగణిస్తారు. ఎంపిక చేయబడిన సభ్యుల ప్రత్యేక మండలిగా గణ వ్యవహరించి ఉండవచ్చు. సభ్యులకు సమాన హోదా ఉన్నట్లు కనబడుతోంది. వారు ఒక సహచర బృందంగా ఉండి కార్యకలాపాలను నిర్వహించి ఉంటారు. ఉదాహరణకు క్షత్రియ గణాలు ఉండేవి. తెగ

ప్రాంతాలను గణ సంఘాలుగా పిలిచేవారు. ఇవి పశువులను అపహరించే బృందాలుగా అవతరించి ఉంటాయి. ఎందుకంటే వారి నాయకుడు పశువులను అపహరించే ముఠాకు నాయకత్వం వహించేవాడు.

పేరు సూచిస్తున్నట్లుగా విధాత అన్నది కర్మకాండయుత సందర్భాలలో క్రియాశీల పాత్ర పోషించేది. ఈ కర్మకాండల ఆధారంగానే సంపద విభజన, పంపిణీ జరిగేది. యుద్ధ కానుకలే సంపదకు ప్రధాన ఆధారం కాబట్టి విధాత పశు అపహరణలు, వీరోచిత సాహసాలతో ముడిపడి ఉంది. మలివైదిక కాలంలో విధాత పతనం కావడం చూస్తే సంపద పంపిణీ దాని ప్రధాన విధి అని, సంపద సముపార్జనకు ఇతర మార్గాలు అభివృద్ధి చెందడంతో అది నిష్క్రియమై నిరర్ధకంగా మారిందని మనకు తెలుస్తుంది. విధాత అన్నది గ్రామీణుల సభ అని వాదించబడినప్పటికీ దానిని చాలా తీవ్రంగా వ్యతిరేకించారు. కాని రుగ్వేద సమాజంలో విధాతకు కొంత మేర ప్రాముఖ్యత ఉండేది. విధాత గురించి రుగ్వేదంలో తరచు ప్రస్తావించారు. విధాత సంపద పంపిణీకి సందర్భమైతే అప్పుడు గ్రామ సభ కన్నా కుదురు సమావేశంగా అది వ్యవహరించినా సంపద పంపిణీ విధికే అది ప్రాముఖ్యతను ఇచ్చి ఉంటుంది.

సభ అనే పదానికి ఇండో–ఐరోపా సమానార్థాలు కుదురు సమావేశాన్ని సూచిస్తాయి. కనక దాని సభ్యత్వం కొన్ని కుటుంబాలకే పరిమితంగా ఉండేదని మనం భావించాలి. తర్వాతి కాలాలలో సభ సలహామండలిగా మారి రాజుకు సహాయపడింది. సభ, సమితి అనే పదాంశాలు రుగ్వేదంలోని చివరి గ్రంథాలలో, తదుపరి వైదిక సాహిత్యంలో ఎక్కువగా కనిపిస్తాయి. అథర్వవేదలో రెండు పదాలు సమాంతరంగా కనిపిస్తాయి. ఈ సభతో రాజులకు కూడా సంబంధం ఉంది. అంటే రాజన్య కుటుంబాలు కూడా ఈ రకంగా సమావేశమయ్యేవి. ఇలాంటి సమావేశాలలో విస్ల ప్రమేయం తక్కువగా ఉండడాన్ని బట్టి క్షీణిస్తున్న వారి హోదాను అర్థం చేసుకోవాలి. రాజుల ఉపస్థితి ఆధారంగా వారిలో ఒకరిని సభాధ్యక్షునిగా ఎన్నుకునే అవకాశం కూడా ఉండేది. సమితి చాలా వరకు సభ కంటే బహిరంగ సమావేశంగానే ఎక్కువగా వ్యవహరించినట్లు బోధపడుతోంది.

పరిషద్ మరీ తక్కువగా ప్రస్తావించబడింది.దాని సభ్యత్వం చాలా స్వల్పంగా ఉండేదని తెలుస్తోంది. తదుపరి కాలంలో అది నిర్వహించబడిన విధులను ప్రాథమికంగా పరిశీలనలోకి తీసుకుంటే అది ప్రత్యేక సలహాదారుల మండలిగా ఉండినట్లు మనకు అర్థమవుతుంది. అయితే ఆ కాలపు రాజకీయ అవసరాలకు అది అంత ప్రధానమైన సమావేశంగా ఉండేది కాదు. కాలక్రమంలో ఈ సమావేశాలు కొన్ని ప్రాధాన్యతను కోల్పోయాయి. మరోవైపు ఇతర సమావేశాల ప్రాధాన్యత పెరిగింది, వాటి విధులు కూడా మారాయి. వైదిక కాలంలో ఇలాంటి పరిస్థితిని కొనసాగించడానికి వివిధ తెగలు విభిన్న సమావేశ స్వరూపాలను వాడుకున్నాయని చెప్పడానికి తగిన ఆధారాలు లేవు. ఎందుకంటే ఇలాంటి సమావేశాలను తెగలకు అనుగుణంగా ఎక్కడా విభజించలేదు, లేదా వర్గీకరించలేదు. అయితే కొన్ని సమావేశ స్వరూపాలు కొన్ని ప్రత్యేక తెగల పని తీరుకు కీలకంగా ఉండేవన్న వాదనకు కొంత వరకు సార్థకత ఉంది. పై న చర్చించిన ప్రతి సమావేశ స్వరూపం యొక్క నిర్దిష్ట, విస్పష్ట విధులు ఏమిటో ఇంకా స్పష్టం కాలేదు. మారుతున్న సామాజిక వ్యవస్థలో విధుల ఏకీకరణ లేదా బహుళార్థక విధులు కూడా

మారాయి. రాజ (పాలకుని) చేతిలో అధికార కేంద్రీకరణను నిలువరించడం చట్టబద్ధమైన విధి కాదు. అయితే సమాజం నుండి అలాంటి కోరిక లేదా ఆకాంక్ష పుట్టుకొచ్చింది. కొందరి చేతుల్లోనే అధికారం కేంద్రీకృతం కారాదన్న భావన సర్వవ్యాపితమైంది. భూమిపై రాజత్వ హక్కు కుదించుకుపోవడం, ప్రజల సమర్పణలు (కానుకలు) ఎక్కువ కావడంతో సభ లాంటి వంశ–కుదురు సమావేశాలు అధికార కేంద్రీకరణకు వాహనాలుగా మారాయి. బహిరంగ సమావేశాలు మరింతగా తరిగిపోయాయి. అంత వరకు సమావేశాలు నిర్ధారించిన తెగ నాయకత్వం ఇప్పుడు వారసత్వ లేదా అనువంశిక ఎంపికకు క్రమంగా దారి తీసింది. పురోహితుడు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించి రాజ్యాభిషేకం చేయించడం మొదలుపెట్టాడు. పై సమావేశాలు లేదా సభల స్వభావం అవి విభజిత సమాజాలతో ముడిపడి ఉన్నాయని, సమసమాజ కుదురులతో కాదని సూచిస్తుంది.

**అనువంశిక వ్యవస్థ నుండి రాజ్యం వైపు పరివర్తనం :**

పశ్చిమ గంగా లోయలో అభివృద్ధి చెందే కొద్దీ అనువంశిక వ్యవస్థ రాజ్య అవతరణను నిరోధించే పరిస్థితిని సృష్టించింది. రాజ్య వ్యవస్థను అధిగమించలేదు. కాని అనువంశిక వ్యవస్థ రాజ్యంగా అభివృద్ధి చెందలేకపోయింది. కొన్ని పోకడలు రాజ్య అవతరణ వైపు వేలెత్తి చూపాయి. కాని మరికొన్ని అడ్డంకిగా తయారయ్యాయి. భూభాగం (ప్రాదేశిక ప్రాంతం)పై అవగాహన ఉండేది. ఒక ప్రాంతంలో ప్రజలు గుర్తింపు పొందే వారు. ప్రాదేశిక భూభాగాన్ని తెగ నాయకుడు ఆర్థిక వనరులు, ఆర్థిక ఉత్పత్తి, పంపిణీలతో ఏకీకృతం చేయాల్సిన అవసరం ఉండేది. ఈ పాత్ర కారణంగానే అతడు అందరి దృష్టిని ఆకర్షించగలిగాడు. వ్యవసాయ విస్తరణ జనాభా పెరుగుదలతో ఆర్థిక వనరులు తగిన మోతాదులో అందుబాటులోకి వచ్చాయి. అయితే వనరులు పెరిగినా అవి రాజ్య వ్యవస్థను నెలకొల్పడానికి సరిపడా మోతాదులో లేవు. రాజ చేతిలో అధికారాలు కేంద్రీకృతం కావడంతో అతడి హోదా సమర్థవంతమైన నియంత్రణ పెరిగాయి. అదే సమయంలో దిగువ శ్రేణి తెగ నాయకులు రాజు నియమించిన వ్యక్తులు కాదు. వారు తమ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను చాటుకున్నారు. అధికార పంపిణీ నామమాత్రంగా ఉండేది.

ఘనమైన వేడుకలను నిర్వహించడానికి బహుళ సాధనాలు ఉండేవి. రాజు, తంత్రి పవిత్ర అధికారాన్ని ప్రజల కానుకలు నిలబెట్టాయి. కాని ఆదాయాన్ని వసూలు చేయడానికి క్రమబద్ధ వ్యవస్థ ఉండేది కాదు. రాజ్య సంస్థలను నిర్వహించడానికి ఆదాయ వనరులు పెద్దగా ఉండేవి కావు. ప్రతిష్టాత్మకమైన వేడుకలు (కర్మకాండలు) నిర్వహించడానికే ఉన్న నిధులు కరిగిపోయేవి. వివిధ కారణాల వల్ల ఆనువంశిక వ్యవస్థ కొనసాగిందని చెప్పవచ్చు. విభిన్న సాంస్కృతిక, జాతి వర్గాలను సమీకరించడానికి అనువంశిక వ్యవస్థ విజయవంతమైన నిర్మాణ స్వరూపంగా ఉండేది. ఈ వ్యవస్థలో ప్రతి వర్గం తన ఉనికిని నిలుపుకుంది. చంద్రవంశ క్షత్రియుల విస్తారమైన అనువంశిక వ్యవస్థ కొనసాగడానికి ఇలాంటి నిర్మాణమే కారణమై ఉండవచ్చు. వీరుపాలించిన భూభాగం ఉత్తర, పశ్చిమ, మధ్య భారతదేశమంతటా విస్తరించి ఉండేది.

భూమి విస్తారంగా అందుబాటులో ఉన్న ప్రాంతాలలో ఈ వ్యవస్థ పునరుత్పత్తి ద్వారా విస్తరించేది. మార్పునకు లోను కాకుండా, మరిన్ని వనరులను సమీకరించాల్సిన అవసరం లేకుండా ఈ విస్తరణ జరిగేది. అలాగే పెరుగుతున్న జనాభా ఒత్తిడిని కూడా పరిగణనలోకి తీసుకోకుండా ఈ వ్యవస్థ పరిఢవిల్లింది. మరోవైపు వ్యవసాయ భూమి భారీ సహకార సంఘటనం అవసరం లేకుండానే అందుబాటులోకి వచ్చినప్పుడు వ్యవసాయాన్ని బలమైన సంచార జాతి ఆధారంతో చేపట్టేవారు. ఆ విధంగా అనువంశిక వర్గాలకు సమీకృతం చేసే విధిని నిర్వహించింది. రాజ్యానికి తలొగ్గే పరిస్థితిని నివారించింది. ఇలాంటి పరిస్థితులకు పశ్చిమ గంగాలోయ అనుకూలంగా ఉండడంతో మధ్యగంగా లోయ వలే భారీ మార్పులు తీసుకు రావలసిన అవసరం ఏర్పడలేదు.

ఇనుము వాడకం వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రభావితం చేయలేదని తెలుస్తోంది. ఇలాంటి పరిస్థితి క్రీ.పూ. తొలి సహస్రాబ్ది మధ్య వరకు కొనసాగింది. ద్వినది ప్రాంతంలో అడవులను తగులబెట్టడం ద్వారా వ్యవసాయానికి భూమిని సిద్ధం చేశారు. ఖాండవ–వనలో దీని గురించి ప్రస్తావన ఉంది. ఇంద్రప్రస్థను ఏర్పరచడానికి అడవులను దహనం చేసినట్లు ఆ గ్రంథంలో వివరించారు. మధ్యగంగా లోయలోని తేమ ప్రాంతాలు, వర్షాధార అడవులను తొలగించడానికి ఇనుము సాంకేతిక పరిజ్ఞానం పెద్ద అవసరంగా మారింది. పశ్చిమ గంగా లోయలో వనరులు తగిన మోతాదులో లేవు. ఫలితంగా రాజ్య స్థాపనకు అవసరమైన సంస్థలను ఏర్పాటు చేయలేకపోయారు. అలాగే నిధులను అలాంటి సంస్థలను ఏర్పాటు చేసే దిశగా వెచ్చించలేకపోయారు.

బూడిద రంగు మట్టి పాత్రల సంస్కృతి నుండి లభించిన పురావస్తు సాక్ష్యాధారాలను బట్టి ఈ సముదాయాల పరిమాణాన్ని నిర్ధారించవచ్చు. తదుపరి కాలంలో కంటే ఈ నివాస ప్రాంతాల వైశాల్యం తక్కువగా ఉంది. ఈ సంస్కృతి తర్వాత ఉత్తర నలుపురంగు మట్టి పాత్రల సంస్కృతి ఆవిర్భావంలోకి వచ్చింది. రాజకీయ నియంత్రణ ఉన్న ప్రాంతంగానే భూభాగాన్ని పరిగణించలేదు. ఎందుకంటే వివాహ సంబంధాల కారణంగా ప్రాదేశిక ప్రాంతాల విస్తరణలో భారీ మార్పులు వచ్చేవి. ముఖ్యంగా క్షత్రియ కులం విషయంలో ఇలాంటి మార్పులు చోటు చేసుకునేవి. అనువంశిక వ్యవస్థలాగే వర్ణ వ్యవస్థ కూడా ఏకీకరణకు ఒక సాధనంగా ఉండేది. కాని అది వర్గీకృత సమాజాన్ని ప్రతిబింబించేది.

కురు–పాంచాల ప్రాంతంలో అనుభవాన్ని బట్టి (వైదిక సాహిత్యం, పురావస్తు ఆధారాల మేరకు) అనువంశిక నియంత్రణ ఉన్న కార్యనిర్వాహక వ్యవస్థలో విభిన్న వర్గాలు, జాతులను కలుపుకొనిపోవడానికి తగిన మార్గాలు లేదా పద్ధతులు అభివృద్ధి చెందాయని పేర్కొనవచ్చు. వైదిక సాహిత్యంలో కనిపించే చిన్నపాటి పాలకుల జాబితా, చంద్రవంశ కుటుంబాల విచ్ఛిన్నం వలస వైపు వేలెత్తి చూపుతాయి. అంటే సమాజంలో ఉద్రిక్తతను తొలగించడానికి వలసలు ఒక సాధనంగా ఉపయోగపడ్డాయి. రాజ్యం ద్వారా నియంత్రణకు ఒక వ్యవస్థను ఏర్పాటు చేయవలసిన అవసరాన్ని ఈ వలసలు చాలా వరకు నివారించాయి.

తూర్పు దిశలో మధ్య గంగాలోయవైపు వలస విభిన్న నైసర్గిక (పరిసర) దృశ్యాన్ని అందిస్తుంది. ఇందులో అనువంశిక వ్యవస్థ, గృహపతి పాత్ర మార్పునకు లోనయ్యాయి.

వ్యాపారం ఒక నూతన కారకంగా వెలుగులోకి రావడంతో ప్రత్యేకంగా ఇలాంటి మార్పులు వచ్చాయి. ఈ కొత్త పరిస్థితిలో క్షత్రియ కులం మరింత అధికారానికి, కానుకలకు వలవేసింది. కానుకలు పన్నులుగా రూపాంతరం చెందాయి. కనుక మధ్య గంగాలోయలో మారిన పరిస్థితులలో సంపూర్ణ రాజ్యం అవతరించింది.

## మౌర్యపూర్వకాలం

### రాజ్య అవతరణకు ఉన్న సామాజిక - ఆర్థిక నేపథ్యం :

'సతపత బ్రాహ్మణ" సరస్వతి నుండి సదానీర (గండక్) నదికి (ఇవి మధ్య గంగా లోయలో ప్రవహిస్తాయి) విదేఘ మాధవ వలస పోవడాన్ని వివరిస్తుంది. నదికి అవతల ఉన్న భూమి వ్యవసాయానికి దూరంగా గడ్డితో దట్టంగా ఉందని అందులో ప్రస్తావించబడింది. అగ్ని నదిని దాటిన తర్వాత ఆ భూమి నివాసానికి అనుకూలంగా మారిందని, ఫలితంగా అది కోసల, విదేహ మధ్య సరిహద్దుగా అవతరించిందని పేర్కొనబడింది. కోసల పాలకులు, విదేహ పాలకులిద్దరూ మాధవ వారసులేనని వివరించబడింది. రెండు వేర్వేరు మార్గాలలో ప్రజలు మధ్యగంగా లోయలో ప్రవేశించి వలస ప్రాంతాలను ఏర్పాటు చేయడంతో ఈ ప్రాంతం చారిత్రక దృష్టిని ఆకర్షించింది. ఉత్తర మార్గం హిమాలయ పర్వత అంచుల గుండా వెళుతుంది. విదేఘ మాధవ ఈ మార్గం గుండా మధ్య గంగా లోయకు వలస వచ్చినట్లు కనబడుతోంది. రెండవ మార్గం యమున దక్షిణ తీరం, వింధ్య పర్వత బాహ్య ప్రాంతంలోని గంగానది గుండా వెళుతుంది.

మధ్యగంగా లోయ గురించి వైదిక సాహిత్యం చాలా తక్కువగా పేర్కొన్న ఈ ప్రాంతంలో జరిగిన సంఘటనలకు ఆధారం చాలా వరకు బౌద్ధ సాహిత్యం నుండి లభిస్తుంది. కొన్ని తులనాత్మక గణాంకాలు, ముఖ్యంగా గణ-సంఘ పనితీరుపై, పానిని రచించిన అష్టధ్యాయిలో లభిస్తాయి. బౌద్ధ గ్రంధాలు చేసిన వ్యాఖ్యానాలను అష్టధ్యాయి తరచూ నిర్ధారిస్తుంది. అయితే ఉత్తర భారతదేశంలోని వివిధ ప్రాంతాలలో ఉన్న గణ-సంఘాల గురించే పానిని ఎక్కువగా ప్రస్తావించాడు. మధ్యగంగా లోయలో అలాంటి సంఘాల పని తీరును అంత ప్రత్యేకంగా వివరించలేదు.

బౌద్ధ, వైదిక కృతులలో వివరించబడ్డ గణ-సంఘ స్వరూపాల మధ్య స్పష్టమైన తేడా ఉంది. పానిని ప్రస్తావించిన గణ సంఘాలు ఉత్తర, పశ్చిమ భారతదేశ భూభాగాలు, ముఖ్యంగా మద్రా, అంధక-వృషిణి, క్షుద్రక, మాలవలో విస్తరించి ఉన్నాయి. రాజ్యం అవతరించక ముందు అవి తెగ నాయకత్వాలుగా కొనసాగి ఉండవచ్చు. అయితే మధ్య గంగాలోయలోని గణసంఘాలు, ముఖ్యంగా వృజ్జీలు, రాజ్యానికి సంబంధించిన మౌలిక లక్షణాలను ప్రాథమిక రూపంలో కలిగి ఉండేవి. తర్వాత గణ సంఘాలలో సక్య, కొలియ, మల్లా లాంటి ఏక వంశ కుటుంబాలు కనిపిస్తాయి. ఇవి హిమాలయ తిరాయి ప్రాంతంలో విస్తరించి ఉండేవి. మరికొన్ని కుదురు సమాఖ్యలుగా ఉండేవి. వజ్జీలు, లిచ్ఛావీలు ఈ కోవకిందకి వస్తారు. వజ్జీ సమాఖ్య వైశాలి కేంద్రంగా ఏర్పడింది. ఇదే ప్రధాన రాజకీయ శక్తి. మగధ సామ్రాజ్య విస్తరణను అది

వ్యతిరేకించింది. కోసల, మగధలలో తొలి రాచరిక వ్యవస్థలు సంపూర్ణ హంగులతో ఏర్పడ్డాయి. అయితే గాంధార, కాశి, వత్స లాంటి ప్రాంతాలు కూడా రాచరిక వ్యవస్థ ఆవిర్భావ లక్షణాలను చాటుకున్నాయి.

నవీన రాతియుగ నివాస ప్రాంతాలు ఎరుపు–నలుపు మట్టి పాత్ర సంస్కృతి ప్రజల రాకకు పూర్వం ఉన్న జనాభా గురించి ఆధారాలు అందిస్తాయి. ఈ ప్రజలు బహుశా దక్షిణ మార్గం గుండా పశ్చిమ, మధ్య భారతదేశం నుండి వలస వచ్చి ఉంటారు. బూడిద రంగు మట్టి పాత్రలు కోసలలో అంతర్భాగమైన శ్రావస్తి (తూర్పు యుపిలోని సాహేత్, మాహేత్) వద్ద లభించాయి. ఉత్తర మార్గం ద్వారా పశ్చిమ గంగాలోయతో, అలాగే కౌశాంబి, గంగా – యమున సంగమంతో మధ్య గంగా లోయతో సంబంధాలుండేవని ఈ మట్టి పాత్రల అవశేషాలు సూచిస్తాయి. అంటే వింధ్య పర్వత శివార్ల గుండా ప్రజలు స్థిరపడ్డారని ఈ ఆధారాలు స్పష్టం చేస్తాయి.

పట్టణీకరణకు ముందు ఉన్న ప్రధాన సంస్కృతి ఎరుపు–నలుపు రంగు మట్టి పాత్రల సంస్కృతి. ఈ సంస్కృతి క్షేత్రాలు దక్షిణ మార్గం గుండా వలస వచ్చినట్లు కనబడుతోంది. తర్వాత ఉత్తర దిశగా మధ్యగంగా లోయకు విస్తరించాయి. నది తీరాల వెంబడి అవి ఏర్పడ్డాయి. అలాగే నదీ సంగమ ప్రాంతాలలో కూడా తరచుగా ఏర్పడ్డాయి. సంగమ ప్రాంతాలలో వ్యవసాయానికి సాగునీరు పుష్కలంగా లభించేది. మట్టి కుండలు ప్రాథమిక స్వరూపం నుండి ఉన్నత స్థాయి వరకు ఉన్నాయి. వాటిని నలుపు–ఎరుపు రంగుపింగాణీ పాత్రలతో సంబంధం కలిపితే అపుడు వాటి ఆవాస కేంద్రాలు పశ్చిమ భారతదేశంలో అన్వేషించవచ్చు. తర్వాత తూర్పు దిశగా యమునా నదికి దక్షిణాన ఉన్న ప్రాంతానికి, మధ్య భారతదేశానికి అవి విస్తరించాయి. మధ్య గంగా లోయలో అవి తర్వాతి కాలంలో స్థిరపడి ఉండవచ్చు. అంటే క్రీ.శ. తొలి సహస్రాబ్ది మొదటి భాగంలో ఈ సాంస్కృతిక కేంద్రాలు మధ్య గంగాలోయలో ఏర్పడి ఉంటాయి. జనాభా పెరుగుదలను బట్టి ఈ కాలంలో పట్టణీకరణకు పూర్వపు నిర్ధారిత పరిస్థితి ఉండేదని చెప్పవచ్చు. చివరి దశలలో ఇనుము సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన వచ్చిందని పురావస్తు ఫలకాలు నిరూపిస్తాయి. వరిని చాలా ముందుగా సాగు చేశారనడానికి తగిన ఆధారాలు అందుబాటులో ఉన్నాయి.

ఉత్తర నలుపు రంగు మట్టి పాత్రలు (క్రీ.పూ. ఆరవ శతాబ్దానికి చెందినవి) గుణాత్మక మార్పును కలిగి ఉన్నాయి. వారణాసి, పాట్నాల మధ్య గంగా నదికి ఇరువైపులా ఇలాంటి పురావస్తు క్షేత్రాలు ఉన్నాయి. ఈ ప్రాంతంలోనే తదుపరి నలుపు–ఎరుపు రంగు పింగాణీ పాత్రల సంస్కృతి కేంద్రీకృతమై ఉంది. ఉత్తర నలుపురంగు మట్టికుండలు సంకీర్ణ, ఉన్నత సంస్కృతికి అద్దం పడతాయి. పట్టణ జీవనానికి సంబంధించిన కొన్ని లక్షణాలను అవి ప్రదర్శిస్తాయి. సాహిత్య ఆధారాల నుండి ఈ ముఖ్యమైన క్షేత్రాలు పట్టణ కేంద్రాలని మనం తెలుసుకోవచ్చు. ఇంకా సమగ్రంగా తవ్వకాలు జరిపిన తర్వాతే పట్టణీకరణవైపు జరిగిన ప్రగతిని మనం పురావస్తు ఆధారాలతో నిర్ధారించుకోవచ్చు.

మధ్యగంగాలోయ వలసదారులకు కొత్త వాతావరణ పరిస్థితిని ఒక మోస్తరుగా తలపించింది. వారు బూడిదరంగు మట్టి పాత్రల సంస్కృతి ప్రజలు కావచ్చు లేదా నలుపు–ఎరుపు

రంగు మట్టి పాత్రల సంస్కృతి ప్రజలు కావచ్చు. ముఖ్యంగా వరి సాగు ప్రధాన వ్యవసాయ కార్యక్రమంగా మారడంతో ఇలాంటి కొత్త పరిసరాలు వలసదారులను ఆహ్వానించాయి. గోధుమ కంటే వరి పంట ఎక్కువ దిగుబడిని అందించడంతో వరి సాగు అసంఖ్యాక ప్రజలను పోషించి ఉంటుంది. ఉత్తర నలుపు రంగు మట్టిపాత్రల సాంస్కృతిక కాలంలో జనాభా పెరుగుదల (జనసాంద్రత తీవ్రం కావడం) వల్ల నివాస ప్రాంతాల వైశాల్యం కూడా పెరిగింది. కొత్త ప్రాంతాలు అనేకం ఏర్పడ్డాయి. కనక ఇలాంటి పరిస్థితిలో పెరుగుతున్న జనాభాను పోషించడానికి అధిక దిగుబడులు సాధించాల్సిన అవసరం ఉండేది.

భూమి, శ్రమ, సాగునీరు అందుబాటులో ఉన్న చోట అదనపు దిగుబడిని సాధించే అవకాశం ఉండేది. అదనపు నిల్వలు భారీ జనాభాను పోషించగలవు లేదా వర్గీకరణకు అవసరమైన సామాజిక ఆధారాన్ని తీవ్రతరం చేయగలవు. దాస-కర్మకారుల గురించి, రాజ-కులాల పంట పొలాల గురించి సాహిత్యంలో ప్రస్తావనలు ఉన్నాయి. సమాజంలోని వివిధ వర్గాల మధ్య ఆర్థిక అసమానతలు ఉన్నట్లు ఆధారాలున్నాయి. రాజ-కులాల యాజమాన్యంలో పని చేసిన దాస-కర్మకారుల ద్వంద్వ విభజన (గృహపతుల ప్రస్తావన లేకుండా) గణ-సంఘాలలో వ్యక్తిగత యాజమాన్యానికి పూర్వ స్థితిని సూచిస్తుంది. గహపతుల గురించి గణ-సంఘాలపై వెలువడిన సాహిత్య కృతులలో అప్పుడప్పుడు ప్రస్తావించారు. అయితే వ్యవసాయదారులుగా వారిని చాలా అరుదుగా గుర్తించారు. మధ్యగంగా లోయలోని రాచరికాలలో గృహపతులు మరింత స్పష్టంగా వెలుగులోకి వస్తారు.

అదనపు నిల్వలు రాజ్య ఆవిర్భావం దిశగా గొలుసు చర్యను ప్రారంభించాయని వాదించడం మార్పును చాలా యాంత్రికంగా అన్వయించినట్లు అవుతుంది. అదనపు నిల్వలున్నవి ఒక ఘటన కాదు, అదో ప్రక్రియ. కనక నియంత్రణ స్వరూపం ఇక్కడ అదనపు నిల్వల సమీకరణకు చాలా ముఖ్యమని చెబుతారు. దానిని అమలు జరిపిన దిశ కూడా ముఖ్యమైనది.

**రాజ్య అవతరణ క్రమం, స్వభావం :**

రాజ్య అవతరణ క్రమంలో పశ్చిమ గంగాలోయలో కనిపించే వైరుధ్యం కేవలం ఒక సూచికే కాదు. మధ్య గంగాలోయలో గణ-సంఘ తెగ ప్రాంతాలు, రాజ్యాల మధ్య వ్యత్యాసాలు కూడా కనిపిస్తాయి. రెండు ప్రాంతాలల్లోనూ పూర్వపు స్థితులు ఒకేలా ఉన్నా రాజ్య వ్యవస్థ రాచరిక స్వరూపం ఆధ్వర్యంలోనే మరింత స్పష్టంగా అవతరించింది. గణ-సంఘాలు, రాచరికాల మధ్య తులనాత్మక అధ్యయనం రాజ్య ఆవిర్భావానికి దారి తీసిన కీలక లక్షణాలను సూచించడానికి ఉపయోగపడగలదు. ఈ లక్షణాలు ఆర్థిక వనరుల నియంత్రణ, రాజకీయ అధికార స్వరూపంతో ముడిపడి ఉన్నట్లు బోధపడుతుంది.

మధ్యగంగాలోయలో రాజకీయ వ్యవస్థ సరిసమానంగా ఉండేది కాదు. ఎందుకంటే కొన్ని జనపదాలు రాజులను సమర్థిస్తే మిగతావి గణ-సంఘ వ్యవస్థను అంటిపెట్టుకున్నాయి. కొన్ని సందర్భాలలో రాజత్వం స్థానంలో గణ-సంఘ వ్యవస్థను పునఃప్రవేశపెట్టారు. దీనిని బట్టి రాజత్వ సిద్ధాంతం ఎంత బలహీనంగా ఉండేదో అర్థమవుతుంది. అలాగే "రాజ" అనే పదాన్ని తప్పుగా లేదా వేరుగా అన్వయించినట్లు బోధపడుతుంది. రాజ వాస్తవికంగా ఒక తెగ

నాయకుడు. అయితే అతడిని ఆధునిక చరిత్రకారులు, విద్వాంసులు రాజు (పాలకుడు)గా భావించారు.

గణ–సంఘ వ్యవస్థను ఆధునిక చరిత్రకారులు విభిన్న రాజకీయ వ్యవస్థలుగా అభివర్ణించారు. కొందరు వాటిని గణరాజ్యాలుగా పేర్కొంటే మరికొందరు సామంత వ్యవస్థగా చిత్రీకరించారు. అయితే వాటిని నిర్దిష్టంగా దొరతనాలు లేదా తెగనాయక ప్రాంతాలుగా వివరించవచ్చు. ఇక్కడ పాలక కుదుర్లను క్షత్రియేతరులకు భిన్నంగా వర్గీకరించారు. పాలక కుదురు సభ్యులను రాజాలు, రాజ కులాలు లేదా అభిషిక్త క్షత్రియులుగా కూడా పిలిచారు. ఆ విధంగా మల్లాలకు 500 రాజాలు, వజ్జీ సమాఖ్యకు 7,707 రాజులు, చేదీలకు 60,000 మంది రాజులు ఉన్నారు. ప్రతి కుటుంబానికి ఒక పెద్ద లేదా రాజు ఉండేవాడు. సంఘాలలో రాజ అనే హోదా ఉన్న వారు అధిక సంఖ్యలో ఉండేవారు. రాజకులాల లోపల హోదా సమానంగా ఉండేది. అయితే వృద్ధ, యువ తరాల మధ్య తేడాలను గుర్తించేవారు. ఓటింగ్ ద్వారా నిర్ణయాలు తీసుకునేవారు. గణ–సంఘాలను పుగ, వ్రత, శ్రేణిలుగా వర్గీకరించారు.

దొర ప్రాంతాలు కేంద్ర నాయకత్వాన్ని కలిగి ఉన్నాయి. జన(పుట్టుక) ఆధారంగా నాయకత్వానికి చట్టబద్ధత లభించేది. కనక పాలక వంశ చరిత్రలు గణనీయమైన ప్రాముఖ్యతను కలిగి ఉన్నాయి. పూర్వీకులు కీలకంగా మారుతారు. పాలకులు, పాలితుల మధ్య తేడా తొలుత అధికారం అందుబాటులో ఉన్న అనువంశిక బృందాలు, అధికారం నుండి మినహాయించబడిన కుదురేతర వర్గాలుగా ఉండేది. కుదురేత వర్గాలు సాధారణంగా శ్రమశక్తిని అందించేవి. ఈ వర్గాలలో స్థానిక ప్రజలు ఉండే అవకాశం ఉంది. వారిని పాలక వంశాలు జయించి ఉండవచ్చు. బందీలుగా లేదా కార్మిక బృందాలుగా (బయటి ప్రాంతం నుండి తీసుకు వచ్చిన) వ్యవహరించి ఉండవచ్చు. పాలక కుదుర్లు ఆక్రమిత ప్రాంతాలలో స్థిరపడి ఉంటారు. కేవలం పాలక క్షత్రియ వంశానికి చెందిన వారసులనే “జన”గా పరిగణించేవారు. కాని దాస–భృతక (బానిసలు, వేతన కార్మికులు) వర్గానికి ఆ పదాన్ని వర్తింపచేసేవారు కాదు.

తెగ నాయకునికి అనుచర వర్గం ఉండేది. అందులో కుటుంబానికి చెందిన యువ సభ్యులు ఎక్కువగా ఉండేవారు. ప్రాథమిక లేదా మౌలిక పాలనా విధులను వీరు నిర్వహించేవారు. లిచ్ఛవీల పరిపాలనా యంత్రాంగం అత్యంత ప్రాథమికమైనది. వైశాలిలో కనీసం 7,707 మంది రాజాలు నివాసముండేవారని చెబుతారు. వజ్జీలు సమాఖ్యకు వైశాలి రాజధానిగా ఉండేది. రాజ కుల కుటుంబాలకు చెందిన ఈ పెద్దలు వజ్జీ శాసనమండలిలో కూర్చోవడానికి అర్హులు. సంధగార అనే సమావేశ మందిరంలో వీరు తరచూ గుమిగూడి విషయాలను చర్చించేవారు. రాజాల సంఖ్య కొద్దిగా అతిశయమే అయినప్పటికీ ఈ శాసనమండలి ఎంతైనా విశాల ప్రాతినిధ్యం కలది. ఎందుకంటే ఎనిమిది కుదురులతో కూడిన సమాఖ్య అది.

శాసనమండలి సభ్యులు తమలో ఒకరిని అధ్యక్షునిగా ఎన్నుకునేవారు. గణ – రాజ లేదా రాజ ప్రముఖులకు సహాయకారిగా ఒక ఉపరాజ ఉండేవాడు. గణ లోపలే శ్రేణులు ఉండేవి. వాటి ఆధారంగా సభ్యత్వాన్ని క్రమబద్ధంగా నిర్ధారించేవారు. మండలి సమావేశం కావడానికి సభ్యులు తగిన సంఖ్యలో హాజరు కావలసి ఉంటుంది (కోరమ్). పరోక్ష ఓటింగ్‌ను అనుమతించే వారు. గణ ఎదుట తీర్మానాన్ని ప్రవేశపెట్టి చర్చించేవారు. తీర్మానాన్ని మూడుసార్లు

చదివి వినిపించిన తర్వాత ఓటింగ్ కోసం సభ్యుల ముందు ఉంచేవారు. తదుపరి కాలపు వ్యాఖ్యానాలు విస్తృతమైన న్యాయ ప్రక్రియను ప్రస్తావిస్తాయి. ఈ ప్రక్రియ వాస్తవ రూపంలో అమల్లో లేకపోయినా కనీసం సిద్ధాంతపరంగానైనా ప్రజల భావనలో మెదిలేది. న్యాయ ప్రక్రియలో ఒక వ్యాజ్యం ఆరు స్థాయిలలో చర్చించడానికి అవకాశం ఉండేది. సర్వోన్నత తీర్పుకోసం వ్యాజ్యం శాసనమండలి అధ్యక్షుని ఎదుటకు వచ్చేది. అధ్యక్షునిదే అంతిమ తీర్పుగా ఉండేది.

సేనాపతి, భండగారిక లాంటి అధికారుల ప్రస్తావన కూడా ఉంది. వీరు గణకు బాధ్యత వహించేవారు. వీధులలో వారి ప్రావీణ్యం అలా బయట పడుతుంది. సైనిక, ఆర్థిక అవసరాలకు అనుగుణంగా వారి విధులు నిర్ధారించబడేవి.

అయితే సుశిక్షిత సైన్యం గురించి ఎలాంటి ప్రస్తావన లేదు. వజ్జీ పాలకులు సైనికపరంగా శక్తిమంతులని పేర్కొన్నా వారికి క్రమబద్ధ సైన్యం ఒకటుంటూ ఉండేదని చెప్పడానికి ఎలాంటి ఆధారాలు లేవు. అలాగే పన్నుల సేకరణ క్రమబద్ధంగా జరిగినట్లు లేదా పన్నులను ఆయా పరిస్థితులకు అనుగుణంగా అంచనా వేసినట్లు కూడా ఎక్కడా ప్రస్తావించలేదు. పాలక కుటుంబాలు లేదా కుదుర్లు వ్యవసాయ భూమిని ఉమ్మడిగా కలిగి ఉన్నట్లు భావించినా వ్యవసాయ లేదా భూమి శిస్తులు చెల్లించాల్సిన అవసరమే ఏర్పడదు. భోజకాలు, అమాత్యాల గురించి కొన్ని వ్యాఖ్యానాలు ఉన్నాయి. వాటిని బట్టి అధికార నియంత్రణను కొంత మేరకు వికేంద్రీకరించారని మనం ఊహించాల్సి ఉంటుంది. ఇలాంటి పదవులు క్షత్రియ రాజ కులాల చేతుల్లో ఉండేవనడంలో ఎలాంటి సందేహం లేదు.

గంగాలోయలోని గణ సంఘాలలో అధికారంతోపాటు అవసరమైన సంపద కూడా పాలక కుటుంబం ఆధీనంలో ఉండేది. అయితే పన్నుల సేకరణ బాధ్యతను నిర్వహించడానికి ఒక ఉన్నత అధికార వ్యవస్థ ఉండేది కాదు. అలాంటి వ్యవస్థ ఉండడం రాజ్య ఆవిర్భావానికి కీలకమని పరిగణించాల్సి ఉంటుంది. నిర్దిష్టమైన అంశాలతో రాజ్యం, రాజ్యేతర సమాజం మధ్య వ్యత్యాసం చూపనపుడు, నిరంతర ప్రక్రియగా వాటిని నిర్ధారించినచోట వజ్జీల గణ-సంఘ వ్యవస్థ అలాంటి నిరంతరతకు కీలకమై ఉండవచ్చు. ఈ పరిస్థితి రాజ్య ఏర్పాటుకు చాలా దగ్గరలో ఉండేది. ఉదాహరణకు పశ్చిమ భారతదేశంలో వృషణీల గణ-సంఘ వ్యవస్థ.

## మౌర్యయుగం

### మౌర్య రాజ్య స్వభావం :

చాలా కాలం పాటు మౌర్య రాజ్యాన్ని దాదాపు సంక్షేమ రాజ్యంగానే పరిగణించారు. ఎందుకంటే ఆ రాజ్యం తనను తాను ప్రజల సంరక్షకర్తగా భావించి విభిన్న వర్గాల పరస్పర విరుద్ధమైన ప్రయోజనాలను సామరస్యపూర్వకంగా కాపాడడానికి ప్రయత్నించిందని భావిస్తారు. యజమాని - కార్మికుల సంబంధాల నియంత్రణ, వినియోగదారుని సంరక్షణ, వ్యాపారులకు ప్రోత్సాహం, వ్యవసాయదారునికి సహాయం, అనాథలు, వికలాంగుల సంక్షేమం, ప్రజారోగ్యంపై శ్రద్ధ, అంటువ్యాధులను నివారించడానికి చర్యలు, చివరగా పాలితుల మానసిక, నైతిక సంక్షేమం... ఇవన్నీ రాజ్య విధుల పరిధిలోకి వచ్చాయి. మౌర్య అధికార యంత్రాంగం

ప్రాముఖ్యత ఒక నూతన ప్రభుత్వ స్వరూపాన్ని నిర్మించడంలోనే ఉందని అందరూ భావిస్తారు. ఈ ప్రభుత్వం తీవ్రస్థాయిలో కేంద్రీకృతమై ఉండేది. భారతీయులు సామ్రాజ్య ప్రభుత్వాన్ని విజయవంతంగా ప్రయోగించడం ఇదే తొలిసారి. మౌర్య అధికార సంఘటనం మొగల్, ఆంగ్లేయులకు కూడా తన వారసత్వాన్ని వదలి వెళ్లింది.

అయితే ఇటీవలి కాలంలో అశోకుని శిలాశాసనాల అధ్యయనంలో వచ్చిన ప్రగతి మౌర్య రాజ్య స్వభావాన్ని తాజాగా విశ్లేషించడంలో చరిత్రకారునికి కీలక ఆధారంగా నిలిచింది. మౌలికంగా అర్థశాస్త్ర ఆధారంగా అంచనా వేసిన మౌర్య రాజ్య ఏకీకృత రాజకీయ–పాలనా సంఘటనం ఇటీవలి కాలంలో ముఖ్యమైన మార్పులకు లోనైంది. ఇప్పుడు మౌర్య సామ్రాజ్యాన్ని మూడు అధికార నిర్మాణ స్వరూపాలు ఉన్న పాలనా వ్యవస్థగా పరిగణిస్తున్నారు. మొదటిది మగధ చుట్టూ ఉన్న రాజధాని ప్రాంతం. రెండవది పూర్వపు మహాజనపదలు గల మూల ప్రాంతం, చివరిది సరిహద్దు ప్రాంతాలు.

ఈ విభిన్న భూభాగాలలో సంభవించిన సామాజిక–ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక పరిణామాల మధ్య అసమానతలు, వైరుధ్యాలు ఉండేవన్న విషయాన్ని ఇప్పుడు గమనంలోకి తీసుకున్నారు. మౌర్య సామ్రాజ్యాన్ని ప్రాచీన సంక్షేమ రాజ్యంగా ప్రతిపాదించిన చిత్రాన్ని నేడు ప్రశ్నిస్తున్నారు. ఎందుకంటే దక్కను ప్రాంతాన్ని మౌర్యులు సుదీర్ఘ కాలం తమ ఆధీనంలో ఉంచుకున్నప్పటికీ అక్కడి భౌతిక పరిస్థితులలో నామమాత్రపు మార్పులు కూడా నమోదు కాలేదు. వాస్తవానికి మౌర్య పాలకులు దక్కనులోని ఖనిజ వనరులపైనే ప్రాథమికంగా దృష్టి సారించి తమ రాజధాని ప్రాంతాన్ని సుసంపన్నం చేయడానికి వాటిని కొల్లగొట్టారు. దక్కనులోని వజ్రాలు, బంగారు గనులు ఉన్న ప్రాంతాల చుట్టూ అనేక అశోక శాసనాలు బయల్పడడం పై పరిస్థితికి నిదర్శనం. జింక్ గనుల తవ్వకం, దాని ఉత్పత్తి మౌర్య కాలంలోనే ప్రారంభమైందని కూడా కొందరు చరిత్రకారుల వాదన.

ఉత్తరప్రదేశ్‌లోని చునార్ సమీపంలోగల అహరౌరా నుండి కొన్ని అశోక శాసనాలు వెలికి తీయడం, అలాగే మధ్యప్రదేశ్‌లోని పంగురారియాలో మరికొన్ని శాసనాలు లభ్యం కావడం, వాటికి తోడు అంతకు ముందే రూప్‌నాథ్, సాంచిల నుండి వెలికి తీసిన శాసనాలు మౌర్య పాలకులకు మధ్య భారతదేశం ఎంత కీలకంగా ఉండేదో చెప్పకనే చెబుతాయి. ఎందుకంటే ఈ ప్రాంతం పశ్చిమ భారతదేశం, దక్కను రెండింటినీ మౌర్య సామ్రాజ్యంతో అనుసంధానం చేయడానికి కీలక వారధిగా ఉండేది. పంగురారియా శాసనం నుండి మణేమదేశ అధిపతి అయిన సాంబ అనే రాకుమారుని గురించి మనం తొలిసారిగా తెలుసుకుంటాము. ఇది కేవలం తాజా సమాచారమే కాదు. సామ్రాజ్య స్వరూపం (నిర్మాణం) గురించి మరలా అధ్యయనం చేసేందుకు అది దోహదపడింది.

ఉత్తరాన తక్షశిల, పశ్చిమాన ఉజ్జయినీ, తూర్పున తోశాలి, దక్షిణాన సువర్ణగిరి అనే నాలుగు ప్రత్యేకమైన ప్రాంతాలు గల సామ్రాజ్యంగా మౌర్యుల భూభాగం విస్తరించి ఉండేదన్న పూర్వపు భావన స్థానంలో అనేక ప్రాంతాలు గల సామ్రాజ్య సిద్ధాంతం వచ్చింది. అంతకు ముందు పై నాలుగు ప్రాంతాలను మౌర్య వంశానికి చెందిన నలుగురు రాకుమారులు

ప్రాంతీయ గవర్నర్లుగా పాలించేవారని చెప్పుకొచ్చారు. అందుకు ధౌలి, జౌగద (ఒరిస్సా)లో లభించిన అశోకుని శాసనాలను ఆధారంగా చూపారు. అలాగే కేంద్ర ప్రభుత్వం ప్రాంతీయ, స్థానిక రాజ్యాల అంతర్గత వ్యవహారాలలో తరచూ జోక్యం చేసుకొనేదన్న వాదనను కూడా పునఃపరిశీలించాల్సి వచ్చింది. తక్కువ కేంద్రీకరణ గల రాజకీయ వ్యవస్థగా మౌర్య సామ్రాజ్యాన్ని విశ్లేషించారు. ప్రాంతీయ పాలకులకు గణనీయమైన స్వయంప్రతిపత్తి ఉండేదని నిర్ధారించారు. కొత్తగా స్వాధీనం చేసుకున్న కళింగ ప్రాంతంలోనే కేంద్ర ప్రభుత్వ ప్రభావం బలంగా ఉండేదని భావిస్తారు. కళింగ రాతి శాసనాలుగా చెప్పబడే రెండు సెట్ల రాతి శాసనాలలో ఉల్లేఖించిన చట్టాలు లేదా ఆదేశిక సూత్రాలు సామ్రాజ్యమంతటికీ వర్తించలేదని గ్రహించారు.

ఇటీవలి కనుగొన్న శాసనాలు, అందుబాటులో ఉన్న శాసనాలను తాజాగా అధ్యయనం చేయడం వల్ల మౌర్య సామ్రాజ్యం సమైక్య రాజ్యం కాదన్న వాదన బలోపేతమైంది. అంతకుముందు ఇందుకు పూర్తిగా విరుద్ధమైన సూత్రీకరణలను ప్రతిపాదించారు. ఈ కొత్త అవగాహన ఎంత ఉత్తేజభరితమైనప్పటికీ ఇటీవల కర్నాటకలోని గుల్బర్గా జిల్లా సన్నాతి వద్ద లభించిన అశోక శాసనంతో మళ్లీ వివాదం రాజుకుంది. ఈ శాసనం ప్రాముఖ్యత ఏమిటంటే అది ప్రాచీన కళింగ (ధౌలి, ఔగద) శాసనాలను పోలి ఉంది. సాధారణంగా కళింగ శాసనాలను ప్రత్యేకమైనవిగా పరిగణించేవారు. అవి కళింగ ప్రాంతానికి ప్రత్యేకంగా వేయించబడ్డాయని, కళింగ హత్యాకాండను వివరించే రాతి శాసనం-13ను ఇక్కడ ఉద్దేశ్య పూర్వకంగా జారీ చేయలేదని విశ్వసిస్తారు. అందుకే ప్రత్యేక రాతి శాసనాలు, కళింగ రాతి శాసనాలు, తదితర శాసనాలంటూ ప్రత్యేక వర్గీకరణను ప్రతిపాదించారు. సన్నాతి వద్ద లభించిన శాసనం అన్ని వివాదాలను ఇప్పుడు పరిష్కరిస్తుంది. అశోకుడు చేసిన కొన్ని ప్రకటనలు, అతడు తీసుకున్న కొన్నిచర్యలు కేవలం కళింగ ప్రాంతానికే వర్తించలేదని, సామ్రాజ్యమంతటికీ అవి సాధారణంగా వర్తించాయని ఈ శాసనం స్పష్టం చేస్తుంది.

ఫలితంగా పూర్తి స్థాయి కేంద్రీకరణగల సామ్రాజ్యంగా మౌర్య పాలనను చిత్రీకరించడంపై కొత్త వాదనలు (చర్చలు) ప్రారంభమయ్యాయి. తన స్వభావరీత్యా మౌర్య సామ్రాజ్యం సమైక్య రాష్ట్రం కాకపోయి ఉండవచ్చు. అలాగే సంక్షేమ రాజ్యాన్ని కూడా తలపించకపోవచ్చు. అయితే మౌర్య పాలిత భూభాగంలో అసమానతలు, వైరుధ్యాలు ఉన్నప్పటికీ కేంద్రీకరణ వైపు మొగ్గను పూర్తిగా తిరస్కరించలేము. కేంద్రీకరణ పోకడలకు రాజధాని ప్రాంతంలో నిస్సందేహంగా అనుకూల వాతావరణం ఉండేది.

**కేంద్ర పరిపాలన :**

తొలి ఇద్దరు మౌర్యుల కింద దయార్ద్ర నిరంకుశత్వాన్ని ప్రదర్శించిన మౌర్య రాచరికం అశోకుని నేతృత్వంలోని పితృస్వామ్య నిరంకుశత్వంగా రూపాంతరం చెందింది. అశోకుడు పాలితుల పట్ల తన వైఖరిని విస్పష్టంగా ప్రకటించాడు : "పురుషులందరూ (పాలితులు) నా పిల్లలు. నా పిల్లల సంక్షేమ సౌభాగ్యం కోసం ఏదైతే మంచిదని నేను భావిస్తానో పురుషులందరికీ దానిని వర్తింపచేయాలని నేను ఆకాంక్షిస్తాను." ప్రత్యేక రాతి శాసనాలలో అశోకుడు నిర్భయంగా ఇలా ప్రకటించాడు : "ఏదైతే మంచిదని నేను భావిస్తానో దానిని ఆచరణలో నెరవేర్చాలని నేను కోరుకుంటాను. ఆ లక్ష్యాన్ని సాధించడానికి నిర్దిష్టమైన పద్ధతులను అనుసరిస్తాను." తన

అపరిమిత అధికారాల గురించి అవగాహన లేనిదే ఏ చక్రవర్తీ ఇలాంటి ప్రకటనను జారీ చేసే అవకాశమే లేదు.

మౌర్యుల అధికార యంత్రాంగంలో మంత్రి మండలి లేదా మంత్రి పరిషద్ ఉండేదని కాని తుది నిర్ణయం మాత్రం పాలకునిపైనే ఆధారపడి ఉండేది. చక్రవర్తి మంత్రి పరిషద్‌ను సలహా మండలి కంటే ఎక్కువగా పరిగణించేవాడు కాదు. పాలకుడే స్వయంగా ఎంపిక చేసిన మండలి సభ్యులు అధికార యంత్రాంగంలో అలంకార ప్రాయంగా కొనసాగడం తప్ప మరేమీ చేయలేకపోయారు. అధికార వ్యవస్థను విభిన్న హోదాలు గల అధికారులు శాసించేవారు. మహామాత్రులు అత్యంత బాధ్యత గల అధికారుల వర్గంగా ఉండేవారు. వీరు పరిపాలన, న్యాయ విభాగాలలో విభిన్న అంశాలను నియంత్రించేవారు. మెగస్థనీస్ వివరించిన కౌన్సిలర్లు, అంచనాదార్లను వీరు పోలి ఉన్నారు.

తన 14వ పాలనా సంవత్సరంలో అశోకుడు ధర్మ–మహామాత్రులనే కొత్త అధికార వర్గాన్ని సృష్టించాడు. బౌద్ధులు, బ్రాహ్మణులు, అజీవికాలు, నిర్గంధాలు తదితర వర్గాల నుండి ఈ అధికారులు ఎంపికయ్యేవారు. సన్యాసులు, గృహస్తులు ఇద్దరూ ఈ పదవులను అలంకరించారు. ప్రజల నైతిక వర్తనాన్ని పెంచే మార్గదర్శక సూత్రాలను రూపొందించే బాధ్యత వీరిపై ఉండేది. అలాగే ధర్మానికి కట్టుబడి ఉన్న ప్రజల సంక్షేమం, సౌభాగ్యం కోసం కృషి చేయాల్సిన బాధ్యత కూడా వీరిపై ఉండేది. ముఖ్యంగా యోనాలు, కంబోజులు, గాంధారులు, రిషకులు, పేతినికాలు, ఇతర పాశ్చాత్య ప్రజల సంక్షేమం, వృద్ధులు, అనాథలు, సేవకులు, బానిసల యోగక్షేమాలు చూసే బాధ్యతను అశోకుడు వారికి ప్రత్యేకంగా అప్పగించాడు. రాచరిక కుటుంబంలో, ముఖ్యంగా అశోకుని సోదరులు, సోదరీలు, ఇతర బంధువుల ఇళ్లలో కూడా వారు విధులు నిర్వహించేవారు. స్థూలంగా వారు సామ్రాజ్యమంతటా నైతిక వర్తనాన్ని, సేవా కార్యక్రమాలను నియంత్రించేవారు.

"నగర వ్యవహారిక" అనే ప్రత్యేక హోదాలు గల కొందరు మహామాత్రులు ఉండేవారు. కౌటిల్యుడు ప్రస్తావించిన "పౌర వ్యవహారిక"లు వీరే అయి ఉంటారు. వీరు నగరాలలో న్యాయాన్ని అమలు చేసేవారు. అంటే గ్రామీణ ప్రాంతాలలో రాజుకాలు నిర్వహించే విధులనే వీరు నగరాలు, పట్టణాలలో చేపట్టేవారు. అంత మహామాత్రులు సరిహద్దు ప్రాంత ప్రజల మధ్యలో పని చేస్తూ తక్కువ నాగరికత కలవారి విశ్వాసాన్ని, ఆమోదయోగ్యాన్ని పొందేవారు. అంత మహామాత్రుల విధులలో ప్రధానమైనది సరిహద్దులలో ధమ్మను వ్యాపింపచేయడం. చివరగా, ఇతిజాఖ – మహామాత్రులు లేదా మహిళా పర్యవేక్షణాధికారులు ఉండేవారు. ఈ అధికారులు వేశ్యల కార్యకలాపాలను పర్యవేక్షించడమే కాక మహిళలకు సంబంధించిన ఇతర వ్యవహారాలను కూడా చక్కబెట్టేవారు. రాచరిక అంతఃపురంలో అధికారిక విధులను కూడా నిర్వహిస్తూ విరాళాలపై సమగ్రమైన నివేదికలను తయారు చేసేవారు.

ఇతర పరిపాలనా వ్యవస్థల్లో వలే మౌర్య పాలనా వ్యవస్థలో కూడా రెవెన్యూ, రక్షణ శాఖలే ప్రధానమైనవి. ఈ రెండు శాఖలు కీలక పాత్రను పోషించేవి. సామ్రాజ్యంలో పన్నులు వసూలు చేసే బాధ్యత సంహర్తపై ఉండేది. అక్షపతల్–అధ్యక్షుని (అకౌంటెంట్ జనరల్) పని తీరును పర్యవేక్షిస్తూ రాబడి, వ్యయాలపై అతడు సమీక్ష జరిపేవాడు. భూమి, సాగునీరు,

సుంకాలు, రహదారి శిస్తులు, దుకాణ పన్ను, రవాణా పన్ను, అడవులు, గనులు, మేత ప్రాంతాలు, రాచరిక భూములు, హస్తకళాకారుల నుండి రుసుము, జూద గృహాల నుండి విలాస పన్ను తదితర మార్గాలలో రాజ్యానికి ఆదాయం లభించేది. ప్రధాన కోశాధికారి “సన్నిధాత” ఈ విషయాలలో సంహర్తకు సహాయపడేవాడు. అతడు కోశగృహ లేదా కోష్టగార అనే దృఢంగా నిర్మించబడిన భవనాలలో ఖజానాను నిల్వ చేసేవాడు. ప్లినీ ప్రకారం మౌర్య సైన్యంలో ఆరు లక్షల మంది పదాతి సైనికులు, 30,000 మంది ఆశ్వికులు, తొమ్మిది వేల గజదళం, ఎనిమిది వేల రథాలు ఉండేవి. సైన్యం సేనాపతి నియంత్రణలో ఉండేది. అతడి కింద అనేక మంది అధ్యక్షులు లేదా పర్యవేక్షణాధికారులు (వివిధ విభాగాలకు చెందిన) ఉండేవారు. ముఖ్యంగా పదాధ్యక్ష, అశ్వాధ్యక్ష, హస్త్యాధ్యక్ష, రథాధ్యక్ష, నావధ్యక్ష, ఆయుధగారాధ్యక్షలు ఉండేవారు. వివిధ రకాల యోధుల గురించి కౌటిల్యుడు తన కృతులలో వివరించాడు. అలాగే వివిధ హోదాలు గల సైనిక కమాండర్ల జీతభత్యాల గురించి ప్రస్తావించాడు. సేనాపతికి వార్షికంగా 48,000 పనాల జీతం లభించేది. అతడి తర్వాత ప్రశస్తకు 24,000, నాయకకు 12,000, ముఖ్యకు 8,000, అధ్యక్షకు 4,000, సాధారణ సుశిక్ష సైనికునికి 500 పనాల జీతం లభించేది. జీతాలను నగదు రూపంలో చెల్లించేవారు.

**ప్రాంతీయ, స్థానిక పరిపాలన :**

ప్రాంతీయ పరిపాలనను రాకుమారుడు లేదా రాచరిక కుటుంబ సభ్యుని ప్రత్యక్ష నియంత్రణలో ఉంచారు. అశోకుని సామ్రాజ్యం నాలుగు ప్రాంతాలుగా విభజితమై ఉండేది. ఉత్తర ప్రాంతానికి (ఉత్తరపథ) తక్షశిల రాజధానిగా ఉండేది. పశ్చిమ ప్రాంతానికి (అవంతిరథ) ఉజ్జయినీ, తూర్పునకు (కళింగ) తోశాలి, దక్షిణానికి (దక్షిణపథ) సువర్ణగిరి రాజధానులుగా ఉండేవి. ఒక రాజ్యాన్ని నాలుగు ప్రాంతాలుగా విభజించాలని అర్థశాస్త్రం ప్రతిపాదించడం నిజంగా ఆసక్తికరమైన విషయమేనని ఇక్కడ మనం గుర్తించాలి. చిన్న భూభాగాలను పాలించిన గవర్నర్లను బహుశా స్థానిక ప్రజల నుండే ఎంపిక చేసి ఉంటారు. విదేశీ నేపథ్యం గల తుషస్ప అనే స్థానిక వ్యక్తిని గిర్నార్ గవర్నర్‌గా ప్రస్తావించారు. ప్రాంతీయ పాలనా వ్యవస్థలో మంత్రి మండలికి రాకుమారునితో సమానంగా అధికారం ఉండేది. ఈ ఏర్పాటువల్ల రాకుమారుని అధికారాలపై నియంత్రణ, పరిమితులు ఉండేవి. కేంద్రంలో బలహీన మంత్రివర్గానికి ఈ పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉండేది. ప్రాంతీయ మండలి రాజుతో ప్రత్యక్ష సంబంధాన్ని కలిగి ఉండేది. రాకుమారుని ఏకపక్ష నిర్ణయాలు లేదా చర్యలను నిరోధించడానికి ఇలాంటి ఏర్పాటు చేసి ఉంటారు.

ప్రాంతాలను జిల్లాలుగా ఉపవిభజన చేశారు. ప్రతి జిల్లాలోనూ ఒక అధికార బృందం పని చేసేది. ఈ బృందంలో ముగ్గురు ప్రధాన అధికారులు – ప్రాదేశిక, రాజుక, యుక్త – అంతర్భాగంగా ఉండేవారు. వీరికి సహాయంగా అనేక మంది అధికారులు విధులు నిర్వహించేవారు. ఆధునిక డివిజనల్ కమీషనర్లు నిర్వహించే పాత్రను ప్రాదేశికలు పోషించేవారు. జిల్లా పరిపాలనా యంత్రాంగానికి వారు స్థూలంగా బాధ్యత వహించేవారు. ప్రతి జిల్లాకు ఒక ప్రదేష్ట్రి అధిపతిగా ఉండేవాడు. ప్రాదేశికలు రెవెన్యూ వసూళ్లను పర్యవేక్షిస్తూ జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో శాంతిభద్రతలను కాపాడేవారు. గ్రామీణ పరిపాలనకు రాజుకలు

ఎన్నుముకగా ఉండేవారు. వేలాది మంది ప్రజలకు అధిపతులుగా నియమితులైన రాజుకలకు పూర్తి స్వేచ్ఛ ఉండేది. గౌరవ పురస్కారాలను ప్రదానం చేయడం, శిక్షలు విధించడం లాంటి విధులను వారు నిర్భయంగా నిర్వహించేవారు. అంచనా అధికారులుగా కూడా వారు వ్యవహరించారు. తొలుత తాడుతో భూమిని కొలిచేవారు. తమ ప్రాంత పరిధిలోని ప్రజల జీవితాన్ని, మరణాన్ని శాసించే అధికారం రాజుకలకు ఉండేది. మరణశిక్ష విధించిన తర్వాత ఆ తీర్పును సవరించడానికి వారికి మూడు రోజుల వ్యవధి ఉండేది.

మెగస్థనీస్ ప్రస్తావించిన "అగ్రోనోమోయ్" అనే గ్రామీణ అధికార వర్గానికి రాజుకలు పోలి ఉన్నారు. వీరు పన్ను చెల్లించే రైతుల భూములను కొలిచేవారు. దిగుబడి అంచనా, పన్నులలో మినహాయింపు, భూతగాదాలు, నీటి తగాదాలు, గ్రామీణ హస్తకళాకారుల మధ్య ఘర్షణలు తదితర వివాదాలను రాజుకల దృష్టికి తెచ్చేవారు. అశోకుడు తన 27న పాలనా సంవత్సరంలో వీరి అధికారాలను అమాంతంగా పెంచాడు. పరిపాలనా వ్యవహారాలను త్వరితగతంగా చక్కబెట్టడానికే ఆ నిర్ణయం తీసుకున్నాడు. ఆ విధంగా ప్రతి విషయాన్ని ప్రాదేశికల నిర్ణయం కోసం వాయిదా వేయకుండా నివారించాడు. రాచరిక వేగుల ద్వారా కేంద్ర పాలకుడు రాజుకలతో నిత్యం సంప్రదింపులు జరిపేవాడు. ఈ వేగులను పురుషా (పులిసా) అని పిలిచేవారు. తమ కార్యనిర్వహణ క్రమంలో రాజుకలు ప్రజలలో ధమ్మను కూడా ప్రచారం చేయాల్సి వచ్చేది.

"యుక్త"లు జమాపద్దులను చూసే దిగువశ్రేణి అధికారులు. పర్యటనలలో వారు రాజుక, ప్రాదేశికల వెంట వెళ్లి సీనియర్ అధికారులు తీసుకునే నిర్ణయాలను లిఖిత పూర్వకంగా నమోదు చేసేవారు. ప్రాదేశిక, రాజుక, యుక్త, మహామాత్ర తదితర ఉన్నతాధికారుల మహాసమ్మేళనం రెండేళ్లకు లేదా మూడేళ్లకోసారి సామ్రాజ్య రాజధాని లేదా పూర్వ నిర్ధారిత వేదిక వద్ద జరిగేది. అశోకుడు తన పాలనా విధానాలలో తీసుకున్న అత్యంత సృజనాత్మక నిర్ణయాలలో ఈ సమ్మేళన నిర్వహణ ఒకటి. ప్రచార కార్యక్రమాలు నిర్వహించడమే ఈ సమ్మేళనాల ప్రధాన లక్ష్యం. అలాంటి సమ్మేళనాన్ని 'అనుసంయాన" అని పిలిచేవారు. న్యాయ పాలనలో పొరపాట్లు, ఏకపక్షంగా శిక్షలు విధించడం, చిత్రహింసలను సరిహద్దు ప్రాంతాలలో నివారించడంపై ఉన్నతాధికారుల విధి. దీనికితోడు ప్రజాహిత పనులు చేపట్టడం, ప్రజలలో ధమ్మ విలువలను ప్రచారం చేయడం కూడా వారి బాధ్యతలలో అంతర్భాగంగా ఉండేవి.

పాలనా యంత్రాంగ నిర్మాణంలో ఐదు లేదా పది గ్రామాల ఒక సమూహం జిల్లా, గ్రామం మధ్య అనుసంధానకర్తగా వ్యవహరించేది. ఈ సమూహంలో గోప, స్థానిక అనే ఇద్దరు ప్రధాన అధికారులు ఉండేవారు. గోప అకౌంటెంట్‌గా వ్యవహరించేవాడు. ప్రతి గ్రామంలోని జనాభా వివరాలను, ప్రజల వృత్తులు, వయస్సు వారి ఆదాయ వ్యయాల నివేదికను నిర్వహించేవాడు. ఆధునిక తహసిల్దారు విధులను "స్థానిక" నిర్వహించేవాడు. అతడి ప్రధాన విధి పన్నుల సేకరణ.

ఇతర అధికారులలో రాజు వేగులు లేదా పురుషాలు (పులీసాని) మూడు శ్రేణులలో విభజించబడి విధులు నిర్వహించేవారు. ఆధునిక ప్రజా సంబంధాల అధికారుల వలె వారు ప్రజాభిప్రాయాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ రాజుకు నివేదించేవారు. పతివేదకులు లేదా

ప్రత్యేక సమాచార వాహకులపై (special reporters) రాజు ఆధారపడేవాడు. ఈ అధికారులు రాజును ఏ క్షణంలోనైనా కలుసుకునే వెసులుబాటు ఉండేది. కౌటిల్యుడు వివరించిన గూఢపురుషాలనే రహస్య వేగు సంస్థతో ఈ పతివేదకులను పోల్చవచ్చు. కేంద్ర, ప్రాంతీయ పాలనా యంత్రాంగాల మధ్య పురుషాలు, పతివేదకులు అనుసంధానకర్తలుగా వ్యవహరించేవారు. ప్రభుత్వ యంత్రాంగాన్ని పర్యవేక్షించడం, రాజకీయ, సామాజిక, ఆర్థిక పరిస్థితులపై ఎప్పటికప్పుడు తాజా సమాచారాన్ని తెలుసుకోవాలన్న ఉద్దేశంతోనే తాను పురుషాలు, పతివేదకులను నియమించినట్లు అశోకుడు ఒక సందర్భంలో పేర్కొన్నాడు. వ్రజభూమికలు అనే ప్రత్యేక అధికారుల వర్గం ఒకటి ఉండేది. వీరు వ్రజకు బాధ్యులు. అంటే సార్వజనిక భవనాలు, నిర్మాణాలను వారు పర్యవేక్షించారు.

**మౌర్య-అనంతర కాలం :**

**రాజకీయ వ్యవస్థ స్వరూపం :** రాజ్య ఆవిర్భావానికి దారి తీసిన కారణాలపై తొలి భారతీయ రాజకీయ సిద్ధాంత కర్తల మధ్య సాధారణ ఏకాభిప్రాయం ఉంది. వారి దృష్టిలో రాజ్య ఆవిర్భావానికి దారి తీసిన కారణాలు అంతిమంగా అరాచక, కల్లోల పరిస్థితులను రూపుమాపాయి. అయితే రాజ్యానికి సంబంధించిన వివిధ విభాగాలు లేదా సంస్థల పూర్వ ప్రాముఖ్యతను నిర్ధారించడంపై ఎవరి అభిప్రాయాలు (లేదా సిద్ధాంతాలు) వారికి ఉన్నాయి. కాలక్రమంలో రాజు కీలక అంగంగా మారాడు. దైవంతో అనుసంధానం చేయబడడంవల్ల రాజు హోదాకు ప్రత్యేకమైన పవిత్రత దక్కింది. అశోకుడు కేవలం "దేవానంప్రియ" (దైవాలకు ఇష్టుడు) అయితే కుషానులు "దేవపుత్రులు"గా కీర్తించబడ్డారు. గౌతమీపుత్ర శాతకర్ణి, రుద్రదమన్‌లిద్దరూ వారి ప్రశస్తిలలో మానవ మాత్రునికి మించిన లక్షణాలు గల వ్యక్తులుగా కీర్తించబడ్డారు. "రాజు శిశువు అయినప్పటికీ అతడు మానవ రూపంలో ఉన్న గొప్ప దైవం," అని ప్రకటించిన మను ఆ కాలపు మారిన పరిస్థితులను తన మాటల్లో ప్రతిధ్వనించాడు.

అప్పటికి అమల్లో ఉన్న రాజకీయ సంఘటనలపై రాచరిక ప్రాముఖ్యత తీవ్ర ప్రభావం చూపింది. గత కాలపు గణాలు పూర్తిగా మాయం కాలేదు. వాస్తవానికి యోధేయ, మాలవ, తదితర గణాలు మరికొంతపాటు అభివృద్ధిని చవి చూశాయి. అయితే రాచరికం వైపు వారు (గణాలు) ఎక్కువగా మొగ్గు చూపారు. మను రచనలలో ప్రముఖంగా కనిపించే "దండ" (శిక్ష)పై రాచరిక రాజ్య వ్యవస్థ ఎక్కువగా ఆధారపడింది. "శిక్షార్హులను శిక్షించడానికి రాజు (నిర్విరామంగా) ప్రయత్నించకపోతే బలవంతులు బలహీనులను చేపల్లాగా కాల్చుకుతింటారు," అని మను ప్రబోధించాడు. దండను రాజుపై కూడా ప్రయోగించవచ్చని అతడు చెప్పాడు. రాచరిక నిరంకుశత్వాన్ని నివారించేందుకు సాధారణ పరిష్కారంగా అతడు ఈ వాదనను చేయలేదు. అధికార వ్యవస్థలో సమతుల్యాన్ని పాటించే ఉద్దేశంతోనే ఇలాంటి ప్రతిపాదనను ప్రవేశపెట్టి ఉంటాడు.

సామ్రాజ్య విచ్ఛిన్నం దానిని మోస్తూ వచ్చిన సంస్థలలో కూడా మార్పు తీసుకొచ్చింది. ఉత్తర భారతదేశంలోని కొన్ని నగరాలలో స్వయం ప్రతిపత్తిగల నగర ప్రభుత్వాలు ఉన్నట్లు అవి జారీ చేసిన నాణేలు వెలుగులోకి తీసుకొచ్చాయి. కేంద్ర అధికారస్వామ్యానికి బదులు ప్రాంతీయ అధికార స్వామ్యం నెమ్మదిగా ఏర్పడిందని అందుబాటులో ఉన్న ఆధారాలు

సూచిస్తాయి. ఇండో–గ్రీకు కాలం నాటి శిలాఫలకాలలో మెరిడస్ఫ్, అప్రచరాజ హోదాగల అధికారుల గురించి ప్రస్తావన ఉంది. స్కైథో–పార్థియన్, కుషాన కాలాలలో క్షత్రప, మహాక్షత్రప హోదా గల అధికారులను ప్రవేశపెట్టారు. శాతవాహన రాజ్యానికి చెందిన మహారథిన్, మహాభోజాలు లేదా ఆంధ్ర ఇక్ష్వాకు రాజ్యానికి చెందిన మహాసేనాపతి, మహాతల్వార్లు కొత్త రాజ్యం యొక్క అధికారిక నిర్మాణాన్ని సూచిస్తారు. తదుపరి కాలంలో ఈ కొత్త రాజ్యం మరింతగా విస్తరించింది.

## ద్వీప కల్పంలో రాజ్య ఆవిర్భావం

**అధికార యంత్రాంగ పరిణామక్రమం :** మౌర్య పాలనా యంత్రాంగ మౌలిక లక్షణాలు, అధికారులు, పాలితులతో సంభాషించడానికి ప్రాకృత భాషను సాధనంగా ఉపయోగించడాన్ని శాతవాహనులు తమ పూర్వ తెగ నాయకుల నుండి వారసత్వంగా స్వీకరించారు. ( ఈ తెగ దొరలు దాదాపు 200 సంవత్సరాలపాటు స్వతంత్రంగా పాలించారు) అలాంటి తెగ నాయకులు జారీ చేసిన నాణేలు సుమారు 300కు పైగా ఇప్పటి వరకు లభ్యమయ్యాయి. భద్ర, మిత్ర అనే పదాలు పేర్ల చివరన కలిగిన నాణేలు కొన్ని ఉన్నాయి. పశ్చిమ దక్కనులో శాతవాహనుల పాలనలో మౌర్య అధికార యంత్రాంగ లక్షణాలు కొన్ని కొనసాగడం సహజ పరిణామమే. మౌర్యుల వలె తొలి శాతవాహన పాలకులను “రాజ” అని పిలిచేవారు. గౌతమీపుత్ర శాతకర్ణి మాతృమూర్తి అయిన గౌతమి బాలశ్రీ తన కుమారుడు, మనవడు “మహారాజు” అని వాదించినప్పటికీ గౌతమీపుత్ర కాని వశిష్ఠిపుత్ర పులమయి కాని ఆ బిరుదును స్వీకరించలేదు. కుషాణ రాకుమారులతో ప్రత్యేకంగా గుర్తించబడ్డ అలాంటి ఆర్భాటపు బిరుదులను ఈ పాలకులు స్వీకరించలేదు. అశోకుని పాలనలో కుమార, ఆర్యపుత్ర లేదా మహామాత్ర అనే ఉన్నతాధికారుల ద్వారా రాజశాసనాలను అమలు చేసే వారు కాని శాతవాహన రాజులు మాత్రం తమ ఆదేశాలను అమాత్యులనే కింది స్థాయి అధికారుల ద్వారా ప్రజలకు చేరవేసేవారు. అయితే వారి ఆదేశాలు ప్రాకృత భాషలో, అలాగే అశోకుడు వాడిన పదజాలంలోనే ఉండేవి.

శాతవాహన రాజకీయ కార్యనిర్వాహకులు “మహా” అనే బిరుదును తొలిసారిగా వాడారు. తదుపరి కాలంలో ఆ బిరుదు గుప్త రాజకుమారులు, అధికారులు, సామంతుల హోదాలో సాధారణంగా ముడిపడిపోయింది. శాతవాహన రాజులు తమను తాము “రాజు” అని పిలిచుకునే వారు. అయితే వారి శాసనాలలో మాత్రం “మహారాజ” అని సంబోధిక కనిపిస్తుంది. అలాగే మహాసేనాపతి, మహారథి, మహాభోజ, మహాతల్వార తదితర హోదాలు కూడా కనిపిస్తాయి. శాతవాహనుల సామంతుల యొక్క హోదాలను అవి ప్రతిబింబిస్తాయి. మహారథి లాంటి సామంతులు శాతవాహనుల వలే హోదాలనే కాకుండా వారసత్వ హక్కును కూడా అనుభవించారు. ఈ కారణంగా వారు నాణేలు జారీ చేయగలిగారు. అలాగే గ్రామాలను ధారాదత్తం చేయగలిగారు. ఇలాంటి అధికారాలు వారి స్వంత హక్కులకు లోబడే ఉండేవి. ఇలాంటి హోదాలు లేదా బిరుదులు ఇక్ష్వాకులు, చుతులు, విష్ణుకుండినులు తదితరులలో కూడా కనిపిస్తాయి. అలాగే శాతవాహనుల కొన్ని కుటుంబ శాఖల్లోనూ దర్శనమిస్తాయి. ప్రధాన శాఖకు ఈ కుటుంబాలు సామంతులుగా వ్యవహరించి ఉంటారన్నది నిస్సందేహం.

శాతవాహన రాజ్యం "ఆహారాలు"గా లేదా జిల్లాలుగా విభజించబడి ఉండేది. కొన్నిసార్లు ఈ ఆహారాలను రాష్ట్రాలుగా కూడా పిలిచేవారు. ఆహారాల గురించి అశోకుని శాసనాలలో పేర్కొనకపోయినా శాతవాహన శాసనాలలో మాత్రం గోవర్ధన-ఆహార తదితర ఆహారాల గురించి తరచూ ప్రస్తావించారు. ఒక ఉదంతంలో శాసనాన్ని అమాత్యుడు రూపొందించాడు. మరో ఉదంతంలో ప్రతిహార (శాతవాహనుల కాలంలోనే ఇతడి గురించి తొలిసారిగా ప్రస్తావించారు), ఇంకో ఉదంతంలో మహాసేనాపతి శాసనాలను రూపొందించారు. అంటే శాసన రూపకల్పన ఏ ఒక్క అధికారికో పరిమితం కాలేదని తెలుస్తోంది. అయితే గుప్తుల అనంతర కాలంలో "సంధివిగ్రహిక" అనే ప్రత్యేక అధికారికే ఆ బాధ్యతను ఎక్కువగా కేటాయిస్తూ వచ్చారు.

పట్టిక-పాలక అనే భూ సర్వేక్షణ అధికారులను కూడా శాతవాహనులు నియమించారు. శాసనాలను రాతిపై చెక్కే శిల్పకారులను, లబ్దిదారులకు శాసనాలను చేరవేసే దళారులను కూడా నియమించారు.

శాతవాహన అధికారులు నగదు రూపంలో వేతనాలు పొంది ఉంటారు. కౌటిల్యుడు తన అర్థశాస్త్రంలో ఇలాంటి ఏర్పాటునే సూచించాడు. నానాఘాత్ తదితర ప్రాంతాలలో లభ్యమైన గుహ శాసనాలలో "కర్షపాను"ల పొడవాటి జాబితా కూడా ఇలాంటి ఏర్పాటునే సూచిస్తుంది. కొందరి వేతనాలు, 1,48,000 కర్షపానుల కంటే ఎక్కువ ఉండేదని బోధపడుతుంది. ఆయా సందర్భాలలో ఈ వేతనాలను నగదు (కర్షపాన) రూపంలో చెల్లించేవారు. మహారాష్ట్రలో పెద్ద సంఖ్యలో లభించిన వెండి, రాగి, కాంస్య, టిన్, పొటిన్ నాణేలను బట్టి నగదు చెల్లింపులను సంపూర్ణంగా నిర్ధారించవచ్చు. అయితే ఆంధ్ర, మధ్యప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాలలో ఇలాంటి నాణేలు అంతగా లభ్యం కాలేదు. మౌర్య అనంతర పాలక కుటుంబాలలో శాతవాహనులు మినహా ఏ ఒక్క వంశమూ అన్ని నాణేలను జారీ చేయలేదు. మౌర్య నాణేల కంటే పరిమాణంలో అవి పెద్దగా ఉండేవి. అంటే అధికారులపై శాతవాహనులకు పూర్తి నియంత్రణ ఉండేదని ఈ విషయం స్పష్టం చేస్తుంది. శాతవాహన రాజ్య పరిధిలో లభించిన అనేక రోమను నాణేలు వాణిజ్య లావాదేవీలలో పెద్ద ఎత్తున చేతులు మారి ఉంటాయి. వాటిని బంగారు నిల్వలుగా కూడా పోగు చేసి ఉండవచ్చు. అయితే శాతవాహన నాణేలను రోజువారీ లావాదేవీలలో ఉపయోగించి ఉంటారు. రాజ్య అధికారులకు నాణేల రూపంలోనే వేతనాలు చెల్లించారు. అలాగే వస్తు రూపేణా కూడా వారికి భత్యాలు చెల్లించి ఉంటారు.

శాతవాహనులు ఆర్థిక వ్యవస్థను ప్రాథమికంగా గ్రామాలలో మత అవసరాల కోసం కల్పించిన పన్నురాయితీల నుండి గ్రహించవచ్చు. స్థిర గ్రామాలలో లేదా సాగు భూమిలో దిగుబడిని అంచనా వేసేవారు. ఉప్పుతో సహా అన్ని ఖనిజాలపై పాలకునికి యాజమాన్యం ఉండేది. రాజ్య అధికారులు, సైనికులు, పోలీసులు తమ స్వంత నిర్వహణకు లేదా ప్రభుత్వ యంత్రాంగాన్ని నిర్వహించడానికి రైతుల నుండి అదనపు ఉత్పత్తిని సమీకరించి ఉండవచ్చు. దేయ-మేయ, భోగ లాంటి పదాంశాలు దిగుబడిలో రాచరిక వాటాను సూచిస్తాయి. వృత్తిదారులపై విధించిన కారు-కర అనే పన్నును కూడా రాజు దక్కించుకునే వారు. ధర్మశాస్త్రాలకు అనుగుణంగా తమ కులపెద్ద కోసం వృత్తిదారులు నెలలో కనీసం ఒక్క రోజైనా

శ్రమించకపోతే అప్పుడు వారు నగదు రూపంలో పన్నులు చెల్లించాల్సి వచ్చేది. పన్నులను నగదు, వస్తు రూపాలలో వసూలు చేసినట్లు కనబడుతోంది. అయితే సాధారణ లోహపు నాణేలు పెద్ద సంఖ్యలో అందుబాటులో ఉండడాన్ని బట్టి నగదు వసూళ్లే ఎక్కువగా ఉన్నట్లు భావించాలి. కోశాధికారిని "హిరణ్యిక" అని ప్రస్తావించారు. దీనిని బట్టి నగదు లావాదేవీలు శాతవాహన రాజ్యంలో ఎక్కువగా జరిగేవని బోధపడుతుంది.

శాతవాహన గ్రామీణ పాలనలో భూకేటాయింపులు ఒక ముఖ్యమైన లక్షణంగా ఉండేవి. శాసనాల ప్రకారం శాతవాహనులు బ్రాహ్మణ, బౌద్ధ భిక్షువులకు ఆర్థిక, పాలనాపరమైన రాయితీలిచ్చే సాంప్రదాయాన్ని ప్రారంభించారు. నానాఘట్‌లోని నాగణిక గుహ శాసనం తొలి భూదానాన్ని వివరిస్తుంది. వైదిక బలిదానాలలో పురోహితుల పాత్రను పోషించిన బ్రాహ్మణులకు గ్రామాలను ప్రదానం చేస్తున్నట్లు ఆ శాసనం పేర్కొంటుంది. అయితే ఈ నేపథ్యంలో ఎలాంటి రాయితీల గురించి కూడా ఆ శాసనం ప్రస్తావించలేదు.

క్రీ.శ.రెండవ శతాబ్దం తొలి దశకాలలో గౌతమీపుత్ర శాతకర్ణి చేసిన భూదానాలలో రాయితీలు తొలిసారిగా ప్రత్యక్షమవుతాయి. సాగు భూముల నుండి ఉప్పును కొనుగోలు చేసే రాచరిక హక్కులను కూడా లబ్దిదారులకు బదిలీ చేశారు. రాచరిక అధికారులు దానం చేయబడ్డ వ్యవసాయ భూములు లేదా గ్రామాల పరిపాలనలో జోక్యం చేసుకోరాదని ఆ శాసనాలు చెబుతాయి. అంటే గ్రామ పరిపాలన అంతా మతపరమైన లబ్దిదారుల చేతుల్లోనే పూర్తిగా కేంద్రీకృతమైంది.

క్రీ.శ. రెండు, మూడవ శతాబ్దాలకు చెందిన శాతవాహన శాసనాలు వారి రాజ్యం రాష్ట్రాలు, ఆహారాలు, గ్రామాలుగా విభజించబడి ఉందని తెలుపుతాయి. అమాత్య లేదా మహాసేనాపతి, గౌల్మికల అధికార వర్గం రాజ్యాన్ని పరిపాలించేది. క్రీ.శ. మూడవ శతాబ్దంలో బళ్లారి జిల్లాలో ప్రాంతీయ అధిపతులైన ఇద్దరు అధికారులు ప్రత్యక్షమవుతారు. కనక అధికార యంత్రాంగం లేదా రాజ్య స్వరూపం అన్ని సమయాల్లోనూ ఒకే రూపంలో కొనసాగిందని చెప్పలేము. శాతవాహనుల రాజకీయ వ్యవస్థను బౌద్ధ భిక్షువులు, వ్యాపారులు చాలాకాలంపాటు నిలిపారని అనేక శిలాధారాలు సూచిస్తాయి. అయితే వారు అధికార యంత్రాంగానికి ఏ స్థాయిలో సేవలందించారో అంచనా వేయడం కష్టం. బహుశా బౌద్ధ సన్యాసులు తమకు దక్కిన భూదానాలకు ప్రతిఫలంగా ప్రజలలో శాంతిని ప్రబోధించి ఉంటారు. మరోవైపు వ్యాపారులు రాజ్య వ్యయానికి తగిన వనరులను సమకూర్చి ఉంటారు.

శాతవాహన పాలనలో మరో ముఖ్యమైన లక్షణం దాని బలవంతపు, సైనిక స్వభావం. శాతవాహనుల సైనిక సంఘటనంలో ఆశ్వికదళానికి ప్రముఖ స్థానం ఉండేదని తెలుస్తోంది. బలవంతపు అంశం ప్రాధాన్యతను వివిధ కారణాలను బట్టి అంచనా వేయవచ్చు. గ్రామీణ ప్రాంతంలో పోలీసులు, సైనికుల ప్రవేశాన్ని నిరోధించాలని ప్రజలు కోరుకోవడం, అలాగే మహాసేనాపతి, గౌల్మిక లాంటి రాజ్య అధికారుల పేర్ల నుండి తమకు స్వేచ్ఛ కావాలని పాలితులు ఆకాంక్షించడం రాజ్యం యొక్క బలవంతపు లక్షణాన్ని ఊహించవచ్చు.

"కటక", "స్కంధవర" (సైనిక శిబిరాలు) లాంటి సాధారణ పదాల వాడకాన్ని బట్టి రాజ్యం యొక్క సైనిక లక్షణం బహిర్గతమవుతుంది. ప్రతి ఆహారాలోనూ స్వంత కటక ఉండేదని

తెలుస్తోంది. గోవర్ధన ఆహారలోని బేనకటకలోని పరిస్థితి అందుకు ఒక ఉదాహరణ. అయితే ధేనుక–కటక లేదా ధాన్యకటక మరో ఆహారలో అదే స్థాయిని కలిగి ఉండేదని తెలుస్తోంది. జైత్రయాత్ర శిబిరాల నుండి భూదాన శాసనాలను జారీ చేసే సాంప్రదాయం శాతవాహనులతో మొదలైంది. తొలి మధ్యయుగ కాలాలలో ఇలాంటి దానాలు సర్వవ్యాప్తంగా ఉన్నాయి.

శాతవాహన రాజకీయ వ్యవస్థలో అశోకుని రాజకీయ వ్యవస్థ లక్షణాలు ఉండడంతో కొందరు దానిని సంకీర్ణ రాజ్య అవతరణకు ఉదాహరణగా పరిగణించారు. అయితే భార శిలా సాంస్కృతిక వారసత్వం, తమిళ రాజ్యాలైన చోళ, పాండ్య, చేరాలతో సన్నిహిత సంబంధం, రోమను వాణిజ్యం నుండి లభించిన ప్రోత్సాహాలను ఇక్కడ విస్మరించకూడదు. మౌర్య నమూనా శాతవాహన రాజ్య నిర్మాతలను స్ఫూర్తినిచ్చి ఉండొచ్చు కాని మౌర్య రాజ్యానికి ఒక కొత్త స్వరూపంగా ఆ రాజ్యాన్ని పరిగణించకూడదు. మౌర్యులు–గుప్తులు, అలాగే ఉత్తర–దక్షిణ ప్రాంతాల మధ్య శాతవాహనుల అధికార వ్యవస్థ ఒక కీలకమైన వారధిగా కనిపిస్తుంది. శాతవాహనులు మౌర్య రాజ్య లక్షణాలను కొంత వరకు పరిరక్షించి ఉండవచ్చు. కాని వారు సరికొత్త లక్షణాలెన్నింటినో ప్రవేశపెట్టారు. ఆ లక్షణాలను గుప్తులు, వకాటకులు కొనసాగించారు. వారి ప్రభుత్వంలో మహిళలు, వ్యాపారులు పోషించిన పాత్ర చాలా కాలం కొనసాగలేదు. అయితే గ్రామీణ జిల్లాలను సైనిక పాలన కింద చేర్చే సాంప్రదాయం, ఆర్థిక పాలనపరమైన మినహాయింపులు ఇచ్చే వ్యవస్థ ఉత్తర, దక్షిణ మార్గాలలో సమానంగా విస్తరించింది. ఆ విధంగా చూస్తే పల్లవ పాలనను శాతవాహన రాజకీయ వ్యవస్థ దక్షిణాది విస్తరణగానే పరిగణించాలి.

## రాజకీయవ్యవస్థపై విస్తరిస్తున్న ఆర్థిక వ్యవస్థ ప్రభావం :

శాతవాహన రాజకీయ సంఘటనంపై దక్కనులో ప్రగతిపథంలో ఉన్న హస్తకళల ఉత్పత్తి, విస్తరిస్తున్న వ్యాపార వాణిజ్యాలు చూపిన ప్రభావాలను పరిశీలించడం ఇక్కడ సహేతుకంగా ఉంటుంది. ఒక పర్యవేక్షణాధికారి ఆధ్వర్యంలో కళాకారులు (హస్తకళల వారు) ఒక గుహను తీర్చిదిద్దారని ఒక శిలాశాసనం చెబుతుంది. ఇలాంటి అధికారులలో బౌద్ధ, జైన భిక్షువులు, పెద్దలు, వ్యాపారులు తదితరులు ఉండేవారు. వీరిని నవకార్మిక, ఉపరక్షిత లాంటి హోదాలతో గుర్తించేవారు. వీరికి రాజ్యంతో ఏ విధమైన సంబంధం ఉండేదో స్పష్టంగా తెలియరాలేదు. శిల్పులు, వ్యాపారులతో శాతవాహన పాలకులు ఎలాంటి అధికార వ్యవస్థ ద్వారా సంప్రదించేవారో సూచించబడలేదు. వ్యాపారులను నిగమలని మాత్రం ప్రస్తావించారు. అయితే వ్యాపారులు, కళాకారులకు తమ స్వంత మండళ్లను ఏర్పాటు చేసుకునే స్వేచ్ఛ ఉండేది. రాచరిక పోషకులు తమ దానాలను ఇలాంటి మండళ్లతో జమ చేసేవారు.

బౌద్ధ సన్యాసులు, మఠాలకు సమర్పించిన కానుకలను పరిశీలిస్తే బార్హూత్,సాంచిలలో వ్యాపారులు(గాంధికాలు), హస్తకళాకారులే ఎక్కువగా కానుకలను అందించారన్న భావన ఏర్పడుతుంది. (గాంధిక అనేక పదం నుండే గాంధి అనే బిరుదు ఉద్భవించింది). అయితే నాసిక్, జున్నర్ గుహశాసనాలు వ్యక్తిగత కానుకలను ఎక్కువగా నికామ లేదా నిగమ వ్యాపారులే అందించారని, కాని గాంధికాలు,సేఠీలు,శార్తవాహాలనే వ్యాపారుల వర్గాలు కూడా దాతలుగా ఉన్నారని స్పష్టం చేస్తాయి. మతాన్ని పోషించడంలో వ్యాపారులు ఇంత ఉదారంగా వ్యవహరిస్తే

రాజకీయాల విషయంలో వారి తాత్సార లేదా నిర్లక్ష్య ధోరణిని రాజ్యం సహించే అవకాశమే లేదు. వ్యాపారులు, ఉత్పత్తిదారుల నుండి రాచరిక ఆదాయం గురించి ప్రత్యక్ష సాక్ష్యాలు పరిమితంగా ఉన్నా "కారు-కార" అనే పదప్రయోగం గ్రామీణ ప్రాంతాలలో సైతం హస్తకళాకారులు పన్నులు చెల్లించేవారన్న విషయాన్ని సూచిస్తుంది.

రవాణా పన్నులను కొన్ని సందర్భాలలో ఉషవదాత (సకా పాలకుడు నహాపన అల్లుడు, ఉపపాలకుడు) జమ చేశాడు. బహుశా వాటిని వ్యాపారులు చెల్లించి ఉంటారు. సుంకం అధికారులను శాతవాహన రాజ్యంలోని వివిధ ఓడరేవు పట్టణాలలో నియమించి సుంకాలను వసూలు చేసి ఉంటారు. అయితే క్షేత్ర స్థాయి పరిస్థితి ఎలా ఉండేదో తెలుసుకోవడానికి మనకు ఎలాంటి ఆధారాలు లేవు.

శాతవాహన పాలకులు వ్యాపారులకు అత్యున్నత అధికార హోదాలను కట్టబెట్టి ఉంటారు. పట్టణాల నిర్వహణతో వ్యాపారులు చాలా దగ్గరగా ముడిపడి ఉండేదని తెలుస్తోంది. శాతవాహన పాలక ప్రాంతాలలో పట్టణాల సంఖ్య అధికంగానే ఉండేది. బ్రోచ్, సోపార, కళ్యాణ, పైథన్, తగర (తేర), జున్నార్, కార్లే, గోవర్ధన, నాసిక్, ధాన్యకటక లాంటి పట్టణాల పేర్లను శిలాశాసనాలు పేర్కొంటాయి. పై పట్టణాలతోపాటు మరెన్నో పట్టణ నివాసప్రాంతాల అవశేషాలు పురవాస్తు తవ్వకాలలో బయటపడ్డాయి. వాటిలో మస్కీ, బ్రహ్మగిరి, చంద్రవల్లీ, బ్రహ్మపురి (కోల్హాపూర్), జోర్వే, కొండాపూర్, బహల్, సంగనకల్లు, అమరావతి, నాగార్జుని కొండ తదితర ప్రాంతాలు ఉన్నాయి. ఈ జాబితాకు అరికమేడును కూడా చేర్చవచ్చు. శాతవాహన రాజ్యంతో గుర్తించదగ్గ టోలెమీ "అరయేక్ సాదేనాన్"లో ఐదు ఓడరేవులు, 18 అంతర్గత పట్టణాలు ఉండేవి. శాసనాలలో పేర్కొన్నబడ్డ, తవ్వకాలలో బయటపడ్డ పట్టణాలు అందులో చాలా వరకు ప్రస్తావించబడ్డాయి.

తమ గుర్తింపును చాటుకోవడానికి వ్యాపారులు తమ తల్లిదండ్రుల పేర్లకంటే తమ స్వంత పట్టణం పేరునే ఎక్కువగా వినియోగించేవారని తెలుస్తోంది. అనేక మంది నిగమలు తాము కళ్యాణకు చెందిన వారమని పేర్కొన్నారు. అలాగే సోపార నుండి ఒక నిగమ, కళ్యాణ నుండి ఒక లోహ కార్మికుడు, ధేనుక-కటక నుండి కూడా ఒక వడ్రంగి వచ్చారని మనం తెలుసుకుంటాము. కొందరు వ్యాపారులు తమను తాము కేవలం నిగమపుత్రులుగా (పట్టణ వాస్తవ్యునిగా) పరిచయం చేసుకున్నారు. ఇలాంటి ఉదంతాలు ఎక్కువగా లేనప్పటికీ వ్యాపారులు, హస్తకళాకారులు తమ స్వంత నగరం లేదా పట్టణానికి ఎంత విలువనిచ్చేవారో, తమ ప్రాంత ప్రతిష్టను ఎంత తీవ్రంగా పరిగణించేవారో వాటి ద్వారా మనకు బోధపడుతుంది. అలాగే వారు తమ పౌర జీవనంలో సాధ్యమైనంత తోడ్పాటును అందించేవారు. వ్యాపారులు తమ తెగ, కుల అనుబంధాల కంటే నగర, ప్రాంతీయ గుర్తింపునకే ఎక్కువ ప్రాధాన్యతనిచ్చేవారని ఇలాంటి ఉదాహరణలు అనేకం స్పష్టం చేస్తాయి.

కనీసం కొన్ని పట్టణాలనైనా నిగమ-సభ పాలించేది. సాంప్రదాయానికి అనుగుణంగా ఉషవదాత తమ విరాళాన్ని ప్రకటించి నిగమ సభతో నమోదు చేయించు కున్నాడు. పట్టణవాసులు కొన్నిసార్లు ఒక కార్పొరేట్ సంస్థగా విరాళాలు అందించేవారు. అమరావతి శిల్పాలలో ధాన్యకటక అనే పట్టణం అందజేసిన కానుకల గురించి అనేక ప్రస్తావనలు ఉన్నాయి.

నిగమ సభ సభ్యులు సహజంగానే వ్యాపారులు. అయితే ఈ హోదాలో కొందరు గహపతులు కూడా విధులు నిర్వహించారు. స్థానిక పరిపాలనలో ప్రజాభాగ స్వామ్యాన్ని ఎందరో విద్వాంసులు ఎత్తి చూపారు. క్రీస్తుశకం తొలి రెండు శతాబ్దాల ప్రాచీన చరిత్రలో ఎక్కడా లేని విధంగా దక్కను, ముఖ్యంగా మహారాష్ట్రలో అనేక పట్టణాలు విరసిల్లినట్లు అనేక శాసనాలు, పురావస్తు తవ్వకాలు నిరూపించాయి.

ఈ కాలంలో దక్కనులో కనిపించిన క్రియాశీల పౌరజీవనం స్థాయి ప్రాచీన భారతదేశంలో మరెక్కడా నమోదు కాలేదు. అంటే మిగతా ప్రాంతాలలో వ్యాపారులు పౌరజీవనంలో అంత చురుకుగా పాల్గొనలేదు. శాసనాలలో సేని లేదా శ్రేణి, నికాయ అనే పదాలు సాధరణంగా కనిపించడాన్ని బట్టి వ్యాపార, హస్తకళాకార మండళ్లు అనేకం ఉండేవని, శాతవాహనుల పాలనలో పౌరజీవనం గణనీయంగా విస్తరించిందని చెప్పవచ్చు. నిగమ సభతో వ్యాపార, కళామండళ్లకు ఎలాంటి సంబంధం ఉండేదో తెలియదు. అలాగే రాజ్యం, వ్యాపార మండళ్ల మధ్య సంబంధ స్వభావం(లక్షణం) ఎలాంటిదో కూడా తెలియదు. అయితే వ్యాపార మండళ్లు పాలకునికి ఆర్థిక స్థిరత్వాన్ని ఇవ్వడంలో కీలక పాత్ర పోషించాయి. పట్టణాల పాలనలో అవి రాజుకు సహకరించి ఉంటాయి. విచిత్రమేమిటంటే శాతవాహన వారస రాజ్యాలలో అలాంటి వ్యాపార మండళ్ల గురించి ఎలాంటి సమాచారం లేదు.

**దక్షిణాదిలో రాజ్య ఆవిర్భావం :**

ప్రాచీన దక్షిణ భారత సామాజిక రూపకల్పనలో అంతర్భాగంగానే రాజకీయ స్థాయిని నిర్ధారించడంపై ఇప్పుడు ఎక్కడ లేని ఆసక్తి కనిపిస్తోంది. ఆదిమ సమాజాలలో రాజ్య ఆవిర్భావ ప్రక్రియపై కొత్త పరిశోధనలు అనేక కొత్త అంశాలను వెలికి తీయడంతో ఈ విషయమై అసక్తి మరింత పెరిగింది. రాజ్య పూర్వ సమాజంలో రాజ్య అధికార నిర్మాణ ప్రక్రియలు, వ్యవస్థలు, పూర్వస్థితిగతులపై నేడు సిద్ధాంతాలు విశాలంగా ఉన్నాయి. కనుక రాజ్య ఆవిర్భావాన్ని అనేక కోణాలలో పరిశోధించవచ్చు. రాజ్య నిర్మాణ ప్రక్రియ తొలిదశ (దక్షిణ భారతదేశపు లోపలి ప్రాంతాలలో)ను లిఖిత చరిత్ర కాలంలో కనుగొనవచ్చు. అపుడు సుసాధ్యమైన జీవనోపాధి స్వరూపాల ఆధారంగా సముదాయాల ప్రాథమిక నివాస ప్రాంతాలు లేదా సూక్ష్మ ఆర్థిక మండళ్లు ఆవిర్భవించాయి. ఇక్కడ కుదురు ఆధారిత దొరతనాలను ప్రతిపాదించవచ్చు. ప్రాచీన తమిళ సాహిత్యంలో ప్రస్తావించబడిన ఐదు వేర్వేరు నైసర్గిక ప్రాంతాలను మౌలిక ఆర్థిక మండళ్లు లేదా విశాల ఆర్థిక మండళ్లుగా గుర్తించారు. సూక్ష్మ ఆర్థిక మండళ్ల మధ్య పరస్పర సంబంధాలు బలపడడంతో విశాలమైన ఆర్థిక మండళ్లు ఏర్పడడం తదుపరి దశను సూచిస్తుంది. ఈ రెండవ దశలో విశాలమైన దొర ప్రాంతాలు (Chiefdoms) ఏర్పడ్డాయి. అంతిమ దశ విశాలమైన ప్రాథమిక ప్రాంతం (నాడు) ఆవిర్భావంతో ముడిపడి ఉంది. తొలి చారిత్రక కాలంలో ఈ ప్రక్రియ క్రమంగా సంపూర్ణమైంది. ఫలితంగా రాజ్యాలు నిర్దిష్టంగా ఆవిర్భవించాయి. విశాలమైన ప్రాంతాల ఏర్పాటు వాటి సమీకరణకు కారణమైన అంశాలు, శక్తులను బాహ్య, అంతర్గతమైనవిగా గుర్తించారు. అంతర్గత అంశాలను ఆర్థిక, సాంస్కృతిక కారకాలుగానూ, బాహ్య అంశాలను మౌర్య రాజ్య ప్రభావం, ఉత్తరాది సామాజిక మత సిద్ధాంతాలు, సంస్థలుగానూ గుర్తించారు. తమిళ కావ్యాలనుండి తమిళ సమాజంపై మౌర్య

రాజ్యం చూపిన ప్రభావాన్ని తెలుసుకోవచ్చు. అయితే ఈ ప్రాంతపు పురాతత్వశాస్త్రంలో మౌర్య ఉనికి నామమాత్రంగా కూడా లేదు. ఉత్తరాది సామాజిక సిద్ధాంతాలు, సంస్థల చొరబాటును సాహిత్య ఆధారాలు చక్కగా ధృవీకరిస్తాయి. అయితే ఇక్కడ ఒక విషయాన్ని మనం దృష్టిలో ఉంచుకోవాలి. దక్షిణాదిలో రాజ్య ఆవిర్భావ ప్రక్రియలో బాహ్య కారకాల కంటే అంతర్గత కారకాలే కీలక పాత్రను పోషించాయి. ఎందుకంటే రాజ్యం ప్రాథమికంగా అంతర్గత చలనాల ప్రతిఫలంగానే ఏర్పాటవుతుంది.

ఈ కాలంలో రాజ్యపూర్వ సమాజం కంటే రాజ్య సమాజానికి పూర్తిస్థాయి పరివర్తన ప్రక్రియ సంభవించిందో లేదో స్పష్టంగా తెలియదు. కావ్యగ్రంథాల సూచికల మేరకు సమాజం దాదాపు తెగదొరల స్థాయిలో ఉండేదని ఊహించవచ్చు. రాజకీయ అధికారశక్తులు మూడు విభాగాలుగా ఉండేవి. ఒకటి కిలార్(గ్రామపెద్ద), రెండవది వెలిర్(కొండ దొరలు), మూడవది వెంటార్ (దిగువ భూభాగాల నాయకులు). ఉర– కిలార్ అన్న విభజన స్వచ్ఛమైన కుదురు ఆధారిత పెద్దమనిషిని సూచిస్తుంది. తన ప్రజలతో అతడికి రక్త సంబంధం ఉండేది. వెలిర్ కొండదొరలు. కొన్నిసార్లు పొరుగు ఉర్–కిలార్‌ను లొంగదీసుకొని వాటి నుండి బలవంతంగా వనరులు వసూలు చేసేవారు. అయితే తమ అధికారాన్ని తమ తమ స్వంత కొండ ప్రాంతాలకే పరిమితం చేసేవారు. తమ కుదురుతో సంబంధం ఉన్న ప్రజలతోనే లావాదేవీలు జరిపేవారు. వెంటార్‌లు పెద్దదొరలు. విశాలమైన భూభాగాలపై వారికి నియంత్రణ ఉండేది. కిలార్‌లను తమ అదుపులో ఉంచుకొని వారి సహాయంతో దండయాత్రలు జరిపేవారు. యుద్ధకానుకలను వారితో పంచుకునేవారు.

తమిళనాడులో మొత్తం మూడు పాలక వంశాలే ఉండేవి : చేర, చోళ, పాండ్య. వారి రాజ్యాలు (ప్రాదేశిక భూభాగాలు) కురించి (కొండ) ప్రాంతాలలో (పశ్చిమ కనుమల నుండి అరేబియా సముద్రం వరకు), కావేరి తీరప్రాంతం, ముల్లై–పలాయి (అడవులు–మెట్టభూములు) ప్రాంతాలుగల దక్షిణ మధ్య మండళ్లలో (తీర ప్రాంతంతో సహా) వరుసగా విస్తరించి ఉండేవి. అయితే ఖచ్చితమైన సరిహద్దుకాని, క్రమం తప్పకుండా శిస్తు లేదా కౌలు వసూలు చేసే సాంప్రదాయం కాని అమలులో ఉండేది కాదు. సరిహద్దు ప్రాంతాలలో వెంటార్ విషయంలో రాజుతో చిన్నస్థాయి దొరల సాంగత్యం శాశ్వతంగా కొనసాగిందని చెప్పడానికి ఎలాంటి ఆధారం లేదు. ప్రాదేశికత్వ లేమి ఇక్కడ స్పష్టంగా అర్థమవుతుంది. కనక తొలి చారిత్రక కాలంలో రాజ్యం కొనసాగిందన్న భావన పట్ల అపనమ్మకం ఏర్పడుతుంది.

సామాజిక నిర్మాణం, అంతిమంగా వ్యవస్థాగత (నిర్మాణపరమైన) పరివర్తనకు దారి తీసిన కొన్ని ప్రధాన శక్తులను (చోదకశక్తులు) గుర్తించడానికి గట్టి ప్రయత్నాలే జరిగాయి. ప్రధాన చోదక శక్తులు లేదా విడదీయరాని కారణాల స్థాయిలో కాకున్నా తొలి చారిత్రక తమిళ సమాజంలో సంభవించిన అన్ని ప్రధాన పరిణామాలను సామాజిక– ఆర్థిక మార్పు యొక్క గతితార్కికాల పర్యవసానాలుగా గుర్తించారు. సామాజిక–ఆర్థిక మార్పు యొక్క గతి తర్కం ప్రజల మధ్య పరస్పర సంబంధాల అంతర్గత చలనాలను సూచిస్తుంది. అలాంటి మండళ్లలో స్థూల ఆర్థిక మండళ్ల ఏర్పాటు, దొరప్రాంతాల అభివృద్ధిని వివిధ సూక్ష్మ ఆర్థిక మండళ్లకు చెందిన సామాజిక వర్గాల మధ్య బలపడిన సంబంధాలతో ముడిపెట్టవచ్చు.

## గుప్త - గుప్త అనంతర కాలాలు

**భారతీయ భూస్వామ్య వ్యవస్థ** : పరస్పరం ముడిపడి ఉన్న రెండు అంశాలతో భారతీయ భూస్వామ్య వ్యవస్థ పరిశీలనను మొదలుపెట్టాల్సి ఉంటుంది. భారతీయ భూస్వామ్య వ్యవస్థ ఎందుకు అభివృద్ధి చెందింది, ఎప్పుడు అభివృద్ధి చెందింది? వ్యక్తిగత చరిత్రకారుల అభిప్రాయాలు చాలా వరకు భిన్నంగా ఉన్న కారణంగా ఈ ప్రశ్నలకు సమాధానాలను అన్వేషించడంలో మనం భూస్వామ్య వ్యవస్థ ఏర్పాటుపై వెలువడిన ప్రధాన వివరణలు, ప్రధాన సిద్ధాంతాలను గుర్తించడానికే పరిమితం కావాలి. తొలి దశలో రాజకీయ భూస్వామ్య వ్యవస్థ మూలాలను వికేంద్రీకృత రాజ్య నిర్మాణ వ్యవస్థలో వెలికి తీశారు. రాజకీయ నిర్మాణ స్వరూపం అభివృద్ధి చెంది బలమైన భూస్వామ్య వ్యవస్థకు పునాదులు వేసిందని సూత్రీకరించారు. ఈ విషయంలో అది భూస్వామ్య దశను గుప్తుల పూర్వకాలంలో స్థిరీకరించారు. భూస్వామ్య ఆర్థిక వ్యవస్థ మూలాలను పరిపాలనా హక్కులతో కూడిన భూదానాలు సాంప్రదాయం, క్షీణిస్తున్న రాజ్య అధికారంలో కనుగొన్నారు. ఈ దశలో కూడా ఈ సిద్ధాంతం రెండు పూడ్చలేని సమాంతరాల అస్థిర స్వభావం వల్ల బలహీనపడింది. సామంత వ్యవస్థ అభివృద్ధితో అంచెలంచెల రాజకీయ వ్యవస్థ పరిడవిల్లిందని ప్రతిపాదించగా పాలనాపరమైన హక్కుతో భూములను పొందిన లబ్దిదారులు (వీరు రాజ్య అధికారాన్ని బలహీనపరచి దానిని వికేంద్రీకరిస్తారని ఆశించాలి) కేవలం బ్రాహ్మణులు, మత సంస్థలు మాత్రమే.

రెండవ ఆలోచన భూదానాలు కొత్త సామాజిక స్వరూపాన్ని సృష్టించాయన్న భావనకు పూర్తిగా విరుద్ధమైంది. అయితే భూదానాలు సాంప్రదాయం ఎప్పుడు పుట్టుకొచ్చిందో వివరించడానికి అది ప్రయత్నిస్తుంది. అదీ "సామాజిక సంక్షోభ" సిద్ధాంతం. ఈ "సామాజిక సంక్షోభం" తొలి సామాజిక స్వరూపాన్ని అంతమొందించిందని భావిస్తారు. కొన్ని అంతర్గత వైరుధ్యాలు(వైషమ్యాలు) సుదీర్ఘ సామాజిక సంఘర్షణలకు దారి తీశాయని విశ్వసిస్తారు. ఈ సామాజిక సంఘర్షణలను పురాణాలు, ఆది గ్రంథాలలో ఘోరంగా చిత్రీకరించారు (గుప్తుల పూర్వ కాలంలో) కలియుగంలో సామాజిక వ్యవస్థ కుప్పకూలి పోయిందని, రాజ్యం తన పాలితుల నుండి స్వంతశక్తిపై రాబడిని సమకూర్చుకోవడంలో విఫలమైనందున అది భూదానాలు చేసే సాంప్రదాయాన్ని ప్రారంభించిందని పౌరాణిక సాహిత్యంలో వివరించారు. ఒక విధంగా చెప్పాలంటే పై భావన నూతన, భూస్వామ్య సామాజిక నిర్మాణ ఆరంభాన్ని రాజ్య అధికార సంక్షోభంలో అన్వేషిస్తుంది. రాజ్య అధికార సంక్షోభం సామాజిక సంఘర్షణల కారణంగా తలెత్తింది. కలియుగపు సామాజిక సంక్షోభాన్ని ప్రతిపాదించిన తీరు దానిని కొత్త సామాజిక నిర్మాణానికి కారణంగానూ, నిర్మాణాంశంగానూ నిర్ధారిస్తుంది. తార్కికంగా ఇలాంటి వాదన అసంబద్ధమైనది. మరీ ముఖ్యంగా వాస్తవిక చారిత్రక ఘటనలు ఇంత వరకు నమోదు కాలేదు. అంత పెద్ద స్థాయిలో సామాజిక సంఘర్షణలను సూచించే పరిణామాలు ఎక్కడా ఉల్లేఖించబడలేదు. రాజ్య అధికారాన్ని సంక్షోభంలోకి నెట్టివేసిన సామాజిక సంఘర్షణలు తొలిచారిత్రక పట్టణ నాగరికత పతాకస్థాయికి చేరుకున్న కాలంలో చోటుచేసుకున్నాయని భావిస్తారు.

మరోవైపు రాజ్య అధికార సంక్షోభం తర్వాత తలెత్తిన సామాజిక సంక్షోభావాన్ని కొత్త సామాజిక నిర్మాణ ఆరంభానికి వివరణగా చూపడం మరో సమాంతర సిద్ధాంతానికి నిర్మాణపరంగా పూర్తి భిన్నంగా ఉంది. ఆ సమాంతర సిద్ధాంతం ఇలా ఉంది. పట్టణాల మార్కెట్ ఆర్థిక వ్యవస్థ వ్యవసాయ ఆధారిత మనుగడ ఆర్థిక వ్యవస్థగా పతనం కావడంతో క్రీ.శ. మూడవ శతాబ్దం నుండి పట్టణాలు పూర్తి స్థాయిలో నిర్వీర్యమై నిర్మానుష్యంగా మారాయి. భూస్వామ్య వ్యవస్థ మూలాలను అర్థం చేసుకోవడానికి ఈ పరిణామం కీలకాంశంగా ఉండగలదు. ఇక్కడ కూడా సిద్ధాంత రూపకల్పన అంతర్గత లోపాలతో నిండి ఉంది. అయితే ఇక్కడో విషయాన్ని గమనించాలి. ఒక వివరణాత్మక నమూనాగా "పట్టణ క్షీణత" (urban decay)రాజ్య అధికారం కుప్పకూలడానికి దారి తీసిన సామాజిక సంఘర్షణల వలె స్థిరమైనది కాదు. రాజ్య వనరులు కుదించుకుపోయాయని సూచించడం వేరే విషయం. సుదూర వాణిజ్య లావాదేవీల వ్యవస్థలు కూలిపోవడంతో ముడిపడి ఉన్న పట్టణ క్షీణతను బాహ్య కారకంగా పరిగణించవచ్చు. అయితే సామాజిక సంఘర్షణలు అంతర్గత వివరణను అందిస్తాయి. ఆ విధంగా చూస్తే భారతీయ భూస్వామ్య వ్యవస్థ ఆవిర్భావ మూలాలను వివరించే సంతృప్తికరమైన నిర్మాణాత్మక వాదన ఏదీ లేదు. ముందుగా సూచించినట్లు భారతీయ భూస్వామ్య వ్యవస్థపై ప్రస్తుతమున్న సిద్ధాంతం ప్రాచీన భారతదేశ నేపథ్యంలో కేంద్రీకృత రాజ్యం, వికేంద్రీకృత రాజ్యం, అలాగే పట్టణ మార్కెట్ ఆర్థిక వ్యవస్థ, సహజసిద్ధమైన ఆర్థిక వ్యవస్థల మధ్య ద్విముఖ వైరుధ్యాన్ని (ఊహాత్మక) నొక్కి చెబుతూనే ఉన్నట్లు కనబడుతోంది.

ఏది ఏమైనప్పటికీ ఈ సిద్ధాంతం భారత చరిత్రను శాసించిన రెండు ప్రధాన ప్రక్రియలను పూర్తిగా విస్మరించింది. క్రీ.శ. 320 నుండి 750 మధ్య కాలంలో ఆ ప్రక్రియల పర్యవసానాలను (ప్రభావాలను) అర్థం చేసుకోవడంలో విఫలమైంది. (1) రాజ్య నిర్మాణ ప్రక్రియ ఆధారంగా రాజ్యపూర్వ సమాజం రాజ్య సమాజంగా పరివర్తనం చెందడం (2) తెగలు రైతు సముదాయంగా రూపాంతరం చెందడం, ఈ రూపాంతరం ద్వారా సమాజంలోని వివిధ వర్గాలు కుల వ్యవస్థ నిర్మాణంలో స్థానం పొందడం(వర్ణ సిద్ధాంత చట్రంలో అంతర్భాగంగా) ఆ రెండు ప్రధాన ప్రక్రియలు ఈ రెండు ప్రక్రియలు పరస్పరం ముడిపడి ఉన్నాయని మరింత నొక్కి చెప్పాల్సిన అవసరం ఉంది. భారత చరిత్రలోని ఏ దశలోనైనా వాటి నిర్వహణను ప్రాంతీయ దృష్టికోణం నుండి చూడాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే భారతదేశంలో చారిత్రక సాంస్కృతిక ప్రాంతాల ఏర్పాటు విభిన్నమైన స్థలకాలాదుల నేపథ్యాలలో ఈ లక్షణాలు ఎలా ప్రధానంగా మారాయన్న దానిపైనే ఎక్కువగా ఆధారపడి ఉంది.

సాంప్రదాయానికి భిన్నంగా ఇటీవల చేపట్టిన పరిశోధనల ద్వారా ఒక విషయం మరింత స్పష్టమవుతోంది. ఈ కాలం స్థానిక ప్రాంతీయ రాజ్యాల ఆవిర్భావానికి ఎంతో కీలకంగా ఉండేదని అర్థమవుతుంది. పట్టణ ప్రాంతాల పతనమే తొలి మధ్యయుగ కాలానికి నేపథ్యంగా ఉందని వాదించిన ఇటీవలి ఒక పరిశోధన కూడా ఈ కాలం కొత్తరాజ్యాలు లేదా రాచరికాల ఆవిర్భావానికి అత్యంత ముఖ్యమైనదన్న విషయాన్ని గుర్తించడంలో విఫలం కాలేదు. గుప్తుల సామ్రాజ్య వ్యవస్థను పక్కన పెడితే ఈ కాలంలో మనం 69 రాజ్యాలను దేశవ్యాప్తంగా లెక్కించవచ్చు. వాటిలో 48 రాజ్యాలు మహారాష్ట్ర, తూర్పు మధ్య ప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా, బెంగాల్‌లలో విస్తరించి ఉండేవి. ఒక విధంగా చూస్తే ఈ రాజ్యాలు ఏర్పడిన ప్రాంతం కొన్ని

అవాంతరాలు కల నిరంతర ప్రాదేశిక భూభాగంగా మనకు దర్శనమిస్తుంది. ఈ నిరంతర భౌగోళిక మండలిలో ఎక్కువ భాగం అడవులతో కూడి పీఠభూమిగా ఉంది. ముఖ్యంగా వింధ్య పర్వత ప్రాంతంలో అది విస్తరించి ఉంది.

## గుప్తుల లిఖిత భూస్వామ్య రాజకీయ వ్యవస్థ :

**సామాజిక- ఆర్థిక నేపథ్యం:** మధ్యభారతం, దక్కను, దక్షిణ భారతంలో విశాలంగా అందుబాటులో ఉన్న భూములను క్రియాశీల బ్రాహ్మణులకు దానంగా కట్టబెట్టడం వల్ల గుప్తుల యుగంలో ఆర్థిక వ్యవస్థ విస్తరించింది. వ్యక్తిగత ఆస్తి (భూమి) లో కూడా గణనీయమైన ప్రగతి వచ్చింది. వ్యక్తిగత ఆస్తులను (భూములు) శాసనగ్రంథాలు గుర్తించాయి. బంగారు నాణేలు వెచ్చించి భూమిని కొనుగోలు చేసేవారు లేదా వాటిని స్వీకరించి విక్రయించేవారు. దీనికి తగిన పురావస్తు ఆధారాలు ఉన్నాయి. పాలక వర్గ ఆర్థిక సౌభాగ్యాన్ని అసంఖ్యాక బంగారునాణేలు సూచిస్తాయి. ప్రాచీన భారత దేశంలో ఏ ఇతర వంశానికి లేనన్ని నాణేలు గుప్త పాలకులకు ఉండేవి. బంగారు మారకాన్ని ఉపయోగించడంతో వ్యాపారులు, ధనిక ఉత్పత్తిదారులు బలోపేతమయ్యారు. వీరు ఏర్పాటు చేసిన మండళ్లతో బంగారు నగదు విరాళాలను అప్పుడప్పుడూ జమ చేసేవారు. విదేశీ వాణిజ్యం, పట్టణ మార్కెట్లు పతన మైనప్పటికీ వ్యాపార మండళ్లు గుప్తుల కాలంలో అనేక పట్టణాలలో ఆర్థిక, పాలనా వ్యవస్థలలో పాలు పంచుకుంటూనే వచ్చాయి.

గుప్తుల కాలం నాటి రాజకీయ సంఘటనం స్థూల చిత్రాన్ని రూపొందించే ముందు దేశవ్యాప్తంగా విస్తరించి ఉన్న అసంఖ్యాక పాలక వంశాలను మనం దృష్టిలో పెట్టుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. హరిసేన అందించిన ఇతివృత్తంలో కొంత అతిశయం ఉందని అంగీకరించినా సముద్రగుప్తుడు అనేక రాజ్యాలు లేదా పాలక వంశాలను తన నియంత్రణలోకి తెచ్చుకున్నాడు. రెండవ చంద్రగుప్తుడు పశ్చిమ భారతదేశాన్ని స్వాధీనం చేసుకున్నాడన్నది నిర్వివాదాంశం. సుదూర ప్రాంతాలను జయించడంవల్ల ఏదో ఒక రకమైన భూస్వామ్య సంఘటనాన్ని రూపొందించాల్సిన అవసరం ఏర్పడింది. మౌర్యులకు పూర్తి భిన్నంగా గుప్త పాలకులు పరమేశ్వర, మహారాజాధిరాజ, పరమభట్టారక లాంటి అతిశయ బిరుదులను పొందారు. సామ్రాజ్యంలో ఇతర దిగువ శ్రేణి పాలకులు ఉండేవారని పై బిరుదులు సూచిస్తాయి.

**కేంద్ర ప్రభుత్వం :** రాజత్వం అనువంశికమైనప్పటికీ రాచరిక అధికారం పరిమితంగా ఉండేది. తొలి సంతానాన్ని వారసునిగా స్వీకరించాలన్న నిర్దిష్ట సాంప్రదాయం ఏదీ లేకపోవడం వల్లే ఇలాంటి పరిస్థితి ఉత్పన్నమైంది. గుప్త పాలకుడు తన మంత్రులు, సామంతులు, అందరికంటే మించి బ్రాహ్మణులతో వేగాల్సి వచ్చేది. వీరు నారద నిబంధనావళిని ఆధారం చేసుకొని తమకు ప్రత్యేక ప్రయోజనాలు, హక్కులు సమకూర్చాలని కోరుకునే వారు. స్మృతులలో ప్రతిపాదించిన చట్టాలను అన్వయించడంలో బ్రాహ్మణులే కీలక పాత్ర పోషించేవారు. అలాగే ధర్మ పరిరక్షకులుగా వ్యవహరించేవారు. గుప్త రాచ శాసనాలలో పురోహితుడిని ఉన్నతాధికారిగా పేర్కొనకపోయినా తమకు లభించే ఖరీదైన కానుకలకు కృతజ్ఞతగా బ్రాహ్మణులు గుప్తుల శాసనాలను రూపొందించి పాలకులను వివిధ దైవాలతో పోల్చారు. ఆ విధంగా శాతవాహన సాంప్రదాయాన్ని కొనసాగించి దానిని ఉత్తర భారతదేశంపై రుద్దారు.

సముద్రగుప్తుడు అన్ని దిశల్లోనూ దండయాత్రలు చేపట్టి విజయాలు సాధించాడని ప్రశస్తులు ఉన్నప్పటికీ గుప్తుల సైనిక నిర్మాణంపై మనకు అంతగా సమాచారం అందుబాటులో లేదు దురదృష్టవశాత్తు ఫాహియాన్ గుప్త సైన్యం సంఖ్యాబలాన్ని పేర్కొనలేదు. నందులు, మౌర్యుల విషయంలో మాత్రం విదేశీ యాత్రికులు తమ కథనాలలో ఆయా రాజ్యాల సైనిక బలం గురించి ప్రస్తావించారు. హుయాన్ త్సాంగ్ హర్షవర్ధనుడి సైనిక బలం గురించి విపులంగా చర్చించాడు. కౌటిల్యుడు తన అర్థశాస్త్రంలో ప్రతిపాదించిన వివిధ రకాల పన్నులను గుప్తులు పూర్తిగా అమలు చేయలేదు. గుప్త శాసనాలలో ఆయా పన్నులు, శిస్తుల సంఖ్య పరిమితంగా ఉంది. అయితే భూమి శిస్తుల సంఖ్య గణనీయంగానే ఉంది. వ్యాపార, వాణిజ్య పన్నులు తగ్గు ముఖం పట్టాయి. గుప్త కాలంలో అమలైన రెండు ప్రధాన భూమి శిస్తులు ఉద్రంగ, ఉపారిక. అయితే రైతు సాధించిన దిగుబడిలో వాటి శాతం ఎంతో స్పష్టంగా తెలియదు. ధనిక రైతులు నగదు రూపంలో పన్నులు చెల్లించినట్లు బోధపడుతోంది. ముఖ్యంగా బంగారు (నాణేలు) రూపంలో వారు పన్నులు చెల్లించి ఉంటారు. బంగారు నాణేలను హిరణ్య అని పిలిచేవారు. మధ్య, పశ్చిమ భారతదేశంలో పాలకులు రైతులతో బలవంతపు శ్రమ (విస్టి) చేయించేవారు. దీనికితోడు వకాటకులు నియంత్రణలోని భూభాగాలు, మధ్యభారతంలోని ఇతర ప్రాంతాలలో రైతులు, పశువులు, తిండిగింజలు, కలప సామాగ్రి తదితర వాటిని గ్రామీణ ప్రాంతాలలో పని చేసే రాచరిక అధికారులు, సేవకులకు సరఫరా చేయాల్సి వచ్చేది.

శిక్షాస్మృతుల ప్రకారం మూడు అంచెల న్యాయస్థానాలు ఉండేవి. సర్వోన్నత న్యాయస్థానంగా రాజు వ్యవహరించేవాడు. అయితే న్యాయ స్థానాలు చట్టాన్ని ఏ విధంగా అమలు జరిపేవో ఊహా మాత్రంగానైనా తెలియదు. అయితే సాధారణ చట్ట వ్యవస్థ (న్యాయస్థానాల వ్యవస్థ)ను బ్రాహ్మణిక న్యాయనిపుణులు సృష్టించారు. గుప్తుల యుగంలో వీరు అనేక చట్టాలను రూపొందించారు. వాటిని గ్రంథాలుగా ముద్రించారు. న్యాయ వ్యవస్థ అనేక దిశలలో ముందుకు సాగింది. తొలి అడుగు వారసత్వ చట్టమే ఎందుకంటే యజవాల్క్య కృతిలో భూ ఆస్తి విభజన చట్టాన్ని ప్రవేశపెట్టడంపై సుదీర్ఘమైన వివరణ ఉంది. రెండవది, నారద, బృహస్పతిలు రెండు రకాల చట్టాలను వర్గీకరించారు. అందులో ఆస్తికి సంబంధించిన 14 హోదాలు, గాయానికి సంబంధించిన నాలుగు శిక్షలు ఉన్నాయి. మూడవది, నారద, బృహస్పతి, కాత్యాయనల చట్టస్మృతులు న్యాయస్థానాల ఏర్పాటు, న్యాయ ప్రక్రియ, సాక్ష్యానికి సంబంధించిన చట్టం గురించి సమగ్రంగా వివరిస్తాయి.

శాసనకర్తలు సాధారణంగా బ్రాహ్మణ వర్ణానికి చెందిన వ్యక్తులనే న్యాయమూర్తులు, విశ్లేషకులుగా ఉండాలని కోరుకునేవారు. ఒకవేళ బ్రాహ్మణులు అందుబాటులో లేని పక్షంలో క్షత్రియ, వైశ్య కులస్తులను భర్తీ చేసేవారు. సూద్రులను ఈ పదవులలో ఎట్టి పరిస్థితులలోనూ నియమించేవారు కాదు. ఆయా స్మృతులలో పేర్కొన్న న్యాయమూర్తులు లేదా న్యాయస్థానాల గురించి రాచరిక శాసనాలు ధృవీకరించలేదు. మరోవైపు వినయస్థితి స్థాపన అనే ఒకే ఒక్క ముఖ్యమైన న్యాయాధికారి గురించి వైశాలి ముద్రికలో ప్రస్తావన ఉంది. అయితే ఆ కాలపు స్మృతులకు అలాంటి వ్యక్తి గురించి ఏ మాత్రం తెలియదు.

కొందరు అధికారుల పేర్లను గుప్తుల భూదాన శాసనాలు ప్రస్తావించినా ఆర్థిక, వాణిజ్య కార్యకలాపాలతో ముడిపడి ఉన్న వారి సంఖ్య మౌర్యుల కాలం కంటే పెద్దదేమీ కాదు. మౌర్య అధికార యంత్రాంగంతో పోలిస్తే గుప్తుల వ్యవస్థ అంత విశాలమైనది కాదు. దానికి నిర్దిష్ట సంఘటనం అంటూ ఉండేది కాదు. కుమారమాత్య అనే వర్గం నుండే ఉన్నతాధికారులు ఎక్కువగా వచ్చేవారు. అశోకుని మహామాత్య, శాతవాహన కాలంలోని అమాత్యతో వారిని పోల్చవచ్చు. ఉన్నతాధికారులను చాలా వరకు పాలకుడే నేరుగా నియమించేవాడు. వారిని ఆయా ప్రాంతాలకు పాలనాధిపతులుగా నియమించి నగదు రూపంలో వేతనం చెల్లించేవారు. అయితే ఒకే వ్యక్తికి అనేక పదవులను కట్టబెట్టేవారు. క్రమంగా పదవులు అనువంశికంగా మారాయి. సహజంగానే ఈ పరిణామం అధికార యంత్రాంగంపై కేంద్ర నియంత్రణను బలహీనపరిచింది.

**ప్రాంతీయ, స్థానిక పాలన :** గుప్తుల కాలంలో ప్రాంతీయ, స్థానిక పాలనా వ్యవస్థ సమగ్రంగా ఉండేదని ఎన్నో శాసనాలు చెబుతాయి. సామ్రాజ్యం భుక్తిలుగా విభజించబడి ఉండేది. ప్రతి భుక్తికి ఉపారిక అనే అధికారి అధిపతిగా ఉండేవాడు. బెంగాల్, బీహార్, యు.పి, మధ్యప్రదేశ్‌లలో కనీసం అరడజను భుక్తిలు ఉండేవి. భుక్తిలను విషయలుగా విభజించి వాటిలో విషయపతిని నియమించేవారు. తూర్పు ప్రాంతంలో విషయను విధులుగా, విధిని గ్రామాలుగా విభజించారు. అయితే ఇలాంటి విభజన వ్యవస్థ గుప్త పాలకులు నేరుగా పాలించిన ప్రాంతాలలోనే ప్రధానంగా లభిస్తుంది. మిగతా ప్రాంతాలలో దేశ, మండల, భోగ లాంటి విభిన్న ఆర్థిక– పాలనా యూనిట్లు కనిపిస్తాయి. ముఖ్యంగా మధ్య, పశ్చిమ భారతదేశంలో ఇలాంటి ఏర్పాటు ఉండేది.

గుప్తుల కాలంలో గ్రామ పరిపాలన కొత్త పుంతలను తొక్కింది. మౌర్య కాలంలో “గోప” అనే అధికారి రాజ్యం పక్షాన గ్రామాన్ని శాసించేవాడు. కాని గుప్తులపాలనలో రాజ్యం గ్రామ వ్యవహారాలలో నేరుగా జోక్యం చేసుకోలేదు. అలాగే గ్రామ పాలనను దగ్గరి నుండి పర్యవేక్షించలేదు. ఈ దశలో గ్రామ పెద్ద పాలనా బాధ్యతలన్నీ చూసుకునేవాడు. మహత్తర (పెద్దమనుషులు) సహకారంతో సమస్యలను పరిష్కరించేవాడు. మహత్తర కొన్ని సందర్భాలలో విషయ ప్రభుత్వంతో కూడా ముడిపడి ఉండేవారు. గ్రామం, లేదా విధి అనే చిన్న పట్టణాల పాలనలో కొందరు స్థానిక వ్యక్తులు పాల్గొన్నారని గుప్తశాసనాలు చెబుతాయి. వారి అనుమతి లేనిదే ఎలాంటి క్రయ విక్రయాలు (భూమి) జరిగేవి కావు. ఇతర ముఖ్య వ్యవహారాలలో కూడా ఇలాగే జరిగి ఉంటుంది. ఆ విధంగా మౌర్యుల కాలంలో గ్రామాలు పై నుండి శాసించబడితే గుప్తుల కాలంలో వాటిని కింది నుండి పాలించారు.

ఉత్తర భారతదేశంలో స్వంత నాణేలు జారీ చేసే పట్టణాలు అధికార చిత్రపటం నుండి కనుమరుగయ్యాయి. ఇప్పుడు అవి తమ అధికారాన్ని చాటుకోవడానికి కేవలం ముద్రలను మాత్రమే జారీ చేశాయి. వైశాల నుండి లభించిన ముద్రల ఆధారంగా వ్యాపారులు, వృత్తిదారులు, బ్యాంకర్లు ఒకే కార్పొరేట్ సంస్థలో విధులు నిర్వహించినట్లు స్పష్టమవుతుంది. ఆ హోదాలో వారు పట్టణ వ్యవహారాలను కూడా చక్కబెట్టారన్నది సుస్పష్టం. వృత్తిదారులు, బ్యాంకర్ల కార్పొరేషన్లు వేర్వేరుగా కూడా చెలామణి అయ్యాయి. వీటికి తోడు వృత్తిదారులు, వ్యాపారుల

మండళ్లు ఖిల, వైశాలిలో అనేకం ఉండేవని మనకు తెలుస్తుంది. మండసోర్‌లోని పట్టుతయారీదారుల మండలి, ఇందూర్(బులంద్‌షహర్) లోని గానుగ వ్యాపారుల మండలి గురించి గుప్త శాసనాలలో ప్రముఖంగా ప్రస్తావించారు. వృత్తిపరమైన మండళ్లు కుటుంబ సంఘటనాలకు పూర్తి భిన్నమైనవి. అందులో అందరికీ అభివృద్ధి చెందే అవకాశం ఉండేది. మండసోర్ పట్టు తయారీదారులే అందుకు ఉదాహరణ. తమ స్వంత సాంప్రదాయాలకు అనుగుణంగా ఈ మండళ్లు నడుచుకునేవి. మండలి అధికారులు రాజ్యం యొక్క జోక్యం లేకుండా తమ విధులను నిర్వర్తించేవారు. గుప్తుల కాలంలో మండలి సభ్యుల సంక్షేమమే కాకుండా తాము నివసిస్తున్న పట్టణాల వ్యవహారాలను కూడా మండళ్లు చూసేవని మనకు అర్థమవుతుంది. పర్యవసానంగా పట్టణాలను పాలించే భారం నుండి రాజ్యం పాక్షికంగా ఉపశమనం పొందింది. రాజ్య అధికారులు ప్రత్యేకంగా అలాంటి బాధ్యతలను నిర్వహించినట్లు శాసనాలు ఎక్కడా పేర్కొనలేదు.

**పరోక్ష పాలన గల ప్రాంతాలు:** ఉత్తర బెంగాల్, బీహార్, యు.పి.లను గుప్త పాలకుడు నియమించిన అధికారులు ప్రత్యక్షంగా పాలించినప్పటికీ సామ్రాజ్యంలోని విశాల భూభాగాన్ని పరివ్రజక, ఉక్కకల్ప రాకుమారులు లాంటి సామంతులు నియంత్రిచేవారు. అలాగే సముద్రగుప్తుడు లొంగదీసుకున్న స్థానిక పాలకులూ అందులో ఉన్నారు. సామ్రాజ్య సరిహద్దు ప్రాంతాలలో నివసించిన సామంతులు మూడు మార్గాలలో తమ బాధ్యతలను నిర్వహించారు. చక్రవర్తి ఆస్థానంలో వ్యక్తిగతంగా హాజరై సార్వభౌమునికి గౌరవ వందనాలు సమర్పించడం, కప్పం చెల్లించడం, తమ కుమార్తెలను చక్రవర్తితో వివాహం జరిపించడం ద్వారా సామంతులు తమ విధేయతను, కర్తవ్యాలను పూర్తి చేసేవారు. సముద్రగుప్తుని అలహాబాదు శాసనం పై సాంప్రదాయాలన్నింటిని ప్రస్తావిస్తుంది. అయితే పై బాధ్యతలకు అదనంగా సామంతులు చక్రవర్తికి సైన్యాలను కూడా సమకూర్చిపెట్టేవారు. యుద్ధ సమయంలో చక్రవర్తి తన సామంతులందరికీ రక్షణ కల్పించేవాడు. గుప్తుల ప్రధాన సామంతుల్లో వలభికి చెందిన మైత్రకులు, థానేశ్వర్‌కు చెందిన వర్ధనులు, కనౌజ్ మౌఖారీలు, మగధకు చెందిన తదుపరి గుప్తులు, బెంగాల్ చంద్రలు ఉన్నారు. గుప్త సామ్రాజ్యం పతనమైన తర్వాత దాని శిథిలాలపై వీరు స్వతంత్ర రాజ్యాలను స్థాపించారు.

**పాలనా హక్కుల వితరణ:** అయితే గుప్త సామ్రాజ్యం చవిచూసిన నిజమైన భూస్వామ్య వ్యవస్థ ప్రగతి పురోహితులు, ఆలయాలకు ఆర్థిక, పాలనాపరమైన మినహాయింపులే. భూదానాలవల్ల వారికి ఇలాంటి అధికారాలు దఖలుపడ్డాయి. దక్కను శాతవాహనులతో భూదానాల సాంప్రదాయం మొదలైంది. గుప్త సామంతులు, వకాటకల నియంత్రణలోని మధ్య భారతదేశ భూభాగాలలో ఈ సాంప్రదాయం సర్వవ్యాపితమైంది. అయితే గుప్త చక్రవర్తులు కేవలం కొన్ని భూదానాలు మాత్రమే చేశారు. కొత్తగా అందించిన ఆర్థిక మినహాయింపులలో ఉప్పు, గనులపై ఉన్న రాచరిక హక్కుల బదిలీ కూడా ఉంది. ఉప్పు, గనులపై అంతవరకు రాచరికానికి ఉన్న గుత్తాధిపత్యం, సార్వభౌమత్వ చిహ్నాలు తొలగిపోయాయి. మతపరమైన లబ్దిదారులకు గ్రామాలను శాశ్వత ప్రాతిపాదికన కట్టబెట్టారు. పన్నులు వసూలు చేసే అధికారం వారికి బదిలీ అయ్యింది. ఉత్తర భారతదేశం, దక్కనులలో లబ్దిదారులు తమ పోషకులు లేదా దాతలకు పన్నులో  కొంత భాగాన్ని కూడా చెల్లించేవారు కాదు. అయితే గుప్త కాలంలో

దానం ఇచ్చిన భూములు, సంబంధిత శాసనాలు ప్రత్యేకమైనవి. ఎందుకంటే లబ్ధిదారులకు భూముల (గ్రామాలు)తోపాటు అధికారిక హక్కులను కూడా కట్టబెట్టారు. రాచరిక దళారులు, సేవకులు తదితరులు వారి గ్రామాలలో ప్రవేశించేవారు కాదు. శాతవాహన శాసనాలలో కూడా ఇలాంటి ఏర్పాటు కనిపిస్తుంది. కాని ఇపుడు పది రకాల నేరాలకు పాల్పడే వారిని శిక్షించే అధికారం కూడా లబ్ధిదారులకు దక్కింది. వేరే మాటల్లో చెప్పాలంటే లబ్ధిదారులకు మెజిస్ట్రీరియల్, పోలీసు అధికారాలు దఖలు పడ్డాయి. అలాగే లబ్ధిదారులకు కట్టబెట్టిన గ్రామాల పరిధిలోని ప్రజలు తమ కొత్త యజమానులను గౌరవించి వారి ఆజ్ఞలను పాటించాలని కూడా రాజు తన భూదాన శాసనంలో ఆదేశించాడు.

**రాజకీయ వ్యవస్థ ఫ్యూడల్ స్వభావం:** సామ్రాజ్య అధికార వ్యవస్థలో గణనీయమైన ప్రాంతాన్ని సామంతులు, లబ్ధిదారులు పాలించేవారు. కనక గుప్త చక్రవర్తులకు మౌర్యుల వలె పెద్ద సంఖ్యలో అధికారుల అవసరం ఏర్పడలేదు. పరిమితంగా ఉన్న అధికారులు కూడా నిరర్థకంగా మారారు. ఎందుకంటే రాజ్యం పక్షాన ఆర్థిక కార్యకలాపాలు విశాల స్థాయిలో జరగలేదు. అలాగే భారీ సుశిక్షిత సైన్యం కూడా ఉండేది కాదు. గ్రామీణ, పట్టణ పాలనలో వృత్తిదారులు, వ్యాపారులు, పెద్దలు, తదితరులు పాల్గొనడంవల్ల విస్తృతమైన అధికార యంత్రాంగం కలిగి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడలేదు. మౌర్య కాలంలో ఇలాంటి లక్షణం కనిపించదు. గ్రామాలు సర్వస్వతంత్రంగా వ్యవహరించాయి. కేంద్రంతో చర్చించాల్సిన అవసరం ఉండేది కాదు. కనక గుప్తులకు మౌర్యుల వలె విస్తృతమైన అధికార యంత్రాంగం ఉండేది కాదు. పెద్ద సంఖ్యలో అధికారులను నియమించాల్సిన అవసరమే తలెత్తలేదు. గుప్త చక్రవర్తులకు బలమైన సైన్యాలు ఉన్నప్పటికీ వికేంద్రీకరణ వైపు కృషి చేస్తున్న శక్తులు ఇంకా బలంగా ఉండేవి. అనేక విధాలుగా గుప్తుల పాలన భూస్వామ్య రాజకీయ వ్యవస్థకు నాంది పలికింది. తొలి మధ్యయుగ భారతంలో ఇలాంటి వ్యవస్థ సర్వసాధారణమై పోయింది.

## గుప్త- అనంతర సామంత వ్యవస్థ:

**అర్థం - ప్రభావం:** సామంత వ్యవస్థ ప్రాచీన భారతదేశంలోని ఇతర యుగాలను గుప్త-అనంతర కాలం నుండి వేరు చేసే ప్రధాన ఆవిష్కరణ. సామంత అనే పదాంశం తొలుత "పొరుగువాడు" అనే అర్థానిచ్చేది. మౌర్యుల కాలంలో పొరుగు భూభాగాన్ని పాలిస్తున్న స్వతంత్ర పాలకుడిని ఉద్దేశించి ఆ పదాన్ని వాడేవారు. కౌటిల్యుడి అర్థశాస్త్ర, అశోకుని శాసనాలు సామంత అనే పదం చాలాసార్లు దొర్లుతుంది. గుప్తపూర్వకాలంలో ఆ పదాన్ని శాసన కర్తలు పొరుగు భూయజమానిని ఉద్దేశించి ప్రస్తావించారు. సరిహద్దు రాజుల (ప్రత్యాంతనృపతి) గురించి సముద్రగుప్తుడు తన అలహాబాదు ప్రశస్తిలో ప్రస్తావించాడు. ఆ మాటకు వస్తే వారు కూడా సామంతులతో సమానమే. గుప్తుల పాలన ముగిసేనాటికి, అలాగే ఆరవశతాబ్దం నాటికి సామంత అనే పదం ఖచ్చితంగా ఒక కొత్త అర్థం సర్వజనీనతను సంతరించుకుంది. సామంత అంటే లొంగిపోయిన లేదా అధికారాన్ని తిరిగి దక్కించుకున్న రాకుమారుడు అనే అర్థాన్ని ఇవ్వడం మొదలు పెట్టింది.

**ఆవిర్భావం, ప్రగతి:** సామంతుల ఆవిర్భావం, వారి ప్రగతిని ఫ్యూడల్ రాజ్యాల ప్రగతిలో ప్రత్యేకమైన నిర్మాణ లక్షణంగా పేర్కొనవచ్చు. ప్రాచీన భారతంలో పూర్వపు యుగాలలో

ఉన్నత స్థాయిలో నియమితులైన పాలకులు (అధికారులు) ఉంటే గుప్త అనంతర కాలం నుండి ఫ్యూడల్ ప్రాంతాలను రాకుమారులు నియంత్రించారు. కేంద్ర పాలకుని చేతిలో ఓటమి పాలై అతడి దయతో రాజ్యాన్ని తిరిగి దక్కించుకున్న వీరు క్రమం తప్పకుండా కప్పాన్ని చెల్లిస్తూ తమ విధేయతను ప్రదర్శించేవారు. చివరి గుప్త కాలంలో ఈ రకమైన పాలకుడు ఎక్కువగా సరిహద్దు ప్రాంతాలలో కనిపించేవాడు. అయితే హర్షుని కాలంలో, ఆ తర్వాత వారు చివరకు రాజ్య మూల ప్రాంతంలో కూడా బలమైన వ్యక్తులుగా ఎదిగారు. ఈ బలమైన పాలితుల (సామంతులు)ను రాజ్య అధికార నిర్మాణంలో అంతర్భాగం చేసేందుకు రాజులు వారికి తన ఆస్థానంలో ఉన్నత పదవులను కట్టబెట్టేవాడు. ఆ విధంగా ఉత్తర భారతదేశంలో హర్షవర్ధనుడి చేతిలో ఓటమి పాలైన వలభిరాజు మహాసామంతగా గుర్తింపు పొందడమే కాకుండా "మహాప్రతిహార" (రాచరిక మహాద్వార పరిరక్షకుడు) లాంటి ఉన్నత పదవులకు సైతం ఎగబాకాడు. తర్వాత మహాదండనాయక (రాచరిక సైన్యాధిపతి) పదవిని కూడా అలంకరించాడు. మరోవైపు కేంద్ర ఆస్థానంలోని ఉన్నతాధికారులు కూడా తమకు సామంతులు (రాకుమారులు)తో సమానంగా గుర్తింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ పరిణామం కాలక్రమంలో సంభవించింది. అయితే ఉన్నతమైన బిరుదు ఒక్కటే సరిపోదు. దానితోపాటు కొంత భూభాగాన్ని కూడా కేటాయించాలని అధికారులు కోరారు. ఆ విధంగా సామంతీకరణ ప్రక్రియ రాజ్యాలలో మొదలైంది. దీనినే భారతీయ తరహా భూస్వామ్య వ్యవస్థ అని పరిగణించవచ్చు. సామంతీకరణ ప్రక్రియ రెండు కారకాలవల్ల వేగిరమైంది (1) వేతనాలు చెల్లించడానికి నగదు కొరత, (2) పాలకుని సామంతచక్ర పరిమాణం బట్టి రాచరిక ప్రతిష్ట ఆధారపడి ఉంటుందన్న కొత్త సిద్ధాంతం.

**శిలాశాసన ఆధారం :** క్రీ.శ. ఐదవ శతాబ్దం తృతీయ భాగంలో సామంత అనే పదాన్ని దక్షిణ భారతంలో వాడారు. "సామంత-చూడామణియ" (ఉత్తర సామంతులు) అనే పదం శాంతివర్మన్ (క్రీ.శ.455-470) పాలనా కాలం నాటి పల్లవ శాసనంలో కనిపిస్తుంది. ఉత్తర భారతదేశంలో ఆరవ శతాబ్దం తొలి భాగంలో వేయించిన బరాబర్ కొండగుహ శాసనం (మౌఖారీ నాయకుడు అనంతవర్మన్ జారీ చేసినది)లో సామంత అనే పదం మొదటిసారిగా ప్రత్యక్షమవుతుంది. అందులో అనంతవర్మన్ తండ్రిని సామంత-చూడామణిగా సంబోధించారు. అతడు సామ్రాజ్య గుప్తుల సామంతునిగా ఉండేవాడు. తదుపరి యశోధర్మన్ (525-535) జారీ చేసిన మందసోర్ స్థూపశాసనంలో సామంత అనే పదం ప్రముఖంగా ప్రస్తావించబడింది. యావత్తు ఉత్తర భారతదేశంలోని సామంతులందరినీ లొంగదీసుకున్నట్లు యశోధర్మన్ ఆ శాసనంలో వాదించాడు.

**సాహిత్య ఆధారం :** తన హర్షచరిత్రలో బాణుడు అనేక రకాల సామంతుల గురించి చర్చించాడు. వారిలో సామంతుడు దిగువ శ్రేణి పాలకుడు. అంటే అతిసాధారణమైన సామంతుడు. సామంతునికి పైన మహాసామంతుడు ఉండేవాడు. జయించబడిన శత్రు నాయకుడు శత్రు మహాసామంత. కేంద్ర పాలకునికి దాసోహమైన వాడు ఆప్తసామంత. చక్రవర్తికి అత్యంత విశ్వసనీయులైన వారిలో ప్రధాన సామంతులు ఉండేవారు. వారి సలహాను చక్రవర్తి ఎన్నడూ పెడచెవిన పెట్టేవాడు కాదు. "ప్రతి సామంత" అనేవాడు రాజుకు ప్రత్యర్థి

లేదా తిరుగుబాటుదారుడు. అయితే ఈ విషయాన్ని ఖచ్చితంగా నిర్ధారించలేము. బాణుడు ఒకే ఒక్కసారి ప్రస్తావించిన అనురక్త మహాసామంతులు చక్రవర్తికి ప్రీతిపాత్రులై ఉంటారు.

**వ్యవస్థ పనితీరు:** సామంతులు తమ సార్వభౌముని పట్ల కలిగి ఉన్న బాధ్యతలను వివరించిన తొలి రచయిత బాణుడు. హర్షచరితలో వివరించినట్లు సామంతుని తొలి బాధ్యత చక్రవర్తికి క్రమం తప్పకుండా కప్పాలు, కానుకలు చెల్లించడమే. చక్రవర్తి వారి సేవలతో సంతృప్తి చెందితే వారిని మహాసామంతులుగా నియమించి, భాగస్వాములుగా (కరద) చేర్చుకునేవాడు. బాణుడి ప్రకారం సామంతుల రెండవ బాధ్యత చక్రవర్తి ఎదుట వ్యక్తిగతంగా హాజరై గౌరవ వందనాలు సమర్పించడం. ఓడిపోయిన మహాసామంతులు తమ కిరీటాలు, తలపాగాలను తీసివేసి చక్రవర్తికి నమస్కరించేవారని బాణుడు తెలుపుతాడు. హర్షుని ఆస్థానంలో అలాంటి వారిని అనేక విధాలుగా అవమానించేవారని బోధపడుతోంది. ఓడిపోయిన సామంతుల మూడవ బాధ్యత తమ మైనర్ రాకుమారులు లేదా పుత్రులను చక్రవర్తి సంరక్షణలో విడిచి వెళ్లడం. అలా వదిలివెళ్లిన బాలురను సామ్రాజ్య సాంప్రదాయాలలో శిక్షణనిచ్చి చక్రవర్తులకు విధేయులుగా తీర్చిదిద్దుతారు.

హర్షచరిత్రలో బాణుడు హర్షుని సైనిక కవాతును వివరించాడు. దానిని బట్టి హర్షుని సైన్యంలో సామంతులు సమకూర్చిన దళాలు కూడా ఉండేవని అర్థమవుతుంది. విశాలంగా సమీకృతమైన సైన్యాన్ని చూసి హర్షవర్ధనుడు ఆశ్చర్యపోయాడని బాణుడు పేర్కొంటాడు. శాంతి సమయాలలో సామంతులు అధికారిక లేదా న్యాయపరమైన విధులు కూడా నిర్వహించేవారు. ఆస్థానంలో నివసించే సామంతులు కొన్ని సామాజిక బాధ్యతలను కూడా చేపట్టాల్సి వచ్చేది. జూదం, పాచికలు, ఫ్లూట్ వాయిద్యం, రాజు చిత్రాలను గీయడం, క్లిష్టమైన గణాంకాలను పరిష్కరించడం తదితర కార్యకలాపాలలో సామంతులు పాలుపంచుకునేవారని “కాదంబరి”లో నమోదు చేశారు.

## సామంతీకరణ ప్రభావం

సామంతీకరణ పాలకుని అధికార పునాదిని క్రమంగా బలహీనపరచింది. రాజ్యంలోని మూల ప్రాంతంలో సైతం పాలకుని ప్రభావం క్షీణించింది. కేంద్ర పరిపాలన పరిధిలో ఉన్న ప్రాంతాల నుండి ఆదాయ వనరులు తగ్గిపోయాయి. కేంద్ర అధికారం విచ్ఛిన్నమైన ఈ ప్రక్రియ ఇతర దేశాలలో కూడా సంభవించింది. కాని భారతదేశంలో అది రాజత్వం యొక్క చట్టబద్ధమైన లక్షణంగా మారింది. సామంతచక్రకు ఎక్కువగా ప్రాధాన్యత ఇవ్వడంతో సామంతులు అందివచ్చిన అవకాశాన్ని బాగా వినియోగించుకొని బలపడ్డారు. సమకాలీన శాసనాలు, సాహిత్యం సామంతుల వైభవాన్ని విలాసాలను ఉత్తేజభరితంగా వివరిస్తాయి. రాజు దర్బారు నిర్వహిస్తే సామంతులు ఖరీదైన వస్త్రాలు, కిరీటాలతో అతడి చుట్టూ పోగయ్యేవారు. ఆ విధంగా రాచరిక వైభవాన్ని చాటే ప్రత్యేక వేదికగా మారింది. సామంతులు, మహాసామంతులు ఎంత ఎక్కువ సంఖ్యలో హాజరైతే చక్రవర్తి ప్రతిష్ట అంతగా పెరిగేది. సహజంగానే అలాంటి సామంతచక్ర అంతర్గతంగా అస్థిరమైనది. కేంద్ర పాలకుని అధికారం సన్నగిల్లిన వెంటనే మహాసామంతుడు స్వాతంత్ర్యం కోసం కృషి చేస్తాడు లేదా సామంత చక్రలో కేంద్ర బిందువు కావాలని ఆకాంక్షిస్తాడు.

# IV

# ఆర్థిక వ్యవస్థ

9

# సింధూ నాగరికత కాలం

### సింధూ ఆర్థిక వ్యవస్థ స్వభావం :

హరప్పా వ్యవసాయం కాలువ సాగునీటి కంటే ఎత్తిపోతల సాగునీటిపైనే ఎక్కువగా ఆధారపడి ఉండేది. ఆ కారణంగా అది అత్యంత శ్రమతో కూడుకొని ఉండేది. అయితే హరప్పా మనుగడను కేవలం వ్యవసాయ కోణం నుండి చూడలేము. హరప్పా చిత్రపటంలో మానవ సంచారం లేని విశాలమైన భూభాగాలు ఉండడం, నిత్యం సంచార జీవితం గడిపే సముదాయాలు ఎలాంటి పురావస్తు ఆధారాలు వదలకపోవడం లాంటి వాస్తవాలను దృష్టిలో పెట్టుకొని ఒక కొత్త సూత్రాన్ని ప్రతిపాదించారు. సంచార తెగలు వ్యవసాయదారులతో పరస్పర సహకార బంధంతో జీవించి ఉంటారని, అలాగే స్థిర నివాసప్రాంతాల మధ్య వారధులుగా వ్యవహరించి భౌతిక సంస్కృతిని సర్వవ్యాపితం చేసి ఉంటారన్నది ఆ సిద్ధాంతం. హాక్ర లోయ, ఉత్తర గుజరాత్‌లో సంచార తెగల శిబిర ప్రాంతాలుగా భావిస్తున్న కొన్ని అవశేషాలను కనుగొన్నారు. సంచార సముదాయాల రంగం వ్యవస్థలో ముఖ్యమైనదిగా ఉండేదని పై ఆవిష్కరణ సూచిస్తుంది.

హరప్పాకు, గల్ఫ్, మెసొపొటామియాలతో సముద్ర మార్గాన కొనసాగిన వాణిజ్య సంబంధాల గురించి మనకు ముందుగానే ఎక్కువ సమాచారం ఉన్నప్పటికీ గత కొన్నేళ్లుగా లభించిన పురావస్తు ఆధారాలను పరిగణనలోకి తీసుకుంటే చిత్రం మరింత స్పష్టంగా ముందుకు వస్తుంది. క్రీ.పూ. మూడవ సహస్రాబ్దిలో ఒక రకమైన అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ ఉండేది. దక్షిణాసియా, మక్రన్, దక్షిణ ఇరాన్, ఒమన్ ద్వీపకల్పం, బహ్రెయిన్, కువైట్, సుమేర్‌ల మధ్య లోహాలు, రాళ్లు, కలప, హస్తకళ ఉత్పత్తుల రవాణా జరిగేది. క్రీ.పూ. మూడవ సహస్రాబ్ది మధ్య నాటికి ఈ ప్రాంతాల మధ్య పరస్పర సంబంధాల క్షేత్రాలు అనేకం అభివృద్ధి చెందాయి. వాటి మధ్య కలయిక ఏర్పడింది. అయితే అంతకు ముందు గడిచిన శతాబ్దాలలో మధ్య ఆసియా, ఆఫ్ఘనిస్తాన్, సీస్తాన్, ఉత్తర బలోచిస్తాన్, సింధూ మైదాన ప్రాంతాల మధ్య మరింత స్పష్టమైన సంబంధాలు ఉండేవి. సంబంధ క్షేత్రాల మార్పు క్రమ ప్రక్రియ, హరప్పా నాగరికతల ఆవిర్భావం ప్రమాదవశాత్తుగా జరగలేదు.

వికసిస్తున్న అంతర్జాతీయ వాణిజ్యం, దక్షిణాసియాలో పట్టణ ప్రాంతాలు, పాలక వర్గ ఆవిర్భావం మధ్య సంబంధం ఏదైనా ఉందా? అంతర్జాతీయ వాణిజ్యం రాచరిక సంపద సమీకరణకు దారి తీసిందా? వ్యాపారం ఉత్పాదకతను పెంచిందా? పై అంశాలను మనం పరిశీలించాల్సి ఉంది. అంతర్జాతీయ వాణిజ్యం శ్రమ కేటాయింపులో మార్పులను తీసుకువచ్చి ఉండొచ్చు. ఉదాహరణకు సరుకుల ఎగుమతి కోసం హస్తకళ కర్మాగారాల ఏర్పాటు ప్రాంతీయ ఉత్పత్తి కార్యకలాపాలలో మార్పులకు దారి తీసి ఉండవచ్చు. ఆ విధంగా ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థ ఏర్పడి ఉండవచ్చు. ఆ కారణంగానే చిరుకత్తులు, గవ్వపరికరాలు కొన్ని హరప్పా క్షేత్రాలలోనే ఉత్పత్తి అయినప్పటికీ అవి అనేక ప్రాంతాలలో లభించాయి. గవ్వలను పశ్చిమం వైపు ఎగుమతి చేశారు. చాన్‌హుదారో, లోథల్ వద్ద గల ఉత్పత్తి కేంద్రాలు కర్మాగార– తరహా పరిస్థితులను ఆవిష్కరిస్తాయి. కనీసం ఈ పరిణామాలను కొంతవరకు మెసొపొటామియాలో హరప్పా సరుకులకు పెరుగుతున్న డిమాండ్‌కు ప్రతిస్పందనలుగా పరిగణించవచ్చు.

ఇటీవల తవ్వకాలు కొన్ని కొత్త అంశాలను వెలుగులోకి తీసుకు వచ్చాయి. క్రీ.పూ. 2000 సంవత్సరాల తర్వాతి నేపథ్యాలలో రాగి విస్తారంగా కలిగిన ఒమన్‌లో హరప్పా తయారీ మట్టికుండలు, బీడ్లు, ముద్రలు కలిగిన సూచికలు, బరువులు తదితర వస్తువులు కనిపించాయి. మెసొపొటామియా – హరప్పాల మధ్య వాణిజ్యం ప్రారంభమైనపుడు గల్ఫ్‌లోని సమాజాలు మెసొపొటామియా సాంస్కృతిక ప్రభావం కింద ఉండేవని అయితే క్రీ.పూ. 2000 తర్వాత అవి హరప్పా ప్రభావం కిందికి వచ్చాయని చెబుతారు. కొన్ని గల్ఫ్ క్షేత్రాల క్రమాన్ని పునః పరిశీలిస్తున్నారు. బహ్రెయిన్ (దిల్‌మన్) నివాస ప్రాంత పరంగా, సంపద పరంగా ఉన్నత స్థాయికి చేరుకొని ఉండవచ్చు. ఈ పరివర్తన కాలంలో హరప్పా ప్రభావం కూడా శిఖర స్థాయికి చేరుకుంది. ఈ మార్పును వివరించే ప్రయత్నంలో హరప్పా వైపు నుండి వాణిజ్య నిర్వహణకు సంబంధించిన కొన్ని ప్రాథమిక అంశాలను మనం గ్రహించవచ్చు.

**వ్యవసాయ రంగం :**

హరప్పా లాంటి విశాలమైన నాగరికతను పోషించాలంటే సమగ్ర నిర్వహణ కలిగిన ఒక వ్యవసాయ వ్యవస్థ చాలా అవసరం. అదనపు ఉత్పత్తిని సాధించే వ్యవసాయ సంఘటనం ఖచ్చితంగా వెలిసి ఉంటుంది. హరప్పా, మొహెంజొదారో వద్దగల ధాన్యాగారాలను పరిశీలించిన మీదట అక్కడ పప్పుదినుసులు విస్తారంగా లభించేవని స్పష్టంగా బోధపడుతుంది. ప్రజల తక్షణ అవసరాలను తీర్చడమే కాకుండా భవిష్యతు ఆపత్కాల పరిస్థితులలో వాడుకునేందుకు సైతం పప్పుదినుసుల నిల్వలు విస్తారంగా ఉండేవి. సార్వజనీన ధాన్యగారాలలో నిల్వ ఉంచిన పప్పుదినుసులను అధికారులు నియంత్రించారన్నది విదితమే అయినప్పటికీ ప్రైవేటు వ్యక్తులు సైతం కొన్ని జాగ్రత్తలు తీసుకొని ఉంటారు. భారీ నిల్వ జాడీలు లభించడమే అందుకు తార్కాణం. కాలిబంగన్‌లోని ఒక గదిలో అలాంటి జాడీలు ఒక దానిపై ఒకటి పేర్చబడి పెద్ద సంఖ్యలో కనిపించాయి.

సాధారణ ఆహారంలో గోధుమ, బార్లీ అంతర్భాగంగా ఉండేవి. అయితే వరి సాగు కేవలం గుజరాత్‌లో చివరి హరప్పా నాగరికత నేపథ్యంలో ప్రారంభమైంది. అప్పటికి చెరుకు పంట సాగులో ఉండేదని భావించినప్పటికీ ఆ పంటకు సంబంధించిన అవశేషాలు తవ్వకాలలో ఎక్కడా బయటపడలేదు. ఇతర పంటలలో ఖర్జూర పండ్లు, ఆముదం, పత్తి, సజ్జ, వేరుశెనగ తదితరాలు ఉన్నాయి. ప్రధాన పంటల (గోధుమ, బార్లీ)ను రబీ పంటలుగా సాగు చేసి మార్చి లేదా ఏప్రిల్‌లలో కోత కోసేవారు. ఇతర పంటలను ఖరీఫ్ పంటలుగా (వేసవిలో) సాగు చేసేవారు. పొలాలలో దుక్కి దున్నడానికి కొయ్య నాగలిని ఉపయోగించేవారు. నాగలి మొనలో తీవ్రమైన ధార గల రాగి (తామ్ర) పూచను ఉపయోగించి ఉండవచ్చు. కాలిబంగన్‌లో దున్నిన పొలం ఆధారానికి తోడు బనావలిలో ఇపుడు నాగలి యొక్క టెర్రకోట నమూనా పూర్తి రూపంలో లభించింది. ఈ నాగళ్లను కాడెద్దులు లాగేవి. హరప్పా వాసుల పశుసంపదలో కాడెద్దులు ప్రధాన భాగంగా ఉండేవి. హరప్పా వాసులు కాలువ సేద్యాన్ని చేపట్టి ఉండవచ్చని కూడా కొందరు సూచించారు అయితే అందుకు సంబంధించిన సాక్ష్యం నామమాత్రంగా ఉంది. అదే సమయంలో ఉపరితలంగా ప్రవహిస్తున్న వర్షపు నీటిని పొలాలకు తరలించినట్లు ఊహించవచ్చు.

**ఉత్పత్తి రంగం :**

కొన్ని ప్రత్యేక వృత్తిదార వర్గాలు ఉండేవని చెప్పడానికి తగిన సాక్ష్యాధారాలు ఉన్నాయి. కాంస్యకారులు, స్వర్ణకారులు, ఇటుకల తయారీదారులు, రాళ్లను తొలిచేవారు, నేతపనివారు, నావ నిర్మాణదారులు, టెర్రకోట ఉత్పత్తిదారులు తదితరులు ఈ కాలంలో తమ వృత్తులను కొనసాగించారు. వీటిలో కొన్ని పనులు (ఇటుకల తయారీ) రాజ్య నియంత్రిత ఉత్పత్తి కేంద్రాలుగా ఉండి ఉండొచ్చు. ఉన్నతమైన రాగి, కాంస్య పాత్రలు హరప్పా లోహకారుల కళానైపుణ్యానికి ఉత్తమ ప్రతీకలు. ప్రజలు, జంతువుల కాంస్య విగ్రహాలు (మలచబడిన) లేదా చిన్న నమూనా బండ్లు స్పెషలిస్టు కర్మాగారాల ఉత్పత్తులను తలపిస్తాయి. బంగారు లోహాన్ని అనేక రూపాలలో మలిచేవారు. వ్యక్తిగతంగా వాడే చిన్నచిన్న నగలు అందులో భాగంగా ఉన్నాయి. భారతదేశంలో వెండి తొట్టతొలిసారిగా సింధూ నాగరికతలో ప్రత్యక్షమవుతుంది. బంగారు కంటే వెండే సర్వవ్యాపితంగా ఉండేదని చెప్పడానికి తవ్వకాలలో పెద్ద సంఖ్యలో లభించిన వెండి పాత్రలే నిదర్శనం. లోహాలను సాధారణంగా ఉపయోగించినప్పటికీ రాతిని మాత్రం విడిచిపెట్టలేదు. చిరుకత్తులను నివాసప్రాంతాలలోనే తయారు చేసేవారు. సుక్కూర్, రెహ్రీ వద్ద గల గొప్ప ఫ్యాక్టరీలను అలాంటి బ్లేడ్‌లను విదేశాలకు ఎగుమతి చేసేవారు. గవ్వల తయారీ, గాజుల తయారీకి బాలాకోట్, లోథల్, చాన్‌హుదారో కేంద్రాలుగా ఉండేవి. పింగాణీతో తయారైన బీడ్ల తయారీకి లోథల్, చెన్‌హుదారో కేంద్రాలుగా ఉండేవి. కుండ పాత్రలు చాలా వరకు సాధారణమైనవి. కాని వాటిలో చాలా వరకు ఎర్రటి ధారలు, నలుపు రంగు అలంకరణ కలిగి ఉన్నాయి. అయితే ఏనుగు దంతాల కళకు తులనాత్మకంగా కొన్ని ఉదాహరణలు మాత్రమే ఉన్నాయి. వాటిలో దువ్వెనలు, తీర్చిదిద్దిన

సిలిండర్లు, చిన్న కర్రలు, సూదులు ఉన్నాయి. అర్థ విలువ కలిగిన రాళ్లను సింధూ లోయకు వివిధ ప్రాంతాల నుండి తీసుకువచ్చి బీడ్లను తయారు చేసేవారు. కార్నేలియన్ రాళ్లు ఎక్కువగా ఉపయోగంలో ఉండేవి. మెసొపొటామియాకు ఎగుమతి అయిన వస్తువులలో బీడ్లు కూడా ఉండి ఉండవచ్చు. ముద్రికలను స్టీటైట్‌అనే రాయితో తయారు చేసేవారు. రంపంతో వాటికి తొలి రూపం ఇచ్చేవారు. బీడ్లు, బ్రాస్‌లెట్లు, బటన్లు, పాత్రలు తదితర వస్తువులను తయారు చేయడానికి కూడా స్టీటైట్‌ను ఉపయోగించేవారు.

**వ్యాపార, వాణిజ్యాలు :**

**దేశీయ వ్యాపారం :** వేర్వేరు ప్రాంతాలలో తవ్వితీసిన హరప్పా క్షేత్రాలలో కనుగొన్న వివిధ రకాల ముడిసరుకులు హరప్పా దేశీయ వ్యాపారానికి ప్రత్యక్ష సాక్ష్యాలు. ఒక్క గుజరాత్ నేపథ్యంలోనే క్షేత్రస్థాయి ముడిసరుకుల పంపిణీలో స్థూలంగా 28 వస్తువులు అంతర్భాగంగా ఉన్నాయి. వేర్వేరు క్షేత్రాలలో ముడిసరుకులు లభించడం బట్టి వాటి వెనుక ఆర్థిక ప్రపంచం ఉండేదని స్పష్టంగా నిర్ధారించవచ్చు. ఈ ప్రపంచంలో ముడిసరుకుల కొనుగోలు, శుద్ధి, వస్తువుల తయారీ, వాటి పంపిణీ జరిగేవి. హరప్పా నాగరికత వితరణలో గుజరాత్ కేవలం ఒక్క ప్రాంతం మాత్రమే. మొత్తం ప్రాంతాలను ఉమ్మడిగా తీసుకుంటే ఈ ప్రపంచం భారీ పరిమాణాలను సంతరించుకుంటుంది.

కరాచీ ప్రాంతం నుండి ఒక రవాణా మార్గం కోహిస్తాన్ గుండా వెళ్లింది. సింధూ నది పశ్చిమ తీరం వెంబడి లర్కానా జిల్లాకు చేరుకుంది. అక్కడే మొహెంజొదారో స్థిరపడి ఉంది. లర్కానా నుండి సింధూ నదిని నాటి చాన్‌హుదారో, సింధూనది తూర్పు భాగానికి చేరుకుంది. ఒక వైపు సుక్కుర్ / రోర్హీ కొండల నుండి హరప్పాకు, మరోవైపు ఘగ్గర్/ హాక్ర పరిధి నుండి మరో ప్రాంతానికి వెళ్లే రహ దారి కూడా ఉండేది. రవాణా కోసం కొంతవరకు సింధూ నదిని కూడా ఉపయోగించారు. సింధ్, బలోచిస్తాన్ ప్రాంతాలు భూమార్గాన, అలాగే గుజరాత్‌తో తీర మార్గాన సంబంధాలు కలిగి ఉండేవి. సింధ్ నది తూర్పు భాగానికి సింధ్ మైదానప్రాంతాలు, గుజరాత్‌ల మధ్యలో ఒక మార్గం ఉండేది. అది కచ్, కథెయావార్ గుండా వెళ్లేది. తీరం వెంబడి ఒక సముద్ర మార్గం కూడా ప్రత్యక్షమైంది.

బహావల్‌పూర్, మధ్య సింధూ ప్రాంతాన్ని భూ, నదీ మార్గాలు రాజస్థాన్‌తో కలిపాయి. ముల్తాన్-మాంట్గోమెరి ప్రాంతం నుండి బహావల్‌పూర్‌కు ఒక భూమార్గం ఉండేది. జ్ఞానేశ్వర్ నుండి సోధి - భద్రలకు ఖేత్రి గుండా మరో మార్గం కూడా ఉండేది. రాజస్థాన్, దానికి ఉత్తర, పశ్చిమాన గల ప్రాంతాల మధ్య రవాణాకు కంత్లి నది మార్గాన్ని కూడా ఉపయోగించేవారు. సింధ్, తూర్పు పంజాబ్‌ల మధ్య రెండు ప్రధాన రహదారులు ఉండేవి. అవి బహావల్‌పూర్ గుండా వెళ్లేవి. ఒక మార్గం ఎగువ సట్లిజ్ ప్రాంతం వైపు మళ్లీ భటిండా, లుధియానా జిల్లాల నుండి హిమాలయాల అంచున గల మాండా వరకు విస్తరించి ఉండేది. మరో మార్గం మధ్య పంజాబ్‌లోని ఘగ్గర్-దృషాద్‌వతి చీలికను దాటిన తర్వాత హిస్సార్, జింద్ గుండా రోహ్‌తక్‌ను

చేరుకునేది. అక్కడి నుండి మరో శాఖ యమున నదిని దాటి మీరట్ గుండా గుర్‌గావ్‌లో అంతమయ్యేది. దేశీయంగా వెలసిన ప్రధాన రహదారుల పై విశ్లేషణ హరప్పా దేశీయ వ్యాపార స్థాయిని, ప్రాముఖ్యతను వెల్లడిస్తుంది.

**అంతర్జాతీయ వాణిజ్యం :**

హరప్పా నాగరికత చేపట్టిన విదేశీ వాణిజ్యానికి ఉత్తర ఆఫ్ఘనిస్తాన్, తుర్క్‌మేనిస్తాన్, ఉత్తర– దక్షిణ ఇరాన్, బహ్రెయిన్ ద్వీపాలు, గల్ఫ్‌లోని ఫైలాక, ఒమన్ ద్వీపకల్పం, ఉత్తర దక్షిణ మెసొపొటామియాలలో ప్రధాన ఆధారాలు లభించాయి. వాటిని వివిధ విభాగాల కింద జమ చేయవచ్చు. ప్రధానంగా బయల్పడిన వస్తువులలో రెండు రకాల సింధూ పూసలు, చతర్భుజ/చదరపు ఆకారం గల సింధూ ముద్రికలు, సింధూలిపి కలిగిన మట్టి పాత్రలు ఉన్నాయి. ఇవి దాదాపు అన్ని ప్రాంతాలలోనూ లభ్యమయ్యాయి. వీటితో పాటు తక్కువగా లభించిన వస్తువులు కొన్ని ఉన్నాయి. అవి కుండలు, స్థానిక ముద్రికలపై సింధూ చిహ్నాలు, ఏనుగు దంతపు పరికరాలు, సాధారణ టెర్రకోటాలు మొదలైనవి. సింధూ ప్రాంతంతో ఆయా నాగరికతలకు ఉన్న సాన్నిహిత్యాన్ని పై వస్తువులు సూచిస్తాయి. మరోవైపు సింధూ ప్రాంతం లోపలే కొన్ని విదేశీ ఛాయలు కలిగిన ముద్రికలు ఉన్నాయి. స్టీవైట్ పాత్రలు (వీటికి ప్రత్యేక అలంకరణలు ఉన్నాయి), బయటి నుండి గ్రహించిన చిహ్నాలు మొదలైన వస్తువులు కూడా లభించాయి. వీటి నైసర్గిక పుట్టుక, నేపథ్యాల గురించిన వివరాలపై సుదీర్ఘమైన చర్చ జరిగింది.

ఉపఖండం బయట కనుగొన్న ప్రతి వస్తువు బాగా పరిచయమున్న వ్యాపార మార్గాల వెంబడే లభించింది. ఉత్తర ఆఫ్ఘనిస్తాన్‌లోని షోర్తుగాయ్‌ని చేరుకోవడానికి వ్యాపారులు హిందూకుష్ వెంబడి వెళ్లే అన్ని సొరంగ మార్గాల గురించి పూర్తిగా తెలుసుకోవలసిన అవసరం ఉండేది. ఇరాన్‌లో దక్షిణ ఇరాన్‌లోని బలోచిస్తాన్– ఖుజెస్తాన్ మార్గం, కందహార్, హెరాత్, హిస్సార్ (ఉత్తర ఇరాన్) తదితర ప్రాంతాల దిశగా పయనించే ఉత్తర ఇరాన్ మార్గం రెండింటినీ వ్యాపారులు వినియోగించారు. ఈ మార్గాలు మెసొపొటామియాకు చేరుకునేందుకు అనువైన భూమార్గాలుగా ఉండేవి. షోర్తుగాయ్, హెరాత్ ప్రాంతాలు లేదా కోపేట్ దాగ్ పర్వత శ్రేణుల గుండా తుర్క్‌మేనిస్తాన్‌కు చేరుకునేవారు.

దక్షిణ ఇరాన్ మార్గం గల్ఫ్ ప్రాంతాన్ని కూడా అందుబాటులోకి తెచ్చేది. అయితే గల్ఫ్ ప్రాంతాన్ని సముద్ర మార్గం ద్వారా చేరుకునేవారు. మెసొపొటామియాకు కూడా సముద్ర మార్గం ఉండేది. సముద్ర వ్యాపార మార్గం మక్రన్ తీరాన్ని తాకేదని తెలుస్తోంది. అయితే తార్కికంగా చూస్తే ఓడలు గుజరాత్ నుండి బయలుదేరి రుతు పవనాల సహాయంతో ఒమన్ ద్వీపకల్పానికి చేరుకునేవి. ఈ ప్రాంతంలోనే సింధూ నాగరికత అవశేషాలు ఎక్కువగా లభించాయి. మట్టికుండలు, సింధూ ముద్రికలు, అలంకరణలతో సహా ఇక్కడ అనేక పురావస్తు సాక్ష్యాలు బయటపడ్డాయి. ఒమన్ తీరంలోని రాస్– అల్– జునైజ్ గుజరాత్ నుండి వచ్చిన

ఓడల గురించి సాక్ష్యాలను అందిస్తుంది. మరీ ముఖ్యంగా ఈ ప్రాంతంలో నిర్వివాదమైన సింధూ కళాఖండాలు ఎన్నో లభించాయి.

పై ప్రాంతాలన్నింటిలో సింధూ లేదా సింధూ సంబంధిత వస్తువులను కనుగొన్నారు. అలాగే సింధూ నాగరికత విస్తరించిన ప్రాంతంలో విదేశీ నేపథ్యం ఉన్న సింధూయేతర వస్తువులు లభించాయి. ముఖ్యంగా మొహెంజోదారో, కాలిబంగన్‌లలో మెసొపొటామియా, ఇరానీ, మధ్య ఆసియా ప్రపంచపు ముద్రికలు బయల్పడ్డాయి. అయితే అవి సింధూ చిహ్నాలను ప్రదర్శిస్తాయి. లోథల్ వద్ద ఉపరితలంలో ఒక గల్ఫ్ ముద్రిక లభించింది. అలాగే బెట్ ద్వారకా వద్ద గల్ఫ్ చిహ్నం ఉన్న ముద్రిక లభించింది. మరోవైపు గల్ఫ్ నేపథ్యం గల అనేక ముద్రికలు సింధూ చిహ్నాలను, లిపిని కలిగి ఉన్నాయి. అవి గల్ఫ్‌లోనే కాకుండా ఉర్ లాంటి మెసొపొటామియా క్షేత్రాలు, సుసాకు చెందిన ఇరానీ ఖుజెస్తాన్‌లలో కూడా కనిపించాయి. ఈ ముద్రికలు వృత్తాకారంలో ఉన్నాయి. స్థూలంగా చెప్పాలంటే పై ప్రాంతమంతా భూ సముద్ర మార్గాల కలయికతో ముడి పడి ఉన్నట్లు బోధపడుతోంది. మెసొపొటామియా సాహిత్యంలో కనిపించే "మెలుహ్హా" అనే పదాంశం హరప్పా నాగరికతా ప్రాంతాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించకపోవచ్చు. అందుకు భిన్నంగా అది ఖుజెస్తాన్‌కు తూర్పున ఉన్న మొత్తం ప్రాంతాన్ని, ఇరాన్‌లో ఉన్న పొరుగు భూభాగాన్ని సంభోదించి ఉంటుంది. అందులో సింధూ ప్రాంతం కూడా అంతర్భాగంగా ఉండి ఉంటుంది. మెసొపొటామియా నగరాలలో హరాప్పా వ్యాపారుల నివాస ప్రాంతాలు కూడా ఉండి ఉండొచ్చు. ఈ ప్రాంతమంతటా సరుకులను క్రమం తప్పకుండా తరలించి వ్యాపార కార్యకలాపాలు నిర్వహించి ఉంటారు బహుశా ఈ ప్రక్రియలో హిందూకుష్ ప్రాంతానికి చెందిన సీజన్‌వారీ సంచారులు పాత్రను పోషించి ఉంటారు.

హరప్పా విదేశీ వాణిజ్య కార్యక్రమంలో గల్ఫ్ ప్రాంతం వలె ఉత్తర ఆఫ్ఘనిస్తాన్ ప్రత్యేక స్థానాన్ని ఆక్రమించి ఉండేదని తెలుస్తోంది. బాక్ట్రియా ప్రాంతంలో లూటీ చేసిన అనేక సమాధులు, డాష్లీ అనే క్షేత్రంలో సాధారణ హరప్పా లేదా హరప్పా సంబంధిత వస్తువులు లభించాయి. మరోవైపు నిర్వివాదమైన విలాస వస్తువులు (బాక్ట్రియా ముడిసరుకులతో తయారైనవి) క్వెట్టా, మెహర్‌గఢ్, సిబ్రి (ఇవన్నీ బోలన్ పాస్ ప్రాంతంలో ఉన్నాయి) లలో దొరికాయి. ఈ వస్తువులు సింధూ నాగరికత చివరి దశకు చెందినవని కొందరు విద్వాంసుల అభిప్రాయం. అయితే ఆ వస్తువులు హరప్పా నాగరికత పరిణత దశకు ఎందుకు చెందవో నిర్ధారించడానికి ప్రత్యేక కారణం అంటూ ఏదీ లేదు.

## వేదకాలం

### ఆర్థిక వ్యవస్థ స్వరూపం :

**రుగ్వేద కాలం :** రుగ్వేద కాలపు ఆర్థిక వ్యవస్థ మౌలికంగా మనుగడ సాగించే సంచార జాతులతో కూడి ఉన్నా దానికి వ్యవసాయంతో పరిచయం ఉండేది. సంపదను

ప్రాథమికంగా పశువుల సంఖ్యతో లెక్కించేవారు. అలాగే అశ్వాలకు ఎనలేని ప్రాధాన్యత ఉండేది. అశ్వాలు చాలా విలువైనవి. వాటిని సమీకరించడం అంత తేలికగా ఉండేది కాదు. తర్వాత రథాలు, స్వర్ణ ఆభరణాలు, బానిస బాలికలకు ప్రాధాన్యతను ఇచ్చేవారు. కానుకల సమర్పణను కీర్తిస్తూ రచించబడిన "దాన–స్తుతి" భక్తిగీతాలలో పై అంశాల వివరణ ఉంది. పశువులు ప్రధాన సంపదగా ఉండడంతో వాటిని అపహరించడానికి తరచూ దాడులకు పాల్పడేవారు. పశువుల పోషణతో పాటు ఇతర సముదాయాల పశువులను అపహరించి తమ సంపదను పెంచుకునేవారు. పశుపోషక సమాజాలలో ఇలాంటి దాడులు సర్వసాధారణం. సరస్వతీ నది తీర ప్రాంతాలు మేతకు ఎంతో అనుకూలంగా ఉన్నా నదీ ప్రవాహ మార్గంలో మార్పులు రావడంతో ఈ ప్రాంతం నుండి ఎగువ ద్వినది ప్రాంతానికి ప్రజలు వలసపోయారు. సంచార జీవనవిధానం ఒంటరిగా ఉండజాలదని, దానికి రైతులతో సంబంధం అవసరమని వాదించబడింది. అలాంటి సంబంధం ఆచరణీయమే. పురావస్తు, సాహిత్య ఆధారాలు ఇలాంటి "బాంధవ్యాన్ని" సూచిస్తాయి. ఆ సమయంలో ఉత్తర భారతదేశంలో రెండు సముదాయాలు వేర్వేరు భాషలను మాట్లాడి ఉండవచ్చు. వేద సాహిత్యంలో వ్యవసాయానికి సంబంధించి ఉపయోగించిన పదాలు చాలా వరకు ఆర్యేతర భాషకి కావడం ఇక్కడ ఆసక్తికరమైన విషయం.

**తదుపరి వేద కాలం :** తొలి, మలి వేద గ్రంథాలను తులనాత్మకంగా అధ్యయనం చేస్తే సంచారవాదం నుండి వ్యవసాయంవైపు ఆర్థిక వ్యవస్థ రూపాంతరం చెందిందని బోధపడుతుంది. అయితే పశ్చిమ గంగ మైదాన ప్రాంతంలో సంచార సముదాయాలు పూర్తిగా పతనం కాలేదు. అలాగే ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి ఆర్థిక వ్యవస్థ స్వరూపం (అంతర్గత చలనాలు) వేర్వేరుగా ఉండేది. ఆ కారణంగా మథుర చుట్టూ ఉన్న ప్రాంతం అనేక శతాబ్దాల పాటు సంచార జీవనవిధానాన్ని చవి చూసింది. మరోవైపు మధ్యగంగ మైదాన ప్రాంతంలో సంచార జాతుల ఉనికిపై సాక్ష్యాధారాలు చాలా పరిమితంగా ఉన్నాయి. ఆర్థిక వ్యవస్థలో మార్పును పరోక్ష ఆధారాల నుండి సమీకరించవచ్చు (విశ్లేషించవచ్చు). ఉదాహరణకు రాజసూయ లాంటి ప్రధాన బలిదాన కర్మకాండలలో పాలపదార్థాలతో తయారు చేసిన సంతర్పణలు చాలా తక్కువగా కనిపిస్తాయి. అదే సమయంలో వ్యవసాయోత్పత్తులనుండి సంగ్రహించిన కానుకలు ఎక్కువగా వచ్చి చేరాయి.

వ్యవసాయం అంటే భూమిపై కొంత నియంత్రణను, సేద్యపు నీటి స్వరూపాలను సూచిస్తుంది. మధ్య గంగ మైదాన ప్రాంతంలోని తడి నేలలను ఎండబెట్టి ఉంటారు. అందుకు శ్రామికులు అవసరమై ఉంటారు. స్వయంగా వరిసాగే శ్రమతో కూడుకున్నది. నాట్ల పద్ధతిని పాటించి ఉంటే అందుకు మరింత మంది కార్మికులు అవసరమై ఉంటారు. అలాంటి కార్యకలాపాలకు శ్రమ అందుబాటులో ఉండడమే కాకుండా కార్మికులు– యజమానుల మధ్య కొంతమేరకు సామాజిక తేడా ఉండడం కూడా ఎంతో అవసరం. దీనర్థం సమాజంలో శక్తిమంతులు కొద్ది సంఖ్యలో ఉన్నా మిగతా వారిని తమకోసం శ్రమించేలా ఆదేశించేవారు. కాలువలను తవ్వి తడినేలల నుండి నీటిని తరలించడం వల్ల వ్యవసాయ కాలువలు ఏర్పడి

ఉంటాయి. ఆ విధంగా కృత్రిమ సేద్యంతో తదుపరి పంటలు పండించి ఉంటారు. అయితే ఈ ఉదంతంలో కూడా వ్యవసాయ కాలువల (సేద్యపు నీటి కాలువలు) నిర్వహణకు శ్రమ ఎంతో అవసరం.

**ఆర్థిక మార్పు ప్రక్రియ :**

రుగ్వేద సమాజం మౌలికంగా సంచార జాతులతో నిండి ఉన్నా వ్యవసాయాన్ని మాత్రం మినహాయించలేదు. వాస్తవానికి వ్యవసాయక కార్యకలాపాల గురించి వేద గ్రంథంలోని చివరి భాగాలలో ఎక్కువగా ప్రస్తావించారు. తదుపరి వేద గ్రంథాలలో వివరించినట్లు గంగా-యమున ద్వినది ప్రాంతంలోని సమాజం వ్యవసాయంపైనే ఎక్కువగా ఆధారపడేది. అయితే పశుపోషణ అప్పటికీ ప్రధాన వ్యాపకంగా కొనసాగింది. చారిత్రకంగా చూస్తే యమున పశ్చిమ తీరం సంచార జీవనవిధానంతో ముడిపడి ఉంది. మరోవైపు ద్వినది ప్రాంతం అంతకు ముందే ప్రధాన వ్యవసాయ భూభాగంగా మారింది. శాశ్వత నివాస ప్రాంతాలు వ్యవసాయానికి పెరుగుతున్న ప్రాధాన్యతను వివరిస్తాయి. అయితే ఇక్కడ మార్పు త్వరితగతిన చోటు చేసుకోలేదు. ద్వినది ప్రాంతంలోని శాశ్వత నివాస గృహాలు (ప్రాంతాలు) పూర్వపు ప్రజల నివాస ప్రాంతాలతో సర్దుబాటు చేసుకొని ఉంటాయి. లోహమిశ్రమ రంగు కుండపెంకులు, తామ్ర నిల్వల సంస్కృతులు పై సర్దుబాటును సూచిస్తాయి. తామ్ర నిల్వల సంస్కృతిని ప్రధాన సంస్కృతి తనలో విలీనం చేసుకొని ఉంటుంది. లోహమిశ్రమ రంగు మట్టిపాత్రల సంస్కృతి తర్వాత బూడిదరంగు మట్టి పాత్రల సంస్కృతి ఆవిర్భవించింది. ఇలాంటి పురావస్తు క్షేత్రాల నుండి లభించిన ఆధారాల ప్రకారం ఈ ప్రాంతంలో అంతకుముందు నివాసం ఉన్న వ్యవసాయ సముదాయాలు విశాల సముదాయాలకు మూల కేంద్రాలుగా మారాయని నిర్ధారించవచ్చు.

రుగ్వేద సమాజంలోని సంచార జీవనవిధానం పశుపోషణను, మరీ ముఖ్యంగా పశుపాలనను (కాపరి) ప్రధాన వ్యాపకంగా మార్చింది. ఇలాంటి జీవితం స్థిరమైన మేత ప్రాంతాల లభ్యతపై ఆధారపడి ఉంటుంది. అలాగే పశువులను సేకరించి మంద పరిమాణాన్ని పెంచగల సామర్థ్యం కూడా చాలా అవసరం. సంపదకు పశువుల మందే ప్రధాన ఆధారంగా ఉండేది. రాజకీయ సమీకరణలు మేత ప్రాంతాలను స్పష్టంగా నిర్ధారించడానికి, బయటి వారిని నివారించడానికి పరిస్థితులను సృష్టించాయి. పశువుల సమీకరణ (గవిష్టి) పోషణ, ఇతర మందలను స్వాధీనం చేసుకోవడం ద్వారా జరిగేది. కనక పశువుల అపహరణ కోసం జరిపే దాడులు ఒక సామాజిక స్వరూపంగా మారాయి. ఇలాంటి దాడులను ప్రస్తావించడానికి ఒకే రకమైన పదాంశాన్ని ఉపయోగించారు. ప్రజల అగర్భ శత్రువులుగా పాణిలు ఉండేవారు. వారి ప్రధాన వ్యాపకం పశువులను తస్కరించడం. పశువులను స్వాధీనం చేసుకోవడంలో కొన్ని సార్లు కాపరిని కూడా బందీగా తీసుకునేవారు. అలా దొరికిన వారిని బానిసలుగా మార్చేవారు. ఇలాంటి పరిస్థితిలో నాయకత్వానికి మందను సంరక్షించే సామర్థ్యమేకాకుండా స్వంత కుదురు సభ్యులను కూడా రక్షించే బాధ్యత ఉండేది. పశువుల యాజమాన్యం, మేత భూములపై నియంత్రణను చాటుకోవలసిన అవసరం ఉండేది. (మేత భూములను వ్రజ అని

పిలిచేవారు). ఈ కారణంగా ("రాజు" అనే పదానికిగల) గోప, గోపతి, జనస్య అనే నానార్థాలు తదుపరి కాలంలో నృపతి, నరేశ్వరగా రూపాంతరం చెందాయి. ఆ విధంగా పశువుల మంద యజమాని ప్రజల ప్రభువుగా ఎదిగాడు.

రాజ లేదా ముఖ్యుడు (నాయకుడు) పశువుల అపహరణ కోసం జరిపే దాడులలో విజయవంతమైన నాయకునిగా, అంటే యుద్ధ నాయకునిగా ఉండేవాడు. దాడులలో లభించే సంపదను కుదురు సభ్యులు పంచుకునేవారు. అయితే అప్పటికే పంపిణీ అసమానంగా ఉండేది. కొంత సంపదను నాయకుడు(రాజ) తన వద్దే ఉంచుకునేవాడు. అయితే అందులో ప్రధాన భాగాన్ని పురోహిత కుటుంబాలే దక్కించుకునేవి. తాము నిర్వహించిన కర్మకాండలు లేదా పూజల వల్లే యుద్ధంలో విజయాలు సాధ్యమయ్యాయనే వాదనతో వారు యుద్ధకానుకల్లో ప్రధాన వాటాను దక్కించుకునేవారు. కీర్తిని, తద్వారా నాయకుని అమరత్వాన్ని తాము అందిస్తున్నామని వాదించేవారు.కుదురు నాయకుడు, పురోహితుని మధ్య పరస్పర సంబంధం మలి వేద కాలంలో తొలిసారిగా మార్పునకు లోనైంది. ఇతర వేద గ్రంథాలలో దానికి సంబంధించిన వివరణలు ఉన్నాయి. అంతకు ముందు కూడా సంచార జీవన విధానం నుండి వ్యవసాయం మినహాయించబడలేదు. అయితే రెండింటి మధ్య సమతుల్యం క్రమంగా వ్యవసాయం వైపు మొగ్గు చూపింది. ఋగ్వేదంలో నాగలి సేద్యం గురించి ప్రస్తావన ఉంది. సాధారణంగా చివరి మండలాలలో ఆ మేరకు వివరణ ఉంది. అయితే కొన్ని ప్రధాన వ్యవసాయ పనిముట్లు భాషాపరంగా ఆర్యేతర పేర్లను కలిగి ఉన్నాయి. ఉదాహరణకు "లంగాల".

వేద కాలానికి ముందే ఈ ప్రాంతంలో వ్యవసాయదారులు స్థిర నివాసం కలిగి ఉండేవారన్న విషయాన్ని పురావస్తుశాస్త్రం స్పష్టం చేస్తుంది. ఉదాహరణకు అసురలకు వ్యవసాయానికి అనుకూలమైన ఋతువుల గురించి ఖచ్చితమైన పరిజ్ఞానం ఉండేదని చెబుతారు. పశుకాపర్లు, వ్యవసాయదారుల మధ్య సన్నిహిత సంబంధం పరస్పర ఆధార సంబంధంగా మారి ఉండే అవకాశం ఎక్కువగా ఉంది. ఆ కారణంగా కాపరులు తమ పశువులను పొలాలలో మిగిలిన గడ్డిని మేపించేవారు. పొలాలను పరిరక్షణకు ప్రతిఫలంగా మేతను పొందారు. అలాంటి వ్యవసాయదారులు తర్వాతి కాలంలో సంచార తెగ నాయకుల అధికారాన్ని ఆమోదించి ఉంటారు. అంటే సంచార తెగలు వారిని జయించాల్సిన అవసరం లేకుండానే ఇలాంటి ఏర్పాటు జరిగి ఉంటుంది. ద్వినది ప్రాంతానికి వలసలో స్థానిక ప్రజలపై దండయాత్ర లేదా భూభాగాల ఆక్రమణకు సంబంధించి కేవలం కొన్ని వ్యాఖ్యానాలు మాత్రమే ఉన్నాయి. బాగా ప్రాచుర్యం పొందిన యుద్ధాలు చాలావరకు ప్రధాన కుదురుల మధ్యే జరిగాయి. భూభాగంపై నియంత్రణ, వారసత్వ హక్కుల విషయంలోనే సంఘర్షణలు ఎక్కువగా చోటుచేసుకున్నాయి. ఋగ్వేదంలో అలాంటి వివరణలు ఉన్నాయి. తదుపరి వేద గ్రంథాలలో కూడా పూర్వం జరిగిన యుద్ధాలను ప్రస్తావించారు. అలాంటి యుద్ధాలు జరిగిన ప్రాంతాలను ద్వినది ప్రాంతానికి పశ్చిమోత్తర దిశలో నిర్ధారించారు. అవి ద్వినది ప్రాంతానికి ప్రజలు వలస రావడానికి ముందే సంభవించాయని చెప్పారు. కొత్త భూభాగాలలో వ్యవస్థాగత పరిష్కారం జరిగినట్లు కనబడుతోంది.

స్థానిక ప్రజలను వలసదారులు తమలో విలీనం చేసుకొని ఉంటారు లేదా వారిని శివార్లకు తరిమివేసి ఉంటారు. అప్పుడు భూమిని ఆస్తిగా గుర్తించడం ప్రారంభించారు. భూముల యాజమాన్యం కుదురు చేతిలోకి ఉమ్మడిగా వెళ్లింది. భూమిని దానం చేయడానికి ప్రయత్నించాడన్న నెపంపై రాజ విశ్వకర్మ భువనను పృథ్వీ శపించింది. కుదురుల(విస్‌లేదా విషయ) అనుమతి లేనిదే రాజకు కొత్త ప్రజలను భూభాగంపై స్థిరపరిచే అధికారం ఉండేది కాదు. వేద గ్రంథాలలో భూముల విక్రయంపై ఎలాంటి ప్రస్తావన లేదు.

**మౌర్య - పూర్వ కాలం :**

**పట్టణీకరణ స్వభావం:** భారతదేశంలో రెండవ పట్టణీకరణ ఆరంభం గురించి విస్తృత పరిశోధనలు జరిగాయి. నగరాలు, పట్టణాలను వివరించడానికి సాహిత్య ఆధారాలపై ఒకప్పుడు ఎక్కువగా ఆధారపడేవారు. అయితే ఇటీవలి కాలంలో అలాంటి పరిస్థితిలో మార్పు వచ్చింది. ఇప్పుడు పురావస్తు పరిశోధనలు, వాటి ఫలితాలు, సాక్ష్యాలపై దృష్టి సారించారు. శాస్త్రీయ దృక్పథంతో ముందుకు వెళుతున్నారు. ఎందుకంటే సాహిత్య వర్ణనలు తరచూ మూస ధోరణిలో సమాచారాన్ని అందించాయి. పట్టణతత్వ భౌతిక లక్షణాలు రక్షణ వ్యవస్థ (కోట, ప్రహరీ, మహాద్వారం వద్ద భటుల నివాసాలు మొదలైనవి) ఇటుకలతో పక్కాగా నిర్మించిన కట్టడాలు (నివాసగృహాలు, రాజభవనాలు, సార్వజనీన, మతపరమైన కట్టడాలు,) పౌరసేవల (మరుగు కాలువల వ్యవస్థ (టెర్రకోట బావులతో) లో కనిపిస్తాయి.

తొలి బౌద్ధ గ్రంథాలలో ఆరు మహానగరాల గురించి ప్రస్తావించారు. అవి చంపా (భాగల్‌పూర్ సమీపంలో), రాజగృహ లేదా గిరివ్రజ (బీహార్‌లోని రాజగిర్), వారణాసి (బనారస్ సమీపంలోని రాజ్‌ఘాట్), కౌసాంబి (అలహాబాద్ సమీపంలో), శ్రావస్తి (సాహేత్–మాహేత్ –ఉత్తరప్రదేశ్), సాకేత (తూర్పు యు.పి.). ఈ నగరాలు పురావస్తు శాస్త్రజ్ఞుల దృష్టిని పూర్తిగా ఆకర్షించాయి. క్షేత్ర పురావస్తుశాస్త్రం అత్రంజిఖేడా క్షేత్రాన్ని వెలుగులోకి తీసుకువచ్చింది. అయితే ప్రాచీన బౌద్ధ, జైన గ్రంధాలలో పేర్కొన్న ఒక మహానగరంతో దానిని ఇంకా గుర్తించాల్సి ఉంది. అహిచ్ఛత్ర, కాంపిల్య, హస్తినాపుర్, పురానా ఖిలా నుండి కూడా ప్రాచీన నగరాల అవశేషాలను కనుగొన్నారు. గంగాలోయ వెలుపల ఉజ్జయినీ (పశ్చిమ మధ్యప్రదేశ్‌లోని ప్రాచీన ఉజ్జయినీ,) తక్షశిల(పాకిస్తాన్‌లోని రావల్పిండి సమీపంలో), చార్సద్ద (పెషావర్ సమీపంలోని ప్రాచీన పుష్కలవతి) లలో విశాలమైన పట్టణ క్షేత్రాలు బయటపడ్డాయి. పట్టణ కేంద్రాల అవశేషాలను వెలికి తీయడమే కాకుండా క్షేత్రాల వైశాల్యం బట్టి నివాసప్రాంతాల వర్గీకరణను అందించడానికి పురావస్తు పరిశోధనలు ప్రయత్నించాయి. ఈ పరిశోధనల ఫలితంగా నివాసప్రాంతాల క్రమస్థాయిని, పట్టణ కేంద్రాల వర్గీకరణను ప్రతిపాదించే అవకాశం లభించింది.

భౌతికవాద సంస్కృతికి సంబంధించిన మరో ముఖ్య లక్షణం కొత్త మట్టిపాత్రల సాంప్రదాయం రాకలో ప్రతిబింబిస్తుంది. అదే ఉత్తర నలుపు రంగు మట్టి పాత్రల సంస్కృతి. క్రీ.పూ. 600లో మధ్యగంగ లోయలో ఈ సంస్కృతి తొలి సారిగా ప్రత్యక్షమైందని భావిస్తారు.

ఆ తర్వాత అది ఉత్తర భారతదేశంలోని విశాల భూభాగాలకు విస్తరించింది. ఉన్నతమైన ఉత్పత్తి, మెరిసే పూతకు పేరెన్నిక గన్న ఉత్తర నలుపు రంగు పాత్రలు విలాస వస్తువులుగా ఉండి ఉండవచ్చు. ఇలాంటి పాత్రలు విలువైనవని, వాటిని కొనుగోలు చేయడానికి ప్రజలు ఆకాంక్షించే వారన్న విషయం పురావస్తు తవ్వకాలలో బయటపడింది. పగిలిపోయిన పాత్రలను రివెట్‌మెంట్లతో మరమ్మతు చేసినట్లు అవశేషాల పరిశోధనలో తేలింది. దీనిని బట్టి అవి ఎంత విలువైనవో, ప్రతిష్టాత్మకమైనవో బోధపడుతుంది. అవి విస్తరించిన భూగోళిక ప్రాంతం వాణిజ్య మార్గాల కలయికను సూచిస్తుంది. పాకిస్తాన్‌లోని తక్షశిల, ఆఫ్ఘనిస్తాన్ రాజధాని కాబుల్ సమీపంలోని చమన్-ఎ-హుజూరీలలో రంధ్రాలు గల నాణేలు (ప్రాచీనమైనవి) లభించడం బట్టి ఉత్తర భారతదేశంలో వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలు జరిగేవన్న వాదన మరింత బలపడుతుంది. వెండి, రాగిలతో తయారైన కర్షపాన నాణేలు అలాంటివే.

క్రీ.పూ. ఆరు-ఐదు శతాబ్దాల సందర్భంగా గంగాలోయలో నగరాల ఆవిర్భావం భారత దేశపు రెండవ పట్టణీకరణను సూచిస్తాయి. మొదటిది హరప్పా నాగరికత. గంగాలోయలోని పట్టణ కేంద్రాలు హరప్పా పట్టణీకరణ కొనసాగింపు లేదా పునరుద్ధరణా లేదా అవి దిగుమతులా అనే విషయమై సుదీర్ఘ చర్చ జరిగింది. మెజారిటీ వర్గాల అభిప్రాయంలో గంగాలోయ పట్టణీకరణ హరప్పాకు భిన్నమైనది. గంగాలోయలోని స్థానిక పరిస్థితులు దాని మూలాలను వివరిస్తాయి. ప్రముఖ మార్క్సిస్టు చరిత్రకారులు రెండవ పట్టణీకరణ ఆవిర్భావాన్ని వివరించడంలో అదనపు వ్యవసాయ నిల్వలు గణనీయంగా అందుబాటులో ఉండాన్ని నొక్కి చెబుతారు. అలాంటి నిల్వలతో పట్టణ ప్రాంతాలలోని వ్యవసాయేతర సముదాయాలను పోషించారని వివరిస్తారు. ఆ విధంగా అదనపు వ్యవసాయ నిల్వల లభ్యత గంగా లోయలో నగరాల నిర్మాణంలో కీలక పాత్రను పోషించాయని పేర్కొంటారు.

ఈ అదనపు ఉత్పత్తి గంగాలోయలోని అనుకూలమైన వాతావరణ పరిస్థితులు (సారవంతమైన నేలలు, క్రమం తప్పకుండా కురిసే మంచి వర్షాలు, జీవనదులు, దట్టమైన అడవులు). లోహ ఖనిజం విస్తారంగా ఉన్న కారణంగా సాధ్యమైందని భావిస్తారు. లోహాన్ని తవ్వి తీయడంతో లోహ పరికరాలు, గొడ్డళ్లు, కోత కొడవళ్లు, నాగళ్ల వినియోగం విస్తరించిందని, వ్యవసాయ ఉత్పాదకత పెరిగి కీలకమైన నిల్వలు లభించాయని చెబుతారు. అలాగే ఈ కాలంలో మధ్య గంగ లోయలో వరినాట్ల పద్ధతిని కూడా ప్రవేశపెట్టారు. ఫలితంగా వరి దిగుబడి గణనీయంగా పెరిగింది. బియ్యాన్ని భుజించే సంస్కృతులకు పునరుత్పత్తి శాతం ఎక్కువగా ఉంటుందని కూడా వాదించారు. ఈ కోణం నుండి చూస్తే క్రీ.పూ. ఆరవ శతాబ్దపు గంగాలోయ జనాభా పెరుగుదలకు అనుకూలంగా ఉండేదని బోధపడుతుంది. ముఖ్యమైన అంశం ఏమిటంటే వ్యవసాయ నిల్వలు అదనంగా లభించడం, జనాభా పెరిగే అవకాశం ఉండడం గంగా లోయలో పట్టణ కేంద్రాల ఆవిర్భావానికి అనుకూల పరిస్థితులను సృష్టించాయి.

తొలి చారిత్రక కాలాలలో గంగాలోయలో పట్టణ కేంద్రాల ఆవిర్భావం, విస్తరణపై ఎలాంటి సందేహం లేదు. గ్రామీణ ప్రాంతాల నుండి ఆహార సరఫరాలు నిత్యం కొనసాగడం

వల్లే పట్టణ కేంద్రాలలోని వ్యవసాయేతర సముదాయాలు మనుగడ సాగించాయన్న వాదనను కూడా అంగీకరించాలి. అయితే అదనపు ఉత్పత్తిని సృష్టించడంలో, పట్టణవాసుల మనుగడలో లోహపరిజ్ఞానం పోషించిన పాత్రను చర్చించారు. గంగా లోయలో కేవలం కొన్ని లోహనాగళ్లు మాత్రమే లభించిన విషయాన్ని విస్మరించడం అంత సులభం కాదు. అలాగే సమకాలీన దక్కను, దక్షిణాది ప్రాంతం లోహ పరిజ్ఞానాన్ని అనుభవించినా (భారీ శిలా సమాధులు) క్రీ.పూ. రెండవ శతాబ్దం వరకు అవి పట్టణ కేంద్రాల ఆవిర్భావాన్ని చవి చూడలేదు. వేరే మాటల్లో చెప్పాలంటే పట్టణీకరణ లాంటి సంకీర్ణ ప్రక్రియను కేవలం సాంకేతికపరమైన మార్పు ఆధారంగా వివరించలేము. అయితే అదనపు నిల్వలను కేవలం సాంకేతికపరమైన ఉత్పత్తిగానే పరిగణించలేము. అంటే ఒక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉంటే అదనపు ఉత్పత్తిని సృష్టించడం సాధ్యమని చెప్పలేము. మరోవైపు దానిని సామాజిక, రాజకీయ ఉత్పత్తిగా వివరించడం జరిగింది. ఒక బలమైన అధికార నిర్మాణం (కుదురు రాజకీయ వ్యవస్థకు భిన్నమైనది) డిమాండ్ చేసినపుడు అదనపు ఉత్పత్తిని సృష్టించేవారని ప్రతిపాదించారు.

**సామాజిక - ఆర్థిక నేపథ్యం :**

బ్రాహ్మణిక గ్రంథాలకు భిన్నంగా బౌద్ధ ఆధారాలు వర్ణవ్యవస్థను ప్రతిపాదిస్తాయి. శీర్షంలో ఖట్టియా (క్షత్రియ)తో మొదలై బహమన్న (బ్రాహ్మణ), వెస్సా (వైశ్య), సుద్ద(సూద్ర) లతో అది ముగుస్తుంది. అస్పృశ్యులను సంబోధించేందుకు “చండాల” అనే పదాన్ని తరచుగా ఉపయోగించారు. వర్ణజాబితాలో ఖట్టియా, బహుమన్న, గహపతిలను అంతే స్థాయిలో ప్రతిపాదించారు. సాంప్రదాయబద్ధమైన వర్గీకరణ కంటే సామాజిక ఆర్థిక సముదాయాల వాస్తవిక వర్గీకరణగా ఇది కనిపిస్తుంది. క్షత్రియకు ఇచ్చిన అమితమైన ప్రాధాన్యత బౌద్ధవ్యవస్థలో సాంప్రదాయ బద్ధమైన వర్గీకరణ లోపించిన విషయాన్ని స్పష్టం చేస్తుంది. ఇది ఆశ్చర్యకరమైన విషయమేమీ కాదు. ఎందుకంటే బౌద్ధులకే కాకుండా ఇతర ఏకేశ్వరోపాసన మత అనుచరులకు కూడా బ్రాహ్మణిక సాంప్రదాయవాదం ఆమోదయోగ్యంగా ఉండేది కాదు. ఉన్నతమైన హోదా గల మూడు వర్ణాలన్నీ (క్షత్రియ, బ్రాహ్మణ, గహపతి) సంపద, జ్ఞానాలను ఆర్జించడమే లక్ష్యంగా పెట్టుకున్నాయని చెబుతారు. మొదటి వర్గం ఈ లక్ష్యాన్ని అధికారం ద్వారా భూభాగంపై నియంత్రణ తెచ్చుకోవడంతో సాధిస్తే, రెండవ వర్గం వేదాల అధ్యయనం ద్వారా, తాను నిర్వహించే కర్మకాండలో బలిదాన ఫలం ద్వారా సాధిస్తుంది. మూడవ వర్గం కళలు, శ్రమ ద్వారా ఆ లక్ష్యాన్ని సాధిస్తుంది.

గణ-సంఘ ప్రాంతాలలో ఒక సామాజిక సంస్థగా వర్ణ ఉండేదికాదని తెలుస్తోంది. అలాగే ఈ ప్రాంతాలలో వారసత్వ వ్యవస్థకూడా పశ్చిమ గంగ లోయకు భిన్నంగా ఉంది. గణ-సంఘాలలో విశాలస్థాయి బలిదాన కర్మకాండలను నిర్వహించేవారు కాదు. ఆ విధంగా వాటిలో బ్రాహ్మణ వర్ణ నిరర్థకంగా మారింది. అలాగే ఆర్థిక వ్యవస్థ స్వభావం, నియంత్రణ పద్ధతులు మారిపోయాయి. శ్రామికుల లభ్యత, వారి సంఘటనంపై ఎక్కువగా దృష్టి సారించేవారు. ఈ సమాజాలు స్థూలంగా రెండు వర్గాలుగా విభజించబడి ఉండేవి. మొదటి

వర్గం భూములను కలిగి ఉంటే రెండవ వర్గం ఆ భూములలో పని చేసేది. ఈ విభజనను ఆమోదించడంతో సూద్ర వర్ణ అనవసరంగా మారింది. ఎందుకంటే దాస- కర్మకార"సూద్రుని" విధులను సమర్థవంతంగా నిర్వహించేవారు. రాజ్యాలు, ముఖ్యంగా కోసల, మగధల నేపథ్యంలోనే బ్రాహ్మణుల గురించి బౌద్ధ సాహిత్య కృతులలో ఎక్కువగా ప్రస్తావన ఉంది. గణ- సంఘాల నేపథ్యంలో బ్రాహ్మణులకు ఎలాంటి పాత్ర ఉన్నట్లు బోధపడదు. ఎందుకంటే అలాంటి ప్రాంతాలలో వేద కర్మాకాండలు సాధారణంగా ఉండేవి కావు.

వైశ్య స్థానంలో గహపతిని చేర్చడం బట్టి తొలి విషయం ఎట్టకేలకు విచ్ఛిన్నమైందని భావించవచ్చు. కుటుంబ పెద్దగానే కాకుండా భూమి యజమానిగా కూడా గహపతి తన విధులు నిర్వహించేవాడు. గహపతులలో ధనిక వ్యక్తులు కూడా ఉండేవారు. వృత్తిదారులు లేదా భూస్వాములు లేదా వ్యాపారులు ఈ కోవకు చెందుతారు. గహపతికి అనుబంధంగా "కుటుంబిక", "గామిని" ఉన్నారు. కుటుంబిక కుటుంబపెద్ద. అతడికి ఆస్తి కూడా ఉండేది. జాతకసాహిత్యంలో అతడిని సంపన్న భూస్వామి లేదా వ్యాపారిగా సంబోధించారు. పూర్వపుగ్రామణి అనే పదం నుండి గ్రహించబడిన గామని అనే పదం వృత్తిదార సమూదాయ పెద్దను లేదా గ్రామ పెద్దను సూచిస్తుంది. బౌద్ధ కృతులు గామినిని వృత్తిపరమైన సైని కులుగా, గజ, ఆశ్విక దళ శిక్షకులుగా, వేదిక పాలకులుగా గుర్తిస్తాయి.

**పట్టణ ఆర్థికవ్యవస్థ ఆవిర్భావం- ప్రగతి :** కొన్ని "నిగమ"ల మూలాలను కొన్ని పెద్ద గ్రామాలలో (వృత్తిదార) అన్వేషించవచ్చు. అలాంటి గ్రామాలలో కుమ్మరి, వడ్రంగి, ఉప్పు తయారీదారులు లాంటి వృత్తిదార సముదాయాలు ప్రత్యేకంగా నివసించేవారు. తొలుత అవి చిన్న స్థాయి ప్రత్యేక మార్కెట్లుగా తదుపరి కాలంలో మరింత సాధారణ మార్కెట్ కేంద్రాలుగా ఆవిర్భవించి ఉంటాయి.

"నిగమ" ఒక మార్కెట్ పట్టణంగా ఉండేదన్న విషయాన్ని నాణేల ఆధారం నిరూపిస్తుంది. "నిగమ" అనే ముద్ర కలిగిన నాణేల పరంపరను నిగమలు(పట్టణాలు) జారీ చేశాయని బోధపడుతుంది. కొన్ని పెద్ద నగరాల విషయానికి వస్తే నిగమ అనే పదాన్ని వార్డు లేదా నగరంలో ఒకప్రాంతాన్ని సూచించడానికి ఉపయోగించారు. అలాంటి వార్డులు లేదా ప్రాంతాలలో ఒక ప్రత్యేక వృత్తిని నిర్వహించే వ్యక్తులు నివసించేవారు, అక్కడే తమ కార్యకలాపాలను చేపట్టేవారు.

కేవలం రాజకీయ కేంద్రాలుగా కొనసాగిన నగరాలు, రాజకీయ, వాణిజ్య విధులు రెండింటినే నిర్వహించని నగరాల మధ్య వైరుధ్యాన్ని పాటించాలి. హస్తినాపూర్, ఇంద్రప్రస్థ, అహిచ్ఛత్ర, అయోధ్య లాంటి పట్టణాలు మౌలికంగా రాజకీయ కేంద్రాలుగా కొనసాగితే శ్రవస్తి, కౌసాంబి, వైశాలి, రాజగృహ లాంటి పట్టణాలు రాజకీయ, వాణిజ్య కార్యకలాపాలు రెండింటినీ నిర్వహించాయి. అందుకే వాటి మధ్య తేడాను గుర్తించాలి. తొలి రకం నగరాలు లేదా పట్టణాలలో రాజప్రసాదాలు, రాచరిక ఆస్థానాలు, రాజకీయ కార్యకలాపాల కేంద్రంతో కిటకిటలాడాయి.

తర్వాతి కాలలో వాటికి పునఃపంపిణీ వ్యవస్థ జత అయ్యింది. వ్యవస్థలో సమీకరణ, వితరణ విభాగాలు అంతర్భాగంగా ఉండేవి. తొలి రాజకీయ రాజధానులలో జరిపిన తవ్వకాలలో రాజప్రసాదాలు ఇంకా బయటపడవలసి ఉంది. ఈ దశలో రాచరికం వైపు పరివర్తన చాలా బలహీనంగా ఉండడం వల్లే మనకు రాజభవనాలు ఎక్కువగా కనిపించవు. సమాంతర తవ్వకాలు జరపకపోవడం కూడా పాక్షిక కారణం కావచ్చు. కౌసాంబిలో రాజభవనాల సముదాయం బయటపడినా అది వెలసిన సమయం కొంత వరకు వివాదాస్పదంగా ఉంది.

గంగా లోయలోని తొలి పట్టణాలలో విశాలమైన సార్వజనిక భవనాల లోటు కొట్టొచ్చినట్లు కనబడుతుంది. చివరకు మౌర్య కాలంలో కూడా ఒక్క పాటలీపుత్ర మాత్రమే అద్భుతమైన కట్టడాలను కలిగి ఉండేది. మౌర్య అనంతరకాలంలో విదేశీ వాణిజ్యం నుండి సంపద దేశంలోకి ప్రవహించేంత వరకు ఉత్తర భారతదేశంలోని నగరాలు అద్భుతమైన కట్టడాలతో అలంకరించబడలేదు. వాణిజ్య కేంద్రాలుగా, రాజకీయ రాజధానులుగా ద్విపాత్రాభినయం చేసిన పట్టణాలలో వ్యాపారులు, వాణిజ్యవేత్తలు చురుకైన పాత్ర పోషించారు. కొన్ని సందర్భాలలో వారు నిగమగా పరిగణించబడిన ప్రాంతాలను పూర్తిగా శాసించేవారు.

పట్టణీకరణ వైపు తొలి అడుగులు వేసినపుడు పట్టణాలు మతపరమైన కట్టడాలు లేదా కర్మకాండ కేంద్రాలు చుట్టూ అభివృద్ధి చెందాయనడానికి నామమాత్రపు సూచికలు కూడా లేవు. వైదిక మతానికి కాని, బౌద్ధం తొలి దశలు కాని లేదా జైన మతానికి కాని పెద్ద ఆలయాలు లేదా తీర్థయాత్ర ప్రదేశాలు కాని ఉండేవి కావు. వాటికి కొన్ని సాంస్కృతిక ప్రదేశాలు తప్ప విశాలమైన నిర్మాణాలు ఉండేవి కావు. మధ్య గంగ లోయలో పట్టణ కేంద్రాల ప్రగతి శీఘ్రగతిన సంభవించి ఉండవచ్చు. ఎందుకంటే మూల ప్రాంతాలైన గణ సంఘాలలో రాజకుల కుటుంబాలే ఎక్కువగా ఉండేవి. వీరు భూమిపై ఆధారపడి మనుగడ సాగించలేదు. అందుకు భిన్నంగా చిన్న చిన్న బృందాలుగా నివసించడం మొదలుపెట్టారు. ఈ కారణంగా అలాంటి మూల ప్రాంతాలకు పట్టణాలుగా రూపాంతరం చెందే సామర్థ్యం మొండుగా ఉండేది.

పట్టణాలను సంబోధించడానికి“పుర” అనే పదాన్ని తరచూ వాడేవారు. వాస్తవానికి “పుర” అనే పదానికి తొలి అర్థం సురక్షిత వలస ప్రాంతం లేదా నివాస ప్రాంతం. సురక్షితమైన కట్టడాలు సాధారణంగా రాజకీయ కేంద్రాలతో ముడిపడి ఉండేవి. అవి రాజ నివాసాలు లేదా రాజకుల కుటుంబాల (గణ సంఘ వ్యవస్థలో అంతర్భాగంగా ఉన్న కుటుంబాలు) ఆవాస ప్రాంతాలుగా ఉపయోగపడ్డాయి. సురక్షితమైన, విశాలమైన ప్రహరీగోడ పట్టణాన్ని సరిహద్దు ప్రాంతాలతో వేరు చేసేది. ఆ విధంగా నగర, గ్రామీణ ప్రాంతాల మధ్య విభజన రేఖ ఏర్పడేది. అయితే ఇలాంటి విభజన పూర్తిస్థాయిలో నిర్దిష్టమైనది కాదు. ఎందుకంటే రెండు ప్రాంతాల మధ్య సంబంధాలు (లావాదేవీలు) బలంగా కొనసాగాయి. చండాల లాంటి మినహాయించబడిన సామాజిక వర్గాలను దూరంగా ఉంచడానికి కూడా ప్రహరీ గోడలు తోడ్పడ్డాయి. ఈ వర్గాలు సాధారణంగా పట్టణ శివార్లలో లేదా పొరుగు గ్రామాలలో నివసించేవి. తొలి ప్రహరీలు మట్టితో

తయారైన ఎత్తయిన వేదికల రూపంలో ఉండి ఉండవచ్చు. మౌర్య, మౌర్య అనంతర కాలాలలో అవి మరింత విశాలమైన, ఎత్తయిన పక్కా నిర్మాణాలుగా రూపాంతరం చెందాయి.

పట్టణాన్ని పిలవడానికి "నగర" అనే పదాన్ని సాధారణంగా వాడేవారు. మధ్యగంగా లోయలో ఎక్కువగా వినిపించే మహానగర అనే పదం నగరాన్ని సూచిస్తుంది. "జనపద"ల ఆవిర్భావంపై ఉన్న బౌద్ధ విశ్లేషణలు వాటి తొలి దశ అభివృద్ధిని రాజకుల నివాసప్రాంతాలతోనే కాకుండా పట్టణ కేంద్రంతో కూడా ముడిపెడతాయి. బ్రాహ్మణిక ఆధారాలలో నగరాల పేర్లను తరచూ రాజుల పేర్ల నుండి గ్రహించబడ్డాయి. అయితే బౌద్ధ సాహిత్యంలో నగరాల పేర్లు రుషులు, మొక్కలు, పశువులతో ముడిపడి ఉన్నాయి. కపిలవస్తు, కొలియనగర అందుకు నిదర్శనాలు.

**పట్టణీకరణ మౌలిక లక్షణాలు :**

సమకాలీన సాహిత్య ఆధారాలలో నగరాన్ని దాని వైశాల్యంతో గుర్తించేవారు. నగరం సగటున 30 నుండి 50 చదరపు కిలోమీటర్ల వైశాల్యంలో విస్తరించి ఉండడాన్ని సాధారణ విషయంగా పరిగణించేవారు. అయితే సజీవంగా ఉన్న శిథిలాలు ఐదు కిలోమీటర్ల మేరకే విస్తరించి ఉన్నాయి. మూల ప్రాంతం నుండి ఒక నగరం అనేక ప్రాంతాలకు విస్తరించి ఉండేదన్న విషయాన్ని అంగీకరించినా నగర వైశాల్యాన్ని ఎక్కువగా ఊహించే పోకడ స్పష్టంగా బయటపడుతుంది. తొలి దశ పట్టణీకరణలో భౌతిక సంస్కృతి కొంత వరకు సమానంగా ఉండేదన్న వాస్తవాన్ని పురావస్తుశాస్త్రం కూడా ఎత్తి చూపుతుంది. జీవన ప్రమాణాలలో మెరుగుదల వచ్చిందని చెప్పడానికి కొంత ఆధారం ఉంది. గతంలో కొన్ని జనసాంద్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో ప్రజలు కేంద్రీకృతం ఆయ్యారు. దాంతో మురుగునీటి, చెత్త విసర్జనలకు తగిన వ్యవస్థలు అవసరమయ్యాయి.

నిర్మాణ సామాగ్రిలో మట్టి, ఇటుకలు ప్రధాన భాగంగా ఉండేవి. వాటికి తోడు కలప వచ్చి చేరింది. బట్టీలలో కాల్చిన ఇటుకలు, రాయి తదుపరి కాలంలో ఎక్కువగా కనిపిస్తాయి. నలుపు రంగు మట్టి కుండలను విస్తృతంగా వాడారు. అవి బహుశా విలాస వస్తువులై ఉండవచ్చు. అందుకే వాటిని ముఖ్యమైన వాణిజ్య సరుకుగా పరిగణిస్తారు. ప్రధాన మార్కెట్ అంటూ ఏదీ లేకపోవడం మధ్యగంగ లోయ పట్టణాల సాధారణ లే–ఔట్‌ను సూచిస్తుంది. రెండు ప్రధాన రహదారుల కలయిక వద్ద లేదా నదీ తీరం వెంబడి పట్టణం అభివృద్ధి చెందింది. పట్టణ కేంద్రానికి ప్రధాన రహదారులు వెన్నెముకగా ఉండి దానిని గ్రామీణ ప్రాంతాలతో జత చేసేవి. వేడుకల సమయంలో ఊరేగింపులకు అవి ఉపయోగపడేవి. ప్రజలు తమ గృహాలలోని బాల్కనీల నుండి ఊరేగింపులను వీక్షించేవారు. బౌద్ధ శిల్పాలలో అలాంటి దృశ్యాలను ఎక్కువగా పొందుపరిచారు. మార్కెట్ ప్రాంతాలు లేదా నిగమలు (ప్రధాన నగరాలలో) ఎక్కువగా ప్రధాన ద్వారాల వద్ద ఏర్పడేవి. రాజగృహ, శ్రావస్తి లాంటి పెద్ద నగరాలలో

నిగమ ఒక మార్కెట్ పట్టణాన్ని సూచించగలదు. తర్వాతి కాలంలో మహానగర విస్తరించడంతో నిగమలు అందులో కలిసిపోయాయి.

ప్రాచీన నగరాల మౌలిక లక్షణంగా తరచూ పేర్కొనబడిన మహాకట్టడాలు చాలాఅరుదుగా ఉన్నాయి. తొలి చారిత్రక ప్రజలు భవన నిర్మాణంలో కలపను ఎక్కువగా ఉపయోగించడం అందుకు ఒక కారణం. అలాగే ఈ కాలంలో ప్రతిష్ఠాత్మకమైన భవనాలను నిర్మించడానికి రాజకీయ అధికారం కాని మతపరమైన అధికారం కాని అంత శక్తిమంతంగా లేదా సంపన్నంగా ఉండేవి కావు. నివాస ప్రాంతానికి భిన్నమైన కోట కాని విధాన మండలి భవనం కాని మచ్చుకు కూడా కనిపించవు. హరప్పా పట్టణాలలో అవి మౌలిక లక్షణంగా ఉన్న విషయం విదితమే. విశాలస్థాయి గోదాములు లేదా ధాన్యగారాలు పట్టణాలలో లేకపోవడాన్ని బట్టి. రాజకీయ అధికారం అప్పటికీ వికేంద్రీకృతమై ఉండేదని భావించవచ్చు.గహపతులకు స్వంత ధాన్యగారాలు ఉండేవి. అయితే కేవలం మౌర్య కాలంలోనే రాజ్య ధాన్యాగారాల గురించి ప్రస్తావన కనిపిస్తుంది.

**వ్యాపారుల అవిర్భావం -వారి కార్యకలాపాలు :** రాజకీయ కేంద్రంగా ఉండడంతో పాటు వాణిజ్య కేంద్రంగా నగర ఆవిర్భావం వ్యాపారులు, వాణిజ్యకారుల ఎదుగుదలతో దగ్గరగా ముడిపడి ఉంది. గహపతుల శ్రేణుల నుండే వ్యాపార వర్గాలు ఆవిర్భవించాయి. ధర్మ సూత్రాలలో వ్యాపారాన్ని వైశ్యులతో ముడిపెట్టారు. పశుపోషణ, వ్యవసాయం, వ్యాపారం ద్వారా వైశ్యులు సంపదను కూడ బెట్టారని వాటిలో వివరించారు. అయితే వైశ్యులందరికీ వ్యాపారంలో పెట్టుబడి పెట్టడానికి అదనపు సంపద ఉండేది కాదు. అనేక మంది పశుపోషణ, వ్యవసాయ కార్యకలాపాలకే పరిమితమై ఉండవచ్చు. గృహ సూత్రాలు వ్యాపారంలో విజయం కోసం చేపట్టాల్సిన కర్మాకాండలను ప్రతిపాదిస్తాయి. అలాంటి మతాచారాలను పాణ్యసిద్ధి అంటారు. కొందరు క్షత్రియులు కూడా వ్యాపారంలో పాలుపంచుకున్నారని అప్పుడప్పుడు ప్రస్తావించాయి. అయితే సాధారణంగా క్షత్రియుల యువ పుత్రులే వ్యాపారాన్ని నిర్వహించి ఉంటారు.

బ్రాహ్మణిక సాహిత్యంలో చాలా వరకు తొలి రెండు అగ్రవర్ణాలు వ్యాపారాన్ని వృత్తిగా స్వీకరించరాదని స్పష్టంగా పేర్కొన్నప్పటికీ వ్యాపార వర్గం మాత్రం సమాజం నుండి గణనీయమైన గౌరవాన్ని పొందగలిగింది. వ్యాపారిని సంబోధించడానికి“శ్రేష్ఠిన్” అనే పదాంశాన్ని వాడడం వారి గౌరవ ప్రతిష్ఠలను సూచిస్తుంది, అదే పదాన్ని పాలి రూపంలో “శెట్టి” అని పిలిచారు. దానర్థం“ఉత్తమ సౌకర్యాలు గల వ్యక్తి”. తదుపరి వేద గ్రంథాలలో శ్రేష్ఠిన్ అనే పదాన్ని సాధారణ పరిస్థితులలో వాడారు. అయితే పాలి గ్రంథాలలో ఆ పదం ఒక ప్రత్యేకమైన అర్థాన్ని సంతరించుకుంది.

దుకాణదారుడు (పాపణిక), చిల్లరవిక్రేత (క్రయవిక్రయిక), పెట్టుబడిదారుడు (వాస్నిక), చిన్నస్థాయి వ్యాపారి (వణిజ), శెట్టిగహపతిల మధ్య తేడాను పాటిస్తారు. శెట్టిగహపతి

మౌలికంగా బ్యాంకరు లేదా పెట్టుబడిదారుడు. వాస్తవిక ఉత్పత్తి లేదా సరుకుల రవాణాలో స్వయంగా కీలకపాత్ర పోషించడం కంటే పెట్టుబడులు పెట్టడంపైనే వారు ఎక్కువగా ఆసక్తి చూపేవారు. నాణేల మారకం వినియోగంలోకి రావడంతో అతడి కార్యకలాపాలు పెరిగాయి. ఈ కాలానికి చెందిన వివిధ క్షేత్రాలలో రంధ్రం పొదగబడ్డ నాణేలు లభించడం అందుకు నిదర్శనం.

**వాణిజ్య కేంద్రాలు, వాణిజ్య మార్గాలు :** స్థానిక వ్యాపార మండళ్లు గ్రామాలను స్థానిక మార్కెట్ కేంద్రాల (నిగమలు)తో జత చేయగా నిగమలు వాటిని నగరాలతో ముడిపెట్టాయి. వ్యాపారంలో చెలామణి అయిన సరుకులు ఎక్కువగా మౌలిక వినియోగానికి సంబంధించినవే. లోహాలు, ఉప్పు లాంటి కొన్ని ఉత్పత్తులు విశాల వాణిజ్య మండళ్లలో తదుపరి దశలో ప్రవేశిస్తాయి. ఈ మండళ్లు నగరాలను పరస్పరం జత చేస్తాయి. స్థానిక మండళ్లకు పూర్తి భిన్నంగా ఇవి తమ వ్యాపార కార్యకలాపాలను నిర్వహిస్తాయి. తొలి వ్యవస్థలో వాణిజ్యాన్ని గహపతులు నియంత్రిస్తే తదుపరి వ్యవస్థలో శెట్టిలు రంగంలోకి వస్తారు. ఈ వ్యాపారానికి పెద్ద మొత్తాలలో పెట్టుబడులు, వ్యాపారుల మధ్య సన్నిహిత సంబంధాలు అవసరం. ఇలాంటి కొన్ని సంబంధాలు రాజకీయ కేంద్రాల మధ్య ఉన్న పూర్వ సంబంధాలు వైపు మళ్లాయి. వాణిజ్యం విస్తరించడంతో అవి వాణిజ్య సంబంధాలుగా రూపాంతరం చెందాయి. స్థానిక వ్యాపార మండళ్లకు వెలుపల ఉన్న ప్రధాన రహదారులు రాజకీయ కేంద్రాలను కూడా జత చేశాయి. ఇలాంటి సంబంధాలు తొలుత వివాహసంబంధాల ద్వారా ఏర్పడి ఉండవచ్చు. వ్యాపారం విస్తరించడంతో కొన్ని రాజకీయ కేంద్రాలు వాణిజ్య ప్రాధాన్యతను కూడా సంతరించుకున్నాయి. ఆ విధంగా గాంధారలోని తక్షశిల పశ్చిమాసియాతో ఉన్న అనుబంధం వల్ల తన వాణిజ్య ప్రాముఖ్యతను నిలబెట్టుకుంది. మరీముఖ్యంగా క్రీ.శ. ఆరవ శతాబ్దం తర్వాత అఖెమేనియా సామ్రాజ్యానికి తూర్పు కోణంలో ఉండడం వల్ల తక్షశిల ప్రముఖ వ్యాపార వాణిజ్య కేంద్రంగా ఎదిగింది.

భౌద్ధ సాహిత్య కృతులలో పేర్కొన్న ఆరు మహానగరాలు ఈ విధంగా ఉన్నాయి :

1. శ్రావస్తి (బౌద్ధ కాలంలో కోసల రాజధాని) రామాయణలోని అయోధ్య స్థానాన్ని భర్తీ చేసినట్లు కనబడుతోంది. ఎందుకంటే అయోధ్య దక్షిణాన మరీ దూరంగా ఉండేది. ఆ కారణంగా పర్వత పాదాలకు దగ్గరగా వెళ్లే ప్రధాన రహదారికి దగ్గరగా ఉండేది కాదు.
2. సాకేత: కోసల– కౌసాంబి రహదారిలో ఏర్పాటైన మహానగరం సాకేత.దానితో కోసలకు రెండు ప్రధాన నగరాలు అందుబాటులో ఉండేవి.
3. రాజగృహ మగధ రాజధాని. గంగానది, పీఠభూమి తూర్పు ప్రాంతాల మధ్య ఉన్న సారవంతమైన నేలలను మగధ శాసించేది.

4. చంపా అంగ రాజధాని. (అంగరాజ్యం బీహార్‌లోని భాగల్‌పూర్ ప్రాంతంలో విస్తరించి ఉండేది). గంగా నదిపై వెలిసిన ముఖ్యమైన రేవు చంపా. తూర్పు దిశలో ప్రవహించే వాణిజ్యాన్ని అది నియంత్రించేది.

5. కాశి రాజధాని కేంద్రం. అది గంగా–గోమతి నదుల సంగమానికి దగ్గరలో ఉండేది.

6. కౌసాంబి గంగా యమునల సంగమం వద్ద ఏర్పాటైంది. వింధ్య పర్వతాల గుండా వెళ్లే రహదారి దానికి అందుబాటులో ఉండేది.

ఈ నగరాలన్నీ ప్రధాన రహదారుల వెంబడి లేదా నదుల ఒడ్డుపై ఏర్పాటై ఉండడంతో ఒక ప్రత్యేక లక్షణాన్ని సంతరించుకున్నాయి. రహదారులు, నదులను వాణిజ్య మార్గాలుగా ఉపయోగించాయి. అలాగే కొన్ని నగరాలు రెండు భిన్నమైన వాతావరణ మండళ్ల కలయిక వద్ద ఏర్పడ్డాయి.

ఉత్తరపథ లేదా ఉత్తర మార్గం పర్వతపాదాల గుండా విస్తరించి గండక్‌ను అనుసరిస్తూ దక్షిణం వైపు వెళ్లింది. అయితే నది జల మార్గాల ద్వారా రవాణాపై నియంత్రణకు కాలానుగుణంగా ప్రాముఖ్యత పెరిగింది. అది ఉత్తరపథాన్ని అధిగమించింది. తొలుత పాటలీగ్రామంగా ఉన్న ప్రాంతం నందుల కాలంలో పాటలీపుత్రగా ఎదగడం అందుకు నిదర్శనం. గంగాలోయలో ప్రధాన నదుల సంగమ ప్రాంతానికి దగ్గరగా ఏర్పాటై ఉండడంతో పాటలీపుత్రకు ఎనలేని ప్రాముఖ్యత దక్కింది. మరో మాటలో చెప్పాలంటే నదులు వ్యాపార లావాదేవీలకు (మారకానికి) విశాలమైన వ్యవస్థను అందించాయి.

కపిలవస్తు, కొలియనగర, కుసినగర, పావలాంటి గణ–సంఘ రాజధానులను ముఖ్యమైన పట్టణాలుగా వర్ణించబడి నప్పటికీ మహానగరాలుగా అవి దర్శనమియ్యవు. ఉత్తరపథలో ఒక ముఖ్యమైన భాగాన్ని నియంత్రించిన వైశాలి కూడా మహానగరాల జాబితాలో నిరంతరంగా చోటు చేసుకోలేదు. కనీసం రెండు ఉదంతాలలో రాజకీయ కేంద్రాలుగా ఉన్న రాజధానులను ముఖ్యమైన వాణిజ్య మార్గాలపై ఉన్న ప్రాంతాలకు తరలించబడ్డాయి. కోసల రాజధానిని అయోధ్య నుండి శ్రావస్తికి తరలించగా మగధ రాజధానిని రాజగృహ నుండి పాటలీపుత్రకు మార్చారు.

ఉత్తర భారతదేశం లోపల వ్యాపారం విశాలమైన భూభాగంలో విస్తరించింది. నలుపు రంగు మట్టికుండలు, సంబంధిత పురావస్తు శకలాలు తొలి దశలలో విస్తరించిన తీరు అందుకు తగిన సాక్ష్యాన్ని అందిస్తుంది. పశ్చిమోత్తర ప్రాంతంలో, ముఖ్యంగా గాంధారలో అఖెమేనియా సామ్రాజ్య అవసరాలు విదేశీ వాణిజ్యానికి పునాదుల వేసి ఉంటాయి. మౌర్య కాలం నాటికి విదేశీ వాణిజ్యం పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందింది. గల్ఫ్ ప్రాంతంతో సముద్ర మార్గాన సంబంధాలు గల గుజరాత్ మరో అనువైన వాణిజ్య ప్రాంతం. అస్సేరియా సామ్రాజ్యం తన చివరి దశలో పశ్చిమ భారతదేశంతో వాణిజ్య సంబంధాలను ఏర్పాటు చేసుకొని ఉండవచ్చు. వాటి గురించి సాహిత్య కృతులలో సూచికలు ఉన్నాయి. పశ్చిమ తీరంలో రేవులుగా భృగుకచ్ఛ,.

సోపారలకు గల ప్రాధాన్యతను పశ్చిమాసియాతో ఉన్న సముద్ర మార్గ వాణిజ్యంలో అంతర్భాగంగానే వివరించగలము. సింధ్ నుండి శ్రీలంక వరకు పశ్చిమ తీరం వాణిజ్య కార్యకలాపాలకు ముఖ్యమైన ప్రాంతంగా ఆవిర్భవించింది. తన స్వంత తీర వ్యవస్థతో ఒక వాణిజ్య మండలంగా అది రూపాంతరం చెందింది. దక్షిణపథ లేదా దక్షిణ మార్గం ఉజ్జెయినీ గుండా దక్షిణంవైపు వెళ్లింది. గంగాలోయను పశ్చిమ తీరంతో జత చేయడమే దాని లక్ష్యం. ఈ కాలంలోనే ఈ రహదారి మొదలైనా తదుపరి కాలంలో పూర్తిగా అభివృద్ధి చెందింది.

**వాణిజ్య ఉత్పత్తులు:**

ఇనుము, రాగి, వెండి, తగరం, లెడ్ తదితర లోహాలు, ఉప్పు పింగాణీ పాత్రలు, విశాలమైన పరిమాణంలోగల జౌళి ఉత్పత్తులు వాణిజ్యానికి సాధారణ సరుకులుగా ఉండేవి. స్థానిక వ్యాపార మండళ్ల స్థాయి పెరగడంతో లోహాలు, ఉప్పును విదేశీ వాణిజ్యంలో చేర్చి ఉంటారు. ఉత్తర నలుపు రంగు మట్టి పాత్రలు లాంటి విలాస వస్తువుల పంపిణీ ఒక సంపన్న కుమ్మరి నుండి ప్రారంభమైందనడంలో ఎలాంటి సందేహం లేదు. తర్వాతి కాలపు సాహిత్యంలో వివరించినట్లు ఆ సంపన్న కుమ్మరికి 500 కుండల తయారీ కేంద్రాలు అంతే సంఖ్యలో నావలు ఉండేవి. గంగా లోయలోని వివిధ నదీరేవులకు పాత్రలను నావలలో రవాణా చేసేవాడు. గ్రీకు సాహిత్యంలో పత్తి వస్త్రాలు, ఇనుప ఖడ్గాల గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ రెండు ఉత్పత్తులు భారత వాణిజ్యంలో అనేక శతాబ్దాల పాటు ప్రధాన భాగంగా కొనసాగాయి. మరీ ప్రత్యేకమైన ఉత్పత్తులు ఉన్ని దుప్పట్లు. గాంధార నుండి ఉన్ని దుప్పట్లు ఎక్కువగా ఎగుమతి అయ్యేవి. గంగాలోయ, హిమాలయ పర్వత పాదాల్లోని అడవులలో విస్తారంగా ఉన్న ఏనుగు దంతాలు, సింధ్, కంబోజ నుండి వచ్చిన అశ్వాలు కూడా వ్యాపార సరుకులుగా ఉండేవి. అశ్వాల విక్రయానికి కాశి ప్రధాన మార్కెట్టుగా ఉండేదని తెలుస్తోంది.

**మారకద్రవ్యం :**

నాణేల రూపంలో మారకద్రవ్యం వినియోగంలోకి వచ్చింది, అయితే అది పట్టణకేంద్రాలతోనే ఎక్కువగా ముడిపడి ఉంది. ఈ స్థాయిలో గ్రామీణ ప్రాంతాలలో నాణేల వాడకం ఉండేదని చెప్పడానికి కనీస సాక్ష్యం కూడా లేదు. చెలామణి అయిన నాణేలలో అత్యంత విలువైనది వెండి "శతమన". అయితే అతిసాధారణంగా చెలామణి అయిన నాణేలు వెండి 'కర్షపాన", వెండి "మాష," "కాకాణి" లు. ఒక కర్షపాన 16 మాషలతో సమాన విలువ కలిగి ఉండేదని చెబుతారు. దానిని అర్థ, పాద(నాల్గవవంతు) లుగా విభజించారు. కాకాణికి మాషలో సగం విలువ ఉండేది. అతి చిన్న విభజన అర్ధ కాకాణి. పాలిగ్రంథాలలో కనిపించే కర్షపాన లేదా కహపానను "పాన" అని కూడా పిలుస్తారు.

రంధ్రం దుయ్యబడిన నాణేలు జారీ చేసిన అధికార వ్యవస్థ యొక్క చిహ్నాలను కలిగి ఉన్నాయి. ఆయా ప్రాంతాలలో అవి లభ్యమైన దానిని బట్టి, జారీ చేసిన అధికార

వ్యవస్థను బట్టి నాణేలు విభిన్న చిహ్నాలను కలిగి ఉన్నాయి. కొన్ని నాణేలలో ఒకటి కంటే ఎక్కువ చిహ్నాలు ఉన్నాయి. వ్యాపార సముదాయాలు నాణేలను జారీ చేసి ఉండవచ్చు. వాటికి స్వంత వంశానికి చెందిన రాజుల మద్దతు ఉండేది. వాటికి ప్రత్యేక చిహ్నాలు ఉండేవి. అలాగే స్వంతంగా నాణేలు జారీ చేయగల సత్తా ఉన్న సంపన్న వృత్తి నిపుణుల సముదాయాలు కూడా నాణేలను జారీ చేసి ఉండవచ్చు. అయితే రంధ్రాలు గల నాణేలను ఏదేనీ రాచరికం జారీ చేసిందా అన్నది ఇంతవరకు నిర్ధారణ కాలేదు. అందుకే వాటిని పరివర్తన కాలపు నాణేలుగా పరిగణించవచ్చు. వ్యాపారులు జారీ చేసిన టోకు నాణేలు, రాచరికం జారీ చేసిన చట్టబద్ధమైన మారకాల మధ్య అవి చెలామణి అయి ఉండవచ్చు. అర్థశాస్త్ర వెలువడేంత వరకు నాణేలను రాజ్యం సమర్థించిన దాఖలాలును ఎక్కడా ప్రస్తావించలేదు.

**హస్తకళలు- వృత్తిదారులు:** ఉన్నతమైన వస్త్రాలు, చక్కటి నక్కాషి కలిగిన ఏనుగు దంతపు కృతులు లాంటి ఖరీదైన వస్తువులు పట్టణ కేంద్రాల్లోని నిపుణులైన వృత్తికారులతో ముడిపడి ఉన్నాయి. ఈ వృత్తికారులు తొలుత స్వతంత్రంగా పని చేసినప్పటికీ క్రమంగా కార్పొరేట్ సంస్థలుగా సంఘటితమయ్యారు. అలాంటి సంస్థలను శ్రేణి, పుగ పిలిచేవారు. ఆ రెండు గణ-సంఘ వ్యవస్థతో ముడి పడి ఉన్నాయి. శ్రేణిలో వృత్తిదారులు అంతర్భాగంగా ఉండేవారు. మండలి అభివృద్ధి చెందితే సహాయకులను (అంతే వాసిక్) నియమించడమే కాకుండా దాస-భృతకలను కూడా పనులలో చేర్చుకునేవారు. అయితే ఈ కాలంలో వృత్తికారులు దాసలును నియమించిన దాఖలాలు కొన్నే ఉన్నాయి. మండలి కూడా దాసులను నియమించలేదు. శ్రేణి క్రమంగా వృత్తినిపుణుల వర్గంగా ఎదిగింది. ఒప్పంద సంబంధాలతో వారు సమైక్యంగా ఉండేవారు. వృత్తిపరమైన గుర్తింపు వాటిని జాతులుగా ఉద్భవించడంతో ప్రోత్సహించింది. వర్ణవ్యవస్థలో సూద్రుల హోదా పొందిన వృత్తిదార జాతులు (అసంఖ్యాకమైన) ఇవే.

## మౌర్య కాలం

**వ్యవసాయం :** మౌర్య రాజ్యం ఐదు రకాల భూమి యాజమాన్యాలు ఉండేవని చరిత్రకారులు ప్రతిపాదించారు. అవి రైతు యాజమాన్యం, సముదాయ యాజమాన్యం, పాలకుని యాజమాన్యం, భూస్వామ్య యాజమాన్యం రాజ్య యాజమాన్యం. అయితే సమకాలీన సాహిత్య కృతులలో తొలి రెండు రకాల యాజమాన్యం గురించి ఎలాంటి ప్రస్తావన లేదు. గహపతుల వర్గం ఉండేదని నిర్ధారించడానికి తగిన ఆధారాలు ఉన్నా వారు వ్యవసాయ దారులకు కేవలం ఆర్థిక సహాయం అందించే పాత్రను పోషించారు. భూయజమానుల వర్గంగా వారు వ్యవహరించలేదు. పాలకుని యాజమాన్యం విషయానికి వస్తే భూభాగమంతా పాలకుని యాజమాన్యంలో ఉండేదన్న మెగస్థనీస్ ప్రకటన తీవ్రంగా ప్రశ్నించబడింది. అంటే మనముందు ఒకే ఒక్క సాధ్యత మిగులుతుంది. అదే రాజ్య యాజమాన్యం. ప్రాచీన గ్రంథాలలో చాలా వరకు ఈ విషయాన్ని అంగీకరించారు. అర్థశాస్త్రంలో కూడా అలాంటి ప్రస్తావనే ఉంది.

అయితే దురదృష్టవశాత్తు కనీసం సిద్ధాంతపరంగానైనా రాజు, రాజ్యం మధ్య మౌర్య కాలంలో ఎలాంటి విభజన ఉండేది కాదు. వ్యక్తిగత ఆస్తులకు తోడు మౌర్య పాలకుడు రాజ్య భూముల నుండి పన్నులు కూడా అందుకునేవాడు. ఆ కారణంగానే మెగస్థనీస్ రాజు భూములన్నింటికి యజమాని అనే భావనకు వచ్చాడు. రాజ్యం పాలకుడి యాజమాన్యంపై ఇలాంటి సైద్ధాంతిక వాదన ఉన్నప్పటికీ సాగుదారులు కొన్ని అనువంశిక లేదా సాంప్రదాయబద్ధమైన హక్కులను అనుభవిస్తూ ఆచరణలో వ్యవసాయ పనులను చేపట్టేవారు. వ్యవసాయ రంగం రాజ్యానికి ప్రధాన ఆదాయ వనరుగా ఉండేది. దిగుబడిలో నాలుగోవంతు భాగం నుండి ఆరోవంతు భాగం వరకు పన్ను లేదా శిస్తు రూపంలో రాజ్యం వసూలు చేసేది. పాలకుని అధికారులు నేరుగా వ్యక్తిగత వ్యవసాయదారుల నుండి పన్ను (వాటా) వసూలు చేసేవారు. పన్నుల సేకరణలో దళారులను దూరంగా ఉంచేవారు. అవసరమైతే పన్ను మినహాయింపు లేదా తగ్గింపును రాజే స్వయంగా నిర్ణయించేవాడు. దిగుబడిలో నాలుగో వంతు భాగాన్ని రాజ్య వాటాగా సాధారణంగా అంచనా వేసేవారు. ఈ నియమం కేవలం అత్యంత సారవంతమైన భూభాగాలకే వర్తించేది. ముఖ్యంగా పాటలీపుత్ర చుట్టూ ఉన్న ప్రాంతంలో సారవంతమైన నేలలు ఉండేవి. అనేక భారతీయ సాహిత్య కృతులు సూచించిన లేదా ప్రతిపాదించిన వాటా కంటే రాజ్యం వసూలు చేసిన నాలుగో వంతు వాటా ఎక్కువనే చెప్పాలి. సాధారణ సిద్ధాంతం మేరకు రాజ్య వాటాను ఆరోవంతు భాగంగా అనేక న్యాయ, పాలనా గ్రంథాలు ప్రతిపాదించాయి. అత్యవసర పరిస్థితులలో పన్నును మూడోవంతుకు లేదా నాలుగో వంతుకు పెంచవచ్చని "అర్థశాస్త్ర" సూచిస్తుంది. అయితే సేద్యపు నీటి సౌకర్యాలు ఉన్న సారవంతమైన ప్రాంతాలలోనే ఇలాంటి పన్ను హెచ్చింపు ఉండాలని ఆ గ్రంథం ప్రతిపాదించింది. అశోకుని శాసనాలలో రుమ్మిండి శాసనం ఒక్కటే పన్ను విధింపును స్పష్టంగా వివరిస్తుంది. బుద్ధుని జన్మస్థలం కావడం వల్ల లుంబిని గ్రామాన్ని రాజు పన్నుల నుండి మినహాయించాడని, గ్రామ వ్యవసాయ దిగుబడిలో కేవలం ఎనిమిదో వంతు భాగాన్ని చెల్లిస్తే సరిపోతుందని సూచించాడని మనకు చెబుతారు.

నూతన వ్యవసాయధార నివాస ప్రాంతాలను స్థాపించడానికి మౌర్య రాజ్యం తీవ్రంగా కృషి చేసింది. జనాభా ఎక్కువ ఉన్న ప్రాంతాల నుండి అసంఖ్యాక సూద్రులను కొత్త వ్యవసాయ ప్రాంతాలకు తరలించారని అర్థశాస్త్రంలో పేర్కొన్నారు. అశోకుని శాసనాలలో కూడా కళింగ యుద్ధఖైదీలు 1.5 లక్షల మందిని బంజరు భూమిని శుభ్రపరచి కొత్త నివాస ప్రాంతాలను స్థాపించడానికి తరలించారని వివరించారు. జలాశయాలు, చెరువులు, కాలువలు, బావుల తవ్వకం, నిర్వహణ ద్వారా రాజ్యం సాగునీటి సౌకర్యాలను కల్పించింది.

**పారిశ్రామిక ఉత్పత్తులు :**

ఇనుము, రాగి, బంగారం, వెండి, తగరం తదితర లోహాలను గనుల నుండి తవ్వితీసే పరిజ్ఞానం అభివృద్ధి చెందుతూ పోయింది. ఈ లోహాలను విభిన్న పరికరాలు, సాధనాలను తయారు చేయడంలో వినియోగించారు. ప్రత్యేకంగా ఇనుము పరికరాల వినియోగం పెద్ద స్థాయిలో జరిగింది. మథుర, కాశి, పాటలీపుత్ర, వంగ, మహిస, తదితర ప్రాంతాలలో జౌళి

ఉత్పత్తుల తయారీ సాధారణంగా జరిగేదని చెప్పడానికి సాహిత్య, పురావస్తు ఆధారాలు ఎన్నో ఉన్నాయి. ఉత్తర నలుపు రంగు మట్టికుండలు తయారు చేసే ప్రాంతాలు, అలాగే అనేక కుండలను మౌర్య క్షేత్రాలలో కనుగొన్నారు. పాటలీపుత్రలో జరిపిన తవ్వకాలు, ఇతర సాహిత్య ఆధారాల ద్వారా మౌర్య వృత్తికారుల అద్భుతమైన చెక్క పనిని విశ్లేషించవచ్చు. మరోవైపు శిల్పకళలో అద్భుత కళాఖండాలను అశోకుని నిర్మాణశాస్త్రంలో చూడవచ్చు. ముఖ్యంగా స్థూపాలు లేదా స్తంభాల నిర్మాణం అద్భుతమైన శైలిలో జరిగేది.

తొలి బౌద్ధ కాలం నుండి కొనసాగుతూ వచ్చిన వ్యాపార, హస్తకళాకారుల మండళ్లు మౌర్యుల పాలనలో మరింత అభివృద్ధి చెంది స్థిరత్వాన్ని సమకూర్చుకున్నాయి. ఈ కాలంలో హస్తకళల ఉత్పత్తి, వాణిజ్య కార్యకలాపాలు గణనీయంగా విస్తరించడం వల్లే వ్యాపార, వృత్తిదారుల మండళ్లు అభివృద్ధి చెందాయి. విశాల స్థాయి సంఘాలుగా అవి ఎదిగాయి. వ్యక్తిగత సభ్యులు అనుభవించిన కొన్ని హక్కుల గురించి కౌటిల్యుడు ప్రస్తావించాడు. పని నాణ్యత, పరిమాణం బట్టి కార్మికులకు వేతనాలను నిర్ధారించేవారు. నాసిరకమైన, అసంపూర్ణమైన పనికి తీవ్ర జరిమానాలు, శిక్షలు విధించేవారు. స్థానికీకరణ, వృత్తుల అనువంశిక స్వభావం వల్ల మండళ్లు మరింత బలపడ్డాయి. మండళ్లు కిరాయి కార్మికులను నియమించుకోవలసి వచ్చింది. వేతన కార్మికులు రెండు విధాలుగా ఉండేవారు ఒకరు కర్మహారులు లేదా భృతకలు. వీరు స్వేచ్ఛ కార్మికులు. వీరికి క్రమం తప్పకుండా వేతనాలు లభించేవి. మరోవర్గం వారు దాసులు లేదా బానిసలు. అశోకుడు తన శాసనాలలో పై రెండు వర్గాల కార్మికులను ప్రస్తావించారు. భతక, దాస అనే పదాలను అతడు ఉపయోగించాడు. గనులు, ఆయుధాలు–కవచాల ఉత్పత్తి మద్యపానాన్ని మరగబెట్టడం, నౌకానిర్మాణం తదితర పారిశ్రామిక కార్యకలాపాలపై మౌర్య రాజ్యానికి ఒక విధమైన గుత్తాధిపత్యం ఉండేది. ఉదాహరణకు మద్యపాన తయారీ కేంద్రాలన్నీ రాజ్య నియంత్రణలో ఉండేవి. వాటిని సురాధ్యక్షుల ద్వారా పర్యవేక్షించేవారు.

**వ్యాపార– వాణిజ్యాలు :** దేశంలోని వివిధ ప్రాంతాల మధ్య అంతర్గత వ్యాపారం జరిగేది. విభిన్న రకాలైన సరుకులను విక్రయించేవారు లేదా కొనుగోలు చేసేవారు. దుప్పట్లు, చర్మాలు లాంటి ఉత్తరభారత ఉత్పత్తులను విలువైన రాళ్లు, ముత్యాలు, వజ్రాలు, శంఖాలు, బంగారు లాంటి దక్షిణ భారత ఉత్పత్తులతో మార్చుకోవడం వ్యాపారంలో ఒక ముఖ్యమైన భాగంగా ఉండేది. విదేశాలు, ముఖ్యంగా గ్రీకు ప్రపంచం, కొంత వరకు బర్మాతో అంతర్జాతీయ వాణిజ్యాన్ని నిర్వహించేవారు. మసాలదినుసులు (మిరియాలు, పసుపు, మెంతులు, లవంగాలు, యాలకలు), ముత్యాలు, వజ్రాలు, పత్తి వస్త్రాలు, ఏనుగుదంతపు కళాఖండాలు, శంఖాలు, చర్మాలు, దుప్పట్లు తదితర వాటిని ప్రధానంగా ఎగుమతి చేసేవారు. ప్రధాన దిగుమతుల్లో అశ్వాలు, బంగారు, గాజు, శుద్ధి చేయబడిన చర్మం మొదలైనవి ఉండేవి. వ్యాపార సమతుల్యం భారతదేశం వైపే ఎక్కువగా మొగ్గేది.

అంతర్గత (దేశీయ) వ్యాపార మార్గాలు ప్రధాన రహదారులు, రవాణా సాధ్యమైన నదుల గుండా వెళ్లేవి. అంతర్జాతీయ వ్యాపార మార్గాలు ప్రధానంగా తీర ప్రాంతాలు, భూమార్గాల

ద్వారా వెళ్లేవి. భారుకచ్ఛ (గుజరాత్ లోని బరోచ్) రేవు గురించి తరచూ ప్రస్తావన ఉంది. ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలో రహదారుల నిర్మాణం. వాటి నిర్వహణపై మౌర్యపాలకులు చాలా శ్రద్ధ చూపేవారు. ఈ ప్రత్యేక అధికారులను మెగస్థనీస్ "అగ్రనామోయ్" (agranamoi) అని పిలిచాడు. శ్రావస్తి నుండి ప్రతిష్ఠాన వరకు విస్తరించి ఉండిన దక్షిణ– పశ్చిమ రహదారి, శ్రావస్తి నుండి రాజగృహ వరకు గల దక్షిణ తూర్పు రహదారి, తక్షశిల నుండి పాటలీపుత్ర వరకు గల తూర్పు పశ్చిమ రహదారి (గంగా, యమునా నదులను అనుసరిస్తూ) దేశీయ వ్యాపార మార్గాలలో ముఖ్యమైనవి. అయితే అన్నింటికంచే ముఖ్యమైన మార్గం పశ్చిమోత్తర ప్రాంతం (తక్షశిల) నుండి పాటలీపుత్ర వరకు విస్తరించిన రాచరిక ప్రధాన రహదారి. గ్రాండ్ ట్రంక్ రోడ్‌గా అది శతాబ్దాల తరబడి ప్రాముఖ్యతను నిలుపుకుంది. తూర్పు దిశలో అదనపు రహదారి తామ్లూక్ లేదా గంగానది ముఖద్వారం వరకూ విస్తరించి ఉండేది. సముద్ర వ్యాపారం అభివృద్ధి చెందకముందు పశ్చిమ దేశాలకు గ్రాండ్ ట్రంక్ రోడ్డు ప్రధాన వ్యాపార మార్గంగా ఉండేది. ఈ రహదారిలో తక్షశిల మారక కేంద్రంగా ప్రముఖ స్థానాన్ని ఆక్రమించి ఉండేది. దేశీయ వ్యాపారం కోసం కూడా ఈ రహదారిని తరచూ ఉపయోగించేవారు. ఎందుకంటే గంగా పశ్చిమోత్తర ప్రాంతాల మధ్య వస్తువుల మారకం గణనీయంగా జరిగేది.

ఉత్పత్తులతో పాటు ఎగుమతులన్నిటిపై రాజ్యం పన్ను విధించేది. సరుకు విలువలో ఐదు వంతు భాగాన్ని వాణిజ్య పన్నుగా వసూలు చేసేవారు. పన్ను ఎగవేతకు తీవ్రమైన శిక్ష విధించేవారు. అన్ని రకాల వస్తువుల విక్రయంపై కఠినమైన పర్యవేక్షణ ఉండేది. స్థానిక ఉత్పత్తులపై ఐదు శాతం, ఎగుమతి అయిన ఉత్పత్తులపై 10 శాతం లాభాలను నిర్ధారించేవారు. ప్రత్యేక మండళ్లు వ్యాపారులపై ఇలాంటి నిబంధనలను విధించేవి. విశాల స్థాయి వ్యవసాయం సామ్రాజ్యానికి బలమైన ఆర్థిక పునాదిని అందించడమే కాకుండా నగదు సమీకరణకు అదనపు నిల్వలను అందించేది. ఈ కారణంగా వెండి, రాగి నాణేల రూపంలో లోహపు మారకం పెద్ద ఎత్తున చెలామణి అయ్యేది. భారతదేశంలో వడ్డీ వ్యాపారం లేదని మెగస్థనీస్, వ్యక్తం చేసిన అభిప్రాయం వాస్తవం కాదు. ఎందుకంటే బౌద్ధ సాహిత్యంతో పాటు అర్థశాస్త్రం వడ్డీవ్యాపారం అమల్లో ఉండేదని తగిన ఆధారాలను అందిస్తాయి. వార్షిక వడ్డీ 15 నుండి 60 శాతం ఉన్నా రాజ్యం వడ్డీ రేటును నియంత్రించిన అవకాశం ఎక్కువగా ఉంది. అందుకే మెగస్థనీస్, ఆ విషయాన్ని గ్రహించడంలో విఫలమయ్యాడు. వ్యాపారం, హస్తకళల అభివృద్ధికి సహజ పరిణామంగా పట్టణీకరణ వెలుగులోకి వచ్చింది. శ్రావస్తి, కపిలవస్తు, రాజగృహ, పాటలీపుత్ర, ఉజ్జయినీ, తదితర ముఖ్యమైన నగరాలు, వాణిజ్య కేంద్రాలు ఉండేవి. ముఖ్యమైన రేవు పట్టణాలలో భారుకచ్ఛ, తామ్రలిప్తి, సోపార ప్రధానమైనవి.

## మౌర్య అనంతర కాలం :

### మౌర్య అనంతర కాల ఆర్థిక వ్యవస్థ స్వభావంః

మౌర్య అనంతర కాలం సందర్భంగా దక్షిణాసియాలోని దాదాపు అన్ని ప్రాంతాలు వ్యవసాయ అభివృద్ధిని చవిచూశాయి. తొలి చారిత్రక కాలాల సందర్భంగా ద్వీపకల్ప భారతదేశం స్థిర వ్యవసాయ స్థాయికి ఎదగడం అత్యంత గమనార్హమైన లక్షణం. మౌర్య కాలంలో వింధ్య పర్వత ప్రాంతాల గుండా ఉత్తర భారతదేశ భౌతికవాద సంస్కృతి విస్తరించడం వల్లే ఇలాంటి పరిణామం సాధ్యమై ఉండవచ్చు. తూర్పు దక్కనులో వెలిసిన ప్రముఖ పట్టణ, సాంస్కృతిక కేంద్రమైన ధాన్యకటక పేరే వ్యవసాయ విస్తరణకు సూచికగా ఉంది. పశ్చిమ దక్కను, ఉత్తర కొంకణ్ ప్రాంతాలు తొట్టతొలిసారి క్రమబద్ధమైన, అత్యంత విశాలమైన కొబ్బరి తోటలను వీక్షించాయి. దక్షిణాది, ముఖ్యంగా చేర పాలకుల నియంత్రణలోని మలబార్ తీరం తన మిరియాల ఉత్పత్తి వల్ల తమిళ సంగం గ్రంథాలలోనే కాకుండా ప్లైనీ రచించిన పెరిప్లస్ ఆఫ్‌ది ఎరిత్రియాన్ సీ, నేచురల్ హిస్టోరీయాలలో కూడా అపార ఖ్యాతిని ఆర్జించింది.

ఈ కాలపు వ్యాపార కార్యకలాపాలు కనీవిని ఎరుగని స్థాయిలో విస్తరించాయి. అనేక ప్రాంతాలలో చారిత్రక కాలంవైపు పరివర్తన చెందాయి. ఈ దశలో సామాజిక నిర్మాణం మరింత సంకీర్ణమై దేశీయ వ్యాపార పరిధిని తగిన స్థాయిలో విస్తరింపచేసింది. వణిజ్‌లు, శ్రేష్ఠిన్‌లు, సార్థవాహాలు (విభిన్న వ్యాపార వర్గాలు), వృత్తికారుల మండళ్లు, వాటి లబ్దిదారులకు సంబంధించి ఉన్న అనేక వ్యాఖ్యానాలు పై పరిణామాలను నిర్ధారిస్తాయి.

భారతదేశ ఆర్థిక వ్యవస్థతో ఏ మాత్రం సంబంధం లేని కొన్ని మార్పులు కూడా భారతీయ వ్యాపారభివృద్ధిని ప్రోత్సహించాయి. ఈ వ్యాపారంలో అత్యంత అద్భుతమైన దృశ్యం రోమను సామ్రాజ్యంతో గల సంబంధం. మసాల దినుసులు, విలువైన రాళ్ల, చైనా పట్టుకు రోమను సామ్రాజ్యంలో ఎక్కువ డిమాండ్ ఉండడంతో భారత విదేశీ వాణిజ్యం క్రీ.శ. 45-46 నుండి రుతుపవనాల సహాయంతో ఎంతో అభివృద్ధి చెందింది.

ద్వీపకల్ప భారతదేశంలో రోమను నాణేలు కుప్పలు కుప్పలుగా లభించడం ఈ వ్యాపారానికి అత్యంత నిర్దిష్టమైన ఆధారం. వ్యాపార సంబంధాల గురించి పెరిప్లస్ ఆఫ్‌ది ఎరిత్రియన్ సీ అనే గ్రంథంలో వివరాలు ఉన్నాయి. అలాగే టోలెమి రచించిన జియోగ్రఫీ లో కూడా భారత్-రోమ్ మధ్య గల వాణిజ్య సంబంధాలపై వ్యాఖ్యానాలు ఉన్నాయి. ద్వీపకల్పంలో జరిపిన తవ్వకాలలో కూడా రోమను వస్తువులు పెద్ద సంఖ్యలో లభించాయి. చైనా, ఆగ్నేయ ఆసియాలతో కూడా ఈ కాలంలో సంబంధాలు మొదలయ్యాయి. ఈ ప్రాంతాలలో భారత సంస్కృతి చూపిన ప్రభావం వల్ల తొలి వాణిజ్య కార్యకలాపాలు గాడిలో పడ్డాయి.

వాణిజ్య విస్తరణ నేపథ్యంలో వృత్తికారులు, వ్యాపారుల మండళ్లు ఈ కాలపు ఆర్థిక వ్యవస్థలో అద్వితీయమైన పాత్రను పోషించడం మొదలుపెట్టారు. వ్యాపార, వృత్తిదార మండళ్లు

అనేకం ఉండేవని శాసనాలు చెబుతాయి. ముఖ్యంగా కుమ్మరులు, లోహకారులు, వడ్రంగులు, కంసాలి, స్వర్ణకారులు, వెండినగల తయారీదారులు, ఐవరీ కార్మికులు, మొక్కజొన్న డీలర్లు, హైడ్రాలిక్ ఇంజినీర్లు, తదితరుల మండళ్లు ఉండేవి. వాస్తవానికి ఏ వృత్తి అయినా తనకు తాను మండలిగా సంఘటితమయ్యే అవకాశం ఉండేది. ఎందుకంటే అది తన వ్యక్తిగత సభ్యులకు ఉద్యోగ భద్రత కల్పించేది. ముఖ్యమైన మండళ్లు బ్యాంకర్లు, ఫైనాన్షియర్లుగా కూడా వ్యవహరించాయి.

తొలుత వాణిజ్య కేంద్రాలుగా ఉండిన పట్టణాలు, నగరాలు సహజంగానే తమ విస్తరణలో పతాక స్థాయికి చేరుకున్నాయి. అప్పటి అవసరాల దృష్ట్యా అనేక నూతన పట్టణ కేంద్రాలను స్థాపించాల్సి వచ్చింది. ఇటీవలి అధ్యయనాలు ప్రకారం ఉత్తర భారత పట్టణీకరణలో అత్యంత సంపన్న దశకు సక–కుషాన స్థాయిలు ప్రాతినిధ్యం వహించాయి. దక్షిణంలో అనేక పట్టణాలు కొత్తవే అయినా వ్యాపారంతో వాటి సంబంధం చాలా పాతది. కావేరిపట్టణం, అరికమేడు లాంటి పట్టణాలు ముఖ్యమైన రేవులుగా అంతకుముందు నుండే ఉండడం అందుకు నిదర్శనం.

**వ్యవసాయం :**

మౌర్య అనంతర కాలంలో రాజ్య వ్యవసాయ క్షేత్రాల గురించి ప్రస్తావన ఎక్కడా కనిపించదు. మౌర్య కాలంలో అలాంటి క్షేత్రాలలో బానిసలు, వేతన కార్మికులు సితాధ్యక్ష అనే వ్యవసాయ సంచాలకుడి పర్యవేక్షణలో పంటలను పండించేవారు. అందుకు భిన్నంగా మౌర్య అనంతర కాలంలో భూమిని వ్యక్తిగత రైతులు తమ ఆ ధీనంలో తీసుకున్నారని బోధపడుతుంది. వ్యవసాయ ప్రాంత విస్తరణ విషయానికి వస్తే రాజ్య ప్రయత్నాల (చర్యలు) స్థానంలో వ్యక్తిగత కృషి ముందుకు వచ్చిందని చెప్పవచ్చు. సిద్ధాంతపరంగా చూస్తే బంజరు భూములను వేతన కార్మికులతో అభివృద్ధిపరచి, సాగులోకి తెచ్చే వ్యక్తికే యాజమాన్యం దక్కుతుంది. వ్యవసాయ విస్తరణకు ఊతం ఇవ్వడానికే ఇలాంటి సూత్రాన్ని అమలు చేసి ఉంటారు. వ్యవసాయ భూమిని దానంగా అందించే సాంప్రదాయం అప్పటికే అమలులో ఉన్నప్పటికీ బ్రాహ్మణులకు చౌడు భూములివ్వడానికి ప్రధాన కారణం బంజరు భూములను సాగులోకి తీసుకురావాలన్న సంకల్పమే. భూమిని వ్యక్తిగత ఆస్తిగా పరిగణించినా రాజ్య యాజమాన్యం ఉండేది కాదని ఆలోచించడం తప్పే అవుతుంది. శాతవాహన పాలకుల శాసనాలను బట్టి రాజ్యం తన యాజమాన్య హక్కులను సమర్థవంతంగా చాటుకున్నట్లు బోధపడుతుంది.

భూదానంపై తొలి శిలాశాసన ఆధారం క్రీ.పూ. తొలి శతాబ్దానికి చెందినది. అందులో శాతవాహనులు మహారాష్ట్రలో అశ్వమేధ యాగం సందర్భంగా బ్రాహ్మణులకు ఒక గ్రామాన్ని కానుకగా ఇచ్చినట్లు పేర్కొన్నారు. అలాంటి కేటాయింపులు పన్ను రహితంగా జరిగేవి. అయితే ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే శాతవాహన పాలకుడు గౌతమీపుత్ర శాతకర్ణి (రెండవ శతాబ్దంలో) పరిపాలనా హక్కులను తొలిసారి రద్దు చేశాడు. పశ్చిమ దక్కనులో బౌద్ధ భిక్షువులకు

కేటాయించిన భూములకు పాలనా స్వాతంత్ర్యాన్ని కల్పించాడు. అలాంటి భూములలో రాచరిక సైన్యాలు ప్రవేశించరాదు. ప్రభుత్వ అధికారులు లేదా జిల్లా పోలీసులు వాటి వ్యవహారాలలో జోక్యం చేసుకోరాదు. మతపరమైన బాధ్యతలను నెరవేర్చడానికే భూములను కేటాయించారని బయటికి కనిపించినా భూములను సాగులోకి తీసుకురావాలన్న లక్ష్యంతో కొన్ని కేటాయింపులు జరిగినట్లు ఆధారాలు సూచిస్తాయి. అలాగే తాము కేటాయించిన భూమి నుండి సమకూరే ఆదాయంపై రాజులు తమ నియంత్రణను ఏదో ఒక రూపంలో కొనసాగించిన ఉదంతాలు కూడా అనేకం ఉన్నాయి. క్రీ.శ. రెండవ శతాబ్దానికి చెందిన శాతవాహన శాసనాలు కేవలం ఉప్పుపై నియంత్రణను మాత్రమే బదిలీ చేసినట్లు పేర్కొన్నాయి. పాలకుడు గనులు, తదితర ఆధారాల నుండి ఆదాయాన్ని పొందుతూనే ఉన్నాడని అవి సూచిస్తాయి.

ఈ కాలంలో కొన్ని మినహాయింపులు తప్ప భారీ నీటిపారుదల పనులు చేపట్టిన దాఖలాలు ఎక్కడా కనిపించవు. కళింగలో ఖారవేల ఒక పాత కాలువ మరమ్మతు, సౌరాష్ట్రలో ఒకటవ రుద్రదమన్ సుదర్శన్ కాలువలకు చేపట్టిన మరమ్మతు తప్ప ఇతర పనులేవీ నమోదు కాలేదు. పశ్చిమోత్తర భారతదేశంలో సక, కుషాణ నాయకులు చెరువులను తవ్వించినట్లు కనబడుతోంది. అలాగే యు.పి.లో అనేక మంది వ్యక్తులు చెరువులను తవ్వించారు. క్రీ.శ. తొలి రెండు శతాబ్దాలలో అక్కడ కర్మకాండయుత చెరువులను తవ్వించే సాంప్రదాయం ప్రజలలో సర్వవ్యాప్తంగా ఉండేది. వ్యక్తులు చెరువులను ఇతరుల బారి నుండి కాపాడాలని మను సూచించాడు. కాలువలు ఎక్కువగా వినియోగంలో ఉండకపోవడంతో మౌర్య అనంతర కాలం చివరిలో వ్యవసాయ భూములు పరిమిత వైశాల్యంతో కొనసాగాయి. ఇలాంటి పొలాలను సాగు చేయడానికి బావులు, చెరువులను ఎక్కువగా ఉపయోగించినట్లు బోధపడుతోంది.

వ్యవసాయాన్ని పరిరక్షించేందుకు ఈ కాలంలో రాజ్యం చట్టాలను అమలు చేసినట్లు తెలుస్తోంది. ఎడతెరిపి లేని విదేశీ దండ యాత్రలతో విసిగిపోయిన రాజ్యం ఆదాయ వనరులను సమకూర్చుకునేందుకు వ్యవసాయాన్ని బాగా ప్రోత్సహించింది. వ్యవసాయ పనిముట్లను తస్కరిస్తే ప్రజలను కఠినంగా శిక్షించాలని పాలకులకు మను సూచించాడు. నకిలీ విత్తనాలను అమ్మితే శరీర అంగాలను ఛేదించాలని, విత్తిన విత్తనాలను తొలగించడం, గట్లు తొలగించడం చేస్తే అలాంటి శిక్షే విధించాలని సూత్రీకరించాడు. ఇలాంటి చర్యలకు వ్యతిరేకంగా పొలాలకు రక్షణ కల్పించినందుకు ప్రతిఫలంగా రాజ్యం వ్యవసాయదారుల నుండి పన్నులు డిమాండ్ చేసింది. గ్రామసామిక (గ్రామపెద్ద) గ్రామస్తులందరికి తన దూత ద్వారా కబురు పంపి సమావేశం ఏర్పాటు చేస్తాడు. సభలో రాజు పక్షాన పన్ను విధిస్తాడని "మిలింద పాన్హో" వివరిస్తుంది.

**పారిశ్రామిక హస్తకళ ఉత్పత్తులు, కళలు :**

ఈ కాలంలో పారిశ్రామిక హస్తకళా ఉత్పత్తులు, కళాఖండాలు గణనీయమైన ప్రగతిని చవిచూసాయి. తొలిబౌద్ధకృతులు, కౌటిల్యుని అర్థశాస్త్రలో పేర్కొనని వివిధ రకాల వృత్తిదారులు

ఈ కాలంలో పెద్ద సంఖ్యలో కనిపిస్తారు. దిఘ నికాయ సుమారు 24 వృత్తులను ప్రస్తావించింది. అయితే మహావస్తు 36 రకాల కార్మికుల జాబితాను (రాజగృహలో నివసించే కార్మికులు) అందించింది. ఆ జాబితా అంత సుదీర్ఘమైనది కాదు. ఎందుకంటే దాని చివరలో ఇతర రకాల కార్మికులు కూడా ఉన్నారని పేర్కొన్నారు. మిలింద పన్హో సుమారు 75 వృత్తులను లెక్కించింది. వాటిలో సుమారు 60 వృత్తులు వివిధ రకాల హస్తకళలతో ముడిపడి ఉన్నాయి. పశ్చిమ దక్కను, సాంచి, బార్హూత్, మథుర, బోధ్‌గయలకు చెందిన శాసనాలలో అనేక వృత్తిదార వర్గాలు బౌద్ధ భిక్షువులకు గుహలు, స్తంభాలు, ఫలకాలు, కుండలు విరాళంగా అందించారని పేర్కొంటూ వాటిని దాతల జాబితా కింద చేర్చారు.

గనుల తవ్వకం, లోహశాస్త్రంలో పురోగతిని ఈ కాలం చవి చూసింది. మిలింద పన్హోలో పేర్కొన్న 60 కళలలో ఎనిమిది ఖనిజ పదార్థాలు, ఖరీదైన రాళ్లను శుద్ధి చేయడంతో ముడిపడి ఉండడం అందుకు నిదర్శనం, లోహాల తయారీ, వాటి ఉత్పత్తులును తీర్చిదిద్దడం చూస్తే లోహాల వినియోగంలో గణనీయమైన ప్రగతి, నైపుణ్యం వచ్చాయని బోధపడుతుంది. ఈ కాలంలో వస్త్రాల తయారీ కూడా అంతే సమానంగా అభివృద్ధి చెందిందని తెలుస్తోంది. ఈ కాలపు బ్రాహ్మణిక, బౌద్ధ, జైన కృతులలో లెక్కించిన జౌళి ఉత్పత్తులు కౌటిల్యుడు తన అర్థశాస్త్రంలో వివరించిన వివిధ రకాల వస్త్రాలతో దాదాపు సమానంగా విస్తృతంగా ఉన్నాయి. పత్తి ముద్దలు, దుకుల, క్షౌమ, పట్టు, పత్రోర్న, గొర్రె ఉన్ని, ఇతర పశువుల కేశాలు, బంగారు దారంతో అలంకరించబడిన వస్త్రాలు ఈ జాబితాలో ఉన్నాయి. పెరిప్లస్, మిలింద పన్హో, దివ్యవదన పత్తి ఉత్పత్తి కేంద్రాల గురించి ప్రస్తావించాయి. కొన్ని దక్షిణ భారత పట్టణాలలో నేతపని విస్తరించింది. ఉరయూర్ (సంగం చోళుల తొలి రాజధాని) వద్ద ఒక నేత నిర్మాణం లభించింది. అరికమేడులో కూడా కొన్ని సాధనాలు లభించాయి. అ నిర్మాణాలు క్రీ.శ. 1–3 శతాబ్దాలకు చెందినవి. ఈ కాలంలో ఈ పట్టణాలలో నేత పరిశ్రమ ప్రగతి పథంలో ఉండేది.

కొన్ని విదేశీ, స్థానిక పురావస్తు క్షేత్రాలలో కనుగొన్న అవశేషాల ఆధారంగా భారతదేశంలోని పలు ప్రాంతాలలో ముత్యాల సేకరణ(pearl fishing) జరిగేదని మనకు తెలియవస్తుంది. తమిళ తీరంలో కొర్కియి, మన్నార్ గల్ఫ్, దిగువ గంగా నది, బొంబాయి సమీపంలోని చౌల్ వద్ద గుప్తులకు పూర్వం ముత్యాలను సేకరించేవారు. ప్లినీ, టోలెమి, “పెరిప్లస్”ల ప్రకారం భారతదేశం అత్యంత విలువైన ముత్యాలకు గొప్ప ఉత్పత్తి కేంద్రంగా ఉండేది. బెరార్ ప్రాంతంలోని కోస, సంభల్‌పూర్ ప్రాంతంలోని సబరాయి, ఆదామస్ నది (వైతరిణి) ముఖద్వారం వద్ద వజ్రాలను తవ్వి తీసేవారు. దక్కను పీఠభూమిలోని రాళ్ల నుండి అగేట్, కార్నేలియాన్‌లను వెలికి తీసేవారు. పశ్చిమ దక్కను నుండి అమేథిస్ట్ లభించేది. దక్షిణ భారతదేశంలో బేరిల్‌ను ఎక్కువగా కనుగొనేవారు. పశ్చిమ దక్కనులోని సాత్పుర కొండప్రాంతం సార్డోనిక్స్, ఒనిక్స్‌కు ప్రఖ్యాతి గాంచినవి. “దివ్యవదన” లో రత్నాలను పరీక్షించే శాస్త్రం గురించి ప్రస్తావన ఉంది. వ్యాపారుల సంతానం ఈ శాస్త్రంలో క్రమబద్ధంగా శిక్షణ పొందేవారు. వాత్సాయన 64 కళల (అంగవిద్య) జాబితాలో ఈ శాస్త్రాన్ని చేర్చాడు. ఈ

కాలంలో వికసించిన రత్నాల పరిశ్రమ, దక్షిణ భారతదేశంలోని నగల తయారీకళ గురించి సంగం సాహిత్యంలో వివరణ ఉంది.

ఈ కాలంలో ఇతర పారిశ్రామిక కళలు, హస్తకళలు కూడా పెద్ద ఎత్తున అభివృద్ధి చెందాయి, ప్రత్యేకతను సంతరించుకున్నాయి. వాటిలో నూనెల తయారీ, ఆయుధాల తయారీ, ఐవరీ పని, కలప పని, కుండల తయారీ ఉన్నాయి. నూనె ఉత్పత్తిలో ప్రత్యేక ప్రగతి ఏదైనా వచ్చిందా అనే విషయం మనకు తెలియదు. అయితే తైలికచక్ర గురించి దివ్యవదనలో ప్రస్తావన ఉంది. సమకాలీన సాహిత్యంలో వివిధ రకాల ఆయుధాలు, రక్షణ కవచాల తయారీ గురించి వర్ణన ఉంది. దువ్వెనలు, పాచికలు, కత్తిఒరలు, ఆయుధాల తయారీలో ఐవరీ (ఏనుగు దంతాలు)ని ఉపయోగించేవారు. విదిషకు చెందిన ఐవరీ కార్మికులు ప్రఖ్యాతి గాంచిన సాంచి స్థూప ప్రధాన ద్వారంపై తను విరాళాన్ని నమోదు చేయడం ఆసక్తిని గొల్పుతుంది. చెక్కపని పెద్ద ఎత్తున కొనసాగింది. నౌకానిర్మాణం, గృహనిర్మాణం, రథాలు, బండ్లు, వివిధ రకాల యంత్రాల తయారీ గురించి జాతక కథలు ప్రస్తావిస్తాయి. మౌర్య అనంతర కాలాలలో వృత్తికారుల మండళ్లకు సంబంధించి తొలి పురావస్తు సాక్ష్యాలు మనకు లభిస్తాయి. తమ నాయకుల కింద వృత్తిదారులు సంఘటితమయ్యారు. నాయకులు పాలకుడి విశ్వాసాన్ని చూరగొన్నారు. క్రీ.శ. రెండవ శతాబ్దంలో శాతవాహన రాజ్యంలో బౌద్ధ భక్తులు (సాధారణ ప్రజలు) తమ ధనాన్ని (వెండి "పాన"లు) కుమ్మరుల వద్ద జమ చేసేవారు. అలాగే నూనె ఉత్పత్తిదారులు, నేత పనివారి వద్ద కూడ నిధులను దాచిపెట్టేవారు. అందుకు ప్రతిఫలంగా బౌద్ధ సన్యాసుల కోసం వస్త్రాలు, ఇతర నిత్యావసర వస్తువులను పొందేవారు. అదే శతాబ్దంలో మథుర వద్ద పిండి తయారీదారుల మండలితో ఒక నాయకుడు తన సొమ్మును జమ చేశాడు. ఆ సొమ్ముపై వచ్చే నెలసరి వడ్డీతో వంద మంది బ్రాహ్మణులకు నిత్యాన్నదానం నిర్వహించాడు. ఆ విధంగా మండళ్లుగా ఏర్పడిన వృత్తికారులు స్వతంత్రంగా వ్యవహరించగలిగారు. సమకాలీన సాహిత్య ఆధారాల ప్రకారం మండళ్ల సంఖ్య కూడా పెరిగింది. సాంప్రదాయబద్ధమైన 18 మండళ్లకు 11 రకాల వృత్తికారులు తమ తమ నాయకుల ఆధ్వర్యంలో పని చేసేవారని "మహావస్తు" అనే గ్రంథం పేర్కొంటుంది. ఈ గ్రంథంలోని రెండు జాబితాలను పోల్చిచూస్తే ఈ కాలంలో కనీసం రెండు డజన్ల వృత్తిదార మండళ్లు కొనసాగాయని స్పష్టమవుతుంది. ఈ వృత్తికారులలో చాలా మంది ఇటు ఉత్పాదకులుగానూ, అటు చిన్న వ్యాపారులుగానూ విధులు నిర్వహించారు.

**వ్యాపార – వాణిజ్యం :** ప్రాచీన భారత వాణిజ్యం, పట్టణీకరణ చరిత్రకారులకు ఈ కాలం ఎంతో ఇష్టమైనది. స్థానిక సాహిత్య కృతులలో, ముఖ్యంగా బౌద్ధ జాతక కథలలో ఉపఖండంలో వ్యాపారానికి ఉన్న అవిశ్రాంత స్వభావాన్ని స్పష్టంగా వివరించారు. క్రీ.పూ. మూడవ శతాబ్దం నుండి ఉపఖండంలో ఉత్తర నలుపు రంగు కుండలు విస్తారంగా పంపిణీ అయినట్లు లభించిన సాక్ష్యాలు వ్యాపార లావాదేవీల స్థాయిని మరింత బలపరుస్తాయి. దక్కను, దక్షిణ భారతదేశంలో ఉత్తర నలుపు రంగు కుండపెంకులు లభించడం బట్టి వాటిని ఉత్తర

భారత దేశం నుండి జొరబడిన శక్తులుగా అన్వయించవచ్చు. ఉత్పత్తి కేంద్రాలకు సుదూరంగా ఉన్న ప్రాంతాలలో ముత్యాలు, రత్నాల హారాలు లభించాయి. వ్యాపార, సమాచార నెట్‌వర్క్ ఏ స్థాయిలో విస్తరించిందో పై ఆవిష్కరణను బట్టి ఊహించవచ్చు. ఉపఖండం ఈ కాలంలోనే నాణేల వినియోగాన్ని శిఖర స్థాయిలో చవి చూసింది. బంగారు, వెండి, రాగి నాణేలు పెద్ద సంఖ్యలో చెలామణి అయ్యాయి. కేవలం సాహిత్యం, మౌర్య అనంత కాలంలో వికసించిన వ్యాపార, వాణిజ్యాలను అర్థం చేసుకోవడానికి చరిత్రకారులు కేవలం సాహిత్యం, శిలాశాసనాలపైనే ఆధారపడలేదు. క్షేత్రస్థాయి పురావస్తు అవశేషాల ప్రాముఖ్యతను కూడా బాగా గుర్తించారు. ఈ కాలంలో, ముఖ్యంగా దక్కను నేపథ్యంలో వికసిస్తున్న వ్యాపారానికి వ్యాపార మండళ్లు, బౌద్ధ మఠాల మధ్య ఉన్న సన్నిహిత సంబంధం ఎంతో మేలు చేకూర్చిందని క్షేత్రస్థాయి పురావస్తు పరిశోధనలు, శిలాశాసన ఆధారాలను వడబోసిన చరిత్రకారులు వాదించారు.

ఈ కాలపు వ్యాపారంలో అత్యంత ఆసక్తికరమైన కోణం అంతర్జాతీయ వాణిజ్యంలో భారతదేశ పాత్ర అని ఖచ్చితంగా చెప్పవచ్చు. రోమన్ సామ్రాజ్యం, అలాగే ఆగ్నేయ ఆసియాలతో కూడా భారత్‌కు వాణిజ్య సంబంధాలు ఉండేవి. పెరిప్లస్ ఆఫ్ ది ఎరిథ్రియన్ సీ, ప్లైనీ రచించిన నేచురలిస్ హిస్టోరియా, టోలెమీ రచించిన జియోగ్రాఫిక్ హుఫెజెసిస్ అందించిన సాహిత్య సాక్ష్యాల ఆధారంగానే ఇండో–రోమన్ వాణిజ్యాన్ని ఎక్కువగా పరిశోధించారు. దక్షిణభారతదేశం విషయానికి వస్తే తమిళ సంగం సాహిత్యం అందించిన సాక్ష్యాలను పైన పేర్కొన్న ప్రాచీన గ్రంథాలు మరింత బలపరుస్తాయి. మలబార్ తీరంలోని ముజిరిస్ అనే రేవు వద్ద రోమను వ్యాపారులతో భారతీయులు కుదుర్చుకున్న రుణ ఒప్పందాన్ని ఒక కాగితపు పత్రంపై నమోదు చేశారు. ఇండో– రోమను వాణిజ్య పరిశోధనకు ఈ పత్రం ఒక కొత్త కోణాన్ని అందించింది. అత్యంత ప్రాధాన్యత గలిగిన ఈ పత్రం తొలి సముద్ర వ్యాపారంపై ఎంతో అవసరమైన సమాచారాన్ని అందిస్తుంది. సముద్ర వ్యాపారాన్ని పాశ్చాత్య వ్యాపారులే నిర్వహించేవారని, భారతదేశ పాత్ర కేవలం రోమను సామ్రాజ్యంలో ఎక్కువ డిమాండ్ ఉన్న కొన్ని విలాస వస్తువుల ఉత్పత్తికే పరిమితమైందన్న కల్పన 'భావనను ఈ రుణ ఒప్పంద పత్రం పటాపంచలు చేస్తుంది.

హిందూ మహాసముద్రానికి పశ్చిమాన ఉన్న క్షేత్రంతో భారతదేశం నిర్వహించిన సముద్ర వ్యాపారాన్ని అర్థం చేసుకోవడానికి నేడు పురావస్తు అవశేషాలు ఎన్నో మనకు అందుబాటులో ఉన్నాయి. రోమను కళానైపుణ్యం ఉన్న కళాత్మక వస్తువులు, కుండ పాత్రలు ఎన్నో బయటపడ్డాయి. కోల్హాపూర్, కరూర్, పాండిచెర్రి సమీపంలోని అరికమేడు వద్ద రోమను వస్తువులు లభించాయి. పోసీడన్‌కు చెందిన ఒక విగ్రహం కోల్హాపూర్‌లో లభించగా ఇటాలియన్ డిజైన్ ఉన్న రత్నాలు కరూర్ నుండి లభించాయి. అర్రెట్ పింగాణీ పాత్రలు అరికమేడు వద్ద బయటపడ్డాయి. అలాగే మద్యం ఆంఫొరె లాంటి వస్తువులు ఉన్నాయి. పురావస్తు శాస్త్రం, జాతిచరిత్రల పరిశోధనలు కూడా సముద్ర వ్యాపార కార్యకలాపాలకు సంబంధించిన అనేక

కోణాలను వెలుగులోకి తీసుకువచ్చాయి. హిందూ మహాసముద్రంలో, భారత తీరప్రాంతాలలో సముద్ర యాన కార్యకలాపాలు ఎక్కువగా జరిగేవి. ఈ నేపథ్యంలో ఒక కీలకమైన పురావస్తు పరిశోధన క్షేత్రం పాండిచెర్రి సమీపంలోని అరికమేడు. చాలా కాలం క్రితమే ఈ క్షేత్రం రౌలెట్ పాత్రలు, అరెట్ పాత్రలను గణనీయమైన పరిమాణంలో అందించింది. ఇపుడు జరుగుతున్న తాజా తవ్వకాలు, రౌలెట్ పాత్రలపై తాజా పరిశోధనలను బట్టి క్రీ.పూ. రెండవ శతాబ్దంలో రౌలెట్ పాత్రలు దేశంలో ప్రవేశించాయని పరిశోధకులకు అర్థమవుతుంది. మరోమాటలో చెప్పాలంటే ఇండో-రోమను వాణిజ్యం ప్రారంభం కావడానికి చాలా కాలం క్రితమే ఆ పాత్రలు దేశంలోకి వచ్చాయి. శ్రీలంకలోని మంతాయి నుండి తమ్లూక్, చంద్రకేతుగఢ్ లాంటి తూర్పు తీరప్రాంతాల వరకు రౌలెట్ పాత్రలు లభించడం అంతే ప్రాధాన్యత కలిగిన విషయం. తమిళనాడులోని తీర ప్రాంతాలలోని క్షేత్రాలలో ఇలాంటి పాత్రలు ఘనంగా కేంద్రీకృతమై ఉన్నాయి. దీనిని బట్టి తూర్పు తీర ప్రాంతాలలో కూడా పశ్చిమ తీరానికి ఏమాత్రం తీసిపోని విధంగా వాణిజ్య కార్యకలాపాలు జరిగేవని బోధపడుతోంది.

**వాణిజ్య మార్గాలు :**

గుప్త పూర్వ కాలంలో అత్యంత ప్రధానమైన వాణిజ్య మార్గం (దేశీయ) ఉత్తరపథగా ప్రసిద్ధి గాంచింది. తక్షశిల నుండి మధుర వరకు విస్తరించిన ఈ మార్గం ఎన్నో ముఖ్యమైన వాణిజ్య కేంద్రాలను ముడిపెట్టింది. ఈ ప్రధాన రహదారికి అనేక అనుబంధ మార్గాలు కూడా ఉండేవి. వారణాసి- మధుర, వారణాసి-వైశాలి, సాకేత్- శ్రావస్తి, కపిలవస్తు- రాజ్‌గిర్, వైశాలి- పాటలీపుత్ర- రాజ్‌గిర్, చంపా-తామ్రలిప్తి మార్గాలు అందులో ముఖ్యమైనవి. ఉత్తర, దక్షిణ భారతదేశాలకు వారధిగా దక్షిణపథ ఉండేది. అవంతి గుండా వింధ్యా పర్వతాల అవతల వరకు అది విస్తరించి ఉండేది. అది మహిష్మతిని అమరావతితో కలిపింది. ఉత్తరపథం లాగే ఈ మార్గం కూడా అనేక అనుబంధ మార్గాలను కలిగి ఉండేది. ముఖ్యంగా ప్రతిష్ఠాన-నాసిక్-భారుకచ్ఛ-సుపారక-కళ్యాణ్, ముజిరిస్- కావేరిపట్టణం (పూంపుహార్) మార్గాలు దక్షిణపథంతో ముడిపడి ఉండేవి.

క్రీ.శ. 45 వరకు పాశ్చాత్య ప్రపంచంతో భారతీయ వాణిజ్యం మూడు భూమార్గాలలోనే ఎక్కువగా సాగింది. సెల్యూక సామ్రాజ్యం, ఈజిప్టు, తదుపరి రోమను సామ్రాజ్యంతో భూమార్గాన వాణిజ్య కార్యకలాపాలు జరిగేవి. ఉత్తర మార్గం, మధ్యమార్గం, దక్షిణ మార్గం ఆ మూడు మార్గాలకు ప్రాతినిధ్యం వహిస్తాయి. అయితే క్రీ.శ. 45వ సంవత్సరం తర్వాత వాణిజ్యం చాలావరకు అరేబియా సముద్రం గుండా రుతుపవనాల మార్గంలోనే కొనసాగింది. రుతుపవనాల మార్గాన్ని అన్వేషించకముందే భారతదేశం-పాశ్చాత్య ప్రపంచం మధ్య సముద్ర మార్గాలు ఉండేవి. అయితే వాటిని ఎక్కువగా ఉపయోగించలేదు. ఉదాహరణకు ఎర్రసముద్రం మార్గం గుండా ఈజిప్టుతో, పర్షియన్ గల్ఫ్ మార్గం ద్వారా సెల్యూక సామ్రాజ్యంతో భారతదేశానికి సంబంధం ఉండేది. ఆగ్నేయాసియాతో భారత వాణిజ్యం కేవలం సముద్ర మార్గాల ద్వారానే కొనసాగింది. క్రీ.శ. రెండవ శతాబ్దంలో తూర్పు భారతదేశం నుండి అవతలి

తీరానికి క్రమబద్ధ మార్గం ఒకటి క్రియాశీలంగా ఉండేది. మరో సముద్ర మార్గం దిగువ గంగా ప్రాంతాన్ని మలయ ద్వీపకల్పం, ఇండోనేషియా ద్వీపసమూహాలతో జత చేసింది. భారుకచ్ఛ నుండి నేరుగా సముద్రయానం చేపట్టేవారు. ఇండో-చైనా వాణిజ్యం భూసముద్ర మార్గాలు రెండింటిలోనూ సాగేది. క్రీ.శ. తొలి శతాబ్దాలలో పశ్చిమోత్తర భారతదేశం చైనాతో అనేక భూమార్గాల ద్వారా ముడిపడి ఉండేది. క్రీ.శ తొలి శతాబ్దం ద్వితీయార్థం నుండి చైనాకు సముద్రమార్గం ఉందని తెలియవచ్చింది. అయితే క్రీ,శ. రెండవ శతాబ్దం నుండే ఈ సముద్ర మార్గాన్ని ఎక్కువగా ఉపయోగించడం మొదలుపెట్టారు.

**పెరిగిన వ్యాపార మండళ్ల పాత్ర :**

మౌర్య అనంతరకాలం నాటి వ్యాపార మండళ్లు వాణిజ్య సాంప్రదాయాలు, ఆచార పరిరక్షకులుగా వ్యవహరించాయి. ఆధునిక బ్యాంకుల పాత్రను కూడా నిర్వహించాయి. ప్రజాధనాన్ని జమ చేసుకొని వడ్డీలను క్రమం తప్పకుండా చెల్లించాయి. అలాగే ప్రజలకు రుణాలను అందించాయి. మండళ్లను సాధారణంగా శ్రేణి లేదా సంఘ అని పిలిచేవారు. వాణిజ్య సంఘాలను కూడా అదే పదంతో గుర్తించేవారు. అయితే వ్యాపార మండళ్లను, ప్రత్యేకంగా “నిగమ” అని పిలిచేవారు. విభిన్న వ్యాపారులు, కళలు, వృత్తులకు (స్థానికంగా) పుగా(Puga) ప్రాతినిధ్యం వహిస్తూ వారి ప్రయోజనాలను పరిరక్షించేది. అలాగే సార్థ అనే మండళ్లు కూడా ఉండేవి. ఇవి సంచార సంఘాలు. అక్కడక్కడా శిబిరాలను ఏర్పాటు చేస్తూ సంచార వ్యాపారానికి సేవలు అందించేవి. సార్థ అనే మండలికి నాయకుడిని సాధారణంగా సార్థవాహ అనే పేరుతో గుర్తించేవారు.. సార్థ మండళ్లు వాటి స్వభావం ఆధారణంగా అనేక రకాలుగా విభజించబడి ఉండేవి. వ్యక్తిగత వ్యాపారులు, ఒప్పందపు వ్యాపారులు వాటిని నిర్వహించేవారు. మూల పెట్టుబడి ఆధారంగా వారు లాభాలను పంచుకునేవారు. సంచార వ్యాపార సమూహాలు వ్యాపార వస్తువులలో తమ పెట్టుబడిని బట్టి లాభాలు పంచుకునేవి. మౌర్య అనంతర కాలంలో వ్యాపార-వాణిజ్య నిర్వహణలో మండళ్లు ప్రముఖ పాత్రను పోషించాయి. రాజకీయ వ్యవస్థపై రచనలు చేసిన తొలి రచయితలలో ఒకడైన గౌతమ వ్యాపారులు, వాణిజ్యవేత్తలకు తమ తమ వర్గాల సంక్షేమం, భద్రత కోసం నియమనిబంధనలు జారీ చేసే అధికారం ఉండేదని పేర్కొన్నాడు. సమకాలీన ఆధారాలను బట్టి వృత్తులు సాధారణంగా వారసత్వంగా కొనసాగేవని, అవి ప్రాంతీయమైనవని తెలుస్తుంది. ఉదాహరణకు జాతకాలు 18 మండళ్లను ప్రస్తావించాయి. పరిశ్రమలు కొన్ని పట్టణాలు లేదా గ్రామాలకు ప్రత్యేకంగా పరిమితమై ఉండేవి. ఒక్కో మండలికి ప్రముఖ లేదా జేఢా అధ్యక్షునిగా ఉండేవాడు. వ్యాపారులలో ఒకరు న్యాయమూర్తిగా వ్యవహరిస్తూ వ్యాపార సంబంధిత తగాదాలను, ఫిర్యాదులను పరిష్కరించేవాడు. సార్థవాహల గురించి కూడా జాతకాలు వివరిస్తాయి. వీరి ఆదేశాలను వ్యాపార మార్గాల గుండా ప్రయాణించే వ్యాపార సముహాలు ఖచ్ఛితంగా పాటించేవి.

స్మృతి ప్రకారం వ్యాపార మండళ్లుకు అధ్యక్ష లేదా ముఖ్య అనే ఉన్నత కార్యనిర్వహణాధికారులు నాయకత్వం వహించేవారు. వీరికి సహాయంగా ఇద్దరు, ముగ్గురు

లేదా ఐదుగురు వ్యక్తులతో కూడిన కమిటీలు ఉండేవి. కమిటీ సభ్యులను సాముఖహిత వాదినులు అని పిలిచేవారు. అంటే ప్రజల హితంలో వారు సలహాలు అందించేవారు. వారిని కార్య–చింతక (సార్వజనిక వ్యాపార సలహాదారులు) అని కూడా పిలిచేవారు. నారద, బృహస్పతి లాంటి న్యాయనిపుణులు సంవిపత్రాలు అనే వ్యాపార సాంప్రదాయాలు లేదా ఒప్పందాల గురించి అనేక ఉదాహరణలు అందించారు. మరో ప్రముఖ న్యాయకోవిదుడు కాత్యాయన వ్యాపార సాంప్రదాయాలను స్థితి పత్రాలనే పేరుతో పిలిచాడు. తమ ఉపయుక్తాన్ని పరిరక్షించేందుకు మండళ్లు కొన్ని నియమనిబంధనలను పాటించాలని నిర్ణయించాయని, అలాంటి సాంప్రదాయాలను స్థితిపత్రాలని పిలుస్తారని కాత్యాయన నిర్వహించాడు. ఈ సాంప్రదాయాలను రాజు అమలు చేసేవాడు. రాజు ప్రయోజనాలకు భంగం వాటిల్లనంత వరకు, ప్రజా ప్రయోజనాలు దెబ్బతిననంతవరకు లేదా ప్రజాభిప్రాయానికి విరుద్ధంగా కార్యకలాపాలు నిర్వహించనంతవరకు పాలకుడు మండళ్ల కార్యకలాపాలలో జోక్యం చేసుకునేవాడు కాదు. తమ వంతుగా మండలి సభ్యులు తమ తమ ప్రత్యేక సాంప్రదాయాలకు కట్టుబడి నడుచుకునేవారు. తమ వ్యక్తిగత నిధులను నిర్వహిస్తూ రాజు ఆదేశాన్ని పాటించేవారు. పాలకుడి ఆజ్ఞలకు భిన్నంగా తమ కార్యకలాపాలను నిర్వహించేవారు కాదు. అలాగే పాలకుడి ప్రయోజనాలకు విరుద్ధంగా ఎలాంటి చర్యలు చేపట్టేవారు కాదు. పైన పేర్కొన్న న్యాయకోవిదులు మండలిసభ్యుల హక్కులు, బాధ్యతల గురించి కూడా వివరించారు. మండలి సమకూర్చుకున్న ఏ వస్తువులోనైనా లేదా మండలి పొదుపు చేసిన సొమ్ము ఎంతైనా అందులో ప్రతి సభ్యునికి సమాన వాటా ఉండేది. అలాగే పాలకుని అనుగ్రహంతో ఏది సమకూరినా లేదా ఉమ్మడి ప్రయోజనాల కోసం చేసిన రుణాలు ఏ మేరకు ఉన్నా సభ్యులందరూ సమానంగా పంచుకునేవారు లేదా భరించేవారు. మరోవైపు సభ్యులు పరస్పర సహకారం ఏర్పాటు చేసుకోకుండా, పరస్పర సంఘర్షణలకు పాల్పడకుండా నిషేధం ఉండేది. అలాగే చట్టవిరుద్ధంగా ఆయుధాలను సమకూర్చుకోకుండా సభ్యులపై నిషేధం ఉండేది.

**పట్టణీకరణ ప్రగతి :**

పట్టణాభివృద్ధి చరిత్ర విషయంలో కూడా మౌర్య అనంతర కాలం ప్రముఖంగా వెలుగులోకి వస్తుంది. క్రీ.పూ. ఆరవ శతాబ్దం సందర్భంగా మౌలికంగా గంగా లోయలో రెండవ పట్టణీకరణ ప్రక్రియ ప్రారంభమైన విషయం మనం అంతకు ముందే తెలుసుకున్నాము. గంగాలోయ ప్రాథమిక పట్టణ కేంద్రాల ఏర్పాటును వీక్షిస్తే మౌర్య సామ్రాజ్య విస్తరణ ఉత్తర భారతదేశంలోని ఎక్కువ భూభాగాలకు పట్టణీకరణను వ్యాప్తి చేయడంలో తోడ్పడినట్లు కనబడుతోంది. కాలక్రమంలో దక్కను, దక్షిణ భారతానికి కూడా పట్టణీకరణ వ్యాపించింది. ఉన్నత పట్టణ కేంద్రాల ఆవిర్భావంతో వీటిని పోల్చారు. దక్కను, దక్షిణ భారతంలో ఉన్నత పట్టణ కేంద్రాలతో సమాంతరంగా ఉన్నత రాజ్యాలు(secondary states) కూడా ఆవిర్భవించాయి. ఈ స్థూల ప్రక్రియకు మూల కేంద్రం గంగాలోయలో ఉండేది. అక్కడ ఒక ప్రత్యేకరీతిలో పట్టణాలు, రాజ్యాలు ఏర్పాడ్డాయి.

పట్టణ కేంద్రాల పరిశోధనలో క్షేత్రస్థాయి పురావస్తు అవశేషాల ప్రాముఖ్యత గురించి అంత ఎక్కువగా నొక్కి చెప్పాల్సిన అవసరం లేదు. క్రీ.పూ. ఆరవ శతాబ్దం పరిసరాలలో వెలుగులోకి వచ్చిన అనేక నగరాలు మనుగడ సాగించాయి. వాస్తవానికి అవి అభివృద్ధిని పతాక స్థాయిలో చవిచూశాయి. తక్షశిల, చర్సాద్ద, ఉజ్జయినీ, మథుర, శ్రావస్తి, ఖైరాదిహ్, కౌసాంబి, వారణాసి, పాటలీపుత్ర, చంపా తదితర నగరాలు అత్యంత సంపన్న దశకు చేరుకున్నాయి. మౌర్య కాలం ప్రారంభం కాగానే బెంగాల్ పట్టణీకరణను చవి చూసి ఉంటుంది. మౌర్య అనంతరకాలంలో కూడా బెంగాల్ నగరాలు, పట్టణాలు ప్రగతిని సాధించాయి. మహాస్థాన్, బంగఢ్, మంగల్‌కోట్, చంద్రకేతుగఢ్, తామ్రలిప్తిలోని పట్టణ కేంద్రాల అవశేషాలు ఈ విషయాన్ని ధృవీకరిస్తాయి. తన విశాలమైన మహాద్వారాలతో శిశుపాల్‌గఢ్ తొలి చారిత్రక ఒరిస్సా (మౌర్య, మౌర్య అనంతర కాలాలలో)లో విస్తరించిన పట్టణీకరణకు నిదర్శనంగా నిలిచింది.

మౌర్య అనంతర కాలంలో తూర్పు దక్కను తీరప్రాంతాలలో పట్టణ కేంద్రాలు పెద్ద సంఖ్యలో ఆవిర్భవించడం ప్రాధాన్యత కలిగిన విషయం. అక్కడ జరిపిన తవ్వకాలు, పరిశోధనలలో పై విషయం బాగా నమోదైంది. సంగం కృతులు అనేక పట్టణ కేంద్రాల గురించి మాట్లాడాయి. అయితే ఈ సాహిత్య సమాచారం పురావస్తు సాక్ష్యంతో సరితూగదు. అయితే ఇటీవలి కాలంలో తమిళనాడులోని అనేక కోస్తా క్షేత్రాలు పురావస్తుశాస్త్రవేత్తల దృష్టిని ఆకర్షించాయి. తమిళనాడులో కోస్తా పట్టణాలు పెద్ద సంఖ్యలో ఆవిర్భవించాయని ఆ క్షేత్రాలు సూచిస్తాయి. దక్కను లోపలి భాగాలలోని పౌని, నాసిక్, పైఠన్, నెవాసా, తేర్, కోల్హాపూర్, శతనికోట, సన్నాతి వద్ద జరిపిన తవ్వకాలలో పట్టణ కేంద్రాలు, రాజ్య సమాజాల ఆవిర్భావానికి సంబంధించిన నిర్దిష్ట ఛాయలు బయట పడ్డాయి. గత కాలపు భారీశిలాస్థూప సంస్కృతుల స్థానాన్ని అవి భర్తీ చేశాయి. క్లుప్తంగా చెప్పాలంటే పట్టణ కేంద్రాలను మౌర్య–అనంతర కాలలో భౌతిక సంస్కృతిలో ఐక్యతకు బాట వేసిన కారకాలుగా విశ్లేషించవచ్చు. కొన్ని మానవ విజ్ఞాన శాస్త్ర సిద్ధాంతాలతో ప్రభావితులైన కొందరు చరిత్ర కారులు విలాసవస్తువుల వ్యాపారం, ఉన్నత పట్టణ కేంద్రాలు, రాజ్యాల ఆవిర్భావం మధ్య సంబంధాన్ని విశ్లేషించాలని వాదించారు. తొలి చారిత్రక భారతదేశంలో ఇలాంటి పరిణామాలు సమాంతరంగా సంభవించాయని సూత్రీకరించారు. ముఖ్యంగా దక్షిణ భారతంలో ఇది ప్రస్ఫుటంగా కనిపిస్తుందని పేర్కొన్నారు. దక్షిణ భారతంలో సుదూర వాణిజ్యం, పాశ్చాత్య ప్రపంచంలో భారతీయ విలాస వస్తువులకు ఉన్న డిమాండ్ కారణంగా ఈ ప్రాంతపు సామాజిక, సాంస్కృతిక చరిత్రలో ప్రధాన మార్పు చోటు చేసుకుందని చెప్పారు. పై వాదనను (అభిప్రాయాన్ని) అనేక మంది సందేహించారు. కోస్తా ప్రాంతంలో వ్యాపార కేంద్రాల స్థాపనకు విదేశీ ఊతం ప్రాథమికంగా కారణమైనప్పటికీ దాని ప్రభావం స్వల్ప కాలంలోనే కరిగి పోయింది. తీవ్ర పర్యవసానాలు కలిగిన ఎలాంటి భారీ మార్పులను విదేశీ చోదకశక్తి తీసుకురాలేదు. అయితే మథుర, అలాగే సమీపంలోని సోంఖ్ వద్ద జరిపిన తవ్వకాలు ప్రత్యామ్నాయ దృశ్యాన్ని ఆవిష్కరిస్తాయి. ఉత్తర భారతదేశ వ్యాపార కలయికలో మథుర కీలక ప్రదేశంలో ఉండడం వల్లే అది పట్టణ సమాజంగా ప్రగతి సాధించిందని అక్కడి అవశేషాలు సూచిస్తాయి. మథుర చుట్టూ సారవంతమైన భూములు

కాని గ్రామీణ ప్రాంతం కాని లేవు. వ్యాపారానికి మథుర కేవలం వస్త్రాలను మాత్రమే ఉత్పత్తి చేసేది. పశ్చిమోత్తర ప్రాంతం, తూర్పున గంగాలోయ, దక్షిణ, పశ్చిమ మార్గాలలో మాల్వా పీఠభూమి, గుజరాత్ తీరప్రాంతంతో ఉన్న సమాచార వ్యవస్థల వల్లే మథుర సంపన్న నగరంగా ఎదిగింది. అయితే సాధారణంగా తొలిచారిత్రక కాలాలలో పట్టణ ప్రాంతాల ఆవిర్భావం స్థిరమైన వ్యవసాయ పరిస్థితులు, రాజకీయ శక్తులు బలోపేతం కావడం వల్లే సాధ్యమైంది. ఈ సిద్ధాంతం ఉపఖండంలోని వేర్వేరు ప్రాంతాలకు సమానంగా వర్తిస్తుంది. తూర్పు దక్కనులో పట్టణ కేంద్రాల ఆవిర్భావంపై జరిగిన పరిశోధన ఈ విషయాన్ని ప్రత్యేకంగా నిర్ధారిస్తుంది. అక్కడ పట్టణ కేంద్రాలకు సంపన్నమైన వ్యవసాయ దిగుబడి, విస్తరిస్తున్న వ్యాపారం (భూ, నది, సముద్ర మార్గాలలో) దన్నుగా నిలిచాయి.

**మారకద్రవ్యం :**

ద్వీపకల్ప భారతీయులకు బంగారు, వెండి నాణేల వినియోగంపై అవగాహన లేనట్లు తొలుత భావించారు. అలాగే ఎగుమతి చేసుకున్న నాణేలను కేవలం బులియన్‌గానే ఉపయోగించారని భావించారు. అయితే ఇపుడు మనకు శాతవాహనులకు సంబంధించినవిగా చెప్పబడుతున్న కొన్ని వెండి నాణేలు ఉన్నాయి. శిలాశాసనాల ప్రకారం వెండి “పాన” (నాణేం) చెలామణిలో ఉండేదని బోధపడుతోంది. అందుకే రోమను బంగారు నాణేలకు తగిన విలువ ఇచ్చినట్లు తెలుస్తోంది. వ్యాపార లావాదేవీలలో రోమను నాణేలను పెద్ద ఎత్తున వినియోగించి ఉంటారు. పశ్చిమోత్తర ప్రాంతంలో ఇండో–గ్రీకు పాలకులు కొన్ని బంగారు నాణేలను జారీ చేశారు. కాని కుషానులు వాటిని తగిన సంఖ్యలో జారీ చేశారు. కుషాన బంగారు నాణేలన్నీ రోమను బంగారం నుండే ముద్రించారన్న సిద్ధాంతాన్ని ఆమోదించడం కష్టం. క్రీ.పూ. ఐదవ శతాబ్దంలోనే భారత సత్రపాలు పర్షియా సామ్రాజ్యానికి 320 రాశుల బంగారాన్ని కప్పంగా చెల్లించారు. బంగారు గనుల నుండి ముడి సరుకును పొంది ఉంటారు. అలెగ్జాండర్ జీవితకాలంలో బంగారు గనులు సింధ్‌లో విస్తారంగా ఉండేవని చెబుతారు. సింధ్‌తో పాటు ధాల్‌బమ్ బంగారు గనులు కుషానుల నియంత్రణలో ఉండేవి. మౌర్యులు విస్తరింపచేసిన గనుల తవ్వకం, లోహశాస్త్ర పరిజ్ఞానంతో కుషానులు లబ్ధి పొందారు. అయితే రోమ్‌తో ఉన్న సంబంధం కారణంగా వారు దినారా తరహా బంగారు నాణేలను జారీ చేయడం ప్రారంభించారు. గుప్తుల పాలనలో ఇలాంటి నాణేలు పెద్ద ఎత్తున చెలామణి అయ్యాయి.

అయితే రోజు వారీ లావాదేవీలలో ప్రజలు వెండి, ప్రత్యేకంగా బంగారు, నాణేలు వాడడం కష్టతరం. కర్మకారులకు (వేతన కార్మికులు) నిష్కాల రూపంలో వేతనాన్ని చెల్లించే వారని పతంజలి పేర్కొన్నాడు. ఆ దశలో అవి బంగారు నాణేలు కానట్లు కనబడుతోంది. ఈ విషయంలో శాతవాహనులు జారీ చేసిన లెడ్ లేదా పోటిన్ నాణేలకు ప్రాధాన్యత ఉంది. దక్కను తీరప్రాంతాలలో నగదు ఆర్థిక వ్యవస్థ విస్తరించిందని పై పరిణామం సూచిస్తుంది. ఇదే పరిస్థితిని ఉత్తర, పశ్చిమోత్తర భారతదేశం విషయంలో కూడా వర్తింపచేయవచ్చు. కుషానుల నాణేలు అందుకు ఆధారాన్ని అందిస్తాయి. కుషానులు రాగి నాణేలను పెద్ద సంఖ్యలో జారీ

చేసి ఉంటారు. నాగా పాలకులు, ముఖ్యంగా గణపతి నాగ, కూడా రాగి నాణేలను ఎక్కువగా జారీ చేశారు. అలాగే కౌసాంబి, మధుర, అవంతి, అహిచ్ఛత్ర పాలక వంశాలైన యోధేయులు, మిత్రులు తదితరులు కూడా అనేక నాణేలను ముద్రించారు. రాగి నాణేలను జారీ చేయడంలో పాలకులు, తెగలు, ముఖ్యమైన పట్టణాలు పరస్పరం పోటీ పడ్డాయి. అనేక సందర్భాలలో కాంస్య నాణేలు కూడా ముద్రిత మయ్యాయి. ఏ కాలంలో లేనంతగా ఈ కాలంలోనే నగదు ఆర్థికవ్యవస్థ సామాన్య ప్రజానీకం జీవితంలో లోతుగా చొచ్చుకుపోయినట్లు కనబడుతోంది. ముఖ్యంగా పట్టణాలు, శివారు ప్రాంతాలలో నగదు ఆర్థిక వ్యవస్థ బలంగా పాతుకుపోయింది. ఈ పరిణామం హస్తకళలు, కళల ప్రగతి, రోమను సామ్రాజ్యంతో భారతదేశానికి ఉండిన వాణిజ్య సంబంధాల ఉన్నత దశతో సరిగ్గా అతుకుతుంది.

**గుప్త కాలం :**

**ఆర్థిక వ్యవస్థ స్వరూపం :** ఈ కాలపు ఆర్థికవ్యవస్థకు ప్రధాన సాక్ష్యాధారంగా భూదానాలు మంచి ఉదాహరణలు అందిస్తాయి. అయితే ఆర్థిక జీవితం యొక్క అన్ని కోణాలను భూదానాలు స్పృశించవు. భూదానాలలో ముఖ్యమైనవి సుదూర ప్రాంతాలలో స్థిరపడిన బ్రాహ్మణ లబ్దిదారులను సూచిస్తాయి. కొత్త రాజ్యాలలో బ్రాహ్మణులకు వ్యక్తిగతంగా లేదా ఒక సముదాయంగా భూములు లేదా గ్రామాలను కేటాయించేవారు. సాంస్కృతిక సమ్మేళన ప్రక్రియతో పాటు వ్యవసాయ విస్తరణ నేపథ్యంలో మొదలైన కొత్త భూమి సంబంధాల గురించి ఈ భూదానాలు లోతైన సమాచారాన్ని అందిస్తాయి. వ్యవసాయదార వ్యవస్థలో బ్రాహ్మణులు తొలుత దళారీవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తే తదుపరి దశలో ఆ ప్రక్రియ తీవ్రతరమై అధికారులతో పాటు వివిధ వర్గాలకు చెందిన ప్రజలకు భూమి శిస్తును వసూలు చేసే అధికారాలను కట్టబెట్టారు. దానంగా ఇచ్చిన భూములను సాగులోకి తీసుకురావాలన్న షరతుల వల్ల లబ్దిదారులు లేదా వ్యవసాయదారులు స్థిరనివాసాలు ఏర్పాటు చేసుకొని ఉంటారు. వ్యవసాయదారులపై భూస్వామ్య సమాజ తరహాలో కొన్ని బాధ్యతలు పెరిగి ఉంటాయి. వాటితో పాటు పన్నుల పెరుగుతున్న భారాన్ని కూడా వారు మోయాల్సి వచ్చింది. స్మృతి సాహిత్యంలో వ్యవసాయంపై ఉన్న ఆందోళన ప్రతిబింబిస్తుంది. వ్యవసాయ పనిముట్లను నాశనం చేయడం లేదా దెబ్బతీయడం, సాగునీటి పథకాలను ధ్వంసం చేయడం, వ్రేళ్లను పీకి వేయడం లాంటి నేరాలకు భారీ జరిమానా (100పానలు) విధించేవారు. వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేసే లబ్దిదారులపై జరిమానాలు విధించి వాటిని క్రమంగా తగ్గించేవారు.

వ్యవసాయ విస్తరణ పోకడతో సమానంగా వాణిజ్యం కనీసం పాక్షికంగానైనా క్షీణించసాగింది. తీవ్రమైన వ్యాపార కార్యకలాపాలకు తొలి గుప్త నాణేలు సూచికగా ఉంటే తర్వాతి ముద్రణలు నాణ్యత లోపించి తిరోగమన దశను సూచిస్తాయి. అప్పటికే బంగారు సరఫరాలు తగ్గుముఖం పట్టాయి. ఈ దృగ్విషయం తదుపరి కాలంలో ఎంత తీవ్రరూపం దాల్చిందంటే కొన్ని శతాబ్దాలపాటు బంగారు నాణేలను అసలు జారీ చేయలేదు. గుప్తా అనంతర కాలంలో వాణిజ్యం క్షీణించిందని చెప్పడానికి పురావస్తు తవ్వకాలలో ప్రధాన పట్టణ కేంద్రాలు

లభించకపోవడమే తార్కాణం. శిధిలావస్థలో ఉన్న అనేక ముఖ్యమైన పట్టణ కేంద్రాల గురించి హుయాన్ త్సాంగ్ తన యాత్రాస్మృతులలో ప్రస్తావించారు.

గ్రామీణీకరణకు కారణాలు ఏవైనప్పటికీ ఆ ప్రక్రియ నెమ్మదిగా సాగి ఉంటుంది. భారతదేశంలోని అన్ని ప్రాంతాలు ఆ ప్రక్రియతో సమానంగా ప్రభావితమై ఉంటాయని భావించలేము. ప్రాచీన కాలంలో (Classical period) పారిశ్రామిక కళలు శిఖర స్థాయికి చేరుకొని ఉంటాయి. అమరకోశ, భృతసంహిత లాంటి సమకాలీన గ్రంథాలలోని వ్యాఖ్యాలను బట్టి పై పరిస్థితిని ఊహించవచ్చు. ఉత్తర బెంగాల్‌లోని పుండ్రవర్థన, ఉత్తర బీహార్‌లోని బాసఢ్, ఉత్తర ప్రదేశ్‌లోని భిత లాంటి కేంద్రాలలోని మండళ్లు పూర్వకాలపు ఉత్పాదనా సాంప్రదాయాన్ని కొనసాగించినట్లు బోధపడుతోంది. వాత్సాయనుడు వివరించిన నాగరిక లేదా పట్టణవాసి లేదా కాళిదాసుడు వివరించిన ఉజ్జయినీ ప్రౌఢ మహిళ ఆ యుగపు ఉన్నత సంస్కృతికి ప్రాతినిధ్యం వహిస్తారు. నగరాలు అలాంటి సంస్కృతికి కేంద్రాలుగా ఉండేవి. కాళిదాసుడు చేసిన ఒక్క వ్యాఖ్యానం ఈ పరిస్థితికి అద్దం పడుతుంది. “పట్టణం ఉండగా గ్రామంలో రత్నాన్ని పరీక్షించాల్సిన అవసరం ఏమిటి?”

**వ్యవసాయం :**

గుప్త కాలపు ఆధారాలలో వ్యవసాయం, దానికి సంబంధించిన ప్రతి అంశం గురించి అనేక వ్యాఖ్యానాలు ఉన్నాయి. సానుకూలమైన వాతావరణం, నీటి పారుదల వ్యవస్థల స్థాపన వ్యవసాయ విస్తరణలో చాలా తోడ్పడ్డాయి. రాజ్య, వ్యక్తిగత సాగుదారులతో పాటు మత సంస్థలు, సముదాయాలు బంజరు భూములను సాగులోకి తెచ్చాయి. అలాంటి బంజరు భూములను వాటికి విరాళంగా (దానంగా) ఇచ్చేవారు. సంచార జాతులు (సన్యాసులు) కూడా భూమిని వ్యవసాయం కోసం వినియోగించి తమ స్వంత మనుగడ కోసం వివిధ రకాల తిండి గింజలను ఉత్పత్తి చేశారని కాళిదాసు తన రచనలలో పేర్కొన్నాడు. వ్యవసాయానికి ఉన్న ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకొని నారద, బృహస్పతి లిద్దరూ పంటలను ధ్వంసం లేదా నాశనం చేసేవారికి కఠిన శిక్షను ప్రతిపాదిస్తూ నిబంధనలను రూపొందించారు. తిండిగింజలను తస్కరించే వారిని సైతం కఠినంగా శిక్షించాలని ప్రతిపాదించారు. చివరకు పశుకాపరులను కూడా మినహాయించలేదు. కాపరుల నిర్లక్ష్యం వల్ల పశువులు పంటను నాశనం చేస్తే వారికి శిక్ష విధించేవారు. అదే సమయంలో వ్యవసాయదారుడు తన పొలానికి కంచె ఏర్పాటు చేసి పంటను కాపాడుకోవాలని సూచించేవారు. ఈ కాలంలో వ్యవసాయం పురోగతి సాధించిందని చెప్పడానికి అనేక ఆధారాలు ఉన్నా కరువులు, వరదలు, పంట వైఫల్యాలు, సుదీర్ఘ కరువులు తరచూ సంభవించేవని ఆయా కృతులలో పేర్కొన్నారు.

ఈ కాలంలో వ్యవసాయభూములు వైశాల్యంలో చాలా చిన్నవిగా ఉండేవి. వాటిని స్వయంగా యజమానే సాగు చేసేవాడు. తన కుటుంబ సభ్యులను వ్యవసాయ పనులలో ఉపయోగించేవాడు. అయితే కొన్ని విశాలమైన పొలాలు కూడా ఉండేవి. ఉదాహరణకు

గునాయ్‌గఢ్ ఫలకంలో పేర్కొన్న 11 పతకాల భూమి. అక్కడ యజమాని పంటలను సాగు చేయడం కోసం వేతన కార్మికులను రప్పించేవాడు లేదా పంట వాటాదారులకు భూమిని అప్పగించేవాడు. నారద, బృహస్పతిలు భూయజమాని, వేతన కార్మికులు లేదా పంట వాటాదారుల మధ్య ఉండాల్సిన సంబంధాలు గురించి కొన్ని నిబంధనలను రూపొందించారు. ఈ నిబంధనలు ఇరుపక్షాల ప్రయోజనాలను పరిరక్షించడానికి ఉద్దేశించినవి. చాలా ప్రాంతాలలో వ్యవసాయంలో వర్షపాతం కీలక పాత్ర పోషించిన కారణంగా వరహామీరుడు రచించిన భృతసంహిత సాగుదారులకు మార్గదర్శక సూత్రాలను అందించింది. వాతావరణ మార్పులను ఆ గ్రంథం విస్తృతంగా పరిశోధించి తగు సూచనలు చేసింది. వరహామీరుని ప్రకారం దేశంలోని కనీసం కొన్ని భాగాలలో మూడు కోతలు ఉండేవి. గ్రీష్మరుతువు, వసంతరుతువు, శీతలరుతువులలో పంటను కోసేవారు. వరహామీరుడు, అమరసింహులు ఇద్దరూ వివిధ రకాల పంటలను ఈ కాలంలో తరచూ ప్రస్తావించారు. వాటిలో వరి, గోధుమలు, బార్లీ, శెనగలు, పప్పుదినుసులు, చెరుకు, నూనె విత్తనాలు, తదితర పంటలు ఉన్నాయి. కాళిదాసుని కృతులను బట్టి దక్షిణ భారతదేశం మిరియాలు, మసాలదినుసులకు ప్రఖ్యాతి గాంచినదని బోధపడుతుంది. దేశంలోని వివిధ ప్రాంతాలలో రకరకాల పండ్ల తోటలను కూడా పెంచేవారు. పండ్లతోటల పెంపకంపై వరహామీరుడు విస్తృతమైన సలహాలను అందించాడు.

భూమి అంతటిపై రాజ్యానికే యాజమాన్యం ఉండేదని చెబుతారు. రాజ్యం యొక్క ప్రత్యేక యాజమాన్యానికి అనుకూలంగా అత్యంత నిర్ణయాత్మకమైన వాదన పహార్‌పూర్ రాగి ఫలకంలో ఉంది. ఆ శాసనాన్ని బుద్ధగుప్త వేయించాడు. రాజ్యానికి ప్రాతినిధ్యం వహించే చక్రవర్తి భూదానాలు చేసినపుడు సంపదను, అలాగే ఆధ్యాత్మిక సామర్థ్యాన్ని పొందుతాడని ఆ శాసనంలో పేర్కొన్నారు. రాజ్యం ఏకైక ప్రతినిధిగా పాలకుడు రాజ్య పరిధిలోని భూమి అంతటికి యజమానిగా ఉండేవాడని పై శాసనం బట్టి స్పష్టమవుతుంది. భూకేటాయింపులను పొందడానికి చవి చూడవలసిన విస్తృతమైన అధికారిక ప్రక్రియ కొంతవరకు పరోక్ష సాక్ష్యాన్ని అందిస్తుంది. రాజు తన అధికారిక హోదాలో (వ్యక్తిగత హోదాలో కాకుండా) భూదానాలు చేసేవాడని ఆయా శాసనాలు నిస్సందేహంగా సూచిస్తాయి. అలా కాకుండా ఉన్నట్లయితే లబ్దిదారునికి పాలకుడు భూమిపై సమగ్ర హక్కులను బదిలీ చేసి ఉండేవాడు కాదు. భూమిని కేటాయించిన తర్వాత కూడా పాలకునికి దానిపై కొన్ని ప్రత్యేక అధికారాలు ఉండేవి. ఆచరణలో భూమి రైతులదే అయినప్పటికీ అధికారిక హోదాలో రాజుకు దానిపై సైద్ధాంతిక యాజమాన్యం ఉండేదని బోధపడుతుంది.

బ్రాహ్మణులకే పరిమితమైన అగ్రహార కేటాయింపులు శాశ్వతమైనవి, అనువంశికమైనవి, పన్నురహితమైనవి. భూమిపై వచ్చే ఆదాయమంతా బ్రాహ్మణులకే దక్కేది. సముద్రగుప్తుడు చేసిన నలంద, గయ విరాళాలు అగ్రహార కేటాంపులపై వెలుగును ప్రసరించిన తొలి నివేదికలు. పాలకుని ఆదాయానికి గండి పడే విధంగా అలాంటి ప్రత్యేక హక్కులు గల గ్రామాలలో పన్నుచెల్లించే రైతులను అనుమతించరాదనే షరతులపై అగ్రహారాలను

కేటాయించేవారు. కొన్ని షరతులను ఉల్లంఘించనంతవరకు పాలకుడు అగ్రహారాలను తిరిగి స్వాధీనం చేసుకునేవారు కాదు అయితే పాలకునికి వ్యతిరేకంగా కుట్ర జరిగితే, చోరీలు, వ్యభిచారం లాంటి నేరాలకు పాల్పడితే అగ్రహారాలను మరలా రాజ్యానికి దఖలు పరిచేవారు. పై పరిస్థితులను బట్టి అగ్రహార కేటాయింపులు బ్రాహ్మణుల ఉన్నత హోదాను ప్రతిబింబిస్తాయన్నది స్పష్టమవుతుంది. అలాగే ఇలాంటి కేటాయింపులు లబ్దిదారులకు ఎలాంటి అధికారిక విధులను అనుమతించ లేదన్నది విస్పష్టం. గుప్తకాలం నాటి కొన్ని శాసనాల ప్రకారం గ్రామాలను లౌకికవాద పక్షాలకు కూడా కేటాయించారు. మతపరమైన అవసరాల కోసం అలాంటి గ్రామాలను వారు పాలించారు. మధ్యభారతదేశానికి చెందిన ఉచ్ఛకల్ప రాజవంశ పాలకులు గుప్త చక్రవర్తులకు సామంతులు. వారి నివేదికల ప్రకారం ఒక ప్రాముఖ్యమైన భూదానాన్ని బ్రాహ్మణులకు కేటాయించారు అయితే మిగతా అన్నీ వివిధ వర్గాలకు చెందిన ప్రజలు విరాళాలుగా ఇచ్చిన భూములే. ఈ భూములను రచయితలు, వ్యాపారులు లాంటి వివిధ వృత్తుల వారు అందించారు. వాటిని ఆలయాల మరమ్మత్తు కర్మకాండల నిర్వహణ కోసం ఉపయోగించారు.

లౌకికవాద పక్షాలకు కూడా స్వతంత్రంగా భూములు దానం చేసిన విషయం ఉక్కకల్ప రాజవంశం చేసిన కేటాయింపుతో ధృవపడుతుంది. ఆ శాసనం ప్రకారం రెండు గ్రామాలను శాశ్వత ఆర్థిక, పాలనా హక్కులతో పులిందభట్ట అనే వ్యక్తికి అనుగ్రహ పూర్వకంగా కేటాయించారు. భట్ట ఒక తెగ నాయకుడై ఉండవచ్చు. ఈ కాలంలో ఇతర లౌకికవాద కేటాయింపులు జరిగాయి. అయితే మత విరాళాలతో వాటికి సంబంధం లేకపోవడంతో వాటి గురించి రాయి లేదా రాగి ఫలకాలపై నమోదు చేయలేదు. తమ అధికారిక, సైనిక విధులలో విశేష ప్రతిభ చూపిన అధికారులకు కేటాయించిన భూములపై శిలాశాసన ఆధారాలు లేవు. అయితే అలాంటి కేటాయింపులు జరగలేదని మనం కొట్టి పారేయలేము. వాస్తవానికి భాగిక, భోగపతిక లాంటి పరిపాలనాధికారుల హోదాలు, గుప్తకాలం నాటి పరిపాలనా విభాగాలను బట్టి ప్రభుత్వానికి సేవలు అందించినందుకు ప్రతిఫలంగా అధికారులకు భూమిపై వచ్చే ఆదాయాన్ని కేటాయించేవారని బోధపడుతుంది.

బెంగాల్, తూర్పు భారతదేశంలో గుప్తుల జారీ చేసిన భూములను లబ్దిదారులు విడిచివెళ్ల కూడదు. అలాగే భూములపై వచ్చే కౌలును కాని, భూములను కాని ఇతరులకు కేటాయించ కూడదు. అయితే స్కందగుప్తుడు జారీ చేసిన ఇండోర్ విరాళం లబ్దిదారునికి సర్వ హక్కులను కల్పించింది. లబ్దిదారుడు భూమిపై వచ్చే ఆదాయాన్ని అనుభవించవచ్చు. భూమిని స్వయంగా లేదా ఇతరులతో సాగుచేయవచ్చు. విరాళ షరతులను పాటించినంత వరకు భూములలో రాజ్యం జోక్యం చేసుకొనేది కాదు. ఈ వెసులుబాటు వల్ల విరాళంగా ఇచ్చిన భూములను కౌలుదారులకు అప్పగించే వీలు కలిగింది. ఉప- భూస్వామ్య వ్యవస్థ వేళ్ళూనుకుందనడానికి ఇది తొలి శిలాశాసన ఆధారాలను అందిస్తుంది. ఈ పరిస్థితి మధ్య భారతదేశంలోని పశ్చిమ భాగంలో ఐదవ శతాబ్దం వరకు కొనసాగింది. క్రీ.శ. ఆరు, ఏడవ

శతాబ్దాలలో వల్లభి పాలకులు ఈ తరహా భూదానాలను అందించారు. క్రీ.శ. ఐదవ శతాబ్దంనుండి భూమిని విరాళంగా పొందిన లబ్ధిదారులు పశ్చిమ, మధ్య భారతదేశంలో దొంగలను శిక్షించే అధికారాన్నే కాకుండా పౌర వ్యాజ్యాలపై తీర్పు చెప్పే హక్కును కూడా పొందారు. ఆర్థిక స్వేచ్ఛతోపాటు పై అధికారాలు దఖలుపడడంతో లబ్ధిదారులు రైతులు, ఇతర స్థానికులను పీడించడం మొదలుపెట్టారు. రైతులు, ఆయా గ్రామాల్లోని ప్రజలు తమ కొత్త యజమానుల ఆదేశాలను గౌరవించి, వాటిని అమలు చేయాలని పాలకులు సూచించారు. గుజరాత్, మధ్య భారతదేశం, చివరకు ఒరిస్సాలో కూడా ఆరవ శతాబ్దపు శాసనాలు రైతులు తమ భూముల మీద కొనసాగాలని తరచూ ఆదేశించాయి. భూములను ఇతరులకు కేటాయించినా రైతులు మాత్రం పంటలను సాగు చేస్తూనే ఉండాలని సూచించాయి. ఆ విధంగా దేశంలోని కొన్ని భాగాలలో స్వతంత్ర రైతుల పరిస్థితిని లబ్ధిదారులు దిగజార్చారు. రైతులను కౌలుదారులుగా లేదా అర్థబానిసలుగా మార్చివేశారు.

**పరిశ్రమలు :** గుప్తుల కాలంలో వికసించిన పరిశ్రమలలో గనులు, లోహశాస్త్రం ఉన్నత స్థానాన్ని ఆక్రమించాయి. గనుల తవ్వకం గురించి అమరసింహ, వరహమిహిర, కాళిదాసులు తరచూ ప్రస్తావించారు. వారి రచనల నుండి కుషాణ కాలపు గనులు గుప్తుల కాలంలో కూడా కొనసాగాయని బోధపడుతుంది. అమరసింహుని “అమరకోశం” లోహాల సమగ్ర జాబితాను అందిస్తుంది. లోహాలన్నింటిలో ఇనుము ఎక్కువగా వినియోగంలో ఉండేది. గ్రామీణ సముదాయంలో రైతుల తర్వాత కంసాలులే ముఖ్య హోదాను కలిగి ఉండేవారు. గుప్త కాలంలో లోహ శాస్త్రం సాధించిన . ప్రగతిస్థాయి ఎంతో ఉన్నతంగా ఉంది. అందుకు రెండవ చంద్రగుప్తుని (చంద్ర) మెహ్రోలీస్థూపమే నిదర్శనం. ఈ ఏకశిలస్థూపం శతాబ్దాల తరబడి తుప్పు పట్టకుండా ఉందంటే ప్రాచీన భారత దేశ లోహకార్మికుల నైపుణ్యాన్ని ఊహించవచ్చు. కంసాలులు సమాజంలోని అన్ని వర్గాల అవసరాలను తీరిస్తే స్వర్ణకారులు సాధారణంగా ధనికుల డిమాండ్లను తీర్చారు. సమకాలీన సాహిత్యం ఆ కాలపుప్రజలు నగలను పెద్ద ఎత్తున ధరించే వారని పేర్కొంటుంది. లోహశాస్త్ర పరిజ్ఞానంలో వచ్చిన అభివృద్ధి కారణంగా ముద్రలు, శిల్పాలను, ముఖ్యంగా బుద్ధుని శిల్పాలను ఉన్నతంగా తీర్చిదిద్దారు. లోహకార్మికులు హస్తకళాకారులలో ఒక ముఖ్యమైన, గణనీయమైన వర్గంగా ఉండేవారు.

కుండల తయారీ, టెర్రకోట విగ్రహాలు, ముద్రలు, ముద్రికలు తయారీ పరిశ్రమలు విస్తారంగా ఉండేవి. అందుబాటులో ఉన్న అవశేషాలను బట్టి అప్పటి కళాకారుల నైపుణ్యం, సామర్థ్యం, పరిపూర్ణత ఉన్నత స్థాయిలో ఉండేదని బోధపడుతుంది. రోజువారీ గృహ వినియోగంలో పింగాణీ పాత్రలు జనప్రియంగా ఉండగా పింగాణీ బొమ్మలకు మత, లౌకిక అవసరాల మేరకు మంచి డిమాండ్ ఉండేది. పింగాణీ దగ్గరగా అందుబాటులో ఉండడంతో దాని వినియోగం సహజంగానే విస్తృతంగా ఉండేది. రాతి పని చేసే మేస్త్రీలు, శిల్పకారులు కూడా పెద్ద సంఖ్యలో ఉండేవారు. భవనాలు, స్థూపాలు, శిల్పాలు, మంటపాల నిర్మాణంలో వారు ఎక్కువగా పాలు పంచుకునేవారు. అనేక అందమైన మఠాలు, హిందూ ఆలయాలను

వారు నిర్మించారు. దేశంలోని అనేకప్రాంతాలలో ప్రతికూల వాతావరణాన్ని, విదేశీ దండయాత్రలను తట్టుకొని కొన్ని కట్టడాలు శతాబ్దాల తరబడి సజీవంగా నిలిచాయి.

జంతువుల నుండి సమకూరే ఉత్పత్తులైన పట్టు, ఉన్ని, చర్మాలు అనేక మంది ప్రజలకు పారిశ్రామిక ఆధారంగా ఉండేవి. పట్టు, ఉన్ని ఉత్పత్తులు, చర్మంతో తయారైన అరుదైన వస్తువులను సాధారణంగా ధనికులే వినియోగించేవారు. అయితే పత్తి వస్త్రాలను సమాజంలోని అన్ని వర్గాల ప్రజలూ ధరించేవారు. రంగుల అద్దకం, ఎంబ్రాయిడరీ (జరి) కళ, పట్టు, ఉన్ని, పత్తి పరిశ్రమతో సమానంగా అభివృద్ధి చెందింది. శిలాశాసనాల ప్రకారం పశ్చిమ, మధ్య భారతదేశంతో పట్టు పరిశ్రమ బాగా వికసించింది. ఎందుకంటే నేతపనివారు మండళ్లుగా సంఘటితమై ఉండేవారు. మత అవసరాలకోసం వారు విరాళాలను కూడా అందించేవారు. అయితే కొందరు పట్టు నేతవారు గుజరాత్ నుండి మాల్వాకు వలసపోవలసి వచ్చింది. తమ ఉత్పత్తులకు డిమాండ్ తగ్గిపోయిన కారణంగా వారు వలస వెళ్లి కొత్త వృత్తిని చేపట్టి ఉంటారు.

**వ్యాపారం, వాణిజ్యం :** రోజు వారీ వినియోగంలో ఉండే ఉత్పత్తులకే స్థానిక వ్యాపారం పరిమితమై ఉండగా దేశంలోని వివిధ ప్రాంతాల మధ్య వ్యాపారం సాధారణంగా విలువైన, విలాస వస్తువులలో జరిగేది. ముఖ్యంగా మిరియాలు, గంధపు చెక్కలు లేదా గంధం, సుగంధద్రవ్యాలు, కేసరి, యాక్‌తోక, ఏనుగులు, గుర్రాలు, బంగారు, ఇనుము, రాగి, మైకా తదితర వస్తువులలో వ్యాపారం జరిగేది. వ్యాపార సాంప్రదాయాలను శాసించే అనేక నిబంధనలను నారద, బృహస్పతిలు రూపొందించారు. ముఖ్యంగా వస్తువులను ఒక సారి విక్రయించిన తర్వాత వాటిని వెనక్కి తీసుకోవడం, సరుకుల నాణ్యత, నాసిరకమైన, తస్కరించబడిన వస్తువులను విక్రయించడం లాంటి అవినీతి కార్యకలాపాలను నియంత్రించేందుకు వ్యాపార నిబంధనావళిని ప్రవేశపెట్టారు. అయితే ఎన్ని చట్టాలు అమల్లో ఉన్నా వ్యాపారంలో అవినీతి అన్నది అరుదైన దృగ్విషయంగా ఉండేది కాదు. ఒక ముఖ్యమైన అంశంలో గుప్తుల కాలం మౌర్య యుగానికి భిన్నంగా ఉండేది. మౌర్యుల వలే గుప్తులు సరుకుల ధరలను నిర్ధారించడానికి ప్రయత్నించలేదు. అందుకే సరఫరా, అవసరాలను బట్టి వాటి ధరలు మారుతూ ఉండేవి. గుప్త కాలంలో ధరలే కాకుండా తూకాలు కూడా ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి భిన్నంగా ఉండేవి.

హస్తకళలు, కళలు అభివృద్ధి చెందినట్లు ఆధారాలు ఉన్నప్పటికీ గుప్త కాలంలో విదేశీ వాణిజ్యం అంతకు ముందు కాలంలో వలె విస్తారంగా ఉండేది కాదని తెలుస్తోంది. బంగారాన్ని సమకూర్చుకోవడానికి రోమ్‌తో జరిగే వాణిజ్యం మన దేశానికి ప్రధాన ఆధారంగా ఉండేది. అయితే బంగారు రాశులు తరలిపోతున్నాయన్న ఆందోళనతో రోమను పాలకులు వాణిజ్యానికి (భారతదేశంతో) తూట్లు పొడిచారు. రోమను, గుప్త సామ్రాజ్యాలపై అనాగరిక సైన్యాలు దండయాత్రలు జరపడంతో వాణిజ్య కార్యకలాపాలు పూర్తిగా స్తంభించిపోయాయి. అయితే భారత్, బైజాంటీన్ సామ్రాజ్యం మధ్య వాణిజ్య కార్యకలాపాలు తిరిగి పుంజుకున్నాయి.

ప్రోకోపియస్ రచనలు అందుకు తగిన ఆధారాలను అందిస్తాయి. ఈ వాణిజ్యం భారతదేశానికే చాలా ప్రయోజనకరంగా ఉండేది. భారతదేశంలోని దక్షిణ, తూర్పు, పశ్చిమ ప్రాంతాలలో బైజాంటీన్ బంగారు నాణేలు లభించడాన్ని బట్టి ఇరు దేశాల మధ్య వాణిజ్యం గణనీయమైన పరిమాణంలో జరిగేదని బోధపడుతుంది. తన న్యాయ పత్రంలో జస్టీనియన్ ఎగుమతులకు సంబంధించిన పెద్ద జాబితాను అందించాడు. వాటిలో అనేక వస్తువులు భారతదేశం నుండి వచ్చాయని స్పష్టంగా పేర్కొన్నాడు. అలాగే భారతీయ నేపథ్యం ఉన్న మరికొన్ని వస్తువుల గురించి ప్రస్తావించాడు. ఎగుమతి వస్తువులలో ఇనుము, ఏనుగు దంతాలు, పత్తి ఉన్నా ముఖ్యమైనవి మాత్రం పట్టు, మసాలాదినుసులే. భారత్, బైజాంటీన్‌ల మధ్య ఉన్న పట్టు వ్యాపారం నుండి పర్షియన్ వ్యాపారులు లాభాలను అధికంగా పొందేవారు. పట్టువ్యాపారంలో పర్షియన్ గుత్తాధిపత్యాన్ని నీరుగార్చేందుకు జస్టీనియన్ అనేక విధాలుగా ప్రయత్నించాడు. బైజాంటీన్‌తో పాటు భారతదేశానికి అరేబియా, పర్షియా, బహుశా ఆర్మేనియాలతో కూడా వాణిజ్య సంబంధాలు ఉండేవి.

ఈ కాలంలో భారతదేశానికి సిలోన్‌తో వాణిజ్య సంబంధాలు ఉండేవి. జౌళి, మసాలాదినుసులు, గంధం, మస్క్, ఆముదం, గుర్రాలు, ఏనుగులు లాంటి విభిన్నమైన సరుకులను భారతదేశం నుండి సిలోన్ పొందేది. సిలోన్ నుండి ఈ ఉత్పత్తులు బహుశా, ఇతర దేశాలకు తిరిగి ఎగుమతి అయ్యేవి. సిలోన్ నుండి భారతదేశానికి దిగుమతి అయిన వస్తువులలో ముత్యాలు, వెండి ప్రధానంగా ఉన్నాయి. దక్షిణ, తూర్పు భారతదేశంలోని తీర ప్రాంత ప్రజలు ఆగ్నేయాసియా దేశాలతో వ్యాపారాన్ని కొనసాగించారు. ఆ దేశాలలో వారికి వలస కేంద్రాలు ఉండేవి. అయితే పాశ్చాత్య దేశాలతో ఉన్న స్థాయిలో భారతదేశానికి తూర్పు దేశాలతో (చైనా, తూర్పు ఆసియా) వాణిజ్య సంబంధాలు ఉండేవి కావు. వాణిజ్య కార్యకలాపాలు ఒక మోస్తరుగా ఉన్న దేశంలోని అంతర్గత ప్రాంతాల ఆర్థిక వ్యవస్థను అవి తీవ్రంగా ప్రభావితం చేయలేదు. అయితే ఈ సంబంధాలు, ముఖ్యంగా ఆగ్నేయా ఆసియాతో సంబంధాలు, ఆయా దేశాల సంస్కృతులపై దీర్ఘకాలిక ప్రభావాన్ని చూపాయి.

**వ్యాపార మండళ్లు, సంస్థలు :**

గుప్త కాలపు న్యాయ గ్రంథాలు వ్యాపార మండళ్లు, సంస్థల పనితీరును నిర్దేశిస్తూ సమగ్రమైన చట్టాలను అందించాయి. ఈ కార్పొరేట్ సంస్థలు ముఖ్యమైన ఆర్థిక విధులనే కాకుండా న్యాయ, కార్యనిర్వాహక విధులను కూడా నిర్వహించాయి. ఈ కాలపు శిలాశాసన ఆధారాలను బట్టి వ్యాపార మండళ్లు కేవలం నాణేలను ముద్రికలను జారీ చేయడమే కాకుండా స్వంత కిరాయి సైన్యాన్ని కలిగి ఉండేవని తెలుస్తోంది. కాలాచురి శాసనాల ప్రకారం ఈ కిరాయి మూకలను శ్రేణిబల అని అంటారు. ఉత్పత్తి, రాజకీయ అధికారానికి దాదాపు స్వతంత్ర విభాగాలుగా వ్యవహరించిన వ్యాపారమండళ్ల స్వయంప్రతిపత్తి లక్షణాన్ని మండళ్లు, రాజ్యం మధ్య సంబంధాలను శాసించే నియమాల నుండి గ్రహించవచ్చు. పూర్వపు సాహిత్య కృతులు శ్రేణి ధర్మను (వ్యాపార మండళ్ల ఆచారాలను) గౌరవించాలని రాజును సూచించాయి. అయితే

గుప్త కాలపు కృతులు పాలకుడిని మండళ్లలో ఉన్న ఒడంబడికలను గట్టిగా అమలు చేయాలని ఆదేశిస్తాయి. ఉదాహరణకు బృహస్పతి వ్యాపార మండళ్ల అధ్యక్షులు ఇతర ప్రజలను ప్రభావితం చేసే విధంగా తీసుకునే చర్యలకు (నిబంధనలకు లోబడి) పాలకుని అనుమతి తప్పనిసరి అని ప్రతిపాదించాడు. మండలి అధ్యక్షులు రాజ్యవ్యవహారాలను పర్యవేక్షించడానికి నియమితులైన అధికారులని ప్రకటించాడు. అయితే కొన్ని సందర్భాలలో పాలకుడు మండళ్ల అంతర్గత వ్యవహారాలలో జోక్యం చేసుకోవడానికి ఆస్కారం ఉండేది. తిరుగుబాటు స్వభావం గల విభిన్న మండళ్లు ఒక సమాఖ్యగా ఏర్పడకుండా పాలకులు ముందుస్తు చర్యలు తీసుకోవచ్చని నారద ఒక చట్టాన్ని ప్రతిపాదించాడు. అలాగే తగిన కారణాలు లేకుండా మండళ్లు సాయుధ బలగాలను సమకూర్చుకోరాదని పేర్కొన్నాడు. రాజ్యవ్యతిరేక, అనైతిక లేదా నేరపూరిత చర్యలకు పాల్పడకుండా మండళ్లను నిరోధించాలని కూడా నారదుడు పాలకునికి సూచించాడు.

**మారకద్రవ్యం :** గుప్తుల మారకద్రవ్య వ్యవస్థను ఎవరు ప్రవేశపెట్టారో ఖచ్చితంగా నిర్ధారించడం అంత తేలిక కాదు. ఇటీవలి కాలం వరకు ఒకటవ చంద్రగుప్తుడు గుప్తుల వంశం నుండి వచ్చిన తొలి సామ్రాజ్య పాలకుడు కావడం చేత మారకద్రవ్య వ్యవస్థను కూడా అతడే ప్రవేశపెట్టి ఉంటాడని భావించారు. అలాగే చంద్రగుప్త–కుమారదేవి తరహా బంగారు నాణేలు ఆ వంశానికి చెందిన తొలి నాణేలని విశ్వసించారు. ఈ నాణేలు, సముద్రగుప్తుడు జారీ చేసిన వివిధ రకాల నాణేలను తులనాత్మకంగా పరిశీలించిన తర్వాత కొందరు విద్వాంసులు గుప్తుల నాణేలను తొలిగా జారీ చేసింది సముద్రగుప్తుడేనని సూచించారు.అతడు మొదటి విడతగా జారీ చేసిన బంగారు నాణేలు ప్రామాణికమైనవని, ఆ తర్వాత అతడు చంద్రగుప్త–కూమారదేవి తరహా నాణేలను జారీ చేశాడని పేర్కొన్నారు. లిచ్ఛావీ రాకుమారైతో తన తండ్రి వివాహం చేసుకోవడాన్ని సంస్మరిస్తూ రెండవ రకం నాణేలను సముద్రగుప్తుడు విడుదల చేశాడు. ఈ వివాహం గుప్తుల వంశానికి ఎనలేని ప్రయోజనాన్ని కల్గించింది. అయితే రెండవ చంద్రగుప్తుని పాలనలోనే వెండి నాణేల ముద్రణ తొలుత ప్రారంభమైందని ఖచ్చితంగా చెప్పవచ్చు. ఒకటవ కుమారగుప్తుడు, స్కంధగుప్తులు వెండి నాణేల ముద్రణను కొనసాగించారు. బంగారు, వెండి నాణేలతో పాటు రాగి నాణేలు కూడా జారీ అయ్యేవి. అయితే వాటి సంఖ్య పరిమితంగా ఉండేది. కనీసం రెండవ చంద్రగుప్త, ఒకటవ కుమారగుప్తల పాలనా కాలంలో ఇలాంటి పరిస్థితి ఉండేది.

గుప్తుల కాలం నుండి రాగి నాణేల కొరత ఉండేదని తెలుస్తోంది. ఎందుకంటే పూర్వపు పాలకుల్లాగా గుప్త చక్రవర్తులు రాగి నాణేలను పెద్ద సంఖ్యలో జారీ చేయలేదు. ఇండో– గ్రీకులు, ముఖ్యంగా కుషాణులు రాగి నాణేలను గణనీయంగా జారీ చేశారు. వారు పాలించిన భూభాగాలలో ఈ నాణేలను సాధారణంగా వినియోగించేవారని పురావస్తు సాక్ష్యాధారాలు తెలుపుతాయి. మారకానికి ప్రజలు గవ్వలను ఎక్కువగా ఉపయోగించేవారని ఫాహియాన్ పేర్కొనడం నిజమేనని బోధపడుతుంది. ఇతర కాలాలతో పోలిస్తే గుప్తుల కాలంలో నాణేల కొరత స్పష్టంగా కనబడుతోంది. ఆ కారణంగా ఒక పట్టణానికి చెందిన ప్రజలు ఇతర

పట్టణాలతో మారక సంబంధాలను పెట్టుకోవడానికి అనువైన మాధ్యమం ఉండేది కాదు. గుప్తులు జారీ చేసిన బంగారు నాణేలు భూమి క్రయవిక్రయం లాంటి భారీ లావాదేవీలకే ఉపయోగపడి ఉంటాయి. ఇలాంటి లావాదేవీలలో దీనారాలను (బంగారు నాణేలు) ఉపయోగించే వారు. చిన్నస్థాయి లావాదేవీలను వస్తు మార్పిడి లేదా గవ్వల ద్వారా నిర్వహించేవారు. కనక గుప్తుల కాలంలో ఆర్థిక వ్యవస్థ చాలావరకు స్వయంసమృద్ధి ఉత్పత్తి కేంద్రాలపైనే (గ్రామాలు, పట్టణాలలో) ఆధారపడి ఉండేదని, ఈ కాలంలో నగదు ఆర్థిక వ్యవస్థ క్రమంగా బలహీనమైందని వాదిస్తారు.

**గుప్త-అనంతర కాలం :**

**ఆర్థిక వ్యవస్థ స్వభావం:** నూతన వ్యవసాయదార ఆర్థిక వ్యవస్థ ఆవిర్భావం గుప్త–అనంత కాలంలో ప్రధాన లక్షణంగా కనిపిస్తుంది. ఈ కొత్త ఆర్థిక వ్యవస్థ సాధారణంగా, కొత్త వ్యవసాయదార నిర్మాణం ప్రత్యేకంగా అనేక ముఖ్యమైన లక్షణాలను కలిగి ఉన్నాయి. ఉదాహరణకు బంజరుతో పాటు సాగు భూముల కేటాయింపు, లబ్దిదారుల క్షేత్రాలకు రైతుల తరలింపు, బలవంతపు శ్రమ, రైతుల కదలికలపై ఆంక్షలు, మత లబ్దిదారులకు ఆర్థిక, పాలనా హక్కుల బదిలీ, భూమి శిస్తు రూపంలో అధికారులకు వేతనాల చెల్లింపు, లబ్దిదారుల హక్కులలోపెరుగుదల, పన్నుల హెచ్చింపు, సంకీర్ణ రెవిన్యూ వ్యవస్థ ఆవిర్భావం, వ్యవసాయదార నిర్మాణంలో విశాలమైన ప్రాంతీయ వైరుధ్యాలు. కొత్త ఆర్థిక వ్యవస్థ చాలా వరకు స్వయంసమృద్ధి ఆర్థిక యూనిట్లపై ఆధారపడి ఉండేది. ఉత్పత్తి కేంద్రాలు దేశంలోని వివిధ ప్రాంతాలలో పని చేసేవి. నాణేల కొరత, స్థానిక బరువులు– తూకాలు, వ్యాపారం, పరిశ్రమల నుండి లభించే ఆదాయాన్ని పాలకులు, తెగనాయకులు ఆలయాలకు బదిలీ చేయడం లాంటి పరిస్థితులు నూతన ఆర్థిక వ్యవస్థను అద్దంపడతాయి.

పట్టణ కేంద్రాల క్షీణత వ్యాపార, నిత్యావసర వస్తువుల ఉత్పత్తి పతనాన్ని కూడా సూచిస్తాయి. క్రీ.శ. ఒకటి నుండి మూడవ శతాబ్దాల వరకు గల కుషాణ పొరలు వికాస దశలో ఉన్నాయని పురావస్తు సాక్ష్యాలు చెబుతాయి. క్రీ.శ. నాలుగు, ఐదు, ఆరవ శతాబ్దాలకు చెందిన గుప్త పొరలు పతన దశలో ఉన్నాయి. అనేక పట్టణ క్షేత్రాలలో క్రీ.శ. ఆరవ శతాబ్దం తర్వాత మానవ నివాసాలు మాయమయ్యాయి. హస్తినాపుర, మధుర, కౌసాంబి, వారణాసి, వైశాలి, చిరంద్, రాజగృహ, చంపా లాంటి అనేక పట్టణాలలో ఇలాంటి పరిస్థితి, నెలకొంది. మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రలలో కూడా అదే స్థాయి కనిపించింది. తొలుత పట్టణానికి పర్యాయపదంగా ఉండిన నిగమ చివరిప్రాచీన, తొలి మధ్యయుగ కాలాల నాటికి గ్రామం అనే అర్థాన్ని సంతరించుకుంది. పై కారణాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుంటే మార్కెటీకరణ అధమ స్థాయికి చేరుకొందని, స్థానిక అవసరాలు స్థానిక స్థాయిలోనే తీర్చాల్సి వచ్చిందని బోధపడుతుంది. కనక ఈ కాలంలోనే జాజ్‌మాని వ్యవస్థ అభివృద్ధి చెందింది. పట్టణాలలో తమ ఉత్పత్తుల విక్రయానికి అంత డిమాండ్ లేకపోవడంతో వృత్తిదారులు గ్రామాలకు తరలి పోయారు. అక్కడ రైతుల అవసరాలను తీరుస్తూ అందుకు ప్రతిఫలంగా కోత సమయాలలో

తిండిగింజలను పొందారు. రైతులు, వృత్తిదారులు తమ గ్రామాలనే అంటి పెట్టుకొని ఉండాలని నొక్కి చెప్పిన ఒప్పంద పత్రాలు జాజమాని వ్యవస్థను క్రమంగా బలోపేతం చేశాయి. మఠాలు, ఆలయాలు విశాలమైన ఆర్థిక విభాగాలుగా రూపాంతరం చెందాయి. కొన్ని మఠాలు లేదా ఆలయాలు వందకుపైగా గ్రామాలను కలిగి ఉండేవి. కొన్ని గ్రామాలు తిండిగింజలను సరఫరా చేస్తే ఇతరులు వస్త్రాలను, మరికొన్ని కార్మికులను అందించాయి. ముఖ్యంగా భవనాలు లేదా కట్టడాల మరమ్మత్తుకు కార్మికుల శ్రమను వినియోగించేవారు. ప్రతి గ్రామం పైన పేర్కొన్న వస్తువులలో కొంత భాగాన్ని అందించేవి.

**నూతన వ్యవసాయదార ఆర్థిక వ్యవస్థ ఆవిర్భావం :**

గుప్త- అనంతర కాలంలో నూతన వ్యవసాయదార ఆర్థిక వ్యవస్థ ఆవిర్భావానికి దారి తీసిన, ప్రధాన కారకం విస్తృతమవుతున్న భూదానాలు సాంప్రదాయమే. ముందుగానే పరిశీలించినట్లు ఈ సాంప్రదాయానికి మూలాలు గుప్త-పూర్వ కాలంలో ఉన్నాయి. గుప్త యుగంలో ఆ సాంప్రదాయం బలపడి గుప్త అనంతరకాలంలో సర్వవ్యాపితమైంది. మత సేవకు ఇలాంటి దానాలు చేసేవారని తొలుత కారణం చూపినా ప్రాచీన సామాజిక వ్యవస్థను ప్రభావితం చేసిన తీవ్ర సంక్షోభం భూదానాల వెనుక వాస్తవ కారణంగా ఉంది. సంక్షోభాన్ని అధిగమించడానికి తీసుకున్న అనేక చర్యలలో అత్యంత కీలకమైనది పురోహితులు, అధికారులకు వేతనాలు, పారితోషికంగా భూముల కేటాయింపు. దానమిచ్చిన భూభాగంలో (గ్రామంలో) శాంతి భద్రతల పరిరక్షణ, పన్నులు వసూలు చేసే భారాన్ని లబ్దిదారులపై మోపడంలో ఈ చర్య సఫలమైంది. అలాగే కొత్త భూములను సాగులోకి తేగలిగింది. అయితే లబ్దిదారులు స్వంతంగా భూములను సాగుచేయలేకపోయారు, పన్నులు కూడా వసూలు చేయలేకపోయారు. ఫలితంగా వాస్తవిక సాగును రైతులేదా పంటవాటాదారులకు అప్పగించారు. వీరికి భూములతో సంబంధం ఉన్నప్పటికీ చట్టబద్ధమైన యాజమాన్యం మాత్రం ఉండేది కాదు. క్రీ.శ. ఆరవ శతాబ్దం నుండి రైతులు, పంట వాటాదారులు లబ్దిదారుల భూమిని అంటిపెట్టుకొని ఉండిపోయారు. ఆ కారణంగా ఒక గ్రామం నుండి మరో గ్రామానికి వలస వెళ్లలేకపోయారు. అందుకు భిన్నంగా అదే గ్రామంలో నివసిస్తూ దాని అవసరాలను దాదాపు తీర్చారు.

చివరి ప్రాచీన కాలం, తొలి మధ్యయుగ కాలాలలో భారతీయ రైతాంగ అణచివేత భూదానాలు పెరుగుతున్న పరంపరలో ప్రస్ఫుటమైన పరిణామం. దానిని అనేక కారకాలతో వివరించవచ్చు. అందులో ముఖ్యమైనది గ్రామీణులపై పెరిగిన పన్నుల భారం. భూదాన శాసనాలు సుమారు11 రకాల పన్నులను గ్రామాలలో విధించాలని పేర్కొన్నాయి. ఈ పన్నులను వసూలు చేసే అధికారాన్ని లబ్దిదారులకు బదిలీ చేయడంతో పాటు నిర్ధారిత, అనిర్ధారిత పన్నులను విధించే హక్కును కూడా వారికి ధారాదత్తం చేశారు. అనేక భూదానాలలో పన్నుల జాబితా విశాలంగా ఉండేది కాదు."తదితర" (ఆది) పద్దు కింద అదనపు పన్నులను వసూలు చేసే అధికారాన్ని లబ్దిదారులకు కట్టబెట్టారు. దీనర్థం కొత్త పన్నులు విధించే అధికారం వారికి ఉండేది. రైతాంగ హోదాను నీరుకార్చిన రెండవ కారకం బలవంతపు శ్రమ (విష్టి)ను రుద్దడం.

మౌర్య కాలంలో బానిసలు, వేతన కార్మికులను అలాంటి శ్రమకు గురి చేశారు. అయితే క్రీ.శ. రెండవ శతాబ్దం నుండి ఈ దురాచారాన్ని పాలితులలోని అన్ని వర్గాలకు విస్తరించారు. ఆయా సందర్భాలలో పాలకుడు బలవంతపు శ్రమను ప్రజలపై రుద్దినా వారిని స్థానిక లబ్దిదారులకు బదిలీ చేసినపుడు దోపిడీ స్థాయి తీవ్రంగా పెరిగేది. ఎందుకంటే స్థానిక లబ్దిదారులకు గ్రామీణ వనరులను కొల్లగొట్టడంలో ప్రత్యక్ష ప్రయోజనం ఉండేది. మూడవ కారకం ఉప- భూస్వామ్య హక్కు. భూమిని సాగు చేయాలని లేదా సాగు చేయించాలని లబ్దిదారులను పాలకులు ఆదేశించారు. కొన్ని ప్రాచీన, తొలి మధ్యయుగ చట్ట గ్రంథాలు పాలకుడు, వాస్తవిక సాగుదారుని మధ్య నాలుగు దశల భూమి ప్రయోజనాలు ఉన్నాయని వివరిస్తాయి. అయితే రైతులను ప్రతికూలంగా ప్రభావితం చేసిందేమిటంటే గ్రామీణుల నుండి సముదాయ హక్కులను లబ్దిదారులకు బదిలీ చేయడమే. బంజరు భూములు, అటవీభూములు, మేత భూములు, చెట్లు, జలాశయాలపై హక్కులు ఉండడంతో లబ్దిదారులు (భూస్వామ్య వర్గం) రైతుల నుండి వినియోగదార రుసుము వసూలు చేయసాగారు. ఇలాంటి హక్కుల బదిలీ రాచరిక యాజమాన్య సిద్ధాంతం ఆధారంగా జరిగింది. గుప్త, గుప్త అనంతరకాలాలలో ఈ సిద్ధాంతాన్ని గట్టిగా నొక్కి చెప్పే ప్రయత్నం జరిగింది. రాజు లేదా అతడి మతపరమైన, లౌకికవాద లబ్దిదారులకు ప్రయోజనం కలిగే విధంగా రైతుల నుండి అదనపు ఉత్పత్తిని వసూలు చేసే వివిధ మార్గాలుగా పై పరిస్థితులను పరిగణించవచ్చు. అవి కొత్త ఆస్తి సంబంధాలకు పునాదులు వేశాయి. ఆర్థికంగా దోపిడీ చేయడానికి కొత్త వ్యవస్థను సృష్టించాయి. అలాంటి దోపిడీ వ్యవస్థ, ఆస్తి సంబంధాల నుండి రైతులకు రక్షణ లేకుండా పోయింది.

భూముల యాజమాన్య లేమి, పేదరికం ప్రక్రియకు వ్యతిరేకంగా రైతులు ఎలా స్పందించారు? ఈ ప్రశ్నకు భూకేటాయింపులు ఎలాంటి సమాధానాన్ని ఇవ్వలేవు. అలాగే అనేక సాహిత్య కృతులలో దానికి జవాబు లేదు. ఎందుకంటే సాహిత్యం చాలా వరకు రాచరిక ఆస్థానం మెప్పు పొందడానికే పరిమితమైంది. అయితే కొన్ని గ్రంథాలు రెండు రకాల ప్రతిస్పందనను సూచిస్తాయి. ఒకటి, గ్రామీణ ప్రాంతాన్ని వీడివెళ్లడం-ఈ పాత (ప్రాచీన) సాంప్రదాయం గురించి జాతకాలలో వివరణ ఉంది. ఆరవ శతాబ్దానికి చెందిన ఖగోళ శాస్త్రజ్ఞుడు వరాహమిహిరుని ఉటంకిస్తూ"సుభాషితరత్నకోశం"లో ఒక వ్యాఖ్యానం ఉంది. అందులో జన సంచారం లేని గ్రామాల అధోగతిని వివరించారు. అలాంటి నిర్మానుష్య గ్రామాలలోభోగపతి మితిమీరిన ఆగడాలను తట్టుకోలేక వలస పోయిన రైతుల గృహాలు శిథిలావస్థలో ఉన్నాయని పేర్కొన్నారు. రైతులు దోపిడీకి వ్యతిరేకంగా మరో విధంగా కూడా స్పందించి ఉంటారు. భూములపై తమ హక్కులను గట్టిగా చాటుకొని ఉంటారు. రామచరిత్రలో సంధ్యకరనంది వివరించినట్లు తూర్పు బెంగాల్‌లో కైవర్తులు దోపిడీకి వ్యతిరేకంగా తిరుగుబాటు జరిపారు. అయితే ఈ ఒక్క ఉదంతం నుండే మనం ఆ కాలపు పరిస్థితులను స్థూలంగా అంచనా వేయలేము. రైతులందరూ తిరుగుబాటు పంథాలో నడిచారని భావించలేము. సాధారణంగా దోపిడీని నిరసిస్తూ రైతులు గ్రామాల నుండి వలసపోయి ఉంటారు. అయితే వలసలు పోయినంత

మాత్రాన రైతుల పరిస్థితిలో మార్పు వచ్చి వారు ప్రయోజనం పొందారని చెప్పలేము. ఎందుకంటే అప్పటి ఆర్థిక వ్యవస్థ గ్రామస్థాయిలో స్వావలంబన స్వరూపాన్ని కలిగి ఉండేది. పరస్పర సహకార ఒప్పందానికి గ్రామీణులందరూ కట్టుబడి ఉండేవారు. గ్రామాన్ని వీడి వెళ్లే సమస్యే ఉండేది కాదు. అన్ని చోట్లా ఆర్థిక పరిస్థితులు, రాజకీయ సంఘటనం మౌలికంగా ఒకేలా ఉన్న కారణంగా రైతులు వలసపోయినా రాకుమారులు, లబ్ధిదారుల దోపిడి నుండి విముక్తి పొందలేకపోయారు

**భూస్వామ్య వ్యవస్థ ఆవిర్భావం- దాని పాత్ర :**

క్రీ.శ. ఒకటవ శతాబ్దం నుండి బ్రాహ్మణులకు కేటాయించిన భూములలోనే భూస్వామ్య వ్యవస్థ మూలాలను అన్వేషించవచ్చు. గుప్తుల కాలంలో భూదానాల సంఖ్య ఉత్తర భారత దేశంలో గణనీయంగా పెరిగింది. తదుపరి కాలంలోనూ ఆ సంఖ్య పెరుగుతూనే పోయింది. నలంద మఠానికి హర్షుని పాలనా కాలంలో 200 గ్రామాలపై యాజమాన్యం ఉండేది. తమ పోషకులకు పౌర, సైనిక సేవలు అందించినందుకు ప్రతిఫలంగా బ్రాహ్మణులకు, ఆలయాలకు భూమి నుండి లభించే ఆదాయాలను బదిలీచేయలేదు. అందుకు భిన్నంగా ఆధ్యాత్మిక సేవలందించేందుకు వీలుగా వారికి గ్రామాలను కేటాయించారు. గ్రామాలను కేటాయించడంతో పాటు లబ్ధిదారులకు (ఆలయాలు, బ్రాహ్మణులు), ఆర్థిక, పరిపాలనా హక్కులు, శాంతి భద్రతల పరిరక్షణ బాధ్యతలు, నేరస్తుల నుండి జరిమానాలు వసూలు చేసే అధికారాన్ని కట్టబెట్టారు. రాజ్య ఉన్నతాధికారులకు భూకేటాయింపుల ద్వారా వేతనాలు చెల్లించేవారని హుయాన్‌త్సాంగ్ పేర్కొన్నాడు. అయితే అలాంటి కేటాయింపులు జరిగాయని చెప్పడానికి తగిన ఆధారాలు లేవు. గ్రామాల కేటాయింపును నమోదు చేసిన పత్రాలు లేదా ఫలకాలకు అరిగిపోయే స్వభావం ఉండడం అందుకు కారణం. భూస్వామ్య వర్గాన్ని సృష్టించే ప్రక్రియ దేశవ్యాప్తంగా అసమానంగా విస్తరించింది. బ్రాహ్మణులకు సంపదను సమకూర్చే కొత్త ప్రాంతాలను కనుగొనడానికి, బంజరు భూమిని సాగులోకి తీసుకురావడానికి ఉద్దేశించిన భూకేటాయింపుల ప్రక్రియ తొలుత సరిహద్దు, వెనుకబడిన, గిరిజన ప్రాంతాలలో ప్రారంభమైంది. ఈ ప్రక్రియ ఎంతో ప్రయోజనకరంగా ఉందని గ్రహించిన పాలకవర్గం దానిని దేశంలోని నాగరిక ప్రాంతాలలో క్రమంగా విస్తరించింది. అలాంటి ప్రాంతాలు బ్రాహ్మణిక సంస్కృతి, సమాజానికి మూల కేంద్రాలుగా ఉండేవి. భారతదేశంలో భూస్వామ్య వ్యవస్థకు ఉన్న సామాజిక–ఆర్థిక కోణం సూద్రులను పరివర్తనతో చాలా దగ్గరగా ముడిపడిఉంది. అంతవరకు సూద్రులను తొలి మూడు అగ్రవర్ణాల సాధారణ సేవకులుగా పరిగణించే వారు. గుప్తుల కాలం నుండి సూద్రులు రైతులుగా పరివర్తన చెందసాగారు. పాత వలసప్రాంతాలలో సూద్ర కార్మికులకు భూములను అప్పగించినట్లు తెలుస్తోంది. వెనుకబడిన ప్రాంతాలలో భూకేటాయింపుల ద్వారా గిరిజన రైతాంగాన్ని చాలా వరకు బ్రాహ్మణిక వ్యవస్థతో జత చేశారు. ఆ తర్వాత వారిని సూద్రులుగా గుర్తించారు. అందుకే హుయాన్‌త్సాంగ్ సూద్రులను వ్యవసాయదారులుగా అభివర్ణించాడు. సుమారు నాలుగు శతాబ్దాల తర్వాత ఈ వాస్తవాన్ని అల్– బెరూనీ నిర్ధారించాడు.

అనేక కారణాల వల్ల తొలి భారతీయ భూస్వామ్య వ్యవస్థ చారిత్రక పాత్రకు ఎంతో ప్రాధాన్యత ఉండేది. మొదటిది, భూకేటాయింపులు మధ్య భారతదేశం, ఒరిస్సా, తూర్పు బెంగాల్‌లోని కొత్త భూములను సాగులోకి తేవడానికి ఒక ముఖ్యమైన సాధనంగా పని చేశాయి. దక్షిణ భారతదేశంలోనూ ఇలాంటి ప్రక్రియ చోటు చేసుకుంది. స్థూలంగా చెప్పాలంటే తొలి భూస్వామ్య వ్యవస్థ వ్యవసాయ విస్తరణకు గొప్ప దశగా ఉంది. రెండవది, భూకేటాయింపులు ఆయా ప్రాంతాలలో శాంతిభద్రతల పరిరక్షణకు ఒక పరిపాలనా వ్యవస్థను నెలకొల్పాయి. ఇలాంటి వ్యవస్థలో అధికారాలన్నీ లబ్ధిదారులకు దఖలు పడ్డాయి. స్థిరనివాస ప్రాంతాలు, వెనుకబడిన ప్రాంతాలు రెండింటిలోనూ మతపరమైన లబ్ధిదారులు ప్రజలలో అధికార వ్యవస్థ పట్ల విధేయతాభావాన్ని పెంపొందించ గలిగారు. మరోవైపు లౌకికవాద (భౌతికవాద) సామంతులు తమ జాగీర్లను పాలించడంతో పాటు యుద్ధ సమయాలలో సైనికబలగాలను సరఫరా చేయడం ద్వారా పాలకునికి ఎంతో సహాయపడ్డారు. మూడవది, భూకేటాయింపులు గిరిజన ప్రజల బ్రాహ్మణీకరణ, సాంస్కృతిక పరివర్తనానికి దారి తీశాయి. గిరిజనులకు లిపులను, కాలసూచికను, కళాసాహిత్యాలను, ఒక కొత్త జీవన విధానాన్ని అందించారు. ఈ విషయంలో భూస్వామ్య వ్యవస్థ దేశ సమైక్యతకు కృషి చేసింది. ఆ విధంగా భారతీయ భూస్వామ్య వ్యవస్థ అనేక భిన్నమైన దశలలో ప్రస్థానం సాగించింది. గుప్తయుగం, తదుపరి రెండు శతాబ్దాలు ఆలయాలు, బ్రాహ్మణులకు భూకేటాయింపుల ఆరంభాన్ని చవిచూశాయి. అలాంటి కేటాయింపుల సంఖ్య క్రమంగా పెరిగింది. పాల, ప్రతీహార, రాష్ట్రకూట రాజ్యాలలో భూకేటాయింపుల స్వభావం మౌలికంగా మారిపోయింది.

**నూతన వ్యవసాయదార వ్యవస్థ (నిర్మాణం) :**

గుప్త అనంతర కాలంలో భూమి యాజమాన్య అంశం అత్యంత వివాదాస్పదమైనది. సమకాలీన ఆధారాలు దానిని మరింత గందరగోళంగా మార్చాయి. ఉదాహరణకు తొమ్మిదవ శతాబ్దానికి చెందిన న్యాయకోవిదుడు మేధాతితి పాలకుడే భూమికి అధిపతి అని ఒక చోట నమోదు చేశారు. అయితే నిజమైన సాగుదారునికే భూమి చెందుతుందని మరోచోట పేర్కొన్నాడు. ఇక్కడో విషయాన్ని గుర్తించాలి. వివిధ స్థాయి కలిగిన హక్కులతో పాలకులు భూమిని ఉమ్మడిగా కేటాయించేవారు. బ్రాహ్మణులు, మత సంస్థలకు మత, సిద్ధాంతపరమైన అవసరాల నిమిత్తం గ్రామాలను కట్టబెట్టారు. సైనిక అవసరాల కోసం సామంతులు, రాకుమారులకు కొన్ని భూభాగాలను ధారాదత్తం చేశారు. పరిపాలన అవసరాల కోసం అధికారులకు భూములను కేటాయించారు. ఆ విధంగా భూమిపై విభిన్నమైన ప్రయోజనాలు, హక్కులు అభివృద్ధి చెందాయి. మధ్యదళారులు వాటిని వివిధ స్థాయిలలో కోరుకున్నారు. భూకేటాయింపుల సాంప్రదాయం సర్వసాధారణంగా మారడంతో సైద్ధాంతిక యాజమాన్యం కూడా లబ్ధిదారులకే దక్కింది. పచ్చిక, మేత భూమి, జలాశయాలు, తోటలు, చౌడు భూములు (ఎండు నేలలు) కూడా వారికే దక్కాయి. అలాంటి భూకేటాయింపులను మరో విధంగా అన్వయించుకోవచ్చు. పాలకునికి భూమిపై అపరిమితమైన యాజమాన్యానికి భూకేటాయింపులను ఒక గొప్ప సూచికగా

భావించవచ్చు. అలాంటి పరిస్థితులలో కొన్ని సార్లు నిజమైన వ్యవసాయదారులను కూడా లబ్దిదారుల గ్రామాలకు బదిలీ చేశారు.

అయితే గుప్త అనంతరకాలంలో పాలకవర్గానికి భూమిపై వ్యక్తిగత యాజమాన్యం ఉండేదని చెప్పడానికి కూడా సాహిత్య, పురావస్తు ఆధారాలున్నాయి. కొన్ని సాహిత్య ఆధారాలు వ్యక్తిగత యాజయాన్యాన్ని సూచించే వ్యాఖ్యానాలను కలిగి ఉన్నాయి. మరోవైపు అనేక శాసనాలు భూకేటాయింపులు, ప్రైవేటు వ్యక్తులచే భూ విక్రయాలను నమోదు చేశాయి. ఆ కారణంగా భూములన్నిటిపై రాజ్యానికే యాజమాన్యం ఉండేదని సాధారణ సూత్రంగా నిర్ధారించారు వ్యక్తులు లేదా సముదాయాలు తమ ఆధీనంలో ఉన్న భూములను సాగు చేస్తూ ఉన్నట్లయితే ఆచరణపరంగా వారినే యజమానులుగా పరిగణించేవారు. కాని భూమి శిస్తును చెల్లించాల్సిన బాధ్యత వారిపై ఉండేది. పన్నును చెల్లించకపోతే భూమిని తిరిగి స్వాధీనం చేసుకునే హక్కు రాజ్యానికి ఉండేది.

**పన్ను సూత్రాలు, ఆచరణ :**

రాజ్య ప్రధాన అంగాలలో కోశాగారం ఒకటిగా మన ప్రాచీన న్యాయకోవిదులు పరిగణించారు. అలా అయితే కోశాగారం లేదా కోశ ఆదాయానికి అనేక ఆధారాలను కలిగి ఉండేదని భావించాలి. యాజ్ఞవాల్క్యపై వ్యాఖ్యానిస్తూ "మితక్సార" పాలకుని ఆదాయ వనరులుగా బంగారు, గనులు, తదితరాలను గణించింది. రాజ్య సౌభాగ్యం దాని భూముల నాణ్యతపై ఆధారపడి ఉందని కమండక సూత్రీకరించాడు. రాజ్యం స్థిరంగా అభివృద్ధి చెందుతూ పోతే పాలకుడు వ్యక్తిగతంగా బలపడతాడని పేర్కొన్నాడు. అందుకే భూవనరులను అభివృద్ధి పరచడానికి పాలకుడు తగిన చర్యలు తీసుకోవాలని సూచించాడు. రాజ్యానికి కోశాగారం ఎంత ముఖ్యమైనదో వివరించడంతో పాటు రెవెన్యూ సమీకరణ(సేకరణ) పై కొన్ని మార్గదర్శక సూత్రాలను న్యాయ కోవిదులు ప్రతిపాదించారు. రెవెన్యూకు వివిధ ఆధారాలను సూచించారు. ఈ సూత్రాలు ఆదాయాన్ని అహేతుకంగా డిమాండ్ చేయకుండా పాలకులను చాలావరకు నియంత్రించాయి.

తన పాలితులను ధర్మం ఆధారంగా పరిరక్షించి వారు చేసే మంచి కార్యాల నుండి ఆరోవంతు భాగాన్ని పాలకుడు తీసుకునేవాడని యాజ్ఞవాల్క్య చెబుతాడు. అయితే పాలకుడు భూమికి యజమాని అని ఆరవ శతాబ్దానికి చెందిన కాత్యాయనుడు తొట్టతొలిసారిగా ప్రకటించాడు. భూమి తప్ప పాలకునికి ఎలాంటి ఇతర సంపద లేదని, కనక అతడు భూమి అందించే ఫలాలలో ఆరోవంతు భాగాన్ని సమకూర్చుకోవాలని మరో విధంగా ప్రవర్తించరాదని పేర్కొన్నాడు. రాజు తన విషయ (ప్రజలు)ను పరిరక్షిస్తాడన్న సిద్ధాంతం ఏడవ శతాబ్దంలో కూడా మనుగడ సాగించింది. బాణుడి హర్షచరితలోని ఒక వచనం నుండి ఈ విషయాన్ని గ్రహించవచ్చు. రాజు ప్రపంచాన్ని ఎంత సమర్థవంతగా పరిరక్షిస్తాడంటే అత్యంత స్వార్థపరుడు కూడా సహాయం కోసం అర్థించాల్సిన అవసరం లేదని బాణుడు అందులో వివరించాడు.

ఆ కారణంగా రాజుకు ప్రజల ఆదాయంపై హక్కు ఉండేది. కేవలం తన ప్రజలకు అందించిన భద్రతే కాకుండా భూమి అంతటికీ అతడు యాజమాని కావడంతో పాలకునికి ఆ హక్కు లభించింది. ఈ ద్వంద్వ చట్టబద్ధతను పాలకుడు ఏడవ శతాబ్దం చివరి నాటికి సంతరించుకున్నాడు. అలాంటి చట్టబద్ధత అతడిని అత్యంత శక్తిమంతునిగా తీర్చిదిద్దిందనడంలో ఎలాంటి సందేహం లేదు.

అయితే తొలి భారతీయ సాహిత్య కృతులలో ప్రతిపాదించిన కొన్ని ఉదాత్తమైన పరిస్థితిని చాలా వరకు అదుపు తప్పకుండా నివారించాయి. ప్రజలు పీడనకు గురికాకుండా నివారించడమే లక్ష్యంగా న్యాయకోవిదులు కొన్ని పన్ను సూత్రాలను రాజుకు ప్రతిపాదించారు. ఇవి పన్ను రేట్లు నిర్ధారణకు సంబంధించినవి. వివిధ రకాల ఉత్పత్తులపై ఏ మేరకు పన్ను విధించాలి, పన్నులను సామరస్య పూర్వకంగా ఎలా వసూలు చేయాలి, అనే విషయాలను ఈ సూత్రాలు వివరిస్తాయి. ప్రజల నడ్డివిరిగే విధంగా పన్నులు విధిస్తే పాలకుడు అభిశంసనకు గురికాక తప్పదని పేర్కొన్నాయి. చట్టవ్యతిరేకంగా పన్నులు డిమాండ్ చేసి తమ ఖజానాలను నింపుకునే పాలకులు దురదృష్టాన్ని చవిచూడక తప్పదని, రాజ్యం పతనమవుతుందని యాజ్ఞవాల్క్య జోస్యం చెప్పాడు. ఈ సూత్రాలను కొంతవరకు ఆచరించారని, ప్రజలను భయభ్రాంతులకు గురిచేయకుండా పాలకులు నడుచుకున్నారని శిలాశాసన నివేదికలు కూడా సూచిస్తాయి. సముద్రగుప్తుడు, రెండవ చంద్రగుప్తుడు, ఒకటవ కుమారగుప్తుడు, స్కందగుప్తుడు, బుద్ధగుప్తులు జారీ చేసిన అనేక శాసనాలు ఈ పాలకులు మంచి నడవడిక, న్యాయబద్ధ పాలనను కీర్తిస్తాయి.

కేవలం పన్ను సూత్రాలనే కాకుండా భూమి శిస్తును పాలకుడు ఏ మేరకు వసూలు చేయాలో కూడా శాసనకర్తలు సిఫార్సు చేశారు. ప్రజల జీవన ప్రమాణాలను వివరిస్తూ హుయాన్‌త్సాంగ్ ఒక వ్యాఖ్య చేశాడు. పాలకుడి కౌలుదారులు దిగుబడిలో ఆరోవంతు భాగాన్ని కౌలుగా చెల్లించే వారని పేర్కొన్నాడు. సాధారణంగా దిగుబడిలో ఆరో వంతు వాటాను భూమి శిస్తుగా వసూలు చేసేవారని బోధపడుతోంది. అయితే విభిన్న నేలలకు విభిన్న పన్నులను వర్తింపచేసే అవకాశం పాలకుడికి ఉండేదన్న విషయాన్ని కొట్టివేయలేము. ఆ కాలపు పురావస్తు ఆధారాలు భూమి పన్ను శాతానికి సంబంధించి ఎలాంటి సూచికలు ఇవ్వవు. వాస్తవానికి పాలకులే భూమి శిస్తును సొంతం చేసుకునేవారు. కేవలం బెంగాల్ శిలాశాసనాలలో మాత్రమే రాజు ఆరోవంతు వాటాను వసూలు చేసేవాడని పేర్కొనబడింది. గుప్తుల శాసనాలలో ధర్మసందర్భగ అనే వ్యక్తికరణ పాలకుడి సాధారణ ధాన్యవాటా దిగుబడిలో ఆరోవంతుగా ఉండేదని సూచిస్తుంది.

అంచనా పద్ధతి విషయానికి వస్తే భూమి శిస్తును వ్యక్తిగత భూముల ఆధారంగా అంచనా వేసే వారని తెలుస్తోంది. విరాళంగా ఇచ్చిన పొలాలు, గ్రామాలను నాలుగు వైపులా నిర్ధారించిన తీరు ఈ విషయాన్ని సూచిస్తుంది. బెంగాల్‌లోని కొన్ని గుప్తకాలపు శాసనాలు నిస్సందేహంగా క్రయపత్రాలే. వ్యక్తులకు చెందిన భూములను అవి నమోదు చేశాయి. సాహిత్య

ఆధారాలు కొలతల గురించి ఎక్కడా ప్రస్తావించలేదు. కేవలం గుప్త పూర్వ ఆధారాలలోనే మనకు వివిధ రకాల కొలతలగురించి తెలుస్తుంది. పురావస్తు ఆధారాల విషయానికి వస్తే కుల్యవాప, ద్రోణవాప, అధవాప, పతక (బెంగాల్), నివర్తన, భూమి (మధ్యభారత్), నివర్తన, పదవర్త (పశ్చిమ భారతదేశం) లాంటి కొలతల స్థాయి గురించి తెలుస్తుంది. అలాగే పొలాలకు ఒక పూర్తి "పితక" ధాన్యం విత్తనాలుగా ఉపయోగించాలని నిర్దేశించే శాసనం కూడా ఉంది. ఉత్తర భారతదేశంలో వివిధ ప్రాంతాలలో కొలతకు వేర్వేరు యూనిట్లు ఉండేవన్న వ్యాఖ్యానం బట్టి ప్రభుత్వ అధికారులు కొలతకు స్థానిక ప్రమాణాలను పాటించేవారని బోధపడుతుంది.

**మతపరమైన విరాళాలు :**

బ్రాహ్మణులకు భూములను విరాళంగా ఇచ్చే సాంప్రదాయం ఈ కాలంలో కనిపించిన అత్యంత ప్రధానమైన పరిణామం. ఈ సాంప్రదాయాన్నీ ధర్మశాస్త్రాలు, పురాణాలు, మహాభారత. ఉపదేశాలు పవిత్రతను చేకూర్చాయి. అలాంటి విరాళాల రెండు ప్రధాన లక్షణాలు ఐదవ శతాబ్దం నుండి మరింత విస్తృతంగా మారాయి. ఒకటి ఆదాయానికి సంబంధించిన అన్ని ఆధారాలను లబ్దిదారులకు బదిలీ చేయడం. రెండవది పరిపాలనా, గస్తీ విధులను స్వాధీన పరచడం బ్రాహ్మణులకు అన్ని ఆదాయ వనరులను బదిలీ చేశారన్న విషయం వకాటక పాలకులు చేసిన శాసనాలలో స్పష్టమవుతుంది. క్రీ.శ. ఐదవ శతాబ్దంలో రెండవ ప్రవరసేన కాలం నుండి ఇలాంటి విరాళాలు కొనసాగాయి. ఇలాంటి ఏర్పాట్లలో పాలకుడు, ఆదాయ వనరులపై తన నియంత్రణను పూర్తిగా వదులు కున్నాడు. వాటిలో మేత భూములు, చర్మాలు, బొగ్గు, ఉప్పు తయారీ కేంద్రాలు, బలవంతపుశ్రమ, రహస్య ఖజానాలు, ధనరాశులు ఉన్నాయి. గుప్త, గుప్త అనంతర కాలాలలో చేసిన కొన్ని భూదానాలు బ్రాహ్మణ లబ్దిదారులకు రాజ్యం పరిపాలనా అధికారాన్ని కట్టబెట్టిందని స్పష్టంగా పేర్కొన్నాయి. బ్రాహ్మణులకు కేటాయించిన అగ్రహారాలలో సర్వాధ్యక్షులు, క్రమబద్ధ సైనికులు, ఛత్రపాలులు ఏవిధంగానూ జోక్యం చేసుకోరాదని గుప్త అనంతర కాలంలో జారీ అయిన రెండు భూదాన శాసనాలు స్పష్టంగా ఆదేశించాయి.

అగ్రహారాలలో బ్రాహ్మణులకు గస్తీ విధులను (పోలీసు విధులు) రాజ్యం బదిలీ చేయడం ప్రత్యేకంగా గుప్త అనంతర కాలం నుండే జరిగింది. అప్పటి నుండి మధ్య, పశ్చిమ భారతదేశంలో కొందరు రాచరిక దాతలు బ్రాహ్మణులకు దొంగలను శిక్షించే హక్కునే కాకుండా కుటుంబం, ఆస్తి, వ్యక్తి (పౌర న్యాయం) కి వ్యతిరేకంగా జరిగే నేరాలను శిక్షించే అధికారాన్ని కూడా ప్రసాదించడం మొదలుపెట్టారు. ఈ కేటాయింపులు అభ్యంతరసిద్ధి అనే పదాంశాన్ని వాడుతూ లబ్దిదారులకు అపరిమిత అధికారాలను కట్టబెట్టాయి. అలాంటి అధికారులు అగ్రహారాలను ఆచరణపరంగా స్వతంత్ర గ్రామాలుగా మారే అవకాశాన్ని కల్పించాయి. గుప్తుల భూదానాలు సాధారణంగా లబ్దిదారుడు భూమి నుండి వేరు పడడానికి లేదా ఇతరులకు కౌలుకు ఇవ్వడానికి అనుమతించవు. అయితే ఇండోర్– భూదానం క్రీ.శ. 397 లో మహారాజ స్వామిదాస– సామ్రాజ్యగుప్తుల సామంతుడు– అనుమతిలో ఒక స్థానిక వ్యాపారి బ్రాహ్మణుడికి

అందించిన విరాళం లబ్ధిదారునికి కొన్ని మినహాయింపులు ఇచ్చింది. బ్రాహ్మదేయ కేటాయింపు నిబంధనలను పాటించినంతవరకు లబ్ధిదారుడు భూమిని అనుభవించవచ్చని, స్వంతంగా లేదా ఇతరులతో భూమిని సాగు చేయించుకోవచ్చని అధికారమిచ్చింది. విరాళమిచ్చిన భూమిలో కౌలుదారులను నియమించడానికి ఈ నిబంధన పూర్తి అవకాశాన్ని కల్పించింది. భూమిపై ఉప-భూస్వామ్యానికి ఇది తొలి శిలాశాసన ఆధారాన్ని అందిస్తుంది. ఉపభూస్వామ్య ప్రక్రియ మధ్యభారత్‌లోని పశ్చిమ భాగంలో ఐదవ శతాబ్దంలో విస్తరించింది. క్రీ.శ. ఆరు, ఏడవ శతాబ్దాలలో వల్లభి పాలకులు తమ లబ్ధిదారులకు కేటాయించిన భూములలో ఇలాంటి లక్షణం ఉండేది.

భూకేటాయిపులకు ప్రతిఫలంగా పురోహితులు మతపరమైన (ఆధ్యాత్మిక) సేవలు అందించాల్సి ఉంటుందని శాసనాలలో పేర్కొన్నారు. అలాంటి సేవల వల్ల దాతలు లేదా వారి పూర్వీకులకు ఆధ్యాత్మిక సంక్షేమం దక్కే అవకాశం ఉండేది. అయితే పురోహితులు పాటించాల్సిన భౌతికపరమైన(లౌకిక) విధులను శాసనాలలో అరుదుగా ప్రస్తావించారు. ఎందుకంటే విరాళాలను శాశ్వతమని లబ్ధిదారులు భావించేవారు. అయితే పురోహితులు పాలకులు ఆశించిన దాని కంటే ఎక్కువగా సేవలను అందించారు. తమ గ్రామాలలో శాంతి భద్రతలను పరిరక్షించడమే కాకుండా ప్రజలు వర్ణ ధర్మాన్ని పాటించి రాజు ఆజ్ఞలను శిరసావహించాలని కూడా ప్రబోధించాడు. కనక దాతల ఉద్దేశం ఏదైనప్పటికీ ఈ విరాళాలు కేవలం మత అవసరాలను మాత్రమే తీర్చాయని భావించడం తప్పే అవుతుంది.

**లౌకిక విరాళాలు :**

రాజ్యవ్యవస్థ భూస్వామీకరణ చెందిందనడానికి మరో సూచిక పరిపాలన సైనిక విధులు నిర్వహించే అధికారులకు భూములను కేటాయించడమే. అలాంటి కేటాయింపులు జరిగినట్లు గుప్తుల కాలంలో ఎలాంటి ప్రత్యక్ష శిలాశాసన ఆధారాలు లేవు. అయితే అలాంటి ఏర్పాటును పూర్తిగా తోసిపుచ్చలేము. కాని గుప్త అనంతర కాలంలో రాజ్య అధికారులకు వేతనాలు చెల్లించే పద్ధతిలో ఖచ్చితమైన మార్పు వచ్చింది. కనీసం హర్షుని పాలనా కాలంలోనైనా ఉన్నతాధికారులకు వారి సేవలకు ప్రతిఫలంగా నగదు రూపంలో వేతనాలు చెల్లించేవారు కాదు. ఎందుకంటే గొప్ప ప్రజాసేవకులకు రాచరిక ఆదాయాలలో నాలుగో వంతు భాగాన్ని ఒక ఎండోమెంట్ (నిధి) రూపంలో భద్రపరిచేవారు. గవర్నర్లు, మంత్రులు, మెజిస్ట్రేట్లు, అధికారులకు వ్యక్తిగత మనుగడ కోసం కొంత భూమిని కేటాయించారని ఒక చోట హుయాన్ త్సాంగ్ స్పష్టంగా పేర్కొన్నాడు. ఆ విధంగా హర్షుని పాలనలో రెవెన్యూలను కేవలం పురోహితులు, విద్వాంసులకే కాకుండా రాజ్య అధికారులకు కూడా కేటాయించారు. ఈ కాలపు నాణేలు తక్కువ సంఖ్యలో లభించడం కూడా భూదానాల సాంప్రదాయాన్ని బలపరుస్తుంది.

గుప్త- అనంతర కాలం నాటి కొన్ని శిలాశాసనాలు లౌకిక సేవల కోసం లౌకిక పక్షాలకు జారీ చేసిన భూదానాలను ప్రస్తావిస్తాయి. తూర్పు బెంగాల్‌లోని అష్రఫ్‌పూర్ నుండి లభించిన రెండు రాగి ఫలక శాసనాలు (ఏడు లేదా ఎనిమిదవ శతాబ్దానికి చెందినది) కొందరు

లౌకికవాద లబ్ధిదారులను పేర్కొన్నాయి. బౌద్ధ మత ముఖ్యునికి కేటాయించిన కొన్ని భూములను వాస్తవంగా కొందరు వ్యక్తుల నుండి తిరిగి స్వాధీనం చేసుకున్నవేనని ఆ శాసనాలు చెబుతాయి. అప్పటి వరకు ఆ వ్యక్తులు భూములను అనుభవించారు. అందరు వ్యక్తుల పేర్లను ప్రస్తావించినప్పటికీ కేవలం కొందరి హోదా, గుర్తింపును మాత్రమే నిర్ధారించగలిగారు. ఇదంతా చూస్తే గుప్త అనంతర కాలం సందర్భంగా తూర్పు బెంగాల్‌లో కొన్ని సేవలకు ప్రతిఫలంగా భూములను పరిమిత కాలానికి కేటాయించేవారని బోధపడుతుంది.

గుప్త–అనంతర కాలంలో పాలనా అధికారుల కొత్త హోదాలు వెలుగు చూశాయి. అధికారులకు వేతనాల చెల్లింపు సమస్యను ఈ నేపథ్యంలో మరింత లోతుగా పరిశోధించవచ్చు. హర్షుడు తన సైన్యంతో ముందుకు సాగుతున్న తరుణంలో కొందరు గ్రామీణులు తమ భోగపతులకు వ్యతిరేకంగా తప్పుడు ఫిర్యాదులు చేసినట్లు బానుడు తను రచించిన హర్ష చరిత్రలో పేర్కొన్నాడు. హర్షుని కాలంలో మరో సామంత అధికారిగా మహాభోగి ఉండేవాడు. ఒరిస్సా శాసనాలు కొన్నింటిలో ఈ మహాభోగుల గురించి ప్రస్తావన ఉంది. తొలి కాలాచురిశాసనాలు "భోగికపాలక" అనే కొత్త అధికార హోదాను ప్రవేశపెట్టాయి. బహుశా అతడు భోగికలను పర్యవేక్షించి ఉంటాడు. భోగిక, భోగిపాలక, భోగి కపాలక ఈ పదాంశాలన్నీ భూస్వామ్య సంబంధాలను స్పష్టంగా సూచిస్తాయి.

గుప్త, గుప్త – అనంతర కాలాలలో పరిపాలనా వ్యవస్థలకు ఉపయోగించిన కొన్ని పదాలు అధికారులకు భూకేటాయింపులను కూడా సూచిస్తాయి. భూమిపై యాజమాన్యం ఉన్నవాడు లేదా భూమిని పాలించే వాడికే సర్వ అధికారాలు, ఫలాలను అనుభవించే హక్కు ఉంటుందనే సాధారణ భూస్వామ్య సిద్ధాంతం ఈ రెండు కాలాలలో తెరపైకి సంపూర్ణంగా వచ్చినా దానిని అశోకుని శాసనాలలో తొట్టతొలిగా ఉల్లేఖించారు. "ఆహార" అనే పదం "భూమి నియంత్రణదారులకు ఆహారం" అనే అర్థాన్ని నేరుగా ఇస్తుంది. కాని వాస్తవానికి అది ఒక పాలనా విభాగం (ఆధునిక జిల్లా లేదా రెవెన్యూ డివిజన్‌తో సమానమైన) అశోకుని కాలం నుండి అలాంటి పాలనా విభాగం ఉద్భవించి గుజరాత్, మహారాష్ట్రలలో కొనసాగింది. గుప్త, తదుపరి కాలాలలో కూడా అది కొనసాగిందని తొలి కాలాచురి శాసనాలు చెబుతాయి. అదే సమయంలో ప్రాదేశిక విభజనలకు సాధారణంగా ఉపయోగించే హక్కుదారి పదాంశాలు వెలుగులోకి వచ్చాయి. వాటిలో భుక్తి, భోగ, విషయ అనే పదాలు అంతర్భాగంగా ఉన్నాయి.

**రైతాంగ స్థితిగతులు :**

పశ్చిమ ఐరోపాలోని ఫ్యూడల్ గ్రామాలలో రైతులు ఫ్యూడల్ ప్రభువులకు కట్టుబడి ఉన్నట్లే భారతదేశంలోని బ్రహ్మదేయలలో కూడా రైతులు తమ బ్రాహ్మణ భూస్వాములతో సంబంధాలు కొనసాగించారని చెప్పడానికి ఎలాంటి ఆధారం లేదు. అయితే కొన్ని అంశాలలో భారతీయ రైతు తన యజమానికి పూర్తిగా దాసోహమై ఉండేవాడు. చాలా ఉదంతాలలో భూస్వాములు పాతరైతుల స్థానంలో కొత్తవారిని తీసుకు వచ్చేవారు. ఆ విధంగా తమ కౌలుదారులను భూముల నుండి గెంటివేసేవారు. ఇతరులతో భూమిని సాగు చేయించే హక్కు భూస్వాములకు ఉండడమే అందుకు కారణం. రైతులు తమ పాలకుడు లేదా భూస్వామికి

విష్టి లేదా బలవంతపు శ్రమను అందించేవారని మధ్య, పశ్చిమ భారతదేశంలో లభించిన గుప్త శాసనాలు తెలుపుతాయి. గుప్త అనంతర కాలంలో రైతులలో బలవంతపు శ్రమ చేయించే అధికారం భూస్వాములకు నిర్దిష్టమైన హక్కుగా మారింది. అవసరమైతే రైతులతో బలవంతంగా శ్రమ చేయించాలని క్రీ.శ. 575లో వల్లభి పాలకుడు ఒకటవ ధర్మసేనుడు జారీ చేసిన శాసనం లబ్దిదారునికి (మతపరమైన) సూచించింది.

గుప్త, గుప్త అనంతర కాలాలలో బలవంతపు శ్రమ స్వభావంలో కొన్ని తీవ్రమైన మార్పులు వచ్చాయి. మధ్యభారతదేశంలోని పశ్చిమ భాగం, మహారాష్ట్ర, కర్ణాటకలోని కొన్ని భూభాగాలకు ఈ సాంప్రదాయాన్ని విస్తరించారు. వకాటక, రాష్ట్రకూట, చాళుక్య శాసనాలు ఈ విషయాన్ని సూచిస్తాయి. మధ్యభారతదేశంలో ఈ సాంప్రదాయం తీవ్ర స్థాయిలో పెచ్చరిల్లింది. అక్కడ సర్వ–విష్టి అనే పదాంశంతో దానిని గుర్తించేవారు. బలవంతపు శ్రమను వినియోగించే హక్కు అంతకు ముందు కేవలం పాలకునికే పరిమితమై ఉండగా ఇప్పుడు మతపరమైన విరాళాలు పొందిన వారు, వారి వారసులకు కూడా విస్తరించింది. దాని స్థాయి కూడా విస్తరించింది. విష్టి ద్వారా చేయించుకున్న వివిధ రకాల పనులను సమకాలీన గ్రంథాలలో గణించారు. ఈ పరిస్థితి రైతులపై తీవ్ర భారాన్ని మోపింది. భూస్వాముల నియంత్రణలోని రైతులు దాదాపు బానిసల స్థాయికి దిగజారగా స్వేచ్ఛా రైతులు కూడా తమ హోదాను కోల్పోయారు. నడ్డివిరిచే అనేక కొత్త పన్నులు, శిస్తులు వారిని పరాధీనులుగా మార్చాయి. ఈ కాలాలలో గ్రామీణులు బలవంతపు నగదు చెల్లింపులు జరిపేవారని బోధపడుతోంది. అలాగే రాచరిక సాయుధ బలగాలు, అధికారులకు ఆహార సరఫరాలను అందించేవారని తెలుస్తోంది. ముఖ్యంగా సైనికులు, అధికారులు గ్రామాలలో మకాం చేసినపుడు వారికి గ్రామస్తులే అన్ని సేవలను అందించేవారు. మరో విషయం ఏమిటంటే అధికారుల రవాణా కోసం రైతులు తమ పశువులను రిలే పద్ధతిలో అందించవలసి వచ్చేది. పర్యటనలో ఉన్న రాచరిక అధికారులకు పుష్పాలు, పాలను సరఫరా చేసే బాధ్యత కూడా రైతులపై ఉండేది. ఇలాంటి బలవంతపు సేవలు లేదా చెల్లింపులను రాజ్య ఖజానాకు పంపించేవారు కాదు. అందుకు విరుద్ధంగా స్థానికంగానే రాచరిక సైన్యాలు, అధికారులు వాటిని అనుభవించేవారు. ఆ విధంగా మరో మధ్యవర్తి (దళారి) వర్గం తయారైంది. రైతాంగ స్థాయి మరింత దిగజారింది.

అయితే భూస్వాములు లేదా బ్రాహ్మదేయలకు బదిలీ కావడంవల్లే రైతులు బానిసల స్థాయికి దిగజారారు. శాసనాల ప్రకారం ఈ సాంప్రదాయం దక్షిణ భారతదేశంలో మొదలైంది. క్రీ.శ. నాల్గవ శతాబ్దంలో జారీ అయిన ఒక పల్లవ శాసనం బ్రహ్మదేయకు రైతుల బదిలీని ప్రస్తావిస్తుంది. లబ్దిదారునికి భూమిని మంజూరు చేసినా సాగుదారులు మాత్రం తమ కార్యకలాపాలను కొనసాగించాల్సిందేనని ఆ శాసనం నిగూఢంగా సూచిస్తుంది. ఈ సాంప్రదాయం క్రమంగా కర్ణాటకకు కూడా విస్తరించి అక్కడి రైతులను తన కబంధ హస్తాలలోకి తీసుకుంది. తొలి బాదామి చాళుక్య పాలకుడు క్రీ.శ. ఆరవ శతాబ్దంలో జారీ చేసిన బీజాపూర్ శాసనం 25 నివర్తనల భూమిని దిగుబడి, తోటల పెంపకం, సాగునీరు, గృహం (నివేశ)తో సహా లబ్దిదారునికి విరాళంగా ఇచ్చింది. ఇక్కడ నివేశ అనే పదం కేవలం లబ్దిదారుని గృహాన్నే కాకుండా ఆ ప్రాంతంలో నివసిస్తున్న రైతులను కూడా సూచిస్తుంది. గ్రామీణ

ప్రాంతాలను అలాంటి పదంతోనే ఎక్కువగా పిలిచేవారు. వ్యక్తిగత రైతులను కొత్త యజమానికి బదిలీ చేసే సాంప్రదాయం దక్షిణ భారతదేశం నుండి మధ్య, పశ్చిమ భారతదేశానికి విస్తరించి ఉంటుంది.

భూమితోపాటు రైతులను లబ్దిదారులకు బదిలీ చేసే సాంప్రదాయం అప్పటి బ్రాహ్మదేయలలో ప్రధాన లక్షణంగా ఉండేదని తెలుస్తోంది. కొన్ని భూకేటాయింపులు సంఘటిత గ్రామాలలో అంతర్భాగంగా ఉండేవి కావు. వాటిని వ్యక్తిగత రైతు కుటుంబాలు స్వతంత్రంగా సాగు చేసేవి. వారి నివాసాలు కూడా వేర్వేరుగా (ఒకే నివాస ప్రాంతంలో కాకుండా) దూరంగా ఉండేవి. ఈ ఉదంతాలన్నింటిలో రైతులుసాగు చేసిన భూములన్నీ వారి నివాస గృహాల చుట్టూ ఉండేవి. ఈ భూములను ఇతరులకు విరాళంగా ఇచ్చినపుడు వాటిని సాగు చేస్తున్న రైతులను కూడా ఉంచుకోవలసి వచ్చేది. లేనిపక్షంలో లబ్దిదారులు అనేక కష్టాలకు గురి అవుతారు. ఇలాంటి రైతులలో కొందరు నాగలితో దున్నేవారు ఉన్నట్లు తెలుస్తోంది. అందుకే రెండు రకాల బానిస రైతులు ఉండేవారని భావించాల్సి ఉంటుంది. ఒక వర్గం రైతులు నాగలి పని చేయగా మరో వర్గం గ్రామాలలో కౌలుదారులుగా సేవలందించారు. నాగలి దున్నేవారిని పూర్తిస్థాయి బానిసలతో, కౌలుదారులను పాక్షిక బానిసలతో పోల్చవచ్చు. లబ్దిదారుల వ్యక్తిగత వ్యవసాయ క్షేత్రాలలో పని చేసే అవసరం కౌలుదారులకు ఉండేది కాదు. తీవ్రమైన ఆర్థిక సంక్షోభ సమయాలలో తప్ప మిగతా కాలాలలో భుక్తి కోసం (మనుగడ) ఇతర ప్రాంతాలకు వలసపోయే అధికారం వారికి ఉండేది.

అనేక శిలాశాసనాల ఆధారంగా భారతదేశంలో కొనసాగిన బానిస రైతాంగ వ్యవస్థ గురించి (క్రీ.శ. ఎనిమిదవ శతాబ్దం మధ్యనాటికి ఈ వ్యవస్థ సర్వవ్యాపితమైంది) ఈ కింది వ్యాఖ్యానాలను మనం చేయవచ్చు.

- ఈ వ్యవస్థ సరిహద్దు భూభాగాలలో మొదలై క్రమంగా ఉత్తర భారతదేశంలోని కేంద్ర ప్రాంతానికి విస్తరించింది.
- స్థానిక ఆర్థిక వ్యవస్థ నిర్వహణకు రైతులు తగిన సంఖ్యలో లేని పర్వత లేదా వెనుకబడిన ప్రాంతాలలో బానిస వ్యవస్థను ఏర్పాటు చేశారు. అయితే రైతులపై భూస్వాములకు అధికారాలు లభించడంతో తదుపరికాలంలో ఆ వ్యవస్థ అభివృద్ధిచెందిన ప్రాంతాలకు సైతం విస్తరించింది.
- ఈ వ్యవస్థ పంట వాటాదారులతో మొదలై సాధారణ రైతులను సైతం తన పరిధిలోకి తీసుకుంది.
- చివరగా అది వ్యవసాయ క్షేత్రాలలో మొదలై ఏకంగా గ్రామాలన్నింటినీ తనలో విలీనం చేసుకుంది.

# V

# సమాజం – మతం

# 10

# ప్రాచీన భారత సమాజం

**పరిచయం :**

ప్రాచీన భారత సమాజంపై తాము జరిపిన అధ్యయనాలలో అనేక మంది చరిత్రకారులు రెండు సిద్ధాంతాలను ఎలాంటి సందేహం లేకుండా ఆమోదించారు. మొదటిది, భారత ప్రాచీన సమాజం ఆ కాలమంతటా దాదాపు స్థిరంగా (ఎలాంటి కదలిక లేకుండా) ఉండిపోయిందని భావించారు. కేవలం రేఖామాత్రపు మార్పులే సంభవించాయని సూత్రీకరించారు. రెండవది, సమాజ పనితీరుకు వర్ణ వ్యవస్థను నిర్దిష్టమైన వివరణగా తీసుకున్నారు. ఆయా వర్ణాల హోదా ఆధారంగా సమాజ నిర్మాణం బలంగా ఉండేదని తర్కించారు. అయితే ఈ రెండూ భావనలు నేడు ప్రశ్నించబడ్డాయి. శిలాశాసన, పురావస్తు ఆధారాలను పునఃపరిశీలిస్తే ఆర్థికపరమైన మార్పు చవిచూసిన కాలాలు ఉండేవని, అవి సామాజిక సంస్థలు, అలాగే ప్రజాజీవనంలోని ఇతర అంశాలను కూడా ప్రభావితం చేశాయని బోధపడుతుంది.

ప్రాచీన భారతదేశంలో వచ్చిన కొన్ని విశాలమైన ఆర్థిక మార్పు దశలను మనం ఇంతకుముందే చర్చించాము. వన సంచార జీవన నేపథ్యం నుండి తొలి వేద సాహిత్యం వెలువడింది. వనసంచార జీవనం స్థానంలో వ్యవసాయ వలస కేంద్రాలు క్రమంగా ఏర్పడ్డాయి. బాగా స్థిరపడిన వ్యవసాయదార ఆర్థిక వ్యవస్థ, పట్టణ వ్యాపార ఆర్థిక వ్యవస్థలు వికాస దశలో ఉండేవని తొలి బౌద్ధ సాహిత్యం సూచిస్తుంది. మౌర్య అనంతర కాలం ఉపఖండంలోని వివిధ ప్రాంతాలలో చిన్న రాజ్యాల పరంపరను చవి చూసింది. అదే సమయంలో దేశీయ, అంతర్జాతీయ వాణిజ్యం గణనీయమైన ప్రగతిని సాధించింది. గుప్త, గుప్త అనంతరకాలాలలో వ్యవసాయదార వ్యవస్థలో భారీ మార్పు మొదలైంది. భూకేటాయింపులు, రెవెన్యూ గ్రాంట్ల పద్ధతి ఉపఖండంలోని అనేక భాగాలలో ఒక కొత్త ఆర్థిక – రాజకీయ నిర్మాణానికి దారి తీసింది. ఇలాంటి కేటాయింపులు మతపరమైన, లౌకికమైన లబ్ధిదారులకు దక్కేవి. ఆర్థిక నిర్మాణం యొక్క మారుతున్న లక్షణం ప్రాచీన భారత సమాజం ఆ కాలమంతటా నిస్తేజంగా ఉండేదన్న సాధారణ సూత్రీకరణను సవాలు చేస్తుంది.

సమాజంలో అంతర్గతంగా వచ్చిన మార్పులు సమాజ పరిణామానికి సంబంధించి ఒక స్పష్టమైన లేదా అర్థవంతమైన దృశ్యాన్ని ఆవిష్కరించకపోయినా విదేశీ దండయాత్రలు, వలసలు ఉన్నత వర్గాల స్థాయిలో స్పష్టమైన మార్పులు తీసుకువచ్చాయి. ఆర్యభాష మాట్లాడే ప్రజలు తమతోపాటు ఒక కొత్త ఆర్య ఉన్నత వర్గాన్ని దేశంలోకి తీసుకువచ్చారు. పంజాబ్, సింధ్‌లలోని అధికార కేంద్రాలను అలెగ్జాండర్ స్వల్పకాలిక దండయాత్ర తీవ్రంగా ప్రభావితం చేయకపోయినా ఇండో–గ్రీకులు, సకాలు, కుషాణులు సుమారు రెండు శతాబ్దాలపాటు జరిపిన దండయాత్రలు ఉపఖండంలోని ఉత్తర, పశ్చిమ భాగాలలోగల భారతీయ సమాజాన్ని ఖచ్చితంగా ప్రభావితం చేశాయి. క్రీ.శ. ఐదవ శతాబ్దంలో హుణులు జరిపిన దండయాత్రల ప్రభావం గంగాలోయలోని మూలకేంద్రాలను సైతం తాకింది. గుప్త–అనంతర కాలంలో మధ్య ఆసియా నుండి ఉత్తర, పశ్చిమ భారతదేశాలకు ప్రజలు వలస రావడం మరింత గొప్ప ప్రభావాన్ని సృష్టించింది.

ప్రాచీన భారత సమాజంలో నాలుగు వ్యవస్థలు(చతుర్వర్ణ) ఉండేవని చెబుతారు. ఐదవ వ్యవస్థ (పంచమవర్ణ)ను తరువాతి కాలంలో అంతర్భాగం చేశారు. మొదటి నాలుగు వ్యవస్థలు బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, సూద్ర కులాలను కలిగి ఉన్నాయి. తొలి మూడు కులాలను ద్విజ (రెండవ జన్మకలిగిన)గా పరిగణించేవారు. అస్పృశ్యులను తరువాతి కాలంలో ఐదవ వర్ణంగా గుర్తించారు. రుగ్వేదలోని పదవ మండలం పురుషసూక్త ప్రకారం చతుర్వర్ణాలు దైవం సృష్టించింది. మహాదేవ ప్రజాపతి నుండి ఆ వర్ణాలు ఉద్భవించాయి. ఈ కారణంగా చతుర్వర్ణ వ్యవస్థకు చట్టబద్ధత, పవిత్రత దక్కాయి. వర్ణ సిద్ధాంతం ధర్మ సిద్ధాంతంతో చాలా దగ్గరగా ముడిపడి ఉండేది. ఆ విధంగా చూస్తే ఒక సామాజిక చట్టాన్ని లేదా సమాజం యొక్క వ్యవస్థాగత పని తీరును ఏర్పాటు చేయడానికి జరిగిన ప్రయత్నమే వర్ణధర్మ సిద్ధాంతమని చెప్పవచ్చు. సమాజం సంక్షేమాన్ని వర్ణధర్మ సిద్ధాంతం పరిరక్షించగలదని భావించారు.

వీటికి తోడుగా ఆశ్రమాల సిద్ధాంతాన్ని జత చేశారు. జీవితంలోని వివిధ దశలలో ఈ ఆశ్రమ ధర్మాలను పాటించాలని ప్రతిపాదించారు. ఫలితంగా వర్ణాశ్రమ ధర్మ సిద్ధాంతం వెలుగులోకి వచ్చింది. దీనిని సమర్థించేందుకు, అలాగే శాశ్వతంగా కొనసాగించేందుకు కర్మ సిద్ధాంతాన్ని వాడుకున్నారు. మలి వేద, వేదానంతర కాలాలలో జీవితాన్ని నాలుగు భాగాలుగా విభజించినట్లు మనకు తెలియవస్తుంది. తొలి దశ బ్రహ్మచారి (విద్యార్థి), రెండవ దశ గృహస్త (కుటుంబ పెద్ద), మూడవ దశ వానప్రస్థ (పాక్షిక సన్యాసం), నాల్గవ దశ సన్యాసి (పూర్తి సన్యాసం లేదా సాత్విక జీవనం). అయితే ఈ ఆశ్రమాల సిద్ధాంతం తొలి రెండు వర్ణాలకే ప్రాథమికంగా వర్తించేది లేదా ద్విజ కులాలకే పరిమితంగా ఉండేది. ఒక వ్యక్తి యొక్క సంపూర్ణ జీవితాన్ని అనేక సంస్కారాలుగా విభజించారు. జననం నుండి మరణం వరకు ఒక వ్యక్తి నిర్వహించాల్సిన విధులను విపులంగా ప్రతిపాదించారు. ప్రతి సందర్భానికి ఒక వేడుకను స్పష్టంగా నిర్ధారించారు.

వర్ణ సిద్ధాంతం ఈ గుణాత్మక లక్షణాలను కలిగి ఉంది : పుట్టుకతో హోదా, సామాజిక విభాగాల వ్యవస్థాగత నిర్మాణం, దాంపత్యసూత్రాలు, కర్మకాండల పవిత్రత. సిద్ధాంతపరంగా ఏ వ్యక్తి కూడా జీవితకాలంలో తన వర్ణ హోదాను మార్చుకోరాదు. నాలుగు వర్ణాలు, వాటిపరిధిలోకి వచ్చే అనేక కులాలలను కర్మకాండయుత హోదా ఆధారంగా సామాజిక వ్యవస్థలో ఏర్పాటు చేశారు. ఒక వర్ణానికి చెందిన సభ్యులు తమ వర్ణానికి వెలుపల వివాహం చేసుకోరాదు. అలాగే దిగువ స్థాయి వర్ణానికి చెందిన వ్యక్తుల నుండి ఆహారాన్ని స్వీకరించరాదు. జననం, వారసత్వాలతో ఉన్నత, అధమ అనే సిద్ధాంతాన్ని ముడిపెట్టారన్నది ఇక్కడ స్పష్టమవుతుంది.

సిద్ధాంతపరంగా హోదాను పెంచుకోవాలంటే రెండే రెండు విస్పష్ట మార్గాలు ఉండేవి. ఒకటి సమాజాన్ని త్యజించి సన్యాసిగా మారడం, రెండవది మలి జన్మలో ఉన్నత సామాజిక హోదాలో పునర్జన్మను పొందడం. అయితే వర్ణ వ్యవస్థలో భౌతికంగా ఉన్నత స్థాయిని అందుకునే అవకాశాన్ని మాత్రం నిరాకరించలేదు. కాని తిరోగమనం చాలా సులభంగా ఉండేది. ఉన్నత స్థాయికి ఎదగడం చాలా కష్టమైనది. అది కేవలం వ్యక్తిగత అంశం కూడా కాదు. కుదురు లేదా సముదాయ పరంగానే అలాంటి ప్రగతి సాధ్యమయ్యేది. ఇది సుదీర్ఘ ప్రక్రియ. నివాస ప్రాంతంలో మార్పు ఈ ప్రక్రియకు దోహదపడేది.

కర్మకాండయుత హోదాపై ఆందోళన వర్ణ సంకర సిద్ధాంతానికి దారి తీసింది. మిశ్రమ కులాలను (వర్ణసంకర) సాంప్రదాయపరంగా అస్వచ్ఛమైనవిగా చూసేవారు. మను లాంటి ప్రామాణిక ధర్మశాస్త్రాలలో మిశ్రమ కులాలు అక్కడక్కడా వృత్తిపరమైన సముదాయాలుగా కనిపిస్తాయి. అయితే సాధారణంగా అవి ఆర్యసమాజంలో పూర్తిగా విలీనం కాని తెగలుగా ఉన్నాయి. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే ఈ తెగల పేర్లు తొలి మధ్యయుగ కాలం వరకు ప్రత్యేక ఉనికిని సంతరించుకుంటూ కొనసాగాయి. మనుస్మృతి, తదుపరి పురాణాలలో పేర్కొన్న ఆది సముదాయాలను పోల్చి చూస్తే ఈ విషయం అర్థమవుతుంది. ఆ విధంగా ఒక బ్రాహ్మణుడు ఒక వైశ్య మహిళను వివాహమాడితే అతడికి కలిగే సంతానాన్ని అంబష్ఠగా వర్గీకరించారని మనకు తెలిపారు. అంబష్ఠ అనే తెగ అనవ క్షత్రియుల నుండి పుట్టుకొచ్చిందని తదుపరి పురాణాలు పేర్కొన్నాయి. ఆ తెగ ఉనికి చెక్కుచెదరకుండా ఉండిపోయింది. అలాగే ఒక బ్రాహ్మణుడు ఒక సూద్ర మహిళను వివాహమాడితే అతడికి కలిగే సంతానాన్ని నిషాదగా గుర్తించేవారు. ఇది కూడా ఆది తెగేనని బోధపడుతోంది. సమాజంలో విలీనం కాని తెగలకు వ్యవస్థలో కర్మకాండయుత హోదాను ఇవ్వాల్సి వచ్చింది. అందుకే వర్ణ సంకర సిద్ధాంతాన్ని రూపొందించాల్సి వచ్చింది.

## వర్ణ వ్యవస్థ పరిణామక్రమం

**వర్ణ విభజనకు ఆధారం :** ఆర్థికపరమైన మార్పులు, సంబంధిత సామాజిక సంబంధాలు పరస్పర విరుద్ధమైన హోదాల విభజనకు దారి తీశాయి. వర్ణ సిద్ధాంతం ఆధారంగా ఈ హోదాలను వ్యవస్థలో ఏర్పాటు చేయడానికి ప్రయత్నించారు. తొలి గ్రంథాలు ఆర్యవర్ణం, దాస వర్ణం గురించి మాట్లాడతాయి. అంటే ద్వంద్వ విభజన ఉండేదని సూచిస్తాయి. రుగ్వేద కాలం నాటి దాసులు బహుశా చివరి హరప్పా లేదా హరప్పా అనంతర సంస్కృతులకు చెందిన వ్యవసాయదార సముదాయాలై ఉంటాయి. హరప్పా నాగరికత ఉన్న మూల కేంద్రాలు లేదా నాగరిక ప్రభావం ఉన్న విశాల భూభాగంలో ఈ సముదాయాలు చెల్లాచెదురుగా విస్తరించి ఉంటాయి. దాస అనే పదం "బానిస" అనే అర్థాన్ని ఇస్తుంది. అయితే ఆయా సముదాయాలపట్ల ఆర్యులకు ఉన్న విరోధాన్ని మాత్రమే ఆ పదం సూచిస్తుంది. ఆర్యులు వారిని వాస్తవంగా లొంగదీసుకున్నారని భావించలేము. విభిన్నమైన మత విశ్వాసాలు, ఆచారాలకు దాస్యులు ప్రాతినిధ్యం వహించడంతో ఆర్యులు వాటిని తిరస్కార ధోరణులుగా పరిగణించారు. అలాంటి విభిన్న మత విశ్వాసాలు, ఆచారాలే ఇరువర్గాల మధ్య ప్రధాన వైరుధ్య లక్షణంగా బహిర్గతమయ్యాయి. వ్యవసాయదార సముదాయాలకు తక్కువ హోదా ఇవ్వడంతో రెండు వర్గాల సమ్మేళనం సాధ్యమైంది.

సామాజిక నిర్మాణాన్ని నిర్ధారించేందుకు వర్ణం ఒక వ్యవస్థగా మారింది. శరీర ఛాయ ప్రతీకాత్మకతను కొనసాగించారు. తదుపరి కాలంలో నాలుగు వర్ణాలు శ్వేత, పసుపు, ఎరుపు, నలుపు ఛాయలతో ముడిపడ్డాయి. ఆర్య, దాస అనే ద్వంద్వ విభజనలో ఆర్యులను వారి సంపద, హోదా ఆధారంగా ఉన్నత వర్గంగా పరిగణించేవారు. రాజన్య, విషయ కుదురులకు చెందిన ఆర్యులతోపాటు కర్మకాండయుత విధుల పంపిణీలో చోటు సంపాదించుకున్న బ్రాహ్మణులు కూడా ఉన్నారు. ఈ పంపిణీ నుండి దాసులను మినహాయించారు. బ్రాహ్మణులకు కానుకలు సమర్పించగల స్థాయిలో దాసులకు సంపద ఉన్నప్పటికీ వారిని దూరంగా ఉంచారు.

విభజన తీవ్ర రూపం దాల్చడం, వృత్తిపరమైన నైపుణ్యం ఆరంభం కావడంతో ఆర్యవర్గ సభ్యులు బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య కులాలుగా నిర్దిష్టమైన వర్గీకరణ పొందారు. మినహాయించబడిన కుదురులు, దిగువశ్రేణి వృత్తులు సూద్రులుగా గుర్తింపు పొందాయి. తొలి మూడు కులాలను ద్విజగా గుర్తించడం (తదుపరి గ్రంథాలలో)తో సామాజిక విభజన స్పష్టమైన రూపాన్ని సంతరించుకుంది. వ్యవస్థలో ప్రవేశం, కుదురు ఆచారాల మధ్య సంబంధాన్ని అది నిర్ధారించింది.

ఈ జాబితాకు మరో సామాజిక ద్వంద్వత్వాన్ని జత చేయవచ్చు. దీనిని మలి వేద గ్రంథాలలో నమోదు చేశారు. అదే భాషాపరమైన వైరుధ్యం. తొలుత అది ఆర్య, మ్లేచ్ఛ మధ్య ప్రారంభమై ఇండో–ఆర్య భాష మాట్లాడే వారిని ఇతరుల నుండి వేరు చేసింది. ఈ వైరుధ్యం సామాజిక పర్యావసానాన్ని కూడా కలిగి ఉంది. మ్లేచ్ఛ అంటే అనాగరికుడు లేదా

కర్మకాండయుతంగా అస్వచ్ఛమైనవాడు. ఆర్య–దాస, దేవ–అసుర, ఆర్య–మ్లేచ్ఛ వైరుధ్యాలలో మౌలిక తేడాల గుర్తింపు అనియత సమాజాన్ని సూచిస్తుంది. కార్యనిర్వాహక వ్యవస్థలో ఈ వైరుధ్యాలను విలీనం చేయాల్సిన అవసరాన్ని నొక్కి చెబుతుంది.

**కుటుంబ - సామాజిక సముదాయాల స్వరూపాలు :**

కుటుంబ సంబంధ స్వరూపాల (ప్రత్యేకమైన) ద్వారా ఆయా వర్గాల ఏకీకరణ సమాంతర ప్రక్రియగా కొనసాగింది. దీని గురించి 'గోత్ర' సిద్ధాంతంలో తరచూ ప్రస్తావించారు. గోత్ర అంటే గోశాల లేదా గోమంద అని అర్థం. దాని ఆధారంగానే ఉన్నత శ్రేణి వర్ణాలలో అనువంశిక సముదాయాలను గుర్తించేవారు. తొలుత గోత్ర అనే సిద్ధాంతం బ్రాహ్మణులతోనే ముడిపడి ఉన్నా, బ్రాహ్మణ ఉనికిని మౌలిక కొలబద్ధగా ఉన్నా తదుపరి కాలంలో క్షత్రియుల (అంధక–వృషిణిలు, సక్యులు, లిచ్ఛావీలు) గోత్ర గుర్తింపులను వినియోగించడం మొదలుపెట్టారు.

అయితే కుటుంబాల మధ్య వ్యత్యాసాన్ని చూపడం కోసమే ఈ క్షత్రియులు (కుదురు లోపల) గోత్రాన్ని ఉపయోగించారు కాని విశాలమైన సామాజిక ఉనికి కోసం కాదు. గోత్ర అన్నది బాహ్య వివాహ సంబంధాలు గల కుదురు. అది సగోత్రికులలో వివాహాలను నిషేధిస్తుంది. తండ్రి కుటుంబానికి చెందిన ఏడు తరాల సంబంధీకులను, తల్లి కుటుంబానికి చెందిన ఐదు తరాల సంబంధీకులను వివాహమాడటాన్ని నిషేధిస్తుంది. తదుపరి కాలాలలో గోత్ర వ్యవస్థ కేవలం బ్రాహ్మణులలోనే అమల్లో ఉండేదని వాదించారు. అయితే క్షత్రియులు తమ పురోహితుల గోత్రాలను సంతరించుకునే వెసులుబాటును కల్పించారు. క్షత్రియుల విషయంలో వర్ణ వ్యవస్థలో చేర్చుకోవడమంటే రెండు ప్రధాన వంశాలైన సూర్యవంశం లేదా చంద్రవంశంలో చేరడమే. క్రీ.శ. తొలి సహస్రాబ్దిలో ఈ ప్రక్రియను చాలా జాగ్రత్తగా అమలు చేశారు. అప్పుడు దిగువశ్రేణి నాయకులు అధికారాన్ని హస్తగతం చేసుకొని ఉన్నత వంశంతో ముడిపడాలని ఆకాంక్షించారు.

వేద సాహిత్యంలో ఒక విలక్షణ దశ 'పంచ–జన'. ఈ పదాంశం యొక్క నిర్దిష్టమైన అర్థం ఇప్పటికీ దొరకలేదు. కొందరి దృష్టిలో అది ఐదు ప్రత్యేక తెగలను సూచిస్తుంది. యూదు, తుర్వాస, దృహ్యూ, అను, పురు అనే ఐదుగురు పూర్వీకులు ఆ తెగలను స్థాపించారని చెబుతారు. పురాణాలు, మహాభారతంలో పేర్కొన్న చంద్రవంశీయులలో రెండు ప్రధాన క్షత్రియ కుదురులకు పంచ–జన్య అనే భావన మూలాధారంగా ఉండేదని బోధపడుతుంది. ఈ ప్రధాన కుదురులు యాయాతికి చెందిన ఐదుగురు కుమారుల కుటుంబాల నుండి ఉద్భవించాయని, వాటిలో పౌరవ, యాదవ కుదురులు అత్యంత ప్రధానమైనవని వివరించబడింది. కురుక్షేత్ర యుద్ధంలో ఐదుగురు పాండు కుమారుల విజయంతో వారసత్వ బంధనాలు ముగిశాయని పేర్కొనబడింది. నైసర్గిక విస్తరణ కీలకదశలలో ఐదుగురు సోదరులతో కూడిన వారసత్వ కుదురులు ఎక్కువగా కనిపిస్తాయి. ఉదాహరణకు ఉపపరిచారకులు కలిగిన ఐదుగురు కుమారులు యమున దక్షిణ తీరం వెంట మగధ వరకు రాజ్యాన్ని స్థాపించారని చెబుతారు. అలాగే బాలికి చెందిన ఐదుగురు కుమారులు తూర్పు భారత దేశంలో రాజ్యాన్ని ఏర్పాటు చేశారని ప్రతీతి.

మూల కేంద్రాల నుండి శివార్ల వరకు (సరిహద్దులు) వలయాకారంలో కుల, విషయ, జనలు విస్తరించి ఉండేవి. జనలో హోదాల స్థాయి స్వరూపం ఉండేది. రాజన్య, విషయాలు అందులో రెండు విభిన్నమైన వర్గాలు. రాజన్య ఉన్నత లేదా పాలకవర్గ కుటుంబాలకు చెందిన వారైతే విషయ దిగువ శ్రేణి కుటుంబాలకు చెందిన వారు. రాజన్యలో నాయకులుగా (తెగ లేదా కుదురు నాయకులుగా) ఎన్నుకోబడిన వారు ఉంటారు. రాజన్యకు అధికారం అందుబాటులో ఉండేది.

అధికారాన్ని "క్షాత్ర" అని పిలిచేవారు. తదుపరి కాలంలో ఆ పదం క్షత్రియులుగా మారింది. అప్పుడు రాజన్య అనే పదం పూర్తిగా కనుమరుగై క్షత్రియ అనే పదం స్థిరపడింది. పాలకవర్గ కుదురులలో అధికార కాంక్షను క్షత్రియ అనే పదం సూచిస్తుంది. క్షత్రియుల ఆవిర్భావం భూమిపై కుదురులకు ఉన్న హక్కుతోపాటు బ్రాహ్మణులు నిర్ధారించే కొత్త హోదా (పాలకవర్గ)తో ముడిపడి ఉంది. ఆర్య నిర్వచనంలో మూడు వర్గాలను – బ్రాహ్మణ, క్షత్రియ, విష్ – ప్రస్తావించారు. ఈ త్రైపాక్షి విధుల సిద్ధాంతాన్ని ఒకరు ఆమోదించినా ఆమోదించకపోయినా ఒక విషయాన్ని మాత్రం స్పష్టంగా చెప్పగలం. పై మూడు వర్గాల మధ్య సంబంధాన్ని ఏర్పాటు చేయడానికి గట్టి ప్రయత్నం జరిగింది. అయితే క్రమంగా ఈ సంబంధాన్ని విడగొట్టారు. వైశ్య వర్ణాన్ని తరచుగా శూద్ర వర్ణంతో గుర్తించారు. వైశ్యులు, శూద్రులను బ్రాహ్మణ, క్షత్రియుల కంటే తక్కువ హోదా గల వారిగా పరిగణించారు.

బ్రాహ్మణ, క్షత్రియ మధ్య హోదాల స్థాయి తొలుత అస్పష్టంగా ఉండేది. బ్రాహ్మణుడు దాన, దక్షిణల కోసం క్షత్రియులపై ఆధారపడితే క్షత్రియుడు తన అధికారానికి చట్టబద్ధత, పవిత్రతను సమకూర్చుకోవడం కోసం బ్రాహ్మణుల మద్దతను కోరేవాడు. ఈ వ్యవహారం ఎలా ఉన్నా బ్రాహ్మణ, క్షత్రియ వర్ణాల సముదాయంలోని మిగతా వర్ణాల కంటే ఉన్నత హోదాను అనుభవించారు. వారి ఆధిపత్యం కర్మకాండయుత బలిదానాల వద్ద స్పష్టంగా వ్యక్తమయ్యేది. బలిదాన వేదికను బ్రాహ్మణ, క్షత్రియులు చుట్టుముట్టేవారు. అదే సమయంలో వైశ్యులు, సూద్రులు వేదికకు దూరంగా నిలబడి కర్మకాండలను తిలకించేవారు. ఈ రెండు వర్ణాల అధమ స్థాయిని ఇలాంటి ఏర్పాట్లు చెప్పకనే నిర్ధారిస్తాయి.

సామాజిక అసమానతల కారణంగా సంపద పునఃపంపిణీ క్షత్రియ, బ్రాహ్మణ వర్ణాలకే పరిమితమైంది. ఈ రెండు వర్ణాలు పరస్పర ప్రయోజనాల కోసం పాటు పడ్డాయి. ఇలాంటి పరస్పర ప్రయోజనాల సంబంధంవల్ల ఇద్దరి హోదా పెరిగింది. బ్రాహ్మణునికి క్షత్రియుడు కానుకలు సమర్పించేవాడు. పూజా పురస్కారాలు నిర్వహించినందుకుగాను వేతనం చెల్లించేవారు. అయితే ఆ వేతనానికి సాంప్రదాయాలు, ఆచారాల ముసుగు తొడిగేవారు. ఆ విధంగా నగదు లేదా వస్తు రూపంలో కాకుండా కానుకల రూపంలో బ్రాహ్మణులకు వేతనాలు లభించేవి. క్షత్రియుల అధికారానికి చట్టబద్ధత కల్పించడమే కాకుండా అతడికి ప్రత్యేక నైపుణ్యాలను, జ్ఞానాన్ని బ్రాహ్మణులు అందించేవారు. ఈకారణంగానే క్షత్రియుల అధికారం బలపడింది.

మూడు ఉన్నత వర్గాలకు తోడు మరో ప్రత్యేక వర్గాన్ని కులపరమైన సమాజ నిర్వచనంలో చోటు కల్పించారు. అదే సూద్రుల వర్గం. (పూర్వపు లేదా తొలివేద గ్రంథాలలో సూద్రులను దాసులతో ముడిపెట్టారు) తదుపరి కాలంలో వెలువడిన ధర్మశాస్త్రాలలో సూద్రులను సంకీర్ణ లేదా మిశ్రమ జాతిగా అభివర్ణించారు. ప్రతిజాతి అనులోమ లేదా ప్రతిలోమ వివాహం నుండి జన్మించేది. ఈ వివాహాలు మూడు ద్విజ కులాలు లేదా వాటి సంతానం మధ్య జరిగేవి. కులాంతర వివాహాలు పెరిగే కొద్దీ జాతుల సంఖ్య కూడా సిద్ధాంతపరంగా పెరగాలి. అయితే ఆచరణలో మాత్రం భిన్నంగా జరిగింది. భారీ మార్పులు సంభవించి కొత్త సామాజిక వర్గాలు, వృత్తులు స్థాపించబడినప్పుడే జాతుల సంఖ్య పెరిగింది. వృత్తిదారులు, వ్యవసాయదారులకు సమాజ నిర్మాణంలో చోటు కల్పించాల్సి రావడంతో సూద్ర వర్ణాన్ని నిర్వచించారని స్పష్టంగా తెలుస్తోంది. అప్పటి వరకు సమాజంలో తొలి మూడు ఉన్నత వర్ణాలకే (బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య) ప్రాధాన్యత, గుర్తింపు ఉండేది. అలాగే కుల సమాజంలో పరాయి వర్గాలను చేర్చుకున్నప్పుడు వాటికి వేర్వేరు హోదాలను నిర్ధారించారు. సమాజంలోని వాస్తవ పరిస్థితిని వివరించే ప్రయత్నంలోనే సంకీర్ణ జాతి సిద్ధాంతాన్ని ముందుకు తెచ్చారు. సూద్ర సంతానాన్ని పుట్టించే వివిధ కులాల ప్రత్యేక కలయికలకు సంబంధించి వెలువడిన గ్రంథాలలో వైరుధ్యాలు ఉండడంపై వాదనను బలపరుస్తుంది.

**వర్ణ వ్యవస్థ హేతుబద్ధత :**

విభిన్నమైన ఉప వ్యవస్థలను సమాజంలో అంతర్భాగం చేసేందుకే వర్ణ సిద్ధాంతాన్ని రూపొందించారు. అంతేకాని సామాజిక–ఆర్థిక స్థాయి స్వరూపాన్ని ప్రతిబింబించేందుకు కాదు. సామాజిక విధి నిర్వహణకు సంబంధించిన నియమాల మార్పులేని స్వభావాన్ని ఈ నేపథ్యంలో అర్థం చేసుకోవచ్చు. అయితే ఉప వ్యవస్థలోనే మార్పు స్పష్టంగా నమోదైంది. క్రీ.పూ. తొలి సహస్రాబ్ది మధ్య భాగంలో వర్ణ వ్యవస్థ అత్యంత జాగ్రత్తగా రూపొందించారనడానికి రుగ్వేదలో పురుష సూక్త అనే భక్తిగీతాన్ని జత చేయడమే నిదర్శనం. అందులో ప్రజాపతి దేహం నుండి నాలుగు వర్ణాలు ఎలా పుట్టుకొచ్చాయో వివరించారు. ప్రతీకాత్మక ఇక్కడ దేహంలో ఆయా అంగాలు విభిన్న విధులను నిర్వర్తించినా అవి దేహంలో ఒక భాగమేనని, అన్ని అంగాలు సయోధ్యతో పని చేస్తాయని చెప్పడంలోనే ఉంది. అంగాల పనితీరును బట్టి వాటికి ప్రాధాన్యత, హోదాలు ఉంటాయని, అలాగే ఆయా కులాల విధులను బట్టి సమాజ నిర్మాణంలో వాటికి హోదా లభిస్తుందనే వాదనను ముందుకు తెచ్చారు. ఈ పోలికను చూపడం ద్వారా వర్ణ స్థాయికి మతాచారాలలో ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు.

వర్ణ సిద్ధాంతంలో కుల విభజనకు హేతుబద్ధత కల్పించడమే కాకుండా ప్రతి సముదాయం యొక్క విధులను కూడా స్పష్టంగా నిర్ధారించారు. ఇప్పుడు బ్రాహ్మణుడు పీఠాధిపతికి తక్కువే అయినా అతడిని కర్మకాండల నిపుణునిగా పరిగణించారు. పట్టాభిషేకం లాంటి విస్తృతమైన కార్యక్రమాలకు సుశిక్షితులైన వృత్తిపర పురోహితులు పెద్ద సంఖ్యలో

అవసరమయ్యారు. గృహ సూత్రాలలో వివరించబడిన ఇంటిల్లిపాది పూజా పురస్కారాలు చాలా వరకు పంచకర్మలకు సంబంధించినవి. వాటి నిర్వహణకు ఒక బ్రాహ్మణుడు సరిపోతాడు.

ఈ రెండు రకాల కర్మకాండల పెరుగుతున్న ప్రాధాన్యత బ్రాహ్మణుని రాజకీయ పాత్రను నొక్కి చెప్పడమే కాకుండా గృహపతులకు సంబంధించి సాంస్కృతిక గుర్తింపును అందించే అధికారిగా అతడి ప్రాముఖ్యతను కూడా వెల్లడిస్తుంది. అలాగే సమాజంలో కొత్త వర్ణాలను చేర్చుకోవడంలో కూడా అతడికి ఎనలేని ప్రభావం ఉండేది. వేద కాలం చివరలో వ్యవసాయం విస్తరించింది. ఆర్యులు ఆర్యేతరులతో కలిసిపోయారు. ఈ నేపథ్యంలో 17 రకాల పురోహితులు ప్రత్యక్షమయ్యారు. వీరు విభిన్న కర్మకాండలను (సార్వజనిక బలిదానాలు) నిర్వహించారు. ఇంత మందిలో బ్రాహ్మణుడు ఒకడయ్యాడు. అయితే ఇతరులపై అతడు క్రమంగా పై చేయి సాధించి ఉన్నత స్థానానికి ఎదిగాడు. పురోహిత వర్గానికి ఏకైక ప్రతినిధిగా మారాడు. అయినప్పటికీ సామాజిక వర్గీకరణకు ఒక నిర్దిష్టమైన స్వరూపాన్ని ఈ కాలంలో ఇవ్వలేకపోయారు. ఎందుకంటే ప్రాచీన వ్యవసాయం కారణంగా రైతులు వినియోగానికి అవసరమైన ఉత్పత్తిని ఎక్కువగా పండించలేకపోయారు. అలాగే ఇతరులు సరిపడ నిల్వలను సమకూర్చుకోలేకపోయారు.

## చారిత్రక నేపథ్యం

బుద్ధుని కాలంలో హస్తకళలు, వ్యవసాయ కార్యకలాపాలలో ఇనుప పరికరాలు పెద్దఎత్తున ఉపయోగించడం మొదలుపెట్టారు. ఫలితంగా గిరిజన, వనసంచార, దాదాపు సమసమాజ వైదిక సమాజం పూర్తిస్థాయి వ్యవసాయదార, వర్గ విభజిత సామాజిక వ్యవస్థగా రూపాంతరం చెందింది. ఇనుప గొడ్డలితో మధ్య గంగా బేసిన్‌లలోని అడవులను ఒక్కసారి తొలగించాక ఆ ప్రాంతం వ్యవసాయానికి, వలస కేంద్రాలకు అందుబాటులోకి వచ్చింది. తాము వినియోగించే స్థాయి కంటే ఎక్కువ దిగుబడిని రైతులు పండించడం మొదలుపెట్టారు. వ్యవసాయోత్పత్తికి తోడు హస్తకళల ఉత్పత్తి కూడా పెరిగింది.

కర్మాగారాలు ఏర్పాటు కావడంతో రైతులకు వ్యవసాయ పనిముట్లు, వస్త్రాలే కాకుండా పాలకులు, బ్రాహ్మణులకు ఆయుధాలు, విలాస వస్తువులు కూడా అందుబాటులోకి వచ్చాయి. మూడు ఉన్నత వర్ణాలకు చెందిన సభ్యులు నాలగవ వర్ణ సభ్యులకు భిన్నమైన గుర్తింపును పొందారు. సూద్రులు ఉన్నత వర్గాలకు బానిసలు, వేతన కార్మికులుగా సేవలు అందించాల్సి వచ్చింది. ద్విజ కులాల్లోనే తొలి రెండు వర్ణాలు శారీరక శ్రమ పట్ల ఏహ్యాభావం పెంచుకున్నారు. వైశ్యులు ద్విజకులస్తులైనప్పటికీ రైతులు, పశుకాపరులు, వృత్తికారులు, తర్వాతి కాలంలో వ్యాపారులుగా విధులు నిర్వర్తించారు. అంతకంటే ముఖ్యంగా వైశ్యులు పన్ను చెల్లించే ప్రధాన వర్గంగా ఎదిగారు. వారు చెల్లించే పన్నులతో పాలకులు, పురోహితులు విలాస జీవితాన్ని గడిపారు. వైశ్యులు, సూద్రులు అందించే కానుకలు, సేవలు, చెల్లించే పన్నులపైనే పాలకులు, బ్రాహ్మణులు ఆధారపడి జీవించడంతో ఇద్దరి మధ్యసామాజిక పొదుపులో వాటాను పంచుకునే

విషయంలో తరచూ ఘర్షణలు జరిగేవి. అయితే దిగువ శ్రేణి కులాల నుండి ముప్పు పొంచి ఉండడంతో ఆ రెండు ఉన్నత వర్గాలు సయోధ్య కుదుర్చుకున్నాయి. రెండు అగ్రవర్ణాల మధ్య పరస్పర సహకారం ఉండాల్సిన అవసరాన్ని ప్రాచీన గ్రంథాలు తరచూ నొక్కి చెప్పాయి.

మార్క్సిస్టు చరిత్రకారుల అభిప్రాయం ప్రకారం క్రీ.శ. మూడవ శతాబ్దం ప్రాంతంలో ఒక తీవ్రమైన సామాజిక సంక్షోభం వైశ్య–సూద్ర సామాజిక నిర్మాణాన్ని విచ్ఛిన్నం చేసింది. స్థూలంగా వర్ణ వ్యవస్థే దెబ్బతింది. క్రీ.శ. మూడు, నాల్గవ శతాబ్దాలకు చెందిన పురాణాలలో కలియుగ వర్ణనలు కలిగిన భాగాలలో ఈ సంక్షోభం ప్రతిబింబిస్తుందని మార్క్సిస్టు చరిత్రకారులు చెబుతారు. దండ (దండన) ప్రాముఖ్యతను శాంతి పర్వంలో నొక్కి చెప్పడం, మహా గ్రంథాలలో అరాజక (అరాచక) వర్ణన కూడా అదే కాలానికి చెందినవి. అదే సామాజిక సంక్షోభాన్ని అవి ఎత్తి చూపి ఉంటాయి. వైశ్యులు, సూద్రులు తమ నిర్ధారిత ఉత్పత్తి విధులను నిర్వహించడానికి తిరస్కరించి ఉంటారు లేదా వైశ్య రైతులు పన్నులు చెల్లించడానికి నిరాకరించి ఉంటారు. మరోవైపు సూద్రులు శ్రమశక్తిని అందించడానికి నిరాకరించి ఉంటారు. ఈ కారణంగా సమాజం, రాజ్య నిర్వహణ అసాధ్యం కాకపోయినా కనీసం తీవ్ర కష్టాలను ఎదుర్కొని ఉంటుందని చెబుతారు. ఈ సంక్షోభం నుండి బయట పడేందుకు పాలకులు భూకేటాయింపుల సాంప్రదాయాన్ని పెద్ద ఎత్తున ప్రారంభించారు. పురోహితులు, అధికారులకు భూమి శిస్తును కట్టబెట్టి పన్నుల సేకరణ బాధ్యతను ప్రభుత్వం వదులుకుంది. క్రమంగా శాంతిభద్రతల పరిరక్షణ విధులను కూడా లబ్దిదారులకే బదిలీ చేసింది. రాజధాని లేదా మూల కేంద్రం తప్ప రాజ్యంలోని మిగతా భూభాగాల పాలనా వ్యవస్థ లబ్దిదారుల నియంత్రణలోకి వచ్చింది. ఈ సాంప్రదాయాన్ని వలస, వెనుకబడిన ప్రాంతాలు రెండింటికీ విస్తరించారు. ఈ భూకేటాయింపులు భౌతిక సంస్కృతి విస్తరణకు దారి తీశాయి. అలాగే స్థూలంగా వ్యవసాయోత్పత్తిని పెంచాయి.

ఈ ప్రక్రియలో అనేక మంది ఆదిమ రైతులు బ్రాహ్మణిక సమాజంలో ప్రవేశించి సూద్రులుగా గుర్తింపు పొందారు. ఫలితంగా సూద్రులను రైతులు, సాగుదారులుగా పిలవడం మొదలు పెట్టారు. సాధారణ బ్రాహ్మణులతోపాటు దిగువశ్రేణి పురోహితులు కూడా సూద్రుల సేవలు పొందే విధంగా సూద్రులకు వివిధ సంస్కారాలను, వ్రతాలను, తీర్థాలను (తీర్థయాత్ర) వర్తింప చేశారు. ఇప్పుడు ఆది గ్రంథాలు, పురాణాల పఠనాన్ని ఆలకించే అవకాశాన్ని సూద్రులకు కల్పించారు.

గుప్త, గుప్త–అనంతర కాలాలలో జాతులు అసంఖ్యాకంగా పుట్టుకొచ్చాయి. గిరిజన ప్రాంతాలలో భూకేటాయింపులు ఎక్కువగా జరగడం, ప్రతి తెగ హిందూ వ్యవస్థలో సూద్ర కులంగా స్థానం పొందడమే అందుకు కారణం. మనుస్మృతిలో సుమారు 51 జాతులు (కులాలు) మనకు కనిపిస్తాయి. అలాగే బ్రహ్మవైవర్త పురాణంలో వంద కంటే ఎక్కువ కులాలను పొందుపరిచారు.

గిరిజనులే ఎక్కువ సంఖ్యలో కులాలుగా ఏర్పడినా బ్రాహ్మణిక శాసనకర్తలు వారి మూలాలను ఆయా వర్ణాల మధ్య ఏర్పడిన వివాహ బంధంలో అన్వేషించి వారిని వర్ణ సంకర

లేదా మిశ్రమ జాతులని పిలిచారు. అలాగే తెగ నాయకులను, కొందరు విదేశీ ఆక్రమణదారులను బ్రాహ్మణిక సమాజంలో ద్వితీయ శ్రేణి క్షత్రియులుగా చేర్చుకున్నారు. గుప్త–అనంతర కాలంలో వీరు రాజ్‌పుత్రులుగా ప్రసిద్ధులయ్యారు. గుప్త, గుప్త–అనంతర కాలాలలో మరోసారి కులాలు వెల్లువలా పుట్టుకొచ్చాయి. అయితే వాటి స్వరూపం వేరుగా ఉండేది. వాణిజ్యం, పట్టణ ప్రాంతాల పతనంతో పెరుగుతున్న భూకేటాయింపులను ముడిపెట్టారు. స్థానిక అవసరాలను స్థానికంగానే తీర్చుకున్నారు. వృత్తిదారులు, వ్యాపారులు తమ చలనాన్ని కోల్పోయారు. ఫలితంగా వృత్తులు అనువంశికమయ్యాయి. వృత్తిపరమైన కులాలు ఏర్పడ్డాయి. ఆ విధంగా ప్రాచీన కాలం చివరలో జాతి లేదా కుల వ్యవస్థ అభివృద్ధికి అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయి.

**వర్ణ వ్యవస్థ నిర్వహణ**

వర్ణ సిద్ధాంతాన్ని అనేక మంది విద్వాంసులు చాలా వరకు సైద్ధాంతిక నమూనాగానే భావించారు. సమాజం యొక్క వాస్తవిక వర్ణనగా దానిని ఎప్పుడూ గుర్తించలేదు. ప్రాచీన భారత బ్రాహ్మణిక న్యాయ గ్రంథాల (ధర్మశాస్త్రాలు) నుండే వర్ణ సిద్ధాంతంపై మనకు ఎక్కువ సమాచారం లభిస్తుంది. వర్ణ సిద్ధాంతంపై ఈ గ్రంథాలలో ఉన్న వివరణలు చాలా వరకు పరస్పర విరుద్ధమైనవి. వాటికి ప్రామాణికత లేదు. ఇతర గ్రంథాలు పూర్తి భిన్నమైన వివరణలు అందిస్తాయి. వర్ణాల కోసం ఉపయోగించిన పదజాలానికి స్వంత ప్రయోజనాలు ఉన్నాయి. బ్రాహ్మణ, వైశ్య అనే పదాలను ప్రత్యేకమైన వృత్తులు నిర్వహించే వ్యక్తులను సూచించడానికి ఉపయోగించి ఉంటారు. అయితే రాజన్య (తదుపరి కాలంలో క్షత్రియ), సూద్ర అనే పదాలు గిరిజన నామకరణాలై ఉండవచ్చు. లేదా తెగల వర్గీకరణలై ఉండవచ్చు.

రాజన్య తెగ ఉనికిని ప్రాచీన సాహిత్య (పానిని రచించిన అష్టధ్యాయి), నాణేల సాక్ష్యాలు చాటి చెబుతాయి. రాచరిక కుటుంబ సభ్యుడు లేదా పాలక వర్గ సభ్యుడిని రాజన్య అనే వృత్తిదార పదం బహుశా మూలార్థానికి విస్తరణ అయి ఉంటుంది. అయితే సూద్రులను ఒక తెగతో గుర్తించడంలో ఎలాంటి సమస్య తలెత్తదు. ఎందుకంటే ఈ విషయాన్ని మహాభారతం, ఇండికా (మెగస్థనీస్), మహాభాష్య (పతంజలి), అనేక ఇతర పురాణాలలో స్పష్టంగా పేర్కొన్నారు. ఆర్యసమాజంతో పోలిస్తే ఈ తెగకు తక్కువ స్థాయి ఉండడంతోనే వారిని సూద్రుల వర్ణం కిందికి చేర్చి ఉంటారు. నిషాద, అభిర, మల్లలతో సూద్రులకు ఉన్న అనుబంధాన్ని బట్టి వారి తక్కువ స్థాయిని ఊహించవచ్చు.

మనుస్మృతిలో వర్ణ వృత్తుల వర్గీకరణ చాలా వరకు సైద్ధాంతికమేనన్న విషయాన్ని అనేక ధర్మశాస్త్రేతర గ్రంథాలు సూచిస్తాయి. వర్ణ సిద్ధాంతానికి పూర్తి విరుద్ధంగా ఈ గ్రంథాలు ఆయా వృత్తులను ఉల్లేఖిస్తాయి. వివాహ, కుటుంబ నియమాలు, అలాగే ఆర్థిక సంబంధాల వల్లే కులం మనుగడ సాగించింది. నాలుగు వర్ణాలు, అలాగే మిశ్రమ వర్ణాల మధ్య వ్యత్యాసాలు చాలా స్పష్టంగా, ప్రత్యేకంగా కొనసాగి ఉండాలంటే వర్ణ వ్యవస్థ ఆయా సామాజిక వర్గాల స్థూల స్థాయి స్వరూపంగా వ్యవహరించి ఉండాలి. అయితే ఆశ్చర్యకరంగా అలా జరగలేదు.

ఎందుకంటే ఒకవైపు బ్రాహ్మణులు, పంచమవర్ణ (అస్పృశ్యులు) వర్గీకరణ సాధారణంగా స్పష్టంగా ఉన్నా మరోవైపు ధర్మశాస్త్రాలలో సంకీర్ణ లేదా మిశ్రమ కులాల గురించి ఉన్న వ్యాఖ్యానాలు చాలా వరకు గందరగోళంగా కనిపిస్తాయి. అయితే వాటిని పూర్తిగా పరస్పర విరుద్ధమైనవిగా మాత్రం పరిగణించలేము.

అయితే ఈ మిశ్రమ వర్గాల గురించి బౌద్ధ పాలి గ్రంధాలలో స్పష్టమైన నిర్వచనం కనిపిస్తుంది. ఖత్తియ, బహమన, వెస్సా, సుద్ద అనే నాలుగు రకాల విభజన ఇక్కడ సామాజిక వర్గాల ఆధారంగా గుర్తించబడింది. కాని వాస్తవిక సామాజిక విభాగాలుగా కాదు. తొలి రెండు వర్గాలను వాస్తవిక సామాజిక విభాగాలతో గుర్తించవచ్చు. అయితే చివరి రెండు వర్గాలు అసంపూర్ణంగా ఉన్నాయి. కాని ఈ సాహిత్యం ఆధారంగా సమాజంలో చతుర్వర్ణాలు ఉన్నత, దిగువ శ్రేణి వర్గాలుగా విభజించబడి ఉండేవని పేర్కొనవచ్చు (ఉక్కత్థజాతి, హీనజాతి). ఉన్నత జాతిలో ఖత్తియ, బహమన, గహపతిలు ఉండేవారని పాలి గ్రంధాలలో పేర్కొన్నారు. ఖత్తియ అనే పదాన్ని సాధారణంగా పాలక వర్గ కుటుంబాలకు ఉపయోగిస్తారు. సక్యులు, మల్లాలు, లిచ్ఛవీలు ఈ కోవ కిందికి వస్తారు. బహమన అనే పదం బ్రాహ్మణుడిని స్పష్టంగా గుర్తిస్తుంది. గహపతి అనే పదం ధనిక గృహస్తుని సూచిస్తుంది. ఇక్కడ సామాజిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని గహపతి అనే పదాన్ని ఉపయోగించారు. కాని అతడు వాస్తవిక సామాజిక విభాగ సభ్యుడు కాదు.

కేవలం క్షత్రియ వర్ణానికే అధికార కాంక్ష పూర్తిగా పరిమితమై ఉండేది కాదన్న విషయం విస్పష్టం. ఈ కారణంగా కొంత మినహాయింపు ఇవ్వాల్సి ఉంటుంది. క్షత్రియేతర మూలాలున్న పాలకుడు చట్టబద్ధతను కోరి తన క్షత్రియ జన్మను ప్రకటించుకొని తగిన రాచరిక వారసత్వాన్ని పొందాల్సి ఉంటుంది. ఇలాంటి ఏర్పాటే పైన పేర్కొన్న మినహాయింపు. ఆ విధంగా సిద్ధాంతపరంగా రాజత్వం క్షత్రియుని ప్రత్యేక హక్కు అయినప్పటికీ ఆచరణలో ఆ పదవిని క్షత్రియేతరులు అనేక సందర్భాలలో నిర్వహించారు.

సాంప్రదాయబద్ధమైన హోదాకు అమిత ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా బ్రాహ్మణ–క్షత్రియ అనుబంధాన్ని పరిరక్షించారు. అయితే ఈ కార్యనిర్వాహక సంబంధం లేదా ఏర్పాటు ఒక కొలిక్కి రావడానికి అనేక శతాబ్దాలు పట్టింది. గుప్త యుగం వరకు అది ఏ విధంగానూ ఆచరణ రూపం దాల్చలేదు.

క్షత్రియ హోదా నిర్ధారణ మౌలికంగా తగిన, చట్టబద్ధమైన వంశ చరిత్రను సంతరించుకునేందుకు జరిగిన ప్రయత్నమే. హోదా నిర్ధారణకు సంబంధించి పురాణాలలో ఒక ప్రధాన నిదర్శనం ఉంది. గుప్త యుగంలో రచించబడిన విష్ణు పురాణంలో పురాణ కాలం నుండి హుణుల రాక వరకు ఉత్తర భారతదేశాన్ని పాలించిన రాజులు, వారి వంశాల జాబితాను పొందుపరిచారు. తొలి రాచరిక వంశాలను రెండు ప్రధాన వర్గాలుగా విభజించారు. సూర్యవంశీయులు, చంద్ర వంశీయులకు ఒక ఉమ్మడి పూర్వీకుడు ఉన్నాడు. అతడు మనువుకు జన్మించిన గంధర్వ కుమారుడు.

మూడు ద్విజ కులాలలో బ్రాహ్మణుడు ఒక నిర్దిష్టమైన సామాజిక వర్గానికి చెందిన వాడిగా స్పష్టమైన గుర్తింపు పొందాడని పై చర్చ ద్వారా మనకు అవగతమవుతుంది. బౌద్ధ సాహిత్యంలో ఖత్తియగా గుర్తించబడ్డ క్షత్రియులు బుద్ధుని కాలంలో ప్రత్యేకమైన గుర్తింపును కలిగి ఉండేవారు. వైశ్యులు కూడా ప్రత్యేక గుర్తింపును సాధించారు. సిద్ధాంతపరంగా అందరికీ తెలిసినా తమను తాము వైశ్యులుగా పరిగణించిన వర్గాలను గుర్తించడం చాలా కష్టం. అయితే వైశ్య కులం యొక్క సైద్ధాంతిక విధులలో అనుసంధానం చేయగల కులాలు, వృత్తులు పెద్ద సంఖ్యలోనే ఉన్నాయి. ప్రాచీన భారత సామాజిక నిర్మాణంలో సంభవించిన మార్పులను పరిశోధన చేయడంలో వర్ణ–ఆధారిత సమాజ అభివృద్ధికి దారి తీసిన కారకాలను ప్రాథమికంగా పరిగణనలోకి తీసుకోవలసి ఉంటుంది. అయితే వర్ణ వ్యవస్థ యొక్క సైద్ధాంతిక నమూనాను ఆచరణలో నిర్దిష్టంగా అమలు చేయలేకపోయారు. ఎందుకంటే అలాంటి నమూనా సవ్యంగా పని చేయాలంటే "కదలిక లేని" లేదా "నిస్తేజమైన" సమాజం అవసరం.

### ఆశ్రమాలు - జీవన దశలు

**అర్థము–పరిధి :** ఆశ్రమాలనేవి నాలుగు జీవన దశలు. వాటిని ఒక్కొక్కటిగా పూర్తి చేస్తూ మానవుడు మోక్షాన్ని పొందగలడని ఉల్లేఖించారు. తీవ్ర కృషి, స్వీయ క్రమశిక్షణ ద్వారా ఈ నాలుగు దశలను పూర్తి చేసుకునే వ్యక్తి తనను తాను దైవానికి అర్పించుకుంటాడు. తొలి దశ బ్రహ్మచారి (విద్యార్థి దశ). ఈ దశలో బ్రహ్మచారి వేదాలను అధ్యయనం చేసి ఆధ్యాత్మిక విషయాలలో పరిపక్వత సాధించాలి. సాత్విక, లౌకిక జీవితాన్ని గడపడం బ్రహ్మచారుల ప్రత్యేక లక్షణాలు. తర్వాతి దశ గృహస్త లేదా కుటుంబ జీవితం. ఈ దశలో వ్యక్తి తన కుటుంబాన్ని ఏర్పరచి సంతానాన్ని పుట్టించాలి. ఆధ్యాత్మిక ఎదుగుదలకు గృహస్త జీవనంలో ప్రతికూల వాతావరణం ఉన్న కారణంగా ఈ దశను అత్యంత కఠినమైనదిగా భావిస్తారు. అయితే విద్యార్థి, గృహస్త దశల విధులను మనస్ఫూర్తిగా నిర్వహిస్తే ఆ వ్యక్తి తన తుది లక్ష్యం వైపు బయల్దేరతాడు. చందోగ్య ఉపనిషద్‌లో పేర్కొన్నట్లు పునర్జన్మ పొందే అవకాశాల బారి నుండి తప్పించుకుంటారు.

వయస్సు పైబడే కొద్దీ గృహస్తుడు ఇంటి వద్ద స్థిర జీవనం యొక్క సుఖాలను త్యజించడానికి సిద్ధంగా ఉండాలి. భౌతిక ప్రపంచం నుండి విశ్రాంతి తీసుకొని అన్ని ఐహిక ఆకాంక్షలను వదులుకోవాలి. ముఖ్యంగా సంతానం, ఆస్తి, ప్రాపంచిక సుఖాలు పొందాలన్న ఆకాంక్షలను త్యజించాలని బృహదారణ్యక ఉపనిషత్తు పేర్కొంది. అతడు జనబాహుళ్యం ఉన్న ప్రాంతాలను విడిచి వానప్రస్థగా మారతాడు. ఆత్మను శుద్ధి చేసుకునేందుకు అతడు తన శరీరాన్ని శిక్షిస్తాడు. తన జీవిత చరమాంకంలో పురుషుడు నాల్గవ దశలోకి అడుగు పెడతాడు. ఉన్నత లక్ష్యాన్ని సాధించడానికి చివరి మరియు నిర్దిష్టమైన మార్గాలను ఈ దశ అందిస్తుంది. జీవన పరమార్థం తెలుసుకోవడానికి, జనన, మరణ బంధం నుండి విముక్తి కావడానికి తోడ్పడుతుంది. జీవితం యొక్క ఉన్నతాశయాన్ని తెలుసుకోవడంలో పురుషుడు పూర్తిగా నిమగ్నమవుతాడు.

యతి లేదా సన్యాసి అనే తుది దశ కేవలం బ్రాహ్మణుడికి మాత్రమే పరిమితమని వైఖనాశ ధర్మసూత్రం చెబుతుంది. స్వీయ తృణీకరణ, క్రమశిక్షణ విషయంలో ఇతరుల కంటే బ్రాహ్మణుడే తీవ్ర కృషి జరపగలడని పేర్కొంది. వానప్రస్థంతో ముగిసే మూడు దశలు క్షత్రియునికి తప్పనిసరి. తన విధుల స్వరూపం, జీవితంలో స్థిరత్వంవల్ల క్షత్రియునికి ప్రాపంచిక సుఖాల, అధికారంపై ఎనలేని మోహం ఉంటుంది. కనక నాల్గవ దశ క్షత్రియులకు మరీ కష్టతరంగా ఉండగలదు. జీవితాన్ని ఆర్థికకోణం నుండి చూస్తే వైశ్యుడు వృద్ధాప్యంలో ప్రాపంచిక సుఖాలను త్యజించడం కష్టమని గ్రహించాడు. అందుకే తొలి రెండు ఆశ్రమాలను మాత్రమే అతడికి వర్తింపచేశాడు. వేదాలను అధ్యయనం చేయాల్సిన అవసరం లేకపోవడంతో సూద్రునికి గృహస్త జీవితం తప్ప మరొకటి తెలియదు.

**చారిత్రక నేపథ్యం :**

రుగ్వేదంలో ఆశ్రమ దశలను ఆ విధంగా పేర్కొన లేదు కాని విద్యార్థి, గృహస్త, సన్యాసి సంస్థల గురించి ముందుగానే వివరణ ఉంది. తొలి ఉపనిషత్తులలో అలాంటి దశలే కనిపిస్తాయి. అయితే ఆశ్రమాలు నిర్దిష్టమైన స్వరూపాన్ని సంతరించుకుంటున్న దశను వాటిలో మనం గ్రహంచగలము. కల్పసూత్రాలను రచించే నాటికి ఉపనిషద్‌లలో పరిణామ దశలో ఉన్న జీవన దశల వ్యవస్థ పూర్తిగా క్రియాశీలమైంది. మోక్షాన్ని అందుకునే దారిలో ఎన్ని కష్టాలున్నప్పటికీ జీవన దశలను పూర్తి చేయాలన్న కాంక్ష ప్రజలలో బాగా బలపడింది. వ్యక్తులు స్వచ్ఛందంగా ఆశ్రమాలను పాటించారని బోధపడుతోంది. అయితే ఈ విషయంలో నాలుగు వర్ణాలకు వేర్వేరుగా ప్రతిపాదించిన నియమాలను పూర్తిగా పాటించలేదు. వాస్తవానికి కొందరు సామాజిక శాసనకర్తల ప్రకారం విద్యార్థి విధులను పూర్తి చేసిన తర్వాత ఒక వ్యక్తి ఏ ఆశ్రమాన్ని అయినా స్వచ్ఛందంగా ఎంపిక చేసుకోవచ్చు. ఆ విధంగా ఒక విద్యార్థి జీవిత కాలమంతా తన స్వంత ఆశ్రమంలో శాశ్వత, ప్రకటిత విద్యార్థిగా (నైష్టిక బ్రహ్మచారి) కొనసాగవచ్చు లేదా గృహస్తుగా మారవచ్చు. అలాగే వానప్రస్థ లేదా సన్యాస జీవితాన్ని ఎంచుకోవచ్చు.

నిర్ధారిత దశలను పూర్తి చేయని వారిని సన్యాస దశలోకి విచక్షణారహితంగా అనుమతించడంతో అర్హులు కాని అనేక మంది అందులో చేరే అవకాశం ఉండేది. తమ అసమగ్ర క్రమశిక్షణ కారణంగా అలాంటి వ్యక్తులు సన్యాసులుగా జీవించడానికి పనికిరారు. అందుకే సామాజిక శాసనకర్తలు ఇలాంటి విపరీత పోకడ సమాజ ఆరోగ్యాన్ని సాధారణంగా దెబ్బతీసే అవకాశం ఉందని గ్రహించారు. స్థూల సామాజిక నిర్మాణం యొక్క ఆర్థిక పునాదులు కదలించగలదని ఆందోళన చెందారు. ఫలితంగా వారు ఆశ్రమ క్రమపద్ధతిని పాటించాలని ప్రజలకు హితవు పలికారు. యావత్తు సామాజిక మనుగడకు గృహస్త జీవితమే ప్రధాన ఆధారమని నొక్కి చెప్పారు. వివిధ ఆశ్రమ దశల స్వచ్ఛతను దెబ్బతీసే వారికి కఠినమైన శిక్షలను నిర్ధారించారు. ముఖ్యంగా బ్రహ్మచారి, వానప్రస్థ, సన్యాసి ఆశ్రమాల పవిత్రతను, ప్రామాణికాన్ని కాపాడాలని ఆదేశించారు. చివరగా, సన్యాస ఆశ్రమంలో ఒక వ్యక్తి ప్రవేశించడం అంతగా అవసరం లేదని, గృహస్త జీవితంలో ఉంటూనే ప్రాపంచిక సుఖాలను త్యజిస్తే మోక్షం

లభించగలదని పేర్కొన్నారు. సంతానాన్ని పుట్టించి తనతల్లిదండ్రుల రుణం తీర్చుకోకుండానే సన్యాస జీవితాన్ని కోరుకునే వాడు జీవితమనే నిచ్చెన నుండి జారి పడతాడని మను ధర్మ సూత్రాల కంటే ఒక అడుగు ముందుకు వేసి ప్రకటించాడు. తుది లక్ష్యానికి చేరువ కావడానికి బదులు మోక్ష పథం నుండి పూర్తిగా తప్పిపోతాడని హెచ్చరించాడు.

**సంస్కారాలు**

**అర్థం – పరిధి :** హిందూ సంస్కారాలు కేవలం దేహశుద్ధికి ఉద్దేశించినవి మాత్రమే కాదు. ఒక వ్యక్తి యొక్క సంపూర్ణ వ్యక్తిత్వాన్ని పరిశుద్ధం చేసి, సానబెట్టి, పరిపూర్ణం చేసి అతడిలో ఒక ప్రత్యేక సామర్ధ్యాన్ని కూడా కలిగిస్తాయి. కర్మకాండలో సంస్కారాలు ముఖ్య విభాగంగా ఉన్నాయి. తల్లి కడుపులో జీవితాన్ని ప్రారంభించినప్పటి నుండి మరణం తర్వాత అంత్యక్రియలు నిర్వహించేంత వరకు జీవితంలోని ఆయా సందర్భాలలో సంస్కారాలను నిర్వహిస్తారు. మరణం తర్వాత కూడా వాటికి ప్రాముఖ్యత లేదా ప్రభావం ఉంది. ఎందుకంటే ఆత్మ యొక్క దిశను అవి నిర్దేశిస్తాయి.

గృహ సూత్రాలలో సంస్కారాలను వివరించే ప్రయత్నం తొలిగా జరిగింది. అయితే ఈ సూత్రాలలో సాధారణ బలిపూజలు, సంస్కారాల మధ్య స్పష్టమైన విభజన రేఖ కనిపించదు. వైఖనాశ సూత్రాలలోనే సంస్కారాలు, బలిదానాల మధ్య స్పష్టమైన విభజనను అందించారు. ప్రత్యేకంగా ఉల్లేఖించబడిన 22 బలిదానాలను శారీరక సంస్కారాల జాబితాలో కూడా చేర్చారు. అయితే నిజంగా చెప్పాలంటే ఈ బలిదానాలు రోజువారీ, సందర్భ సహిత బలిదానాలే.

సాధారణంగా గృహసూత్రాలు శారీరక సంస్కారాలను ఎక్కువగా ప్రస్తావించాయి. వివాహం మొదలుకొని సమవర్తనంతో ముగిసే సంస్కారాలను వాటిలో ప్రతిపాదించారు. అనేక గృహ సూత్రాల నుండి అంత్యేష్టిని (అంత్యక్రియలు) మినహాయించారు. మృత శరీరానికి ఉండే కాలుష్యం, అపవిత్రత కారణంగానే అంత్యేష్టిని ప్రస్తావించి ఉండరు. అయితే పరాస్కర, అశ్వలయన, బౌద్ధయానల గృహ సూత్రాలలో అంత్యేష్టిని సూచించే భాగాలు ఉన్నాయి. గృహ సూత్రాలలో సంస్కారాల సంఖ్య 12 నుండి 18 వరకు ఉంది. కాలక్రమంలో 16 సంస్కారాలు ప్రామాణిక సంఖ్యగా నిలిచిపోయాయి.

1. గర్భదాన
2. పుంశావన
3. సీమంతోన్నయన
4. జటకర్మ
5. నామకరణ
6. నిష్క్రమణ

7. అన్నప్రాసన
8. చుడకరణ
9. కర్ణవేధ
10. విద్యారంభ లేదా అక్షరారంభ
11. ఉపనయన
12. వేదారంభ
13. కేశాంత
14. సంవర్తన
15. వివాహ
16. అంత్యేష్టి

**సంస్కారాల ఉద్దేశ్యం :**

పరిణత లేని మెదడు మత విశ్వాసాన్ని ఎలాంటి ప్రశ్నలు సంధించకుండా అలాగే ఆమోదిస్తుంది. ఇలాంటి ఆమోదం ఆధారంగానే తొలుత సంస్కారాలు అభివృద్ధి చెందాయి. అందుకే వాటికి జనరంజకమైన ప్రాముఖ్యత ఉంది. హిందువులు సాధారణంగా తమ చుట్టూ అద్భుత శక్తులు ప్రభావాలు (మంచివి, చెడూ) ఉన్నాయని విశ్వసిస్తారు. దుష్టప్రభావాలను తొలగించడానికి అనేక మార్గాలను అన్వేషించి వాటిలో ప్రయోజనకరమైన వాటిని తగిన సమయంలో సహాయం తీసుకోవడానికి ఉపయోగించారు. దుష్ట ప్రభావాలను తొలగించుకోవడానికి ఎంచుకున్న మార్గాలలో మొదటిది మొక్కు. ప్రతికూల శక్తిని శాంతపరిస్తే (పూజలు, మొక్కులతో) సంస్కారంతో పరిశుద్ధుడైన వ్యక్తికి హాని తలపెట్టకుండానే వెనుదిరిగి వెళుతుంది. రెండవ మార్గం మోసం. దుష్టశక్తులు వెంటాడుతున్నప్పుడు ఒక వ్యక్తిని వాటి నుండి దాచిపెట్టడమో లేదా అతడి స్థానంలో మరో వ్యక్తికి అందించడమో చేస్తారు. మూడవ మార్గం హెచ్చరిక, ప్రత్యక్ష దాడికి దిగడం. పైన పేర్కొన్న రెండు మార్గాలు విఫలమైనప్పుడే ఈ మార్గాన్ని అనుసరిస్తారు. స్వయంగా బాధిత వ్యక్తి కాని అతడి పక్షాన ఒక అధికారిక ప్రతినిధి కాని ఈ మార్గాన్ని ఎంచుకుంటారు. సంస్కారాలను అందుకునే వ్యక్తి దరికి దుష్ట ప్రభావాలు చేరకుండా దేవతలను కూడా పూజించేవారు. వ్యతిరేక శక్తులను తెగనాడినట్లే అనుకూల ప్రభావాలను ఆకర్షించడానికి, వాటిని స్వంత లబ్ది కోసం ఆహ్వానించడానికి ప్రజలు అనేక చర్యలు తీసుకునే వారు.

సమాజ పరిణామక్రమాన్ని నిర్దేశించిన సాంస్కృతిక లక్ష్యాలలో సంస్కారాలకు భాగం ఉంది. ఏ విధంగా అంటే సంస్కారాలకు బలిదానాలు, పూజలను నిర్వహించడంలో, గృహస్త సంక్షేమాన్ని నిర్ధారించడంలో విశిష్టమైన పాత్ర ఉంది. పశువుల సేకరణ, సంతానం, దీర్ఘకాల

జీవితం, సంపద, సౌభాగ్యం, బలం, మేధోపరమైన పరిణతను అవి తెచ్చిపెడతాయి. మూడవది, సంస్కారాల నిర్వహణ వ్యక్తిత్వాన్ని చాటుకునే లక్ష్యాన్ని పూర్తి చేస్తుంది. గృహస్తుడు తన సుఖసంతోషాలను, సత్కారాలను, చివరికి దుఃఖాలను (అంత్యక్రియలు) వ్యక్తీకరిం చేందుకు కూడా సంస్కారాలను నిర్వహించాడు. నాల్గవది, మతాధిపతులు, శాసనకర్తల ప్రకారం సంస్కారాలు ఒక వ్యక్తి జీవితానికి ఉన్నతమైన మతపరకీర్తిని కూడా అందిస్తాయి. భౌతిక దేహంతో ముడిపడి ఉన్న కాలుష్యాన్ని సంస్కారాలను నిర్వహించడం ద్వారా దూరం చేస్తారు. శరీరం మొత్తం పరిశుద్ధమవుతుంది, ఆత్మకు నివాసయోగ్యంగా మారుతుంది.

మనిషి సూద్రునిగానే జన్మిస్తాడని ఒక సిద్ధాంతం చెబుతుంది. సంస్కారాల నిర్వహణ ద్వారా అతడు ద్విజగా మారతాడు. వేదాలను నేర్చుకోవడం ద్వారా అతడు విప్ర (స్ఫూర్తి పొందిన కవి)గా మారతాడు. బ్రహ్మత్వాన్ని (సృష్టికర్త) సంతరించుకోవడం ద్వారా అతడు బ్రాహ్మణుడవుతాడు. అయితే సంస్కారాలు తమంతకు తామే పరిష్కారాలు కావు. నైతిక సద్గుణాలను పెంపొందించడానికి వాటిని నిర్వహించారు. సంస్కారాలను నిర్వహించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పిన గౌతమ ఒక విషయాన్ని మాత్రం స్పష్టం చేశాడు. ఆత్మగుణ సంపన్నుడు కానిదే ఒక వ్యక్తిని సంస్కారాలు మోక్షం వైపు నడిపించలేవని పేర్కొన్నాడు. అందుకే జీవితంలోని వివిధ దశలలో నిర్వహించే వేర్వేరు సంస్కారాలకు తగిన నియమాలను విపులంగా నిర్ధారించారు.

## గర్భధారణ సంస్కారాలు :

ఒక వ్యక్తి జీవితం అతడి జననంతోనే ప్రారంభం కాదు. అది ఇంకా వెనక్కి వెళుతుంది. ఎందుకంటే దానిని మాతృత్వం, వారసత్వం, వాతావరణం తీర్చిదిద్దుతుంది. కనక జీవితం యొక్క సంస్కరణ గర్భధారణతో మొదలవుతుంది. ఆ కారణంగానే తొట్టతొలి సంస్కారాన్ని "గర్భదాన" అని పిలిచారు. అంటే అండాశయంలో విత్తనాన్ని ఉంచడమని అర్థం. సంతానం కోసం తగిన సమయంలో కలుసుకోవడం నవదంపతుల పవిత్ర కర్తవ్యం. ఆ విధంగా వారు జాతిని కొనసాగించాలి. సంతానాన్ని కనడం పూర్వీకుల రుణాన్ని తీర్చుకోవడానికి ఒక అవసరంగా పరిగణించేవారు. ఈ సూత్రాన్ని పాటించడంలో విఫలమైతే దానిని పాపకార్యంగా భావించేవారు.

గర్భధారణను నిర్ధారించాక కడుపులోని బిడ్డను పుంశావన అనే రెండవ సంస్కారంతో పరిపూర్ణుడిని చేస్తారు. గర్భవతిని అన్ని విధాలా చూసుకోవడం ద్వారా బిడ్డను ప్రభావితం చేయడం అవసరమని భావించారు. అందుకే గర్భవతిని వైద్యపరంగా, మానసికంగా సంరక్షించాలని నిర్దేశించారు. మూడు లేదా నాల్గవ నెలలో పుంశావనను నిర్వహిస్తారు లేదా తిస్య నక్షత్రలో చంద్రుడు ఉన్నప్పుడు ఆ సంస్కారాన్ని చేపడతారు. ఆ రోజు గర్భవతి ఉపవాసాన్ని పాటించాల్సి ఉంటుంది. రాత్రి మర్రిచెట్టు ఊడలను దంచి రసం తయారు చేస్తారు. ఆ రసాన్ని గర్భవతి కుడి నాసిక నాళంలో పోస్తూ హిరణ్య గర్భతో మొదలుకొని కొన్ని వచనాలను పఠిస్తారు.

మూడవ సంస్కారాన్ని సీమంతోన్నయన అని పిలుస్తారు. అందులో భాగంగా గర్భవతి కేశాలను కర్మకాండయుతంగా సవరిస్తారు. ఈ సంస్కారం యొక్క ఉద్దేశ్యం ప్రతీకాత్మకమైనది, ఆచరణ బద్ధమైనది. ఒక మహిళ గర్భవతి అయినప్పుడు ఆమెపై దుష్టశక్తులు దాడి చేస్తాయని విశ్వసిస్తారు. అందుకే ఆమె సంరక్షణ కోసం తగిన పూజలను నిర్వహిస్తారు.

ఈ సంస్కారాన్ని ప్రారంభించడానికి హిందువులకు ఉన్న దేహపరమైన పరిజ్ఞానం కూడా ఒక కారణమని చెప్పవచ్చు. ఐదవ నెల నుండి శిశువు యొక్క మానసిక నిర్మాణం మొదలవుతుంది. అందుకే గర్భవతి అత్యంత జాగ్రత్తగా మసలు కోవలసి ఉంటుంది. భౌతిక లేదా మానిసిక క్షోభకు దూరంగా ఉండాల్సి ఉంటుంది. "దోహద"కు ఈ నియమాలలో ఒకటి వర్తిస్తుంది. అంటే గర్భవతి కోరికలను తీర్చాల్సి ఉంటుంది.

**బాల్యదశ సంస్కారాలు :**

బాల్యజీవితంలో రెండవ దశ కాన్పుతో మొదలవుతుంది. కాన్పు తర్వాత శిశువు స్వతంత్ర వ్యక్తిత్వాన్ని సంతరించుకుంటుంది. ఈ సందర్భాన్ని సంబరంగా జరుపుకుంటారు. కొత్తగా జన్మించిన శిశువును తగిన సంస్కారాలతో పరిశుద్ధం చేస్తారు. తల్లిబిడ్డల సంక్షేమం కోసం తగిన పూజలు నిర్వహిస్తారు. జటకర్మన్ అనే పూజలో అనేక వస్తువులను ఉపయోగిస్తారు. సాధారణంగా దానిని నాభినాళాన్ని తెంపే సమయంలో నిర్వహిస్తారు. తొలి వస్తువు మేధజనన, రెండవది ఆయుష్య, మూడవది శక్తి. తర్వాత నాభినాళాన్ని కత్తిరించి శిశువును నీటితో శుభ్రం చేస్తారు. తల్లి రొమ్మును పీల్చే అవకాశాన్ని తర్వాత కల్పిస్తారు.

తర్వాత నామకరణ ఉత్సవం వస్తుంది. వేరే ఇతర ప్రతిపాదికలు ఉన్నా సాధారణంగా మతపరమైన సిద్ధాంతాలతో సంబంధం గల పేరును శిశువుకు పెడతారు. నామకరణ నిర్ధారణను గృహ్యా సూత్రాలు చర్చిస్తాయి. నాలుగు దశల నామకరణాన్ని సూచించారు. మొదటిది నక్షత్రం, రెండవది పుట్టిన నెలకు సంబంధించిన దైవం, మూడవది కుటుంబ దైవాన్ని అనుసరించి, నాల్గవది జనప్రియమైన పిలుపు. నాల్గవ నామం కుటుంబం యొక్క సంస్కృతి, విద్యాభ్యాసంపై ఆధారపడి ఉంటుంది. అది పవిత్రంగా, ప్రాధాన్యత కలదిగా ఉండాలని ఆకాంక్షిస్తారు.

అయితే సంతానం ఆలస్యంగా కలిగితే లేదా అనేక శిశువుల మరణం తర్వాత జన్మిస్తే ఒక విచిత్రమైన లేదా వెగటు పుట్టించే పేరును పెట్టేవారు. ఆ విధంగా శిశువు దరికి వ్యాధి లేదా అకాల మృత్యువు చేరకుండా కాపాడుకునేవారు. సాధారణంగా శిశువు జన్మించిన 10 లేదా 12వ రోజు నామకరణం జరుపుతారు.

శిశువును తొలిసారి ఇంటి బయటికి తీసుకెళితే దానిని నిష్క్రమణ అని పిలిచేవారు. తొలి దశలో శిశువును శయనమందిరానికే పరిమితం చేస్తారు. అటు తర్వాత అతడు జన్మించిన ఇంటికి తీసుకెళతారు. అయితే ఒకటి లేదా రెండు మాసాలలోపే శిశువుకు ఆ ఇల్లు కూడా సరిపోదని గ్రహిస్తారు. అందుకే దానిని బయటి ప్రపంచంలోకి తీసుకువస్తారు. ఈ దశలోనే

నిష్క్రమణ సంస్కారాన్ని నిర్వహిస్తారు. కాని ఇంటి బయట జీవితం ప్రకృతి, అతీంద్రియ శక్తుల నుండి సురక్షితంగా ఉండదు. కనక భౌతిక, మతపరమైన అనేక ముందు జాగ్రత్త చర్యలను తీసుకొని శిశువును సంరక్షిస్తారు.

ఘనీకృత ఆహారాన్ని తొలిసారిగా పిల్లవాడికి వడ్డించినప్పుడు అన్న ప్రాసన నిర్వహిస్తారు. ఈ సంస్కారం సాధారణంగా పిల్లవాడి భౌతిక అవసరానికి సంబంధించినది. సుశృత ఈ వాస్తవాన్ని నొక్కి చెబుతాడు. ఆరు నెలలు దాటిన పిల్లవానికి స్తనపోషణ మాన్పించి పెరుగుదలకు తగిన ఆహారాన్ని అందించాలని సుశృతుడు ప్రతిపాదించాడు. చూడకరణ (ముండనం) ఎనిమిదవ సంస్కారం. సుదీర్ఘ జీవితం, సౌందర్యం కోసం దీనిని నిర్వహిస్తారు. ముండనంతో జీవిత కాలం పెరుగుతుంది. అలా చేయకపోతే ఆయుష్షు తగ్గుతుంది. అందుకే ఎట్టి పరిస్థితులలోను ఈ సంస్కారాన్ని నిర్వహించవలసి ఉంటుంది. గృహ్యసూత్రాల ప్రకారం చూడకరణ ఉత్సవం పిల్లవాడి తొలి సంవత్సరం చివరలో లేదా మూడేళ్లలోపు జరపాలి. అయితే తదుపరి కాలంలో మత శాసనకర్తలు ఈ వ్యవధిని ఏడేళ్లకు పెంచారు. చూడకరణ అనే పేరు సూచించినట్లు పిల్లవాడి కేశాలను(శిఖ) కొప్పుగా తీర్చిదిద్దుతారు. కాలక్రమంలో శిఖ హిందూమత చిహ్నంగా అభివృద్ధి చెందింది. చెవులను కుట్టే కార్యక్రమాన్ని కర్ణవేధ అంటారు. బాలబాలికలకు ఒకటి నుండి నాలుగు సంవత్సరాల లోపు ఈ సంస్కారాన్ని నిర్వహిస్తారు. చెవులను కుట్టడం ఒక ఆచారం. తొలుత ఇది అలంకారప్రాయంగా ఉండేది. అయితే తదుపరి కాలంలో ఆరోగ్యానికి ఇది చాలా మంచిదని గ్రహించారు. ఈ ప్రాముఖ్యతను నొక్కి చెప్పేందుకు దానికి మతపరమైన అనుమతి ఇచ్చి ఉంటారు. ఏ కులానికి ఏ రకమైన సూది వాడాలో కూడా ప్రతిపాదించారు. క్షత్రియులకు బంగారు, బ్రాహ్మణ, వైశ్య పిల్లలకు వెండి సూదిని ఉపయోగించారు. కర్ణవేధకు మతపరమైన ప్రాముఖ్యత ఏర్పడినప్పుడు శిఖను ఉంచుకోవడం లాగా అది కూడా తప్పనిసరి కార్యమైంది. మధ్యయుగ స్మృతి రచయిత అయిన దేవల హెచ్చరిక ప్రకారం కర్ణవేధ లేని బ్రాహ్మణుడు ఎదురుపడితే అంతవరకూ కూడగట్టుకున్న సామర్థ్యం అంతా కరిగిపోతుంది.

**విద్యా సంస్కారాలు :**

విద్యారంభ లేదా అక్షరారంభ పదవ సంస్కారం. పిల్లల చదువుకు అది నాంది పలుకుతుంది. అంటే అప్పటి నుండి అక్షరాభ్యాసం మొదలవుతుంది. బాలుని మెదడు అభివృద్ధి చెందినపుడు చేయాల్సిన తొలి కార్యం అతడికి అక్షరాలను నేర్పడమే. అక్షరాభ్యాసం అప్పటికి అత్యంత అభివృద్ధి చెందిన విద్యా మాధ్యమం. ఈ సంస్కారాన్ని అక్షరారంభ లేదా అక్షరలేఖన అని కూడా పిలుస్తారు. ఈ సంస్కారంను బాలుని ఐదవ ఏట జరుపుతారు. అయితే విశ్వామిత్రుని ప్రకారం ఈ సంస్కారాన్ని ఏడేళ్ల వరకు పొడిగించవచ్చు. మరికొందరు విద్వాంసులు ఈ సంస్కారాన్ని చూడకరణ జరిపిన వెంటనే నిర్వహించాలని సూచించారు.

ఉపనయన అనే సంస్కార బాలుడిని విద్యాభ్యాసం కోసం ఉపాధ్యాయుని వద్దకు తీసుకెళ్లడంతో ముడిపడి ఉంది. సాంస్కృతిక కోణం నుండి చూస్తే ఇది అత్యంత ముఖ్యమైన సంస్కారం. విద్యారంభను ప్రాథమిక విద్య ప్రారంభంగా పరిగణించవచ్చు. ఉపనయన ఉన్నత విద్య ప్రారంభాన్ని సూచిస్తుంది. ఉపనయన నిర్వహణతో విద్యార్థి సాంస్కృతిక, ఆధ్యాత్మిక పునర్జన్మ పొందుతాడన్న నమ్మకం ఇక్కడ ముఖ్యమైన లక్షణంగా ఉంది. శిశువు భౌతిక జననం పాశవికతతో ముడిపడి ఉంది. అయితే క్రమశిక్షణ, విద్య ద్వారా లభించే పునర్జన్మను ఉన్నతమైనదిగా, పవిత్రమైనదిగా పరిగణిస్తారు. ఈ సంస్కారంతో ముడిపడి ఉన్న తొలి విషయం గ్రహీత వయస్సు. బాలుడి సామాజికహోదా, వృత్తిపరమైన అవసరాలను బట్టి ఈ వయస్సును నిర్ధారిస్తారు. బ్రాహ్మణుడు తన ఎనిమిదవ ఏట ఉపనయనాన్ని స్వీకరిస్తాడు. క్షత్రియుడు 11 ఏళ్లకు, వైశ్యుడు 12 ఏళ్లకు ఈ సంస్కారాన్ని పొందుతాడు. ఉపనయన నిర్వహణకు గరిష్ట గడువును బ్రాహ్మణులకు 16 ఏళ్లు, క్షత్రియులకు 22, వైశ్యులకు 24 ఏళ్లుగా నిర్ధారించారు. కాలక్రమంలో యజ్ఞోపవీత (పవిత్రమైన తాడు) ఈ సంస్కారంలో ముఖ్యమైన అంశంగా మారింది.

సంస్కారాల జాబితాలో వేదారంభ (వేద పఠనం) 13వ స్థానంలో ఉంది. ఈ సంస్కారంతోపాటు తదుపరి ఆచారాన్ని తొలి సంస్కారాల జాబితాలో ప్రస్తావించలేదు. అంటే అవి ధర్మసూత్రాలలో అంతర్భాగంగా ఉండేవి కావు. ఉన్నత విద్యాభ్యాసానికి ఉపనయనం నాందీవాచకంగా ఉన్న అది వేదాల అధ్యయనంతో ముడిపడి ఉండేది కాదని తెలుస్తోంది. అపుడు వేదేతర అధ్యయనాలు పెద్ద సంఖ్యలో ఉండేవి. అందుకే వేదాల అభ్యాసానికి ఒక ప్రత్యేక సంస్కారం అవసరమని గ్రహించారు. ఆ విధంగా వేదారంభ సంస్కారం అమల్లోకి వచ్చింది.

పేరు సూచించినట్లుగానే కేశాంత అనే సంస్కార విద్యార్థి తొలి మౌఖిక ముండనం (గడ్డం)తో ముడిపడిఉంది. అప్పటికి విద్యార్థి వయస్సు పదహారేళ్లు ఉంటుంది. మగతనపు చైతన్యం అతడిలో పెరిగే కొద్దీ అతడి యుక్త వయస్సు ప్రతిచర్యలపై మరింత నిఘా లేదా పర్యవేక్షణ అవసరమవుతుంది. అందుకే ఈ సంస్కారం ద్వారా అతడికి బ్రహ్మచర్య ప్రతిజ్ఞలను మరోసారి గుర్తు చేస్తారు. ఈ సంస్కారం ప్రక్రియ దాదాపు చూడకరణలాగే ఉంటుంది. కేశాంతను గోదాన (గోవును దానంగా ఇవ్వడం) అని కూడా పిలుస్తారు. అందుకు కారణం ఉత్సవం తర్వాత విద్యార్థి తన గురువుకు గోవును బహుమానంగా ఇచ్చేవాడు.

గురుకులంలో విద్యార్థి తన చదువులను పూర్తి చేసి ఇంటికి తిరిగి వచ్చినప్పుడు సమవర్తన సంస్కారాన్ని నిర్వహిస్తారు. దీనిని స్నాన అని కూడా పిలుస్తారు. చదువులు పూర్తి చేసుకొని ఇంటికి తొలిసారి రావడం విద్యార్థి జీవితంలో మరపురాని ఘట్టం. ఎందుకంటే అతడు వివాహానికి సిద్ధమై ప్రపంచంలో తీరిక లేని జీవితంలోకి అడుగు పెడతాడు. లేదా ప్రపంచంలోని సాధక బాధకాలకు దూరంగా నిశ్చింతగా జీవితం గడిపేలా వేద జ్ఞానాన్ని

అర్జించి ఉంటాడు. తొలి పదాన్ని ఎంచుకునే విద్యార్థులను ఉపకుర్వాన అని పిలుస్తారు. సాత్విక జీవితాన్ని ఎంచుకునే వారిని నైష్ఠిక అని పిలుస్తారు. ఏ పధాన్ని ఎంచుకున్నా గురువు అనుజ్ఞ (అనుమతి) అవసరమని భావిస్తారు. గురువు ఆజ్ఞ తీసుకునే ముందు గురు దక్షిణ చెల్లిస్తారు.

**వివాహం :**

హిందూ సంస్కారాలన్నింటిలోనూ వివాహం అత్యంత కీలకమైనది. సాధారణంగా గృహ్య సూత్రాలు వివాహంతోనే అన్ని సంస్కారాలు మొదలవుతాయని వివరిస్తాయి. అందుకంటే గృహస్త బలిదానాలు, ఉత్సవాలకు అదే పునాది.వివాహ సంబంధిత ఉత్సవాలు దాంపత్య బంధానికి పవిత్రతను చేకూరుస్తాయని నమ్ముతారు. సాధారణంగా ఒక పురుషుడు తన వర్ణానికి చెందిన యువతినే వివాహమాడాలి. అయితే గోత్ర (కుదురు), పిండ (మేనరికానికి) వెలుపల వివాహం జరగాలి. అనులోమ వివాహాన్ని (ఇందులో వధువు తక్కువ కులానికి చెందినది) అనుమతించినా దానిని ఎక్కువగా ప్రోత్సహించేవారు కాదు. ప్రతిలోమ వివాహాన్ని (ఇందులో వరుడు తక్కువ కులానికి చెందిన వారు) తొలుత సహించినా తర్వాతి కాలంలో దానిని వ్యతిరేకించి పూర్తిగా నిషేధించారు.

సగోత్ర, సపిండ వివాహాలపై ఆంక్షలను ఖచ్చితంగా పాటించారు. వాటి ఉల్లంఘనను చట్టపరంగా నిషేధించారు. వివాహ సంస్కారంలో వివాహపూర్వ, వివాహ, వివాహానంతర దశలకు సంబంధించిన అంశాలు అనేకం ఉన్నాయి. వాటిలో అత్యంత ముఖ్యమైనవి ఈ కింది విధంగా ఉన్నాయి.

1. వాగ్దాన (హామీ)
2. వర–వరన (నిశ్చితార్థం)
3. కన్యాదాన (చట్టబద్ధమైన సంరక్షకుడిచే వరుడికి వధువు బహూకరణ)
4. వివాహ హోమ (పెళ్లి కానుకలు)
5. పాణిగ్రహణ (చేతులను పట్టుకోవడం)
6. హృదయ స్పర్శ (గుండెను తాకడం)
7. సప్తపది (ఏడు అడుగులు – ఇవి సౌభాగ్యాన్ని, ఆత్మీయతను ప్రతిబింబిస్తాయి)
8. అస్మరోహణ (రాయిపై ఎక్కడం – ఇది సుస్థిరతకు చిహ్నం)
9. సూర్యావలోకన (సూర్యుని వైపు సంస్కారానికి సాక్షిగా చూడడం)
10. ధృవదర్శన (ధృశతారవైపు చూడడం – ఇది నిలకడను సూచిస్తుంది)

11. త్రిరాత్ర వ్రత (మూడు రాత్రుల ఎడబాటు)

12. చతుర్థి కర్మ (నాల్గవ రోజు ఉత్సవం లేదా దంపతుల సాంప్రదాయ కలయిక)

పై అంశాలు సూచించే హిందూ వివాహం ఆధునిక కాలం నాటి సామాజిక ఒడంబడిక కాదు. అదో మతపరమైన సంస్థ, సంస్కారం, వివాహానికి రెండు పక్షాల (వరుడు, వధువు)తో పాటు మూడో పక్షం (ధర్మ) కూడా ఉంది. నవ దంపతులు వివాహాన్ని తమ ఉమ్మడి మత విధిగా పాటించాల్సి ఉంటుంది. కనక అలాంటి వివాహాన్ని శాశ్వతమైనదిగా పరిగణిస్తారు. దంపతుల మధ్య ఏదైనా వివాదం తలెత్తితే మూడవ పక్షమైన ధర్మ జోక్యం చేసుకొని వారిని ఒకటి చేస్తుంది. వేరు పడేందుకు ధర్మం వారిని అనుమతించదు.

**అంత్యేష్టి :** ఒక హిందువు జీవితంలో చివరి సంస్కారం అంత్యేష్టి. అనువైన దశలలో వివిధ సంస్కారాలను నిర్వహించడం ద్వారా అతడు తన జీవితాన్ని సార్ధకం చేసుకుంటాడు. అతడు మరణించినపుడు బంధుగణం ఆ ఘట్టాన్ని అంత్యేష్టి నిర్వహించి పవిత్రం చేస్తారు. అతడి భవిష్యత్ బాగుండాలని, ఆధ్యాత్మిక శాంతి పొందాలని ప్రార్థిస్తారు. వ్యక్తి మరణం తర్వాత ఈ సంస్కారను నిర్వహించినా అది ప్రాధాన్యత లేనిదికాదు. ఎందుకంటే ఒక హిందువుకు తదుపరి ప్రపంచపు విలువ ప్రస్తుత జీవితానికంటే ఎక్కువ. చితాభస్మం ద్వారా మృతదేహాన్ని వదులుకోవడాన్ని బలిదానంగా పరిగణించేవారు. అదే సాధారణ పద్ధతిగా ఉండేది. అయితే కొన్ని ప్రత్యేక ఉదంతాలలో సమాధి, జల సమాధులను కూడా అనుమతించారు. మృత్యువు, మృతదేహాల ఖననం ఒక ప్రత్యేక పద్ధతిని అనుసరిస్తాయి. తొలి సాంప్రదాయక అడుగు మృత్యువాకిట ఉన్న వ్యక్తి నోట్లో గంగా జలాన్ని, తులసి ఆకులను జారవిడుస్తారు. తర్వాత పాడెను సిద్ధం చేసి మృతదేహాన్ని దానిపై చేరుస్తారు. తర్వాత పాడెని బంధుగణం మృతుడికి గౌరవ సూచకంగా మోస్తారు. ముందు వరుసలో సాధారణంగా మృతుడి తొలి కుమారుడు నడుస్తాడు. అతడి వెనుక బంధుగణం నడుస్తుంది. పాడెను మోసుకుంటూ శ్మశాన వాటికకు తీసుకెళతారు. అంత్యేష్టి సంస్కారంలో అభిషేక (మృతదేహాన్ని నీటితో శుభ్రం చేయడం) చితిని పేర్చడం ముందుగా జరుగుతాయి. తర్వాత వేదాల పఠనం నడుమ చితికి నిప్పంటిస్తారు. ఇతర సాంప్రదాయ చర్యలలో ఉదక కర్మ (జలాభిషేకం), అసౌచ (మలినం లేదా సామాజిక వేర్పాటు), అస్థిసంచయన (అస్థికలసేకరణ), శాంతి కర్మ, స్మారక (చితిపై గుట్టను ఏర్పాటు చేయడం), శ్రాద్ధ (మృతుడికి సమర్పణలు), సపిండకరణ ఉన్నాయి. ఆ విధంగా జీవితంలోని ఈ చివరి సంస్కారం మృతుల బంధువుల భావాలను, అవసరాలను పరిగణనలోకి తీసుకుంటుంది.

**వివాహ రూపాలు - ఆచారాలు :**

**ఎనిమిది రూపాల వివాహాలు :** స్మృతులలో పేర్కొన్న ఎనిమిది రూపాల వివాహాలు పైశాచ, రాక్షస, గంధర్వ, అసుర, ప్రజాపత్య, అర్ష, దైవ, బ్రహ్మ. ప్రాధాన్యత ఆధారంగా

వాటిని జాబితాలో చేర్చారు. ధర్మశాస్త్రాలు చాలా వరకు వీటిని ప్రస్తావిస్తాయి. అయితే మొదటి నాలుగు రకాలకు అనుమతిస్తాయి. తదుపరి నాలుగు రకాల వివాహాలకు అంతగా ఆమోదం లేదు. బ్రహ్మ, ప్రజాపత్య వివాహాల మధ్య ఉన్న వ్యత్యాసం అంత స్పష్టంగా లేదు. ఎందుకంటే ఈ రెండు తరహా వివాహాల్లో పెళ్లిని నిర్ధారిత మత కార్యాల ఆధారంగా నిర్వహిస్తారు. దైవ రూపంలో కన్యను పురోహితునితో వివాహం జరిపిస్తారు. అక్యారూపంలో వివాహ కార్యాన్ని సంపూర్ణంగా నిర్వహించినా అందులో అంతర్భాగంగా వరుడు వధువు తల్లిదండ్రులకు ఎద్దు, గోవులను కానుకగా సమర్పిస్తారు. ఈ రూపాన్ని అధమమైనదిగా పరిగణించేవారు. ఎందుకంటే అసుర వివాహ కొనుగోలు ఆధారంగా జరిగేది. పైశాచ రూపంలో వధువును అన్యాయంగా అపహరించి పెళ్లి జరిపేవారు. రాక్షస వివాహంలో వధువును బంధించేవారు. గంధర్వ వివాహం ప్రేమించి పెళ్లి చేసుకోవడం.

తొలి నాలుగు ఆమోద్యయోగ్యమైన వివాహాలు తొలి రెండు వర్ణాలు, ముఖ్యంగా బ్రాహ్మణ వర్ణ సభ్యులకు సాధారణంగా వర్తిస్తాయి. ఈ నాలుగు రూపాలను ధర్మ్య అంటారు. కౌటిల్యుని ప్రకారం ధర్మ్య అనే పదం పితృస్వామ్య శక్తి సర్వోన్నతమైనదని సూచిస్తుంది. ఈ అంశం నాలుగు ఆమోదయోగ్యం కాని రూపాలలో కనిపించదు. ఎందుకంటే వాటిలో తల్లి, తండ్రి ఇద్దరి అనుమతి అవసరం. ధర్మ్యలక్షణాలున్న వివాహాలు సంబంధిత సంస్కారాలు, ఉత్సవాలు, కార్యాలన్నింటిని పాటించాలని అన్ని వర్ణాలను ఆదేశిస్తాయి. అయితే ధర్మాన్ని పరిరక్షించే బాధ్యత బ్రాహ్మణ, క్షత్రియులపై ఉండడంతో వారు ఆమోదయోగ్యమైన వివాహ రూపాలను ఖచ్చితంగా పాటించాల్సిన అవసరం ఉండేది.

ఆమోదయోగ్యం కాని వివాహ రూపాలు సాధారణంగా క్షత్రియ, వైశ్య, సూద్ర వర్ణాలకు వర్తించేవి. పై రూపాలతోపాటు క్షత్రియులకురాక్షస, గంధర్వ వివాహాలు చేసుకోవడానికి అనుమతి ఉండేది. ప్రాచీన కాలంలో అసుర వివాహం విశ్వజనీనంగా ఉండేదని భావిస్తారు. అయితే ఆ రూపాన్ని ధర్మ శాస్త్రాలు తీవ్ర పదజాలంతో ఖండిస్తాయి. కిందిస్థాయి వర్ణాలతో అది ముడిపడి ఉండడమే అందుకు కారణం కావచ్చు. అన్ని వివాహాల్లోకెల్లా పైశాచ వివాహం అత్యంత హేయమైనది. అలాంటి వివాహాన్ని బౌధాయన వైశ్యులు, సూద్రులకు ప్రతిపాదించాడు. మను కూడా దానిని ధృవీకరించాడు. ప్రాచీన సమాజంలో ఆ రెండు వర్ణాలలో తెగలను చేర్చుకోవడంవల్ల వాటి వివాహ పద్ధతులకు చట్టబద్ధత కల్పించేందుకు శాసనకర్తలు అలా సూచించి ఉంటారు. క్షత్రియులకు రాక్షస వివాహం చెల్లుతుందని మను వ్యాఖ్యానించాడు. అయితే క్రీ.పూ. మూడవ శతాబ్దం నాటికి క్షత్రియులు కూడా రాక్షస వివాహాన్ని ఏ మాత్రం అంగీకరించలేదు. కొందరు విద్వాంసుల ప్రకారం క్షత్రియులకే పరిమితమైన గంధర్వ వివాహాన్ని ఇతర వర్ణాలకు చెందిన స్త్రీ పురుషులు కూడా బహుశా అనుసరించి ఉంటారు. ధర్మశాస్త్రాలలో ప్రతిపాదించిన నియమాలు, సాధారణ సాహిత్య కృతులలో కనిపించే అనేక ఉదాహరణల నుండి ఈ విషయాన్ని గ్రహించవచ్చు.

**వివాహ ఆచారాలు :**

**విడాకులు - వివాహ రద్దు :** వివాహేతర సంబంధం, సంతానలేమి, అనుచిత ప్రవర్తన, క్రమశిక్షణా రాహిత్యం తదితర కారణాలు చూపి పురుషుడు ఏకపక్షంగా విడాకులు తీసుకునేవాడు. అయితే తొలి నాలుగు యోగ్యత కలిగిన వివాహ రూపాలలో విడాకులను కౌటిల్యుడు అనుమతించడు. అంటే ఆమోదయోగ్యం కాని వివాహ రూపాలలోనే విడాకులు జరిగేవని బోధపడుతుంది. వివాహం రద్దుకు సంబంధించిన నిబంధనలు వర్ణ ఆదర్శాలతో ప్రభావితమయ్యేవని స్పష్టమవుతుంది. కేవలం రెండు ముఖ్య కారణాలపైనే వివాహ రద్దు సాధ్యమయ్యేది. కులంలోపలే వివాహం జరగాలనే కఠినమైన నిబంధన ఉండడంతో ఒక వ్యక్తి తన కులాన్ని కోల్పోతే అతడి భార్య వేరే భర్తను స్వీకరించే అవకాశం ఉండేది.

సుదీర్ఘ కాలం పాటు భర్త దూరంగా ఉన్న పక్షంలో భార్య పునర్వివాహంతోపాటు అనేక దారులను ఎంచుకోవచ్చని కౌటిల్యునితో సహా అనేక మంది బ్రాహ్మణిక శాసన కర్తలు అనుమతించారు. సంతానం లేని బ్రాహ్మణ స్త్రీ భర్తకోసం నాలుగు సంవత్సరాలు వేచి చూడాలని, క్షత్రియ మహిళ మూడేళ్లు, వైశ్య మహిళ రెండేళ్లు, సూద్ర మహిళ ఒక సంవత్సరం వేచి చూడాలని కౌటిల్యుడు సూచించాడు. ఒకవేళ భార్యకు సంతానం ఉంటే లేదా జీవనోపాధి మార్గాలుంటే కాల వ్యవధిని మరింత పెంచారు. అయితే వివిధ వర్ణాల మధ్య వ్యత్యాసాన్ని పాటించారు. తొలి ధర్మ శాస్త్రాలు కూడా ఆయా సందర్భాలకు అలాంటి కాలాలనే నిర్ధారించాయి. కాని తదుపరి కాలంలో శాసనకర్తలు అన్ని వర్ణాల విషయంలో కాల వ్యవధిని పెంచారు. సంతానం ఉన్న బ్రాహ్మణ మహిళ గరిష్టంగా ఎనిమిదేళ్లు భర్త కోసం వేచిచూడాలని నిర్దేశించారు.

**వితంతు వివాహం - నియోగ :** ప్రాచీన భారతదేశంలో వితంతువుల వివాహం జరిగేదని చెప్పడానికి సాహిత్య, పురావస్తు ఆధారాలు ఏవి లేకపోయినా ఆ సాంప్రదాయాన్ని దిగువశ్రేణి వర్ణాలు పాటించేవని తెలుస్తోంది. బ్రాహ్మణులలో వితంతువుల పునర్వివాహం జరిగే ప్రసక్తే లేదని మనువు రచించిన ఒక వ్యాసం పేర్కొంది. అంటే మిగతా మూడు వర్ణాలలో అది సాధ్యపడేదని తెలుస్తోంది. క్రీ.శ. తొలి శతాబ్దాలలో సూద్రులు నియోగను ఖచ్చితంగా ఆచరించారు. దీనిని బట్టి నిమ్న కులాలలో వితంతు పునర్వివాహం జరిగేదన్న భావన పరిమితం చేసే నిబంధనలు ఏవీ కనిపించవు. అయితే ఈ ఆచారానికి ఉదాహరణలు చాలా వరకు క్షత్రియుల రాకుమార్తెలతో ముడిపడి ఉన్నాయి. అక్కడక్కడా బ్రాహ్మణులు ఈ ఆచారాన్ని పాటించిన దాఖలాలు కనిపిస్తాయి. అయితే తర్వాతి కాలంలో స్మృతులు ఈ ఆచారాన్ని కేవలం సూద్రులకే పరిమితం చేశాయి.

**బహుభార్యత్వం - ఏకపత్నీవ్రతం :**

ఒక పురుషుడు ఎంత మంది భార్యలను స్వీకరించవచ్చనే విషయాన్ని అతడి వర్ణం నిర్ధారిస్తుంది. బహుభార్యత్వం ఉన్నత వర్ణాలలో ఎక్కువగా చెలామణి కాగా నిమ్నకులాలు సాధారణంగా ఏకపత్నీవ్రతాన్ని పాటించేవి. ఉదాహరణకు బ్రాహ్మణుడు నలుగురి భార్యలను,

క్షత్రియులు ముగ్గురిని, సూద్రులు కేవలం ఒక భార్యను మాత్రమే చేసుకోవడానికి విష్ణువు అనుమతించాడు. ఆ విధంగా అగ్రవర్ణాల బహుభార్యత్వం సామాజిక అదనపు నిల్వలలో వారికి ఉన్న పెద్ద వాటాకు తగిన విధంగా ఉంది. నిమ్నకులాల ఏకపత్నీవ్రతం పెద్ద కుటుంబాలను పోషించలేని వాటి స్థాయికి సూచికగా నిలుస్తుంది.

**కులాంతర వివాహం - వర్ణసంకరం :**

వేద, మహాగ్రంధాల సాహిత్యంలో కులాంతర వివాహానికి సంబంధించిన ఉదాహరణలు కొన్ని ఉన్నప్పటికీ అవన్నీ అనులోమ వ్యవస్థ కిందే ఉన్నాయి. పైపెచ్చు ఈ వివాహాలు కేవలం రెండు అగ్రవర్ణాల మధ్యే జరిగినట్లు అనేక వ్యాఖ్యానాలు ఉన్నాయి. ఒక బ్రాహ్మణ యువకుడు క్షత్రియ వధువును చాలా వరకు వివాహమాడేవాడని చెబుతాయి. ఆ రెండు అగ్రకులాల మధ్య వివాహ సంబంధాల సాంప్రదాయం తదుపరి కాలంలో కూడా కొనసాగింది. కణ్వ, వత్స, సత్యకామజాబాల లాంటి మహర్షులు దాసిపుత్రులకు (బానిస మహిళలు) జన్మించినట్లు ప్రముఖ పురాణాలు నివేదించాయి. శాంతను ఒక మత్స్యకార మహిళ కుమారుడని పేర్కొన్నాయి. అయితే గుప్త పూర్వ, గుప్త కాలాలలో అలాంటి ఉదాహరణలు చాలా అరుదుగా ఉన్నాయి.

తక్కువ కులం మహిళలను భార్యలుగా స్వీకరించడానికి అనుమతి ఉన్నప్పటికీ అలాంటి మహిళలు అగ్రవర్ణ మహిళలతో సమానంగా హోదాను అనుభవించేవారు కాదు. వివాహ మహోత్సవాల నిర్వహణ వేరుగా ఉండడమే కాకుండా నవ దంపతులకు శుభాకాంక్షలు అందించే పద్ధతులు కూడా ఆయా నిమ్న వర్ణాల సాంప్రదాయాలకు అనుగుణంగా ఉండేవి. మరోవైపు తక్కువ కులం భార్యలకు కలిగే సంతానాన్ని తక్కువ హోదాకు పరిమితం చేసేవారు. అనేక అనియమిత లేదా మిశ్రమ కులాలను ధర్మశాస్త్రాలలో ఉల్లేఖించారు. ప్రతిలోమ, అనులోమ సంబంధాల కారణంగానే ఇలాంటి మిశ్రమ కులాలు ఆవిర్భవించాయని అందులో వివరించారు. ముఖ్యంగా ప్రతిలోమ వివాహాల కారణంగానే కొత్త కులాలు పుట్టుకొచ్చాయని పేర్కొన్నారు. ఈ తరహా కులాలను అంత్యజ లేదా నిమ్న కులాలుగా నిర్ధారించారు. మలి వైదిక సాహిత్యం సుమారు ఎనిమిది మిశ్రమ జాతులను నాలుగు వర్ణాలకు అదనంగా ప్రస్తావించాయి. వశిష్టుడు ఆ సంఖ్యను పదికి పెంచాడు. బౌధాయన వాటిని 15కు, గౌతమ 18కి, మను 60కి పెంచారు. అయితే అన్ని గ్రంధాలలో ఒకే కులానికి ఒకే మిశ్రమ మూలాలను ఇవ్వలేదు. తొలి మధ్యయుగ కాలపు కృతి అయిన బ్రహ్మవైవర్త పురాణం మిశ్రమ కులాల సంఖ్యను వందకుపైగా పెంచింది.

అయితే పై సిద్ధాంతం జాతుల ఆవిర్భావాన్ని కేవలం పాక్షికంగానే వివరిస్తుంది. విశేషమేమిటంటే నాలుగు వర్ణాలకు తోడు అనేక సంఖ్యలో ఉన్న గిరిజన తెగలను వర్ణ వ్యవస్థలో స్థానం కల్పించాలన్న ఆలోచన తర్వాతి కాలంలోనే పుట్టుకొచ్చింది. నిషాదులు, అంబస్థులు, పుల్కాసులు తొలుత తెగ సముదాయాలుగా ఉండేవారన్నది సుస్పష్టం. అయితే వారిని ఒక్కసారి బ్రాహ్మణిక సమాజంలో అనుమతించిన తర్వాత వర్ణ వ్యవస్థ నిర్మాణ స్వరూపంలో వారికి స్థానిక మూలాలను సూచించారు. ఈ విషయంలో వర్ణ సంకర లేదా

మిశ్రమ కులాలు అన్న కల్పన బ్రాహ్మణిక శాసనకర్తలకు బాగా ఉపయోగపడింది. మిశ్రమ లేదా నిమ్న కులాలపై మను తన స్వంత జాబితాను అందించారు. తొలి మూడు వర్ణాలు తమ కింది స్థాయిలో ఉన్న మూడు వర్ణాల భార్యలతో పండించిన సంతానాన్ని తండ్రి కులస్తులుగా నిర్ధారించారు. ఫలితంగా అలాంటి సంతానం కొత్త కులాలను ఏర్పాటు చేయలేదు.

ఆర్యేతర జాతుల జాబితా తగిన స్థాయిలో పొడుగ్గా లేదన్న రీతిలో ఆ గొప్ప శాసనకర్త ధరిత్రిపై నివసించే అన్ని ప్రముఖ జాతులను అందులో చేర్చడానికి ప్రయత్నించాడు. అందులో పౌండ్రకులు (ఉత్తర బెంగాల్ ప్రజలు), ఉద్రులు (ఒరియాలు), ద్రవిడులు (దక్షిణ భారతీయులు), కాంబోజులు (కాబులీలు), యవనులు (బాక్ట్రియా గ్రీకులు), సకాలు, పరాడులు, పహ్లావాలు (పర్షియన్లు), చైనాలు (చైనీయులు), కిరాటులు (కొండ ప్రజలు) ఉన్నారు. దరాదులు, ఖాసాలు తొలుత క్షత్రియులుగా ఉండేవారని, కాని ఆ తర్వాత క్రమంగా ఈ ప్రపంచంలో సూద్రుల స్థాయికి దిగజారారని చెబుతారు. పవిత్ర కార్యాలు (మతాచారాలు, పూజా పునస్కారాలు) నిర్వహించకపోవడం, బ్రాహ్మణులను సంప్రదించకపోవడమే అందుకు కారణమని నిర్ధారించారు.

**మహిళల స్థితిగతులు :**

భారతీయ సాహిత్యంలో మనిషి జీవితం యొక్క నాలుగు లక్ష్యాల గురించి గొప్పగా చెప్పారన్నది వాస్తవం. వాటిని చతుర్వర్గాలు లేదా పురుషార్థాలని అంటారు. ధర్మ, అర్థ, కామ, మోక్ష అనేవి నైతిక ప్రవర్తన, సంపద, భౌతిక సుఖం, మోక్షాన్ని సూచిస్తాయి. అయితే అదే సమయంలో మోక్ష ఒక్కటే మనిషి జీవితంలో ఉన్నతమైన లక్ష్యమని స్పష్టంగా, ఏకగ్రీవంగా నిర్ధారించారు. భారతదేశంలో వ్యక్తుల యొక్క రెండు గొప్ప వర్గాలను గుర్తించారు. వారే సన్యాసులు, గృహస్తులు. మహిళలకు కూడా భారతదేశం రెండు ప్రధాన ఆశయాలను గుర్తించింది. ఒకటి బ్రహ్మవాదిని, రెండవది సద్యోవధు. బ్రహ్మవాదిని సన్యాసురాలు. ఆమె ఉన్నతమైన తాత్విక జ్ఞానాన్ని ఆర్జించడానికి తన జీవితాన్ని ధారపోస్తుంది. కనుక ఆమె జీవిత ఆశయం ఆధ్యాత్మిక చైతన్యాన్ని పొందడం. మరోవైపు ఒక సద్యోవధు గృహస్తురాలు. తన కుటుంబ సంక్షేమం కోసం ఆమె అంకితమవుతుంది. రోజువారీ సాధారణ ఇంటి పనులను పూర్తి చేయడంలోనే ఎక్కువ సమయం గడుపుతుంది. ఇద్దరి వేదాలకూ ఎనలేని గౌరవం ఉండేది. దైవ రహస్యాన్ని గ్రహించిన బ్రహ్మవాదినిలలో చాలా వరకు గృహిణులే ఉన్నారు. అలాగే సద్యోవధులు కూడా ఉన్నతమైన ఆధ్యాత్మిక స్వభావాన్ని కలిగి ఉండేవారు. బహుముఖ ఇంటి పనులను చక్కబెట్టడంతో పాటు వారు ఆధ్యాత్మిక పరిపుష్టికి కృషిచేసి జీవన పరమార్థాన్ని గ్రహించారు.

**వేద సాహిత్యంలో మహిళలు:**

యావత్ ప్రపంచంలోనే అత్యంత ప్రాచీన సాహిత్యమైన రుగ్వేదంలో సుమారు 27 మంది బ్రహ్మవాదినిలు సమకూర్చిన భక్తి గీతాలు (హైమన్స్) ఉన్నాయి. క్రీ.పూ. ఐదవ శతాబ్దంలో రుగ్వేదంపై వ్యాఖ్యానంగా తాను రచించిన “బృహద్దేవత”లో సౌనక ఆ 27 మంది మహిళామణుల

పేర్లను ప్రస్తావించాడు. ఆ 27 మంది బ్రహ్మవాదినిలకు తోడు మరో ఇద్దరి పేర్లను ప్రముఖ వేద వ్యాఖ్యాత సాయన జోడించాడు. ఉపనిషద్‌లలో బ్రహ్మవాదినితోపాటు సద్యోవధుల ఉన్నతమైన నిదర్శనాలు మనకు కనిపిస్తాయి. గార్గి అనే బ్రహ్మవాదినికి అజరామరమైన ఖ్యాతి ఉంది. మహర్షి యాజవాల్క్యతో ఆమె జరిపిన ఉన్నతమైన తాత్విక చర్చలను బ్రహ్మదారణ్యక ఉపనిషద్‌లో రెండుసార్లు నమోదు చేశారు. అదే ఉపనిషద్‌లో సద్యోవధుకు సంబంధించిన ఉన్నతమైన ఉదాహరణ కూడా ఉంది. భౌతిక ప్రపంచం నుండి వీడ్కోలు తీసుకునే దశలో యాజవాల్క్య తన ఆస్తిని ఇద్దరు భార్యల మధ్య (మైత్రేయి, కాత్యాయిని) పంచడానికి ప్రయత్నించినపుడు మైత్రేయి ఆస్తిని తీసుకోవడానికి నిరాకరిస్తుంది. “దేని ద్వారా అయితే నేను అమరత్వాన్ని పొందలేనో దానిని తీసుకొని నేనేమి చేయాలి”, అని ఆమె తన భర్తను ప్రశ్నించింది. పర్యవసానంగా యాజ్ఞవాల్క్య ఆమెకు గొప్ప జ్ఞానాన్ని ప్రసాదించాడు. దైవార్పణం గురించి ఆమెను చైతన్యవంతం చేసే విధంగా బోధనలు చేశాడు.

**వ్యాకరణ సాహిత్యంలో మహిళ :**

పానిని యుగం (క్రీ.పూ. ఐదవ శతాబ్దం) వైదిక సాంప్రదాయమైన సంస్కృతి, విద్యలను కొనసాగించింది. స్వంతంగా జ్ఞానాన్ని పొందిన బ్రహ్మవాదినులను ఉపాధ్యాయ లేదా ఉపాధ్యాయి, ఆచార్య అని గౌరవ సూచకంగా పిలిచేవారు. అలాగే గురు భార్యలను ఉపాధ్యాయిని, ఆచార్యని అని పిలిచేవారు. పానిని, పతంజలి ఇద్దరూ బ్రహ్మవాదినులు వేద కాలంలో సమకూర్చుకున్న ఉన్నతమైన వేద జ్ఞానాన్ని ప్రస్తావించారు. ఫలితంగా వారికి ప్రత్యేకమైన పేర్లు అవసరమయ్యాయి. ఆ విధంగా కథా విచారధారకు చెందిన మహిళా విద్యాంసులను “కథి”అని పిలిచారు. రుగ్వేద విద్వాంసులను “బహవిర్చ” అని పిలిచారు. అపిసాలి వ్యాకరణాన్ని ఒంటబట్టించుకున్న బ్రాహ్మణ మహిళా విద్వాంసులను “అపిసాలి” అని, కాలకృత్స్ను మీమాంస విచారధార వారిని “కాలకృత్స్ను” (పతంజలి) అని పిలిచారు. మహిళా విద్వాంసురాలు, ఉపాధ్యాయిని అయిన ఔదమేధ్య విద్యార్థులను (శిష్యులను) “ఔధమేధ“అని పిలిచారు.

**ఇతిహాస గ్రంథాలలో మహిళ :**

రామాయణ, మహాభారతాలలో కూడా బ్రహ్మవాదిని, సద్యోవధులకు సంబంధించి అనేక ఉదాహరణలు ఉన్నాయి. రామాయణంలో బ్రహ్మవాదినికి ఉన్నతమైన నిదర్శనం అత్రి మహర్షి భార్య అయిన అనసూయ. రామాయణంలో కనిపించే మరో ప్రముఖ మహిళా సన్యాసి శ్రమణి శబరి. ఆమె తక్కువ కులానికి చెందినది. ఆమె మహర్షి మాతంగ శిష్యురాలు. పంపా సరస్సు ఒడ్డున ఆమెకు మఠం ఉండేది. మరోవైపు రామాయణంలో అత్యంత ఉన్నతమైన సద్యోవధుసీత అసమాన వ్యక్తిత్వంలో కనిపిస్తుంది. భారతనారికి ఆమె ఆదర్శమూర్తి. మహాభారతంలో కూడా గొప్ప మహిళలు ఉన్నారు. ఆ మహిళలు తమ ఉన్నత లక్ష్యాలను పూర్తి చేసుకున్నారు. ఉదాహరణకు శుల్భ గొప్ప విద్వాంసురాలు. తనకు సరైన సరిజోడి లభించకపోవడంతో ఆమె సన్యాసురాలిగా మారి జ్ఞానాన్వేషణలో ఒక ప్రాంతం నుండి మరో

ప్రాంతానికి తిరిగింది. మహాభారతంలో దర్శనమిచ్చే ఇతర ప్రముఖ బ్రహ్మవాదినిలలో శాండిల్య కుమార్తె బ్రాహ్మణి, వేదాలను సంపూర్ణంగా అధ్యయనం చేసిన శివ ఉన్నారు. గృహిణులుగా ఉన్నత జీవితాన్ని గడిపిన మహిళల ఉదాహరణలు అనేకం ఉన్నాయి. అయితే ఇక్కడ కేవలం గాంధారి, కుంతి, ద్రౌపదిలను మాత్రమే ప్రస్తావించగలము.

**స్మృతులు, పురాణాలలో మహిళ :**

కాలం గడిచే కొద్దీ భారతదేశంలో మహిళల స్థాయి క్రమంగా దిగజారింది. ముఖ్యంగా చారిత్రక దశ ప్రారంభమైనప్పటి నుండి ఇలాంటి పరిస్థితి నెలకొంది. స్మృతుల కాలంలో మహిళలను సూద్రులతో జమకట్టారు. వేదాలను అధ్యయనం చేసే హక్కును వారికి నిరాకరించారు. వేద మంత్రాల ఉచ్ఛారణ, వేద కర్మకాండల నిర్వహణ నుండి వారిని దూరంగా ఉంచారు. అందుకే అలాంటి యుగంలో మహిళలు సన్యాస జీవితాన్ని లేదా ఆధ్యాత్మిక జీవితాన్ని గడిపే పాత హక్కును అనుభవించలేకపోయారు. మరోవైపు వివాహం లేదా కుటుంబ జీవితం మహిళకు తప్పనిసరిగా మారింది. భర్తలపట్ల అకుంఠిత దీక్ష, నిస్వార్థ సేవ ఆమె ఏకైక కర్తవ్యంగా మిగిలిపోయింది. ఈ సందర్భంగా మనువు చేసిన ఒక ప్రముఖ ప్రకటనను ఉటంకిస్తున్నాము. "బాల్యంలో మహిళను తండ్రి రక్షిస్తాడు, యవ్వనంలో భర్త, వృద్ధాప్యంలో ఆమె కుమారులు రక్షిస్తారు. స్వేచ్ఛకు ఆమె ఎప్పుడూ అర్హురాలు కాదు".

**ఆర్థిక స్థాయి :**

స్మృతులు, పురాణాలలో మహిళలను, ఆస్తిని ఒకే గాటన కట్టిన ఉదంతాలు ఎన్నో ఉన్న కారణంగా మహిళనే ఒక రకమైన ఆస్తిగా పరిగణించారనడంలో ఎలాంటి సందేహం లేదు. ఆస్తిలోని భాగంలాగా ఆమెను ఇతరులకు కట్టబెట్టవచ్చు లేదా రుణంగా అందించవచ్చు. ఉదాహరణకు మనువు, యాజ్ఞవాల్క్యుల ప్రకారం ఒక మహిళ ఎప్పుడూ స్వతంత్రురాలు కాదు. వ్యక్తిగత ఆస్తిపై ఆధారపడ్డ సాధారణ పితృస్వామ్య సమాజం యొక్క ధోరణిని ఇది తలపిస్తుంది. ఈ ధోరణి కారణంగా బ్రాహ్మణిక చట్టం మహిళలకు ఎలాంటి ఆస్తి హక్కులను అనుమతించలేదు. "స్త్రీ ధన" సౌకర్యం చాలా పరిమిత లక్షణాన్ని కలిగి ఉంది. నగలు, భూషణాలు, వ్యక్తిగత కానుకలు మినహా మిగతా సంపదపై ఆమెకు ఎలాంటి హక్కు ఉండేది కాదు. భార్య, కుమారుడు, దాసుడు ఆస్తి రహితులని, వారు సంపాదించేదంతా వారి యజమానుల ఆస్తి అవుతుందని మనువు ప్రకటించాడు. ఇలాంటి సామాజిక తత్త్వం గుప్త, గుప్తానంతర కాలాలలో బలంగా పాతుకుపోయింది. అయితే ఏకపత్ని కుటుంబం, వ్యక్తిగత ఆస్తి అనే సంస్థలు అంతకు చాలా ముందే అభివృద్ధి చెందాయి.

**సామాజిక హోదా:** గుప్త పూర్వ, గుప్త కాలం నాటి బ్రాహ్మణిక గ్రంథాలలో సూద్రుల సామాజిక హోదాతో పాటు మహిళల సామాజిక హోదా గురించి అనేక వ్యాఖ్యానాలు ఉన్నాయి. భగవద్గీతలో వారిని (మహిళలు, సూద్రులు) వైశ్యులతోపాటు తక్కువ హోదాకు కుదించారు.

ధర్మశాస్త్రాలు, పురాణాలు రచించిన వారిలో అనేకమంది సూద్రులతో పాటు మహిళలను కూడా చిన్నచూపు చూశారు. సామాజికంగా వారిని అత్యంత మలినమైన వారిగా పరిగణించారు. ద్విజ కుల పురుషులను ఒకవైపు, సూద్రులు, అలాగే అన్ని వర్ణాల మహిళలను మరోవైపు జమచేసి వారి మధ్య వివక్షను మను పాటించాడు. అతడి శాసనం ప్రకారం ద్విజకుల పురుషులు నీటిని తాగితే మూడుసార్లు శారీరక స్వచ్ఛతను పొందుతారు. అయితే సూద్రులు, మహిళలు ఒక్కసారి మాత్రమే స్వచ్ఛతను పొందగలరు. ఆహారం విషయంలో మహిళ, సూద్రుడు వదిలే ఆహారాన్ని తినడం పాపకార్యంగా భావించేవారు. ఈ నిషేధాజ్ఞను ఉల్లంఘించినట్లయితే ఏడు రోజులు వరుసగా బార్లీని తాగి పాపాన్ని తొలగించుకోవచ్చు.

**మతపరమైన హోదా :**

మలివేద కాలం నాటికే మహిళలకు తక్కువ మత హోదాను కల్పించారు. ఉదాహరణకు "సతపత బ్రాహ్మణ" ఒక ఉపాధ్యాయుడు బోధించే సమయంలో మహిళవైపు కన్నెత్తి కూడా చూడకూడదని హెచ్చరించింది. (ఆ కోవకు సూద్రులు, కుక్క, నల్లపక్షి చెందుతాయి). ఎందుకంటే వారు అసత్యానికి ప్రాతినిధ్యం వహిస్తారు. ఇదే సూత్రం పరాశర గృహ్యా సూత్రాల్లో మళ్లీ కనిపిస్తుంది. దాని ప్రకారం సమవర్తన ఉత్సవం తర్వాత ఒక వ్యక్తి మహిళలు, సూద్రులు, మృత శరీరాలు, నల్లపక్షులు, కుక్కలను చూడడం మానుకోవాలి. అలాంటి జీవాలతో కనీసం మాటలు కూడా కలుపరాదని పేర్కొంది. చంద్రయాన ప్రతిజ్ఞ సమయంలో మహిళ, సూద్ర లేదా అస్పృశ్యుడితో మాట్లాడడం తగని పని అని మను కూడా పేర్కొన్నాడు. గుప్త యుగంలో వెలువడిన బ్రహ్మపురాణం ప్రకారం తొలి మూడు వర్ణాలకు చెందిన పురుషులు వేద పద్ధతుల ప్రకారం స్నానాలు, పూజలు చేయాలి. అయితే మహిళలు, సూద్రులు అలాటి కార్యాలు నిర్వహించరాదని స్పష్టం చేసింది.

**మహిళల వ్యవహారశైలి :**

మహిళలు, ముఖ్యంగా ఉన్నత కుటుంబాలకు చెందిన వారు, ముసుగు ధరించే సాంప్రదాయం అమల్లో ఉండేది. ప్రభాకరవర్ధనుడి కుమార్తె రాజ్యశ్రీ తన భర్త కానౌజ్ గ్రహవర్మను తొలిసారి కలుసుకున్నప్పుడు ముసుగు ధరించింది. కాదంబరిలో పుత్రలేఖ ఎర్రటి ముసుగు ధరించిందని వివరించారు. అయితే ఇది సాధారణ సాంప్రదాయం కాదు. హర్షవర్ధనుడి తల్లి యశోమతి తన మరణశయ్యపై రాజ్యమంత్రులకు సూచనలు ఇస్తున్నట్లు కనిపించింది. సమకాలీన శాసన గ్రంథాలు, పురాణాలు ఆదర్శ భార్యను వర్ణిస్తాయి. ఆమె గృహస్త జీవితానికి ప్రధాన ఆధారం. అందరికంటే ముందు నిద్రలేచి కుటుంబ పెద్దలకు పాదాభివందనం చేస్తుంది. అన్నపానీయాలను తయారుచేస్తుంది. ఆమె తన భర్తకు పూర్తిగా కట్టుబడి ఉంటుంది. భర్త పేరును ఉచ్చరించేది కాదు. భర్త పేరును పలికితే అతడి ఆయుష్షు తరగిపోయే ప్రమాదం అన్నది విశ్వాసం. భర్త విదేశానికి వెళితే భార్య తన ఒంటిపై నుండి నగలన్నీ తీసి వేసేది, సౌందర్యాలంకరణ మానుకునేది. అలాగే నృత్యం, సంగీతం, సార్వజనిక ఉత్సవాలను వీక్షించడం

మానుకునేది. తమ భర్తలు నిర్వహించే మత వేడుకల్లో మహిళలు పాల్గొనేవారు కాని మతపరమైన ఉపవాసం, వ్రతం లేదా తీర్థయాత్రల నిర్వహణను భర్త అనుమతిలేనిదే చేపట్టేవారు కాదు.

**చట్టపరమైన సంరక్షణ:**

మహిళల పట్ల సాధారణ వ్యవహారశైలి విషయానికి వస్తే మహిళను రేయింబవళ్లు ఆమె అత్త లేదా కుటుంబంలోని ఇతర మహిళలు కనిపెడుతూ ఉండాలని బృహస్పతి పేర్కొన్నాడు. అలాగే ఒక మహిళను బలవంతంగా లొంగదీసుకుంటే ఆ పురుషుడు తన ఆస్తిని కోల్పోతాడు. అతడిని గాడిదపై ఊరేగిస్తారు. పరాయి పురుషునితో ఒక మహిళ సంబంధం పెట్టుకుంటే భర్త ఆమెను వదిలేయరాదని స్మృతి రచయితలు సూచిస్తారు. అందుకు భిన్నంగా ఆ మహిళ సాధారణ హక్కులు తిరిగి దక్కేలా తగిన పాప పరిహారం చేయాలని పేర్కొన్నారు. వివాహేతర సంబంధం ద్వారా గర్భం తెచ్చుకున్నప్పుడే మహిళను దూరం చేయాలని సూచించారు. మహిళలను వారి అనైతిక కార్యకలాపాల కారణంగా కొన్ని స్మృతులు, పురాణాలు తెగనాడాయి. అయితే ఇతర అధికారిక గ్రంథాలు మహిళల నైతిక జీవితం గురించి భిన్నమైన చిత్రాన్ని అందించాయి. సాధారణంగా మహిళలు పరిపూర్ణులని (స్వచ్ఛమైన వారు), నిందకు అతీతులని, కనుక వారికి ఉన్నత గౌరవం, ప్రతిష్ట దక్కాలని వరాహమిహిరుడు పేర్కొన్నాడు. మహిళల ఉన్నత గుణాలను వదిలి కేవలం వారి దుర్గుణాలనే ప్రస్తావించడం తగదని అతడు కొందరు రచయితలను విమర్శించాడు. కాళిదాస, బాన, భవభూతి తదితర ప్రాచీన కవులు, రచయితల కృతులలో మహిళల సచ్ఛీల గుణం ప్రతిబింబిస్తుంది. అయితే మొత్తం మీద, ఈ కాలంలో మహిళల స్వతంత్ర హోదాను గుర్తించలేదు. పెళ్లికి ముందు ఆమె తన తండ్రిపై ఆధారపడి ఉండేది. పెళ్లి తర్వాత భర్తపై, భర్త మరణం తర్వాత కుమారుడిపై ఆధారపడేది. సంతానం లేకపోతే సమీప బంధువు ఇంటిలో ఆశ్రయం పొందేది. అయితే మగసంతానం లేని మహిళకు భర్త మరణం తర్వాత అతడి ఆస్తిపై హక్కును కల్పించేవారు.

**సతి - విధవల సాత్విక చర్యలు:**

ఒక మహిళ తన భర్త మరణం తర్వాత సతీసహగమనం చేసుకోవచ్చని లేదా శాస్త్రాలు సూచించిన విధంగా సాత్విక జీవనం గడపవచ్చని స్మృతి రచయితలు నిర్ధారించారు. కొన్ని స్మృతిలు, పురాణాలు సతీసహగమనాన్ని ప్రోత్సహించాయి. బృహస్పతి పేర్కొనట్లు ఒక మహిళ తన భర్తకు సుఖ దుఖాలలో సమానంగా కట్టుబడి ఉంటే అతడు మరణించినపుడు ఆమె కూడా మరణించాలి. తన భర్తతోపాటు చితిలో కలిసిపోయే మహిళ పెద్ద పాపం చేసుకున్నప్పటికీ వీడిపోయిన ఆత్మకు శాంతిని చేకూరుతుందని బృహత్‌ధర్మ పురాణం పేర్కొంది. అయితే అధికారిక శాసనాలు ఈడురాని విధవలు, గర్భంతో ఉన్న స్త్రీలు, లేదా చిన్న పిల్లలు ఉన్న వారు సతికి పాల్పడరాదని నిషేధం విధించాయి. అయితే ఒక విధవ, ముఖ్యంగా బ్రాహ్మణ లేదా క్షత్రియ వర్ణానికి చెందిన మహిళ, తన భర్తతోపాటు ప్రాణం వదులుకోవడానికే సిద్ధపడేది. ఎందుకంటే సంబంధీకులు పెట్టే బాధలను భరించడం కంటే భర్తతోపాటు చితిలో కాలిపోవడమే ఆమెకు ఉత్తమ మార్గంగా ఉండేది.

చారిత్రక నివేదికల సహాయంతో సతి సాంప్రదాయ మూలాలను ప్రాచీన యుగపు చివరి దశలో అన్వేషించవచ్చు. గుప్త పాలకుడు భానుగుప్త సైన్యాధ్యక్షుడు అయిన గోపరాజ భార్య క్రీ.శ. 510లో తన భర్త చితిపై కాలిపోయిందని చెబుతారు. సతి స్మారక ఫలకాలు పెద్ద సంఖ్యలో ఉండడంబట్టి ఆ సాంప్రదాయం ఈ కాలంలో మధ్య భారతదేశం, దక్కను ప్రాంతాలలో సర్వవ్యాపితంగా ఉండేదని బోధపడుతుంది. హర్షవర్ధనుడి తల్లి యశోమతి తన భర్త చితికి ఆహుతి అయింది. అయితే సతి సాంప్రదాయ నిర్వహణ సర్వజనీనంగా ఉండేది కాదని స్పష్టమవుతుంది. ఈ కాలానికి చెందిన అనేక ప్రముఖ మహిళలు (ఉదాహరణకు దక్కను వకాటక వంశానికి చెందిన ప్రభావతి దేవి లాటి వారు) ఈ ఆచారాన్ని పాటించలేదు.

స్మృతి నియమాల ప్రకారం ఒక విధవ సాత్విక జీవితాన్ని గడపాల్సి ఉంటుంది. ఆమె నేలపై పడుకునేది. మంచం మీద నిద్రించడానికి ఆమెను అనుమతించేవారు కాదు. అంగవస్త్రాలను, రంగులు అద్దిన దుస్తులను ధరించేది కాదు. కంట్లో కాటుకను, ముఖంపై పసుపును లేదా ఎలాంటి సుగంధ ద్రవ్యాన్ని వాడేది కాదు. రోజుకు ఒక పూటనే భోజనం చేసేది. విధవలు కొప్పు ధరించడాన్ని బానుడు తన హర్ష చరిత్రలో వివరించాడు. మరోవైపు స్కంద పురాణ విధవలు శిరోముండనం చేసుకోవాలని సూచించింది. నియోగ వ్యవస్థను నారదుడు సిఫార్సు చేశాడు. పూర్వపు స్మృతి రచయితలను అనుసరించి అతడు ఆ మేరకు సలహా ఇచ్చాడు. అయితే తదుపరి కాలంలో ఆ ఆచారాన్ని నిరోధించారు. బృహస్పతి వ్యాఖ్యానించినట్లు "ప్రపంచంలోని నాలుగు యుగాలు వరుసగా భ్రష్టుపట్టిపోవడంవల్ల నియోగను సాధారణ మానవులు పాటించడం శ్రేయస్కరం కాదు."

11

# ప్రాచీన భారత మతాలు

**సింధూమతం :**

సింధూ లిపిని క్రోడీకరించలేని నిస్సహాయ స్థితిలో సింధూ ముద్రికల తయారీదారులు, కుమ్మరులు వదలివెళ్లిన పురావస్తువులు సింధూ మతంపై ప్రధాన సమాచార ఆధారంగా మారాయి. అందుకుతోడు మనకు కొన్ని నిర్మాణపరమైన అవశేషాలు ఉన్నాయి. వాటికి భక్తి లేదా కర్మాకాండయుత ప్రాధాన్యత ఉండొచ్చు, లేకపోవచ్చు. అయితే అందుబాటులో ఉన్న ఆధారాలను అధ్యయనం చేసేటపుడు మనం విశ్వాసాలు, కర్మకాండకు సంబంధించి ఒకే ఒక్క వ్యవస్థ ఉండేదని పూర్వ నిర్ధారణకు రాకుండా జాగ్రత్తపడాలి. ఎందుకంటే హరప్పా జనాభాలోని వివిధ వర్గాలకు వేర్వేరు మతాలు, దైవాలు సొంతంగా ఉండి ఉండవచ్చు.

సింధూముద్రికలు (సీల్స్) పాలకవర్గాలు, అధికారులు, వ్యాపారుల మత విశ్వాసాలను ప్రతిబింబించాయని చెప్పడానికి అన్ని అవకాశాలు ఉన్నాయి. పై వర్గాలు ఈ ముద్రికలను ఎక్కువగా వినియోగించడమే ఈ వాదనను బలపరుస్తుంది. సింధూ ప్రాంతంలో (రాజ్యం) అధికారిక మతం లాంటి ఒక మత విశ్వాసం ఉండేదని బోధపడుతోంది. దాదాపు 75 శాతం ముద్రికలు సుమారు 1,524 ముద్రికలలో 1,150 ఒకే ఒక్క జంతువు ప్రతిమను కలిగి వున్నాయి. ముద్రికలో ఆ జంతువు ఎప్పుడూ కుడివైపు ముఖం సారిస్తూ ఉంటుంది. అత్యంత సాధారణమైన జంతువు ఈ ఏకశ్రింగ దానికి తల మీద ఒకటే కొమ్ము ఉన్నట్లు ముద్రికలో చిత్రీకరించారు. దాని ఎదుట మూడంచెల గాడి వేలాడుతూ ఉంటుంది. తులనాత్మకంగా చూస్తే ఇతర జంతువులు చాలా తక్కువగా కనిపిస్తాయి. ఎనుము 95 ముద్రికలలో, ఏనుగు 55 ముద్రికలలో, మోపురం ఉన్న ఎద్దు 54 (ఆవుకు అంతగా ప్రాధాన్యత ఇచ్చినట్లు కనబడదు), పులి–21, కుందేలు – 15, దున్న – 14 ముద్రికలలో ఉన్నాయి.

పైన పేర్కొన్న జంతువులను దైవాలుగా కొలచి ఉంటారు. అలాగే ముద్రికలు వేయించిన వారి కుదురుకు జంతువులు చిహ్నాలై ఉండవచ్చు. అయితే రెండవ ఊహాగానమే బలంగా ఉంది. ఎందుకంటే చాలా కుదురులకు జంతువులే ప్రతీకాత్మక చిహ్నాలుగా ఉండేవి. ఇతర నేపథ్యాలలో జంతువులకు చిహ్న సంబంధిత విధులు ఉన్నట్లు ఏ మాత్రం కనిపించదు.

ఉదాహరణకు మొహెంజొదారోలో లభించిన పశుపతి మహాదేవ అనబడే ముద్రికలో ఖడ్గమృగం, నీటి దున్న ఒకవైపు, ఏనుగు, పులి మరో వైపు మానవాకారంలో ఉన్న మూడు శిరస్సుల దైవం చుట్టూ ఉన్నాయి. ఆ దైవానికి దున్న కొమ్ములుగల తలపాగ ఉంది. ఇటీవల జరిగిన ఒక అధ్యయనం ప్రకారం దైవం యొక్క యోగ ధ్యానం ప్రాచీన ఇరాన్ ముద్రికలలోని ఎద్దు దైవం కూర్చున్న తీరును అనుకరిస్తుంది. ఈ అధ్యయనం ఆ దైవాన్ని శివునిగా (పశుపతి రూపంలో) గుర్తించడంలో చాలా కష్టపడుతుంది. తదుపరి హిందూ మతంలో శివునితో ముడిపడి వున్న చిహ్నాలు ఏవీ లేకపోవడమే ఈ పరిస్థితికి కారణం.

కాలిబంగన్‌లో లభించిన సిలిండర్ ఆకారపు ముద్రికలో ఈటెలతో పోరాడుతున్న ఇద్దరు వ్యక్తులను వారిస్తున్న దేవత ఉంది. తర్వాత ఆ దేవత దున్న కొమ్ములు, పులి శరీరంతో ప్రత్యక్షమవుతుంది. ఈ ముద్రిక, అలాగే ఇతర ముద్రికలలో జంతువులు దైవ శక్తిని లేదా దైవాత్మను ప్రతిబింబిస్తాయి. అలాంటి ఇష్ట దైవాలలో మానవులు కూడా ఉన్నారు. ఉదాహరణకు కథానాయకుడు, కథానాయిక. వీరు ముద్రికలలో, ఫలకాలలో కనిపిస్తారు. నిల్చున్న రెండు పులులను ఎదుర్కొంటూ ముద్రికలకు ఇరువైపులా కనిపిస్తారు. రెండు క్రూరమృగాలతో అలాంటి పోరు సుసా (నైరుతి ఇరాన్), మెసొపొటోమియా ముద్రికలలో బలంగా ప్రతిబింబిస్తుంది. అటు తర్వాత ఒక ఫలకంలో దున్నపోతు కొమ్ములు గల దేవత ఎదుట దున్నపోతును చంపుతున్న ఒక ఈటెకారుడు కనిపిస్తాడు. బహుశా అతడు దున్నపోతును దేవతకు బలి ఇచ్చి ఆమెను ప్రసన్నం చేసుకోవాలని చూస్తున్నాడు.

మరో అంశం చెట్టు ఆత్మ లేదా దైవం. ముద్రికలు, పింగాణి ఫలకాలపై గీసిన చిత్రాలలో ఒక పులి చెట్టు దైవం వైపు వెనక్కు మళ్లి చూస్తూ ఉంది. చెట్టు, జంతువు ఆత్మల కలయికను అది ప్రతిబింబిస్తుంది. పీపల్ (రావిచెట్టు) కొమ్మలు ముద్రికలపై కనిపిస్తాయి. అయితే ఒక మొహెంజొదారో ముద్రికపై చక్కిన విశాల దృశ్యంలో పీపల్ చెట్టులో ఒక దైవం ఉంది. దానికి మత్స్య చిహ్నం, పెద్ద మేక ఉన్నాయి. ఒక జంతువును బలిస్తూ ఒక భక్తుడు ఆ దైవాన్ని మొక్కుతూ ఉన్నాడు. అడుగున ఏడుగురు మహిళలు (బహుశా పురోహితురాళ్లు) వరుసగా నిలబడి ఉన్నారు. ఈ ముద్రికలో బలి ఇచ్చిన వస్తువును అనేకమంది విద్వాంసులు మానవ శిరస్సుగా గుర్తించారు. ఈ అధ్యయన ఫలితాన్ని వివరించడం చాలా కష్టం. బలిపశువు మానవుడని మాత్రమే ఇక్కడ చెప్పగలము. శిరస్సును సంరక్షించడానికి జాడిని తయారుచేయడం కులదైవాన్ని ప్రసన్నం చేసుకోవడానికేనని బోధపడుతుంది.

పశు సంబంధమైన ఆత్మలు, పవిత్ర పీపల్ చెట్టుతో కూడిన అధికారిక సింధూ మతం మూలాలు అలిఖిత చరిత్ర కాలం నాటి ప్రకృతి విశ్వాసాలలో ఉన్నాయని ఇట్టే అర్థమవుతుంది. లిఖిత చరిత్ర కాలంలో కూడా ఆ నమ్మకాలు ప్రాధాన్యతను కలిగి ఉండేవి. హరప్పా నివాస క్షేత్రాలకు అతి సమీపంలోనే క్రూర మృగాలు సంచరించేవి. కనుక పొదల చాటునో, అడవులలోనో ప్రజలకు క్రూర మృగాలు ఎదురపడే అవకాశాలు ఎక్కువగా ఉండేవి. పాత నమ్మకాలు లేదా విశ్వాసాలు పురాణగాథలవల్ల, ప్రతీకాత్మకవల్ల బలోపేతమై ఉంటాయి.

అవన్నీ మౌఖికంగా తరాల తరబడి ప్రవచించాయి. అయితే సింధూ లిపిని అర్థం చేసుకోకపోవడం వల్ల హరప్పా ప్రజల మత విశ్వాసాలను నేటికి కూడా నిర్ధారించలేక పోయారు. సింధూ అధికారిక మతం, రుగ్వేద మతం, కర్మకాండల మధ్య సారూప్యతను అనేక మంది విద్వాంసులు చూడలేకపోయారు. అందుకే వాటి మధ్య సారూప్యతలు ఉన్నాయన్న వాదనలు ఇక్కడ చెల్లుబాటు కావు. సింధూ నాగరికత అంతరించిన 1,800 సంవత్సరాల తర్వాతే హిందూ మతంలోకి యోగ, శైవం ప్రవేశించాయి.

ఈ దశలో సింధూ అధికారిక మతాలకు గుళ్లు గోపురాలు ఉండేవో లేదో నిర్ధారించడం చాలా కష్టం. మొహంజొదారో దిగువ పట్టణంలో వీలర్ ఒక నిర్మాణాన్ని కనుగొన్నాడు. దానికి భారీ ద్వారం ఉంది. ఇరువైపులా నిచ్చెనమెట్లతో ఎత్తైన వేదిక లోపలి భాగంలో ఉంది. దానిని దేవాలయంగా రుజువు చేయగలిగితే అది ఏకశ్రింగ దేవతకు అంకితమై ఉంటుంది. ఎందుకంటే ఏకశ్రింగ ఒక్కటే అనేక ముద్రికలపై ఎక్కువగా దర్శనమిస్తుంది.

అలాగే మొహెంజొదారో వద్ద గల గొప్ప స్నాన ఘట్టం కూడా సాంప్రదాయ స్నానానికి అధికారిక వేదికగా ఉండేదన్న వాదన ఇంతవరకూ నిరూపితం కాని ఊహాగానం మీద ఆధారపడి ఉంది. సింధూ ప్రజలు ప్రాథమికంగా కర్మకాండయుత పవిత్రత కోసం జలాన్ని ఉపయోగించేవారని చేసిన ఊహాగానం ఇప్పటి వరకు తేలలేదు.

పింగాణీ పూతగల అనేక చిన్న గుంతలను (గొయ్యి) కాలిబంగన్, లోథల్, బనావలి, నాగేశ్వర్ తదితర ప్రాంతాలలో వెలికితీశారు. అవి సార్వజనిక ప్రదేశాలలోనూ, ఇంటి ఆవరణలలోనూ లభించాయి. వాటిని హోమగుండాలుగా అభివర్ణించారు. అయితే అలాంటి అగ్ని గుండాలు మొహెంజాదారో, హరప్పా లాంటి ముఖ్యమైన ప్రదేశాలలో కనిపించలేదు. అవి అగ్ని గుండాలే కనక అయితే అవి ఎంత చూసినా ఒక ప్రాంతీయ ఆచారాన్ని మాత్రమే ప్రతిబింబిస్తాయి. కాలిబంగన్ వద్ద ఒక చిన్న బలిదాన గొయ్యి కూడా ఎద్దు ఎముకలతో లభించింది. లోథల్ వద్ద కాలిపోయిన ఎద్దు దవడ లభించింది. దాని ఆధారంగా ఇంటిలో వున్న మట్టి వేదికను బలిదాన పీఠంగా గుర్తించారు. ఈ పరిమిత సాక్ష్యంతో పశుబలికాండను లేదా దాని ఆధారంగా వేద సంబంధాలను నిర్ధారించడం చాలా కష్టం.

టెర్రకోట, ఇతర బొమ్మలు ప్రైవేటు గృహాలలో లభించడంతో వాటిని గృహ మూఢ విశ్వాసాలు, మత విశ్వాసాలకు సాక్ష్యంగా చూపారు. దైవ మాత విగ్రహాలు (బొమ్మలు) పెద్ద సంఖ్యలో ఉండడమే కాకుండా సంతానాన్ని ప్రసాదించే మగదేవతల బొమ్మలను కూడా సంఖ్యాపరంగా అధిగమించాయి. వీటిని సంతానం కోసం పూజించి ఉంటారు. అయితే ఏ విషయాన్ని ఖచ్చితంగా చెప్పలేము. ముఖ్యంగా రాతి మొలలు, భారీ శిలారింగుల గురించి స్పష్టమైన వివరణ ఇవ్వలేము. కొందరు విద్వాంసుల ప్రకారం ఈ రాతి నిర్మాణాలు స్త్రీ, పురుషుల జననాంగాలను ప్రతిబింబిస్తాయి. వాటిని లింగ పూజకు చిహ్నాలుగా భావిస్తారు.

## వైదిక మతం

### వైదిక మత స్వభావం :

వైదిక మతాన్ని చాలా వరకు ఏకేశ్వరోపాసనగా వివరించవచ్చు. ఇలాంటి సిద్ధాంతంలో ఒక్కో దైవం ఉన్నత స్థానాన్ని ఆక్రమిస్తుంది. వివిధ ప్రకృతి దృగ్విషయాలను అర్థం చేసుకొని వివరించడంలో ఆర్యులు విఫలమయ్యారు. అందుకే ప్రకృతి శక్తులను వ్యక్తిగతం చేసి వాటిని పూజించడం మొదలుపెట్టారు. వాటికి మానవ లేదా పశు లక్షణాలను ఆపాదించారు. వైదిక మతం యొక్క ఈ ఏకత్వ సిద్ధాంతం తదుపరి కాలంలో ఆవిర్భవించిన బ్రాహ్మణవాదం యొక్క బహుదైవత్వానికి చాలా భిన్నమైనది. మరో మాటలో చెప్పాలంటే వైదిక మతం ఎలాంటి స్థాయి క్రమం లేని బహుళత్వాన్ని సూచిస్తుంది. అయితే బ్రాహ్మణ వాదం స్థాయి క్రమంతో కూడిన బహుళత్వాన్ని అనుమతినిస్తుంది. కాని రుగ్వేద కాలం నుండి కొన్ని వర్గాలు ఏకేశ్వరవాదాన్ని, ఏకదైవాన్ని పాటించడం మొదలుపెట్టారు. ఏకేశ్వరవాదంలో కేవలం ఒకే ఒక్క దైవాన్ని మాత్రమే అనుమతిస్తారు. అయితే మోనిజం (ఏకదైవం) వివిధ దృగ్విషయాలను ఒకే ఒక్క సూత్రంతో వివరించడానికి ప్రయత్నిస్తుంది.

వైదిక దైవాలు రుగ్వేద భక్తి ప్రవచనాలలో 33 ఉన్నట్లు పేర్కొన్నారు. వాటిని మూడు వర్గాలుగా విభజించారు. విశ్వం యొక్క మూడు భాగాలవలె వాటిని వర్గీకరించారు. మొదటిది పృథ్వీస్థాన, రెండవది అంతరిక్షస్థాన లేదా మధ్యమస్థాన, మూడవది ద్యుస్థాన. మొదటి వ్యవస్థలో పృథ్వీ, అగ్ని, సోమ, బృహస్పతి, నదులు ఉన్నాయి. ఇంద్ర, రుద్ర, వాయు, వట, పరాజన్య, మతరీశ్వన్ రెండవ వ్యవస్థకు చెందుతాయి. ద్యాయుస్, మిత్ర, సూర్య, సావిత్రి, పుషన్, విష్ణు, ఆదిత్యాలు, ఉషలు, అశ్విన్‌లు మూడవ వ్యవస్థలో ఉన్నారు. ఈ విభజన నిరంతరంగా, అసమగ్రంగా ఉంది. ఎందుకంటే అగ్ని, పృథ్వీలను మూడు క్షేత్రాలన్నిటిలో పొందుపరిచారు. ఉషలను భూమి, గగన క్షేత్రాలలో, వరుణ, యమ, సావిత్రిలను గగన, ద్యుస్థానాలు రెండింటిలో ఉంచారు.

### ముఖ్యమైన దైవాలు :

రుగ్వేద కాలంలో అత్యంత ముఖ్యుడైన దైవం ఇంద్ర లేదా పురంధర. రుగ్వేదంలో సుమారు 250 గీతాలు అతడిని కీర్తిస్తాయి. అతడు యుద్ధ ప్రభువు పాత్రను పోషిస్తాడు. అతడిని వరుణ దేవునిగా పరిగణిస్తారు. ఒక భక్తి గీతం అతడి అత్యంత ప్రాధాన్యత కలిగిన విజయాన్ని వివరిస్తుంది. అతడు వృత్ర అనే రాక్షసునిపై విజయం సాధించి జలాలను విడుదల చేశాడు. రెండవ స్థానంలో అగ్ని ఉన్నాడు. రుగ్వేదంలో 200 గీతాలు అతడిని కీర్తిస్తాయి. అతడు అగ్నిదేవుడు. ప్రజలు, దైవాల మధ్య వారధిగా అతడిని గుర్తిస్తారు. అతడు దేవతల పురోహితుడు, పురోహితుల దేవుడు. సోమ మొక్కల దేవత. ఒక మత్తు పానీయానికి అతడి పేరు పెట్టారు. రుగ్వేద స్తోత్రాలను పరిశీలిస్తే సోమ మూడవ అతి ముఖ్యమైన దేవునిగా ఉన్నాడు. రుగ్వేద కర్మకాండలలో అత్యంత ముఖ్యమైనది బలిదానం. 120 భక్తిగీతాలు (సోమను

స్తుతించే)లో ఆరు తప్ప మిగతావన్నీ తొమ్మిదవ మండల అనే పుస్తకంలో జత చేయడం బట్టి పై విషయాన్ని అర్థం చేసుకోవచ్చు. మరోవైపు ఇతర దేవుళ్లను కీర్తించే గీతాలు రుగ్వేదలోని తొమ్మిది మండలాల్లో చెల్లాచెదురుగా విస్తరించి ఉన్నాయి.

వరుణదేవుడు. రుత లేదా ప్రకృతి వ్యవస్థను కాపాడే బాధ్యత అతడిపై ఉందని భావిస్తారు. బ్రహ్మాండ చట్టాన్ని అమలుచేసే అధికారిగా అతడు ఈ ప్రపంచంలోని అన్ని కార్యకలాపాలను నియంత్రిస్తాడు. సూర్యుడిని స్తుతించే స్తోత్రాలలో, అలాగే సూర్యోదయం, సంధ్య, రేయి, తుఫాను, ఇతర ప్రకృతి శక్తులను కొలిచే గీతాలలో కవుల దృష్టంతా ప్రత్యక్షమైన దృగ్విషయం పైనే కేంద్రీకృతమై ఉంది. ఉషల (సూర్యోదయం)ను కీర్తించే గీతాలు రుగ్వేదంలో అత్యంత ఆకర్షణీయమైనవి. సూర్యోదయాన్ని ఉన్నతంగా, అందంగా, చివరకు ప్రణయశైలిలో వివరించడం వల్లే వాటికి అలాంటి హోదా దక్కింది. ఇతర ముఖ్యమైన మహిళా దేవతలలో ఆదితి, అరణ్యాని, నిర్రితి ఉన్నారు.

మలివైదిక కాలంలో ప్రజాపతి, విష్ణు, రుద్ర లాంటి కొత్త దైవాలు ఉద్భవించి ఇంద్ర, అగ్ని కంటే ఎక్కువ ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. కొందరు విద్వాంసుల ప్రకారం రుద్ర పూజ ఒక హరప్పా పూజా విధానం (పశుపతి మహాదేవ) నుండి పరిణామం చెందింది. అందుకే దానిని ఆర్యేతర ప్రభావంగా పరిగణిస్తారు. కొన్ని సామాజిక వర్గాలకు ప్రత్యేక దైవాలు ఆవిర్భవించాయి. ఉదాహరణకు సూద్రులకు పుషన్ (పశువుల సంరక్షకుడు) ఉన్నాడు. రెండు కాలాల్లోనూ దైవ నిర్మాణ స్వరూపంలో పురుషులకే స్పష్టమైన ఆధిపత్యం ఉండేది.

**పూజా విధానం :**

రుగ్వేద కాలంలో వ్యక్తిగతంగా, ఉమ్మడిగా భక్తిగీతాలను ఆలపించి దైవానికి కానుకలు సమర్పించేవారు. కానుకలలో ధ్యానం, కూరగాయలు, మాంసం, నెయ్యి తదితర వస్తువులు ఉండేవి. కానుకల సమర్పణలో ఎలాంటి కర్మకాండకాని బలిదాన మంత్రాలు కాని ఉండేవికావు. ఎందుకంటే పదం యొక్క మంత్ర శక్తిని అంతవరకు చాలా ముఖ్యమైనదిగా గుర్తించలేదు. మలివైదిక కాలంలో పూజా విధానంలో మార్పు వచ్చింది. భక్తిగీతాలకు ఉన్న ప్రాధాన్యత క్షీణించింది. బలిదానాల ప్రాధాన్యత పెరిగింది. బలిదానాలలో జంతు బలిని భారీ స్థాయిలో నిర్వహించేవారు. వాటిని నిర్వహించే సమయంలో భక్తులు అత్యంత జాగ్రత్తగా మంత్రాలను ఉచ్ఛరించాల్సిన అవసరం ఉండేది. రెండు కాలాల్లోనూ మెజారిటీ ప్రజలు భౌతిక ప్రయోజనాల కోసమే తప్ప ఆధ్యాత్మిక ఉన్నతికోసం దేవదేవతలను పూజించలేదు.

సాధారణ స్థాయి బలిదానానికి తోడు సత్ర అనే భారీ స్థాయి బలిదానాలు కూడా నిర్వహించేవారు. ఈ భారీ బలిదానాలను విస్తృతంగా అభివృద్ధి పరచి సంస్థాగత స్వరూపాన్ని ఇచ్చారు. ఈ కారణంగా బలిదానానికి సంబంధించిన నిత్య శాస్త్రం ఆవిర్భవించింది. పౌరోహిత్యం అనువంశిక వృత్తిగా మారింది. యజమాన (బలి ఇచ్చేవాడు) ఆచరణలో చేసేదేమీ ఉండదు. పురోహితులకు ఉదారంగా రుసుమును చెల్లించడం మినహా బలిదాన ఉత్సవంలో అతడి

పాత్ర నామ మాత్రమే. అత్యంత సంక్లిష్టమైన, విస్తృతమైన ఉత్సవాన్ని (బలిదానం) నిర్వహించడానికి నలుగురు ప్రధాన పురోహితుల నేతృత్వంలోని నాలుగు పురోహిత వర్గాలు అవసరమయ్యేవి. ప్రధాన పురోహితులలో హోత లేదా హోత్రి, ఉద్గాత్రి, ఆధ్వర్యు, బ్రాహ్మిణ్ ఉండేవారు. కర్మకాండలు, బలిదానాలకు అమిత ప్రాధాన్యత ఉండేది.

**శ్రమణ ఉద్యమం :**

ఈ తరహా ఆర్భాటపు కర్మకాండవాదం శ్రమణ మతం రూపంలో సహజ ప్రతిచర్యను సృష్టించింది. వేదాల దైవమూలాలను, బలిదానాల సామర్థ్యాన్ని శ్రమణ మతం ప్రశ్నించింది. శ్రమణ మత ఆవిర్భావం అరణ్యక, ఉపనిషద్ రచయితలను ప్రభావితం చేసినట్లుంది. ఎందుకంటే వారు పనికిరాని కర్మకాండకు బదులు శాంతి, మోక్షం కోసం నిజమైన జ్ఞానాన్ని కోరుకున్నారు. ఈ శ్రమణులను కులం, తెగలకు అతీతంగా భర్తీ చేసుకున్నారు. వారి ఉపాధ్యాయులు (గురువులు) వేదాలు, బ్రాహ్మణిక వ్యతిరేకులు. వేద అధ్యయనాన్ని, వైదిక కర్మకాండలను సవాలు చేశారు. శ్రమణులపై దృష్టి సారించాలని పిలుపు నిచ్చిన తొలి సిద్ధాంతకర్త యాజ్ఞవాల్క్య. శ్రమణులను తిత్థియా లేదా తీర్థంకరులని కూడా పిలుస్తారు. వారు సన్యాస జీవితాన్ని గడిపారు. ఇష్టానుసారంగా మాయమయ్యేవారని చెబుతారు. చివరకు అజీవికలు కూడా శ్రమణులుగా గుర్తింపు పొందారు. గోసలకు ముందు ఇద్దరు అజీవిక నాయకులు ఉండేవారు. నందవచ్ఛ, కిసాసన్‌కిచ్ఛాలను తీర్థంకరులుగా కూడా పరిగణించేవారు.

శ్రమణ ఉద్యమం వేద సిద్ధాంతకర్తల కళ్లను తెరిపించినట్లు కనబడుతోంది. వైదిక మతాన్ని సంస్కరించాల్సిన అవసరాన్ని వారు గ్రహించారు. శ్రమణ మతంలోని ఉన్నత అంశాలను తీసుకున్నారు. అదే సమయంలో బలిదానాలు, కర్మకాండలు, పురోహితుల ఆధిపత్యం లాంటి దుర్గుణాలను తొలగించడానికి ప్రయత్నించారు. ఈ సంస్కరణవాద వైదిక మతం గురించి అరణ్యకాలు, ఉపనిషత్తుల నుండి తెలుసుకోవచ్చు. అరణ్యకాలు అంతర్గత లేదా మానసిక బలిదానానికి ప్రాధాన్యత నిచ్చాయి. ఆ విధంగా అవి కర్మమార్గ, జ్ఞాన మార్గాల మధ్య ఉన్న దూరాన్ని పూడ్చడంలో తోడ్పడ్డాయి. కర్మమార్గాన్ని బ్రహ్మణులొక్కరే ప్రతిపాదించేవారు. అయితే ఉపనిషత్తులు జ్ఞాన మార్గాన్ని ప్రబోధించాయి. బృహదారణ్యక ఉపనిషత్తు ఒక వ్యాఖ్యానంలో ఆత్మ యొక్క అదృష్టాల గురించి వివరించింది. ఆశ్చర్యకరమైన రీతిలో ఆత్మ పరిణామవాద సిద్ధాంతాన్ని అభివృద్ధి పరచింది. దానికి అత్యంత దగ్గరగా కర్మ సిద్ధాంతాన్ని కూడా ప్రబోధించింది.

**మరణం తర్వాత జీవితం :**

పునర్జన్మ గురించి నిర్దిష్టమైన సిద్ధాంతాన్ని రుగ్వేద కాలం సృష్టించలేదు. ఆత్మలు మొక్కల రూపంలో పునర్జన్మిస్తాయన్న ఆలోచన అప్పటికి అభివృద్ధి చెందలేదు. మలివైదిక కాలంలో మరణం తర్వాత జీవితాన్ని పాపానికి శిక్ష, పుణ్యానికి కానుక అనే రీతిలో ప్రతిపాదించారు. చివరి వైదిక భక్తిగీతాలలో ద్విజన్మ సిద్ధాంతానికి ఆధారం ఉంది. వేదాలలో

ద్విజన్మ సిద్ధాంతం అంత స్పష్టంగా లేదు. అయితే ఉపనిషద్‌లు ఒక జీవితం నుండి మరో జీవితానికి ఆత్మలు మారుతాయన్న నమ్మకాన్ని వ్యక్తం చేశాయి. గత జన్మలో చేసిన పుణ్య కార్యాల ఆధారంగా మలి జన్మలో ఉన్నత జీవితం పొందుతారని ప్రబోధించాయి. ఈ నమ్మకం లేదా విశ్వాసం నుండే కర్మ సిద్ధాంతం అభివృద్ధి చెందింది. ఈ సిద్ధాంతాన్ని వాస్తవికంగా రుగ్వేదంలో పేర్కొనలేదు. అయితే ఈ జన్మలో ఒక వ్యక్తి నైతిక నడవడిక ఆధారంగా మలి జన్మలో అత్యుత్తమ స్థానం లభిస్తుందని మాత్రం అది స్పష్టం చేసింది. కాని బృహదారణ్యక ఉపనిషద్‌లోనే కర్మ సిద్ధాంతాన్ని స్పష్టంగా ప్రవచించారు. మనిషి తాను ఎలా బతికితే అలా మారతాడని ఆ ఉపనిషత్తు వివరించింది.

## ఉపనిషత్తు ఆలోచన

### ఉపనిషత్తుల స్థానం :

ఉపనిషద్ అనే పదంలో మూడు పదాలు కలసి ఉన్నాయి. ఉప అంటే సమీప, ని అంటే క్రింద, షద్ అంటే కూర్చోవడం. కనక ఉపనిషద్ అంటే "ప్రబోధనం వినేందుకు గురువు పాదాల కింద కూర్చోవడం" అని అర్థం. ఉపనిషత్తులలో వేదాంత (వేదాల ముగింపు) అంతర్భాగంగా ఉన్నాయి. కేవలం చివరి అధ్యాయాలుగా కాకుండా వేదాలే అంతిమ బోధనలు కావడం వల్లే అవి ఉపనిషత్తులలో ముఖ్యమైన స్థానాన్ని ఆక్రమించాయి. ఉన్నతమైన చైతన్య దశకు చేరుకోవడానికి వేదాలు అత్యంత ప్రధానమైన సాధనాలు. ఉన్నత చైతన్యదశకు అవతల మౌనమే రాజ్యమేలుతుంది.

తొలి ఉపనిషత్తులు కూడా వేదాలలో భాగమే. కనుక అవి శృతిలో కూడా భాగమయ్యాయి. వైదిక తత్త్వ శాస్త్రంలో అవి మూలాధారాలుగా ఉన్నాయి. ఈ విజ్ఞాన గనిలో బ్రహ్మాండ మూలాలు వివరణ, బ్రాహ్మణ్; జీవాత్మన్‌ల స్వభావం, మదికి, విషయానికి మధ్య ఉన్న సంబంధం మొదలైన విషయాలు ఇమిడి ఉన్నాయి. కనక ఉపనిషత్తుల ప్రధాన విషయం "సంపూర్ణ జ్ఞానం" అంటే బ్రాహ్మణ, జీవాత్మ ఉనికిని తెలుసుకోవడం. తత్వం అసి లేదా "నీవు ఫలానా వాడివి" (చందోగ్య ఉపనిషత్తు), భిన్నత్వంలో ఏకత్వాన్ని అన్వేషించడం ఉపనిషద్‌ల ప్రధాన ఉద్దేశ్యం. యజ్ఞ వాల్క్య బోధించిన విధంగా కర్మ సిద్దాంత సూత్రాలు ప్రబోధించిన తొలి మత గ్రంథాలు ఉపనిషద్‌లే (బృహదారణ్యక ఉపనిషద్).

సైద్ధాంతిక వితండవాదం ఎక్కడా లేకపోవడం, అలాగే సార్వజనీనత ఉపనిషత్తుల మౌలిక లక్షణాలు. మానవ మేధస్సు ఇంతవరకు రూపొందించిన ఉన్నతమైన తత్త్వశాస్త్రాన్ని ఉపనిషద్‌లు ప్రతిబింబిస్తాయి. స్థూలంగా 108 ఉపనిషద్‌లు ఉన్నాయి. అయితే తొలి 12 ఉపనిషత్తులు మాత్రమే వేద సాహిత్యంలో అంతర్భాగంగా ఉన్నాయి.

**1. పన్నెండు ప్రధాన ఉపనిషత్తులు :**

1. రుగ్వేదానికి చెందిన ఐత్రేయ, కౌసితకి
2. చందోగ్య, కేన (సామవేద)
3. యజుర్వేదానికి చెందిన తైత్రియ, కథ, శ్వేతష్వతర, బృహదారణ్యక, ఇష
4. అథర్వవేదానికి చెందిన ప్రశ్న, ముండక, మండూక్య

2. 23 సామాన్యయువేదాంత ఉపనిషత్తులు
3. 20 యోగి ఉపనిషత్తులు
4. 17 సామాన్యస ఉపనిషత్తులు
5. 14 వైష్ణవ ఉపనిషత్తులు
6. 14 శైవ ఉపనిషత్తులు
7. 8 శక్త ఉపనిషత్తులు

**ఉపనిషద్ ఆలోచనా విధానం :**

ఆధ్యాత్మిక ప్రబోధనలు, అన్వేషణలకు ఉపనిషత్తులు ప్రాతినిధ్యం వహిస్తాయి. తదుపరి భారతీయ తత్త్వశాస్త్రమంతటికీ అవే మూల పరిచయ గ్రంథాలయ్యాయి. నాస్తిక ఆలోచకులకు కూడా అవే మార్గదర్శకంగా నిలిచాయి. నాస్తికులు వేదాలకు ఉన్న మత గ్రంథాల హోదాను తిరస్కరించిన విషయం అందరికీ తెలిసిందే. శంకరలాంటి గొప్ప తత్త్వవేత్త 11 ఉపనిషత్తులపై వ్యాఖ్యానాలు రచించాడు. ఈ వ్యాఖ్యానాలు ప్రత్యేక హోదాను దక్కించుకున్నాయి. భావాత్మక అనుభూతిలో పూడుకుపోయి ఉన్న ఉపనిషద్ సాంప్రదాయం హేతుబద్ధమైన, తెలివైన అభివ్యక్తీకరణను కోరుకుంటుంది. తన నిర్ధారణలను పరీక్షించాలని మానవులను ప్రోత్సహిస్తుంది. ఉపనిషత్తు రుషులు వేద సాంప్రదాయానికి చెందినవారు. వేద సాహిత్యంలో అంతర్భాగమైన కృతులలో వారి బోధనలు నిక్షిప్తమై ఉండడమే కాకుండా పురాతన జీవన సాంప్రదాయంలో అవి నిలువెత్తుగా నిలబడి ఉన్నాయి. పౌరోహిత్య సంప్రదాయంలోని శక్తులను వారు తరచూ విమర్శించారు. మోక్షానికి కర్మకాండలు, బలిదానాలే సమర్థవంతమైన మార్గాలన్న వాదనను కొందరు తోసిపుచ్చారు. అయినప్పటికీ వారు బలిదాన పురోహితుల సంప్రదాయంలోనే ఉండిపోయారు. సాంప్రదాయవాద పంథాకు చెందినప్పటికీ ఉపనిషత్తు రుషులు ఇతర వేద గ్రంథాలకు పూర్తి భిన్నమైన మతాచార శైలికి ప్రాతినిధ్యం వహిస్తారు. మతపరమైన చైతన్యంలో గుణాత్మక మార్పు ఇక్కడ విదితమవుతుంది.

మతపరమైన అంశాలను వినూత్నంగా పునఃనిర్మించిన ప్రక్రియను ఉపనిషత్తులు అద్దంపడతాయి. గత కాలపు సాంప్రదాయాలతో తమను తాము ముడిపెట్టుకునేందుకు రుషులు విభిన్న మార్గాలను అనుసరించారు. ఉదాహరణకు బలిదాన కర్మకాండలను అన్వయించే సాంప్రదాయాన్ని వారు కొనసాగించారు. కర్మకాండల కంటే వాటికి ఉన్న ప్రతీకాత్మకతను రక్షించడానికే వారు ఎక్కువగా శ్రమపడ్డారు. భారతీయ ఆలోచనా ధోరణిని అభివృద్ధి పరచడంలో ఉపనిషత్తులు ప్రధాన మలుపురాయిగా ఉన్నాయి. ధ్యానం, భావాత్మక అనుభూతి, దాని తాత్విక అన్వయానికి మతపరమైన అన్వేషణలో కీలక స్థానాన్ని ఉపనిషద్‌లు కల్పించాయి.

కేవలం జీవిత పరమార్థాన్ని తెలుసుకోవాలన్న మేధోపరమైన తపనపైనే వారు దృష్టి సారించలేదు. అందుకు భిన్నంగా ఆ రుషులు ప్రతిపాదించిన అన్వేషణ తపన అనుభవపూర్వకమైనది. ధ్యానానుభూతిపై వారికున్న దృష్టి ప్రకారం, అది అందించే జీవన రహస్యం ప్రకారం ఉపనిషత్తులను అనేకమంది సిద్ధాంతకర్తలు, తత్త్వవేత్తలు మూలాధారాలుగా ఉపయోగించుకోవడంలో ఎలాంటి ఆశ్చర్యం కనిపించదు. మతపరమైన చరిత్ర అంతటా సాంప్రదాయవాద ఆలోచకులే కాకుండా నాస్తిక అసమ్మతివాదులు కూడా ఉపనిషత్తులను రెఫరెన్స్ గ్రంథాలుగా వాడుకున్నారు. ఉదాహరణకు బౌద్ధ కృతులు తొలి ఉపనిషత్తుల నుండి సంకల్పించిన అంశాలతో పరిపుష్టంగా ఉన్నాయి.

ఉపనిషత్ సాంప్రదాయం ఎలాంటి సవాళ్లను ఎదుర్కోకుండానే ముందుకు సాగలేదు. బుద్ధ కాలానికి పూర్వం తొలి ఉపనిషత్తులు వెలువడగా తదుపరి ఉపనిషత్తులు చాలా వరకు అతడి కాలంలో, ఆ తర్వాతి కాలంలో వచ్చాయి. బౌద్ధులు, జైనులు సాంప్రదాయవాదంపై భారీ ఎత్తున దాడి చేయకముందే ఇతర బోధకులు అసమ్మతి సిద్ధాంతాలను ప్రతిపాదించడం ప్రారంభించారు. ఉపనిషత్తు బోధనల సత్యాన్ని ఆ సిద్ధాంతాలు తిరస్కరించాయి. ఉపనిషత్తులను మనం పవిత్రమైన, ఆత్మవిశ్వాసంగల, ఎదురులేని ఆధ్యాత్మిక సాంప్రదాయ ఉత్పత్తులుగా చూడకూడదు. వాటిని తొలి యుగానికి చెందినవిగా, ముట్టడిలో సాంప్రదాయవాద ఆధ్యాత్మిక ప్రణాళికగా పరిగణించాల్సిన అవసరం ఉంది. ఈ పరిస్థితిలో రుషుల హోదా మరింత ఆసక్తికరంగా మారింది. అందులో వారు ఆత్మరక్షణతో కూడిన స్వల్పకాలిక చర్యను తీసుకోలేదు. తన సొంత సాంప్రదాయవాదానికి విమర్శనాత్మక సమాధానాన్ని అందిస్తూనే దానికి కంకణబద్ధులై కనిపించారు. నాస్తికులలాగే వారు పురోహిత మూల్యాంకణాన్ని (కర్మకాండలు, బలిదానాలలో) వ్యతిరేకించారు. అయితే వేద సముదాయంలో విశ్వాసపాత్రులుగా కొనసాగారు.

## ఉపనిషత్తుల విషయసూచికలు :

ఉపనిషత్తుల ప్రకారం రెండు రకాల జ్ఞానం ఉంది. మొదటిది ఉన్నతమైనది, రెండవది అల్పమైనది. ఉన్నత జ్ఞానం శాశ్వత గుణం ఉన్న బ్రాహ్మణ్‌ను తెలుసుకోవడంలో మనకు ఉపయోగపడుతుంది. అయితే అల్పజ్ఞానాన్ని నాలుగువేదాలు, అలాగే ఆరు వేదాంగాల నుండి గ్రహించవచ్చు. సర్వశక్తిమంతుడైన బ్రాహ్మణ్‌పై ఉన్నత జ్ఞానం, అనుభవపూర్వక ప్రపంచ

అల్పజ్ఞానాల మధ్య స్పష్టమైన తేడాను ముండక ఉపనిషద్ అందిస్తుంది. నిర్దిష్టమైన, సమానమైన లేదా ఏకీకృత తాత్విక వ్యవస్థను అందిస్తున్న గ్రంథాలుగా ఉపనిషత్తులను పరిగణించలేము. వాటిలో కొన్ని సిద్ధాంతాలను సమానంగా ఆమోదించినా ఈ విషయంలో మాత్రం రెండవ మాటకు ఆస్కారమే లేదు. పద్ధతి, అభిప్రాయం, నిర్ధారణలో వైరుధ్యాలు సర్వవ్యాపితంగా కనిపిస్తాయి. చివరకు ఒక ఉపనిషత్తులలోనే ఇలాంటి వైరుధ్యాలు దర్శనమిస్తాయి. ఈ కారణంగానే ఉపనిషత్తులను కాల్పనిక (ఊహాజనిత) గ్రంథాలుగా పరిగణిస్తారు. ఉపనిషత్తుల, ముఖ్యంగా తొలి ఉపనిషత్తు గ్రంథాల, మరో ముఖ్యమైన లక్షణం ఏమిటంటే వాటిలో ప్రతిపాదించిన ప్రతి మౌలిక ఆలోచనకు ఆచరణపరంగా తొలి వేద గ్రంథాలలో మూలాలు ఉన్నాయి. సృజనాత్మక రచనను పక్కనపెడితే ఉపనిషత్తుల విశిష్టత తొలి వేద సిద్ధాంతాలను అన్వేషించి కొత్త అన్వయింపులను అందించడంలోనే ఉంది. బ్రహ్మాండ, మానవునిపై మరింత స్పష్టమైన ఆలోచనను ఆదుకోవడానికి అవి ప్రయత్నించాయి. ఇక్కడ బ్రహ్మాండం, మానవుని మధ్య సంబంధం కర్మకాండ చర్యగా ఏ మాత్రం మిగలదు. అందుకు విరుద్ధంగా కర్మకాండలో ప్రతీకాత్మకంగా ప్రతిబింబించిన శక్తులపై అవగాహనను అది తలపిస్తుంది.

ఈ కారణంగా పునర్జన్మ సిద్ధాంతం తొలుత బృహదారణ్యక ఉపనిషత్తులోని అదనపు భాగంలో ప్రత్యక్షమవుతుంది. అలాగే చందోగ్య ఉపనిషత్తులో కూడా కొద్ది వరకు పూర్తి స్థాయి (సంపూర్ణ రూపం)లో కనిపిస్తుంది. ఈ రెండు ఉపనిషత్తులు అత్యంత ప్రాచీనమైనవి. మరోవైపు, బృహదారణ్యక ఉపనిషత్తు ఒక కొత్త ఆలోచనను ముందుకు తెచ్చింది. దాని ప్రకారం కొన్ని రకాల జ్ఞానాన్ని ఆర్జించిన వాడు వరుసగా వచ్చే మృత్యువును (ఈ సిద్ధాంతాన్ని బ్రాహ్మణాలలో తొలిగా ప్రతిపాదించారు) దూరంగా ఉంచవచ్చు. వైశ్వనా ఆత్మ సిద్ధాంతాన్ని చందోగ్య ఉపనిషత్తులోని అనేక కథలలో బోధించారు. అందులోని ఒక కథ ప్రకారం గొప్ప తత్త్వవేత్త అయిన ఉద్ధకల అరుణితో పాటు ఐదుగురు గృహస్తులు కేకయరాజు, తత్త్వవేత్త అయిన అశ్వపతి వద్దకు వెళతారు. ఆత్మకు సంబంధించిన జ్ఞానాన్ని పొందాలనే లక్ష్యంతో వారు రాజును కలుస్తారు. అయితే చందోగ్యలో అత్యంత ముఖ్యమైన ఉదంతం ప్రకారం ఉద్ధకల తన కుమారుడు శ్వేతకేతుకు వ్యక్తిగత ఆత్మ, బ్రాహ్మణ్‌ల మధ్య ఎలాంటి భేదం లేదన్న వాస్తవాన్ని బోధిస్తాడు.

## విలక్షణ మతాలు :

**పరిచయం:** క్రీ.పూ. ఏడు – ఐదు శతాబ్దాల మధ్య భారతదేశంలో మేధోపరమైన జీవితం పరిపక్వ దశలో ఉండేది. ఈ కాలం యావత్ ప్రపంచంలోనే మేధోపరమైన, ఆధ్యాత్మిక ప్రగతిలో మైలురాయిగా నిలిచింది. ఎందుకంటే గ్రీసుకు చెందిన తొలి తత్త్వవేత్తలు, గొప్ప హిబ్రూ ప్రవక్తలు, చైనాలో కన్ఫూషియస్, పర్షియాలో జొరాస్టర్‌లు ఆవిర్భవించారు. భారతదేశంలో చరిత్రలోని ఈ కీలకదశ ఒకవైపు ఉపనిషత్తు రుషుల బోధన (వేదాలు తమకు స్ఫూర్తినిచ్చాయని వారు అంగీకరించారు) మరోవైపు పూర్తిగా సాంప్రదాయవాదులు కాని, వేదాలను పూర్తిగా తిరస్కరించిన బోధకులు ప్రత్యక్షమయ్యారు. ఈ సమయంలోనే బౌద్ధం, జైన మతాలు

ఆవిర్భవించాయి. అనేక విలక్షణ వ్యవస్థలో అత్యంత విజయవంతమైన మతాలుగా అవి ఎదిగాయి. వాటికి భిన్నమైన సిద్ధాంతాల పట్టిక ఉండేది. మోక్ష సాధనకు పాటించాల్సిన నియమాలను అవి వేర్వేరుగా ప్రతిపాదించాయి.

విలక్షణత చాలా వరకు బీహార్, తూర్పు ఉత్తర ప్రదేశ్‌లలో బలంగా వికసించింది. ఇక్కడ ఆర్య నాగరికతరాక, బ్రాహ్మణిక మత ఆవిర్భావం ఆ సమయంలో తులనాత్మకంగా కొత్తవిగానే కనిపిస్తాయి. ఆర్య వర్గ వ్యవస్థలో ప్రజలు నామమాత్రంగా ప్రభావితమైనట్లు బోధపడుతుంది. ఏ రకంగా చూసినా బ్రాహ్మణుడి ప్రభావం సంపూర్ణంగా కనిపించదు. యక్షులు, నాగాలు లాంటి స్థానిక దైవాలపట్ల ఎంత దృష్టిసారించారో అంతే దృష్టి ఆర్యుల ఇష్టదైవాలపై కూడా సారించారు. అప్పటికే పవిత్రమైన చైతన్యలను, శ్మశాన వనాలను ప్రార్థించేవారు. నగరాలు ఆవిర్భవించాయి. వాటిలో ధనిక వ్యాపారులు విలాసవంతంగా జీవించారు. అలాగే రైతులు కూడా తగిన జీవన ప్రమాణాలను అనుభవించారు.

పాత తెగ నిర్మాణ స్వరూపంలో క్షీణ దశలో ఉండేది. రాచరిక రాజ్యాలు అనేకం ఏర్పడ్డాయి. గణ రాజ్యాలు కూడా సమాంతరంగా ఆవిర్భవించాయి. సంఘటిత రాజ్యాల అభివృద్ధి, భౌతిక సంస్కృతిలో ప్రగతితోపాటు కొత్త మత ఆలోచనలు (సిద్ధాంతాలు) కూడా వేగంగా విస్తరించాయి. అనతి కాలంలోనే ప్రాచీన భారత ఆలోచనా విధానంలో అవి కీలక స్థానాన్ని ఆక్రమించాయి. వేదాలు, తొలి "బ్రాహ్మణ" సాహిత్యంలో ఆత్మ పరిణామ సిద్ధాంతాన్ని స్పష్టంగా పేర్కొనకపోవడం ఇక్కడ గమనార్హం. తొలుత అది చాలా మౌలిక రూపంలో తొలి ఉపనిషద్‌లలో కనిపిస్తుంది. అరుదైన, నూతన సిద్ధాంతంగా సాక్షాత్కరిస్తుంది. జైన, బౌద్ధ మత గ్రంథాలలో అయితే ఈ సిద్ధాంతాన్ని సర్వజనీనంగా ప్రతిపాదించారు. దానిని ఎలాంటి సందిగ్ధం లేకుండా ఆమోదించారు.

ఆత్మ పరిణామ సిద్ధాంతంలో ప్రజల విశ్వాసం వేగంగా విస్తరించడానికి దారి తీసిన కారణాలను లెక్కించడం అంత సులభం కాదు. ముఖ్యంగా ఉత్తర భారతదేశంలో ఈ పరిణామం సంభవించింది. అలాగే ప్రపంచంపై వైరాగ్యం, దాని నుండి తప్పించుకోవాలన్న కాంక్ష ఎలా బలపడిందో వర్ణించడం కూడా చాలా కష్టం. నిరాశవాదమనే ఈ గొప్ప తరంగాన్ని విశ్లేషించడానికి అనేక కారణాలను సూచించారు. విస్తరిస్తున్న సమాజం, భౌతికంగా, మేధోపరంగా అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న సంస్కృతిలో ఇలాంటి విపరీత పరిణామం చోటు చేసుకుంది. పాత తెగలు విచ్ఛిన్నమై వాటి స్థానంలో రాజ్యాలు ఏర్పడడం, రాజ్యాలలో సముదాయ సంబంధాలు తెగి అభద్రతా భావం నెలకొనడం, ఆ విధంగా అన్ని వర్గాల ప్రజలలో దీర్ఘమైన మానసిక ఆందోళన ఏర్పడడంతో ప్రజల వైఖరిలో మార్పు వచ్చిందని కొందరు సూచించారు. ప్రజల దృక్పథంలో మార్పు రావడానికి మరో కారణం ఆ కాలపు అత్యంత తెలివైన ప్రజలు బ్రాహ్మణుల బలిదాన సాంప్రదాయాలపై తిరుగుబాటు చేయడమేనని మరికొందరు సూచించారు. అయితే ఏ వివరణా పూర్తిగా సంతృప్తిపరచదు. ఎందుకంటే

మతపరమైన ఆలోచనా విధానంలో ఇంతటి గొప్ప మార్పునకు దారితీసిన కారణాలపై కేవలం అసంపూర్ణమైన అవగాహన మాత్రమే ఉంది.

ఉపనిషత్ ప్రబోధకులు, ఉదారవాద పంథాలను కనుగొన్న వారిద్దరూ జ్ఞాన మార్గాన్నే బోధించారు. కర్మమార్గాన్ని పూర్తిగా పక్కనపెట్టారు. వారి ప్రాథమిక లక్ష్యం జనన మరణ చక్రం నుండి మోక్షాన్ని సాధించడం. ఇతరులను ఆ దిశలో నడపడం. భౌతిక, మానసిక క్రమశిక్షణను దీర్ఘకాలం పాటించడం ద్వారానే మోక్షాన్ని సాధించగలమని వారిలో అనేకమంది బోధించారు. ఈ ప్రక్రియ కొన్ని సందర్భాలలో తీవ్ర సన్యాసానికి దారితీసేది. వివిధ విచారధారల మౌలిక సత్యాలు చాలా విరుద్ధంగా ఉండేవి. బౌద్ధ మత గ్రంథాలలోని అనేక వ్యాఖ్యానాలలో మనకు ఆరుగురు ఉదారవాద బోధకులు కనిపిస్తారు. ఒక్కొక్కరు ఒక్కో ముఖ్యమైన మతవర్గానికి, సాధారణ భక్తులకు నాయకులుగా ఉండేవారు. "దిఘనికాయ"లోని ఒక వ్యాఖ్యానంలో వారి వ్యవస్థ మౌలిక సూత్రాలను పేర్కొన్నారు. వాటిపై దృష్టిసారిస్తే సిద్ధాంతాల భిన్నత్వం మనకు అర్థమవుతుంది. ఆ కాలంనాటి వివిధ సన్యాస బృందాలు ఈ సిద్ధాంతాలను ప్రచారం చేశాయి.

తొలుత పేర్కొనబడిన గురువు పురాణ కశ్యప వికర్మ సిద్ధాంతవాది. ఒక వ్యక్తి నైతిక వర్తనం అతడి కర్మపై ఎలాంటి ప్రభావం చూపదని అతడు విశ్వసించాడు.

రెండవ సన్యాసి మఖాలి గోసల (గోసల మస్కరీపుత్ర) అజీవిక వర్గ నాయకుడు. ఈ వర్గం సుమారు రెండు వేల సంవత్సరాల పాటు మనుగడ సాగించింది. మంచి కార్యాలు ఆత్మ పరిణామానికి దారితీయవన్న పురాణతో అతడు ఏకీభవించాడు. నియతి (విధి రాత) ప్రకారం జీవితం కొనసాగుతుందని పేర్కొన్నాడు.

మూడవ ప్రబోధకుడైన అజిత కేశకంబళుడు భౌతికవాది. ప్రపంచ సిద్ధాంతాల చరిత్రలో అభౌతికమైన అంశాలలో పూర్తి అపనమ్మకాన్ని ప్రదర్శించిన తొలి వ్యక్తీకరణలుగా అతడి అభిప్రాయాలు వెల్లడవుతాయి.

నాల్గవ ప్రబోధకుడైన పఖుద కాత్యాయణుడు పరమాణువాది. గ్రీసులో డెమోక్రిటస్ శాశ్వతమైన పరమాణువు సిద్ధాంతాన్ని అభివృద్ధి పరచడానికి వందేళ్ల ముందే కాత్యాయనుడు తన సిద్ధాంతాలను ప్రతిపాదించాడు.

ఐదవ గురువు నిఘాంత నాతపుత్త (నిర్ఘంధ జ్ఞాతపుత్ర) జైనుల నాయకుడు వర్ధమాన మహావీర తప్ప మరెవరో కాదు.

ఆరవ, చివరి గురువు సంజయ బలత్థిపుర సంశయవాది. జ్ఞానం అంటూ ఏదీ లేదని అతడు పూర్తిగా తోసిపుచ్చాడు.

ఈ గురువులు వాగ్దానం చేసిన మోక్షం ఒక సిద్ధాంతం లేదా విశ్వాసం యొక్క తార్కిక పునాదులపై ఆధారపడి ఉండేది కాదు. పునర్జన్మ నుండి విముక్తి పొందడానికి మౌలిక సిద్ధాంతాన్ని మనసు అంతరంగాల్లో గ్రహించడం అవసరమని, అలాంటి చైతన్యాన్ని కేవలం

యోగ అనబడే భావాత్మక, సన్యాస ఆచారాల ద్వారానే ఆస్వాదించవచ్చని ప్రబోధించారు. ప్రతి వర్గానికి అనుచరుల సంఘటిత మండలి ఒకటి ఉండేది. సాధారణంగా వాటిలో సన్యాసులే ఎక్కువగా ఉండేవారు. అజితను అనుసరించిన భౌతికవాదులకు కూడా ఒక వర్గం ఉండేది.

## బౌద్ధ మతం

### బుద్ధుని జీవితం :

బౌద్ధ మత స్థాపకుడు గౌతముడు లేదా సిద్ధార్థుడు క్రీ.పూ. 563లో నేటి నేపాల్‌లోని లుంబినిలో కపిలవస్తువుకు చెందిన సాక్య క్షత్రియ కులంలో పుట్టాడు. అతడి తల్లి మహామాయ. ఆమె పొరుగు రాజ్యవంశమైన కోలియాల రాకుమార్తె. అశోకుడు నిర్మించిన ప్రముఖ రుమ్మిందీ స్థూపంలో బుద్ధుని జన్మస్థలం గురించి కీర్తించారు. మాయ బిడ్డకు జన్మనిస్తూ మరణించడంతో సిద్ధార్థను అతడి పిన్ని, సవతి తల్లి అయిన ప్రజాపతి గౌతమి పెంచి పెద్ద చేసింది. అతడి ఇతర బంధువులలో సుద్ధోధన (తండ్రి), యశోధర (భార్య), రాహుల్ (కుమారుడు), దేవదత్త (పిన్ని కుమారుడు) ఉన్నారు. వృద్ధాప్యం, అనారోగ్యం, మరణం, సన్యాసాలను ఒకే రోజు యాధృచ్ఛికంగా వీక్షించిన సిద్ధార్థలో ప్రపంచంపట్ల తీవ్ర ద్వేషభావం పెరిగింది. ప్రాపంచిక సుఖాల డొల్లతనాన్ని అతడు గ్రహించాడు. తన కుమారుడు జన్మించిన తర్వాత అతడు 29 ఏళ్ల ప్రాయంలో ఇంటిని వీడి సత్యాన్వేషణలో బయల్దేరాడు. ఈ వీడ్కోలును “మహాభినిష్క్రమణ” అని పిలుస్తారు.

ఆరేళ్లపాటు వరుసగా అతడు ఆశ్రయం లేని సన్యాసిగా జీవితం గడిపాడు. ఇద్దరు బ్రాహ్మణ మత గురువుల వద్ద శిష్యరికం చేశాడు. తొలుత వైశాలి వద్ద అలారకలమ నుండి ధాన్య పద్ధతిని నేర్చుకున్నాడు. తర్వాత రాజగృహ వద్ద ఉద్దక లేదా రామపుత్త నుండి శిక్షణ పొందాడు. అనేక ప్రాంతాలను సందర్శించాడు. ఎలాంటి సంతృప్తి కలగకపోవడంతో అతడు తీవ్రమైన తపస్సు ఆచరించాడు. అత్యంత కష్టమైన సాత్విక జీవితాన్ని గడిపాడు. సత్యాన్వేషణకు అనేక విఫల యత్నాలు చేశాడు. తర్వాత తపస్సులను వదలి నిరంజన నదిలో (ఆధునిక లిలాజన్) స్నానమాచరించి ఆధునిక బోధ్ గయవద్ద బోది(రావి) చెట్టు కింద కూర్చున్నాడు. అక్కడ 35 ఏళ్ల వయస్సులో అతడు నిర్వాణాన్ని పొందాడు. అప్పటి నుండి బుద్ధ (చైతన్యవంతుడు) లేదా తథాగతుడు (సత్యాన్ని గ్రహించినవాడు)గా ప్రసిద్ధుడయ్యాడు.

ఆ తర్వాత బుద్ధుడు బనారస్ పరిసర ప్రాంతంలోని సార్‌నాథ్ వద్ద గల జింకల వనానికి బయల్దేరాడు. అక్కడ తన తొలి మత ప్రవచనం అందించాడు. అలాంటి ప్రవచనాన్ని ధర్మ చక్ర ప్రవర్తన అని పిలుస్తారు. మత ప్రవచనంతో ప్రభావితులైన ఐదుగురు వ్యక్తులు బుద్ధుని వద్ద శిష్యులుగా చేరారు. ఆ విధంగా తర్వాతి 45 ఏళ్ల వరకు బుద్ధుడు మత బోధనలను కొనసాగించి క్రీ.పూ. 483లో ఉత్తర ప్రదేశ్ కుసినగర్‌లో ఒక సాల చెట్టు కింద తుదిశ్వాసను వదిలాడు. తన మరణానికి కొద్ది కాలం ముందు బుద్ధుడు చండ అనే పేద కంసాలి గుడిసెలో పావపురిలో నివసించాడు. అక్కడ అతడు కుళ్లిపోయిన పుట్టగొడుగు, పంది మాంసాన్ని తిన్నాడు. ఆ విష ప్రభావం వల్లే అతడు మరణించాడని చెబుతారు. బుద్ధుని చివరి ప్రవచనాన్ని సంచార

సన్యాసి సుభద్ర, ప్రియ శిష్యుడు ఆనందలు విన్నారు. అతడి చివరి మాటలు ఈ విధంగా ఉన్నాయి. “కుళ్లిపోయేవన్నీ అంతర్భాగ వస్తువులే. మీ ఆత్మ మోక్షం కోసం నిరంతరం శ్రమించండి.”

బుద్ధుని బోధనలను తొలిగా స్వీకరించిన వారిలో సరిపుత్త, మొగ్గల్లన ఉన్నారు. వారు రాజగృహకు చెందిన సన్యాసులు. బుద్ధుని తొలి ఐదుగురు శిష్యుల్లో ఒకరైన అస్సాజీ వారిని బౌద్ధ మతానికి మార్చాడు. బుద్ధుని ప్రముఖ అనుచరులలో ఆనంద, కశ్యప, ఉపాలి, ధనిక యువకుడైన యశ ఉన్నారు. కోసల పాలకుడు ప్రసేనజిత్,మగధ పాలకులు బింబిసార, అజాతశత్రు లాంటి రాజులు బుద్ధుని సిద్ధాంతాలను ఆమోదించి అతడి శిష్యులుగా మారారు. బుద్ధుని జీవితంతో ముడిపడి ఉన్న ఇతర ప్రముఖులలో చన్న (రథసారథి), కంఠక (అతడి గుర్రం), సుజాత (ఈమె ఒక రైతు కుమార్తె. బోధ్‌గయ వద్ద ఆమె బుద్ధునికి పాలతో కలిపిన అన్నాన్ని అందించింది) ఉన్నారు. బుద్ధుని జీవితంలో సంభవించిన ఐదు ప్రధాన ఘటనలు ప్రతీకలతో ఈ విధంగా ఉన్నాయి. జననం – ఎద్దు, కమలం, మహాభినిష్క్రమణ – అశ్వం, నిర్వాణం – బోధిచెట్టు, తొలి ప్రవచనం (ధర్మచక్ర ప్రవర్తన) – ధర్మచక్ర, పరినిర్వాణ (మరణం) – స్తూపం.

**బుద్ధుని బోధనలు :**

సిద్ధాంతాలను కాని, పిడివాదాలను కాని బుద్ధుడు ప్రతిపాదించలేదు. అందుకు భిన్నంగా ఆధ్యాత్మిక ప్రగతి కొరకు ఒక హేతుబద్ధమైన కార్యక్రమాన్ని సూచించాడు. వేదాల విశిష్టతను తోసిపుచ్చాడు. రక్తసిక్తమైన జంతు బలిదానాలను ఖండించాడు. సంక్లిష్ట, విస్తారమైన, అర్థరహితమైన కర్మకాండలను వ్యతిరేకించాడు. కుల వ్యవస్థను పురోహితుల ఆధిపత్యాన్ని ప్రశ్నించాడు. దేవునిపట్ల తాత్వికవైఖరిని కొనసాగించాడు. అతడి నాలుగు ఉన్నత సత్యాలు (చత్వారి ఆర్య సత్యాని) ఈ విధంగా ఉన్నాయి. 1. ప్రపంచమంతా దుఃఖాలతో నిండి ఉంది. (దుఖ) 2. దుఃఖానికి కారణం కాంక్ష (తృష్ణ). 3. కోరికలను జయిస్తే అన్ని దుఃఖాలు తొలగిపోగలవు 4. ఈ లక్ష్యాన్ని సాధించడానికి ఏకైక మార్గం అష్టాంగమార్గాన్ని అనుసరించడమే. అష్టాంగమార్గంలో 1. సరైన దృక్పథం 2. మంచి లక్ష్యం 3. మంచి మాట. 4. తగిన చర్య. 5. తగిన జీవనోపాధి 6. సరైన కృషి, 7. వాస్తవిక చైతన్యం, 8. ధ్యానం ఉన్నాయి. బుద్ధుని బోధనల ప్రకారం ఈ మార్గాన్ని అనుసరించే ఏ వ్యక్తి అయినా (దీనిని మధ్యమ మార్గం అని పరిగణిస్తారు) తన సామాజిక నేపథ్యానికి అతీతంగా మోక్షం సాధించగలడు. అతడు సూచించిన నైతిక పథం ఆచరణాత్మక విలువల నిబంధనావళిగా ఉంది. దానికి హేతుబద్ధమైన దృక్పథం ఉంది. కనక బౌద్ధ మతాన్ని మతపరమైన విప్లవం కంటే సామాజిక విప్లవంగానే ఎక్కువగా పరిగణించాలి. ఆచరణాత్మక విలువల నిబంధనావళిని అది బోధించింది. సామాజిక సమానత్వమనే ప్రజాస్వామిక సూత్రాన్ని ప్రతిపాదించింది. బుద్ధుడిని తత్త్వవేత్త లేదా తార్కికునిగా పిలవచ్చు. ఎందుకంటే అతడు దేవుడు ఉన్నాడని కాని, లేదని కాని నిర్ధారించలేదు. సైద్ధాంతిక చర్చలోకి దిగడానికి అతడు నిరాకరించాడు. దేవుడు లేదా ఆత్మ స్వభావం గురించి వాదించడానికి

ఇష్టపడలేదు. ఈ విషయాలను ఎప్పుడు ప్రస్తావించినా అతడు మౌనం వహించేవాడు లేదా దైవం (దైవాలు) కూడా కర్మ సిద్ధాంతానికి కట్టుబడి ఉన్నాయని వ్యాఖ్యానించేవాడు. బుద్ధుని ప్రకారం వస్తువులన్నీ అనుసర్గమైనవే. కనక అన్ని వస్తువులు అనిత్యమే. కాలంతో పాటు అన్ని వస్తువుల కలయిక కూడా మార్పునకు లోను కావలసిందే. పైగా అనిత్య స్వరూపం కలిగి ఉండడం వల్ల వస్తువులకు శాశ్వతమైన ఆత్మ అంటూ ఏదీ ఉండదు. స్థిరమైన వ్యక్తిత్వమూ ఉండదు. అవన్నీ దుఃఖానికి లోను కావలసిందే. ఈ త్రిపథ చిత్రీకరణ (ప్రపంచ స్వభావం గురించి), దాని అంశాల (దుఃఖం, అనిత్య, అనాత్మ)ను బౌద్ధ సాహిత్యంలో తరచూ వల్లిస్తారు.

బుద్ధుని బోధనలో మరో విశిష్టమైన బోధన ఆత్మకు సంబంధించి అతడు ప్రతిపాదించిన సిద్ధాంతం. ఆత్మ అంటూ ఏదీ లేదని అతడు బోధించాడు. ఇంకో విధంగా చెప్పాలంటే మానవునికి అతడు అనాత్మ పరిస్థితిని సూత్రీకరించాడు. ఆత్మ అని దేనినైతే పిలుస్తారో వాస్తవానికి అది ఐదు అనిత్య పరిస్థితుల భౌతిక, మానసిక సమ్మేళనమని బుద్ధుడు పేర్కొన్నాడు. (అనిత్య పరిస్థితులను ఖంధ లేదా స్కంధ అని పిలుస్తారు). ఆ విధంగా ఈ విశ్వంలోని అన్ని వస్తువులను కూడా ఐదు స్కంధాలుగా వర్గీకరించవచ్చు లేదా వాటి మిశ్రమాలను పొందుపరచవచ్చు.స్వరూపం, విషయం (రూప), కదలికలు లేదా భావనలు (వేదన), అవగాహన లేదా చైతన్యం (సన్న), మానసిక వైఖరి లేదా పట్టుదల (సంఖర,) విజ్ఞానం (విన్నన) ఆ ఐదు స్కంధాలు. ఈ స్కంధాల మిశ్రమాలు లేదా కలయికతో మానవుడు అవతరిస్తాడు. ఒక క్షణం నుండి మరో క్షణానికి ఈ స్కంధాలు మారుతూ ఉంటాయి. కనక మానవుని సంపూర్ణ దేహం నిత్యం మారుతూ ఉండే పరిస్థితిలో ఉంటుంది. ఏ ప్రక్రియతో జీవితం కొనసాగుతుందో, ఒక అంశం మరో అంశానికి ఎలా దారితీస్తుందో కారణ చక్రం ద్వారా వివరించారు. పతిచ్ఛ – సముప్పద లేదా ప్రతిత్య – సముత్పాద అంటే ఆధార మూలం. జనన, మరణ, పునర్జన్మ ప్రక్రియకు మూల కారణం అజ్ఞానమే. వ్యక్తిత్వం, శాశ్వతత్వం ఉన్నాయని ప్రాథమిక మిధ్య అజ్ఞానాన్ని సూచిస్తుంది. వాస్తవానికి వ్యక్తిత్వం, శాశ్వతత్వం అన్నవి ఏవీ కావు. ఈ భావనల కారణంగానే మనిషిలో వివిధ మానసిక దృగ్విషయాలు ఆవిర్భవిస్తాయి. మోహం (కోరిక) కూడా అందులో ఒకటి. ప్రపంచంలోని సర్వ సుఖాలను దక్కించుకోవాలని తర్వాతి దశలో మానవుడు కోరుకుంటాడు. లైంగికేచ్ఛ, సంభోగాలలో ఈ పరిస్థితి వ్యక్తమవుతుంది. జీవిత చక్రంలోని తదుపరి దశలకు అదే వాస్తవ కారణాలు. వృద్ధాప్యం, మరణంతో జీవిత చక్రం ముగుస్తుంది. అలా ఈ చక్రం అనంతంగా కొనసాగుతూనే ఉంటుంది. కనక పునర్జన్మ (కర్మ సిద్ధాంతం ప్రకారం) చోటు చేసుకుంటుంది. బౌద్ధ కర్మ హిందూ మత కర్మకు మౌలికంగా భిన్నమైనదికాదు. అయితే దానిని చాలా భిన్నంగా వివరించారు.

**బుద్ధుని తర్వాత బౌద్ధ మతం:**

బౌద్ధ మత తొలి దశ క్రీ.పూ. 528 నుండి మొదలవుతుంది. అంటే బుద్ధుడు నిర్వాణం పొందిన కాలం నుండి మొదలై అతడి పరినిర్వాణం (మరణం), తూర్పు భారతదేశంలో బౌద్ధ మత వ్యాప్తితో ముగుస్తుంది. ఈ దశలోనే తొలి రెండు బౌద్ధ మండలి సమావేశాలు జరిగాయి. రెండవ దశ అశోకుడి బౌద్ధ మత స్వీకారంతో మొదలవుతుంది. మూడవ బౌద్ధ

మండలి సమావేశం ఈ దశలో జరిగింది. అలాగే ప్రపంచంలోని వివిధ ప్రాంతాలకు మత ప్రచారకులను పంపే సాంప్రదాయం కూడా ఈ దశలోనే ప్రారంభమైంది.

సుంగ–కన్వ కాలాన్ని మూడవ దశగా పరిగణించవచ్చు. తూర్పు భారతదేశంలో రాచరిక పోషణను కోల్పోయినప్పటికీ ధనిక వ్యాపారులు అండగా నిలవడంతో బౌద్ధ మతం వేగంగా విస్తరించింది. ఉదాహరణకు బార్హూత్ స్తూపం, సాంచిస్తూపం, కార్లే గుహలకు వ్యాపారులు భారీ విరాళాలను అందించారు. అలాగే పశ్చిమోత్తర భారతదేశంలో పాలకులు బౌద్ధ మతాన్ని స్వీకరించారు. గాంధార కళ అభివృద్ధి చెందింది. శాతవాహనుల పరమత సహనం కారణంగా దక్షిణ భారతంలో ఆ మతం విస్తరించింది. అమరావతి, నాగార్జున కొండ లాంటి బౌద్ధ కేంద్రాలు దక్షిణంలో ఆవిర్భవించాయి. అయితే బౌద్ధమతం 18 పాయలుగా చీలిపోయింది. సిద్ధాంతపరమైన విభేదాల కంటే నైసర్గిక కారణాల వల్లే ఆ మతంలో చీలిక వచ్చింది.

కనిష్కుడి బౌద్ధ మత స్వీకారంతో నాల్గవ దశ మొదలవుతుంది. నాల్గవ బౌద్ధ మండలి సమావేశం ఈ దశలో జరిగింది. మధ్య ఆసియా, చైనాలకు మతం విస్తరించడం మొదలు పెట్టింది. ఈ కాలంలోనే ప్రధాన చీలిక వచ్చింది. బౌద్ధులు మహాయాన, హీనయాన వర్గాలుగా చీలిపోయారు. అలాగే మహాయానీయులు విగ్రహారాధన సాంప్రదాయాన్ని కూడా ప్రారంభించారు. ఐదవ దశ గుప్త యుగానికి వర్తిస్తుంది. రాచరిక పోషణ లేకపోయినా బౌద్ధ మతం లోక ప్రియంగా కొనసాగింది. వ్యక్తులు దానిని పోషించారు. ఫాహియాన్ ఈ విషయాన్ని ధృవీకరించారు. ఈ కాలంలో చోటుచేసుకున్న ముఖ్యమైన పరిణామం ఒకటవ కుమార గుప్తుడు నలంద మహావిహార (విశ్వవిద్యాలయం)కు శంకుస్థాపన చేయడం.

హర్షుడు పోషణ ఉన్నప్పటికీ ఆరవ దశలో బౌద్ధం (క్రీ.శ. ఏడవ శతాబ్దం ద్వితీయార్థం నుండి) క్షీణించడం మొదలుపెట్టింది. హుయాన్‌త్సాంగ్ భారతదేశానికి వచ్చి కొన్ని బౌద్ధ కేంద్రాల శిథిలాలను చూశారు. హూణ దండయాత్రలు, బౌద్ధ కేంద్రాల విధ్వంసం ఆ మతాన్ని మరింత దెబ్బతీశాయి. క్రీ.శ. ఎనిమిది, తొమ్మిదవ శతాబ్దాలలో పాలుల పోషణలో బౌద్ధ మతం తూర్పు భారతదేశంలో తిరిగి పుంజుకుంది.

ప్రఖ్యాతి గాంచిన విక్రమశిల విశ్వవిద్యాలయాన్ని ధర్మపాలుడు స్థాపించాడు. అయితే బౌద్ధ మతం మరోసారి సాధారణ పతనాన్ని చవిచూసింది. ముఖ్యంగా పాలుల పతనం తర్వాత ఈ ప్రక్రియ మొదలైంది. తురుష్క దండయాత్రలు, 1198లో తూర్పు భారతదేశంలోని బౌద్ధ కేంద్రాలను భక్తియార్ ఖిల్జీ ధ్వంసం చేయడంతో భారతదేశం నుండి బౌద్ధ మతం పూర్తిగా మాయమైంది.

**బౌద్ధ సంఘం :**

బుద్ధునికి రెండురకాల శిష్యులు ఉండేవారు. ఒకరు భిక్షువులు, మరొకరు ఉపాసకులు (సాధారణ భక్తులు). భిక్షువులు సంఘంగా సంఘటితమయ్యేవారు. సంఘాల సంఖ్య బౌద్ధ

మతం విస్తరించే కొద్దీ పెరుగుతూ పోయింది. సంఘ సభ్యత్వం అందరికీ అందుబాటులో ఉండేది. పదిహేనేళ్లు దాటిన స్త్రీ, పురుషులకు సభ్యత్వం ఇచ్చేవారు. కుష్టువ్యాధికి దూరంగా, వినియోగం, ఇతర అంటు వ్యాధులకు దూరంగా ఉన్నవారు ఎవరైనా సంఘంలో చేరడానికి వీలు కల్పించారు. పాలకుడు లేదా ధనిక వ్యక్తి సేవలో ఉన్నవారికి, అలాగే దివాళా తీసిన వారికి, బందిపోట్లు, నేరస్తులకు సంఘంలో సభ్యత్వాన్ని నిరాకరించేవారు. అయితే శిక్ష పొందినవారు, బానిసలు లేదా అంగవైకల్యం ఉన్నవారికి కొన్ని సందర్భాల్లో మినహాయింపు ఇచ్చారు. సభ్యత్వానికి కులపరమైన ఆంక్షలు ఉండేవి కావు.

భిక్షువులు, సన్యాసినులకు ఆశ్రయం కల్పించేందుకు, అధ్యయనం, ధ్యానం కొనసాగించేందుకు తగిన విధంగా విహారాలను నిర్మించారు. క్రమంగా విహారాలు విశ్వవిద్యాలయాలుగా అభివృద్ధి చెందాయి. అక్కడి నుండి ఉన్నతమైన వ్యక్తులు బయటికి వచ్చేవారు. మతం, తత్త్వశాస్త్రంలో ఆరితేరిన విద్యార్థులు బుద్ధుని బోధనలను ప్రచారం చేసేవారు. వర్షాలు కురిసే మూడు, నాలుగు నెలలలో భిక్షువులు ఒక శాశ్వత నివాసాన్ని తీసుకొని మనుగడ కోసం పొరుగు కుటుంబాలపై ఆధారపడేవారు. ఈ సమయంలో వారు చుట్టుపక్కల ప్రజలకు బౌద్ధ మతాన్ని బోధించేవారు. నివాస కాలం ముగిసే సమయంలో భిక్షువులు సమావేశమై తమ తప్పులను (ఏవైనా ఉంటే) అంగీకరించేవారు. ఈ కార్యక్రమాన్ని పావరణ (ఉపోసథ లేదా ఉపవాసథ) అని పిలుస్తారు.

ప్రజాస్వామిక సూత్రాల ఆధారంగా సంఘాన్ని నిర్వహించేవారు. సభ్యులను క్రమశిక్షణలో పెట్టే అధికారం దానికి ఉండేది. తప్పు చేసే సభ్యులను శిక్షించే అధికారం కూడా దానికి ఉండేది. సంఘ సమావేశం ఎప్పుడు జరిగినా సభ్యులు లేదా భిక్షువులు సీనియారిటీ ప్రకారం ఆసీనులయ్యేవారు. కనీసం పది మంది భిక్షువులు హాజరు కానిదే ఏ సమావేశాన్ని చట్టబద్ధమైనదిగా పరిగణించేవారు కాదు. అయితే సరిహద్దు రాజ్యాలలో కొన్ని విపరీత పరిస్థితులలో కోరాన్ని ఐదుగురు సభ్యులతో పాటించేవారు. అనుభవం లేని వారిని, మహిళలను ఈ సమావేశాలకు దూరంగా ఉంచేవారు.

సంఘంలో ప్రవేశ కార్యక్రమం సాధారణంగా, నిరాడంబరంగా జరిగేది. సంఘంలో చేరాలని కొత్త వ్యక్తి కోరుకున్నప్పుడు అతడు లేదా ఆమె శిరోముండనం చేసుకోవలసి ఉంటుంది. కాషాయ వస్త్రాలను ధరించి స్థానిక సంఘ అధ్యక్షుని ఎదుట త్రిరత్న (బుద్ధుడు, ధమ్మ, సంఘ) పట్ల అంకితమై ఉంటామని ప్రమాణం చేయాల్సి ఉంటుంది. తర్వాత సభ్యుడు బుద్ధుని పది శీలాలను వల్లించాల్సి ఉంటుంది. భిక్షువు, సన్యాసినుల జీవితాన్ని చట్టాలు, పది శీలాలు కఠినంగా శాసించేవి. పుష్పమాలలు, సుగంధ ద్రవ్యాలు, వ్యక్తిగత అలంకారానికి సంబంధించిన వస్తువులను వాడరాదని భిక్షువులపై కఠినమైన ఆంక్షలు ఉండేవి. సన్యాసినులకు మరింత కఠినమైన నిబంధనలు అమలులో ఉండేవి. సన్యాసినులకు సమానత్వం కల్పిస్తే అది క్రమశిక్షణా రాహిత్యానికి, అనైతికతకు దారి తీయగలదని ఆందోళన చెందేవారు. మహిళలకు సన్యాసినులుగా

తీర్చిదిద్దడాన్ని బుద్ధుడు వ్యతిరేకించాడు. అయితే తన ప్రియశిష్యుడు ఆనంద అభ్యర్థన మేరకు తన నిర్ణయాన్ని కొంతవరకు సడలించాడు.

**బౌద్ధ మండళ్లు :**

బుద్ధుని జీవిత కాలంలోనే సంఘ అవతరించింది. బుద్ధుని మరణం తర్వాత అది బౌద్ధ మత స్వచ్ఛతను కాపాడే బాధ్యతను తీసుకుంది. క్రీ.పూ. 483లో బుద్ధుని పరినిర్వానం జరిగిన వెంటనే మహాకశ్యప అధ్యక్షతన రాజగృహలో తొలి బౌద్ధ మండలి సమావేశమైంది. గురువు (బుద్ధుడు) బోధనల స్వచ్ఛతను కాపాడడమే ఆ మండలి లక్ష్యం. మండలిలో సుత్త పితాక (బుద్ధుని ప్రవచనాలు)ను నిర్థారించారు. ఆనంద ఈ ప్రతిపాదన చేశాడు. అలాగే వినయ పితాక (విహార నిబంధనావళి)ను కూడా ఆమోదించారు. ఉపాలి దీనిని ప్రతిపాదించాడు. పితాక అంటే బుట్ట (basket) అని అర్థం. మూల గ్రంథాలను తాటాకులపై రచించి బుట్టలలో భద్రపరచడం వల్లే వాటికి ఆ పేరు వచ్చింది.

బుద్ధుడు మరణించిన వందేళ్లకు (సుమారు క్రీ.పూ. 383)లో రెండవ బౌద్ధ మండలి వైశాలిలో సమావేశమైంది. సబకామి దానికి అధ్యక్షత వహించి ఉండవచ్చు. వజ్జీ భిక్షువులు, సాంప్రదాయవాదుల మధ్య తలెత్తిన వివాదాన్ని పరిష్కరించడమే ఈ సమావేశం ప్రధాన ఎజెండాగా మారింది. వజ్జీ భిక్షువులు కొన్ని ఉదారవాద ఆచారాలను అనుసరించేవారు. అయితే వారిచర్యలను సాంప్రదాయవాదులు తీవ్రంగా వ్యతిరేకించడంతో వివాదం తలెత్తింది. అయితే దురదృష్టవశాత్తు ఈ మండలి విహార క్రమశిక్షణపై ఒక అంగీకారానికి రావడంలో విఫలమైంది. ఫలితంగా బౌద్ధ సంఘ సనాతన వాద స్థవీంవాదిన్‌లు (థెరావాదిన్‌లు), ఉదారవాద మహాసంఘికలుగా చీలిపోయింది.

అశోకుని పోషణలో (క్రీ.పూ. 250 మధ్య) పాటలీపుత్ర వద్ద మూడవ మండలి సమావేశమైంది. మొగలిపుత్త తిస్సా (ఉపగుప్త) సమావేశానికి అధ్యక్షత వహించాడు. అధికారం కోసం రెండు వైరి వర్గాల మధ్య ఏర్పడిన ఘర్షణను నివారించడం ఈ సమావేశ లక్ష్యం. సమావేశ ఫలితాలు ఈ విధంగా ఉన్నాయి.

1. స్థవీరవాదిన్‌లను నిజమైన భక్తులుగా నిర్థారించి, ఇతరులను దైవదూషకులుగా ముద్రవేసి బహిష్కరించారు.

2. త్రిపితాక (తొలి రెండు పితాకలకు మూడో పితాకను అదనంగా జోడించారు)ను తుదిసారి సంకలించారు.

3. ప్రపంచంలోని వివిధ ప్రాంతాలకు మత ప్రచారకులను పంపడం. (మూడవ పితాక అభిధమ్మ పితాక. తొలి రెండు పితాకల తాత్విక అన్వయింపే అభిధమ్మ).

క్రీ.శ. తొలి శతాబ్దంలో కనిష్కుని సౌజన్యంతో నాల్గవ మండలి కాశ్మీర్‌లో సమావేశమైంది. వసుమిత్ర దానికి అధ్యక్షత వహించాడు. బుద్ధ చరితను రచించిన అశ్వఘోషుడు

అతడికి సహాయం అందించాడు. సమావేశ లక్ష్యం 18 వర్గాల మధ్య ఉన్న విభేదాలను పరిష్కరించి, వ్యాఖ్యానాలను రూపొందించడం. దాని ఫలితాలు ఇలా ఉన్నాయి.

1. అన్ని వర్గాలను రెండు ప్రధాన వర్గాలుగా విభజించడం. కాశ్మీర్ మధుర ప్రాంతాలలో పట్టున్న సర్వస్తివాదిన్‌లు, మహా సంఘికలు మహాయానీయులుగా వర్గీకరించబడితే మిగతా వారు (స్థావీరవాదిన్‌లతో సహా) హీనయానీయులుగా గుర్తింపు పొందారు.
2. సర్వస్తివాదిన్ సిద్ధాంతాలను మహావిభాషగా క్రోడీకరించడం (దీనిని తామ్ర ఫలకాలపై చెక్కారు. తర్వాత ఒక ప్రత్యేక స్థూపంలో భద్రపరిచారు).
3. పాలి స్థానంలో సంస్కృతంలో సమావేశ చర్చలను నిర్వహించడం.
4. ఇతర దేశాలకు బౌద్ధ మతం విస్తరించడం. మహాయానవాదం మధ్య ఆసియా, చైనా, జపాన్‌లలో, హీనయానవాదం సిలోన్, బర్మా, థాయ్‌లాండ్, ఆగ్నేయ ఆసియాలోని ఇతర ప్రాంతాలలో విస్తరించాయి.

**బౌద్ధమతం చీలికలు :**

వైశాలి వద్ద జరిగిన రెండవ మండలిలో తొలి చీలిక వచ్చింది. ఫలితంగా బౌద్ధులు స్థావీరవాదిన్‌లు, మహాసంఘికలుగా చీలిపోయారు. అయితే ప్రధాన చీలిక మాత్రం నాల్గవ మండలి (కాశ్మీర్)లో వచ్చింది. అక్కడ బౌద్ధులు మహాయానీయులు, హీనయానీయులుగా చీలిపోయారు. అలాగే క్రీ.శ. 8వ శతాబ్దంలో వజ్రయానీయులనే మరోకొత్త వర్గం అవతరించింది. బుద్ధుని మరణం తర్వాత రెండు, మూడు శతాబ్దాలలో కొత్త ఉపవిభజనలు క్రమంగా అవతరించాయి. ఫలితంగా బౌద్ధమతం మూడవ మండలం  నాటికి 18 శాఖలుగా చీలిపోయిది.

కాలక్రమంలో కొన్ని శాఖలు ముఖ్యమైనవిగా మారాయి. వాటికి పెద్ద ఎత్తున ఆదరణ లభించింది. వారి విచారధారకు తగిన విధంగా ప్రత్యేక సాహిత్యాన్ని రూపొందించారు. మహా సంఘికలకు సొంత వినయ (నైతిక వర్తన సూత్రాలు) ఉండేది. తర్వాతి కాలంలో మహాయానీయులుగా గుర్తింపు పొందిన వారికి వీరే పూర్వీకులు. మరిన్ని శాఖలను సృష్టించిన స్థావీర వాదిన్‌లు, సర్వస్తివాదిన్‌లకు వినయ, సూత్ర, అభిధర్మలపై స్వంతంగా సాహిత్యాలు ఉండేవి. ఒకే సంఘానికి చెందిన ఒకరు లేదా ఇద్దరు వ్యక్తిగత సభ్యుల భిన్నమైన అభిప్రాయాలను "కథావత్తు" (కథావస్తు) రేఖా మాత్రంగా పేర్కొంది. వాటి ఆధారంగానే కథావత్తు వ్యాఖ్యానం ఈ భిన్నమైన అభిప్రాయాలను వేర్వేరు శాఖలవిగా గుర్తిస్తుంది. వ్యాఖ్యానం రచించే నాటికే వేర్వేరు శాఖలు ఆవిర్భవించాయి. బౌద్ధ సంఘంలో చీలికలపై అశోకుని స్థూప శాసనాలలో ఇచ్చిన వివరణల ఆధారంగా కొందరు విద్వాంసులు ఈ శాఖలను అశోకుని అనంతర కాలానికి పరిమితం చేయాల్సి ఉంటుందని భావిస్తారు.

**హీనయాన వాదం :**

హీనయాన అనుచరులు లేదా భక్తులు బుద్ధుని తొలి బోధనలను నమ్మారు. స్వీయ క్రమశిక్షణ, ధ్యానం ద్వారా వ్యక్తిగత మోక్షాన్ని పొందాలని ఆకాంక్షించారు. మహాయానీయులవలె వారు విగ్రహారాధనను విశ్వసించలేదు. అయితే చిహ్నాలను (ప్రతీక) వారు పూజించారు. హీనయానవాదం భారతదేశంలో ఆదరణ కోల్పోయినప్పటికీ సిలోన్, బర్మా, థాయిలాండ్, కంబోడియా, లావోస్‌లలో బలంగా పాతుకుపోయింది. బుద్ధుని వ్యక్తిత్వం, అతడి బోధనలపై వెలువడ్డ తొలి రచనలు పాలి సాహిత్యంలో కనిపిస్తాయి. థెరావాదిన్‌లు లేదా స్థావీరవాదిన్‌ల రచనలలో అవి ప్రముఖంగా కనిపిస్తాయి. అవంతికి చెందిన మహాకాత్యాయన ఈ వర్గాన్ని స్థాపించాడు. ఈ సాహిత్యం బుద్ధుడిని దేవాధిపతిగా అభివర్ణిస్తాయి. లేదా అతడిని అద్భుతమైన మానవునిగా అద్భుతాలు సృష్టించగల వ్యక్తిగా, ప్రపంచ బోధకునిగా కీర్తిస్తాయి. అయితే అందులో కనిపించే సాధారణ వర్ణనలో బుద్ధుడిని మానవునిగా, మానవ సంబంధిత లోపాలు, బలహీనతలు గలవానిగా పేర్కొన్నారు. బుద్ధుని తత్త్వశాస్త్రం కూడా అతి సాధారణమైనది. దానిని మూడు పదాలలో నిర్ధారించవచ్చు. అనాత్మ. అనిత్య, దుఃఖ.

థెరావాద విచారధారతో దగ్గరగా ముడిపడి వున్న సర్వస్తివాదుల ఆలోచనా ధోరణి "సబ్బం అత్థి" (అన్ని జీవులు (వస్తువులు) మనుగడ సాగిస్తాయి) అన్న సిద్ధాంతాన్ని మూల బిందువుగా కలిగి ఉంది. ఈ సిద్ధాంతం "సంయుక్త నికాయ"లాంటి తొలి గ్రంథాలలో కనిపిస్తుంది. ఈ విచారధారతో పాటు స్థావీరవాదిన్‌ల విచారధారను అనుసరించేవారు. వాస్తవికవాదులు కనక ఈ విచారధార అన్ని జీవాలు మనుగడ సాగిస్తాయని నమ్ముతుంది. గతం, వర్తమానం, భవిష్యత్తులో జీవాలు నిత్యం కొనసాగుతాయని విశ్వసిస్తుంది. ఈ విచారధారను ప్రచారం చేసిన గొప్ప వ్యక్తులలో వసుబంధు ప్రముఖుడు. అభిధర్మ కోశ అనే అమూల్య గ్రంథాన్ని అతడు రచించాడు. ఈ విచారధారను కనిష్కుడు పెంచి పోషించాడు. కాశ్మీర్, గాంధారలో అది వికసించింది. వీరిని హేతువాదులని కూడా పిలుస్తారు.

మహా సంఘికలు బుద్ధుని భావాత్మక స్వభావాన్ని నమ్ముతారు. ఆ విధంగా బుద్ధునికి ఎక్కడాలేని అతీంద్రియ శక్తులన్నింటినీ ఆపాదిస్తారు. బోధిసత్వునికి ఎనలేని ప్రాముఖ్యతను కల్పించారు. బోధిసత్వునికి అర్హతల కంటే మానవాతీత శక్తులు ఉన్నాయని, ప్రపంచానికి వారు ఎక్కువగా సహాయ పడగలరని పరిగణించారు. తూర్పు కనుమలు, అమరావతి, నాగార్జున కొండ ప్రాంతాలలో స్థిరపడిన మహా సంఘికలను అనుసరించే వారిని సాధారణంగా ఆంధ్రకలుగా పిలుస్తారు. ఈ శాఖకు చెందిన మూడు వర్గాలను వసుమిత్ర పేర్కొన్నాడు. అవి చైత్య శైల, అపరశైల, ఉత్తరశైల. అయితే కథావత్తు వ్యాఖ్యానం పబ్బశెలియ, అపర శెలియ, రాజగిరిక, సిద్ధాంతికలను ప్రస్తావిస్తుంది. పై శాఖలు, ఉపశాఖలన్నీ హీనయానకు చెందుతాయి. అయితే కొన్ని శాఖలు పాక్షిక మహాయాన ఆలోచనలను అనుసరించాయి. మహాయాన

సిద్ధాంతాలకు వాటిని పూర్వ రూపాలుగా భావించవచ్చు. ఉదాహరణకు మహా సాంఘికలు, లోకోత్తరవాదులు బుద్ధుడిని పూజించారు. బోధిసత్వ ఆలోచనను ప్రవేశపెట్టారు. భావాన్ని అర్హత్ నుండి బుద్ధత్వానికి మార్చారు. ఇలా అనేక కొత్త కోణాలను, దృక్పథాలను ప్రవేశపెట్టారు.

**మహాయానవాదం** : క్రీ.శ. ఒకటి లేదా రెండవ శతాబ్దం నుండి భారతదేశంలో బౌద్ధమతం యొక్క ఒక కొత్త, పూర్తి భిన్నమైన శాఖ ఆవిర్భవించి విస్తరించింది. అందరికీ మోక్షాన్ని ప్రసాదించగలమని వాదించిన ఈ కొత్త విచారధార తనను తాను మహాయానగా ప్రకటించుకుంది. మోక్షానికి గొప్ప వాహనం అనే ఆలోచనను ప్రతిపాదించింది. పాత బౌద్ధానికి ఇది పూర్తి భిన్నమైనది. హీనయాన పాత బౌద్ధానికి చిహ్నమని అది పదే పదే పేర్కొంది. అంటే మోక్షానికి అది అల్పవాహనమని నిందించింది. బుద్ధుడు తన శిష్యులలో అత్యంత చైతన్యవంతులైన వారికి ఉపదేశించిన చివరి ప్రవచనాలకు తాము ప్రాతినిధ్యం వహిస్తున్నామని కూడా మహాయాన మత గ్రంథాలు వాదించాయి. మరోవైపు పూర్వపు సిద్ధాంతాలను కేవలం ప్రాథమికమైనవిగా పరిగణించారు. దైవాత్మ బుద్ధులు, బౌద్ధిసత్త్వాలు, భావాత్మక భౌతికవాదంతో మహాయానం బౌద్ధం హీనయానానికి చాలా అంశాలలో భిన్నమైనప్పటికీ అప్పటికీ ఎంతో కాలంగా కొనసాగిన పోకడల సంగమంగా దానిని భావించవచ్చు. ఆ సమయంలో పశ్చిమోత్తర భారతదేశంలో చోటు చేసుకుంటున్న గొప్ప చారిత్రక మార్పులు మహాయాన ఆవిర్భావానికి అనుకూలంగా మారాయి. ఆ శాఖ విస్తరణను వేగిరపరిచాయి.

బుద్ధుని జీవిత కాలంలో కూడా బుద్ధావతారాలలో అతడే చివరి వాడన్న ఆలోచన ఉండినట్లు బోధపడుతోంది. గౌతమ బుద్ధునికి పూర్వం ఆరుగురు బుద్ధులు – విపాస్యి, సిఖి, విశ్వభూ, క్రాకుచ్ఛంద, కనకముని, కశ్యప – వచ్చారని భావిస్తారు. బౌద్ధులలో వారిపట్ల ఆరాధన ఉండేదనడానికి బౌద్ధ కళలోని ప్రతిమలు, చిత్రాలే నిదర్శనం. అశోకుని నిగళిసాగర్ శాసనం ఈ వాదనను మరింత బలపరుస్తుంది. మౌర్య చక్రవర్తి కనకముని స్మారకార్థం నిర్మించిన స్తూపాన్ని విస్తరించాడని ఆ శాసనం పేర్కొంది. సిఖి మినహా మిగతా ఐదుగురు పూర్వ బుద్ధులు బార్హూత్ చిత్ర కళలో సహజమైన చెట్ల ప్రతీకలతో, గుర్తింపు ముద్రలతో కనిపిస్తారు. తర్వాత కాలంలో ఇతర బుద్ధులు కూడా వస్తారన్న నమ్మకం బలపడింది. చారిత్రక బుద్ధుడు జోస్యం చెప్పిన మైత్రేయుని రాకపై సర్వత్రా ఆసక్తి ఏర్పడింది.  విశ్వాసి లక్ష్యాన్ని (అంతిమ లక్ష్యం) మార్చడమే ధ్యేయంగా మహాయానవాదం తదుపరి చర్య తీసుకుంది. పూర్వపు సైద్ధాంతిక ఆలోచనల ప్రకారం అపర భక్తుడు అర్హత్ కావడానికి కృషిచేయాలి. అర్హత్‌కు పునర్జన్మ ఉండదు. అతడికి మొదటి నుండే నిర్వాణం ఉంటుంది. మరణం తర్వాత అతడు చివరగా పూర్తి నిర్వాణం పొందుతాడు. అయితే అర్హత్ స్థానంలో మహాయనం బోధిసత్త్వను ప్రవేశపెట్టింది. ఈ రెండు శాఖల మధ్య ప్రధాన వ్యత్యాసం ఇదే. బోధిసత్త్వాలలో నమ్మకం, వారికి అందించే సహాయం విముక్తి పథంవైపు నడిపిస్తుందని భావించారు. అయితే పాత వ్యవస్థ బోధిసత్త్వ సిద్ధాంతాన్ని ఆమోదించలేదు. ఫలితంగా అందులో కేవలం కొద్దిమంది ఓపిక కలిగిన, శ్రమపడే గుణం ఉన్న వ్యక్తులే మిగిలారు.

మహాయాన పరిణామ క్రమంలో తదుపరి దశ త్రికాయ సిద్ధాంతం. ఆ సిద్ధాంతం ప్రకారం బుద్ధునికి మూడు దేహాలు ఉన్నాయి. ధర్మకాయ, సంభోగకాయ, నిర్మాణకాయ. నిర్మాణకాయ ఒక్కటే భూమి మీద సిద్దార్థ గౌతమగా జీవించింది. సంభోగ కాయ స్వర్గంలో ఉన్నతమైన దైవంగా నిత్యం కొనసాగుతుంది. ఇది ధర్మకాయకు ప్రతిరూపం. ధర్మకాయ యావత్ విశ్వాన్ని కలిగి ఉంటుంది. నిర్వానతోనే ధర్మకాయను గుర్తించారు. పరిపూర్ణమైన మహాయాన బ్రహ్మాండశాస్త్రంలో అనేక సంభోగ కాయలు ఉండేవి. అవన్నీ ఒకే ధర్మకాయనుంచి వెలువడ్డాయి. అయితే స్వర్గాధిపతి అయిన బుద్ధుడు ప్రాథమికంగా మన ప్రపంచంపైనే దృష్టి సారించడంతో అతడిని అమితాభ అని పిలిచారు. అతడితో గౌతమ బుద్ధుడిని ముడిపెట్టారు. అలాగే సమర్థుడైన, దయార్ద్ర గుణం కలిగిన అవలోకితేశ్వర అనే బోధిసత్త్వను కూడా అతడితో ముడిపెట్టారు.

క్రీస్తు శకం తొలి శతాబ్దాలలో హీనయానం, మహాయానం భారతదేశంలో పక్కపక్కనే వికసించాయి. కొందరు భిక్షువులు మహాయానీయులైతే మరికొందరు హీనయానీయులుగా ఉండేవారని మనం చదువుకున్నాము. అయితే సాధారణంగా పశ్చిమోత్తర భారతదేశంలోని బౌద్ధులు మహాయానీయులు లేదా హీనయాన శాఖల సభ్యులుగా ఉండేవారు. ఈ హీనయాన శాఖల సభ్యులు మహాయాన సిద్దాంతాలతో చాలా వరకు ప్రభావితమయ్యారు. హీనయానలోని అతి సాత్విక స్వరూపాలు పశ్చిమ, దక్షిణ భారతదేశంలో బలంగా ఉండేవని బోధపడుతోంది. అలాగే సిలోన్‌లో కూడా వారి ప్రభావం ఉండేది. పశ్చిమోత్తర ప్రాంతాన్ని పాలించిన గొప్ప కుషాణ చక్రవర్తుల కాలంలోనే బౌద్ధం మధ్య ఆసియా అంతటా వ్యాపించింది. అక్కడి నుండి చైనాకు విస్తరించింది.

తాత్విక సిద్ధాంతాలను కూడా మహాయాన సృష్టించింది. అవి హిందూమతంపై గాఢమైన ప్రభావం చూపాయి. మహాయాన తత్త్వశాస్త్రంలోని రెండు ప్రధాన విచారధారలలో మాధ్యమిక, విజ్ఞాన వాద లేదా యోగచార ఉన్నాయి. తొలి విచారధారను నాగార్జునుడు స్థాపించాడు. (క్రీ.శ. ఒకటి నుండి రెండు శతాబ్దాలు). వాస్తవానికి శూన్యమైన వస్తువుల కోసమే మానవులంతా శ్రమిస్తారని, అవన్నీ భ్రమలేనని నాగార్జునుడు బోధించాడు. శూన్యత ఒక్కటే వాస్తవమని వాదించారు. కనుక మాధ్యమికలను కొన్నిసార్లు శూన్యవాదులని కూడా పిలిచారు. నాగార్జునుడు రచించిన "మాధ్యమిక కారిక" ఈ విచార ధారకు మౌలిక గ్రంథంగా మారింది.

మైత్రేయనాథుడు స్థాపించిన విజ్ఞాన వాద పథం భావవాద విచారధారగా ఉండేది. దాని ప్రకారం మొత్తం విశ్వం కేవలం ఆలోచకుని మదిలోనే ఉంటుంది. మాధ్యమిక కంటే తక్కువ ప్రభావం చూపినప్పటికీ ఈ విచారధార అనేకమంది ప్రముఖతత్త్వవేత్తలు, తార్కికులను సృష్టించింది. వారిలో అసంగ (సూత్రాలంకరణ రచయిత), వసుబంధు (అసంగ చిన్న సోదరుడు) దిగ్‌నాగ, ధర్మకృతి ముఖ్యులు. పదజాల నిర్మాణం భిన్నమైనప్పటికీ మహాయాన బౌద్ధం యొక్క తార్కికవాదం కొన్ని ఉపనిషత్తుల సిద్ధాంతాలతో పోలి ఉన్నాయి. తొమ్మిదవ శతాబ్దపు తత్త్వవేత్త

శంకర సిద్ధాంతాల పరమార్థం కూడా వాటిలో కనిపిస్తుంది. బహుశా శంకర బౌద్ధ మతం నుండి చాలా నేర్చుకొని ఉంటాడు. అతడి ప్రత్యర్థులు అతడిని లిఖిత బౌద్ధునిగా పిలిచారు కూడా.

**వజ్రయాన వాదం:** క్రీ.శ. ఐదవ శతాబ్దం మధ్యలో భారతీయులు అమ్మదేవత పూజా విధానాలలో ఎక్కువ ఆసక్తిని ప్రదర్శించడం మొదలుపెట్టారు. అలాగే మత అతీంద్రియ కర్మకాండల సాంప్రదాయాన్ని అనుసరించడం ప్రారంభించారు. ఈ రెండు విధానాలను అనుసరిస్తే మోక్షం సాధ్యమవుతుందని నమ్మారు. లేదా అద్భుతమైన శక్తులను పొందవచ్చని భావించారు. ఇలాంటి కర్మకాండలు, సాంప్రదాయాలలో కొన్నిసార్లు అనైతిక లేదా వెగుటు పుట్టించే లక్షణాలు ఉండేవి. తాంత్రిక హిందూ మతంతో పాటు తాంత్రిక బౌద్ధం కూడా ఒకేసారి ఉద్భవించాయి. ఈ కొత్త తాంత్రిక బౌద్ధాన్ని తరచుగా తంత్రవాదమని పిలిచారు. తంత్రాలను బట్టి ఆ పేరు వచ్చింది. బహుశా తంత్రవాదం సంఘటిత బౌద్ధంలో కనీసం ఏడవ శతాబ్దం వరకు ప్రవేశించలేదని తెలుస్తోంది. ఎందుకంటే ఆ తర్వాత దేశంలో పర్యటించిన హుయాన్‌త్సాంగ్ కొన్ని విహార సముదాయాలు కొన్ని తంత్ర విద్యలను ఆచరిస్తున్నాయని నివేదించాడు. తాంత్రిక బౌద్ధానికి రెండు ప్రధాన శాఖలు ఉండేవి. వాటిని కుడిచేయి, ఎడమచేయి అని పిలిచేవారు.(హిందూ తాంత్రికులలో కూడా ఇలాంటి శాఖలు ఉండేవి). కుడిచేయి (దక్షిణాచార) చైనా, జపాన్‌లలో చాలా ప్రభావవంతంగా మారినప్పటికీ సంస్కృతంలో నామమాత్రపు సాహిత్యాన్ని వదలివెళ్లింది. కండపుష్టిగల దైవాల పట్ల భక్తిని చాటుకోవడం ఈ శాఖ ప్రధాన లక్షణం. ఎడమచేయి (వామాచార) శాఖలు బుద్ధుని భార్యలు లేదా సమాచార దేవతలను కొలిచేవి. వీటికి వజ్రయాన అనే పేరును ఎక్కువగా వర్తింపచేసేవారు. బోధిసత్వ, తదుపరి బౌద్ధానికి చెందిన పౌరాణిక దైవాలను కూడా పూజించేవారు. తమ ప్రధాన దృష్టినంతా ఈ తారలు లేదా పరిరక్షకులపైనే కేంద్రీకరించేవారు.

క్రీ.శ. ఐదు లేదా ఆరవ శతాబ్దం నాటికి బౌద్ధ తాత్విక అధ్యయనం క్రమంగా క్షీణించడంతో తాంత్రిక సాహిత్యం, కర్మకాండయుత పూజ విధానం పునరుద్ధరణకు గురయ్యాయి. అలాగే వివిధ తాంత్రిక సాధకులు పెద్ద సంఖ్యలో పుట్టుకు వచ్చారు. వీరిని సిద్ధులు లేదా సిద్ధాచార్యులుగానే ఎక్కువగా గుర్తిస్తారు. తాంత్రిక బౌద్ధంపై వెలువడిన తొలి సాహిత్య వృత్తులలో గుహ్యసమాజ, మంజుశ్రీ మూల కల్ప ఉన్నాయి. గుహ్య సమాజ యోగ, అనుత్తర యోగలను ప్రతిపాదించగా మూలకల్ప ముద్రలు (దేహ భంగిమలు, వ్రేళ్లు), మండలాలు (తాంత్రిక బొమ్మలు), మంత్రాల, తదితర వాటిని బోధించింది. అయితే అనేక తాంత్రిక వర్గాలు కర్మకాండలను కేవలం ప్రతీకాత్మకంగానే ఆచరించాయి. వాటి గురువులు తరచూ గణనీయమైన తత్త్వభావంగల కృతులను రూపొందించారు. తాంత్రికుడైన సరాహ దోహకోశ అనే కృతిని రచించాడు. అందులో కొన్ని వ్యాఖ్యానాల నైతికత అత్యున్నతంగా ఉంది. ఆ విధంగా వజ్రయాన భక్తులు తంత్రశక్తి ద్వారా మోక్షాన్ని పొందడమే ఉత్తమమైన మార్గమని నమ్మారు. అలాంటి శక్తిని వారు “వజ్ర” (వజ్రం లేదా పిడుగు) అని పిలిచారు. ఈ కొత్త శాఖ ముఖ్యదైవాలైన తారలు (బుద్ధులు, బోధిసత్త్వాల భార్యలు)ను తంత్రశక్తి కోసం ప్రసన్నం చేసుకోవడం కంటే

బలవంతం చేసేవారు. అందుకు తంత్రాలను ఆచరిస్తూ యంత్ర లోపలే మంత్రాలను జపించేవారు. ఈ విధానం తూర్పు భారతదేశంలో, ముఖ్యంగా బెంగాల్, బీహార్‌లలో ఎనిమిదవ శతాబ్దం నుండి పాలుల పోషణలో విశేష ఆదరణ పొందింది. తర్వాత అది టిబెట్‌కు విస్తరించింది. తాంత్రిక బౌద్ధం లేదా వజ్రయాన వాదం వల్లే తదుపరి బౌద్ధంలో విస్తృతమైన, వైవిధ్యభరితమైన దైవాల సమూహం ఏర్పడింది. తాంత్రికవాదం పూర్తిగా బలపడక ముందు బౌద్ధానికి ఎలాంటి దైవాల సమూహం ఉండేది కాదని బోధపడుతుంది. బుద్ధుడిని లోకోత్తర లేదా అద్భుత పురుషునిగా పరిగణించిన మహాయాన వర్గం అతడి విగ్రహాన్ని పూజించిందనడంలో ఎలాంటి సందేహంలేదు. సాంచి, బార్హూత్ లాంటి తొలి విహారాలలో మనకు బుద్ధుని ప్రతిమలేవీ కనిపించనప్పటికీ గాంధార, మధుర విహారాలలో మాత్రం బుద్ధుని విగ్రహాలను తొలిగా చెక్కారన్న వాదనలు బలంగా ఉన్నాయి. మహాయాన వజ్రయానగా రూపాంతరం చెందడంతో (క్రీ.శ. 7-8 శతాబ్దాలలో), విశాలమైన దైవాల సమూహం ఆవిర్భవించింది. క్రీ.శ. పదవ శతాబ్దంలో దానిని మరింత విస్తరించారు. మంజుశ్రీ మూలకల్పలో అనేకమంది దేవదేవతల గురించి అభివర్ణించారు. అయితే గుహ్య సమాజంలో మాత్రమే మనకు తొలిసారి బౌద్ధ దైవ సమూహంపై సరైన ఆలోచన కనిపిస్తుంది. అందులో ఆ సిద్ధాంతాన్ని నిర్దిష్టంగా అభివృద్ధి పరిచారు.

ఈ దేవ దేవతల స్థాయి క్రమంలో శీర్షికన ఆది బుద్ధ, ఆది ప్రజ్ఞ అనే దంపతులు కనిపిస్తారు. బౌద్ధానికి వారు విశ్వజనీన తల్లిదండ్రులు. వారి నుండి ఐదుగురు ధ్యానబుద్ధులు ఉద్భవించారు. 1. అమితాభ 2. అక్షోభ్య, 3. వైరోచన 4. రత్న సంభవ, 5. అమోఘసిద్ధి ధ్యాని బుద్ధులు ఐదు పంచభూతాలకు ప్రాతినిధ్యం వహిస్తారు. అలాగే బ్రహ్మాండ శక్తులను (స్కంధాలు) ప్రతిబింబిస్తారు. పునరుత్పత్తి చర్యలో ధ్యాని బుద్ధులు పాలు పంచుకోరు. ఆ బాధ్యతను బోధిసత్త్వలకు అప్పగిస్తారు. బోధిసత్త్వలు మానుషిబుద్ధలు (మానవ బుద్ధలు) ద్వారా తమ కార్యకలాపాలు నిర్వహిస్తారని చెబుతారు. అమ్మదేవతల ప్రాధాన్యత విపరీతంగా పెరగడంతో ప్రతి ధ్యానిబుద్ధ, అతడి బోధిసత్వలకు సహచరిని ఇచ్చారు. అలాగే ప్రతిధ్యాని బుద్ధను కులేశ (కుటుంబపెద్ద)గా భావించడం మొదలుపెట్టారు. అంటే అనేక దేవదేవతలతో కూడిన కుటుంబానికి ధ్యానిబుద్ధులు పెద్దలుగా ఉంటారు. కొత్త దైవాలు ప్రవేశించడంతో వజ్రయాన పురోహితులు, రచయితలు వారిని ఎవరో ఒక ధ్యాన బుద్ధుని కుటుంబంతో అంటగట్టడం మొదలుపెట్టారు. ప్రతి ధ్యాన బుద్ధునికి ఒక చిహ్నముంది. అతడి శక్తితో పాటు బోధిసత్త్వ ఆ చిహ్నాన్ని ప్రదర్శించేది. ప్రతి ధ్యాన బుద్ధునికి విభిన్నమైన ఛాయ, భంగిమలు ఉన్నాయి.

**జైన మతం :**

**జైన మత మూలాలు:** జైన మత మూలాలు ఇప్పటికీ అంతుపట్టకుండా ఉన్నాయి. క్షత్రియులైన 24 మంది తీర్థంకరుల బోధనల ఫలితంగానే తమ మతం ఆవిర్భవించిందని జైనులు నమ్ముతారు. తొలి 22 మంది తీర్థంకరులు (రుషభ నుండి అరిష్టనేమి వరకు)

వ్యక్తిత్వంలో మహిమాన్వితులు వారి గురించి ఏమి చెప్పాలన్నా చాలా కష్టం. ఇరవై మూడవ తీర్థంకర అయిన పార్శ్వనాథ వర్థమాన మహావీరునికి 250 సంవత్సరాల ముందు జీవించాడు. అతడికి నిజమైన చారిత్రక వ్యక్తిత్వం ఉన్నట్లు కనిపిస్తోంది. అతడు బనారస్ పాలకుడు అశ్వసేన కుమారుడు. పార్శ్వ నాథ ఒక నిర్దిష్టమైన సంఘటనాన్ని వదలివెళ్లినట్లు కనబడుతోంది. పార్శ్వనాథ స్థాపించిన వ్యవస్థను మహావీరుని తల్లిదండ్రులు, బంధువులు అనుసరించారు. తదుపరి, చివరి తీర్థాంకరుడు స్వయంగా వర్థమాన మహావీరుడే. ఉన్నత జైన ప్రబోధకులను తీర్థంకర అని పిలుస్తారు. ఎందుకంటే వారు మానవులను జీవితంలోని అంధకారపు జలాల నుండి వెలుతురు వైపు నడిపిస్తారు. వారిని జిన (విజేత) అని కూడా పిలుస్తారు.

**మహావీరుని జీవితం - బోధనలు :**

తర్వాతి కాలంలో మహావీరునిగా గుర్తింపు పొందిన వర్థమానుడు క్రీ.పూ. 540లో వైశాలి సమీపంలోని కుందగ్రామ్ వద్ద రెండవ కుమారునిగా జన్మించారు. జ్ఞాత్రిక అనే క్షత్రియ కులానికి అతడి తండ్రి సిద్ధార్థ నాయకుడు. అతడి తల్లి త్రిశాల. ఆమె వైశాలి ప్రముఖ పాలకుడు, లిచ్ఛవీ వంశానికి చెందిన చేతక అనే రాకుమారుడి సోదరి. చేతకుని కుమార్తె చెల్లనను మగధ పాలకుడు బింబిసారుడు వివాహమాడిన కారణంగా మగధకు చెందిన హర్యాంక వంశానికి మహావీరుడు బంధువు అవుతాడు. మహావీరుడు యశోదను వివాహం చేసుకున్నాడు. వారికి అనోజ్జ అనే కుమార్తె జన్మించింది. తన తల్లిదండ్రుల మరణం తర్వాత మహావీరుడు సన్యాసిగా మారాడు. అప్పటికి అతడికి 30 సంవత్సరాలే. పార్శ్వనాథ స్థాపించిన మత వ్యవస్థలో అతడు రెండేళ్లు సభ్యునిగా కొనసాగాడు. తర్వాత ఆ వ్యవస్థను వీడి సుమారు 10 ఏళ్లపాటు సంచరించాడు. ఈ సమయంలో తొలి ఆరేళ్లు గోసల మస్కరీపుత్రతో (ఇతడు అజీవిక శాఖను స్థాపించాడు) కలిసి తిరిగాడు. కైవల్య (పరిపూర్ణ జ్ఞానం) పొందిన తర్వాత (తన 42వ ఏట తూర్పు భారతదేశంలోని జృంభిక గ్రామం వద్ద ఒక సాల వృక్షం కింద ఈ జ్ఞానాన్ని పొందాడు) సుమారు 30 ఏళ్ల పాటు బోధించి క్రీ.పూ. 468లో తన 72వ ఏట రాజగృహ సమీపంలోని పావపురి వద్ద మరణించాడు. బోధనా కాలంలో అతడు నిర్గ్రంథ (ఎలాంటి గ్రంథాలు లేని) అనే శాఖకు అధిపతిగా మారాడు. నిర్గ్రంధులు తదుపరి కాలంలో "జిన"లుగా ప్రసిద్ధిగాంచారు.

జైన మతానికి సంబంధించిన ఐదు ప్రధాన సూత్రాలు - అహింస, సత్యం, అస్తేయము, అపరిగ్రహము, బ్రహ్మచర్యము, మహావీరుడు కేవలం చివరి సూత్రాన్ని మాత్రమే జోడించాడు. మిగతా సూత్రాలన్నిటినీ అతడి పూర్వీకులు (గురువులు) రూపొందించారు. ఈ ఐదు సూత్రాలు లేదాప్రతిజ్ఞలను కఠినంగా ఆచరించే భిక్షువులను మహావ్రతులని పిలుస్తారు. సాధారణ భక్తులు వాటిని అంత కఠినంగా పాటించరు కనక వారిని అనువ్రతులని పిలిచారు. జైన మతానికి చెందిన మూడు రత్నాలు (రత్నత్రయ). సంపూర్ణ జ్ఞానం, చర్య విముక్తి.

మహావీరుని స్యద్వాదను నమ్మాడు. విషయం, ఆత్మలే రెండు సజీవ శక్తులని బోధించాడు. విషయం నశించినా ఆత్మ మాత్రం శాశ్వతంగా కొనసాగి పరిణామక్రమం చెందుతుందని చెప్పాడు. మహావీరుని ప్రకారం కర్మ ఆధారంగా ఆత్మ పరాధీన స్థితిలో ఉంటుంది.

గత జన్మలలో పోగైన మోహాలు, కాంక్షలు ఈ పరిస్థితిని సృష్టిస్తాయి. గృహస్తునికి, నీడలేని భిక్షువుకు ఒక నైతిక నియమావళిని వర్తింపజేశారు. జీవిత లక్ష్యం మోక్ష సాధనే కావడంతో ప్రతి ఒక్కరూ దుష్ట కర్మలకు దూరంగా ఉండి క్రమంగా అన్ని రకాల తాజా కర్మలను నివారించాలి. అలాగే ప్రస్తుతం ఉన్న కర్మలను నాశనం చేయాలి. ఈ లక్ష్య సాధనలో గృహస్తుడు ఐదు ప్రతిజ్ఞలను పాటించాలి. ఇంతకంటే కఠినమైన నిబంధనలను భిక్షువుకు వర్తింపజేశారు.

సజీవ, నిర్జీవ వస్తువులన్నీ వివిధ స్థాయిలో చైతన్యం కలిగి ఉంటాయని మహావీరుడు పరిగణించాడు. వాటికి జీవం ఉంటుందని, వాటికి భౌతికపరమైన గాయాలు తగిలితే నొప్పిని చవి చూస్తాయని భావించారు. వేదాల ఆధిపత్యాన్ని అతడు తోసిపుచ్చాడు. వైదిక కర్మకాండలు, బ్రాహ్మణ ఆధిపత్యానికి అభ్యంతరం తెలిపాడు. కఠినమైన సన్యాస జీవితాన్ని అతడు ప్రతిపాదించాడు. మోక్ష సాధనకు కఠిన దీక్ష ఆచరించాలని అలాగే ఉన్నతమైన ఆధ్యాత్మిక స్థాయికి చేరుకోవాలని ప్రబోధించాడు.

**జైన ఆలయం, మండళ్లు, చీలికలు :**

జైన ఆలయాన్ని మహావీరుడే స్వయంగా స్థాపించాడు. అతడికి 11 మంది సన్నిహిత శిష్యులు లేదా అపోస్తలులు ఉండేవారు. వారిని గణధారలు అని పిలుస్తారు. ఒక్కో విచారధారకు వారు అధిపతులుగా ఉండేవాడు. కేవలం ఆర్య సుధర్మనుడనే శిష్యుడొక్కడే మహావీరుని మరణం తర్వాత జీవించాడు. అలా తొలి థేర (పురోహితుడు) అయ్యాడు. జైన ఆలయానికి ప్రధాన పురోహితునిగా బాధ్యతలు చేపట్టాడు. తన గురువు మహావీరుడు మరణించిన 20 ఏళ్లకు సుధర్మనుడు కన్నుమూశాడు. అతని వారసుడు జాంబు. అతడు 44 సంవత్సరాలపాటు పురోహితునిగా కొనసాగాడు. అతడి తర్వాత మూడు తరాల పురోహితులు వచ్చారు. మగధలో చివరి నంద పాలనా కాలంలో జైన ఆలయం ఇద్దరు థేరాల (సంభూత విజయ, భద్రబాహూ) ఆధ్వర్యంలో నడిచింది. ఒకరి తర్వాత ఒకరు వారు ఆలయాన్ని శాసించారు. తన గణధారలకు మహావీరుడు 14 పాత జైన మత గ్రంథాలైన “పూర్వ”లను స్వయంగా ప్రబోధించాడు. ఆ పూర్వలను సంభూత విజయ, భద్రబాహులిద్దరూ సంపూర్ణం చేశారు. చంద్రగుప్త మౌర్య గద్దెనెక్కిన సంవత్సరంలోనే సంభూత విజయ మరణించినట్లు చెబుతారు.

జైన ఆలయస్థాపన నుండి క్రీ.పూ. 4 లేదా 3వ శతాబ్దం వరకు దానికున్న చరిత్రను తెలుసుకోవడంలో మనం భద్రబాహు రచించిన జైన కల్పసూత్రకు ఎంతో రుణపడి ఉన్నాము. భద్రబాహు మహావీరుని తర్వాత ఆరవథేరగా బాధ్యతలు నిర్వహించాడు. అతడు చంద్రగుప్త మౌర్యునికి సమకాలికుడు. జైన కల్పసూత్రలో మూడు వేర్వేరు భాగాలు ఉన్నాయి. తొలి భాగాన్ని జైన చరిత అంటారు. అందులో 24 మంది తీర్థంకరుల జీవిత చరిత్రలు ఉన్నాయి. కల్పసూత్ర రెండవ భాగంలో థెరావలీ (గణాల జాబితా), గణధారల వివరాలు ఉన్నాయి. మూడవ భాగంలో సమాచారి లేదా భిక్షువులు పాటించాల్సిన నియమావళి ఉంది.

క్రీ.పూ. నాల్గవ శతాబ్దం ముగిసేనాటికి గంగాలోయలో ఘోర కలి సంభవించింది. ఫలితంగా జైన భిక్షువులు పెద్ద సంఖ్యలో దక్కను, దక్షిణ భారతదేశానికి (శ్రావణ బెళగోల) వలసపోయారు. వారిలో భద్రబాహు, చంద్రగుప్త మౌర్య కూడా ఉన్నారు. సుమారు 12 ఏళ్ల తర్వాత వారు తిరిగి గంగా లోయకు చేరుకున్నారు. మగధలోనే ఉండిపోయిన వర్గానికి నాయకుడు స్థూలబాహు. అతడి అనుచరుల నైతిక నియమావళిలో చోటు చేసుకున్న మార్పులు జైనులలో విభజనకు దారితీశాయి. దిగంబరులుగాను, శ్వేతంబరులుగాను వారు చీలిపోయారు.

తొలి జైన మండలి క్రీ.పూ. మూడవ శతాబ్దం తొలినాళ్లలో స్థూలబాహు ఆధ్వర్యంలో పాటలీపుత్ర వద్ద జరిగింది. మండలి ఫలితంగా 12 అంగాల సంకలనం పూర్తయింది. గల్లంతైన 14 పూర్వల స్థానంలో ఈ 12 అంగాలు వచ్చాయి. అయితే ఈ గ్రంథాలను కేవలం శ్వేతంబరులొక్కరే ఆమోదించారు. క్రీ.శ. ఐదవ శతాబ్దంలో శ్వేతంబరులు వలభి వద్ద రెండవ జైన మండలిని నిర్వహించారు. సమావేశానికి దేవార్ధి క్షమశ్రమన నాయకత్వం వహించాడు. ఈ మండలి ఫలితంగా 12 అంగాలను సంపూర్ణంగా సంకలించారు. అలాగే 12 ఉప అంగాలను రూపొందించారు. తదుపరి శతాబ్దాలలో కూడా దిగంబర, శ్వేతంబర శాఖలు రెండింటిలోనూ మరిన్ని చీలికలు వచ్చాయి. దిగంబరుల నుండి సమైయాలు వేరు పడగా శ్వేతంబరుల నుండి తెరాపంతీలు విడిపోయారు. ఈ రెండు కొత్త వర్గాలు విగ్రహారాధనను వీడి కేవలం మత గ్రంథాలను మాత్రమే పూజించాయి.

**మహావీరుని తర్వాత జైన మతం :**

మహావీరుని అనుచరులు లేదా భక్తులు దేశమంతటా విస్తరించారు. భారతదేశంపై అలెగ్జాండర్ దండెత్తినప్పుడు సింధూ నది తీరాలలో జైన భిక్షువులు కనిపించారు. జైన పురాణాల ప్రకారం అజాత శత్రువారసుడైన ఉదయిన్ అపర జైన భక్తుడు. నందులు కూడా బహుశా జైనులై ఉండవచ్చు. క్రీ.పూ. తొలి శతాబ్దంలో ఉజ్జయినీ గొప్ప జైన క్షేత్రంగామారింది. జైన సంతులు కలకాచార్య, గర్దభిల్ల, గర్దభిల్ల కుమారుడు విక్రమ్‌ల పురాణ గాథలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తాయి. క్రీ.పూ. నాల్గవ శతాబ్దం ముగిసే నాటికి జైన మతం దక్కను ప్రాంతమంతటా, అలాగే దక్షిణంలో మైసూరు సమీపానగల శ్రావణ బెళగోల మూల పీఠంగా విస్తరించింది. అక్కడ జైన మతం ప్రజల ఆదరణను చూరగొంది. ముఖ్యంగా వ్యాపార సముదాయం ఆ మతాన్ని స్వీకరించింది.

జైన మతానికి రాచరిక పోషణ, ప్రోత్సాహం కూడా లభించాయి. చంద్రగుప్త మౌర్య ఆ మతాన్ని పోషించిన తొలి పాలకుడు. అతడు పరమ భక్తుడు కూడా. దక్షిణానికి భద్రబాహు జరిపిన యాత్రలో అతడు స్వయంగా పాల్గొన్నాడు. క్రీ.పూ. రెండవ శతాబ్దం సందర్భంగా కళింగరాజు ఖారవేల జైన మతాన్ని స్వీకరించాడు. జైన ప్రతిమలను స్వయంగా నెలకొల్పి గొప్ప పోషకునిగా మారాడు. కుషానుల కాలంలో జైన మతం మధురలో వికసించింది. హర్షుని కాలంలో తూర్పు భారతదేశంలో ప్రధాన విశ్వాసంగా ఎదిగింది. క్రీస్తుశకం తొలి శతాబ్దాలలో ఉత్తరంలో మధుర, దక్షిణంలో శ్రావణ బెళగోల జైన కార్యకలాపాలకు గొప్ప

క్షేత్రాలుగా వెలసిల్లాయి. శాసనాలు, ప్రతిమలు, ఇతర నిర్మాణాలు ఈ రెండు ప్రదేశాలలో పెద్ద సంఖ్యలో లభించడం అందుకు నిదర్శనం.

చివరి ప్రాచీన, తొలి మధ్యయుగ కాలాలలో దక్షిణాదికి చెందిన అనేక రాచరిక వంశాలు – గంగాలు, కాదంబాలు, చాళుక్యులు, రాష్ట్ర కూటులు – జైన మతాన్ని పోషించాయి. మాన్యఖేతాకు చెందిన కొందరు రాష్ట్ర కూట పాలకులు జైన మతంపట్ల ప్రత్యేకంగా మొగ్గు చూపారు. జైన కళ సాహిత్యాలకు గొప్ప ప్రోత్సాహం అందించారు. వారి హయాంలో అనేక ప్రముఖ జైన కవులు అభివృద్ధి చెందారు. అమోఘ వర్షుని పాలనలో జినసేన, గుణభద్రలు తమ "మహాపురాణ"ను రచించారు. అమోఘవర్షుడు స్వయంగా రచించిన రత్నమాలిక అనే జైన కృతి అన్ని వర్గాల ప్రజల ఆదరణను చూరగొంది. తన జీవిత చరమాంకంలో అతడు జైన మునిగా మారినట్లు చెబుతారు. శిలాశాసన ఆధారాల ప్రకారం అమోఘవర్షుడి వారసుల్లో ఒకరైన నాల్గవ ఇంద్ర సాంప్రదాయ జైన శైలిలో మరణించాడు. సల్లేఖన లేదా ఆమరణ నిరాహారదీక్ష చేపట్టి అతడు ప్రాణాలు వదిలాడు.

క్రీ.శ.1100 కాలంలో జైన మతం గుజరాత్‌లో గొప్పగా విస్తరించింది. అక్కడ చాళుక్య రాజు సిద్ధరాజ (1094–1143), అతడి వారసుడు కుమారపాల జైనమతానికి గొప్ప పోషకులుగా వ్యవహరించారు. సిద్ధరాజను జయసింహ అని కూడా పిలుస్తారు. వారిద్దరూ జైన మతాన్ని బహిరంగంగా చాటుకున్నారు. సాహిత్యాన్ని జైన ఆలయాల నిర్మాణాలను ప్రోత్సహించారు. వారి ఆస్థానంలో ప్రముఖ జైన విద్వాంసుడు హేమచంద్ర నివసించాడు. అతడు బహుముఖ సామర్థ్యం గలవాడు. అతడు రచించిన సుదీర్ఘ పద్యాలలో త్రిశస్తిసాలక పురుష చరిత (63 మంది ప్రముఖ వ్యక్తుల కార్యాలు) ఒకటి. ఆ భారీ కావ్య ప్రబంధనంలో 24 మంది తీర్థంకరుల కథలు, జైన పురాణంలోని ఇతర ప్రముఖ వ్యక్తుల చరిత్రలు ఉన్నాయి. ఈ గ్రంథంలోని చివరి భాగంలో "మహావీరుని కార్యాలు" సంపూర్ణంగా ఉన్నాయి. మహావీరుని జీవిత చరిత్రను అది ఉల్లేఖిస్తుంది. హేమచంద్ర పోషకుడైన కుమారపాల అధికారంలోకి వస్తాడని మహావీరుడు జోస్యం చెప్పినట్లు, అలాగే అతడు చేపట్టబోయే సంస్కరణలను సూచించినట్లు చెబుతారు. ముస్లిం పాలనా కాలంలో జైనులు రాజపుతాన రాజ్యాలలో వికసించారు. ఆ రాజ్యాలలో వారు అనేక ముఖ్యమైన పదవులను (సైన్యాధ్యక్షులుగా, మంత్రులుగా) నిర్వహించారు.

**జైన తత్త్వశాస్త్రం :**

తత్త్వశాస్త్రంలోని సాంఖ్య వాదానికి  జైన మతం దగ్గరగా ముడిపడి ఉన్నట్లు కనిపిస్తుంది. దానిని స్యద్‌వాదం అంటారు. స్యద్‌వాదం ప్రకారం సప్తభంగి (ఏడురకాల ముక్తి) సాధ్యమవుతుంది. స్యద్‌వాదానికి దగ్గరగా "నయావాదం" ముడిపడి ఉంది. జ్ఞానం లేదా అధ్యయనానికి ఏడు మార్గాలను అది సూచిస్తుంది. జైన మతానికి చెందిన ఈ రెండు సిద్ధాంతాలను కలిపి అనేకాంతవాదం అని పిలుస్తారు. జైన మతానికి వాస్తవికవాద సిద్ధాంతం కూడా ఉంది. దాని ప్రకారం ప్రపంచంలో రెండు శాశ్వతమైన, అస్పృష్టిత, సహజీవన విభాగాలు

ఉన్నాయి. అయితే వాటికంతకు అవి స్వతంత్రంగా ఉంటాయి. అవే చైతన్యం (జీవ), అచేతనం (అజీవ), అచేతనం అన్నది మనం పిలిచే "విషయం" మాత్రమే కాదు. అందులో విషయం (పుద్గల)తో పాటు స్థలకాలాదులు, పాప పుణ్యాలు వగైరా కూడా ఉన్నాయి. చైతన్యం ఆత్మకు సంబంధించినది. జ్ఞానాన్ని గ్రహించే శక్తి దానికి ఉంటుంది. అన్నిరకాల భావాలను కూడా అది అనుభవించగలదు. అది చర్య తీసుకుంటుంది, చెప్పినట్లు నడుచుకుంటుంది. అది దుఃఖాలను అనుభవిస్తుంది. కేవలం కష్టాలను భరించడానికే మళ్ళీ మళ్ళీ జన్మిస్తుంది. ఈ ఒప్పందం నుండి (బంధం) విముక్తి కావడమే దాని ఉన్నత కర్తవ్యం. ఇదే మోక్షం. దీనిని ఉన్నత జ్ఞానం, మహాసత్యంపై ధ్యానం ద్వారా సాధించవచ్చు.

జైన తత్త్వం ప్రకారం అన్ని జీవాత్మలను ఐదు వర్గాలుగా విభజించవచ్చు. జీవాలకు ఉన్న చేతనాల సంఖ్య ఆధారంగా ఈ వర్గీకరణ ఉంటుంది. ఉన్నత వర్గంలో ఐదు చేతనాలు (స్పర్శ, రుచి, వాసన, చూపు, వినికిడి) కల మానవులు, దేవుళ్లు, ఉన్నత జంతువులు, నరకవాసులు ఉంటారు. రెండో వర్గంలో తొలి నాలుగు చేతనాలు ఉన్న జీవులు ఉంటాయి. ఇందులో ఇతర జంతువులు, పెద్ద కీటకాలు ఉంటాయి. మూడు చేతనాలు గల వర్గంలో చిన్న కీటకాలు ఉంటాయి. దురదృష్టవశాత్తు వీటికి చూపు ఉండదు. ఎందుకంటే వాటికి కాంతివంతమైన దీపాలలో ఎగిరే అలవాటు ఉంటుంది. రెండు చేతనాలు గల జీవాల –కేవలం రుచి, స్పర్శ మాత్రమే వీటికి తెలుసు – లో క్రిములు, జలగలు, జిగురు చేపలు వగైరా ఉంటాయి. చివరి వర్గంలో కేవలం రుచి తెలిసిన జీవాలు మాత్రమే ఉంటాయి. ఈ చివరి వర్గీకరణలోనే జైన మతం తన మౌలిక లక్షణాలను ప్రదర్శిస్తుంది. ఈ గొప్ప వర్గాన్ని మరలా ఐదు ఉపవర్గాలుగా విభజించారు. మొక్క స్వరూపాలు, భూమి స్వరూపాలు, జల స్వరూపాలు, అగ్ని స్వరూపాలు, పవన స్వరూపాలు.

ఉన్నత వర్గ స్వరూపాలకు గాయం తగిలితే ఆత్మకు తీవ్ర పర్యవసానాలు ఉంటాయి. అయితే దిగువ వర్గాలకు అలాంటి బాధ ఉండదు. కాని భూమిని, జలాన్ని దుర్వినియోగం చేస్తే ఆత్మ సంక్షేమానికి ప్రమాదకరంగా పరిణమిస్తుంది. ఒకే చేతనం గల జీవాలను నాశనం చేయడం లేదా వాటికి హానిని తలపెట్టకుండా ఉండడం మానవ మాత్రునికి అసాధ్యం. అయితే ఉద్దేశ్యపూర్వక లేదా అనవసర హాని తలపెడితే అది ఖండనీయమే. తెలిసి తెలిసి భూమి, జల, అగ్ని, పవన స్వరూపాలకు హాని తలపెట్టనని జైన భిక్షువు ప్రమాణం చేస్తారు. సాధ్యమైనంత వరకు వాటిని నాశనం చేయనని ప్రతిజ్ఞ చేస్తాడు. మనుగడ సాగించడం కోసం అతడు తిండి తినాలి, నీళ్లు తాగాలి. అయితే అందుకోసం సజీవ మొక్కలను అతడు నాశనం చేయకూడదు. ఈ విషయాన్ని అతడు సాధారణ భక్తులకు వదలిపెట్టాలి. వారు అతనికి ఆహారాన్ని సరఫరా చేస్తారు. బౌద్ధ మతం కూడా తన భిక్షువులకు ఇలాంటి నైతిక వర్తనాన్నే సూచిస్తుంది. కాని అంత తీవ్రస్థాయిలో కాదు.

**జైన ఖగోళ శాస్త్రం :**

ఆత్మ పరిణామ ప్రక్రియ నిరంతరంగా సాగుతుంది. ప్రగతి, పతనాల అనేక దశల గుండా విశ్వం ప్రయాణిస్తుంది. హిందూ, బౌద్ధ చక్ర సిద్ధాంతాల వలె కాకుండా జైన వ్యవస్థలో ఆత్మ చివరి దశలో ఎలాంటి తీవ్రమైన వ్యత్యాసం ఏదీ కనిపించదు. అయితే సంకోచ, వ్యాకోచాల ఊహాకందని ప్రక్రియ కొనసాగుతుంది. ప్రతి ఖగోళ చక్రంలో రెండు భాగాలు ఉంటాయి. ఒకటి ఉత్సర్పిణి, రెండవది అవసర్పిణి. ఇపుడు మనం అవసర్పిణి (పతన) దశలో ఉన్నాము. ఈ దశను ఆరు కాలాలుగా విభజించారు. తొలి కాలంలో అత్యంత సంతోషదాయకమైన ప్రజలు ఉన్నత హోదా, సుదీర్ఘ, జీవితం కలవారు. వారికి ఎలాంటి కష్టాలు ఉండేవికావు. ఐచ్ఛికంగానే వారు సుగుణవంతులు. అందుకే వారికి నైతిక విలువలు లేదా మతం అవసరం ఉండేది కాదు. రెండవ కాలంలో సంతోషంగా ఉన్న ప్రజలు (సుసమ) తమ స్థాయిని కొంతవరకు కోల్పోయారు. అలాగే వారి జీవితకాలం, సంతోషం తగ్గిపోయింది. మూడవ కాలంలో సంతోషంగా ఉన్నవారు – దౌర్భాగ్యులు (దుషమ) దుఃఖం, పాపాల మౌలిక స్వరూపాల ఆవిర్భావాన్ని చవిచూశారు. తొలుత మానవాళి తన అదృష్టాలలో పతనం సంభవిస్తోందని గ్రహించి మార్గదర్శకత్వం, సలహాల కోసం పెద్దలను ఆశ్రయించింది. చివరి కులకర (కులపెద్ద) రుషభ కాలం వరకు ఇది కొనసాగింది. ప్రపంచం ఎదుర్కోబోతున్న దౌర్భాగ్యాన్ని గ్రహించిన రుషభ పాలన, నాగరికతల సంస్థలను స్థాపించాడు. తర్వాత అతడు సన్యాస జీవితం పుచ్చుకున్నాడు. తన కుమారుడు భరతను తొలి విశ్వజనీన చక్రవర్తిని చేశారు. రుషభ కుమార్తె బ్రహ్మి భారతదేశంలో అనేక అక్షరాలను కనుగొంది. నాల్గవకాలంలో దౌర్భాగ్య – సుఖవంతులు (దుషమ – సుసమ) మరింత పతనాన్ని చవిచూశారు. ఈ కాలలోనే ఇతర 23 మంది తీర్థంకరులు జన్మించారు. ఐదవ కాలంలో దౌర్భాగ్యులే (దుషమ) ఉన్నారు. ఈ కాలం మహావీరుని మరణం తర్వాత మూడేళ్లకు మొదలై నేటికీ కొనసాగుతోంది. దాని వ్యవధి 21,000 సంవత్సరాలు. ఈ కాలంలో జైన మతం క్రమంగా కనుమరుగవుతుంది. మానవుల హోదా, జీవితకాలం, నైతిక వర్తనం కూడా క్రమంగా అంతరించిపోతుంది. ఆరవ మరియు చివరి కాలంలో అతి దరిద్రులు ఉంటారు. అది కూడా 21,000 సంవత్సరాలు కొనసాగుతుంది. ఈ కాలంలో మానవ పతనం అతి చివరి స్థాయికి చేరుకుంటుంది. ప్రజలు 20 ఏళ్లకే తమ ప్రాణాలను కోల్పోతారు. వారు ఒక అంగుళం ఎత్తు మాత్రమే ఉంటారు. నాగరికతను మరచిపోతారు. మానవులు గుహలలో జీవిస్తారు. నైతిక వర్తనం అంతరిస్తుంది. దొంగతనం, సకుటుంబ సంభోగం, వివాహేతర సంబంధం, హత్యలను సాధారణ విషయాలుగా పరిగణిస్తారు. ఈ యుగం చివరలో ఐదు భీకర తుఫాన్లు సంభవిస్తాయి. భూమిపై నివసించే మరుగుజ్జులందరిని అవి తుడిచి పెడతాయి. అయితే వారిలో కొందరు మనుగడ సాగిస్తారు, అప్పటి నుండి ప్రపంచ పరిస్థితి అర్థం కాని రీతిలో మెరుగుపడుతుంది. అప్పటికే ఉత్సర్పిణి యుగం మొదలై ఉంటుంది. ఈ ఆరు కాలాలు మరలా చివరి నుండి మొదటికి సంభవిస్తాయి. మానవుల సంతోషం, నైతిక వర్తనం పతాక స్థాయికి చేరుకునే వరకు ఈ ప్రక్రియ జరుగుతుంది. ఆ తర్వాత మరోసారి బ్రహ్మాండ చక్రం మొదలవుతుంది.

## భాగవతవాదం :

**ఆవిర్భావం:** సర్వలక్షణ మతాలైన బౌద్ధం, జైనం ఒక చివరన, సనాతన వాద వైదిక మతం మరో చివరన ఉండగా మధ్య కొన్ని మత వ్యవస్థలు ఆవిర్భవించాయి. అనతికాలంలోనే అవి విపరీతమైన ప్రజాదరణను పొందే స్థాయి వాటికి ఉండేది. ఈ మత వర్గాలకు వేదాలతో ప్రవచించిన యాంత్రిక పూజా పద్ధతిలో ఎలాంటి నమ్మకం ఉండేది కాదు. బౌద్ధ, జైన మత సిద్ధాంతాలతో అవి చాలా వరకు ఏకీభవించినప్పటికీ ఆ రెండు మతాల ప్రాపంచిక నాస్తికవాద దృష్టి కోణంతో విభేదించాయి. ఈ కొత్త దైవవాద మతాలు విష్ణు, శివ, శక్తి, లేదా మరే ఇతర రూపంలో గల దైవాధిపతి ఉన్నాడనే సిద్ధాంతం చుట్టూ ఆవిర్భవించాయి. దేవుని అనుగ్రహం (ప్రసాదం) ఉంటేనే మోక్షం సాధ్యమవుతుందని, దానిని భక్తి ద్వారా సాధించవచ్చని ఈ మతాలు ప్రబోధించాయి.

ఈ కొత్త వ్యవస్థ ముఖ్య ప్రతినిధులలో భాగవతవాదం ఒకటి. ఉపనిషత్తుపరమైన ఆలోచన లేదా సిద్ధాంతంలో దాని మూలాలు ఉన్నాయి. తూర్పున అది బౌద్ధ, జైన మతాల రూపంలో స్థిరపడింది. అదే సమయంలో పశ్చిమాన సత్వతులలో అది ఆవిర్భవించింది. సత్వతులు మధుర ప్రాంతంలో స్థిరపడిన యాదవులు ఒక శాఖకు ప్రాతినిధ్యం వహించారు. తొలుత భాగవతవాదం దైవాధిపతి అనే సిద్ధాంతంపైనే ఎక్కువ దృష్టిని సారించింది. అతడిని హరి అని పిలిచింది. అతడిని భక్తితో కొలవాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పింది. బలిదానాలు, కర్మకాండలు లాంటి పాత పూజా పద్ధతులను విడనాడాలని పిలుపునిచ్చింది. అయితే బలిదానాలను అది పూర్తిగా పక్కకు తప్పించలేదు. కేవలం వాటి ప్రాధాన్యతను మాత్రమే కుదించివేసింది. బ్రాహ్మణిక మతంలో ప్రధాన లక్షణంగా ఉన్న జంతుబలిని పక్కకు తప్పించింది. ఆ విధంగా సత్వతులు సాంప్రదాయ వాద సూత్రాల ఆధారంగానే మత సంస్కరణలను ప్రవేశపెట్టే ప్రయత్నం చేశారు. జైన, బౌద్ధ మతాలకు అందుకు విరుద్ధంగా సాత్విక లేదా లౌకిక సూత్రాలను అనుసరించాయి. జంతువుల వధ నింద, బలిదాన పూజల నిష్ప్రయోజకత, సాత్వికత బౌద్ధ మత సంస్కరణలో సాధారణ సూత్రాలు. అయితే భాగవత వాదం మాత్రం ఉన్నతుడైన హరిని భక్తితో పూజించాలనే కొత్త సూత్రాన్ని ప్రవేశపెట్టింది.

## వసుదేవ కృష్ణ, అతడి బోధనలు :

వృషిణి వంశానికి చెందిన దేవకి నందనుడు వాసుదేవ కృష్ణ నుండి మత సంస్కరణ గొప్ప ప్రేరణను పొందింది. వృషిణి వంశం బహుశా సత్వతుల శాఖకు మరో పేరుగా ఉండి ఉండొచ్చు. కృష్ణ సంస్కరణవాద సిద్ధాంతానికి నిర్దిష్టమైన స్వరూపం ఇచ్చాడు. దాని తాత్విక బోధనలను భగవద్గీతలో పొందుపరిచాడు. ఫలితంగా ఒక స్వతంత్ర మత వర్గం క్రమంగా అభివృద్ధి చెందింది. అనతికాలంలోనే వసుదేవను మహిమాన్వితునిగా చూడడం మొదలుపెట్టారు. చందోగ్య ఉపనిషద్‌లోని ఒక వ్యాఖ్యానం దేవకి పుత్రుడైన కృష్ణ అనే ఋషిని ప్రస్తావించింది. అతడు ఘోర అంగిరస రుషి శిష్యుడని పేర్కొంది. అంగిరస బోధించిన సిద్ధాంతాలపై కొంత వెలుగును ప్రసరించింది. అతడు దాన, అర్జవ, అహింస, సత్యవచన అనే నైతిక విలువలను ప్రబోధిస్తాడు. తపస్సును సూచించిన అంగిరస బలిదాన (యజ్ఞ)ను మాత్రం ఖండించాడు.

వీటన్నింటినీ కృష్ణుడు గీతలో నొక్కి చెప్పాడు. అతడిని అంగిరస శిష్యునిగా గుర్తించారు. భాగవతవాద మూలాలను అంగిరస బోధనలలో అన్వేషించారు.

భగవద్‌గీతలో అభివృద్ధి చెందిన విధంగా భాగవతవాదం తన సంపూర్ణ రూపంలో రెండు అంశాలతో ప్రాధాన్యతను సంతరించుకుంది. మొదటిది మోక్షానికి సన్యాస జీవితం ఒక్కటే మార్గమన్న ప్రజల నమ్మకాన్ని ఎదుర్కొంది. సమాజంలో తమ హోదాకు తగిన విధంగా ప్రజలు తమ ప్రాపంచిక విధులను నిర్వర్తించాల్సిన ముఖ్యమైన అవసరాన్ని నొక్కి చెప్పింది. రెండవది, దైవవాద విశ్వాసానికి సంబంధంలేని నిస్సారమైన నైతిక బోధనల నుండి ప్రజల మదిని పక్కకు మరల్చడానికి ప్రయత్నించింది. ఉపనిషత్తులలో దైవవాద సిద్ధాంతాలు విస్తరించి ఉన్నాయనే విషయం నిస్సందేహం. అయితే భగవద్ గీతలోనే సులువుగా అర్థం చేసుకోగల మోక్షసాధన వ్యవస్థను అభివృద్ధి పరిచారు. ఆ విధంగా వాసుదేవ కృష్ణ మోక్ష సాధనకు భక్తి, కర్మ, జ్ఞాన మార్గాలను ఉమ్మడిగా అనుసరించాలని ప్రబోధించాడు. తొలి భాగవతవాద ముఖ్య లక్షణాలుగా భక్తి, కర్మ, జ్ఞానం, త్యాగం నిలుస్తాయి.

**సాహిత్య ఆధారాలు :**

పైన ప్రస్తావించినట్లు వాసుదేవ కృష్ణ గురించి తొలి వ్యాఖ్యానాలు ఛందోగ్య ఉపనిషద్‌లో కనిపిస్తాయి. బౌద్ధ "ఘటజాతక" కృష్ణ ఎగువ మధురకు చెందిన రాచరిక కుటుంబ సభ్యుడని పేర్కొంది. జైన కృతి "ఉత్తరాధ్యాయన" కూడా వాసుదేవ గురించి ఆసక్తికరమైన రీతిలో ప్రస్తావించింది. 22వ జిన అయిన అరిష్టనేమి సమకాలికుడు కేశవ గురించి కూడా వ్యాఖ్యానించింది. కేశవ అనేది కృష్ణుని మరోపేరు. కేశవ దేవకి, రాజు వసుదేవ కుమారుడని, అరిష్టనేమి రాజు సముద్ర విజయ, శివదంపతుల కుమారుడని పేర్కొంది. అయితే మానవ రూపంలో వాసుదేవ కృష్ణుని పూజించిన వైనాన్ని తొలిగా అష్టధ్యాయి (పాణిని) సూత్రాలలో ప్రస్తావించారు. పతంజలి రచించిన మహాభాష్యలో వాసుదేవ, అతడి మేనమామ కంసుని మధ్య జరిగిన యుద్ధాన్ని వివరించారు. ఈ కృతిలోనే కృష్ణ, అర్జునుల గురించి సమాంతరంగా ప్రస్తావించారు. కృష్ణుడు బలదేవుని తమ్ముడని కూడా పతంజలికి తెలుసు.

మెగస్థనీస్ రచించిన ఇండికా నుండి వ్యాఖ్యానిస్తూ అర్రియన్ ఇలా పేర్కొన్నారు: "మథోరా, క్లిసోబోరా అనే రెండు పెద్ద నగరాలను ఏలిన సౌరసేనోయ్ (సురసేనులు) అనే భారతీయ తెగ ఒకటి హెరాకిల్స్‌ను ఆరాధించేది. హెరాకిల్స్‌ను దొర్‌సేన్స్ అని కూడా పిలుస్తారు. అతడు పాండియ తండ్రి." ఈ నేపథ్యంలో మెగస్థనీస్ గందరగోళాన్ని సృష్టించారు. అతడు హెరాకిల్స్‌ను దక్షిణంలోని పాండ్య దేశాన్ని పాలించిన పాండ్యులతో ముడి పెట్టాడు. ఈ గందరగోళంతోపాటు పాండ్యుల రాజధాని నగరమైన మధురై పేరు (ఇది నిస్సందేహంగా మధుర అనే ఉత్తర భారతదేశ నగరం పేరు నుండి గ్రహించబడింది) కొందరు విద్వాంసులను ఆలోచింపచేసింది. ఫలితంగా భాగవతవాదం క్రీ.పూ. నాల్గవ శతాబ్దంలో దక్షిణాదిలోని అంతర్గత ప్రాంతానికి కూడా చొచ్చుకుపోయిందని వారు భావించారు. అలెగ్జాండర్‌తో జరిగిన యుద్ధంలో పోరస్ తన పదాతి దళం ఎదుట హెరాకిల్స్ ప్రతిమను ఉంచి ముందుకు కదిలాడని క్వింటస్ కర్షియస్ నమోదు చేశాడు. తొలి సాహిత్య గ్రంథాలలో పేర్కొన్న వ్యాఖ్యానాలను బట్టి (విదేశీ,

దేశీయ కృతులు రెండింటిలోనూ) భారతదేశంపై అలెగ్జాండర్ దండయాత్ర చేయడానికి కొద్ది కాలం ముందైనా వాసుదేవ ఆరాధన జరిగేదని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు.

**పురావస్తు ఆధారాలు :**

అయితే క్రీ.పూ. రెండవ శతాబ్దం నాటికి ఈ కొత్త మతం మధుర సరిహద్దులను దాటి విస్తరించింది. వాసుదేవుని ఆరాధనను నమోదు చేసిన శాసనాలు మహారాష్ట్ర, రాజస్థాన్, మధ్య భారతదేశంలో లభించాయి. బేస్‌నగర్ స్థూప శాసనం ప్రకారం గ్రీకు రాజు ఆంతియల్‌సిడాస్ రాయబారి హీలియోడొర (హీలియోడొరస్) తక్షశిల నివాసి. అతడు తనను తాను భాగవతునిగా ప్రకటించుకొని గరుడధ్వజను వాసుదేవుని గౌరవార్థం బేస్‌నగర్‌లో నిర్మించాడు. మధ్య భారతదేశంలో ప్రాచీన విదీశ రాజ్యం బేస్‌నగర్ ప్రాంతంలోని పరిధవిల్లింది. దీనిని బట్టి బౌద్ధం లాగా భాగవతవాదం కూడా క్రీ.పూ. రెండవ శతాబ్దంలో అత్యంత నాగరికులైన ప్రజలను తన పంథావైపు ఆకర్షించగలిగిందని, అది అంత భిన్నంగా గోచరించిందని అర్థం చేసుకోవచ్చు.

పైన పేర్కొన్న బేస్‌నగర్ శాసనం వాసుదేవ కృష్ణ మినహా మరే దైవాన్ని ప్రస్తావించక పోయినా సర్వతత అనే పాలకుడు (క్రీ.పూ. రెండవ శతాబ్దంలోనే) వేయించిన నగరి శాసనం మాత్రం సంకర్షణ, వాసుదేవ కృష్ణుల సమాధుల చుట్టూ రాతిగోడలు నిర్మించారని మనకు తెలియజేస్తుంది. నగరి శాసనంలో పై ఇద్దరి పేర్లను క్రమస్థాయిలో పేర్కొనడం బట్టి తొలి రెండు వృషిణివీరుల ప్రాముఖ్యం వెల్లడవుతుంది. అంతే తప్ప అది వ్యూహాలను సూచించదు. అలాగే మధురలో లభించిన క్రీ.శ. తొలి శతాబ్దపు మోరా శాసనం వృషిణీ వంశానికి చెందిన పంచవీరుల గురించి వివరిస్తుంది. వారిలో సంకర్షణ, వాసుదేవ, ప్రద్యుమ్న, సాంబ, అనిరుద్ధలు వరుసగా ఉన్నారు. క్రీ.పూ. రెండవ శతాబ్దం నాటికే ఆర్మేనియాలో వాసుదేవ కృష్ణుని ఆరాధన సర్వవ్యాపితంగా ఉన్నట్లు ఒక సిరియన్ ఫలకం తెలియజేస్తుంది. అదే సమయంలో కొత్త మతం యొక్క జనామోదాన్ని సాహిత్య, నృత్య, నాటక రూపాలలో ప్రతిబింబించారు. క్రీ.పూ. రెండవ శతాబ్దం నుండి ఈ మత విస్తరణ నిరంతరంగా కొనసాగింది. పురావస్తు ఆధారాల ప్రకారం గుప్త పూర్వ కాలం ముగిసేనాటికి ఈ మతం కృష్ణా నది అవతల దక్షిణ భారతదేశంలో బలంగా పాతుకుపోయింది.

**ప్రధాన లక్షణాలు :**

**వీరవాదం :** వీరుల ఆరాధన ఈ కొత్త మతం యొక్క ముఖ్యమైన లక్షణాలలో తొలిస్థానాన్ని ఆక్రమిస్తుంది. పంచవీరుల జాబితాలో బలదేవ,కృష్ణ, ప్రద్యుమ్న, సాంబ, అనిరుద్ధల పేర్లు ఉన్నప్పటికీ పాండవుల్లో ఒకడు అయిన అర్జునుడి పేరు మాత్రం కనిపించదు. పంచవీరులందరూ వృష్టిణి వంశానికి చెందిన వారు. వారి మధ్య దగ్గరి సంబంధాలు ఉండేవి. సంకర్షణ, వాసుదేవ కృష్ణలిద్దరూ వాసుదేవ–రోహిణి, దేవకి దంపతుల కుమారులు కాగా, ప్రద్యుమ్న, సాంబలు రుక్మిణి, జాంబవతి – వాసుదేవుల కుమారులు. జాంబవతిని 'చండాల' మహిళగా పేర్కొన్నారు. అలాగే అనిరుద్ధ ప్రద్యుమ్న కుమారుడు.

**వ్యూహోవాదం :** వ్యూహవాద సైద్ధాంతిక పునాదులు 'సుద్ధసృష్టి' అనే అంశం చుట్టూ ప్రధానంగా ఉన్నాయి. అంటే ఆరు ఆదర్శగుణాల సృష్టిని అవి సూచిస్తాయి. వాటిలో జ్ఞాన, ఐశ్వర్య, శక్తి, బల, వీర్య, తేజస్సు ఉన్నాయి. ఈ భావన ప్రకారం దేవతల అధిపతిగా వాసుదేవ తన ధర్మపత్ని శ్రీ లక్ష్మిని భుక్తి క్రియల ద్వారా ఆదర్శ గుణాలను సృష్టించాలని కోరుతాడు. ఆ విధంగా వాసుదేవుని ఇచ్ఛాశక్తి, లక్ష్మి, భుక్తిశక్తి, క్రియాశక్తిల నుండి ఆరు విధాల ఆదర్శ గుణాలు సృష్టించబడ్డాయి. సృష్టి అంతటికీ ఈ ఆరు గుణాలే మూలం. ఈ గుణాలు రెండు ప్రధాన వర్గాల మధ్య సమానంగా విభజించబడ్డాయి. విశ్రమ భూమయ (విశ్రమ దశలు) వర్గం కింద తొలి మూడు గుణాలు జ్ఞాన, ఐశ్వర్య శక్తి వస్తాయి. శ్రమ భూమయ (క్రియ దశలు) వర్గం కింద తదుపరి మూడు గుణాలైన బల, వీర్య, తేజస్ వస్తాయి. ఈ వైరి వర్గాల వ్యక్తిగత లక్షణాలు కలిసినపుడు సృష్టి ప్రక్రియలో మరింత ముందడుగు సాధించగలరు. ఉదాహరణకు జ్ఞాన–బల–ఐశ్వర్య–వీర్య–శక్తి–తేజస్‌లు కలసినపుడు ఉన్నతమైన సృష్టి సంభవిస్తుంది. ఆ విధంగా ఆరు గుణాలు పైన సూచించిన జతలుగా విభజించబడ్డాయి. ఆరు సద్గుణాలను సంపూర్ణంగా, జతపరంగా పరిగణనలోకి తీసుకుంటే అవిసుద్ధ సృష్టికి పరికరాలు లేదా సాధనాలుగా కనిపిస్తాయి. ముగ్గురు వ్యూహోలైన సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధల దేహోలలో పై లక్షణాల మూడు జతలు బహిర్గతమవుతాయి. పరవాసుదేవ నుండి వ్యూహ వాసుదేవ ఆవిర్భవించినట్లు భావిస్తారు. పరవాసుదేవ సమీప పూర్వీకులు నుండి సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధలు ఆవిర్భవించారు. విశాలంగా లభించిన శాసనాల ప్రకారం క్రీ.పూ. రెండు నుండి ఒకటవ శతాబ్దం వరకు, అలాగే క్రీ.శ. తొలి శతాబ్దం మొదటిలో కూడా వీరవాద సిద్ధాంతం అత్యంత ప్రముఖమైన వాదాలలో ఒకటిగా ఉండేదని బోధపడుతుంది.

## బ్రాహ్మణవాదంతో సయోధ్య :

ప్రాచీన భారత మతాల చరిత్రలో దీర్ఘకాల ప్రాముఖ్యత కలిగిన ఘటన సనాతనవాద బ్రాహ్మణవాద పంథాలో ఈ కొత్త మతాన్ని చేర్చుకోవడమే. ఇరు మతాల మధ్య సయోధ్య ఒక విషయంలో సృష్టంగా విదితమవుతుంది. అదేమిటంటే కృష్ణుడిని ఇద్దరు ప్రముఖ వైదిక దైవాలతో గుర్తించడం. వారిలో ఒకరు విష్ణువు. పూర్వం అతడిని సూర్యుని ఉపగ్రహంగా భావించేవారు. అయితే మలివైదిక కాలంలో అతడిని గొప్ప దైవంగా గుర్తించారు. మరొకరు నారాయణ. బహుశా ఇతడు ఆరాధించబడ్డ రుషి కావచ్చు. అయితే ఇతడు తర్వాతి కాలంలో హరిగా ప్రత్యక్షమవుతాడు. అప్పటి నుండి అతడిని గొప్పదైవంగా పూజించారు. ఇలాంటి గుర్తింపు (కృష్ణను విష్ణువు, నారాయణలతో పోల్చడం) క్రీ.పూ. రెండవ శతాబ్దానికి ముందే నిర్ధారణ అయ్యిందనడానికి హీలియోడొరస్ వాసుదేవుని గౌరవార్థం నిర్మించిన గరుడధ్వజమే నిదర్శనం. ఎందుకంటే గరుడను నారాయణ–విష్ణువుల వాహనంగా గుర్తిస్తారు. ఈ రెండు దైవాలను అంతిమంగా ఒకరిగానే భావిస్తారు.

ఈ సమ్మేళనానికి కారణాలను కాని ప్రక్రియను కాని గుర్తించడం అంత సులభం కాదు. ఈ విషయంలో బ్రాహ్మణులే స్వయంగా చొరవ తీసుకొని ఉంటారు. వేగంగా విస్తరిస్తున్న

బౌద్ధాన్ని నిలువరించడానికే ఇలాంటి ఏకీకరణ ప్రక్రియను చేపట్టి ఉంటారు. మరోవైపు భాగవతులు సనాతన వైదిక మతంతో జతపడటాన్ని రాజకీయ చర్యగా భావించి ఉంటారు. కారణాలు ఏవైనా బ్రాహ్మణులకు ఈ పరిణామం చేదుగుళికగా మారి ఉంటుంది. భాగవతవాదం, సనాతన బ్రాహ్మణవాదాల మధ్య సయోధ్య భాగవతవాదానికి శాశ్వత హోదాను కల్పించడమే కాకుండా బ్రాహ్మణవాదానికి కొత్త మలుపును ఇచ్చింది. అప్పటి నుండి భాగవతవాదం (వైష్ణవం) శైవంతో జత కలిసి బౌద్ధ మతాన్ని ఎదుర్కోవడంలో సనాతన మతానికి ప్రధాన భూమికగా మారింది. భాగవతవాద ప్రభావం కారణంగానే వైదిక కాలంలో ఎక్కడా కనిపించని ప్రతిమల పూజ క్రమంగా బ్రాహ్మణిక మతంలో పై చేయిని సాధించింది. వేదాలలో సూచించబడిన బలిదాన ఉత్సవాలు కొనసాగిన మాట వాస్తవమే అయినప్పటికీ అవి క్రమంగా తెరమరుగు అయ్యాయి.

**బ్రాహ్మణవాదం :**

**బ్రాహ్మణవాద ఆవిర్భావం :** ఉపనిషద్ కాలం తర్వాత, అంటే క్రీ.పూ. 800-600 మధ్య, బ్రాహ్మణవాదం విలక్షణ స్వరూపాన్ని సంతరించుకుంది. సిద్ధాంతపరంగా చూస్తే వైదికమతం దానికి ప్రధాన ఆధారంగా కనిపిస్తుంది. అయితే వాస్తవానికి సుదీర్ఘ, నిరంతర పరిణామ సాంస్కృతిక సంశ్లేషణలో వైదిక మతం ఒక ప్రధాన కారకం మాత్రమే.

బ్రాహ్మణవాదం అసంఖ్యాక మతవిశ్వాసాల కలయిక. విభిన్న పూజా విధానాలు, ఆచారాలు, కర్మకాండలు అందులో విలీనమయ్యాయి. దానిని ఒక సమగ్రమైన మతంగా పరిగణించలేము. ఎందుకంటే దానికి వ్యవస్థాపకుడంటూ ఎవరూ లేరు. పిడివాదాలను నిర్ధారించడానికి ఒక పవిత్రమైన వ్యవస్థ లేదు. అలాగే ఒక కేంద్ర సంఘటనమంటూ ఏదీ లేదు. విభిన్న మత విశ్వాసాలు, అభిప్రాయాలు వేర్వేరు జాతుల సంస్కృతి, ద్రవిడ సంస్కృతి, గిరిజన, స్థానిక సముదాయాలు, ఆర్య సంస్కృతుల సమ్మేళనం ఉంది. పై సంస్కృతులు, సముదాయాల కలయిక నుండి విశాలమైన, సమన్వయం లేని కొత్త, నిరంతరం మారే మత విశ్వాసాలు, ఆచారాలు పుట్టుకొచ్చాయి. కొన్ని సంస్కరించబడ్డాయి. మరికొన్ని పూర్తిగా అదృశ్యమయ్యాయి. మతపరమైన ప్రాధాన్యతగల అవశేషం ఉన్నదేనినీ పూర్తిగా త్యజించదు. కనక శతాబ్దాల తర్వాత అది మరలా ముందుకు వచ్చే అవకాశముంది. ఆ విధంగా ఏ ఒక్క మత వ్యవస్థ స్థూలంగా బ్రాహ్మణవాదానికి ప్రాతినిధ్య వహిస్తుందని చెప్పజాలము.

యక్షులు, నాగాలు, ఇతర గిరిజన దైవాల ఆరాధన ప్రాచీన మత విశ్వాసాలలో అత్యంత ముఖ్యమైన భాగంగా ఉంది. ఈ తరహా ఆరాధన ప్రజలలో సర్వవ్యాపితంగా ఉండేదని సాహిత్య, పురావస్తు ఆధారాలు రెండూ నిరూపిస్తాయి. క్రీస్తుశకానికి ముందు ఆ తర్వాత కాలానికి చెందిన అనేక యక్షులు, యక్షిణిలు, నాగాలు, నాగిణల ఊహా ప్రతిమలు దేశంలోని వివిధ ప్రాంతాలలో బయల్పడ్డాయి. యక్షులు, నాగాల గిరిజన మతాలు సనాతన బ్రాహ్మణ పథంలో గణేశుని రూపంలో మనుగడ సాగించాయి. బొజ్జ యక్షుడు, ఏనుగు తల కలిగిన నాగల కలయికే గణేశుని స్వరూపం. (నాగ అనే పదం పాము, ఏనుగు రెండింటినీ సూచిస్తుంది) సనాతన మతంలో గిరిజన సాంప్రదాయానికి తొలి ప్రాధాన్యత ఐదు ప్రధాన పురాణ దైవాల

(గణేశాది పంచదేవత – గణేశ, విష్ణు, శివ, శక్తి, సూర్య) జాబితాలో గణేశునికి మొదటి స్థానం కల్పించడంలో విదితమవుతుంది.

ఆ విధంగా నాస్తికవాద మతాలైన బౌద్ధ, జైనంతోపాటు దైవవాద మతాలు కూడా ఆవిర్భవించాయి. దైవవాద మతాలు ఏ మూల పురుషుల చుట్టూ అయితే బలపడ్డాయో వారు ప్రాథమికంగా వైదిక దైవాలు కాదు. వారు ఇతర (సనాతనవాదం కాని) ఆధారాల నుండి వచ్చారు. వాస్తవానికి వైదిక పూర్వ, వైదికానంతర గిరిజన శక్తులు ఈ కొత్త మతాలలో స్పష్టంగా కనిపిస్తాయి. ఈ దైవవాద ఉద్యమాలను ఉత్తేజితం చేసిన ముఖ్యమైన కారకం 'భక్తి'. ఈ ఉద్దీపనం వైష్ణవం, శైవం,శక్తి లాంటి వివిధ మత శాఖల ఆవిర్భావానికి దారి తీసింది. ఈ శాఖలన్నిటినీ సనాతన బ్రాహ్మణవాదంలో అంతర్భాగాలుగా (మూలకాలు) పరిగణించారు.

**దైవాలు :**

దైవానికి సంస్కృత పదం దేవ. దివ్ అనే మూల పదం నుండి అది గ్రహించ బడింది. దివ్ అంటే ప్రకాశించడం అని అర్థం. ప్రతి భారతీయ గ్రామానికి ఒక స్వంత స్థానిక లేదా తెగ దైవం, అలాగే అసంఖ్యాక మొక్క, అడవి, పొలం దేవతలు ఉంటాయి. వీటిని ప్రసన్నం చేసుకుంటే సముదాయాన్ని రక్షించడంతోపాటు దానిపై సౌభాగ్యాన్ని (సంపద) కురిపిస్తాయి. వైదిక దైవాలలో చాలా వరకు ప్రకృతి శక్తుల స్వరూపాలే. ఈ శక్తులకు కోపం వస్తే ప్రకృతి వైపరీత్యాలు, వ్యాధులు సంభవిస్తాయని భయపడేవారు.

క్రీ.శ. తొలి శతాబ్దం నుండి హిందువులు వైష్ణవులు లేదా శైవులుగా ఉన్నారు. చాలా వరకు వారు సామరస్యంగానే కలిసి జీవించారు. అలాంటి పరస్పర సహనం గుప్త యుగంలో త్రిమూర్తి లాంటి మిశ్రమ దైవ స్వరూపం ఆవిర్భావానికి దారి తీసింది. త్రిమూర్తులలో బ్రహ్మ, విష్ణువు, శివుడు ఉన్నారు. బ్రహ్మ సృష్టికర్త, విష్ణువు మానవాళి పరిరక్షకుడు, శివుడు పాప వినాశకుడు. ప్రపంచ విధ్వంస ప్రక్రియకు శివుడు అధ్యక్షత వహిస్తాడు. అయితే లోకం ప్రమాదంలో పడినప్పుడు దానిని రక్షించడంలో అతడు జోక్యం చేసుకుంటాడు. త్రిమూర్తి సిద్ధాంతానికి మరో జనామోదిత స్వరూపం హరిహర (హరి విష్ణువు పేరు అయితే హర శివుని పేరు)

శక్తి, తాంత్రిక పూజావిధానాలలో శక్తి రూపంలో దేవత విశ్వజనీనమైన బ్రాహ్మణ్ నుండి ఆవిర్భవించే సంక్షిప్త విశ్వానికి ప్రాతినిధ్యం వహిస్తుంది. వేరే మాటల్లో చెప్పాలంటే విశ్వం యొక్క అంతిమ సూత్రాన్ని స్త్రీగా పరిగణిస్తారు. "శక్తి" ప్రవహించే బ్రహ్మాండ శక్తిని ప్రతిబింబిస్తుంది. దాని ద్వారా దైవాలు, ప్రపంచం, సకల జీవరాశులు ఉత్పన్నమయ్యాయి. వాస్తవానికి ఆమె ప్రకృతికి భిన్నమైనది కాదు. తొలి చారిత్రక కాలాలలో శక్తిని దేవతల శక్తిగా సూత్రీకరించారు. మగదైవాలతో సహచరిగా ఆమెను ముడిపెట్టారు. క్రీ.శ. ఏడవ శతాబ్దం నుండి సాహిత్యంలో ఆమె ప్రస్తావన ఎక్కువగా కనిపిస్తుంది. అప్పుడు ఆమె శివుని సహధర్మచారిణిగా మారింది. ఆమె సున్నిత స్వరూపాలను ఉమ, పార్వతి, పద్మ, గౌరి అని పిలుస్తారు. ఆమె ఉగ్రరూపాలను శ్యామ, భైరవి, చాముండి, కాళి, దుర్గ అని పిలుస్తారు. అస్థికలను హారంగా ధరించే కాళిమాత బెంగాల్ ప్రజలకు ఆరాధ్యదైవం. మానస, సితల,

చండి తదితర స్థానిక దేవతలను కాళిమాత నామమాత్రపు హోదాకు తగ్గించివేసింది. మరో ప్రముఖ దేవత శ్రీ ఆమె సౌందర్యం, సంపదకు ప్రతీక. ఆమె గురించి వైదిక సాహిత్యంలో ప్రస్తావన ఉంది. తదుపరి కాలంలో ఆమె వైదికానంతర దేవత లక్ష్మితో ముడిపడి పోయింది. దేవతలు, అసురులు సుధాసాగరాన్ని చిలికినప్పుడు అందులో నుండి లక్ష్మి ఉద్భవించిందని చెబుతారు.

వైష్ణవ, శైవ, శక్తి పూజావిధానాలతోపాటు అసంఖ్యాకమైన పశు, ప్రకృతి స్వరూపాల పూజలు భారతదేశంలో కొనసాగుతున్నాయి. ఈ స్థానిక శక్తులు చాలా వరకు గత స్థానిక నమ్మకాల నుండే పుట్టాయి. క్రమంగా వాటిని ఉన్నత పూజా విధానాలలో చేర్చుకున్నారు. బౌద్ధ, జైన సాహిత్యాలలో కూడా సాధారణమైన యక్షులనే వింత జాతి ప్రజలు ఆయా స్థానిక దైవాలకు ప్రతి రూపాలు లేదా దృష్టాంతాలు. ఆర్యుల రాకకు పూర్వం వారు సముదాయాలకు ఆది దేవతలుగా ఉండి ఉంటారు. యక్షులను సాధారణంగా శిలాఫలకంతో సత్కరిస్తారు లేదా పవిత్రమైన గ్రామ చెట్టు కింద శిలారూపంలో ఉంచుతారు. వారి స్థానిక నివాసం గ్రామ సౌభాగ్యానికి బాటలు వేస్తుంది. వారి మహిళా జోడు అయిన యక్షిణిలు పచ్చదనం యొక్క జీవధారను ప్రతిబింబిస్తాయి. ఇతర అతీంద్రియ శక్తుల వలే యక్ష, యక్షిణిలు మానవుని పట్ల అనురాగం లేదా ద్వేషం చూపిస్తారు. తదుపరి పురాణంలో యక్షుల నాయకుడిగా కుబేరుడు అవతరించాడు. అతడు సంపదకు మూలకారకుడు. అసంఖ్యాత శక్తులు లేదా ఆత్మలలో ప్రేతాలు కనిపిస్తాయి. అవి కొత్తగా చనిపోయిన వారి ఆత్మ స్వరూపాలు. చాలా కాలం క్రితం చనిపోయిన ప్రజలు పూర్వీకులు లేదా పిత్రులుగా మారతారు. అయినప్పటికీ ప్రేత, పిత్రులిద్దరూ ప్రపంచంలో క్రియాశీలంగా ఉండిపోతారు. అప్పుడప్పుడు తమ వారసులకు సహాయపడుతుంటారు. హింసాత్మక రీతిలో చనిపోయే వారుభూతాలుగా మారతారు. వీరిని రాత్రిళ్లు సంచరించే దెయ్యాలుగా పరిగణిస్తారు. అసహజ మరణం పొందిన వారు, అంత్యక్రియలు సరిగ్గా నిర్వహించబడిన వారు ఈ కోవకు చెందుతారు. ఇతర భయానక ఆత్మలను పిశాచాలంటారు. చీకటి, హింస, మరణ శక్తులకు అవి ప్రతీకలు. కుబేర పర్వతాన్ని కాపాడే యతుధానులు కూడా ఇందులో ఉన్నారు. యతుధానులును స్థానిక గిరిజనులతో ముడిపెట్టారు.

ఇతర మృత ఆత్మలలో రాక్షసులు, భైరవులు, నాగాలు, అసురులు, బేతాళులు ఉన్నారు. రాక్షసులు అదృశ్య రూపంలో ఉంటూ పచ్చిమాంసాన్ని భక్షించే రక్తపిపాసులు. భైరవులు రుద్రుని పక్షాన భయోత్పాన్ని సృష్టించే భటులు. నాగాలు నాగదేవతలు, భూమి మీద సంపదకు పరిరక్షకులు. తంత్ర శక్తులు మెండుగా కలిగిన అసురులు యుద్ధంలో పరాక్రమవంతులు. మృత శరీరాలలో ప్రవేశించే దెయ్యాలే బేతాళులు. బేతాళ అనే పదం తంత్రశక్తి కూడా సూచిస్తుంది. మానవులు, దేవతల మధ్య గల క్షేత్రంలో ఇతర జీవులు కూడా ఉన్నారు. వారే గంధర్వులు వారిని గానగంధర్వులని కూడా పిలుస్తారు. భూమి మీద జీవించే సంగీత కారులు, నృత్యకారులు, గాయకులకు వారు స్ఫూర్తినిస్తారు. వారి మహిళా సహచరులు అప్సరసలు, వారు దైవాల ఎదుట నృత్యం చేస్తుంటారు. మానవుల మధ్య యుద్ధాన్ని కూడా సృష్టిస్తారు. కొన్ని ప్రత్యేకమైన చెట్లపైనే గంధర్వులు, అప్సరసలు జీవిస్తారు. యోగిణులు క్షుద్ర విద్యలు

తెలిసినవారు. దుర్గ, శివలకు వారు దాసిలు. దుర్గయొక్క సూక్ష్మ స్వరూపాలుగా వారిని కొన్నిసార్లు పరిగణిస్తారు. దుర్గతో ముడిపడి ఉన్న ఇతర క్షుద్ర మహిళలలో సాకినీలు, దాకినీలు ఉన్నారు. వీరు పచ్చి మాంసాన్ని భక్షిస్తారు. బౌద్ధ, హిందూ తంత్రవిద్యలు రెండింటితోనూ దాకినీలు ముడిపడి ఉన్నారు.

**శైవం :**

**ఆవిర్భావం - విస్తరణ :**

శైవానికి అలిఖిత చారిత్రక కాలంలో బీజాలు పడి ఉంటాయి. అయితే వైదికానంతర భాషావేత్తలే మనకు మతపరమైన ఉద్యమంగా శైవం విస్తరించిన తీరును తొలిగా వివరించారు. పాణిని (క్రీ.పూ. 5-4 శతాబ్దాలు) తన అష్టధ్యాయిలో తన కాలపు శివభక్తుల సముదాయం గురించి ప్రస్తావించాడు. పతంజలి కూడా తన మహాభాష్యలో శివ భాగవతాల గురించి వివరించాడు. ఈ శివభక్తుల భయంకరమైన, అట్టహాసపు కర్మకాండ వాదాన్ని పతంజలి పరోక్షంగా, క్లుప్తంగా వివరించాడు. పశుపతుల సూత్రాలలో వర్ణించబడిన పశుపతుల అతివాద మత ఆచారాలను పతంజలి వివరణ గుర్తు చేస్తుంది. ఆ విధంగా శైవం తొలి చారిత్రక కాలంలో ప్రజల ముందుకు వచ్చింది.

శివుడిని 'లింగ' రూపంలో ప్రార్థిస్తారు. లింగం జీవితానికి ప్రతీక. అందులో విచ్ఛిన్నం, మృత్యువు బీజాలు కూడా ఉంటాయి. స్త్రీ జననాంగమైన యోని శివుని శక్తికి ప్రాతినిధ్యం వహిస్తుంది. శివుని బ్రహ్మాండ శక్తికి ఒక రూపాన్ని ఇస్తుంది. యోని, లింగాన్ని ఉమ్మడిగా తీసుకుంటే అవి విశ్వం యొక్క రెండు గొప్ప ఉత్పత్తి సూత్రాలను ప్రతిబింబిస్తాయి. సృష్టి అంతటికీ శివుడే మూలకారణమని కొన్ని పురాణాలు పేర్కొన్నాయి. పంచముఖ సిద్ధాంతం ద్వారా ఈ వాదనను వినిపించాయి. పంచ ముఖాలలో ఇసాన, తత్పురుష, అఘోర, వామదేవ, సర్యోజత ఉన్నాయి. ఈ పంచ ముఖాలను ఐదు దిక్కుల పాలకులుగా వ్యక్తీకరించారు. దిక్సూచి సూచించే నాలుగు దిక్కులు, వాటి అంతాలు యావత్ భౌగోళిక విస్తరణను పూర్తి చేస్తాయి.

**అతివాద శైవశాఖలు :** లాకులిస స్థాపించిన పాశుపత శాఖ శైవంలో అత్యంత పురాతనమైన శాఖ. క్రైస్తవ యుగానికి అనేక శతాబ్దాల ముందు ఆవిర్భవించినా ఉత్తర భారతదేశం, ఒరిస్సాలలో క్రీ.శ. ఆరు నుండి 11 శతాబ్దాల మధ్య ఆ శాఖ పరిఢవిల్లింది. మోక్ష సాధనను అతింద్రియ శక్తులతో ముడిపెట్టిన ఏకైక శాఖ ఇదే. కాపాళికులు, కాలముఖులు, ఈ పాశుపత శాఖలో ఉపశాఖలుగా ఉండేవి. క్రీ.శ. ఆరవ శతాబ్దంలో దక్కనులో ఆవిర్భవించిన ఈ ఉపశాఖలు క్రీ.శ.10-13 శతాబ్దాల మధ్య కర్నాటకలో అభివృద్ధి చెందాయి. అఘోరీలు కాపాళికుల వారసులు.

శుద్ధ, మలిన వర్గాలుగా విడిపోయిన అఘోరీలు సంచార భిక్షువుల జీవితాన్ని గడిపారు. ప్రతి గురువు వెంట ఒక కుక్క ఎప్పుడూ నడిచేది. శివ భైరవుని రూపంలో అలా దర్శనమిచ్చేవాడు. తూర్పు బెంగాల్‌లో గోరఖ్‌నాథ్ అనే వ్యక్తి గోరఖ్‌నాధి పంథాను స్థాపించాడు.

వీరిని కాన్‌పత యోగులని కూడా పిలుస్తారు. ఎందుకంటే వారి చెవులుకింది భాగం చీలి ఉండేవి లేదా వారు చెవులలో కమ్మలు ధరించేవారు. ఇతర శాఖలకు పూర్తి భిన్నంగా ఈ యోగులకు వివాహం చేసుకునే వెసులుబాటును కల్పించేవారు. వారి మృతదేహాలను ధ్యాన ముద్రలో ఖననం చేసేవారు. వారి స్మారకాలను సమధ్ అని పిలుస్తారు.

**ఉదారవాద శైవ శాఖలు :** క్రీ.శ. తొమ్మిదవ శతాబ్దంలో కాశ్మీరులో రెండు ఉదారవాద శైవ శాఖలు ఏర్పడ్డాయి. వాసుగుప్త ప్రత్యాభిజ్ఞ విచారధారను ఏర్పాటు చేశాడు. అతడి శిష్యులైన కల్లట, సోమానందులు స్పంద శాస్త్ర విచారధారను కనుగొన్నారు. ఈ బోధనలన్నింటినీ అభినవ గుప్త వ్యవస్థీకరించాడు. క్రీ.శ. 11వ శతాబ్దంలో అతడు త్రిక (త్రిముఖ) అనే మత వ్యవస్థను స్థాపించాడు. ఈ కాలంలోనే మధ్య భారతంలో, ఆ తర్వాత దక్కనులోని కొన్ని భాగాలలో మత్తమయూరులు అభివృద్ధి చెందారు. మత్తమయూర ఆచార్యులో అనేక మంది కాలాచురి –ఛేది పాలకులకు జోతిష్యులుగా ఉండేవారు. దక్షిణ భారతానికి చెందిన అనేక మంది శైవ ఆచార్య లేదా బుద్ధిజీవులు ఆగమాంత, శుద్ధశైవ, వీర శైవ లాంటి శైవ ఉద్యమాలతో ముడిపడి ఉన్నారు.

శివుని వివిధ అంశాలను వివరించే 28 ఆగమాల ఆధారంగానే ఆగమాంతలు తమ సూత్రాలను రూపొందించుకున్నారు. ఆగమాంత ప్రబోధకులలో అఘోర శివాచార్య ముఖ్యమైనవాడు, సమర్థుడు. తమిళశైవంగా ప్రఖ్యాతిగాంచిన ఆగమాంత ఉద్యమాన్ని మేకంతర్ తన "శివజ్ఞానబోధం" (13వ శతాబ్దం)లో వ్యవస్థీకరించాడు.

శుద్ధశైవులు రామానుజ బోధనలను పాటించినప్పటికీ శ్రీకాంత శివాచార్యే వారి గొప్ప ప్రబోధకుడు. శివాద్వైతగా కూడా పిలవబడిన ఈ శాఖకు తమిళ, అలాగే కాశ్మీరీ శైవంతో కూడా కొన్ని సారూప్యతలు ఉన్నాయి. వీరశైవులు లేదా లింగాయతులకు బసవ నాయకత్వం వహించాడు. (క్రీ.శ. 12వ శతాబ్దంలో చాళుక్య పాలకుడు బిజ్జల రాయ ఆస్థానంలో బసవ మంత్రిగా ఉండేవాడు). వీరశైవులది మత సంస్కరణ ఉద్యమం ఒక్కటే కాదు. వారిది సామాజిక (సమాజ) సంస్కరణ ఉద్యమం కూడా. తొలుత వారు కుల వివక్ష, విగ్రహారాధనను వ్యతిరేకించినప్పటికీ తర్వాతి కాలంలో కర్ణాటకలో ప్రత్యేక కులంగా ఆవిర్భవించారు. అలాగే "జంగమ" అనే స్వంత పురోహితులను అభివృద్ధి పరిచారు. ఆసిన ముద్ర, ఉత్తర ముఖంతో వారి మృతులను ఖననం చేస్తారు.

శైవం దక్షిణ భారతంలో కూడా తొలినాళ్లలో నయనార్లు అనబడే శివసంతుల కార్యకలాపాల ద్వారా వికసించింది. నయనార్లను అడియార్లని కూడా పిలుస్తారు. వారి భావాత్మక తమిళ కావ్యగ్రంథాన్ని "తేవరం" అని పిలుస్తారు. (దీనిని ద్రవిడ వేద అని కూడా పరిగణిస్తారు) మొత్తంగా 63 మంది నయనార్లు ఉండేవారు. వారిలో తిరుజ్ఞాన సంబంధర్, తిరుణవుక్కరసు ప్రముఖులు.

**వైష్ణవం :**

**ఆవిర్భావం – విస్తరణ :** వైష్ణవ మత ఆవిర్భావం, విస్తరణ భాగవతవాద పరిణామక్రమంతో చాలా దగ్గరగా ముడిపడి ఉంది. గుప్త పూర్వ కాలంలో ఆవిర్భవించిన

వైష్ణవం గుప్తుల కాలంలో భాగవతవాదాన్ని స్వాధీనం చేసుకొని తనలో విలీనం చేసుకోవడం మొదలుపెట్టింది. ఈ ప్రక్రియ గుప్త యుగం చివరి దశలో పూర్తయ్యింది. అప్పటి నుండి భాగవతవాదాన్ని వైష్ణవమని పిలవడం మొదలుపెట్టారు.

మలివైదిక విష్ణు అంశం అందులో అగ్రభాగాన నిలిచింది. అవతారాల సిద్ధాంతానికి ఎనలేని ప్రాముఖ్యత లభించింది. విష్ణువు అనేక మంది స్థానిక దైవాల మిశ్రమం. అందులో సూర్య లక్షణాలు గల ఒక వైదిక దేవుడు, వాసుదేవ అనే పశ్చిమ భారతవీరుడు, ఉపనిషత్తులలోని తాత్విక సర్వేశ్వరుడు ఉన్నారు. అవతార సిద్ధాంతం వైష్ణవ మతంలోకి అనేక జనప్రియ దైవాలను విలీనం చేసుకోవడంలో చాలా సహకరించింది. మహాగ్రంథాల కాలంలో అది అభివృద్ధి చెందింది. పురాణాలలో దాని ప్రస్తావన ఉంది.

**వైష్ణవ పంథాలు :** భాగవతులు, పంచరత్రాలు తొలుత వేర్వేరుగా ఉండేవారు. పంచరత్రాలు నారాయణ మునిని ఆరాధిస్తే భాగవతులు వృషిణి నాయకుడు వాసుదేవుని పూజించేవారు. ఈ రెండు శాఖలు తర్వాత కాలంలో విలీనమయ్యాయి. నారాయణ, వాసుదేవులను గుర్తించే యత్నంలోనే ఈ విలీనం జరిగింది. ముందుగా ప్రస్తావించినట్లు భాగవత పంథా క్రీస్తు శకానికి అనేక శతాబ్దాల ముందు ఆవిర్భవించింది. క్రీ.శ. రెండవ శతాబ్దంలో శిఖర స్థాయికి చేరుకున్నప్పుడు అది పంచరత్ర ఆగమగా సాధారణ నామాన్ని సంతరించుకుంది. పంచరత్ర ఆగమ అంటే ఐదు రాత్రులని అర్థం. అయితే దాని భావమేమిటో ఇంత వరకు తెలియరాలేదు. పురాణాల ప్రకారం పంచరత్ర బోధనలను తొలుత క్రీ.శ. 100వ సంవత్సరంలో శాండిల్య వ్యవస్థీకరించాడు. వాసుదేవ కృష్ణకు దైవాధారాన్ని అందించారు. కృష్ణను, అతడు కుటుంబ సభ్యులను కొన్ని ప్రత్యేకమైన వ్యూహాలతో గుర్తించారు. తొలి పంచరత్రాలు, తదుపరి శ్రీ వైష్ణవ మతానికి ఇదే ముఖ్యమైన సూత్రంగా ఉండిపోయింది. వ్యూహ సిద్ధాంతాన్ని క్రీస్తు శకం తొలి శతాబ్దాలలో అభివృద్ధి పరిచారు. అదే సమయంలో అవతార సిద్ధాంతం కూడా సమాంతరంగా పైకి వచ్చింది. తర్వాత కాలంలో (గుప్త యుగంలో) విష్ణు అవతారాల సిద్ధాంతం ప్రజాదరణ పొందడంతో పంచరత్రల పూజా విధానం క్షీణించింది.

వైఖనాసుడు "వైఖనాస" అనే కర్మకాండయుత శాఖను స్థాపించాడు. అతడి బోధనలను నలుగురు ప్రాచీన మునులు – అత్రి, మరిషి, భృగు, కశ్యప – ప్రచారం చేశారు. వైఖనాస సూత్ర అనే ప్రధాన మతగ్రంథంలో (ఇది క్రీ.శ. మూడవ శతాబ్దానికి చెందినది) విష్ణు పంథా, నారాయణ పంథాతో జత కలుస్తుంది. వైఖనాస కర్మకాండ సిద్ధాంతం విష్ణు యొక్క పంచ ముఖ అవతారంపై ఆధారపడి ఉంది. విష్ణువును బ్రాహ్మణ్ (సర్వేశ్వరుడు), పురుష, సత్య, అచ్యుత (ఖండితం కానివాడు), అనిరుద్ధ రూపాలలో చూసుకుంటారు. ఈ పంచముఖ కర్మకాండను నిర్వహిస్తే కీడు తొలగి ప్రతి ఒక్కరికి సంతోషం దక్కుతుందని నమ్ముతారు. కొన్ని ప్రత్యేకమైన ప్రయోజనాలను ఆశించి విష్ణువు యొక్క దశావతారాలను కూడా పూజిస్తారు. ఈ ఉద్యమంలో ప్రతిమల పూజ ముఖ్యమైనది. ప్రతీకాత్మక వైదిక కర్మకాండ అభివృద్ధి ఫలితమే ప్రతిమ పూజ అని భావిస్తారు. క్రీ.శ. పదవ శతాబ్దం చివరి నుండి వైఖనాస పురోహితులు వైష్ణవ గుళ్లు గోపురాలకు బాధ్యులుగా మారారు. శ్రీ వైష్ణవ ఉద్యమం కారణంగా వైఖనాస పురోహితులు కొంత వరకు తెరమరుగైనప్పటికీ కొన్ని దేవాలయాలలో వారు నేటికీ సంస్కృత

భాషలో కర్మకాండలు నిర్వహిస్తున్నారు. కంచి, తిరుపతిలలో ఉన్న శ్రీ వెంకటేశ్వర ఆలయాలు అందుకు నిదర్శనం.

గుప్త అనంతర కాలం నుండి క్రీ.శ. 13వ శతాబ్దం తొలి దశాబ్ది వరకు ఉన్న వైష్ణవ మత చరిత్ర చాలా వరకు దక్షిణ భారతానికి సంబంధించినదే. అక్కడ అళ్వార్లుగా ప్రఖ్యాతి గాంచిన వైష్ణవ సంతులు ఆ మతాన్ని విస్తృతంగా ప్రచారం చేశారు. విష్ణువు ఏకాత్మతో ప్రేమ భావనతో ఆరాధించాలని బోధించారు. తమిళంలో వారి భక్తిగేయాలన్ని ఉమ్మడిగా ప్రబంధాలని పిలవబడ్డాయి. అళ్వార్లు సమాజంలోని వివిధ వర్గాలకు చెందిన వారు. 12 మంది అళ్వార్లలో నమ్మళ్వర్, తిరుమలిసాయి అళ్వార్ ప్రముఖులు. అలాగే ఆండాళ్ అనే ప్రముఖ మహిళ కూడా ఉండేది. ఆమె జన్మస్థలమైన శ్రీ విల్లి పుత్తూర్‌లో ఒక బ్రహ్మాండమైన ఆలయాన్ని ఒక దళితుడు నిర్మించాడు.

దక్షిణ భారతంలో అళ్వార్ల విష్ణుభక్తి తరంగానికి సిద్ధాంతరీత్యా వైష్ణవ ఆచార్యులు మరింత తోడ్పాటును అందించారు. అలాంటి ఆచార్యులలో రామానుజ ప్రముఖుడు. అతడు యమునాచార్యతో కలిసి విశిష్ట అద్వైత సిద్ధాంతాన్ని అభివృద్ధి పరిచాడు. ఉపనిషద్ గ్రంథాల ఆధారంగా శంకరాచార్యుని అద్వైతవాదానికి వ్యతిరేకంగా విశిష్ట అద్వైతను రూపొందించారు. (శంకరాచార్యుడు వైష్ణవం లేదా శైవ మతానికి విశిష్ట అద్వైతను రూపొందించారు.(శంకరాచార్యుడు వైష్ణవం లేదా శైవ మతానికి చెందిన వాడు కాదు. అతడు నిర్గుణవాది) రామానుజ తర్వాత దక్షిణ భారతదేశంలో జీవించిన ఇద్దరు గొప్ప వైష్ణవ ఆచార్యులు మాధవాచార్య, నింబర్క్. మాధవాచార్య ద్వైతవాదాన్ని స్థాపించగా, నింబర్క్ ద్వైతాద్వైతవాదాన్ని వైష్ణవ మతంలో స్థాపించారు. ఆ విధంగా అళ్వార్లు దక్షిణ భారత వైష్ణవ మత భావాత్మక రూపానికి ప్రాతినిధ్యం వహించగా ఆచార్యులు దాని మేధోపరమైన కోణానికి ప్రాతినిధ్యం వహించారు.

**శక్తివాదం :** తొలుత శక్తివాదం, తాంత్రికవాదం రెండు భిన్నమైన సాంస్కృతిక శక్తులుగా ఉన్నప్పటికీ ఇప్పుడు అవి చాలా దగ్గరగా ముడిపడి ఉన్నాయి. బ్రాహ్మణ్‌కు స్త్రీ రూపమే శక్తి అని ఈ రెండు వాదాలు విశ్వసిస్తాయి. ఆమెను మహాదేవతగా పూజిస్తాయి. కనక ఈ రెండు పంథాల వారికి దైవం స్త్రీ రూపంలో కనిపిస్తుంది. శక్తివాదం మూలాలు అలిఖిత చరిత్రకాలంలోని 'భూమాత' ఆరాధనలో ఉన్నాయి. పూర్వం ధరిత్రినే మతస్వరూపంగా భావించి ఆమెను మహాదేవతగా పూజించేవారు. ఇప్పుడు మనకు సాధారణంగా కనిపించే గ్రామదేవతలు ఆ గొప్ప శక్తికి అనుకరణలే. ప్రాచీన అంశాలు అనేకం మహాదేవతలో విలీనం అయ్యాయి. గిరిజన ఆరాధ్య దైవాలతోపాటు ద్రవిడ, సింధూ నాగరికతల ఇష్టదైవాలు అలా వచ్చి చేరాయి. శక్తి అనేక రూపాలలో దర్శనమివ్వడం బట్టి ఆమె సంకీర్ణ స్వభావాన్ని అర్థం చేసుకోవచ్చు. స్థానిక, గిరిజన దేవతల విధులెన్నింటిలో ఆమె అంది పుచ్చుకుంది. శక్తివాదం శైవంతో దగ్గరగా ముడిపడి ఉన్నా అది శైవానికి భిన్నమైనది.

బెంగాల్‌లో క్రీ.శ. ఏడవ శతాబ్దం నాటికి స్థానిక దేవతలైన మానస, సితల, చండి లాంటి అనేక దేవతలు కాళి మాత పూజలో విలీనమయ్యాయి. తర్వాతి కాలంలో కాళిమాతను పార్వతిగా గుర్తించారు. ఆమె శివుని ధర్మపత్ని. శక్తికి ఉన్న అసంఖ్యాక నామాలలో దుర్గా-కాళి

ఒకటి. బెంగాల్‌లో కాళిమాత ఆరాధన సంకీర్ణమైనది. పూర్తి ఆరాధన, పవిత్రత, మతపరమైన ఆకర్షణలతోపాటు అందులో వెగటుపుట్టించే బలిదాన కర్మకాండలున్నాయి. ఈ జంతు బలుల ఆచారం ప్రాచీన తెగ సంస్కృతి నుండి వచ్చింది. కాళి-దుర్గ పున్నమి వేళలో తన సంపూర్ణ అవతారాన్ని ప్రదర్శిస్తుంది. ఆమె పదహారు చేతులు చంద్రుని యొక్క 16 అంకెలను ప్రతిబింబిస్తాయి. విశ్వం 16 భాగాలతో కూడి ఉందన్న వైదిక విశ్వాసం ఇక్కడ తొణికిస లాడుతుంది. శక్తిని శివుని భార్యగా చూసినప్పుడు ఆమె స్వరూపం సున్నితంగా కనిపిస్తుంది. ఆ హోదాలోఆమెను పార్వతి దేవి లేదా ఉమ లేదా మహాదేవిగా పిలుస్తారు. శివ, శక్తిల సామరస్యం శక్తి, శైవ పంథాల వాస్తవిక ఏకేశ్వరవాదానికి ఆధారం.

**తాంత్రికవాదం :** తాంత్రికవాదం బలిదాన కర్మకాండవాదానికి ఒకరూపం ఇందులో అతీంద్రియ, అద్భుత శక్తులు ఉంటాయి. తాంత్రికులు మంత్రాలు, యంత్రాలు, యోగ పద్ధతులను పాటిస్తారు. జైన మతం, మహాయాన బౌద్ధం, శైవం, వైష్ణవం, శక్తివాదాలలో కూడా తాంత్రిక అంశాలు కనిపిస్తాయి. తంత్రాలు అనబడే పవిత్ర గ్రంథాల నుండి తాంత్రికవాదం అనే పేరు గ్రహించబడింది. ఈ విశాల సాహిత్యంలోని తొలిగ్రంథాలు గుప్తుల కాలంలో రచించబడ్డాయి.

తాంత్రికులకు తంత్రాలు వేదాలంతటి పవిత్ర మరియు అధికారిక గ్రంథాలు. అందుకే వాటిని పంచమ వేద అని పిలుస్తారు. తాంత్రికవాదం మౌలికంగా పశ్చిమోత్తర భారతదేశంలో అఫ్ఘనిస్తాన్ సరిహద్దు వెంబడి, అలాగే పశ్చిమ బెంగాల్, అస్సాంలలో అభివృద్ధి చెందింది. ఉపఖండంలోని ఈ ప్రాంతాలలో హిందూ నివాస ప్రాంతాలు చాలా పల్చగా ఉండేవి. అందుకే తంత్రాలలో అనేక ఆర్యేతర లక్షణాలను పొందుపరిచారు.

దీక్ష చేపట్టడం, సమర్థుడైన గురువు నుండి ప్రత్యేక మంత్రాన్ని అందుకోవడం తాంత్రిక విధానాలలో ముఖ్యమైన అంశం. దీక్షాధరుడు పునర్జన్మిస్తాడు. విముక్తి వైపు మార్గదర్శనం కోసం అతడి తగిన మంత్ర జ్ఞానం అందిస్తారు. సన్యాసత్వం యొక్క కొత్త రూపాలను అభివృద్ధి పరిచారు. వాటిలో శివ, శక్తుల సంగమాన్ని అనుకరిస్తూ జరిపే లైంగిక ఐక్యత కూడా ఉంది. శక్తిని పూజిస్తే గొప్ప శక్తి లభించగలదని చెబుతారు. అయితే తాత్వికంగా ఆలోచిస్తే దేవత ఆవిర్భావం ఆధ్యాత్మికత దిగువ స్థాయి ఫలితంగా కనిపిస్తుంది. కనక భావాతీతాన్ని పొందడానికి కేవలం లైంగికతను మాత్రమే వినియోగించవచ్చు.

తాంత్రికవాదంలో రెండు ప్రధాన విభజనలు ఉన్నాయి. ఒకటి వామాచారం, రెండవది దక్షిణాచారం. దక్షిణాచార పూజా విధానాలు వామచారులంత తీవ్రంగా ఉండవు. వారి కర్మకాండలు కొంత వరకు వామచార స్వరూపం కలిగి ఉన్నప్పటికీ భౌతికంగా వాటిని ఎన్నడూ నిర్వహించలేదు. అయితే కేవలం ప్రతీకాత్మకంగానే వాటిని పాటించారు. పై రెండు శాఖలు కుల వ్యవస్థను గుర్తించలేదు. ఆశావహులందరూ సంక్లిష్టమైన దీక్షా పద్ధతులను పాటించాల్సి ఉంటుంది. వామచార పంథా ఉద్దేశ్యపూర్వకంగా అన్ని సామాజిక నియమాలను, బ్రాహ్మణవాద నిషేధాలను (కర్మకాండల నిర్వహణలో) ఉల్లంఘిస్తుంది. సాధారణ జీవితం విధించే పరిమితుల నుండి విముక్తి పొంది గొప్ప ఆధ్యాత్మిక శక్తిని సంతరించుకోవడానికి జరిపిన ప్రయత్నాలలో భాగంగానే అలాంటి బ్రాహ్మణవాద వ్యతిరేక వైఖరిని తీసుకున్నారు.

జామితి చిహ్నాకారాలు గల యంత్రాలకు విశేష ఆధ్యాత్మిక ప్రాధాన్యం ఉంది. తాంత్రిక పూజల్లో వాటిని ఎక్కువగా వినియోగిస్తారు. యంత్రాల సహాయంతో భక్తులు విశ్వశక్తులలో కర్మకాండయుతంగా పాల్గొంటారు. శ్రీయంత్ర ప్రముఖమైనది. బిందువుతో సమ్మిళిత త్రికోణాలతో బ్రాహ్మణ్‌ను ప్రతిబింబించే ఈ యంత్రం అత్యంత కీలకమైనది. అయితే సహజ తాంత్రికులు మంత్రాలు, గ్రంథాలు, ప్రతిమలు, ధ్యాన వినియోగాన్ని తిరస్కరిస్తారు. ఎందుకంటే ఒకరి సహజ స్వభావంలో కేవలం శూన్యం మాత్రమే ఉంటుందని వారు భావిస్తారు. శూన్యను నిర్వచించటంలో గల శ్రమ, దాని అసమగ్ర స్వరూపం అనేక లైంగిక అత్యాచారాలను ప్రోత్సహించింది.

**ఆరు సనాతనవాద తాత్విక వ్యవస్థలు :**

తత్త్వశాస్త్రానికి సంస్కృత నామం 'దర్శన'. దృష్టి అనే పదం నుండి అది గ్రహించబడింది. సాహిత్యపరంగా దాని అర్థం 'వీక్షణం' లేదా 'దృష్టికోణం'. భారతీయ తత్త్వశాస్త్రం మౌలికంగా మత విశ్వాసాలతో ముడిపడి ఉన్నప్పటికీ సనాతన భారతీయుడు నాస్తికుడిగా కొనసాగడం అప్పటికే సాధ్యమే. కొన్ని సాంప్రదాయ వ్యవస్థలు కూడా నాస్తికమైనవి. ఎందుకంటే అవి సృష్టికర్త సిద్ధాంతాన్ని తోసిపుచ్చుతాయి. ఒక వ్యక్తి పునర్జన్మ సిద్ధాంతాన్ని అంగీకరించినా కేవలం ఒక్కదైవమే శూన్యం నుండి ప్రపంచమంతటినీ సృష్టించిందన్న వాదనను ఆమోదించడు. బుద్ధ, మహావీరుల ఆవిర్భావం తర్వాత వచ్చిన శతాబ్దాలలో ఆరు సనాతన (అస్తిక) మత-తాత్విక వ్యవస్థలు అభివృద్ధి చెందాయి. అవన్నీ వేదాల ఆధిపత్యాన్ని అంగీకరించాయి. అయితే ఆయా అంశాల అన్వయింపులో కొన్ని విభేదాలున్నాయి. వాటిలో అస్తికవాద, ఏకేశ్వరవాద, నాస్తికవాద, ద్వంద్వత్వ అభిప్రాయాలు ఉన్నాయి.

ఈ తాత్విక వ్యవస్థలను స్థాపించిన వారు ఎవరో, వారి పేర్లేమిటో ఎవ్వరికీ తెలియదు. అయితే వ్యక్తుల పేర్ల కంటే ఆయా విచారధారల పేర్లే ఉన్నట్లు తోస్తోంది. ప్రతి విచారధారకు ఒక ప్రత్యేకమైన సూత్రం ఉంది. బహుశా ఆ సూత్రాలను వ్యవస్థాపకులు రూపొందించి ఉంటారు. ఆరు వ్యవస్థలు జతలుగా నిర్ధారించబడ్డాయి. సాంఖ్య (జ్ఞానం) - యోగ (స్వయం నియంత్రణ), వైశేషిక-న్యాయ, వేదాంత-మీమాంస జంటలుగా అన్ని ఉన్నాయి. వైశేషిక-న్యాయ జంట తాత్విక ఆలోచనా విధానం కంటే పద్ధతి శాస్త్రాన్ని ఎక్కువగా సూచిస్తుంది. శైవ సిద్ధాంతం లాంటి ఇతర వ్యవస్థలు కూడా ఉన్నాయి. నాస్తిక వ్యవస్థలలో మూడు ప్రముఖమైనవి బౌద్ధ, జైన, చార్వాక, బౌద్ధ, జైన వ్యవస్థలు వేదాల ఆధిపత్యాన్ని తిరస్కరిస్తాయి. అయితే భవిష్యత్ జీవితం ఉంటుందని విశ్వసిస్తాయి. మరోవైపు భౌతికవాద చార్వాకులు వేదాలు, పునర్జన్మ సిద్ధాంతాలు రెండింటినీ తిరస్కరిస్తారు.

"సాంఖ్య" అన్నది ద్వంద్వత్వ విచారధార. పురుష, ప్రకృతి అనే శాశ్వత వాస్తవాలను గుర్తిస్తుంది. కపిల మహర్షి దీనిని స్థాపించాడని చెబుతారు. పతంజలి ప్రారంభించిన యోగ వ్యవస్థకు సాంఖ్యతో చాలా సారూప్యాలున్నాయి. శ్వేత స్వతర ఉపనిషద్ ప్రకారం సాంఖ్య 'జ్ఞానం', యోగ 'ఆచరణ'. కణద ప్రారంభించిన వైశేషిక విశ్వం యొక్క పరమాణు నిర్మాణాన్ని వివరిస్తుంది. 'న్యాయ' హేతుబద్ధ వాస్తవికత. దీనిని గోతమ లేదా గౌతమ (అక్షపద)

ప్రారంభించాడు. వేదాంతను బాదరాయణ స్థాపించాడు. దానిని "ఉత్తర మీమాసం" అని కూడా పిలుస్తారు. దాని ప్రధాన విచారధారలు అద్వైత, విశిష్ట అద్వైత, ద్వైత. జైమిని స్థాపించిన "మీమాంస"ను పూర్వమీమాంస అని కూడా పిలుస్తారు. ఆ విధంగా దానిని సంక్లిష్టమైన వేదాంత నుండి వేరుగా గుర్తిస్తారు.

**బ్రాహ్మణిక దైవవాదం :**

బ్రాహ్మణిక దైవవాదం ప్రకారం ఆరంభంలేని ప్రపంచాలు స్థూల చక్రాలలోపు అనే చక్రాల గుండా నిరంతరంగా కొనసాగుతూ ఉంటాయి. పరబ్రహ్మ పని దినం సుమారు 4,320 మిలియన్ భౌగోళిక సంవత్సరాలతో సమానం. దానిని 'కల్ప' అంటారు. అతడి రాత్రి కూడా దాదాపు అంతే వ్యవధిలో ఉంటుంది. అతడి సంవత్సరంలో అలాంటి రేయింబవళ్లు 360 ఉంటాయి. అతడి జీవిత కాలం 100 దైవిక సంవత్సరాలు అంటే సుమారు 311,040,000 మిలియన్ సంవత్సరాలు. ఇంతటి సుదీర్ఘ కాలం చివరలో విశ్వం పతనమవుతుంది. మరో 'ఉన్నత' సృష్టికర్త ప్రత్యక్షమై కొత్త ప్రపంచాన్ని నిర్మించవలసి ఉంటుంది. తన పనిదినంలో బ్రహ్మ విశ్వాన్ని సృష్టిస్తాడు. బ్రహ్మాండంలో అందుబాటులో ఉన్న వస్తువులతోనే విశ్వాన్ని నిర్మిస్తాడు. చివరకు వాటిని తనలో విలీనం చేసుకుంటాడు. రాత్రి వేళ పదార్థాలన్నీ బ్రహ్మ ఒడిలో నిష్క్రియంగా ఉంటాయి. తర్వాత సృష్టి ప్రక్రియ మళ్లీ మొదలవుతుంది.

ప్రతి 'కల్ప'ను 14 మన్వంతరాలుగా విభజిస్తారు. ఒక్కో చక్రం లక్షలాది సంవత్సరాలు కొనసాగుతుంది. చక్రాల మధ్య భారీ విరామం ఉంటుంది. ఈ కాలాలలో మరో ప్రపంచం ఆవిర్భావంలోకి వస్తుంది. మానవజాతి తండ్రిగా ఒక కొత్త మనువు ప్రత్యక్షమవుతాడు. ప్రస్తుతం మనం ఏడవ మన్వంతరలో ఉన్నాము. ఈ కాలపు మనువు వైవస్వత. ప్రతి మాన్వంతరలో 71 మహాయుగాలు ఉంటాయి. ప్రతి మహాయుగం నాలుగు యుగాలుగా విభజించబడుతుంది. వాటిలో కృత, త్రేత, ద్వాపర, కలియుగాలున్నాయి. కృత యుగంలో 4,800 దైవిక సంవత్సరాలు, త్రేతలో 3,600, ద్వాపరలో 2,400, కలియుగంలో 1200 సంవత్సరాలు ఉంటాయి. (ఒకదైవిక సంవత్సరం 360 మానవ సంవత్సరాలతో సమానం)

పై యుగాలను కొన్నిసార్లు లోహాల పేర్లతో పిలుస్తారు. ఉదాహరణకు స్వర్ణ, వెండి, రాగి, ఇనుము పేర్లు ఉంటాయి. ప్రస్తుతం మనం కలియుగంలో ఉన్నాము. ఈ యుగంలో మంచితనం, దయ, విలువలు, న్యాయ, బలం, సుదీర్ఘ జీవితం, సంతోషం చాలా తక్కువ స్థాయిలో ఉన్నాయి. కలియుగం క్రీ.పూ. 3102లో ప్రారంభమైంది. మహాభారత యుద్ధం ఆ సంవత్సరంలోనే జరిగింది. స్వర్ణ యుగంలో ప్రతి ఒక్కరూ ధర్మాన్ని పాటించారు. వెండి యుగంలో నాలుగింట మూడొంతుల మంది, కాంస్య యుగంలో సగం మంది, ప్రస్తుత ఇనుప యుగంలో కేవలం పాతిక మంది మాత్రమే ధర్మాన్ని పాటిస్తున్నారు.

# VI

# సంస్కృతి

# 12

# భాష - సాహిత్యం

**ప్రాచీన భారత భాషలు :**

సుమారు 20 లక్షల సంవత్సరాల క్రితం హోమో హోబిలిస్ అనే మానవ జాతి తన మెదడులో మాట్లాడగలిగే బ్రోకా ప్రాంతాన్ని అభివృద్ధి పరచుకుంది. అయితే అతడి 'ప్రసంగం' చాలా వరకు మాటల కన్నా సైగలు, అరుపులు, కేకల రూపంలోనే ఎక్కువగా కొనసాగేది. ఎందుకంటే భౌతికపరంగా అతడు సరైన ప్రసంగానికి అవసరమైన శ్వాస నియంత్రణ సాధించలేకపోయాడు. ఈ సామర్థ్యాన్ని హోమో ఎరక్టస్ జాతి ఏ మేరకు సాధించిందనే విషయం ఇప్పటికీ వివాదాస్పదంగానే ఉంది. నడుము భాగంలో వెన్నెముక జారే రంధ్రం అప్పటికీ చాలా సన్నగా ఉండేది. చివరకు హోమో సాపియన్ జాతి మాత్రమే ప్రసంగానికి కావలసిన పూర్తి సామర్థ్యాన్ని అభివృద్ధి పరచుకుంది. ఆ జాతి సభ్యులు వాక్య నిర్మాణాన్ని సాధించారు. వాక్య నిర్మాణం అన్ని భాషలలో కనిపించే సాధారణ లక్షణం. భాష మాట్లాడే వారు ఎంత ఆదిమ వాసులైనప్పటికీ వాక్య నిర్మాణం తప్పకుండా ఉంటుంది. నవీన రాతి యుగ విప్లవానికి ముందు భాషల సంఖ్య విస్తారంగా ఉండి ఉండవచ్చు. ఎందుకంటే మానవ సమాజాలు ఎంత ప్రాచీనంగా (ఆదిమ) ఉంటాయో అంత ఎక్కువగా భాషలు ఉంటాయన్న విషయాన్ని నేడు గ్రహించారు.

మానవుల మధ్య సంబంధాలు మెరుగుపడే కొద్దీ వ్యాపార లావాదేవీలు విస్తృతమయ్యాయి. ప్రతి వ్యక్తిగత రాజ్యం మరిన్ని కొత్త ప్రాంతాలను తన నియంత్రణలోకి తెచ్చుకుంది. వాటిలో ఒకే ఒక్క భాషను ప్రవేశపెట్టింది. కొద్ది మంది మాత్రమే మాట్లాడే భాషలు ఆ విధంగా కనుమరుగు కావడం మొదలుపెట్టాయి. వలసలు కూడా స్థానిక భాషలను (ప్రాచీన) రూపుమాపాయి. అలాగే పాలకవర్గం తన స్వంత భాషను ప్రజలపై రుద్దింది. ఫలితంగా నవీన రాతి యుగ విప్లవం నుండి మాట్లాడుతూ వచ్చిన భాషల సంఖ్య చాలా వరకు తగ్గిపోయింది.

కాలంతోపాటు భాషలు కూడా మారుతాయి. అయితే పూర్వపు రాజ్యంలో ఉన్న అనేక ఛాయలను (అవశేషాలను) కొనసాగిస్తాయి. అలాగే మాతృభాషలోని పదాలను

అట్టిపెట్టుకుంటాయి. అలాంటి అవశేషాలు భాషలను గుర్తించడంలో మనకు సహాయపడతాయి. భాషల పూర్వాపరాలను, పూర్వీకులను గుర్తించడం సాధ్యమవుతుంది. భారతదేశంలో కొన్ని ప్రధాన భాషలు ఉండడమే కాకుండా ఇతర మైనర్ భాషలు కూడా పెద్ద సంఖ్యలో ఉన్నాయి. అయితే సాధారణంగా తక్కువ మంది ప్రజలే మైనర్ భాషలను మాట్లాడతారు. మెజారిటీ భాషలను నాలుగు కుటుంబాలుగా విభజించవచ్చు : (1) ఇండో–యూరోపియన్ (ఇండో ఆర్యన్ లేదా ఇండిక్, దార్దిక్, ఇరానిక్, నూరిస్తాని శాఖలు) (2) ద్రవిడ (దక్షిణ, మధ్య, దక్షిణ మధ్య, ఉత్తర శాఖలు) (3) ఆస్ట్రో–ఏషియాటిక్ (మండ, మోన్–ఖ్మేర్ శాఖలు( (4) సైనో–టిబెటన్ (టిబెట్–బర్మీస్ శాఖ)

**ఇండో యూరోపియన్ కుటుంబం :**

ఈ కుటుంబంలో ఇండో ఆర్యన్ లేదా ఇండిక్ భాషలను భారత ఉపఖండంలోని మెజారిటీ ప్రజలు నేడు మాట్లాడతారు. అందులో హిందుస్తానీ (హిందీ, ఉర్దూ), మరాఠి, గుజరాతి, బెంగాలి, పంజాబి, సింధి, ఒరియ, అస్సామీ, నేపాలీ తదితర భాషలున్నాయి. దార్దిక్ శాఖ ఇండో–ఆర్యన్‌కు చాలా దగ్గరగా ఉంది. అందులో ఉత్తర భారతదేశం సరిహద్దులో మాట్లాడే భాషలున్నాయి. కాశ్మీరీ ఒక్కటే వాటిలో ప్రధాన సాహిత్య భాష. తర్వాత ఇరానిక్ భాషలు ఉన్నాయి. నేటి పాకిస్తాన్‌లోని పష్తో, బలూచీ భాషలు ఈ కోవకు చెందుతాయి. పశ్చిమోత్తర ఆఫ్ఘనిస్తాన్, పశ్చిమోత్తర సరిహద్దు రాష్ట్రంలోని ఉత్తర భాగంలో నూరిస్తానీ భాషలు మాట్లాడతారు. ఇవి ఇండో–ఆర్యన్ లేదా ఇరానిక్ శాఖకు చెందినవి కావు. ఈ భాషలలో అనేక ప్రాచీన లక్షణాలు కనిపిస్తాయి.

ఇండో–ఆర్యన్, ఇరానిక్ కుటుంబాలకు చెందిన తొలి భాషలు రుగ్వేద, అవెస్తా ఎంత దగ్గరగా ఉండేవంటే భాష శాస్త్రవేత్తలు ఆది ఆర్య భాషను చాలా సులువుగా పునః నిర్మించగలిగారు. ఇండో–యూరోపియన్ కుటుంబానికి చెందిన భారతీయ, ఇరానీ శాఖలకు "ఆర్య" అనే హోదాను సాధారణంగా అందరూ ఆమోదిస్తారు. అలాగే భారతీయ శాఖకు "ఇండో–ఆర్యన్" అనే పేరును వాడతారు. కనక ఆర్యన్ అనే పద వినియోగానికి ఎలాంటి జాత్యహంకార సూచికలులేవు. కాని ఆ హోదాను ఇండో–యూరోపియన్ కుటుంబానికి స్థూలంగా విస్తరించరాదు. అలాగే అందులోని ఇతర శాఖలకు కూడా వర్తింపచేయకూడదు. ఇక్కడో విషయాన్ని గుర్తించాలి. ఆర్య లేదా ఇండో–ఇరానీ భాషల బృందం ఇండో– యూరోపియన్ కుటుంబానికి చెందినదని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. ఎందుకంటే ఆ భాషలలోని అనేక పదాల మధ్య పోలికలున్నాయి. ఉదాహరణకు తల్లి, తండ్రి, కూతురు, సోదరుడు మొదలైనవి.

నిరంతర పరిశోధన కారణంగా ఇండో–యూరోపియన్ కుటుంబానికి అనేక భాషలు జతపడడమే కాకుండా పదాలలో వచ్చిన మార్పుల క్రమాన్ని కూడా నిర్ధారించగలిగారు. ప్రాచీన పదాలు, ఆధునిక పదాల మధ్యగల మార్పును నమోదు చేయగలిగారు. అలాంటి కృషి కారణంగా ప్రాచీన అలిఖిత ఇండో–యూరోపియన్ యొక్క పూర్తి ఊహాజనిత

పదవినియోగాన్ని నిర్మించారు. ఆ ప్రాచీన భాషను మాట్లాడిన ప్రజలు వన సంచార జీవితాన్ని గడుపుతూ నాగలితో సేద్యాన్ని ఆచరించారని, వారికి అశ్వాల గురించి పరిజ్ఞానం ఉండేదని, అలాగే వారి వద్ద బంగారు, వెండి, రాగి ఉండేదని ఈ పునఃనిర్మిత భాష సూచిస్తుంది. మొత్తం మీద అలాంటి పరిస్థితులు దాదాపు పోలి ఉండేవని పురావస్తు పరిశోధనలు నిర్ధారించాయి. క్రీ.పూ. 3000 సంవత్సరాలకు ముందు యుక్రెయిన్ నుండి తూర్పు కజక్స్తాన్ వరకు విస్తరించి ఉన్న గడ్డి భూములలో చాలా వరకు పైన పేర్కొన్న పరిస్థితులు ఉండేవి. అలిఖిత ఇండో-యూరోపియన్ భాషను ఈ భూభాగంలోని ఏదో ఒక ప్రాంతంలో మాట్లాడి ఉంటారనడానికి అవకాశాలు ఉన్నాయి. కనక భారతదేశంలో ఈ భాష మూలాలను వెదికే ప్రయత్నాలు ఫలించబోవు.

ఆర్యభాషల వర్గీకరణ లేదా క్రమానుసారాన్ని టర్కీలోని బోగాజకుయ్ గుహలు అందిస్తాయి. అక్కడి రాతలన్నీ హిట్టైట్ భాషలో ఉన్నాయి. అది స్వయంగా అత్యంత ప్రాచీనమైన ఇండో-యూరోపియన్ భాష. హుర్రియన్ అనే మరో భాషలో అక్కడ లభించిన నివేదికలలో ఎగువ మెసొపొటోమియా (నైరుతి సిరియా)కు చెందిన మిట్టాని పాలకుల (1500-1300 క్రీ.పూ) భాషలోని పదాలు, పేర్లు కనిపిస్తాయి. క్రీ.పూ. 1380 కుదుర్చుకున్న ఒక ఒప్పందం ప్రకారం మిట్టాని పాలకులు రుగ్వేదకు చెందిన మిత్ర, వరుణ, ఇంద్ర, నసత్య అనే దైవాలను పూజించారు. మిట్టాని పదాలు రుగ్వేద భాష మధ్య ఎంత దగ్గరి సంబంధం ఉందంటే మిట్టాని, ప్రధాన స్రవంతి ఇండో-ఆర్య భాషలు మాట్లాడే వారి మధ్య స్థలం లేదా కాలంలో అంత దూరం ఉండేది కాదని బోధపడుతుంది. ఈ ఇద్దరు ప్రజల మధ్య చీలిక క్రీ.పూ. 2000 కంటే ముందు జరగలేదు. తూర్పు ఇరాన్ నుండి మిట్టాని ప్రాంతం అంత దూరంగా ఉండేదికాదు. రుగ్వేద రచయితలతోపాటు మిట్టాని పాలకులు కూడా అశ్వాలు,రథాలపై ఎక్కువ ఆసక్తి చూపారు. కనక పురావస్తు నివేదికలో ఉమ్మడి భాషాపరమైన పూర్వీకుల ఉనికిని నిర్ధారించడానికి ఒకనిజమైన గృహపోషణ గల గుర్రం అత్యంత అవసరమైన సూచిక.

క్రీ.పూ. 1500 సంవత్సరాలకు ముందు ఇండో-ఆర్యన్ మాట్లాడే ప్రజలు స్వాట్, పీరాక్‌లకు వలసపోయి ఉంటే పంజాబ్‌లో వారు ప్రవేశించడానికి అంత సమయం పట్టదు. గుర్రాలు, రథాలు కలిగిన వారు తమ తూర్పు ప్రత్యర్థులపై నిర్ణయాత్మకమైన ఆధిపత్యాన్ని సాధించగలిగేవారు. తూర్పు ప్రాంతం వారికి అప్పుడు కేవలం ఎడ్లబండ్లు మాత్రమే ఉండేవి.

సువస్తు (స్వాట్)నది ఆఫ్ఘనిస్తాన్‌ల పట్ల రుగ్వేదకు ఎంత అవగాహన ఉండేదంటే ఇండో-ఆర్యన్ భాష పంజాబ్‌లోకి విస్తరించిన తర్వాత సరిహద్దు ప్రాంతం, పంజాబ్‌ల మధ్య భాషాపరమైన ఐక్యతను కొనసాగించారని మనం ఊహించవచ్చు. ఇలాంటి విస్తరణకు వలస తప్పనిసరిగా జరగాలి. సరిహద్దు నుండి సింధూ మైదాన ప్రాంతాలకు పెద్ద సంఖ్యలో ప్రజలు వలస రావాలి. అయితే అదే సమయంలో వలసలు అంత భారీ స్థాయిలో జరగాల్సిన అవసరం కూడా లేకపోవచ్చు. ఆ విధంగా వలసలు సంభవించి ఆ ప్రాంతపు జాతి లక్షణాన్ని మార్చాల్సిన

అవసరం లేదు. పైగా ఆ ప్రాంతంలో గతంలో కొంత కాలంపాటు ఇండో-ఆర్యన్ భాష మాట్లాడే ప్రజలు స్థిరపడిన కారణంగా వారు స్థానిక ప్రజలతో కలిసిపోయి ఉంటారు. స్థానికులు సింధూ ప్రజలకు పొరుగు వారు కావడంతో ఇద్దరి మధ్య భౌతికపరమైన నిర్మాణంలో పెద్దగా మార్పు ఉండేది కాదు.

మిట్టాని గురించి మనకు చారిత్రక ఆధారాల నుండి తెలిసిన విషయాలను (క్రీ.పూ 1500-1300) పరిగణనలోకి తీసుకుంటే సింధూ బేసిన్‌లో సంభవించిన పరిణామాలను మనం ఒక ఊహా చిత్రంగా గీయవచ్చు ఎగువ మెసొపొటోమియాలో మిట్టాని రాజ్యానికి చెందిన ఇండో- ఆర్యన్ ప్రజలలో పాలకులు, యోధులు, రథసారథులు, అశ్వ శిక్షకులు, బహుశా పురోహితులు కూడా ఉన్నారు. అయితే రాజ్యంలోని మెజారిటీ ప్రజలు హుర్రియన్ భాషను మాట్లాడడం కొనసాగించారు. ఆ భాష కనీసం ఇండో- యూరోపియన్ కుటుంబానికి చెందినది కూడా కాదు. మిట్టాని పాలకుడు తుష్‌రత్త (సంస్కృతంలో దాశరథ) క్రీ.పూ. 1400లో ఈజిప్టు ఫారోకు స్వయంగా ఒక లేఖ రాశాడు. అది హుర్రియన్ భాషలో ఉంది. అందులో 500 పంక్తులలో ఉంది. నిరంతర ద్విభాషతనానికి ఇదో స్పష్టమైన చిత్రాన్ని అందిస్తుంది. అయితే హుర్రియన్ సాహిత్య భాష కావడంలో బలంగా పాతుకుపోయింది. ఇండో-ఆర్యన్ భాష (మౌఖిక) అక్కడ కేవలం పాలకవర్గ భాషగా కొంత కాలం కొనసాగి తర్వాత పూర్తిగా అదృశ్యమైంది. కాని సింధూ ప్రాంతంలో మాత్రం సింధూలిపి కనుమరుగు కావడంతో ఇండో-ఆర్యన్‌ను ఎదుర్కొనే సమర్థవంతమైన భాష ఏదీ లేకుండా పోయింది. వాస్తవానికి కేవలం కొన్ని చిన్న భాషలే ఉండేవని తెలుస్తోంది. వాటిలో కొన్ని ద్రవిడ భాషలు ఉన్నాయి. రుగ్వేదంలో కొన్ని ద్రవిడ పదాలు ప్రత్యక్షం కావడం ఈ వాదనను బలపరుస్తుంది.

ద్రవిడ లేదా ఆస్ట్రో- ఏషియాటిక్ కాని ఇతర భాషలు కూడా కొన్ని ఇండో-యూరోపియన్ యేతర పదాలను రుగ్వేద, తొలి సంస్కృత భాషకు అందించాయి. ఆఫ్ఘనిస్తాన్ అలాంటి భాషలతో పరిచయాలు ఆర్యులు భారతదేశానికి రావడానికి ముందే జరిగి ఉంటాయి. ఫలితంగా ఇండో- ఆర్య భాషల ప్రత్యేక లక్షణమైన "ప్రాకృతం" ప్రత్యక్షమైంది. ఇందులో ఇండో- ఆర్య పదనిర్మాణాన్ని సరళీకరించారు. ఉదాహరణకు పుత్ర స్థానంలో పుత అని వాడడం మొదలుపెట్టారు. కొన్ని ప్రాకృతాలు రుగ్వేదంలోనే కాకుండా మిట్టాని భాషలో కూడా కనిపిస్తాయి. సంస్కృతంలో గుర్రాన్ని అశ్వ అని పిలిస్తే మిట్టానీలో"అస్సు" అనే వారు. సంస్కృత పదమైన "సప్తను" మిట్టానిలో 'సత్త' అని పిలిచేవారు. అలాంటి సరళీకరణ వల్ల సాధారణ ప్రజలలో ఆర్య భాషను విస్తరించగలిగారు. రుగ్వేద సంస్కృతం తర్వాతి సంస్కృతం లాగే కేవలం కొద్ది మందికే పరిమితంగా ఉండేది. క్రీ.పూ. ఆరవ శతాబ్దం నాటికి ప్రతి ప్రాంతంలోని ప్రాకృతభాషనే స్థానిక ప్రజలు అర్థం చేసుకునేవారు. ఆ కారణంగానే గౌతమ బుద్ధుడు, మహావీరలు మగధ ప్రాకృత భాషలో తమ బోధనలు వినిపించారు పాలకవర్గ ఆధిపత్యం వల్ల ఇండో- ఆర్యన్ భాష గణనీయంగా విస్తరించగా దాని సార్వజనిక రూపమైన ప్రాకృతాన్ని నిర్ధారించడంలో ప్రజలకూ భాగస్వామ్యం ఉంది.

**ద్రవిడ కుటుంబం :**

భారతదేశంలో రెండవ అతి పెద్ద భాషాకుటుంబం ద్రవిడ భాషల కుటుంబమే. ఈ కుటుంబంలో తమిళం, మలయాళం, కన్నడ దక్షిణ వర్గానికి చెందినవి. కొలమి (మహారాష్ట్ర) మధ్య వర్గానికి, కురుఖ్ (జార్ఖండ్, ఛత్తిస్‌గడ్, నేపాల్), బ్రహుయ్ (బలోచిస్తాన్) ఉత్తర వర్గానికి చెందినవి. ఈ భిన్నమైన వర్గాలకు అనేక ఇతర చిన్నభాషలు కూడా ముడిపడి ఉన్నాయి. ఈ భాషల పదనిర్మాణాలు, వ్యాకరణాలను తులనాత్మకంగా అధ్యయనం చేస్తే మనం ఊహాజనితమైన ఆది ద్రవిడ భాషను పునఃనిర్మించవచ్చు. ద్రవిడ భాషలు చీలకముందు ప్రజలు ఈ ఆది ద్రవిడ భాషనే మాట్లాడేవారు. ళ,ణ,ఱ,ర్ష లాంటి కొన్ని పదాల వాడకం ద్రవిడ భాషల ఉమ్మడి లక్షణం. కాని ఇలాంటి పదాలు ఆస్ట్రో-ఏషియాటిక్, ఇండో- యూరోపియన్ కుటుంబ భాషలలో కనిపించవు. ముఖ్యంగా ఉపఖండం వెలుపల అలాంటి పదాలను వాడరు. దీనిని బట్టి ఆది ద్రవిడ లేదా దాని తొలి వారస భాషల నుండే ఇండో- యూరోపియన్, ఆస్ట్రో-ఏషియాటిక్ కుటుంబాలు తమ కఠినమైన పదాలను గ్రహించి ఉంటారని సూత్రీకరించారు.

ఈ భావనకు అనేక పర్యవసానాలు ఉన్నాయి. రుగ్వేదలో కఠినమైన పదాలతో పాటు ద్రవిడ నేపథ్యం ఉన్న సుమారు 24 పదాలు కూడా ఉన్నాయి. కాని అవెస్తాలో వత్తిపలికే అక్షరాలేవీ లేవు. పదనిర్మాణం, వ్యాకరణంలో అది దాదాపు రుగ్వేదను పోలి ఉంది. కనక స్థానిక ప్రజలు తొలిగా మాట్లాడిన భాషలకు అనుగుణంగా రుగ్వేద పండితులు సరళమైన ఇండో- ఇరానియన్ పదాలను కూడా వత్తి పలికారని సూచించబడింది. హిందుకుష్ పర్వతాలు, గంగా నది మధ్య విస్తరించిన ప్రాంతంలో రుగ్వేద భక్తి గీతాలను రచించారు కనక పంజాబ్ లేదా ఎగువ సింధూలోయలోని కొన్ని స్థానిక భాషలు ఆ సమయంలో ద్రవిడ కుటుంబానికి చెందిన సభ్యులుగా ఉండేవన్న వాదన బలంగా ఉంది. బ్రహుయ్ భాష యొక్క నైసర్గిక సాన్నిహిత్యం కూడా ఈ వాదనను బలపరుస్తుంది. ఆ భాషను మాట్లాడే ప్రజలు నేడు ఈశాన్య బలోచిస్తాన్‌లో కనిపిస్తారు. ఆ ప్రాంతం పంజాబ్‌కు చాలా దగ్గరలో ఉంది. ప్రాచీన భాషగా బ్రహుయ్‌ని గుర్తించడానికి ఆ భాషకు పర్షియాలోని ఏలం భాషతో ఉన్న సంబంధాలను ఇటీవలి తవ్వి తీశారు. అయితే ఆ సంబంధాలు ఎంత వరకు నిర్దిష్టంగా ఉన్నాయో తేల్చడం కష్టం. ఈ విషయంలో వివాదం కొనసాగుతోంది. అలాగే ఆది ద్రవిడ భాషలు, తూర్పు ఐరోపా, సైబీరియాకు చెందిన ఉరాలిక్ భాషల మధ్య సంబంధాలు ఉన్నాయని కొందరు విద్వాంసుల వాదన. దీనిని బట్టి ఒకప్పుడు ద్రవిడ భాష మాట్లాడే ప్రజలు ఉత్తరాన నేటి కంటే ఎంతో దూరంగా విస్తరించారని భావించవచ్చు.

కొందరు విద్వాంసుల ప్రకారం అధికారిక సింధూ భాషకు ద్రవిడ కుటుంబంతో సంబంధాలు ఉన్నాయి. సింధూ లిపిలోని కొన్ని బలమైన సూచికలు ఆధారంగా ఈ వాదన చేశారు. సింధూ లోయలో వ్యవసాయ ఆధారిత సాంస్కృతిక సమైక్యత కూడా అధికారిక భాష విస్తరణకు తోడ్పడి ఉంటుంది. ఈ విస్తరణలో ఇతర భాషలు దెబ్బతిన్నాయి. ఆ సమయంలో

ద్రవిడ భాషలను దక్షిణంలో కూడా మాట్లాడేవారిని ఖచ్చితంగా చెప్పలేము. రాగి వినియోగం విస్తరించడం, పంట రకాలు పెరగడంతో క్రీ.పూ.2000 తర్వాత ఉత్తరం నుండి దక్షిణాదికి ద్రవిడ భాష మాట్లాడే ప్రజలు వలస వచ్చారు. మాల్వ, జోర్వే సంస్కృతులు అప్పటికే దక్షిణ రాష్ట్రాలలో అనేక మార్పులు తీసుకువచ్చాయి. ఉత్తర భారతం నుండి వలస వచ్చిన ద్రవిడ భాషలు అసంఖ్యాకమైన వేర్వేరు భాషలను (వనసంచార ప్రజల భాషలు) రూపు మాపి ఉంటాయి. అదే సమయంలో వ్యవసాయం, హస్తకళలు, వాణిజ్యం విశాల భూభాగాలలో విస్తరించాయి. అయితే ఈ ఊహా సిద్ధాంతాన్ని ఇంకా నిరూపించవలసి ఉంది.

**ఆస్ట్రో-ఏషియాటిక్ కుటుంబం :**

తూర్పు మేఘాలయంలో మాట్లాడే ఖాసి భాష మోన్-ఖ్మేర్ శాఖకు చెందినది. ఆగ్నేయ ఆసియాలోని ఇతర భాషలకు ఇది పూర్తిగా భిన్నమైనది. ముండా శాఖలో ముందారీ, సంథాలీ ఉన్నాయి. జార్ఖండ్, బీహార్, ఒరిస్సాలలో ఈ భాషలు మాట్లాడతారు. దక్షిణ ఒరిస్సాలోని సావర, మహారాష్ట్ర-మధ్యప్రదేశ్ సరిహద్దులోని కోర్కి రెండు చిన్న ప్రదేశాలుగా ఉన్నాయి. ముండా శాఖ భారతదేశానికే పరిమితమై ఉండగా మోన్-ఖ్మేర్ శాఖలో వియత్నామీ, ఖ్మేర్ (కంబోడియా), మోన్ (థాయ్‌లాండ్, మ్యాన్మార్) భాషలు ఉన్నాయి. ఆస్ట్రో-ఏషియాటిక్ కుటుంబాల విస్తరణ ఆధారంగా ప్రాచీన మూల భాషను ఆగ్నేయ ఆసియాలో మాట్లాడేవారని సూచించారు. క్రీ.పూ.5000 తర్వాత అక్కడి నుండి వరి సాగు విస్తరించడంతో ఆ భాషకు సంబంధించిన మాండలికంలో మాట్లాడే రైతు సముదాయాలు కూడా విస్తరించాయి. స్థానిక వేటదార సమాజాలను దాటుకొని వారు క్రీ.పూ.3000 సంవత్సరానికి ముందే తూర్పు, మధ్య భారతదేశానికి చేరుకున్నారు. అలాంటి భాష విస్తరణ ఎప్పటి నుండో వినవస్తున్న సిద్ధాంతాన్ని బలపరుస్తుంది. వ్యవసాయ విస్తరణ పెద్ద సంఖ్యలో ఉన్న స్థానిక భాషల స్థానంలో ఒక బలమైన భాషను ప్రవేశపెట్టిందని ఆ సిద్ధాంతం చెబుతుంది. అయితే అలాంటి భాషాపరమైన విస్తరణ జాతిపరంగా భిన్నమైన వ్యక్తులను పెద్ద సంఖ్యలో తీసుకురావలసిన అవసరం ఏదీ లేదు. ఎందుకంటే తమ వలసల వివిధ దశలలో ఆస్ట్రో-ఏషియాటిక్ భాష మాట్లాడే ప్రజలు స్థానిక ప్రజలతో కలిసిపోయి ఉంటారు.

**సైనో-టిబెటన్ కుటుంబం :**

సైనో-టిబెటన్ కుటుంబం గురించి ఎంత తక్కువగా మాట్లాడితే అంత మంచిది. ఈ కుటుంబంలోని భాషలన్నీ ఈశాన్య రాష్ట్రాలు, హిమాలయ పర్వత పాదాల వరకే పరిమితమై ఉన్నాయి. హిమాలయ ప్రాంతంలో టిబెటో-బర్మీస్‌శాఖ భాషలు మాట్లాడతారు. చైనాలోని టిబెట్ ప్రాంతం, భూటాన్, మ్యాన్మార్ (బర్మా)లలో ఈ భాషలు ప్రధానమైనవి. పశ్చిమ మేఘాలయలో మాట్లాడే గారో భాష ఒక్కటే ప్రధాన టిబెట్ మండలి (ఉత్తర భాగాన) నుండి వేరుగా ఉంది. బెంగాలీ, అస్సామీ భాషలు వాటి మధ్య విభజన రేఖను గీశాయి. ఈ ఇండో ఆర్యన్ చొరబాటు టిబెటో-బర్మీస్ శాఖ రాకకు ముందే జరిగి ఉంటుంది.

నైసర్గికంగా నిర్ధారించబడిన ప్రాంతాలలో సాధారణంగా అనేక భాషలను మాట్లాడతారు. ఎందుకంటే భౌగోళిక విస్తరణ ప్రజల మధ్య సంబంధాల స్థాయిని నిర్ధారిస్తుంది. అలాంటి ఏకలక్షణ ప్రాంతాలలో ప్రజలు సాధారణంగా ఎక్కువగా కలుసుకుంటారు, ఆ ప్రాంతాలలోనే వివాహం చేసుకుంటారు. ఫలితంగా జాతి, భాషపరమైన హద్దుల మధ్య విశాలమైన సాంగత్యం ఏర్పడుతుంది. అయితే అలాంటి సాంగత్యం తప్పుదోవ కూడా పట్టిస్తుంది. కనక ఈ విషయాన్ని తెగేదాక లాగాల్సిన అవసరం లేదు. వాస్తవానికి వ్యక్తి మాట్లాడే భాషను నియంత్రించే జన్యుపరమైన నిబంధనలేవీ లేవు. వేరే మాటల్లో చెప్పాలంటే జన్మ ద్వారా మాండలికం ఏర్పడదు. బాల్యంలో విన్న భాషనే పెరిగి పెద్దయ్యాక పలుకుతారు. ఇంటి భాష, బయటిభాష రెండూ ఇందులో ప్రధాన పాత్రను పోషిస్తాయి. ఆ విధంగా భాషాపరమైన వర్గానికి, జన్యుపరమైన వర్గానికి మధ్య అవసరమైన సంబంధం అంటూ ఏదీ లేదు. అలాంటి సంబంధాన్ని సాధారణంగా జనభాషలో 'జాతి' అని పిలుస్తారు.

ఈ విషయాన్ని అనేక ఉదాహరణలతో రుజువు చేయవచ్చు. తుర్కు భాష చాలా చిన్న వయస్సు గలది (బహుశా 1,500 సంవత్సరాల వయస్సు ఉంటుంది) దీనిని ఆసియాలోని అనేక విశాలమైన ప్రాంతాలలో, అలాగే ఐరోపాలో ప్రస్తుతం మాట్లాడతారు.

ఈ భాషల విస్తరణ వలసల కారణంగానే ఎక్కువగా జరిగింది. తొలుత మంగోలియా, పశ్చిమ చైనాల నుండి ఈ వలసలు జరిగాయి. చారిత్రక ఆధారాలు ఈ పరిణామాలను నిర్దిష్టంగా నమోదు చేశాయి. అయితే టర్కీ ప్రజలు (తుర్కు అత్యధికంగా మాట్లాడే దేశంగా టర్కీకి ప్రాముఖ్యత ఉంది) కాకసోయిడ్‌లు. వీరు జన్యుపరంగా గ్రీకులకు దగ్గరివారు. అయితే తుర్కు భాషను తొలిగా మాట్లాడిన పశ్చిమ చైనా ఉయ్‌ఘర్‌లకు (వీరు ఉత్తర మంగోలాయిడ్‌లు) వారు చాలా దూరంలో ఉన్నారు. అదే విధంగా భారతదేశంలో ముండా, ద్రవిడ, ఇండో–ఐరోపా భాషలు మాట్లాడే ప్రజలలో జన్యుపరమైన తేడాలు స్పష్టంగా కనిపించవు. వీరందరినీ కాకసోయిడ్‌లుగా వర్గీకరించారు. కనక ఆర్యజాతి అన్నది ఏ మాత్రం లేదు. ఇండో–యూరోపు జాతి సరేసరి.

**రాత–భాషలు :** రచనల ఆవిర్భావం ఏ సమాజంలోనైనా ఒక చారిత్రక ఘట్టాన్ని తలపిస్తుంది. క్రీ.పూ. మూడవ సహస్రాబ్దికి చెందిన సింధూ ముద్రలు (చిహ్నాలు) తప్ప భారతదేశంలో రచనలకు సంబంధించిన భౌతిక అవశేషాలు ఏవీ లేవు. అశోకుని శిలాశాసనాలు వచ్చే వరకు ఈ పరిస్థితి కొనసాగింది. వేద సాహిత్యంలో రచనలు లేదా రాత గురించి ఎలాంటి ప్రస్తావన లేదు. రచనలకు తొలి సాహిత్య ఆధారం పాణిని రచించిన అష్టధ్యాయి. అందులో లిపి, లిబి అనే పదాలు వస్తాయి. క్రీ.పూ. 4వ శతాబ్దం పాణిని తన రచనను పూర్తి చేశాడని భావిస్తున్నా కాల వ్యవధి గురించి ఖచ్చితమైన నిర్ధారణ ఏదీ లేదు. అలాగే అర్మాయిక్ లిపిని వివరించడానికి అతడు లిపి అనే పదాన్ని ఉపయోగించి ఉంటాడు. పాణిని జన్మస్థలమైన గాంధారలో క్రీ.పూ. 4వ శతాబ్దం నాటికి ప్రజలకు అర్మాయిక్ భాష తెలిసి ఉండాలి. తొలి పాలి సాహిత్యంలో రచన గురించి చేసిన ప్రస్తావనకు ప్రాధాన్యత చాలా తక్కువగా ఉంది. ఎందుకంటే బుద్ధుడు మరణించిన తర్వాత చాలా కాలానికి పాలి సాహిత్యాన్ని సంకలించారని,

మౌర్యులు లేదా అంత కంటే కొన్ని శతాబ్దాల తర్వాత ఈ పరిణామం జరిగి ఉంటుందని వివిధ నేపథ్యాలలో కొందరు విద్వాంసులు వాదించారు.

గ్రీకు చారిత్రక ఆధారాలు అలెగ్జాండర్, చంద్రగుప్త మౌర్యుల కాలంలో భారతదేశంలో ఎలాంటి రచనలు జరగలేదన్న భావనను చాలా వరకు స్ఫురిస్తాయి. **స్ట్రాబో ఇలా పేర్కొన్నాడు** : "ఇతర రచయితలు వారు (భారతీయులు) అక్షరాలను ఏ విధంగానూ ఉపయోగించరని చెప్పారు. కాని అలెగ్జాండర్ వద్ద అడ్మిరల్ (నౌకా దళ అధిపతి) అయిన నియర్కస్ "భారతీయులు దగ్గరగా అల్లబడిన వస్త్రాలపై రాస్తారని" నివేదించాడు. పాణిని లాగా నియర్కస్ ప్రకటనను కూడా సూచికగా తీసుకొని పశ్చిమోత్తర ప్రాంతంలో అర్మాయిక్ లిపిని వినియోగించేవారని చెప్పవచ్చు. మెగస్థనీస్‌ను ఉటంకిస్తూ స్వయంగా స్ట్రాబో మరోచోట ఇలా వ్యాఖ్యానించాడు : "రచనపై అవగాహన లేని భారతీయులు కేవలం అలిఖిత చట్టాలనే వినియోగించారు. అన్ని విషయాలలోనూ జ్ఞాపకశక్తిపైనే ఆధారపడ్డారు". మెగస్థనీస్ మౌర్య రాజధానిలో బస చేసి మరే గ్రీకు రచయిత చేయని విధంగా భారతదేశాన్ని దగ్గరగా చూశాడు కనక అతడి సాక్ష్యానికి ఎక్కువ బలాన్ని ఇవ్వవలసి ఉంటుంది.

బ్రహ్మలిపి ఆవిర్భావంతో భారతదేశంలో రచన వ్యాసంగాన్ని ముడిపెట్టారు. మౌర్యుల రాకకు పూర్వమే దేశంలో రాత లేదా రచన ఉండేదనే అభిప్రాయం గల వారు చాలా మందే ఉన్నారు. గుర్తులు, చిహ్నాల స్థాయి నుండి అంతర్గత ప్రగతి ప్రక్రియ ద్వారా ఉత్తర భారతదేశంలో బ్రహ్మలిపి వెలువడిందని వారు సాధారణంగా వాదిస్తారు. కొందరైతే సింధూ లిపితో కూడా సంబంధం కలిపారు. అయితే సింధూ ఊహాచిత్రాలు, సాధారణ చిత్రాలకు భిన్నమైన దాని నుండి బ్రాహ్మి అక్షరాలు కనక ఆవిర్భవించి ఉంటే అవి దేనినుండైనా, ఏ రూపంలోనైనా ఆవిర్భవించే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి. మరోవైపు ఖరోష్టి లిపి ఆవిర్భావం గురించి శాస్త్రీయమైన వివరణ ఉంది. బ్రాహ్మిలిపితోపాటు అశోకుని ప్రాకృతానికి ప్రాతినిధ్యం వహించేందుకు ఖరోష్టి లిపిని వాడారు.

ఖరోష్టి లిపిలోని అనేక అక్షరాలు అర్మాయిక్ అక్షరాలతో రాతపరంగా, ధ్వనిపరంగా ప్రత్యేక పోలికలను ప్రదర్శిస్తాయి. రెండు లిపులను కుడి నుండి ఎడమవైపుకి రాస్తారు. గాంధారలో ఆ రెండు లిపులూ కనిపిస్తాయి. అలాగే అర్మాయిక్ భాషలో వలె.ఖరోష్టిలో కూడా హల్లులు వత్తుగా ఉన్న అచ్చులను పలకడం కొంచెం కష్టంగా ఉంటుంది. బ్రాహ్మిలో కూడా ఈ లక్షణం కనిపిస్తుంది. అయితే అశోకుని ఖరోష్టి శ్రీలంక బ్రాహ్మిలాగా దీర్ఘమైన అచ్చులను కొరవడింది. ఇక్కడ ఒక ప్రశ్న తలెత్తుతుంది. తొలి బ్రాహ్మి కూడా అర్మాయిక్ నుండి కొన్నిలక్షణాలను గ్రహించిందా లేదా ఖరోష్టిని ఆదర్శంగా తీసుకుందా లేదా సమాంతరంగా అభివృద్ధి చెందిందా?

బ్రాహ్మిలిపి ఏ విధంగా ప్రారంభమైనప్పటికీ (అశోకుడు లేదా అంతకంటే ముందుగా) చేతి రాత కళ వేగంగా విస్తరించినట్లు కనబడుతోంది. తన సామ్రాజ్యమంతటా శాసనాలు వేయించడానికి అశోకుడు చూపిన శ్రద్ధను బట్టి అన్ని ప్రాంతాల్లోనూ వాటిని చదివి ఇతర ప్రజలకు గట్టిగా వినిపించే వ్యక్తులు ఉండేవారని బోధపడుతుంది. అలాగే తేలికపాటి పదార్థాలపై

రచించిన శాసన ప్రతులను కూడా అతడు పంపిణీ చేశాడు. మహాస్థాన్ శ్లాబ్‌శాసనం, సోహ్‌గౌర తామ్రఫలక శాసనం పాలనా, వ్యవహారాలలో లిఖిత ఆదేశాలను ఏ విధంగా ఉపయోగించారో చెబుతాయి. పిప్రాహ్వా, భట్టిప్రోలు శాసనాలు బౌద్ధ సంఘంలో కూడా చేతిరాతను ఏ విధంగా వినియోగించారో వివరిస్తాయి. తమిళ బ్రాహ్మి శాసనాలు కూడా ఇలాంటి కథనే వినిపిస్తాయి. జైన మునులు, భిక్షువులు రాతప్రతులను ఏ విధంగా వినియోగించింది, సాహిత్య కృతులను ఎవరు కానుకలుగా ఇచ్చారు అనే విషయాలు వాటి ద్వారా తెలుస్తాయి.

రచన ఆ విధంగా వేగంగా విస్తరించడంతో సమాజంలో వివిధ సంస్థలపై దీర్ఘకాలిక ప్రభావం పడింది. అధికారస్వామ్య నిర్మాణంలో అది సాంప్రదాయ వ్యక్తుల స్థానంలో నివేదకులను ప్రవేశపెట్టింది. నివేదికలు, జమాఖర్చుల నిర్వహణను సరళీకరించడం ద్వారా పరిపాలనా యంత్రాంగం యొక్క సామర్థ్యాన్ని గణనీయంగా పెంచింది. రచన ద్వారా అన్ని మత వర్గాలు బ్రాహ్మణీకంతో సహా, తమ పవిత్ర గ్రంథాలను పరిరక్షించగలిగారు. అలాగే మత సిద్ధాంతాలను సుదూర ప్రాంతాల్లో సైతం ప్రచారం చేయగలిగారు. అయితే ఈ వ్యవహారానికి చాలా సమయం పట్టింది. గతంలో కంటే ఈ సమయంలో లౌకికవాద రచనలకు దీర్ఘకాల ప్రభావం సంతరించింది. లిఖిత జమాఖర్చులు, సందేశాల కారణంగా వాణిజ్యం కూడా బాగా లాభపడింది.

**తొలి చారిత్రక కాలం :**

తొలి చారిత్రక కాలంలో ప్రసంగిత ఆర్యభాష మూడు భిన్నమైన మాండలికాలలో అభివృద్ధి చెందింది. అవి ఉత్తర లేదా పశ్చిమోత్తర (ఉదిచ్య) మధ్య భారత, తూర్పు లేదా ప్రాచ్య మాండలికాలు. తొలి మాండలికాన్ని సాంప్రదాయవాద మాండలికంగా, పరిపూర్ణమైనదిగా పరిగణించారు. పాణిని "భాష"గా అభివర్ణించిన సంస్కృత అనే కొత్త రూపంలో వెలుగులోకి వచ్చింది. పాలకవర్గ లేదా బ్రాహ్మణుల సమాచార లేదా అభివ్యక్తీకరణ సాధనంగా మారింది. అశోకుని శాసనాలు మూడు భిన్నమైన స్థానిక మాండలికాలను స్థూలంగా అందిస్తాయి. మన్షేరా, షహ్‌బాజ్‌గఢి శాసనాలలో ప్రాకృత లేదా పశ్చిమోత్తర ఆర్య మాండలికం ఉంది. తూర్పు ప్రాంతాలలో తూర్పు మాండలికం (ప్రాకృత) కనిపిస్తుంది. ఇదే మాండలికాన్ని అశోకుని ఆస్థానంలో (పాటలీపుత్ర)లో ఉపయోగించారు. ఆ విధంగా రాజ్‌పుతాన, పశ్చిమ ఉత్తర ప్రదేశ్, పశ్చిమోత్తర ఉత్తరప్రదేశ్ (కల్సీ), మధ్య ఉత్తరప్రదేశ్ (అలహాబాద్)లలో తూర్పు మాండలికాన్ని తూర్పు యు.పి.స్థాయిలో వినియోగించారు. బనారస్ (సార్‌నాథ్), బీహార్ (లౌరియా, రుమ్మింది, బరాబర్ గుహలు)లలో కూడా తూర్పు మాండలికమే కనిపిస్తుంది.

అశోకుని ఆస్థానంలో ప్రధాన భాష ప్రాకృతం లేదా మగధి. ప్రజలు ఈ భాషనే ఎక్కువగా మాట్లాడేవారు. పాటలీపుత్రలో తొలిగా రచించబడ్డ శాసనాలను (ప్రాకృతభాషలో) సుదూర ప్రాంతాలలో శిలలపై చెక్కడానికి పంపించారు. తూర్పు ప్రాకృత భాష బుద్ధ, మహావీరల మతపరమైన సంస్కృతికి ముఖ్యమైన చోదకంగా మారింది. అయితే ఈ మాండలికం మౌర్య సామ్రాజ్య పతనంతో తన ప్రభావాన్ని కోల్పోయినట్లు తెలుస్తోంది. మధ్యభారతంలో మధ్యభారత మాండలికం తన సహజ స్థాయిని అందుకుంది. బుద్ధుని బోధనలను ఆ మాండలికంలోనే

ప్రచారం చేశారు. తొలి మధ్యయుగ కాలాలకు (600–1200 క్రీ.శ.) చెందిన సౌరసేని అపభ్రంశకు అది పూర్వరంగంగా ఉంది. మధ్య భారత మాండలికానికి సాహిత్య రూపమైన పాలిని ఉజ్జయినీ నుండి పాటలీపుత్ర, తామ్రలిప్తి గుండా మహేంద్ర (మహింద) సిలోన్‌కు తీసుకెళ్లాడు.

అయితే ఈ కాలంలో కూడా పాణిని జీవిత కాలంలో స్థాపించబడిన సంస్కృతం తన ప్రాధాన్యతను కోల్పోలేదు. ఆ భాషను బ్రాహ్మణిక పాఠశాలలు, ఇతర వ్యాకరణవేత్తలు అభివృద్ధి పరిచారు. మౌర్య, సుంగ కాలాలలో కాత్యాయన, పతంజలిలు ఆ భాషను ప్రచారం చేశారు. భాషను అత్యున్నత స్థాయికి తీసుకెళ్లారు. పాణిని ద్వారా సరళతను సంతరించుకున్న సంస్కృతం వేదాలలో ఉన్న రూపానికి భిన్నంగా మారింది. మహాగ్రంథాలు, కావ్యసాహిత్యంలో ఆ భాషను పెద్దఎత్తున వినియోగించారు.

మౌర్య పాలనా కాలంలో వ్యాకరణ సంబంధిత కార్యకలాపాలు కూడా పెద్ద ఎత్తున జరిగాయి. సంస్కృత వ్యాకరణంతో పాణిని అప్పటికే అష్టధ్యాయిని రచించి ఉన్నాడు. పాణిని, పతంజలిల మధ్య అనేక మంది వ్యాఖ్యాతలు (వర్తికాకరులు) వచ్చారు. వీరంతా పాణిని పదబంధాలపై వ్యాఖ్యానాలు రాశారు. పాణిని తల్లి కుటుంబానికి చెందిన వ్యాది అనే వారసుడు "సంగ్రహ" అనే మహాగ్రంథాన్ని సృష్టించాడు. అందులో 1,00,000 వచనలు ఉన్నాయి. "పరిభాషలు" కూడా వ్యాది సృష్టేనని చెబుతారు. అలాగే అతడు "ఉత్పళిని" కూడా రచించాడు. నంద–మౌర్య యుగానికి చెందిన మరో బహుముఖ ప్రజ్ఞాశాలి కాత్యాయన అతడిని వరరుచి అని కూడా పిలుస్తారు. పాణిని సూత్రాల మీద అతడు ముఖ్యమైన వ్యాఖ్యానాలు చేశాడు. తన "వజసనేయి ప్రతిసఖ్య"లో అతడు పాణినికి చెందిన 1,500 సూత్రాలపై విమర్శనాత్మక వ్యాఖ్యానాలు చేశాడు.

మరో విద్వాంసుడు కాత్య. అతడిని పతంజలి భగవాన్ కౌత్యగా పేర్కొన్నాడు. అతడి వ్యాఖ్యానాలను "మహావర్తికాలు"గా అభివర్ణించాడు. కాత్య, కాత్యాయానల తర్వాత అంతగా ప్రాముఖ్యం లేని వ్యాఖ్యాతలు ఎందరో వచ్చారు. వారిలో భరద్వాజ, సునాగ, క్రోష్టి, కున్నరదావ, సూర్య ఉన్నారు. పాణిని సాహిత్యంపై వెలువడిన వ్యాఖ్యానాలన్నింటిలోనూ పతంజలి రచించిన "మహాభాష్య" సమగ్ర దర్శినిగా ఉంది. సమకాలీన సమాజం, మతం, తత్త్వశాస్త్రం, కళాసాహిత్యాల పరిస్థితిని అది వివరిస్తుంది. వ్యాకరణానికి సంబంధించిన అంశాలపై పతంజలికి ఉన్న అధికారానికి ఎన్నడూ సవాలు ఎదురుకాలేదు.

**గుప్త - పూర్వ కాలం :**

ప్రాచీన భాష మూలాలను తొలి చారిత్రక లేదా వైదికానంతర కాలంలో అన్వేషించవచ్చు. అయితే మౌర్య అనంతరం కాలంలోనే అది తొలిగా వికసించింది. దానికి రెండు మహా గ్రంథాలు ఉన్నాయి. అవి రామాయణ, మహాభారతాలు. ఈ రెండు గ్రంథాలలో ప్రజారంజక అంశాలు అనేకం ఉన్నాయి. ఉన్నత వర్గాలకు చెందని సుతులు వాటిని ప్రచారం చేయడంవల్లే ఈ జనప్రియ కథనాలు చోటు చేసుకున్నాయి. అయితే ఈ ఆది గ్రంథాలు తొలి

సంస్కృత కవుల మీద గణనీయమైన ప్రభావం చూపినప్పటికీ సంస్కృతం చాలా వరకు సాహిత్యానికే పరిమితమవుతూ పోయింది. ప్రసంగిత భాషగా దాని ప్రభావ క్షేత్రం క్రమంగా కుదించుకుపోయింది.

ఆస్థాన, మతపరమైన (తాత్విక) సాహిత్యాన్ని అది పెంచిపోషించింది. ప్రాచీన సంస్కృతానికి లభించిన పోషణ స్థాయికి ఒకటవ రుద్రదమన్ వేయించిన సుదీర్ఘమైన జునాగఢ్ ప్రశస్తి ఒక నిదర్శనం. సంస్కృతంలో అలాంటి ప్రశస్తి వెలువడడం అదే మొదటిసారి.

సమాజంలోని సాధారణ వర్గాలతో ముడిపడిన ప్రాకృత స్వరూపాలకు సంస్కృత నాటకాలలో కూడా స్థానం కల్పించారు. అందులోని పాత్రలు ప్రాకృతంలో తప్ప సంస్కృతంలో మాట్లాడవు. క్రీ.శ. రెండవ శతాబ్దం తొలి నాటికి అశ్వఘోషుని నాటకాలలో మూడు రకాల ప్రాకృత భాష (అర్ధమగధి, మగధి, సౌరసేని) కనిపిస్తుంది. బహుశా ప్రజలు వాటిని అప్పటికే గుర్తించి ఉంటారు. దక్షిణంలో తొలి తమిళ పద్యాల సంకలనం క్రీస్తు శకం ఆరంభంలో జరిగింది. పాండ్య రాజ్య రాజధాని అయిన మధురైలో జరిగిన మూడు సంగమలలో (సమావేశాలు) కవులు, ఆస్థాన కవులు వాటిని సమర్పించారు. ఈ సాహిత్యం (సంగమ)లో నేడు మిగిలింది కేవలం 33,000 పంక్తుల కవిత్వమే. దానిని ఎనిమిది సంపుటాలుగా వర్గీకరించారు. (ఎనిమిది ఎట్టుతొగగై, 10పట్టుపత్తు) ఈ సాహిత్యగనిలో తోల్కప్పియం కూడా ఉంది. అత్యంత ప్రాచీనమైన తమిళ వ్యాకరణం అదే. నేడు కేవలం మూడు గ్రంథాలుగా మిగిలిన తమిళ ఆది గ్రంథాలు తదుపరి కాలంలో రచించబడినవిగా కనిపిస్తాయి.

శాస్త్ర సాంకేతిక అధ్యయన శాఖలన్నింటిలోకెల్లా ఖగోళ శాస్త్రం, వైద్యశాస్త్రం ఈ కాలంలో గణనీయమైన ప్రగతిని సాధించినట్లు కనబడుతోంది. ఇతర సమకాలీన నాగరికతలతో సంబంధాలు నెలకొనడం ఇందుకు కొంత కారణం కావచ్చు. ఖగోళ శాస్త్ర గ్రంథాలు అంతరించిపోయినా దేశీయ వైద్య శాస్త్రంపై రెండు ముఖ్యమైన గ్రంథాలు మనుగడ సాగించాయి. తదుపరి సవరణలు పొందుపరిచినప్పటికీ మూలగ్రంథాలు సాంప్రదాయ పరంగా క్రీస్తు శకానికి అనేక శతాబ్దాల ముందు రచించబడ్డాయి. అవి కూడా ప్రాచీన అగ్నివేశ, సుశృత సంహితల ఆధారంగానే వెలువడి ఉంటాయి.

చరక, సుశృత సంహితల ఆధారంగా మనకు ఆయుర్వేదంపై అవగాహన ఉంది. అయితే ఆయుర్వేద వ్యవస్థకు పూర్వపు మూలం ఖచ్చితంగా ఉంది. ఆ మూల వ్యవస్థ అవశేషాలు మలి వైదిక సాహిత్యంలో లభిస్తాయి. అందులో అసంఖ్యాక రోగాల నామాలే కాకుండా నిర్ధారిత వైద్య సలహాలు కూడా ఉన్నాయి. అందులో రోగాలకు గల సహజ, అసహజ కారణాలను కూడా గుర్తించారు. రజసనేయి, తైత్రియ, మైత్రాయని సంహితలు అందుకు ఆధారాలు, రోగాలను నయం చేయడానికి మొక్కలు, లోహాలు, సూర్యకాంతి, జంతు పదార్థాలను వివిధ స్థాయిలలో సూచించారు. అయితే ఈ పరిజ్ఞానం యొక్క వ్యవస్థీకరణ, దాని తదుపరి అభివృద్ధి కేవలం ఆయుర్వేద సంహితల కాలంలోనే సాధ్యమైంది. ఈ రెండు సంహితలు వైద్య విజ్ఞానానికి సంబంధించిన ఎనిమిది శాఖలను సూచించాయి. ఈ రెండు సంహితల మధ్యమౌలిక తేడా

ఏమిటంటే చరక ప్రధానంగా రోగాలను నయం చేయడానికి ఔషధాలను సూచిస్తుంది. మరోవైపు సుశృత ప్రాథమికంగా శస్త్రచికిత్సకు సంబంధించినది. ఈ రెండు సంహితలు ఆయుర్వేద వ్యవస్థకు మూలాధారాలు. సహజ వనరులను సాధ్యమైనంత ఎక్కువగా వినియోగించాలని, అవి ఉమ్మడిగా పిలుపునిస్తాయి. అలాగే దేహం, ఆత్మ, మెదడు, శాశ్వత విశ్వం మధ్య నిజమైన సంబంధాన్ని ప్రతిపాదిస్తాయి.

**గుప్త-గుప్త అనంతర కాలం :**

ఈ కాలంలో భాషకు సంబంధించిన అత్యంత గమనార్హమైన విషయం సంస్కృతం యొక్క ఆధిపత్యం. ఆ ప్రక్రియ అంతకు ముందే ప్రారంభమైంది. ఈ కాలంలో బ్రాహ్మణులకు రాచరిక పోషణ గణనీయంగా పెరిగింది. పోషణను భూకేటాయింపుల రూపంలో కొనసాగించారు. అప్పటికి చాలా వరకు అధికారిక నివేదికలుగా మారిన శాసనాలలో ప్రాకృతం నుండి సంస్కృత భాషకు పరివర్తనం పరిపూర్ణంగా జరిగింది. వివిధ ప్రాంతాలలో ఆది ప్రాంతీయ భాషలు ఆవిర్భవించే వరకు సంస్కృత ఆధిపత్యం నిరాఘాటకంగా కొనసాగింది. ఆ కాలపు సామాజిక చరిత్ర దృష్టికోణం నుండి చూస్తే ఈ మార్పు అత్యంత ప్రధానమైనదని చెప్పడం ఇక్కడ అనవసరం.

ఆ కాలంలో వెలువడ్డ మహోన్నత లౌకికవాద సాహిత్యాన్ని పరిగణనలోకి తీసుకుంటే ఒక స్థాయిలో సంస్కృతం యొక్క విజయం స్పష్టమవుతుంది. ఆ కాలపు పురాణాలు, విశాలంగా ఉన్న రాచరిక ప్రశస్తిలు ఆస్థానం చుట్టూ సాహిత్య ప్రక్రియ పుంజుకుందని సూచిస్తాయి. రాచరికంతో ఈ అనుబంధం కారణంగా సృజనాత్మక సాహిత్య రూపాలైన కవిత్వం, నాటకం మొదలైనవి ఎంతో లాభపడ్డాయి. ప్రధాన రీతులు లేదా సాహిత్య శైలులు అభివృద్ధి చెందడం మొదలుపెట్టాయి. ఈ సమయానికి వివిధ రకాల కొలతల (మీటర్లు) వినియోగం సాధారణంగా మారింది. తన బృహత్ సంహితలో వరాహమిహిర సుమారు 60 రకాల కొలతలను వివరించాడు.

మరోస్థాయిలో సంస్కృతం అప్పటి వరకు ఏ రూపంలేని సాహిత్యానికి ప్రామాణిక రూపం ఇవ్వడానికి ప్రధాన సాధనంగా మారింది. పురాణాలే అందుకు చక్కటి నిదర్శనం. పురాణాల మూలకేంద్రం అంతకుముందే ఖచ్చితంగా ఉంది. అలాగే దాని ఐదు లక్షణాలు. అయితే వాటికి ప్రస్తుతం ఉన్న స్వరూపం ఖచ్చితంగాలేదు. వాటిలో అనేక అంశాలు ఉండేవి. వాటిని ఈ కాలంలోనే సంకలించారు. ఈ ప్రక్రియ జానపద కథలు, లోకోక్తుల సంస్కృతీకరణలో కూడా కనిపిస్తుంది. అందుకు మూల పంచతంత్ర సమకాలీన నిదర్శనంగా కనిపిస్తుంది.

అధికార భాషగా సంస్కృతం దక్షిణాదిలో లోతుగా చొచ్చుకుపోయింది. వాస్తవానికి అది ఆగ్నేయ ఆసియా దేశాలకు కూడా విస్తరించింది. అయితే స్థానిక పోషణ వల్ల తమిళం యొక్క ఘనమైన సాహిత్య వారసత్వం మరింత సంపన్నమైంది. ఈ కాలంలో రెండు మహాగ్రంథాలు వెలువడ్డాయని నమ్ముతారు. వాటిలో ప్రముఖమైనది ఇలంగో వడిగల్ రచించిన

"శిలప్పదికరం". బ్రాహ్మణత్వం, దాని విలువలు తమిళ సమాజంలో చాలా వరకు చొచ్చుకుపోయాయని ఈ గ్రంథం వెల్లడిస్తుంది. అయితే నిర్మాణపరంగా ఈ గ్రంథం భిన్నమైనది. ఉన్నత, జానపద సాంప్రదాయాల కలయికను సమర్పిస్తుంది. ఇలాంటి కలయిక ఉత్తర భారత మహాగ్రంథాలలో పూర్తిగా లోపించినట్లు కనబడుతుంది.

ఈ కాలానికి చెందిన అనేక మంది శాస్త్రీయ విద్వాంసులు తమ పూర్వీకుల కృషిని ప్రస్తావించారు. తమ ఆలోచనా విధానంలో ప్రాచీన దేశీయ ప్రభావాలతోపాటు. బహు లక్షణ ప్రభావాలు కూడా ఉన్నాయని వారు ఆ విధంగా సూచించారు. ఉదాహరణకు తన "పంచసిద్ధాంతిక" గ్రంథంలో వరాహమిహిర ఐదు ప్రాచీన సిద్ధాంతాలను పేర్కొన్నారు. అందులో రోమక, పౌలీస సిద్ధాంతాలు గ్రీకు ప్రపంచం నుండి గ్రహించబడ్డాయని నమ్ముతారు. అలాగే రసవిద్య (లోహం నుండి స్వర్ణాన్ని తయారు చేసే ప్రక్రియ) కూడా దక్షిణ చైనాతో సంబంధాల కారణంగా భారతదేశంలో ప్రవేశించింది. తదుపరి కాలంలో అది తాంత్రిక ఆచారాలతో క్రమంగా ముడిపడిపోయింది. పాదరసం, గారకానికి స్త్రీ, పురుష లక్షణాలను ఆపాదించడం భారత్, చైనాలలో సర్వసాధారణంగా కనిపిస్తుంది.

అయితే దేశీయ శాస్త్రీయ ఆలోచన ఈ కాలంలో అత్యంత సృజనాత్మక దశకు చేరుకుంది. వేద కాలం నుండి అది ఆచరణాత్మక అవసరాల నుండి పుట్టుకొస్తూ ఉండేది. కాని ఈ కాలంలో ఒక సుస్థిరతను, సృజనాత్మక లక్షణాన్ని సంతరించుకుంది. ఆర్యభట్ట అందుకు తగిన ఉదాహరణ. అతడు ఎన్నో సిద్ధాంత దీపికలను రచించాడు. కొన్ని తాత్విక వ్యవస్థలు కూడా శాస్త్ర విద్య వైపు మొగ్గు చూపాయి. న్యాయ–వైశేషిక వ్యవస్థ దేశ నిర్మాణ ప్రక్రియను వివరించింది. పరమాణువులు (ద్వ్యానుకు,త్ర్యానుక)తో స్థూల దేహాలు నిర్మితమవుతాయని పేర్కొంది. సమకాలీన శాస్త్రీయ పరిశోధనల వల్ల "చోదకం" అనే భావన విస్తృత అర్థాన్ని సంతరించుకుంది.

భారత శాస్త్ర విజ్ఞానానికి గుర్తింపు చాలా త్వరగానే లభించింది. అనేక శాస్త్ర గ్రంథాలు అరబిక్‌లో అనువాదం కావడంతో అవి అరబ్ ప్రపంచానికే కాకుండా పాశ్చాత్య దేశాలకు కూడా విస్తరించాయి. ఇక్కడ ఒక విషయాన్ని గుర్తుంచుకోవాలి. భారతదేశంలో శాస్త్రీయ పరిశోధన స్ఫూర్తి స్థూలంగా ఎలాంటి వ్యతిరేకత ఎదుర్కోకుండా ముందుకు సాగలేదు. ఆర్యభట్ట సాధించిన కొన్ని గొప్ప ఆవిష్కరణలను తిరస్కరించారు. చివరకు వరాహమిహిర, బ్రాహ్మగుప్త లాంటి గొప్ప వారసులు కూడా ఆర్యభట్ట సిద్ధాంతాలను ఖండించారు.

## ప్రాచీన భారత మత సాహిత్యం :

### వైదిక సాహిత్యం :

**కూర్పు :** వేద' అనే పదం 'విద్' అనేక మూల పదం నుండి గ్రహించబడింది. విద్ అంటే 'తెలుసుకోవడం' అని అర్థం. పవిత్ర జ్ఞానం లేదా దైవిక ప్రబోధనం (శృతి) గా నిర్ధారించిన సాహిత్య శాఖకు ఆ పదం వర్తిస్తుంది. 'శృతి' గీతాలను అనేక మంది రుషులు రూపొందించి

నప్పటికీ పురాణం ప్రకారం ఈ గీతాలు కేవలం దివ్యవాణి ద్వారా రుషులకు అందాయే తప్ప వారే స్వయంగా రూపొందించినవి కావు. కనక వేదాలను అపురుషేయ (మనిషి రూపొందించినవి కావు), నిత్య (నిరంతర మనుగడ) అని పిలిచారు. మరోవైపు రుషులను 'మంత్రద్రష్ట' అని నిర్ధారించారు. అంటే సర్వోన్నతుడైన సృష్టికర్త నుండి మంత్రను స్వీకరించిన వారని అర్థం. వేద సాహిత్యంలో రెండు భాగాలున్నాయి. ఒకటి సంహితాలు, రెండవది బ్రాహ్మణాలు. బ్రాహ్మణాలను మరలా మూడు భాగాలుగా విభజించారు? స్వచ్ఛమైన, సాత్వికమైన బ్రాహ్మణాలు, అరణ్యకాలు, చివరగా ఉపనిషద్‌లు.

**సంహితాలు :** వివిధ దైవాలను కీర్తిస్తూ ఆలపించే భక్తిగీతాల సంపుటాలనే సంహితాలని పిలుస్తారు. వేద సాహిత్యంలో అవి అత్యంత ముఖ్యమైన భాగంగా ఉన్నాయి. సంహితాల సంఖ్య నాలుగు. అవి రుగ్వేద, సామవేద, యజుర్వేద, అధర్వవేద. రుగ్వేదంలో 1017 సూక్తులు ఉన్నాయి. అలాగే మరో 11 వలఖిల్యాలు ఉన్నాయి. అది 10 గ్రంథాలు లేదా మండలాలుగా విభజించబడి ఉంది. రెండు నుండి ఏడవ మండలాలలో అత్యంత ప్రాచీనమైన సూక్తులు (భక్తి గీతాలు) ఉన్నాయి. వీటిని "కుటుంబ గ్రంథాలు" అని కూడా పిలుస్తారు ఎందుకంటే గ్రిష్టమాడ, విశ్వామిత్ర, వామదేవ, అత్రి, భరద్వాజ, వశిష్ట లాంటి రుషుల కుటుంబాలు వాటిని రూపొందించాయి. ఒకటి, పదవ మండలాలలో కొత్త సూక్తులు ఉన్నాయి. సంహితాలలో రుగ్వేద అతి ప్రాచీనమైనది, అలాగే ముఖ్యమైనది. విభిన్న కాలాలకు చెందిన పురోహిత కవులు వాటి సూక్తులను రూపొందించారు. అది పూర్తిగా మతపరమైన కృతి. గీతాలు చాలా వరకు దైవాలను కీర్తించడానికే రచించబడ్డాయి. ఒక కళాకృతిగా దానికి ప్రపంచ సాహిత్యంలో ప్రముఖ స్థానం దక్కాలి. మూడవ మండలంలో ప్రసిద్ధమైన గాయత్రి మంత్రం ఉంది. సావిత్రిని కీర్తించడానికి ఆ మంత్రాన్ని జపిస్తారు. ఈ మండలాన్ని విశ్వామిత్రుడు రూపొందించాడు. సామవేదంలో 1810 లేదా 1549 భక్తిగీతాలు ఉన్నాయి. రుగ్వేదంలోని ఎనిమిది, తొమ్మిది మండలాలకు చెందిన కొన్నిగీతాలు ఇందులో కనిపించడం వల్లే సంఖ్యలో కొన్ని మార్పులు చేయాల్సి వచ్చింది. సోమ బలిదానం వద్ద ఉద్గాత్రి పురోహితులు సామవేద గీతాలను పఠిస్తారు. మంత్రాలకు తగిన విధంగా సంగీతాన్ని రూపొందించారు. కనక భారతీయ సంగీత మూలాలను సామవేదంలో అన్వేషించారు.

యజుర్వేదంలో వివిధ మంత్రాలు ఉన్నాయి. బలిదానం సమయంలో వాటిని నియమనిబంధనలకు అనుగుణంగా జపిస్తారు. మౌలికంగా వాటిని అధర్వ్యు పురోహితుడు కర్మకాండలో మానవ శ్రమ భాగంగా పఠిస్తారు. రాజసూయ, వాజపేయి అనే రెండు రాచరిక ఉత్సవాలను ఈ వేదంలో తొలిసారి ప్రస్తావించారు. తొలి రెండు వేదాలు వచనా రూపంలో ఉంటే ఈ వేదంలో వచన, వాచకం రెండూ కనిపిస్తాయి. దీనిని రెండు భాగాలుగా విభజించారు. ఒకటి కృష్ణ యజుర్‌వేద, మరొకటి శుక్ల యజుర్‌వేద. కృష్ణయజుర్‌వేద ప్రాచీనమైనది. అందులో మంత్రాలే కాకుండా వాచక రూపంలో వ్యాఖ్యానాలు కూడా ఉన్నాయి. శుక్ల యజుర్‌వేదలో కేవలం మంత్రాలే ఉన్నాయి. కృష్ణలో నాలుగు సంహితాలు – కథక, కపిష్ఠల కథ, మైత్రాయని, తైత్రియ – ఉండగా శుక్లలో కేవలం వజసనేయి సంహిత మాత్రమే ఉంది.

అధర్వవేదం (మంత్ర శక్తుల పరిజ్ఞానం)లో వచనా శైలిలో మంత్రతంత్రాలు ఉన్నాయి. దుష్టశక్తులను, వ్యాధులను పారద్రోలడానికి వాటిని జపిస్తారు. అది యోధుల వర్గంతో దగ్గరగా ముడిపడి ఉండేది. అందులో రెండు మంత్రాలు యుద్ధభేరికి అంకితమై ఉన్నాయి. ఆర్యేతరుల కృతిగా భావిస్తున్న అధర్వ వేదంలో ఆర్యేతరుల విశ్వాసాలు, ఆచారాల గురించి తగిన సమాచారం ఉంది. అది రెండు భాగాలుగా విభజించబడి ఉంది. ఒకటి పైప్పలడ, మరొకటి సౌనక. పైప్పలడ గురించి పూర్తి సమాచారం లేదు. సౌనకలో 731 (లేదా 760) మంత్రాలు ఉన్నాయి. అవి 20 వేర్వేరు గ్రంథాలలో విస్తరించి ఉన్నాయి.

**బ్రాహ్మణాలు :** వేదాలలో రెండో గొప్ప వర్గానికి చెందిన బ్రాహ్మణాలు పూజ, బలిదాన, ఉత్సవానికి సంబంధించినవి. ఇందులోని విషయాలు కర్మకాండ యుతమైనవి. దాని భాష వాచక రూపంలో ఉంది. క్లుప్తంగా చెప్పాలంటే అవి బలిదాన శాస్త్రంతో ముడిపడి ఉన్నాయి. ప్రముఖ బ్రాహ్మణాలలో (1) ఐత్రేయ, (2) కౌసితకి, (3) తాండ్యమహా, (4) జైమినియ, (5) తైత్రియ, (6) సతపథ, (7) గోపథ బ్రాహ్మణాలు ఉన్నాయి. ఐత్రేయ, కౌసీతకి బ్రాహ్మణాలకు రుగ్వేదతో సంబంధం ఉంది. తాండ్యమహా, జైమినియ బ్రాహ్మణాలు సామవేదంతో, తైత్రియ, సతపథ బ్రాహ్మణాలు యజుర్వేదంతో, గోపథ బ్రాహ్మణ అధర్వవేదంతో ముడిపడి ఉన్నాయి. తాండ్యమహా బ్రాహ్మణ అత్యంత పురాతనమైనది. అందులో అనేక లోకోక్తులు ఉన్నాయి. ఆర్యేతర ప్రజలను ఆర్య సమాజంలో చేర్చుకునే వ్రత్యస్తోమ ఉత్సవం అందులో ఉంది. అయితే అన్నిటి కంటే ముఖ్యమైన, సుదీర్ఘమైన బ్రాహ్మణ మాత్రం సపపధ బ్రాహ్మణే. అది కేవలం బలిదానాలు, ఉత్సవాల గురించి సమాచారాన్నే కాకుండా మతశాస్త్రం, తత్త్వశాస్త్రం, మలివైదిక కాలం నాటి ఆచార వ్యవహారాల గురించి మనకు తెలియజేస్తుంది. రుగ్వేద బ్రాహ్మణాలను హోత్రి ప్రసన్నం చేయడానికి వినియోగిస్తారు. యజుర్వేద బ్రాహ్మణాలను అధర్వ్యు పురోహితులుకు, సామవేద బ్రాహ్మణాలను ఉద్గాత్రికి ఉపయోగిస్తారు.

**అరణ్యకాలు :** ఈ వన కృతులు సన్యాసవాదం, బలిదాన ప్రతీకాత్మకత, పురోహిత తత్త్వశాస్త్రాన్ని బోధిస్తాయి. సంహితాలు బ్రాహ్మణాల కల్పితవాదం, కర్మకాండ ఒక వైపు, ఉపనిషద్‌ల తాత్విక ఊహాగానాలు మరోవైపు ఉంటే వాటి మధ్యగల పరివర్తన విషయాలను అరణ్యకాలు కలిగి ఉన్నాయి. కర్మకాండకు ప్రతీకాత్మక అర్థాన్ని ఇస్తారు. ఈ అర్థం యొక్క జ్ఞానం ఆ కర్మకాండ నిర్వహణ కంటే ముఖ్యమైనదిగా మారుతుంది. ఈ సూత్రం తదుపరి ఉపనిషత్తు ఊహాగానానికి నాంది వాచకంగా మారుతుంది. ఐత్రేయ, కౌసీతకి అరణ్యకాలు రుగ్వేదతో ముడిపడి ఉన్నాయి. కౌసీతకి అరణ్యక ప్రాణాగ్నిహోత్రను ప్రబోధిస్తుంది. మౌలిక కర్మకాండ స్థానంలో దానిని వినియోగిస్తారు. బ్రాహ్మణాల నుండి ఉపనిషద్‌లకు పరివర్తనలో ఈ నిగూఢ, మానసిక సమర్పణ (సాంప్రదాయ, బహిర్గత బలిదానం స్థానంలో) ముఖ్యమైన అంశంగా ఉంది.

**ఉపనిషత్తులు :** ఇవి తాత్వికగ్రంథాలు. సర్వజనీన ఆత్మ, సర్వేశ్వరుడు, వ్యక్తిగత జీవితం, ప్రపంచ మూలాలు, ప్రకృతి రహస్యాలు తదితర అంశాలను అవి వివరిస్తాయి. వైదిక కాలంలో భారతీయ ఆలోచనా విధాన సమ్మేళనాన్ని అవి సూచిస్తాయి. కర్మకాండలను

అవి విమర్శిస్తాయి. నిజమైన విశ్వాసం, జ్ఞానం గురించినొక్కి చెబుతాయి. అనేక ఉపనిషత్తులలో కేవలం 12 మాత్రమే ముఖ్యమైనవి. అవి (1) ఐత్రేయ, (2) కౌసీతకి, (3) చందోగ్య, (4) కేనా, (5) తైత్రియ, (6) కథ, (7) శ్వేతస్వతర, (8) బృహదారణ్యక, (9) ఇసా,(10) ముండక, (11) ప్రశ్న, (12)మండూక్య, (1,2 రుగ్వేదకు, 3,4 సామవేదకు, 5-9 యజుర్‌వేదకు చివరగా 10-12 అథర్వవేదకు చెందుతాయి)

**వేదాంగాలు- సూత్ర సాహిత్యం :** మొత్తం కలిపి ఆరు వేదాంగాలు ఉన్నాయి. అవి (1) శిక్ష, (2) కల్ప, (3) వ్యాకరణ (4) నిరుక్త (5) చందస్ (6) జ్యోతిష. మౌలిక వేద సాహిత్యానికి భిన్నంగా వేదాంగాలను 'స్మృతి' అంటారు. మానవ మూలాలు గల ఈ విజ్ఞానాన్ని సాంప్రదాయబద్ధంగా ఒక తరం నుండి మరో తరానికి వారసత్వంగా లభించిన కారణంగానే వాటిని స్మృతులు అని పిలిచారు. వేదాంగాలను సూత్రాల రూపంలో రచించారు. అంటే ఘనీకృత వాచక శైలిలో వాటిని రచించారు. ఆ విధంగా వాటిని కంఠస్తబద్ధంగా తీర్చిదిద్దారు. సూత్ర సాహిత్యం మూలవేద సాహిత్యంలో అంతర్భాగంగా లేనప్పటికీ వేద సాహిత్య అధ్యయనంలో అవి మనకు సహాయపడతాయి. అన్ని సూత్ర గ్రంథాలలో కేవలం కల్ప సూత్రాలే మన చేతికి దక్కాయి. వాటిని మరలా మూడు వర్గాలుగా విభజించారు : (1) స్రౌత సూత్రాలు, (2) గృహ్యసూత్రాలు, (3) ధర్మసూత్రాలు. స్రౌత సూత్రాలు అగ్ని, సోమ, జంతువు లాంటి మహాబలుల కర్మకాండలను వివరిస్తాయి. గృహ్య సూత్రాలు గృహస్త ఉత్సవాలు, బలిదానాలను పేర్కొంటాయి. ధర్మ సూత్రాలు చట్టాలు, ప్రజల సాధారణ ఆచార వ్యవహారాలను నిర్ధారిస్తాయి. ధర్మశాస్త్రాలపైనే చరిత్రకారులు ఎక్కువ దృష్టి సారించారు. ఎందుకంటే అవి మనుధర్మ లాంటి ధర్మశాస్త్రాలకు పునాదిని కలిగి ఉన్నాయి. స్రౌత సూత్రాలకు అనుబంధంగా సుల్వ సూత్రాలు ఉన్నాయి. భారత జ్యామిత్రి శాస్త్రంపై అత్యంత ప్రాచీనమైన కృతులు సుల్వ సూత్రాలే. వాటిలో కొలతలు, సంక్లిష్టమైన వైదిక అగ్నిహోమాల నిర్మాణానికి సంబంధించిన సూచనలు ఉన్నాయి.

## బ్రాహ్మణిక సాహిత్యం :

**ఇతిహాసాలు :** పురాణాల ప్రకారం రామాయణం సుమారు క్రీ.పూ. 500 సంవత్సరాల ప్రాంతంలో రచించబడింది. ఈ మహాగ్రంథం తొలి రచనను వాల్మీకి పూర్తి చేసినట్లు చెబుతారు. దానికి ప్రస్తుతం ఉన్నస్వరూపం రెండు లేదా మూడు శతాబ్దాల తర్వాత ఏర్పడింది. అయితే నేడు రామాయణంపై భిన్నకథనాలు గల కృతులు చెలామణిలో ఉన్నాయి. రామాయణలోని ఏడు కాండలలో తొలి మరియు చివరి కాండలు తాజావి. తొలి కాండ ప్రకారం రామ విష్ణు అవతారం. అయితే అందులోని చాలా కథలు అత్యంత పురాతనమైనవి. అందులో మగధ, కోసల రాజ్యాలలో ఆవిర్భవించిన కొన్ని కథలు కూడా ఉన్నాయి.

తొలుత 'జయ సంహిత'గా పిలవబడిన మహాభారతంలో హరివంశం, భగవద్గీత కూడా అంతర్భాగంగా ఉన్నాయి. మహాభారతాన్ని కృష్ణ ద్వైపాయన (వ్యాసుడు) రచించినట్లు సాంప్రదాయబద్దంగా చెబుతూ వచ్చారు. అనేక శతాబ్దాల తరబడి దానిని రచించారు. మూడు లేదా రెండవ శతాబ్దం (క్రీ.పూ) నాటికి అది పూర్తయి ఉండొచ్చు. అయితే భగవద్గీత, తదితర

వర్ణనలు తదుపరి కాలానికి చెందినవి. మహాభారతంలో వర్ణించబడిన కురుక్షేత్రానికి క్రీ.పూ. తొమ్మిదవ శతాబ్దంలో ఉత్తర భారతదేశంలో జరిగిన యుద్ధం తాలూకు జ్ఞాపకాలలో చారిత్రక ఆధారం ఉండవచ్చు. మహాభారతంలో మొత్తం 18 గ్రంథాలు లేదా పర్వాలు ఉన్నాయి. హరివంశ మహాభారతంకు విషయ నివృత్తిగా ఉంది. అందులో మూడు భాగాలు ఉన్నాయి. అది యాదవుల ఆవిర్భావం, వంశజాబితాతోపాటు కృష్ణుని ప్రేమ వ్యవహారాలు, సాహసాలు, కల్పనలను వివరిస్తాయి. హరివంశం మహాభారతంలో అంతర్భాగమని చెబుతున్నా అది తదుపరి కాలానికి చెందినది. శైలిలో అది పురాణాలను పోలి ఉంది. గీత కృష్ణుని ఆలోచనలు, సిద్ధాంతాలను సమర్పిస్తుంది. పురోహిత బలిదానకర్తలకు కానుకలు సమర్పించడం కంటే సరైన నడవడికను కలిగి ఉండడమే ఉత్తమమని అతడు ప్రకటించాడు.

**పురాణాలు :** సాంప్రదాయపరంగా పురాణాలు ఐదు అంశాలను ప్రబోధిస్తాయి : ప్రపంచ సృష్టి, దాని వినాశనం, పునఃనిర్మాణం, దేవతలు, మహాపురుషుల వంశ చరిత్రలు, వివిధ ప్రపంచ కాలాలలో మను రాజ్యాలు(మన్వంతరాలు),సూర్య, చంద్ర వంశీయుల చరిత్ర. మొత్తం 18 పురాణాలలో ఏ ఒక్కటి గుప్తుల కాలం కంటే ముందు రచించబడలేదు. అయితే వాటిలోని జానపద కథలు మాత్రం ప్రాచీనమైనవి. 18 పురాణాలు ఈ విధంగా ఉన్నాయి : విష్ణు, అగ్ని, భవిష్య, భాగవత, నారదీయ, గరుడ, పద్మ, వరాహ, మత్స్య, కూర్మ, లింగ, శివ, స్కంధ, బ్రహ్మ, బ్రహ్మానంద, బ్రహ్మవైవర్త, మార్కండేయ, వామన. కొన్ని జాబితాలలో అగ్ని పురాణ స్థానంలో వాయు పురాణను ప్రవేశపెట్టారు. మరికొన్ని వాటిలో శివపురాణం స్థానంలో వాయు పురాణాన్ని చేర్చారు. వాయు పురాణం బహుశా అన్నిటికంటే పురాతనమైనది. కొన్ని క్రీ.శ.15 లేదా 16 శతాబ్దాలలో కూడా రూపొందించబడ్డాయి. అయితే అన్నిపురాణాలు కాలక్రమంలో సవరణలకు గురయ్యాయి. నిరక్షరాస్యులు, ముఖ్యంగా మహిళలకు, ఉపనిషద్ బోధనలను అందించడంలో పురాణాలు చాలా సహకరించాయి.

**ధర్మశాస్త్రాలు లేదా స్మృతులు :** వీటి విషయాలలో ధర్మానికి సంబంధించిన ఆధారాలు ఉన్నాయి. నాలుగు వర్ణాలు, ఆశ్రమాల విధులు, మానవుని వివిధ సంస్కారాలు, జీవితంలో నాలుగు వర్ణాల ప్రభావాలు, పాలకుని విధులు, బాధ్యతలు, పన్నునియమాలు, యాజమాన్యం, సంరక్షణ, సాక్షులు, వడ్డీ వ్యాపారం, రుణాలు, జమల చెల్లింపు,వివిధ నేరాలకు శిక్షలు, ఆస్తి విభజన – వారసత్వం, జన్మకు సంబంధించిన మలినాలు, మరణం, ఇతర కారణాలు, వివిధ రకాల శ్రాద్ధాలు, ఆహార నియమాలు, మహిళల విధులు, వారి ఆస్తి, నియోగ–దాని పరిస్థితులు (షరతులు), పాపాలు–విముక్తి మార్గాలు, ప్రాయశ్చితం – సంబంధిత షరతులు ధర్మశాస్త్రాల కిందికి వస్తాయి. స్మృతులు ఈ అంశాలను వ్యవస్థీకృతంగా, విశ్లేషణాత్మకంగా వివరిస్తాయి. మూడు పద్దుల కింద ఈ అంశాలను విశ్లేషించారు. ఆచార, వ్యవహార, ప్రాయశ్చిత్తం, ముఖ్య స్మృతులు ఈ కింది విధంగా ఉన్నాయి.

మనుస్మృతి అత్యంత ప్రాచీనమైనది, అధికారయుతమైనది. అందులో 12 అధ్యాయాలు ఉన్నాయి. ఆచార, వ్యవహార, ప్రాయశ్చిత్తాలను అవి వివరిస్తాయి. తర్వాతి

స్మృతులన్నింటికీ అది ఆదర్శంగా నిలిచిందని భావిస్తారు. మేధతిథి, గోవిందరాజ, కల్లూక భట్ట లాంటి ఉద్ధండుల వ్యాఖ్యానాలు అందులో ఉన్నాయి. ప్రాధాన్యతపరంగా తదుపరి స్థానంలో యాజ్ఞవాల్క్య స్మృతి నిలుస్తుంది. అందులో ఆచార, వ్యవహార, ప్రాయశ్చిత్తాలపై మూడు కాండలు ఉన్నాయి. అనేక అంశాలపై అది మనుస్మృతితో ఏకీభవిస్తుంది. అయితే నియోగ, వారసత్వం, జూదం లాంటి కొన్ని అంశాలపై విభేదిస్తుంది. బాలక్రీడ, అపరార్క, మితక్సార లాంటి కొన్ని విలువైన వ్యాఖ్యానాలు అందులో ఉన్నాయి. వాటిలోమితక్సార అత్యంత విమర్శనాత్మకమైనది, అధికార యుతమైనది.

పరాశర స్మృతి ఆధునిక ఆలోచనలకు ప్రసిద్ధి గాంచింది. కలియుగానికి అది బాగా వర్తిస్తుందని భావిస్తారు. అది ఆచార, ప్రాయశ్చిత్తాలపైనే వ్యాఖ్యానిస్తుంది. నాలుగు కులాల ఆపద్ధర్మను అది ప్రస్తావించింది. బ్రాహ్మణ, మొదలైన కులాలకు వ్యవసాయం, వ్యాపారం, వాణిజ్యాలను సూచించింది. దానిపై మాధవాచార్య చేసిన వ్యాఖ్యానం అత్యంత జనప్రియమైనది. రాజధర్మ కింద వ్యవహారశైలిని వివరిస్తుంది. నారదస్మృతి రెండు విశ్రామాలలో లభిస్తుంది. అది కేవలం వ్యవహారాలను మాత్రమే బోధిస్తుంది. మనుస్మృతిని అది చాలా వరకు అనుసరిస్తుంది. కాని 18 చట్టాలలో కొన్ని సవరణలను ప్రవేశపెట్టింది. నియోగ, పునః వివాహం (మహిళలకు) కొన్ని పరిమితుల కింద జూదాన్ని అనుమతించింది.

బృహస్పతి స్మృతిలో ఏడు భాగాలున్నాయి. ఆచార, వ్యవహార, ప్రాయశ్చిత్తాలపై అందులో వివరణ ఉంది. అది దాదాపు మనుస్మృతినే అనుసరించింది. అందుకే దానిని మనుస్మృతి యొక్క అదనపు భాగంగా (పరిశిష్ట) గుర్తిస్తారు. కాత్యాయన స్మృతి మను, బృహస్పతి, నారదలను దగ్గరగా పోలి ఉంది. స్త్రీధనం గురించి వివరించింది. ఇతర స్మృతులలో అంగిరస, దక్ష, పితామహ, ప్రజాపతి, మరిషి, యమ, విశ్వామిత్ర, వ్యాస, సంగ్రహక, సమవర్త చెప్పుకోదగ్గవి.

**బౌద్ధసాహిత్యం :**

**పాలి పవిత్ర గ్రంథాలు :** బౌద్ధ పవిత్ర చట్టాల సాహిత్యాన్ని రెండు పెద్ద వర్గాలుగా విభజించవచ్చు. ఒకటి హీనయాన మతచట్టం. దీనిని ప్రధానంగా పాలి భాషలో రచించారు. అందుకే దానిని పాలి మత చట్టమని పిలుస్తారు.రెండవది మహాయాన మత చట్టం. దీనిని ప్రధానంగా సంస్కృతంలో రచించారు. చైనా, జపాను, టిబెట్, తదితర మంగోలు భాషలలో విస్తారంగా అనువదించారు. పాలి పవిత్ర చట్ట గ్రంథాలలో త్రిపీటక అనే మూడు భాగాల ఉమ్మడి సంకలనం ఉంది. వాటిని క్రీ.పూ. 350–90 మధ్య రాతపూర్వకంగా రూపొందించారు. తొలి భాగమైన 'వినయపీటక' (క్రీ.పూ. 350)లో పతిమొఖ్ఖ (పతిమోక్ష) లేదా భిక్షువులకు మత క్రమశిక్షణ నియమాలు ఉన్నాయి. అలాగే నియమాలపై ఒక వ్యాఖ్యానం కూడా ఉంది. వినయపీటకకు తోడు మహావాగ్గ మతవ్యవస్థలో ప్రవేశానికి కొన్ని నియమాలను నిర్ధారించింది. వర్షాకాలంలో పాటించాల్సిన జీవన విధానాన్ని, వస్త్రధారణపై ఆంక్షలను, వ్యక్తిగత పరిశుభ్రత తదితర అంశాలను సూచించింది. చుల్లవాగ్గ (చిన్న భాగం)లో పవిత్ర బౌద్ధ కథలు, భిక్షువులు,

సన్యాసినుల విధులు, వివాద పరిష్కారాలు, పశ్చాత్తాపం, పాప పరిహారం లాంటి అంశాలు ఉన్నాయి.

సూత్త పీటక(క్రీ.పూ.300)లో ఐదు నికాయలు లేదా ప్రబోధనలు ఉన్నాయి. అవి (1) దిఘనికాయ (2) మజ్జిమ నికాయ (3) సంయుత్త నికాయ (4) అంగుత్తర నికాయ (ఏకోత్తర నికాయ) (5) ఖుద్దక నికాయలు. దిఘనికాయలో విశ్వజననం, పునర్జన్మ, సన్యాసత్వం, అద్భుతాలు, నిర్వాణ, మతధిక్కారం, కుల దూషణ, బుద్ధుని చివరి ప్రవచనాలు, అతడి మరణం, అంత్యక్రియలు లాంటి అంశాలు ఉన్నాయి. మజ్జిమ నికాయలో బుద్ధునికి జైనులు, ఇతర మత వ్యవస్థలతో ఉన్న సంబంధాన్ని, వివిధ సన్యాస రూపాలను, చోరీ, దోపిడీ, వివాహేతర సంబంధం తదితర నేరాలకు శిక్షలను వివరించారు. సంయుత్త నికాయలో బౌద్ధ సిద్ధాంతాన్ని చర్చించారు. బౌద్ధుని ప్రవచనాలను వివిధ సాహిత్య, నృత్యరూపకాలలో రూపొందించి అందులో చేర్చారు. అంగుత్తరనికాయలో బుద్ధుని బోధనలను క్రమానుసారంగా సంకలించారు. ఖుద్దక నికాయలో బౌద్ధ ధర్మాన్ని అర్థం చేసుకోవడానికి అవసరమైన 15 చిన్న గ్రంథాల సంకలనం ఉంది.

ఖుద్దక నికాయలోని ప్రధాన కృతులను కొన్నిసార్లు పాలి పవిత్ర గ్రంథాలలో అత్యంత విస్తృతమైన కొన్ని గ్రంథాలలో చేరుస్తారు. అందులో ముఖ్యమైనవి ఇలా ఉన్నాయి. 'ఖుద్దక పథ' సంఘలో ప్రవేశించే యువతులకు సంబంధించినది. 'ధమ్మపద' అనేది బౌద్ధ చట్ట గ్రంథం. బుద్ధుని ప్రవచనాల ఆధారంగా రూపొందించిన సుమారు 400కు పైగా వచనాల సమాహారం అందులో ఉంది. 'ఉదన'లో బుద్ధుని ప్రసంగాలను వ్యాఖ్యాన పూరితంగా చేర్చారు. అందులో ఒక ప్రసిద్ధమైన జాతక కథ ఉంది. అది అంధులకు సంబంధించినది. ఒక అంధుల బృందం ఒక ఏనుగు శరీర భాగాలను స్పృశించి వేర్వేరు కథనాలను అందిస్తారు. మానవులు ఒక సత్యాన్ని అన్నికోణాల నుండి పరిశీలించవలసి ఉంటుందని, అందుకు వికలాంగులు కూడా అతీతులుకారని ఆ కథ సారాంశం. 'ఇతివృత్తక'లో ఉదనలో వలే 120 ప్రవచనాలు ఉన్నాయి. మానవ మనుగడకు సంబంధించిన లోతైన సమస్యలను అది చర్చిస్తుంది. 'సుత్తనిపత'లో ప్రాచీన బౌద్ధ కవిత్వాన్ని సంరక్షించారు. బౌద్ధ భారతంలోని సామాజిక, మతపరమైన పరిస్థితులపై అది విలువైన సమాచారాన్ని అందిస్తుంది. జాతకాలలో బుద్ధుని పూర్వ జన్మలకు సంబంధించిన కథలు ఉన్నాయి. ప్రపంచ సాహిత్యంలోనే అవి అత్యంత ప్రాచీనమైన జానపద కథలు. 'బౌద్ధ వంశ'లో గౌతమ బుద్ధునికి ముందు వచ్చిన 24 మంది బుద్ధుల చరిత్రను నమోదు చేశారు. థేరాగాథ, థేరిగాథలలో మతపరమైన ఉన్నత శైలి కవిత్వం ఉంది.

అభిధ్దమ్మ పీటకలో సుత్త పీటక లాంటి అంశాలే ఉన్నా వాటిని పరిశోధనాత్మకంగా తీర్చిదిద్దారు. అందులో అదనపు తాత్విక చర్చలు, ప్రబోధనలు ఉన్నాయి. మానసిక శిక్షణ, మనఃశాస్త్రం, పిడివాదాలపై అవి చర్చిస్తాయి. అందులోని ఏడు గ్రంథాలలో 'ధమ్మసంగని' బౌద్ధ తత్త్వశాస్త్రం, మనశ్శాస్త్రం. విలువలపై ఉన్నతమైన బోధనలను అందిస్తుంది. కథావత్తు లేదా విజ్ఞానపద (మొగ్గలిపుత్త తిస్సా) బౌద్ధ పిడివాద ఆవిర్భావంపై సరైన దృష్టికోణాన్ని అందిస్తుంది. కనక అది ఎంతో విలువైనది.

**పాలిచట్టేతర గ్రంథాలు :**

బౌద్ధ మత గ్రంథాల తదుపరి భాగాన్ని భారతీయ చరిత్రలోని బాక్ట్రియ గ్రీకు, కుషానుల కాలంలో రూపొందించారు. ఎందుకంటే ఈ విదేశీ పాలకులు మహాయాన మతస్వరూపాన్ని సమర్థించారు. అప్పటికి ఈ శాఖ అన్ని ప్రాంతాలలోనూ విస్తరిస్తూ ఉంది. ఈ కాలం నాటి కృతులలో మిలిందపన్హో (క్రీ.పూ. 130), మహావస్తు (క్రీ.పూ. 75), లలితవిస్తార (క్రీ.పూ. 30) సిలోన్‌కు చెందిన థేరవాద విచారధార రెండు ప్రధాన పాలకృతులను సంకలించింది. క్రీ.శ.350లో 'దీపవంశం' వెలువడింది. అశోకుని కుమారుడు మహింద (మహింద్ర) శ్రీలంకలో బౌద్ధ మతాన్ని ప్రవేశపెట్టిన తీరును అది వివరిస్తుంది. క్రీ.శ.550లో మహానామ అనే భిక్షువు 'మహావంశ'ను రచించాడు. శ్రీలంక ద్వీప చరిత్రను క్రీ.శ.350 వరకు అది వివరంగా చెబుతుంది.

**సంస్కృత గ్రంథాలు :** క్రీ.శ.రెండు నుండి ఆరవ శతాబ్దం వరకు ఉన్న కాలంలో ప్రాచీన మహాయాన కళాఖండాలు, గొప్ప అనువాదాలు వెలువడ్డాయి. మత గ్రంథాలను చర్చలు, సంభాషణల క్రమంలో సమర్పించారు. సూత్ర రూపంలో బుద్ధుడు చేసిన మతబోధనలను అందులో పొందుపరిచారు. వాటిని సాధారణంగా వైపుల్యసూత్రాలంటారు. వాటిని చైనీస్ భాషలో అనువదించారు. చైనీసు నుండి జపనీసు, టిబెటన్ భాషల్లోకి అనువదించారు. అనేక సూత్రాలు కేవలం ఈ గ్రంథాల్లోనే కనిపిస్తాయి. మూల సూత్రాలన్నీ కనుమరుగయ్యాయి. మహాయాన సిద్ధాంతాలను క్రోడీకరించే బాధ్యత నాగార్జున (క్రీ.శ. 100), అశ్వఘోష, అసంగ, వాసుబంధు సోదరులు (క్రీ.శ. 4వ శతాబ్దం) లాంటి విద్వాంసులపై పడింది.

కొన్ని ప్రధాన సూత్ర కృతులలో ప్రజ్ఞ పరామిత, సద్ధర్మ పుండరిక, అవతంశక సూత్ర, సుఖవతి వ్యూహ, వజ్రచ్ఛేదిక, మహాపరినిర్వాణ, లంకావతార, సురంగామలు ఉన్నాయి.

**జైన సాహిత్యం :**

జైనులు తమ మత ప్రచారం కోసం, తాము గ్రహించిన పవిత్ర జ్ఞానం భద్రపరచడం కోసం దేశంలోని వివిధ ప్రదేశాల్లో, వివిధ కాలాల్లో అక్కడ వాడుకలో ఉన్న భాషలనే ఉపయోగించారు. దేశంలో మొదటిసారిగా జైనులు వివిధ ప్రాంతీయ వాడుక భాషల్లో సాహిత్యాన్ని సృష్టించారు. మహావీరుడే స్వయంగా అర్ధమాగధ భాషలో తన బోధలు చేసేవాడు. మగధి లేదా సురసేని భాషలు తెలిసిన ప్రజలు మహావీరుని బోధనలు తేలికగా అర్థం చేసుకోగలిగేవారు. మహావీరుడి బోధనలన్నీ పన్నెండు గ్రంథాలుగా వర్గీకరించారు, అవన్నీ కూడా శృతంగాల పేరుతో అర్ధమాగధ భాషలోనే రాయబడ్డాయి. శ్వేతంబరుల పవిత్ర సాహిత్యమంతా ఆర్ష లేదా అర్ధమాగధ భాషలోనే ప్రాకృత లిపిలో భద్రపరిచారు. వాటిని పన్నెండు అంగాలు, పన్నెండు ఉపాంగాలు, పది ప్రకరణాలు, ఆరు ఛేద సూత్రాలు, నాలుగు మూల సూత్రాలు, రెండు ఇతర అంశాలుగా వర్గీకరించారు. అయితే ఆ పన్నెండు గ్రంథాలు జైన మత స్థాపకుని అధికారిక రచనలుగా జైనులు కూడా ప్రచారం చేసుకోరు. అవన్నీ

జైనుడు మరణించిన తర్వాత రెండు సంవత్సరాల అనంతరం క్రోడీకరించబడ్డాయంటారు, కాని క్రీస్తుశకం ఐదవ శతాబ్దంలో కాని వాటికి ఒక స్పష్టమైన పూర్తిస్థాయి రూపం రాలేదు, అంతిమంగా సౌరాష్ట్రలోని వల్లభిలో జైనులు నిర్వహించిన సమావేశం వాటిని ఆమోదించింది.

**అంగాలు:** అయరంగసూత్త (అచరంగసూత్ర) జైన భిక్షువులు పాటించాల్సిన నియమాలు తెలియచెబుతుంది. సూయగదంగ (సూత్రకృతంగ) ప్రధానంగా ప్రాచీన ఆచరణయోగ్యం గాని సిద్ధాంతాలను సోదాహరణంగా నిరాకరించడానికి ప్రత్యేకించారు. తనంగ (స్తనంగ) మరియు సమవాయంగ జైన సిద్ధాంతాలను క్రమబద్ధంగా చూపుతుంది. జైనుల పవిత్ర గ్రంథాల్లో భగవతి ఒక ముఖ్యమైన గ్రంథం. ఈ గ్రంథం జైన సిద్ధాంతాన్ని విపులంగా వివరిస్తుంది. స్వర్గంలో పొందే సంతోషాన్ని, నరకంలో పొందే బాధలను వర్ణించి వివరిస్తుంది. ఈ గ్రంథంలో మహావీరుడు, ఆయన ముందుగల తీర్థంకరులు, ఆయన సమకాలికుల బోధనలతో ఒక ముఖ్యమైన విభాగం ఉంది. ఉదాహరణకు చెప్పాలంటే ఐదవ పుస్తకం అజీవిక విభాగాన్ని స్థాపించిన గోసాల మక్కలిపుత్త గురించి ఆసక్తికరంగా వివరిస్తుంది. నయదమ్మకహ (జ్ఞానతధర్మక్-అతాహ్) జైన మత సిద్ధాంతంలోని ప్రధాన సూత్రాలను బోధిస్తుంది, అవన్నీ తరతరాలుగా వస్తున్న కథలు, నీతి కథలు, మామూలు కథల రూపంలో ఉంటాయి. ఉవసగదస (ఉపాసకదసహ్)లో జైనులుగా మారిన పదిమంది ధనిక వ్యాపారుల గురించి వివరిస్తుంది. అంతగగదశ (అంతక్రితద్దశ్) మరియు అనుత్తరోవైయావదశ (అనుత్తరాపాపటికా-దశ)లో తమ శరీరాన్ని శుష్కింపచేసుకుని ఆత్మను పరిరక్షించుకుని మరణదశకు చేరుకున్న జైనసన్యాసుల గురించి వివరిస్తుంది. పన్హవగరనం (ప్రశ్నావ్యాకరనాని) జైన సన్యాసులు ఆచరించాల్సిన పది సూత్రాలు, చేయగూడని పది పనుల గురించి వివరిస్తుంది. వివగసుయం (విపకశృతం)లో మనిషి తన జీవనకాలంలో చేసిన మంచీ, చెడుల వల్ల మరణానంతరం సంభవించే పరిణామాల గురించి సోదాహరణంగా వివరిస్తుంది. దిత్తివయ (దృష్టివాద)లో ఇతర అంశాల గురించి రేఖా మాత్రంగా వివరణ ఉంటుంది. ఇందులో ప్రధానంగా ఇతర సిద్ధాంతాల గురించి చర్చ ఉంటుంది.

**ఉపాంగాలు:** వీటిలో సాహిత్యానికి అంతగా ప్రాధాన్యత ఇవ్వలేదు. ఉపాంగాల్లో ప్రధానంగా సాంప్రదాయంగా వస్తున్న కథలు, పురాణాల గురించే ఎక్కువగా ఉంది. రెండవ ఉపాంగమైన రాయపసేనైజలో మాత్రం సాహిత్యానికి కొంతవరకు స్థానం కల్పించారు. ఇందులో జైన భిక్షువు పేసి అనేరాజు (కోసలకు చెందిన ప్రసేనజిత్ కావచ్చు)కు మధ్య జరిగిన చర్చ ఉంది. ఐదు, ఆరు, ఏడు ఉపాంగాల్లో ఖగోళ శాస్త్రం, భౌగోళిక శాస్త్రం, విశ్వం తదితర విషయాల గురించి ఉంటుంది. ఎనిమిదవ ఉపాంగమైన నిరయవలిసుట్టంలో అజాతశత్రు గురించిన ఆసక్తికరమైన అంశాలున్నాయి, అయితే దీని చారిత్రక సాధికారత అనుమానమే.

**ఇతర పవిత్ర గ్రంథాలు:** ప్రకరణాలు వివిధ సిద్ధాంతాల గురించి వివరిస్తాయి. ఛేదసూత్రాలు జైన భిక్షువులు, సన్యాసినులు ఆచరించాల్సిన క్రమశిక్షణ గురించి ప్రాచీన గాథల ఆధారంగా సోదాహరణంగా వివరిస్తాయి. భద్రబాహు రచించిన కల్పసూత్ర వీటిలో ఉత్తమమైనదిగా చెప్పవచ్చు. మూడు భాగాలుగా గల కల్పసూత్ర నాలుగవ ఛేదసూత్ర రూపమే.

ఐదవ ఛేదసూత్రంగా చెప్పబడే మరో కల్పసూత్రంలో జైన సన్యాసులు, సన్యాసినులు పాటించాల్సిన నియమ నిష్టలు స్పష్టంగా వివరించబడ్డాయి. జైన మత గ్రంథాల్లో మూలసూత్రాలు చాలా విలువైనవి. వీటిలో ఒకటైన ఉత్తరాధ్యయన సూత్రంలో నీతి సూత్రాలు, ఆచారాలు, కథలు, పద్యాలు, సంభాషణల రూపంలో ఉంటాయి. ఈ అంశాలన్నీ జైన మతంలో ఏ ఒక్క విభాగానికీ ప్రత్యేకంగా చెందినవి కావు. వీటిలో వివిధ శాఖలకు చెందిన జైన భిక్షువుల జ్ఞానాన్నంతటినీ కలిపి పొందుపరచబడ్డాయి.

## ప్రాచీన భారతీయ లౌకిక సాహిత్యం

### కావ్య సాహిత్యం :

భారతీయ సాహిత్య చరిత్రలో రెండు గొప్ప ఇతిహాసాలు (రామాయణం, మహాభారతం) సంస్కృత కావ్య చరిత్రకు మూలాలుగా చెప్పడానికి ఎటువంటి సందేహం అక్కర్లేదు. ఈ రెండింటినీ వేదయుగానికి చెందినవిగా గుర్తించారు. పతంజలి మూడింటి గురించి ప్రస్తావించాడు. అవి వాసవదత్త, సుమానోత్తర, భాయిమారతి. మరో రెండు కూడా ప్రస్తావించబడ్డాయి, కంసవధ, బలిబంధ ఈ రెండూ నాటక రూపంలో ఉన్నాయి. దురదృష్టవశాత్తు భారతదేశంలో క్రీస్తుపూర్వం రెండు, క్రీస్తు శకం ఒకటవ శతాబ్దాల మధ్య కాలంలో కావ్యాల రచన, అభివృద్ధికి సంబంధించి ఖచ్చితమైన సమాచారం మనకు అందుబాటులో లేదు. ఈ కాలంలో ఆవిర్భవించిన కావ్యాల గురించి స్పష్టత లేదు. అయితే క్రీస్తుశకం తొలి శతాబ్దాల నాటి నుండి ఇప్పటివరకు గల కావ్యాలకు సంబంధించిన సమాచారం అంతా అందుబాటులో ఉన్నది.

ప్రాచీన భారతదేశంలో ప్రఖ్యాతిగాంచిన కవులలో కాళిదాసు ఒకరు.(ఈయన రెండవ చంద్రగుప్తుని ఆస్థానంలో ఉన్నప్పటికీ ఆయన రచనల్లో ఎక్కువ భాగం మొదటి కుమారగుప్తుని కాలంలో రచించినవే) కాళిదాసు రచనలు సంస్కృత కావ్యాల్లో అత్యున్నత స్థానాన్ని అలంకరిస్తాయి. కాళిదాసు రచనల్లో మేఘదూతం అద్భుతమైన కావ్యం. ఘటకర్పర (రెండవ చంద్రగుప్తుడి ఆస్థానంలోని నవరత్నాల్లో ఒకరు) రచించిన ఘటకర్పర కావ్యం కూడా నాటి గొప్ప కావ్యాల్లో ఒకటి. క్రీస్తు శకం 7వ శతాబ్దంలో జీవించిన భర్తృహరి మూడు గొప్ప శతకాలు రచించాడు. శృంగార శతకం, నీతి శతకం, వైరాగ్య శతకాలు ఆయన రచించాడు. అమరు కవి రచించిన అమరు శతకం కూడా ఆనాటి గొప్ప కావ్యాల్లో ఒకటి.

పూర్వం భారతదేశంపై తరచుగా సాగిన విదేశీయుల దండయాత్రల చీకటి కాలాన్ని అధిగమించి సంస్కృత సాహిత్యం పునరుజ్జీవనం పొందిందని పండితులు చెబుతారు. అంతకుముందు స్వర్ణయుగంగా చెప్పే గుప్తుల పాలనా కాలంలో ఈ సాహిత్యం పరిఢవిల్లింది. అయితే క్రీస్తు శకం ప్రారంభకాలంలోని శాసనాలు పరిశీలిస్తే సంస్కృత సాహిత్యం ఎన్నడూ ఇబ్బందులకు గురికాలేదని స్పష్టమవుతుంది. ఉదాహరణకు రుద్రదమన (క్రీస్తుశకం 150) ప్రశస్థి పూర్తి కావ్య రూపంలో వ్యాకరణ సహితంగా రాయబడింది.

**ఆస్థాన కావ్యాలు :**

కనిష్కుడి ఆస్థానంలో ఉన్న అశ్వఘోషుడు సంస్కృతంలో భౌద్ధ రచనలు చేసి ఖ్యాతి పొందిన కవి. బుద్ధ చరిత్ర, సుందరనందం అశ్వఘోషుడు రచించిన మహాకావ్యాలు. అశ్వఘోషుడు తర్వాత భారతీయ సంస్కృత కవుల్లో కాళిదాసు ఖ్యాతిగాంచాడు. కుమార సంభవం, రఘువంశం కాళిదాసు గొప్ప రచనల్లో కొన్ని. పదిహేడు భాగాలుగా ఉన్న కుమారసంభవంలో ఎనిమిది భాగాలు మాత్రమే కాళిదాసు రాసినవిగా భావిస్తున్నారు. ఉమా, శంకరుల వివాహం, కార్తికేయ జననం గురించి అందులో వర్ణించారు. రఘువంశం పందొమ్మిది భాగాలుగా రచించబడింది. ఇక్ష్వాక వంశ రాజుల గురించి అందులో వివరించబడింది.

ఏడవ శతాబ్దంలో కాంచీపురాన్ని పాలించిన పల్లవుల ఆస్థానంలో ఉన్న భారవి 18 భాగాలతో కిరాతనార్జునీయం అనే కావ్యం రచించాడు. అయితే రెండవ పులకేశి (క్రీస్తు శకం 634) వేసిన ఐహోలు శాసనంలో భారవి పేరుతో పాటుగా కాళిదాసు ప్రస్తావన కూడా ఉంది. మహాభారతం ఆధారంగా భారవి రాసిన కిరాతార్జునీయంలో అర్జునుడు శివుని వద్ద నుండి పాశపతాస్త్రం ఎలా పొందిందీ పద్య రూపంలో వర్ణిస్తాడు. ఆరవ శతాబ్దం చివరలో, ఏడవ శతాబ్దం ప్రారంభంలో వల్లభి రాజు శ్రీధరసేనుడి ఆస్థానంలో ఉన్న భట్టి వ్యాకరణ నియమాల సహితంగా భట్టి కావ్యం లేదా రావణ వధ రచించాడు. 22 భాగాలుగా రచించిన ఈ కావ్యంలో రాముడు జననం మొదలు రావణ వధ వరకు ఉంటుంది. కుమారదాసు రచించిన జానకీహరణ (6వ శతాబ్దం), మాఘుడు రచించిన శిశుపాలవధ (8వ శతాబ్దం) వంటి మరెన్నో పేరుపొందిన సంస్కృత కావ్యాలున్నాయి.

**నాటకం :**

సంస్కృత నాటకం మూలాలను తొలుత భరతుని నాట్య శాస్త్రంలోనే కనుగొన్నారు. అయితే సంస్కృత నాటక రచయితల్లో 13 నాటకాలు రచించిన భాస కవి ప్రసిద్ధుడు. తర్వాతి కాలంలో అవన్నీ వెలికివచ్చాయి. అయితే చాలామంది పండితులు ఆయన రచించినవిగా పేర్కొంటున్న నాటకాలు భాస కవి రాసినవిగా అంగీకరించడంలేదు. కాళిదాసు కూడా భాస కవి పేరు ప్రస్తావించాడు. వీరి తర్వాత సంస్కృత నాటక కర్తలలో భానుడు, రాజశేఖరలను, వారి తర్వాత వచ్చినవారిని చెప్పవచ్చు. భాస కవి రెండు ఇతిహాసాలు, మరికొన్ని కథల ఆధారంగా నాటకాలు రచించాడు. ప్రతిమ, అభిషేక నాటకాలు రామాయణం ఆధారంగా రచించబడ్డాయి. మధ్యమవ్యాయోగ, ఘటోత్కచ, కర్ణాభర నాటకాలు మహాభారతం ఆధారంగా వెలువడ్డాయి. అయితే స్వప్న వాసవదత్త నాటకం భాస కవి గొప్ప నాటకంగా చెప్పవచ్చు.

శూద్రకుని రచనగా చెప్పబడే మృచ్ఛకటికం నాటకంపై ఇప్పటికీ వివాదం కొనసాగుతోంది. క్రీస్తు శకం మూడవ శతాబ్దంలో భాస కవి చారుదత్త నాటకం తర్వాతే మృచ్ఛకటిక నాటకం రాయబడిందనేది వాదన. కాళిదాసు తన రచనల్లో భాస, సౌమిల్ల, కవిపుత్ర పేర్లు ప్రస్తావించాడు గాని ఎక్కడా శూద్రకుని పేరు ప్రస్తావించలేదు. అయితే శూద్రక

రాజు గురించి కల్హణుడి రాజతరంగణిలో, సోమదేవుని కథా సరిత్సాగరంలో, స్కందపురాణంలో చూస్తాం. కాళిదాసు రచించిన మాళవికాగ్నిమిత్రం, విక్రమోర్వశీయం, అభిజ్ఞాన శాకుంతలం అతన్ని భారతదేశానికి చెందిన గొప్ప నాటకకర్తగా నిలిపాయి. కాళిదాసు రచించిన అన్ని నాటకాల కంటే పరిపక్వ రచనగా అభిజ్ఞాన శాకుంతలం ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది.

హర్ష చక్రవర్తి మూడు నాటకాలు రాసాడు. వాటిలో రత్నావళి అత్యద్భుతమైనదిగా కొనియాడబడింది. ప్రియదర్శిని, నాగానందం హర్షుని ఇతర నాటకాలు. కన్యాకుబ్జాన్ని ఏలిన యశోవర్మన్(క్రీస్తు శకం 736) ఆస్థానంలో ఉన్న భవభూతిని కాళిదాసు అనంతరం గొప్ప నాటక కర్తగా చెబుతారు. కల్హణుడు భవభూతి గురించి ప్రస్తావించాడు. మహావీర చరిత్ర, మాలతీమాధవ, ఉత్తరరామచరిత అనే నాటకాలు రచించాడు.

**వచన సాహిత్యం :**

భారతీయ వచన సాహిత్యం తొలుత కృష్ణ యజుర్వేదంలో కనిపిస్తుంది. మహాభారతం, వాయు పురాణం, భాగవత పురాణాల్లో, వైద్యం గురించి చరకుడు రచించిన గ్రంథాల్లోనూ గల వచన సాహిత్యం ఎంతో విలువైనది. సంస్కృత వచన సాహిత్యంలో శబరిస్వామిన్, వాత్సాయనుడి రచనలో గొప్ప ఉదాహరణలుగా నిలుస్తాయి. సంస్కృత వచన సాహిత్యాన్ని ప్రధానంగా రెండు వర్గాలుగా విభజించవచ్చు. మొదటిది శృంగార సాహిత్యం కాగా రెండవది నీతికథలు. శృంగార వచన సాహిత్యం కూడా ప్రధానంగా రెండు విధాలుగా చీలింది. ఒకటి అఖ్యాయిక మరొకటి కథా రూపం. ఏడవ శతాబ్దంలో దండిన్ రచించిన దశకుమార చరితం అఖ్యాయిక రకానికి చెందినది. అలాగే ఏడవ శతాబ్దంలోనే సుబంధు వాసవదత్త రచించాడు. భారత వచన కావ్యకర్తల్లో భాణుడు నిస్సందేహంగా గొప్ప కవి. ఆయన రాసిన హర్షుని జీవితచరిత్ర అయిన హర్షచరిత, ప్రేమ కావ్యం కాదంబరి గొప్ప వచన కావ్యాలుగా నిలిచిపోతాయి.

చిన్న కథలను మూడు భాగాలుగా విభజించవచ్చు. అవి ప్రజల్లో బాగా ప్రాచుర్యం పొందిన కథలు, మంచి చెడులను వివరించే నీతి కథలు, దేవతా కథలు. ప్రాచుర్యం పొందిన వాటిలో గొప్ప కథగా బృహత్కథను చెప్పుకోవచ్చు. దురదృష్టవశాత్తు ఈ కథ మనకు అందుబాటులో లేదు. అయితే అదృష్టవశాత్తు ఈ తరహా కథ బుద్ధస్వామి రచించిన శ్లోక సమగ్రత (క్రీస్తు శకం 8,9 శతాబ్దాలు)లో చూడవచ్చు. క్షేమేంద్రుని బృహత్కథామంజరి (క్రీస్తుశకం 1037), సోమదేవుని కథాసరిత్సాగరం(క్రీస్తు శకం 1063–68) ఆ కోవకు చెందినవే. మనుషుల్లోని మంచి చెడులను వివరించే విధానం విష్ణుశర్మ రచించిన పంచతంత్రంలో చదవవచ్చు.

13

# ప్రాచీన భారతీయ కళలు, వాస్తుశిల్పం

భారతదేశంలో బౌద్ధ, జైన మతాల ఆవిర్భావం, పెరుగుదల, తదనంతరం భక్తి ఉద్యమాలు దేశంలో వాస్తు శిల్పం పురోభివృద్ధికి దోహదం చేశాయి. బౌద్ధ మత చరిత్ర సమస్తం ప్రత్యేకించి ఇటుక, రాళ్ళతో గోపురం లాంటి నిర్మాణాలు, చైత్యాలు, విహారాలు, స్థూపాలతో ముడిపడి ఉంది. బౌద్ధమతంలో ఈ నిర్మాణాలన్నీ ఒక ముఖ్య భాగంగా ఉండేవి. జైన మతంలో కూడా ఈ తరహా నిర్మాణాలున్నాయి. ఈ రెండు మతాలకు ధీటుగా ముందుకు వచ్చిన భక్తి ఉద్యమంలో హిందూ దేవతలకు రూపాలు సృష్టించడం ద్వారా వారికి గుడుల రూపంలో స్థానం కల్పించారు. తదనంతర కాలంలో దేశమంతా హిందూ దేవతలకు పెద్ద సంఖ్యలో ఆలయాల నిర్మాణం కొనసాగింది. తొలిరోజుల్లో ఆలయాల నిర్మాణాల్లో ఉపయోగించిన కొన్ని పదార్థాలు త్వరగా పాడైపోవడం వల్ల అవి కాలగర్భంలో కలిసిపోయాయి. గుహలను తొలచి నిర్మించిన ఆలయాలు అన్ని పరిణామాలను తట్టుకుని శతాబ్దాలుగా నిలిచి ఉన్నాయి. అయితే తొలిరోజుల్లో ఆలయాలు త్వరగా పాడైపోవడాన్ని గమనించిన కళాకారులు, వాస్తుశిల్పులు ఇటుకలు, రాళ్లతో ఆలయాలు నిర్మించడం, రాళ్ళలో దేవతామూర్తులను చెక్కడం వల్ల అవి ఎన్ని వందల సంవత్సరాలైనా పాడుకాకుండా ఉండగలిగాయి. చరిత్రకు అందిన ఆలయాలన్నీ కూడా ఇటుకలు, రాళ్లతో నిర్మించినవే.

**స్థూప నిర్మాణం :**

మహావ్యక్తులు మరణించిన అనంతరం వారి జ్ఞాపకార్థం వారి అస్థికలపై స్థూపాలు నిర్మించేవారు. ప్రత్యేకించి బౌద్ధ సంప్రదాయాల ప్రకారం బుద్ధుడు మహాపరి నిర్వాణం పొందిన వెంటనే పెద్ద సంఖ్యలో స్థూపాలు నిర్మాణమయ్యాయి. బుద్ధుని అస్థికలు భద్రపరిచిన ప్రదేశాల్లో వాటిపై దేశం నలుమూలలా ఎనిమిది స్థూపాలు నిర్మించారు. తొమ్మిదవదాన్ని వాస్తవంగా బుద్ధుని అస్తికలు తొలుత భద్రపరిచిన పాత్రపై నిర్మించారు. బుద్ధుని మార్గం అనుసరించేవారు దీర్ఘకాలంగా ఇదే విధానాన్ని అనుసరిస్తున్నారు. బౌద్ధమతంలో ఆస్తికవాదం ప్రారంభానికి ముందు క్రతువులకు పెద్దపీట వేశారు. అప్పటినుంచే స్థూపాలకు ప్రాధాన్యత మరింతగా పెరిగింది. ఈరోజు బౌద్ధమతానికి ఈ స్థూపాలే చిహ్నాలుగా నిలిచాయి.

తొలుత ఈ స్థూపాలు సాదాగా గుండ్రంగా అర్ధగోళాకారంలో నిర్మించారు. బౌద్ధమతాన్ని స్వీకరించిన అశోక చక్రవర్తి తొలినాళ్ళలో నిర్మించిన స్థూపాలన్నీ కూలదోసి వాటిపై నూతన స్థూపాలు నిర్మించాడంటారు. అలాగే అనేక కొత్త స్థూపాలను కూడా అశోకుడు నిర్మించారు. వాస్తుశిల్ప కళ ఆధారంగా ఎంతో అందంగా అశోకుడు నిర్మించిన స్థూపాలు తర్వాత కాలంలో నమూనాలుగా నిలిచాయి. అశోకుడు తదనంతర కాలంలో ఆయన నిర్మించిన స్థూపాలకు మరమ్మతులు చేసి కాపాడారు. సాంచీలో అశోకుడు నిర్మించిన స్థూపం అన్నింటికీ మిన్నగా నిలుస్తుంది. ఈ స్థూపాన్ని అశోక చక్రవర్తి ఇటుకలతో నిర్మించగా రెండు శతాబ్దాల అనంతరం దానికి రాతిపలకలతో రక్షణ కల్పించారు. ఆ తర్వాత స్థూపం అసలు పరిమాణానికి రెట్టింపు సైజులో దాన్ని విస్తరింపచేశారు. అర్ధగోళాకారంగా ఉండే పై కప్పునకు ఆసరాగా దిగువ భాగాన వర్తులాకార నిర్మాణం ఉంటుంది. ఈ స్థూపానికి రెండు మంచెలు, వాటిపైకి ఎక్కడానికి మెట్లు, మొత్తం నిర్మాణం చుట్టూ రక్షణ కట్టడం ఉంటాయి. తొలిరోజుల్లో నిర్మించిన ఈ స్థూపాలన్నీ ఇదే తరహాగా ఉంటాయి.

సాధారణ నమూనాతో నిర్మించిన స్థూపానికి తరువాతి శతాబ్దాల్లో అనేక మార్పులు చేశారు. దానివల్ల స్థూపం ఎత్తు, నిర్మాణ పరిధి బాగా పెరిగాయి. ఎత్తుకు, దాని చుట్టుకొలతకు సరిపోయేవిధంగా నిర్మాణాల్లో మార్పులు చేశారు. పరిమాణంలో జరిగిన మార్పులు క్రమంగా వాటిని స్థూపాకారానికి తీసుకువచ్చాయి. బౌద్ధ స్థూపాల తొలినాళ్ళనాటి నిర్మాణాలు తదనంతర కాలంలో వాటికి జరిగిన మార్పులు, తర్వాతి కాలంలో బయల్పడిన వాటి శిధిలాలు పరిశీలిస్తే స్పష్టంగా తెలుస్తుంది. పెషావర్ (పురుషపురం)లో కనిష్క చక్రవర్తి నిర్మించిన స్థూపంపై చిత్రాలతో కూడిన గాథలు ఉన్నాయని చైనా యాత్రీకుల రికార్డుల ద్వారా తెలుస్తుంది. పెషావర్ స్థూపానికి ఐదు దశల పునాది, దానికి ఆసరాగా 13 అంతస్థుల ఇనుప కమ్మీలు, రాగి గొడుగులు ఉన్నట్లు చైనా యాత్రీకులు రాసారు. పెషావర్ స్థూపం నాటి కాలంలో సాధారణ స్థాయి స్థూపాల దశ దాటి దూర ప్రాచ్య దేశాలలో భారీ నిర్మాణాలు చేపట్టడం ప్రారంభించినప్పటి సంధికాలంగా చెప్పవచ్చు.

కృష్ణా నది దిగువ భాగాన తీరం వెంబడి అమరావతి, జగ్గయ్యపేట, భట్టిప్రోలు, ఘంటసాల, నాగార్జునకొండ తదితర ప్రాంతాల్లో అనేక స్థూపాలు నిర్మాణమయ్యాయి. వాటిలో చాలావరకు శిధిలమైపోయినా వాటి అవశేషాల ద్వారానే దక్షిణాది ప్రాంతాల్లో బౌద్ధ ఆరామాలు, స్థూపాల నిర్మాణ కౌశలం తెలుసుకోగలుగుతున్నాం. దీర్ఘ చతురస్రాకారంగా ఉన్న నిర్మాణానికి ప్రతి వైపునా ముఖ భాగాన ఐదు స్థంభాల ఆధారంగా ఒక ఎత్తైన వేదిక ఉన్నది. ఈ స్తంభాలను ఆయక-కంభాలంటారు. ఈ తరహా స్థూప నిర్మాణాలు భారతదేశానికే ప్రత్యేకం. బహుశా శ్రీలంకలో కూడా ఇటువంటివి ఉండి ఉండవచ్చు. ఈ నిర్మాణ పద్ధతులే ఎంతో ప్రత్యేకత కలిగినట్టివి. స్థూపంలో ప్రధాన నిర్మాణం రెండు వర్తులాకార గోడలతో నిర్మితమై ఉంటుంది. ఒకటి ఇరుసుగా ఉంటే రెండవది వెలుపల ఉంటుంది. రెండింటి మధ్యలో మరో గోడ ఉంటుంది. లోపలివైపున సున్నపురాయితో నింపి ఉంటుంది.

**చైత్య నిర్మాణం :**

చైత్య నిర్మాణాలు సాధారణంగా పొడవాటి దీర్ఘ చతురస్రాకారపు మందిరాలు, తర్వాత రెండు వరుసల స్తంభాలతో మూడు భాగాలుగా విభజించబడి ఉంటాయి. చైత్యాలు దాదాపుగా శిథిలమైపోయాయి. ఎక్కువ భాగం కేవలం పునాదులు మాత్రమే మిగిలిఉన్నాయి. పశ్చిమ భారతదేశంలో రాళ్లను తొలచడం ద్వారా ఈ తరహా నిర్మాణాలను రూపొందించారు.

**విహారాల నిర్మాణం :**

బౌద్ధ సన్యాసులు, సాధువులు నివసించేందుకు గాను ఒక సాధారణ గృహాల మాదిరిగా విహారాలను నిర్మించారు. తర్వాతి కాలంలో ఇవి భారీ నిర్మాణాలుగా రూపాంతరం చెంది, ముఖ్యమైన విద్యాసంస్థలుగా విలసిల్లాయి. వాటిలో చాలా విహారాలు ఉత్తర, దక్షిణ భారతదేశంలోని అనేక ప్రాంతాల్లో నేటికీ శిథిల దశలో కనిపిస్తాయి. బీహార్‌లోని నలంద (క్రీస్తుశకం 5వ శతాబ్దం), సోమపుర( 8వ శతాబ్దం) ల్లోని విహారాలు ప్రపంచ ప్రఖ్యాత విద్యాలయాలుగా పేరుపొందాయి. చైనా యాత్రీకుడు హుయాన్‌త్సాంగ్ నలందలోని విహారం గురించి చాలా విపులంగా రాసాడు. బహుళ అంతస్తుల భవనాలు, ఎత్తైన ఆలయాలు నలంద విహారంలో ఉండేవి. చైనా యాత్రీకుడు రాసిన విషయాలతో అక్కడ జరిపిన తవ్వకాల్లో లభించిన అవశేషాలు సరిపోతాయి. పహార్‌పూర్‌లోని సోమపుర విహారం కూడా దాదాపుగా నలంద విహారం మాదిరిగానే నిర్మాణమైంది. అయితే ఇది 177 గదులు గల ఒకే నిర్మాణం. ఇటుకలతో నిర్మించిన ఈ కట్టడాలు గాలి, వెలుతురు బాగా వచ్చేవిధంగా రూపొందాయి. ఆనాటి పనివారి నైపుణ్యానికి, నిర్మాణదక్షతకు ఈ రెండు విహారాలు సాక్షీభూతాలుగా నిలుస్తాయి.

ఇటుకలతో నిర్మించినవి గాకుండా తొలిరోజుల్లో కొండలను తొలచి గుహాల్లో నిర్మించిన విహారాలు కూడా ఉన్నాయి. ఒకవైపున మార్గం ఏర్పాటు చేసి మూడువైపుల మూసిఉంచే ఈ విహారాలు రూపుదిద్దుకోవడానికి కొంతకాలం పట్టింది. వీటిలో అతి పురాతనమైనది, ఒకే ఒక హాల్‌తో నిర్మితమైనది బరాబర్ గుహలు (క్రీస్తుపూర్వం 3 శతాబ్దం). ఈ విహారాలన్నింటికీ స్తంభాలు ఆధారంగా ఉన్నాయి. క్రీస్తుపూర్వం 1వ శతాబ్దంలో ఒరిస్సాలోని ఉదయగిరి, ఖందగిరి గుహల్లోని జైన మునుల విహారాలు ఈ విధంగానే ఉంటాయి. పలుచోట్ల రెండస్తుల ఆరామాలు కూడా కనిపిస్తాయి.

**బ్రాహ్మణ, జైన మతాల గుహలు :**

తొలిరోజుల్లో బ్రాహ్మణ మతానికి చెందిన మందిరాలు మధ్యప్రదేశ్‌లోని ఉదయగిరి వద్ద గుహ సముదాయంలో కనిపిస్తాయి. ఇవి క్రీస్తుశకం 5వ శతాబ్దం నాటివి. వీటిలో చాలావరకు దీర్ఘచతురస్రాకారంలో స్తంభాల ఆధారంగా నిర్మించబడినవే. తమిళనాడులో ఈ గుహ మందిరాల నిర్మాణం 7వ శతాబ్దంలో మొదటి మహేంద్రవర్మన్ కాలంలో మొదలైంది.

ఎల్లోరా గుహల్లో బ్రాహ్మణమతానికి చెందిన మందిరాలలో తీర్చిదిద్దిన డిజైన్లు, ఆ విస్తీర్ణం, నైపుణ్యం ఎంతగానో ఆకట్టుకుంటాయి. బ్రాహ్మణ మతానికి చెందిన ప్రముఖ

గుహాలయాలు దేశంలో పదహారు ఉన్నాయి. అయితే వాటిలో కొన్నింటినే అత్యంత ప్రాముఖ్యమైనవిగా చెప్పవచ్చు. ఎల్లోరాలోని దశావతార (15వ గుహ), రావణ (14వ గుహ), రామేశ్వర (21వ గుహ), వీటన్నింటిలోనూ అత్యంత ప్రాచుర్యం పొందినది కైలాస ఆలయం. ఇది గుహలో ఉన్నప్పటికీ మామూలు నేలపై నిర్మాణాన్ని పోలి ఉంటుంది. బ్రాహ్మణ మతానికి చెందిన వాటిలో అన్నింటికంటే గొప్పదిగా పేర్కొనబడేది ఎలిఫెంటా గుహలు.

**ఆలయ శిల్పకళ :**

భారతదేశంలో ఆలయాల నిర్మాణం క్రీస్తుపూర్వం నుంచే ప్రారంభమైంది. అయితే క్రీస్తు శకం 4 నుంచి 17వ శతాబ్దం వరకు దేశంలో ఆలయాల్లో శిల్పకళ బాగా వికసించింది. అద్భుతమైన కళాఖండాలను సృష్టించింది. ఉపఖండంలో సామాజిక, రాజకీయ, ఆర్థిక సమగ్రత కోసం ఆలయాలను ఒక ముఖ్యమైన సాధనంగా రూపొందించే లక్ష్యంతో ఉపఖండంలో వివిధ ప్రాంతాల్లో పరిపాలన సాగించిన రాజవంశాలు ఆలయ కళలకు అత్యంత ప్రాధాన్యతనిచ్చాయి. ఆలయాలు భారతీయ సంస్కృతికి చిహ్నంగా ఎదిగే క్రమంలో వివిధ ప్రాంతాల నడుమ అనేక తేడాలు కనిపిస్తాయి. ఇది అధ్యయనం చేస్తే కనిపించే ఒక చారిత్రక సత్యం. దేవతార్చనకు ఒక కేంద్రంగా ఉన్న ఆలయాలు భారతీయ పురాణ సాంప్రదాయాల విస్తృత ప్రచారానికి ఒక మాధ్యమంగా ఉపయోగపడింది. హిందూ మతంలో విశేష ప్రాచుర్యం పొందిన కథలు, వ్యక్తులు, నమ్మకాల సమాహారంతో రూపొందినవే పురాణాలు. హిందూ దేవతలంతా ప్రధానంగా వైష్ణవ, శైవ తెగలకు చెందినవారు కాగా, మరికొందరు ఇతర తెగల దేవతలున్నారు. ఈ దేవతలందరికీ చెందిన సంస్కృతి, సాంప్రదాయాలే హిందూమతంగా ప్రచారంలో ఉన్నది. మధ్యయుగం ప్రారంభం నుంచే దేశంలో హిందూమతం బాగా ప్రాచుర్యం పొందింది. వేద నాగరికత నుంచి క్రతువులు, పురాణ కథానాయకులు, దేవతలు, వివిధ రకాల పురాణ పురుషులు, తాత్విక, ఆధ్యాత్మిక చింతన క్రమంగా పెరుగుతూ, ప్రాధాన్యత సంతరించుకోవడానికి ఇంతకాలం పట్టింది. ఆలయం అంటే కేవలం దేవతార్చనకు మాత్రమే పరిమితం కాదు. హిందూ మతంలోని సంక్లిష్ట ప్రక్రియలన్నీ అంటే శిల్పకళ, వాస్తుకళ, దేవతామూర్తులు, క్రతువులు, సంస్థాగత నిర్వహణ అన్నీ కలిస్తేనే ఆలయాలు.

**భారతదేశంలో ఆలయాలు ఆవిర్భావం :**

ఇక్కడ తలెత్తే ముఖ్యమైన ప్రశ్న ఏమిటంటే హిందూ ఆలయాలు ఇంత ఉచ్ఛస్థితికి రావడానికి ప్రధాన పాత్ర పోషించిన అంశాలు, వ్యక్తులు ఎవరనేదే? ఇది ఒకే ఒక్క సాంప్రదాయమా లేక అనేక రకాల సాంప్రదాయాల సంగమమా? వేద నాగరికత తొలిరోజుల నాటి క్రతువులు, పూజల నుంచే ఈ ఆలయాల సంస్కృతి వర్ధిల్లినట్లు చాలామంది విశ్వసిస్తున్నారు. ఇతరత్రా అనేక సంస్కృతుల్లో ఈ విధంగా ఆలయ రూపాలు విలసిల్లినప్పటికీ హిందూ మతంలో మాదిరిగా ప్రాచుర్యం పొందలేదు. ఆలయాలు వేదనాగరికత పరిణామంలో ఒక ముఖ్యమైన భాగంగా భావిస్తున్నప్పటికీ, ఆలయాల నిర్మాణం ఏ ఒక్క సాంప్రదాయానికి పూర్తిగా కట్టుబడి లేవు. వైదిక మతం ముఖ్యంగా యజ్ఞాల వంటి క్రతువులకు ప్రాధాన్యతనిస్తే, పురాణాలు భక్తికి, దేవతారాధనకు పెద్ద పీట వేసాయి. ఆలయాలు క్రమంగా మానవ జీవితంలోని

ప్రతి కదలికనూ ప్రతిఫలించాయి. వేద పీఠాల మాదిరిగా కాకుండా ఆలయాల్లో దర్శన విధానం ఉండేది. ఆలయాలు కళల కాణాచిగా రూపొందటంతో వాటిని చూడటానికి ప్రజలు తండోపతండాలుగా రావడం ప్రారంభించారు. ఆలయాలకు రావడంలో ప్రధాన లక్ష్యం దైవ దర్శనం, దేవతలకు బహుమతులు ఇవ్వడం. వేద కాలంలో క్రతువులు నిర్వహించేవారు, తర్వాత వాటి స్థానంలో దేవతలకు బహుమతులు ఇవ్వడం మొదలైంది.

**తొలినాటి ఆలయాల పద్ధతులు :**

దేవతారూపాలను రూపొందించడం, నిలబెట్టడం అనే సాంప్రదాయం క్రీస్తుపూర్వం 2వ శతాబ్దంలోనే మొదలైంది. ఆ కాలం నాటి అనేక దేవగృహాలు ఇప్పటికీ శిధిలావస్థలో కనిపిస్తాయి. అవన్నీ ఎండకు, వానకు పాడైపోయే వస్తువులు, పదార్థాలతో తయారుచేసినందువల్ల కాలక్రమంలో శిథిలమైపోయాయి. తొలిరోజుల్లో దేవాలయాలకు వాస్తుశిల్పం నామమాత్రంగా ఉండేది. గుప్తుల కాలంలో పకడ్బందీగా ఆలయాల నిర్మాణం జరిగింది. శాశ్వతంగా నిలిచి ఉండే రాళ్ళు, ఇటుకలు, లోహాలతో చక్కని వాస్తుతో ఆలయాలు, దేవతామూర్తులు తయారుచేయడం మొదలైంది.

**తర్వాతి కాలం నాటి ఆలయాలు :**

వాస్తు శాస్త్రంలో ప్రధాన ఆలయ శిల్ప రీతుల గురించి వివరించడం జరిగింది. నగర, ద్రావిడ, వెసర వంటి ఆలయ శిల్ప రీతులు బాగా ప్రాచుర్యం పొందాయి. నగర రీతులు ఉత్తర భారత దేశంలోనూ, ద్రావిడ రీతులు దక్షిణ భారతదేశంలోనూ ప్రధానంగా కనిపిస్తాయి. వెసర దక్కను ప్రాంతంలో మిశ్రమంగా కనిపించే వాస్తు రీతి అయినా ఆలయాల వాస్తుశిల్ప ఉచ్ఛస్థితిలో ఉన్న 10, 11 శతాబ్దాలలో కూడా అది ప్రయోగాత్మక దశగానే ఉంది. వెసర వాస్తురీతికి దక్కను పీఠభూమి ముఖ్యమైన భూమికగా ఉండేది. ఇక్కడ పరిపాలించే రాజవంశాల ప్రాధాన్యతలను అనుసరించి ఎక్కడి కక్కడ ఉప ప్రాంతీయ రీతులు ఆలయ నిర్మాణాల్లో రూపు దిద్దుకున్నాయి. ఈ మూడు వాస్తురీతులు అవి ప్రాచుర్యం పొందిన ప్రాంతాల్లోని సారూప్యం, నిర్మాణాల ఆధారంగా వర్గీకరించారు.

**నగర శైలి:** ప్రారంభంలో ఆలయాల నిర్మాణం సమతలంగా ఉండే పైకప్పుతో చతురస్రాకారంగా ఉండేవి. ముందు భాగంలో స్థంభాలతో ఒక మండపం ఉండేది. గుప్తుల అనంతర కాలంలో ఉత్తర, మధ్య భారత దేశంలోని వివిధ ప్రాంతాల్లో నగర శైలిలో ఆలయాల నిర్మాణం మొదలైంది. చతురస్రాకారపు మందిరంపైన గోపురం నిర్మాణాలు క్రమంగా రూపుదిద్దుకున్నాయి. అదే సమయంలో నగర రీతిలో కూడా ప్రాంతీయ పద్ధతులు ప్రారంభమయ్యాయి. ముఖ్యంగా ఇప్పటి ఒరిస్సా అప్పుటి కళింగ రాజ్యంలో, మధ్య భారతంలో, రాజపుత్ర వంశాలు ఏలిన రాజస్థాన్‌లోనూ, గుజరాత్ (పూర్వం గుర్జారదేశం) నగర రీతిలో ప్రాంతీయ పోకడలు విస్తృతం అయ్యాయి. ఉత్తర భారత దేశమంతటా ఆలయాల నిర్మాణంలో తలెత్తిన కొత్త పోకడల వల్ల అద్భుతమైన కట్టడాలు వెలిసాయి. ఉత్తరప్రదేశ్, బీహార్, బెంగాల్, హిమాచల్ ప్రదేశ్ ప్రాంతాల్లోని ఆలయాల నిర్మాణాల్లో ఎక్కడా వాస్తు, శైలి తదితర భేదాలను

అంతగా గుర్తించలేము. ప్రధాన నగర శైలికి భిన్నంగా కాశ్మీర దేశంలో కొంగ్రొత్త శైలిని ఆవిష్కరించారు.

**ద్రావిడ శైలి:** ద్రావిడ శైలి ఆలయాల నిర్మాణం కేంద్రంగా మహాబలిపురం (7వ శతాబ్దం) ఆలయాలను చెప్పవచ్చు. ఇందులో ప్రధానంగా ఆలయాన్ని అంతస్తులుగా నిర్మాణం చేస్తారు. ఆలయం ముందు ఒక విమానం, ఆలయంపై గోపురం ద్రావిడ శైలిలో ప్రధాన భాగాలు. 7వ శతాబ్దం మొదటి అర్థ భాగంలో పల్లవుల కాలంలో మొదలైన ఈ శైలి అనేక శతాబ్దాల పాటు దక్షిణ భారతదేశంలో వివిధ రాజవంశాల ఆదరణతో వికసించింది. కొండలను తొలచి ఆలయాలు నిర్మించే పద్ధతి నుంచి మామూలు నేలపై నిర్మాణం చేపట్టే విధానం రెండవ నరసింహవర్మన్ కాలంలో మొదలైంది. దక్షిణ భారతదేశంలో సముద్రతీరంలో నిర్మించిన తొలి ఆలయం బహుశా మహాబలిపురంలోనిదే కావచ్చు. కాంచీపురం లోని కైలాసనాథ ఆలయం ద్రావిడ శైలి తొలిరోజుల నాటి అతిగొప్ప కట్టడంగా చెప్పవచ్చు. పల్లవుల కాలంలో బ్రహ్మాండంగా అభివృద్ధి చెందిన ద్రావిడ శైలిని తర్వాత వచ్చిన చోళులు ఉచ్ఛ స్థితికి తీసుకువెళ్ళారు.

**వెసర శైలి:** వెసర శైలిని చాళుక్య లేదా దక్కను శైలి అని కూడా అనవచ్చు. 7వ, 8వ శతాబ్దాల్లోని చాళుక్యుల కాలంలో వెసర శైలి ఊపిరి పోసుకున్నదని చెబుతారు. ఐహోలు, పట్టదకల్, ఇతర అనేక ప్రాంతాల్లో నగర, ద్రావిడ శైలిలోని ఆలయాలు పక్క పక్కనే నిర్మించారు. ఈ రెండు రకాల నమూనాల్లోని ఆలయాలు ఒకేచోట ఉండటం వల్ల వాటి నుంచి వచ్చిన ఆలోచనల వల్లనే రెండింటి మిశ్రమంగా చాళుక్యుల కాలంలో వెసర శైలి రూపుదాల్చింది. వెసర శైలి ఆవిర్భావంలో నగర కంటే ద్రావిడ శైలి ప్రధాన పాత్ర పోషించింది. చాళుక్యుల తర్వాత హొయసాలులు కూడా వెసర శైలిలో ఆలయాల నిర్మాణానికి ప్రాధాన్యత ఇచ్చారు.

## శిల్ప కళ-విగ్రహాలు

### చరిత్రపూర్వ మరియు చరిత్రయుగం :

చరిత్ర పూర్వ యుగంలోనే భారతీయులు శిల్పకళను తెలుసుకున్నారు. ఇందుకు సాక్ష్యాలుగా చరిత్రపూర్వ కాలం నాటివి, చరిత్ర కాలం నాటివి దేశం నలుమూలలా రక రకాల బొమ్మలు జంతువులవి, మనుష్యులవి కనిపిస్తాయి. తొలిరోజుల్లో ఇందుకోసం వాడిన పదార్థాలు కాలగర్భంలో కలిసిపోయాయి. మొదట్లో కలప, మట్టి వాడటంతో అవి ఎండకు ఎండి, వానకు తడిసి పాడైపోయాయి. తొలిరోజుల్లో రాయి, కంచుతో కొద్దిసంఖ్యలో మాత్రమే శిల్పాలు తయారు చేసేవారు. కాలక్రమేణా కళాతృష్ణ పెరిగే కొలదీ శిథిలం కాని పదార్థాలతో శిల్పాలు తయారుచేసే స్థాయికి భారతీయ శిల్పకారులు ఎదిగారు. హరప్పా నాగరికతలో రాయి, కంచుతో తయారు చేసిన శిల్పాలు అధికంగా కనిపించడమే ఇందుకు సాక్ష్యం. అదేవిధంగా టెర్రకోట బొమ్మలు కూడా పెద్ద సంఖ్యలో కనిపిస్తాయి.

హరప్పాలో టెర్రకోటతో చేసిన బొమ్మలు లేదా వ్యక్తుల శిల్పాలు పెద్ద సంఖ్యలో దొరికాయి. దాదాపుగా అవన్నీ చేతితో మలిచినవే. పైగా ఒకే మూసతో చేసినవి. వాటిలో

పక్షులు, జంతువులు ముఖ్యంగా కోతులు, కుక్కలు, గొర్రెలు, పశువులు ఉన్నాయి. ఎద్దుల బొమ్మలు మూపురంతో ఉన్నవి మూపురం లేనవీ కూడా దొరికాయి. ఆ ప్రదేశంలో మూపురం లేని ఎద్దులు ఉండటం ఒక అద్భుతం. వాటితో పాటే స్త్రీ, పురుషుల బొమ్మలు లభించాయి. కొంతమంది స్త్రీలు శరీరం నిండా భారీగా నగలు ధరించినట్లుగా, మరికొందరు తల పాగాలు ధరించినట్లుగా ఆ బొమ్మలు మలచబడ్డాయి. తల్లీ పిల్లలు గుంపులుగా కూర్చున్నట్లుగా కూడా బొమ్మలు ఉన్నాయి. గుంపులో నాయకురాలిగా కనిపించే స్త్రీ తలలో కొమ్ము బూరలు ఉన్నాయి. వారు ఆ గుంపు పెద్ద లేదా దైవ సమానులుగా భావించబడి ఉండవచ్చు. మరొకొన్ని బొమ్మ బళ్ళు ఉన్నాయి. బహుశా అవి పిల్లల ఆట వస్తువులు అయి ఉంటాయి.

హరప్పా నాగరికత వెల్లివిరిసిన ప్రదేశంలో దొరికిన వస్తువుల్లో రాతితో చేసినవి, లోహాలతో చేసినవీ ఉన్నాయి. రాతితో చేసిన అనేక వస్తువులను కూడా కనుగొన్నారు. వాటిలో 11 మొహెంజోదారోలో, రెండు హరప్పాలో, ఒకటి దాబర్‌కోట్‌లో, మరొకటి ముండిగాక్(ఆఫ్ఘనిస్తాన్)లో దొరికాయి. ఆనాటి నాగరికతా చిహ్నాలుగా దొరికిన రాతి శిల్పాల్లో గొప్పదిగా భావించే బొమ్మ మొహెంజొదారోలోనే దొరికింది. గడ్డం కలిగిన ఒక పురుషుడు వంటి నిండా నగలు గల దుస్తులు ధరించినట్లుగా రూపొందించిన ఆ రూపం ఒక అద్భుతంగా భావిస్తారు. హరప్పాలో దొరికిన రెండింటిలో ఒకటి బాగా చిన్నది నాలుగు అంగుళాలు మాత్రమే ఉంది. ఎర్ర ఇసుకరాయితో చేసిన ఆ బొమ్మ ఒక దిగంబర పురుషుడి రూపానిది. మరొక బొమ్మ కూడా చిన్నదే దిగంబరంగా నృత్యం చేస్తున్నట్లుగా బూడిద వర్ణం రాయితో తయారుచేశారు. రాతి బొమ్మలలో ఎక్కువ భాగం మెత్తని రాయితోనే చేశారు. కఠిన శిలల బొమ్మలు లేవు. మొహెంజోదారో, హరప్పా, చాన్హుదారో, దైమాబాద్‌లలో కంచుతో చేసిన బొమ్మలు కూడా దొరికాయి. కంచుతో తయారుచేసిన బొమ్మలలో నాలుగున్నర అంగుళాల పొడవున్న ఒక నృత్యం చేస్తున్న బాలిక శిల్పం ఉత్తమమైనదిగా చెప్పవచ్చు. చేతులు నిండుగా గాజులు, ముఖం కొంచెం వంచినట్లుగా, రింగుల జుత్తు, పెద్దవిగా ఉన్న అరమోడ్పు కన్నులతో ఆ చిన్న కళాఖండం కళాకారుని నైపుణ్యాన్ని ఎత్తి చూపుతుంది. కంచుతో చేసిన వాటిలో ఎద్దుల బళ్ళు తదితర బొమ్మలు హరప్పా, చాన్హుదారోలో దొరికాయి. కొంతకాలం క్రితం దైమాబాద్‌లో తవ్వకాలు సాగిస్తుండగా ఒక్కొక్కటి 60 కిలోగ్రాముల బరువుగల ఏనుగు, ఖడ్గమృగం, గేదె, రథం బొమ్మలు కంచుతో చేసినవి లభ్యమయ్యాయి. హరప్పా నాగరికత గురించి ఇంకెంతో తెలుసుకోవలసినది ఉన్నదని ఈ తవ్వకాలు తెలియచేశాయి.

**తొలి చరిత్ర కాలం :**

హరప్పా తర్వాత మౌర్యుల కాలం నాటి కళాకృతుల ద్వారా అనేక విషయాలు తెలుస్తాయి. లోహాలు, రాతితో చేసిన మనుష్యులు, జంతువులు, అనేక ఇతర కళాకృతులు మౌర్యుల కాలం నాటి నుండి తదనంతర రాజుల కాలం వరకు ఇప్పటికీ ఉన్నాయి. దాదాపుగా ఇవన్నీ మత సంబంధంగానే కనిపిస్తాయి. అశోక స్థంభాలు, బౌద్ధ స్థూపాలు ప్రత్యేకించి పశ్చిమ, ఈశాన్య భారతదేశంలో ఉన్నవాటిలో ఎక్కువగా రకరకాల శిల్పాకృతులు కనిపిస్తాయి.

హరప్పా సీల్స్‌గా పేరొందిన ఆనాటి ఎద్దు బొమ్మల్లాంటివి మరింతగా అభివృద్ధి చేసిన కళాఖండాలు కనిపిస్తాయి. భారతదేశం–పర్షియన్ (పెర్సో–హెలెనిక్) కళారూపాలకు చాలా సామీప్యాలుంటాయి. పశ్చిమాసియా శిల్పకళ భారత శిల్పకళను ప్రభావితం చేసినట్లు కనిపిస్తుంది.

మౌర్యుల అనంతర కాలానికి చెంది, ఉత్తర భారత దేశంలో అనేక ప్రదేశాల్లో లభ్యమైన శిల్పాలు అవి వివిధ కాలాలకు చెందినవి అయినా కూడా కళలో చాలా పోలికలు ఉన్నాయి. మధుర సమీపంలోని పర్ఖం, మధ్యప్రదేశ్‌లోని బేస్‌నగర్, పవాయా, బీహార్‌లోని లోహానీపూర్, దీదార్‌ఘంజ్, పాట్నా తదితర ప్రాంతాల్లో దొరికిన బొమ్మల్లో చాలా పోలికలు కనిపించాయి. పవాయాలో లభ్యమైన మణిభద్ర యక్ష విగ్రహంతో ఇతర ప్రాంతాల్లో దొరికిన యక్ష, యక్షిణిల విగ్రహాలను సరిపోల్చవచ్చు. వీటన్నింటి మధ్యా అనేక సారూప్యాలు కనిపిస్తాయి. దాదాపుగా ఇవన్నీ ఆనాటి జానపదులు పూజించే దేవతల విగ్రహాలు కావచ్చు.

**దేవతామూర్తులు–ఆరాధన:** వేద నాగరికత తొలిరోజుల్లో ఆర్యుల్లోని ఎగువ తరగతి ప్రజల్లో దేవతామూర్తుల ఆరాధన ఉండేది కాదు. అయితే ఆర్యుల కంటే ముందు నుంచీ ఉన్న ప్రజల్లో, వారి ఆవాసాల్లో మాత్రమే దేవతామూర్తుల ఆరాధన ఉండేది. హరప్పా నాగరికతా ప్రాంతాల్లో టెర్రకోట సహా రాతి బొమ్మలు లభ్యమయ్యాయి. అక్కడ దొరికిన బొమ్మలను ఆనాటి ప్రజలు పూజించేవని చరిత్రకారుల భావన. ఆర్యులకు పూర్వం ఉన్నవారికి సంబంధించిన దేవతారాధన గురించి రుగ్వేదంలో కొన్ని పదాలు ఉన్నాయని వారు వివరిస్తారు. అయితే వేదపండితులు ఆ మత సాంప్రదాయాలను ఖండించేవారు. క్రమంగా తొలిరోజుల నాటి మత క్రతువులన్నీ దీర్ఘకాలంలో ఆర్యుల ఆచార వ్యవహారాలుగా మారిపోయాయి. ఆస్తికత్వం వ్యాప్తి క్రమంగా వ్యక్తిగత దేవతారాధన దిశగా మార్పు చెందింది. ఈ దేవతారూపాలు వేద సంస్కృతి నుంచి కాకుండా జనపదాల నుంచి ఆవిర్భవించాయి. ఈ జానపద దేవతామూర్తుల గురించి బౌద్ధ, జైన మత గ్రంథాల్లో పేర్కొన్నారు. ఇవన్నీ కూడా శివుడు, శక్తి, కృష్ణుడు తదితర పురాణ పురుషుల నుంచి ఆవిర్భవించినవే. బాగా ప్రాచీన కాలంలో యక్షులు, నాగులను పూజించే తెగలు కనిపిస్తాయి.

**దేవతామూర్తులకు పరివర్తన:** బుద్ధుడిని తొలిరోజుల్లో మానవ రూపంలో పూజించలేదు. మొదట్లో బుద్ధుడిని రక రకాల చిహ్నాల రూపాలలో కొలిచేవారు. వీటికి సాక్ష్యాలుగా ఇప్పటికీ శిథిలమై పోయిన బార్హూత్, సాంచీ, అమరావతి బౌద్ధ స్థూపాలపై గల చిహ్నాలను చెప్పవచ్చు. అయితే బుద్ధుని అసలు రూపాలు బయటపడిన తొలి ప్రాంతం ఏదీ అన్న దానిపై ఇంకా చర్చ నడుస్తూనే ఉన్నది. అయితే అనేకమంది చరిత్రకారులు గాంధార ప్రాంతానికి చెందిన భారత్–గ్రీక్ కళాకారులు తొలిసారి బుద్ధుని రూపాన్ని సృష్టించారని చెబుతున్నారు, కాని మరికొందరు మాత్రం స్థానికంగా మధురకు చెందిన శిల్పులే బుద్ధుని రూపాన్ని సృష్టించారని అంటారు. ఏదేమైనా బుద్ధుని తొలిరూపాలు గాంధార, మధుర ప్రాంతాల శిల్పుల చేతినుండి ఒకేసారి తయారై ఉండవచ్చు. అయితే వాటి మూలాల్లో తేడాలు స్పష్టంగా కనిపిస్తాయి.

బుద్ధుడు, బోధిసత్వుడికి చెందిన రాతి విగ్రహాలు గాంధార ప్రాంతంలో కనిపిస్తాయి. అటువంటివే బ్రాహ్మణ, జైన తెగలకు చెందిన వారు సృష్టించినవిగా చెప్పబడే రూపాలు మధురలో కనిపిస్తాయి. ఈ రెండు రకాల బుద్ధుని రూపాలు క్రీస్తుశకం మొదటి రెండు, మూడు శతాబ్ధాల కాలంలో ఒకేసారి సృష్టించబడి ఉండవచ్చు.

**రూపాలు, ఆలయాలకు సంబంధించిన శాసనాలు:** దేవతారాధకులు క్రమంగా తాము పూజించే దేవతామూర్తిని నిత్యం కొలుచుకోవడానికి ఒక ప్రదేశం అవసరం అయినందున అందుకు వీలుగా ఆలయాల నిర్మాణాలు చేపట్టారు. బేస్‌నగర్ వద్ద లభించిన క్రీస్తుపూర్వం 1వ శతాబ్దానికి చెందిన ఒక శాసనంలో 'అక్కడొక అద్భుతమైన వాసుదేవుని మందిరం' ఉన్నదని పేర్కొనబడింది. ఆ ప్రదేశంలో తప్పనిసరిగా వాసుదేవుని రూపం ప్రతిష్టించబడి ఉండి ఉంటుంది. మధుర సమీపంలోని మోరా ప్రాతంలో లభించిన మరో శాసనంలో ఐదుగురు దేవతామూర్తుల మందిరం ఉన్నట్లుగా పేర్కొన్నారు. ఈ విధంగా క్రీస్తుశకం ప్రారంభ శతాబ్దాల్లో వివిధ దేవతామూర్తుల ఆలయాల గురించి వివరించే అనేక శాసనాలు లభించాయి. బుద్ధుడు, బోధిసత్వుడికి చెందిన అనేక రూపాలు, జైనులు, వారి అనుచరులు పురుషులు, స్త్రీలకు(యక్షులు, శాసన దేవతలు) చెందిన పలు రూపాలు, విగ్రహాలు క్రీస్తుశక ప్రారంభ శతాబ్దాలలో దొరికాయి. వీటన్నింటినీ చూస్తే ఆనాటి భారతదేశంలో బ్రాహ్మణ, బ్రాహ్మణేతర మతాల క్రతువులతో విగ్రహాలు ఎంతో ముఖ్యపాత్ర పోషించిన విషయం తెలుస్తుంది.

## గుప్తులు, వారి అనంతర కాలం :

**విగ్రహాల తయారీ విధానాలు :** గుప్తుల కాలంలో విగ్రహాల రూపకల్పన ఉచ్ఛస్థితికి చేరింది. ఈ చక్రవర్తుల హయాంలో విగ్రహారాధన బాగాపెరిగింది. వివిధ రకాల దేవతామూర్తులు, రకరకాల రూపాలు, ఎప్పటికప్పుడు వాటిని మరింత మెరుగుపరచడం జరిగింది. దేవతామూర్తుల రూపకల్పనకు కళాకారులకు నిబంధనలు విధించడానికి కూడా ప్రయత్నం జరిగింది. వివిధ దేవతామూర్తుల ప్రస్తుత రూపాలకు పురాణాలు, పంచతంత్రం, శైవ ఆగమాలలో బీజాలు పడ్డాయి. ఇవన్నీ గుప్తులు ఆ తర్వాత వచ్చిన రాజుల కాలంలోనే ఒక రూపం తీసుకున్నాయి. వరాహమిహిరుని (క్రీస్తుశకం 6వ శతాబ్దం) బృహత్‌సంహితలో వివిధ మతాలకు చెందిన దేవతామూర్తుల విగ్రహాల తయారీకి సంబంధించిన నియమాలను వివరించే ఒక అధ్యాయం ఉంది. బ్రాహ్మణ, బౌద్ధ, జైన మతాలకు చెందిన ప్రముఖుల విగ్రహాల రూపకల్పనకు సంబంధించిన సాంకేతిక అంశాల వివరణ అందులో పేర్కొనబడింది. కొన్ని పురాణాలు, ఆగమ శాస్త్రాలలోని అధ్యాయాలలో పలు ముఖ్యమైన బ్రాహ్మణ మతానికి చెందిన దేవతామూర్తుల విగ్రహాల రూపకల్పనకు అవసరమైన సాంకేతిక వివరాలు, వాటిని గుర్తించి, అధ్యయనం చేయడానికి వీలుగా రాయబడ్డాయి. బౌద్ధంలో మహాయాన, వజ్రయాన శాఖల అభివృద్ధిలో భాగంగా బుద్ధుడు, బోధిసత్వునికి చెందిన చిత్రాలు, విగ్రహాల రూపకల్పనకు, ఆరామాల నిర్మాణాలకు కొన్ని నియమ నిబంధనలు రూపొందించారు. జైన తీర్థంకరుల

విగ్రహాల రూపకల్పనకు సంబంధించిన అంశాల అధ్యయానికి జైన సిద్ధాంతకర్తల సాహిత్యం ఎంతగానో ఉపయోగపడుతుంది. ఈ సాహిత్యమంతా మధ్యయుగ ప్రారంభంలో రూపొందింది.

**గుప్తుల కాలంనాటి శిల్పకళలో ప్రధాన లక్షణాలు :** గుప్తుల కాలం నాటి శిల్పాల్లో శక-కుషానుల హయాంలో మధుర ప్రాంతంలో అభివృద్ధి చెందిన తరహాలో, అదే పరిమాణంలో జానపద శిల్పకళ విలసిల్లింది. అయితే ఇవన్నీ సారనాధ్ ప్రాంత సాంప్రదాయాలను ప్రతిబింబిస్తున్నప్పటికీ వాటిలో అద్భుతమైన కళ ఉట్టిపడుతుంది. గుప్తుల శిల్పకళలో రకరకాల భంగిమల్లో మానవ రూపాలు అలాగే దేవతా రూపాలు దర్శనమిస్తాయి. మానవరూపాలను విభిన్న భంగిమల్లో, ముద్రల్లోనూ, కూర్చుని ఉన్న శిల్పాలు వివిధ ఆసనాలు వేస్తున్నట్లుగానూ రూపొందించారు. ధ్యాన భంగిమలో ఉన్న వ్యక్తులకు చెందిన ఈ తరహా శిల్పాలు తర్వాతి కాలంలో కొనసాగాయి. గుప్తుల కాలంలో సారనాధ్ కేంద్రంగా శిల్పకళా సాంప్రదాయాలు దేశమంతటా విస్తరించాయి.

**గుప్తుల తర్వాతి శిల్పకళ :** గుప్తుల కాలం నాటి శిల్పకళలో ఉన్నత విలువలు గలవి తర్వాత కాలంలో చాలావరకు కాపాడబడినప్పటికీ మధ్య యుగంలో భారతదేశంలోని వివిధ ప్రాంతాల్లో వివిధ రూపాల్లో శిల్పకళ వర్ధిల్లింది. ఈ కళ ప్రాంతీయ రూపాన్ని సంతరించుకుంది. ప్రాంతాలవారీగా చూస్తే తూర్పు భారతదేశం, పశ్చిమ భారతదేశం, గంగా-యమునా లోయ, మధ్య భారతదేశం, దక్కను, తమిళనాడు, పూర్తిగా ఉత్తర భారతదేశం (ప్రత్యేకించి కాశ్మీరం) లలో ఎంతో నైపుణ్యం శిల్పులు తయారయ్యారు. వారంతా రాయి, కంచు, మట్టితో వివిధ రూపాల్లో శిల్పాలను రూపొందించి తమ నైపుణ్యాన్ని చాటుకున్నారు. ఈ కళ అదే కాలంలో క్రమేణా ఇతర కళారూపాలకు కూడా విస్తరించింది. మధ్యయుగ కాలంలో రూపొందించిన దేవతామూర్తుల విగ్రహాలలో ప్రాచీనకాలంలో మాదిరిగా కాకుండా నగిషీ పని ఎక్కువగా కనిపిస్తుంది. ప్రత్యేకించి దక్కను, తమిళనాడు ప్రాంతాలలోని మధ్యయుగం నాటి శిల్పకళను గమనిస్తే అప్పటి, అక్కడి ప్రజల్లో గల రసజ్ఞత కనిపిస్తుంది. మహాబలిపురం, ఎల్లోరా, ఎలిఫెంటాలో రాతిపై చెక్కిన శిల్పాలు, వేసిన చిత్రాలు వారి కళాచాతుర్యానికి, రసజ్ఞతకు అద్దం పడతాయి. మహాబలిపురంలోని అత్యంత సహజసిద్ధమైన శిల్పాలు, పురాణగాథలతో రూపొందించిన ఎల్లోరా శిల్పాలు, శివునికి సంబంధించిన కథలతో చిత్రించిన ఎలిఫెంటా చిత్రాలు మధ్యయుగంలో దక్షిణ భారతదేశంలో ఎంతటి అద్భుతమైన చిత్రకారులు, శిల్పులు ఉద్భవించారో రుజువుచేస్తాయి.

**చిత్రకళ :**

**చరిత్రపూర్వపు ప్రారంభం:** నెవసా ప్రాంతంలో ఇటీవలి తవ్వకాల్లో కుక్క, జింక బొమ్మలు చిత్రించిన రెండు మట్టి పాత్రలు లభించాయి. చరిత్ర పూర్వ యుగంలోనే భారతదేశంలో చిత్రకళ మొదలయ్యిందని చెప్పడానికి వీటిని ఉదాహరణలుగా చూపవచ్చు. సింధు నాగరికతా కాలంలోనే రంగులతో బొమ్మలు వేయడం మొదలైంది. తర్వాతి కాలంలో మీర్జాపూర్, ఆదాంఘర్ తదితర ప్రాంతాల్లో ఈ చిత్రకళ విస్తరించినట్లుగా ఆధారాలు లభించాయి. ఇక్కడ ప్రధానంగా

వేట ఇతివృత్తంగా చిత్రాలు గీసారు. భారతదేశంలో క్రీస్తుపూర్వమే బ్రాహ్మణ మతం, బౌద్ధ మతం రెండింటికీ సంబంధించిన చిత్రాలు వివిధరకాలుగా, అనేకరకాల టెక్నిక్‌లతో రూపొందించినవి లెక్కలేనన్ని దొరికాయి.

**చరిత్రయుగం తొలినాళ్లలో చిత్రకళ:** చరిత్ర యుగపు తొలిరోజుల్లో భారతదేశంలో చిత్రకళకు సంబంధించి లెక్కలేనన్ని సాక్ష్యాలు ఉన్నాయి. అయితే దురదృష్టవశాత్తు అవేవీ ఇప్పుడు నిలిచిలేవు. ఎందుకంటే అప్పటి చిత్రకారులు వాడిన పదార్థాలు కాలక్రమంలో శిథిలమయ్యాయి. వారు ప్రధానంగా గుడ్డలపైన, ఆకులు, చెట్టుబెరళ్ళు, చెక్క మరియు కొంతవరకు దీర్ఘకాలం ఉండే గోడలపైనా చిత్రాలు గీసారు. ఎండా, వానలకు శిథిలమయ్యే వాటిపైనే ఎక్కువగా చిత్రాలు గీయడం వల్ల అవన్నీ కాలగర్భంలో కలిసిపోయాయి. ఆనాటి చిత్రకళ గురించి ఉదాహరణలతో చెప్పాలంటే క్రీస్తుపూర్వం 1వ శతాబ్దం నాటి చిత్రాలు రామ్‌ఘర్ హిల్స్‌లోని సీతాబెంగ లేదా యోగిమర గుహల్లో పెద్దసైజులో ఉన్న కొన్ని మానవ, జంతువుల చిత్రాలు కనిపిస్తాయి. అజంతా గుహల్లోని 9, 10 గుహల్లో గల చిత్రాలు చరిత్రయుగపు తొలిరోజుల్లో ఆవిర్భవించిన చిత్రాలుగానే చెప్పవచ్చు. కచ్చితంగా చెప్పాలంటే తొలిరోజుల్లోని చిత్రకళ గురించి చెప్పుకోవడానికి చాలా ఉన్నా చూపించడానికి తగినవిధంగా లేవు. అక్కడక్కడా కొన్ని మాత్రమే మిగిలిఉన్నాయి. బెడ్సాలోని బౌద్ధచైత్యం గోడలపై చిత్రాలు ఉన్నా తర్వాతి కాలంలో సున్నం వేయడం వల్ల అవి కూడా అదృశ్యమయ్యాయి.

**సాహిత్యంలో చిత్రకళ:** క్రీస్తుశకం 350–700 సంవత్సరాల నడుమ కాలంలో భారతదేశంలో చిత్రకళ ఉచ్ఛస్థితిని అనుభవించింది. ఆ కాలంలో ఈ కళను ప్రజలు బ్రహ్మాండంగా ఆదరించారు. అప్పటి చిత్రకళలో సాంకేతిక నైపుణ్యం కూడా ఎంతో ఉన్నతంగా వృద్ధి చెందింది. ఆనాటి సమాజంలో ప్రతి ఒక్కరు పట్టణ ప్రాంతాల్లో నివసించే ఉన్నత వర్గాల ప్రజలే కాకుండా అన్ని వృత్తులవారూ చిత్రకళను ఒక సామాజిక బాధ్యతగా ఆదరించారు. వాత్సాయనుడి కామసూత్రాల చిత్రణతో చిత్రకళ అనేది 64 కళల్లో ఒకటిగా నిలిచిపోయింది. అది కూడా ఒక కళారూపంగానే ప్రజలు గుర్తించారు. బృహత్సంహిత (క్రీస్తుశకం 6వ శతాబ్దం), విష్ణుధర్మోత్తర (క్రీస్తుశకం 7వ శతాబ్దం) గ్రంథాలలో అంశాల వారీగా చిత్రకళలో సాంకేతికతను, వర్గీకరణను ప్రవేశపెట్టారు. అప్పటి సమకాలీన సాహిత్యరూపాలన్నింటా ప్రధానంగా భాసా, కాళిదాస, విశాఖదత్త, బాణుడు, బుద్ధఘోషుడు, ఇతిహాసాలు, పురాణాలు ఒకటేమిటి అన్నింటా ఉన్నతమైన చిత్రకళ గురించి సవివరమైన చర్చ జరిగింది. మేధావులతో పాటు సమాజం యావత్తు చిత్రకళపై దృష్టి పెట్టింది.

**గుప్తులు మరియు వారితర్వాత కాలంలో చిత్రకళ:** దక్షిణ భారతదేశంలోని అనేక ప్రాంతాల్లోని గుహల్లో గుప్తుల అనంతర కాలంలోని చిత్రకళా రూపాలు పెద్ద సంఖ్యలోనే ఇప్పటికీ మిగిలి ఉన్నాయి. ముఖ్యంగా బాగ్ (4వ గుహ, క్రీస్తు శకం 500), అజంతా (1,2,17,19 గుహలు, క్రీస్తు శకం 6,7 శతాబ్దాలు) బాదామీ (3వ గుహ, క్రీస్తుశకం 6వ శతాబ్దం) జైన ఆలయం ఉన్న సీతన్నవాసల్ (క్రీస్తుశకం 7వ శతాబ్దం), కాంచీపురంలోని శైవక్షేత్రం (కైలాసనాథ ఆలయం, క్రీస్తుశకం 7వ శతాబ్దం), శ్రీలంకలోని సిగిరి కొండగుహ

(క్రీస్తుశకం 5-6 శతాబ్దాలు)ల్లోనూ చిత్రకళా చిహ్నాలు ఇప్పటికీ కనిపిస్తున్నాయి. ఇవే గాకుండా అస్పష్టంగా, శిథిలావస్థలో ఉన్న అనేక చిత్రకళా రూపాలు దక్కను పీఠభూమి, ఉత్తర భారతదేశంలోనూ అనేక కొండగుహల గోడలపై కనుగొన్నారు. ముఖ్యంగా కన్హేరి (6వ శతాబ్దం), ఔరంగాబాద్ (6వ శతాబ్దం), కియోంజర్ (6వ శతాబ్దం), తిరుమలాయపాలెంలోని దిగంబర జైన ఆలయం(7వ శతాబ్దం), మలయాడిపట్టి లోని వైష్ణవ ఆలయం (8, 9వ శతాబ్దాలు)లోనూ ఈ చిత్రాలు కనిపిస్తాయి.

ఈ అన్ని రకాల చిత్రాలు చిత్రించడానికి భూమికను తయారుచేసే విధానమే కీలకం. రాతిపొడి, మంకమన్ను, ఆవు మలంకు పీచుకలిపి పేస్టు మాదిరిగా తయారు చేసేవారు. ఈ పదార్థాన్ని సమానంగా లేని రాతిపై మెత్తేవారు. కొంచెం ఆరిన తర్వాత రాయిని సమతలంగా పాలిష్ చేసేవారు. పూర్తిగా ఆరకముందే, ముందుగా ఒకసారి శ్వేతవర్ణం వేసేవారు. రంగులు వేయడానికి ముందు దాన్ని బాగా ఆరనిచ్చేవారు. రంగులన్నింటినీ స్థానికంగా తయారుచేసుకునేవారు లేదా జైపూర్ నుంచి గాని విదేశాల నుంచి గాని దిగుమతి చేసుకునేవారు. బాగ్, అజంతా, బాదామీ, సీతన్నవాసల్ గుహల్లోని చిత్రాలు మతపర గాథల ఆధారంగా వేసినవి. అయితే వాటి నుంచి తెలుసుకోగల కథ మాత్రం లౌకికంగా, నీతివంతంగా, సున్నితంగా ఉంటుంది. బాగ్, అజంతా గుహల్లోని చాలా కొద్ది ప్రాంతాల్లో మాత్రం సమతలంగా ఉన్న ప్రాంతమంతా చిత్రాలు కనిపిస్తాయి. వాటిలో ఆనాటి సమకాలీన జీవితం కూడా ప్రతిబింబిస్తుంది. మొత్తం మీద ఈ అన్ని చిత్రాలు ఆధ్యాత్మిక విలువలను ఉన్నత స్థాయిలో నిలుపుతాయి. బాగ్, అజంతా, బాదామీ గుహ చిత్రాలు ఉత్తర భారతదేశం, దక్కను ప్రాంతాల సాంప్రదాయాలు, సంస్కృతిని ప్రతిబింబిస్తే, సీతన్నవాసల్, కాంచీపురం, మలయాడిపట్టిల్లోని చిత్రాలు దక్షిణ భారతదేశ సంస్కృతిని ప్రతిఫలిస్తాయి. సీతన్నవాసల్ చిత్రాలు జైన గాథలతో ముడిపడి ఉంటాయి. తర్వాతి మూడు శతాబ్దాల కాలంలో చిత్రకారులకు శైవ, వైష్ణవ మత గాథలు స్ఫూర్తినిచ్చాయి.

# VII
# అనుబంధం

# 14. ప్రాచీన యుగం - వంశ వృక్షాలు

## <u>మౌర్యులు</u>

చంద్రగుప్త(శాంద్రొచేట్స్)

↓

బిందుసారుడు (మిత్రఘాతలేదా అమిట్రొచేట్స్)

↓

అశోకుడు (దేవనం ప్రియ ప్రియదర్శిన్)

↓

- మహేంద్ర
- సంఘమిత్ర
- చారుమతి
- కునాల
  - బందుపాలిత (దశరథ)
  - సంప్రతి → సలిసుక → దేవవర్మన్ → శతధాన్వన్ → బృహద్రథ
- జలౌక
- తివర

# <u>గుప్త సామ్రాజ్యం</u>

- శ్రీగుప్త
  - ఘటోత్కచ గుప్త
    - ఒకటవ చంద్రగుప్తుడు = కుమారదేవి (లిచెచ్చావి)
      - సముద్ర గుప్తుడు (పరాక్రమంక ; శ్రీ విక్రమ)
        - రామ గుప్త
        - రెండవ చంద్రగుప్తుడు (విక్రమాదిత్య)
          - గోవింద గుప్త
          - కుమార గుప్త
            - స్కంద గుప్త
            - పురు గుప్త
              - నరసింహ గుప్త
              - బుధ గుప్త
                - రెండవ కుమార గుప్త
                  - విష్ణు గుప్త
            - ఘటోత్కచ గుప్త
          - ప్రభావతి (వకటక రాణి)

## తొలితరం పల్లవులు

- మొదటి సింహవర్మన్ (క్రీ.శ. 275-300)
- స్కంద వర్మన్
- బుద్ధవర్మన్
- బుద్ధియంకుర
- మొదటి కుమార విష్ణు (350-70)
- మొదటి స్కంద వర్మన్ (370-85)
- వీర వర్మన్ (385-400)
- రెండవ స్కంద వర్మన్ (400-36)
  - మొదటి సింహవర్మన్ (436-60)
    - మూడవ స్కంద వర్మన్(460-80)
      - నందివర్మన్(480-510)
      - రెండవ కుమార విష్ణు (510-30)
        - బుద్ధవర్మన్ (530-40)
        - మూడవ కుమార విష్ణు (540-50)
  - విష్ణుగోపవర్మన్
    - రెండవ సింహవర్మన్
    - రెండవ విష్ణుగోపవర్మన్

## <u>థానేశ్వర్ పుష్యభూతులు</u>

నరవర్ధన

↓

రాజ్యవర్ధన

↓

ఆదిత్యవర్ధన

↓

ప్రభాకరవర్ధన

↓

రెండవ రాజ్యవర్ధన | హర్షవర్ధన | రాజ్యశ్రీ (మావుఖరీల రాణి

హర్షవర్ధన ↓ కుమార్తె; వలాభికి చెందిన రెండవ ధృవసేనను పెళ్లి చేసుకున్నది

↓

నాలుగవ ధృవసేన (వలాభి)

# భన్వాసి కదంబాలు

- మయూరశర్మన్ (345–60)
  - కంగవర్మన్ (360–85)
    - భగీరథ (385–410)
      - రఘు(410–25)
      - కాకుస్థవర్మన్(425–50)
        - శాంతివర్మన్
          - మృగేశవర్మన్(470–88)
            - రవివర్మన్ (500–38)
            - భానువర్మన్
              - హరివర్మన్
            - శివరథ
        - కుమారవర్మన్
          - మంధత్రివర్మన్
        - మొదటి కృష్ణవర్మన్
          - విష్ణువర్మన్
            - సింహవర్మన్
              - రెండవ కృష్ణవర్మన్(550–65)
                - అజవర్మన్
          - దేవవర్మన్

## ఆంధ్ర విష్ణుకుండినులు

- మొదటి మాధవవర్మన్
  - దేవవర్మన్
    - మాధవవర్మన్
  - మొదటి విక్రమేంద్రవర్మన్ **(460–80)**
    - ఇంధ్ర భట్టారక **(480–515)**
      - రెండవ విక్రమేంధ్ర **(515–35)**
        - గోవింద వర్మన్ **(535–56)**
          - రెండవ మాధవవర్మన్ **(556–616)**
            - మంచన భట్టారక

## బదామి చాళుక్యులు (తొలితరం చాళుక్యులు)

మొదటి జయసింహ

↓

రణరాగ

↓

మొదటి పులకేసిన్(543-66)

↓

మొదటి కృతివర్మన్ (566-97) | మంగళేశ (597-609)

మొదటి కృతివర్మన్ (566-97) ↓

రెండవ పులకేసిన్ (609-42) | విష్ణువర్ధన | జయసింహ

రెండవ పులకేసిన్ (609-42) ↓

మృగేశవర్మన్(470-88)

↓

చంద్రాదిత్య | ఆదిత్యవర్మ | విక్రమాదిత్య(654-81) | జయసింహ | అంబేర

విక్రమాదిత్య(654-81) ↓

వినయాదిత్య(681-96)

↓

విజయాదిత్య (696-733)

↓

రెండవ విక్రమాదిత్య (733-45)

↓

రెండవ కృతివర్మన్ (745-55)

## <u>పశ్చిమ గంగాలు (మైసూర్)</u>

**కొంగనివర్మన్ (400)**

↓

**మొదటి మాధవ (425)**

↓

**అయ్యావర్మన్ (450)** | **కృష్ణవర్మన్ (450)**

↓ (అయ్యావర్మన్)

**రెండవ పులకేసిన్ (609-42)**

↓

**మృగేశవర్మన్(470-88)**

## మదురై పాండ్యాలు

కడుంగాన్ **(560-90)**

↓

మారవర్మన్ అవనిసుళమణి **(590-620)**

↓

సెలియన్ సెండన్ **(620-50)**

↓

అరికేసరి పరాంకుశ మారవర్మన్ **(650-700)**

↓

కొక్కాదయియాన్ **(700-30)**

↓

మొదటి మారవర్మన్ రాజసింహ **(730-65)**

↓

జటిల పరాంతక నెడుంజెడియాన్ **(766-815)**

↓

శ్రీమర శ్రీవల్లభ **(815-62)**

↓

- రెండవ వరగుణ **(862-85)**
- పరాంతక వీరనారాయణ **(860-905)**
  - ↓
  - రెండవ మారవర్మన్ రాజసింహ **(905-20)**

## మదురై పాండ్యాలు

సింహవర్మన్ (క్రీ.శ. 550-60)

సింహవిష్ణు (555-90)

మహేంద్ర (590-630)

మొదటి నరసింహ (630-68)

రెండవ మహేంద్ర (660-70)

మొదటి పరమేశ్వర (670-700)

రెండవ నరసింహ (రాజసింహ 700-28)

మూడవ మహేంద్ర(728)

రెండవ పరమేశ్వర (728-31)

భీమవర్మన్

బుద్ధవర్మన్

ఆదిత్యవర్మన్

గోవిందవర్మన్

హిరణ్యవర్మన్

రెండవ నందివర్మన్ (731-96)

దంతివర్మన్ (796-847)


మూడవ నందివర్మన్ (846-69)


నృపతుంగ (869-99)

అపరాజిత (899-903)

కంపవర్మన్ (903-12)

# 15. ప్రాచీన యుగం మ్యాపులు




గుప్తుల కాలానికి ముందు
భారతదేశం
అరేబియా
సముద్రము
బంగాళాఖాతము
హిందూ
మహాసముద్రం
కుషాణుల విస్తరణ
శాకాలు
శాతవాహనులు
రోమను నాణెములు దొరికిన ప్రాంతాలు
ప్రస్తుత భారత దేశ
అంతర్జాతీయ సరిహద్దు


ప్రజాశక్తి బుక్‌హౌస్